రాహుల్ సాంకృత్యాయన్

# మధుపురి

కథాసంపుటి













అనువాదం

కవిని ఆలూరి

రాహుల్ సాంకృత్యాయన్

# మధుపురి

కథాసంపుటి

అనువాదం

కవిని ఆలూరి

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజయవాడ

**Bahurangi Madhupuri** (Hindi) - By **Rahul Sankrityayan**
**Madhupuri** (Telugu) Translated by **Kavini Aluri**

ప్రచురణ నెం. : 2350/623
ప్రతులు : 1000
ప్రథమ ముద్రణ : జూన్, 2016
టైటిల్ డిజైన్ : పద్మావతి

© **రచయిత**

వెల : ₹ 200/-

**ప్రతులకు**

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
33-22-2, చంద్రం బిల్డింగ్స్
చుట్టుగుంట, విజయవాడ-520 004
ఫోన్ : 0866-2430302
Email : vphpublish@gmail.com

**విశాలాంధ్ర బుక్‌హౌస్**
విజయవాడ, విశాఖపట్నం,
అనంతపురం, గుంటూరు
తిరుపతి, కాకినాడ, ఒంగోలు
శ్రీకాకుళం, కడప, విజయనగరం

**హెచ్చరిక :** ఈ పుస్తకంలో ఏ భాగాన్నైనా పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ కాపీరైట్ హక్కు కలిగినవారి నుండి లేక ప్రచురణకర్తల నుండి ముందుగా రాతపూర్వక అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం.

**ముద్రణ : విశాలాంధ్ర విజ్ఞాన సమితి ముద్రణాలయం - విజయవాడ**

# ముందుమాట

మహాపండిత రాహుల్ సాంకృత్యాయన్‌ను గురించి తెలుగు పాఠకులకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరంలేదు. ఆయన రచనలు "వోల్గా నుంచి గంగాతీరము, సింహసేనాపతి, విస్మృత యాత్రికుడు, ఋగ్వేద ఆర్యులు, జయయౌధేయ, దివోదాసు, లోకసంచారి, మధురస్వప్నం, వైజ్ఞానిక భౌతికవాదం, విశ్వరూపం, ప్రాక్పశ్చిమ దర్శనాలు" ఇప్పటికే పలుమార్లు ముద్రించబడి చెల్లిపోయాయి. ఈ రచనలన్నింటిని తిరిగి ముద్రించాలని విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంకల్పించింది. ఆ సంకల్పంలో భాగంగానే వినమ్రతతో ఈ పుస్తకాలను తెలుగు పాఠకుల ముందుంచుతున్నాం.

రాహుల్జీ మహాపండితుడే గాక "త్రిపీటికాచార్యుడు"–మార్క్సిస్టు మేధావి, స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న కార్యకర్త. పలుమార్లు జైలుకెళ్ళాడు. తన జైలుజీవిత కాలంలోనే రచనా వ్యాసాంగానికి ప్రణాళిక వేసుకున్నాడు. ఆ తర్వాత రైతుసంఘ నిర్మాణంలోనూ, పోరాటాల్లోనూ పాల్గొంటూనే గ్రంథరచనకు పూనుకొన్నాడు. తన జైలుజీవిత కాలంలో తోటి కామ్రేడ్స్‌కు పాఠాలు చెప్పేవారు.

భారతదేశంలోని మార్క్సిస్టు మేధావులను ప్రత్యేకించి ఉత్తర భారతంలోని మేధావులను ఆయన తాత్విక చింతన ప్రభావితం చేసింది. స్వీయానుభవం, స్వీయపరిశీలన, అధ్యయన ప్రాతిపదికగా ఆయన రచనలు సాగాయి. మార్క్సిస్టు గతితర్కాన్ని ఆయన ఆలోచనలకు అనుగుణంగా భారతదేశ చరిత్రకు, తాత్విక ధోరణులకు అనువర్తింపచేశాడు.

"మానవజాతి ప్రగతిపథంవైపు సాగించిన ప్రతి అడుగూ రక్తతర్పణంతోనే సాగింది. నర రక్తం ఇంతగా ప్రవహించడానికి అన్ని మతాల ధర్మాచార్యులే కారణం; వారే బాధ్యులు. ఏ ఒక్క మతము, ఏ ఒక్క మతాచార్యుడు గర్వించవల్సింది ఏమీలేదు" అని చారిత్రక ఆధారాల రీత్యా తన రచనల ద్వారా ఆయన రుజువు చేశాడు. ప్రస్తుత రాజకీయ, సామాజిక వాతావరణంలో రాహుల్జీ పుస్తకాల పఠనం అత్యంత ఆవశ్యకం.

ఆ మహాపండితుని రచనలనన్నింటినీ తిరిగి ముద్రించి తెలుగు పాఠకుల ముందుంచు తున్నందుకు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ గర్వపడుతున్నది. అందులో భాగంగానే శ్రీమతి కవిని ఆలూరి గారి అనువాద కథలు "మధుపురి" పాఠకులకు అందిస్తున్నాం. మహాపండిత రాహుల్ సాంకృత్యాయన్ గారి అనేక రచనలను తెలుగులోకి అనువదించిన కీ.శే. ఆలూరి భుజంగరావుగారి వర్థంతి సందర్భంగా ఈ కథల సంపుటిని వినమ్రపూర్వకంగా విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ పాఠకులకు అందిస్తుంది.

అభివందనాలతో

**గడ్డం కోటేశ్వరరావు**

**సంపాదకుడు**

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**

# రెండు మాటలు

ఈ సంగ్రహములో నేను రచించిన 21 కథలు ఉన్నాయి. ఈ కథలన్నింటినీ హిమాలయాలలోని విలాస నగర ప్రజల జీవితాలకు అంకితం ఇచ్చాను. ఈ కథలను వాస్తవ జీవితాల మీద ఆధారపడి రచించాను. ఇవి కల్పితాలు కావు. పాఠకులు ఒక్కో కథనూ ఒక్కో జీవితగాథగా పొరబడే అవకావం వుంది. కానీ, ఈ కథల చిత్రణలో అనేక మంది జీవితాలను తీసుకున్నాను. స్వల్పంగా కల్పిత విషయాలనూ పొందుపరచాను.

సమకాలీన చిత్రణలో పాఠకులకు మనోరంజకంతో పాటుగా ఇతరత్రా ప్రయోజనాలు ఏమాత్రం ఒనగూడినా అది నాకు సంతోషదాయకం.

**రాహుల్ సాంకృత్యాయన్**

అమృతసర్,

4-5-1954.

# అనువాదకురాలి మాట

రాహుల్ సాంకృత్యాయన్ హిందీలో రచించిన 'బహురంగీ మధుపురి' అనే సంగ్రహములో దాదాపుగా 21 కథలున్నాయి. ఈ కథలను రాహుల్జీ 40 సం॥ల క్రితం రచించారు. తెలుగులో 'మధుపురి' అన్న పేరుతో నేను ఈ గ్రంథాన్ని అనువాదం చేశాను. దాదాపుగా నూటయాభై సంవత్సరాల క్రితం బ్రిటీషువారు తమ విలాసాల కోసం, తమ సైనికుల విలాసాల కోసం శీతల - మంద - సుగంధ పవనాలు వీచే హిమాలయ పర్వత ప్రాంతాలలో నిర్మించిన విలాస నగరం మధుపురి. మధుపురిని బ్రిటిష్ వాళ్ళు తమ విలాసాల కోసం నిర్మించుకున్నారు. చాలాకాలంపాటు మధుపురి బ్రిటిష్ వారికి విలాస నగరంగానే వున్నది. బ్రిటిష్వాళ్ళు వెళ్ళిపోయాక మధుపురిని సామంతవర్గానికి చెందిన రాజులూ, జమిందార్లూ, జాగీర్దార్లూ తమ విలాస నగరంగా చేసుకున్నారు. మధుపురి నగర నిర్మాణం జరగటానికి ముందు అక్కడ దట్టమైన అడవి ప్రాంతముండేది. స్థానికంగా వెనుకబడిన అనాగరిక జాతులకు చెందిన ప్రజలు వుండేవారు. ఈ గ్రంథంలోని కథలన్నీ ఆయా వ్యక్తుల జీవితాలతోపాటు ఆనాటి చారిత్రక, రాజకీయ అంశాలతో కూడుకుని వున్నాయి. అతితక్కువ కల్పనతో, యథార్థ జీవితాలే ఆధారంగా ఈ కథల రచన సాగింది. విభిన్నమైన, వైరుధ్యాలు కలిగిన జీవితాలు ఈ కథలలో మనకు కనిపిస్తాయి.

తెల్లదొరల, సామంతవర్గాల జీవితాలే కాకుండా అట్టడగు వర్గాల ప్రజల జీవితాలనూ ఈ కథలలో విశదపరిచారు. మధ్యతరగతి, ఉన్నతవర్గ మహిళల జీవన విధానాలతో పాటు పొట్టకూటికోసం అహర్నిశలూ శ్రమించే పేదవర్గపు మహిళల జీవితాలనూ, అలాగే మధుపురికి వచ్చే విలాస ప్రియుల వలన సహజ సౌందర్యవంతులయిన చుట్టుప్రక్కల గ్రామాల అమాయకపు స్త్రీల జీవితాలు ఏ విధంగా నరకప్రాయమైనాయో? ఛిద్రమైనాయో? వివశులై వారు తమ జీవితాలను ఎలా బలిపెట్టుకున్నారో? కళ్ళకు కట్టినట్టు చిత్రించారు రాహుల్జీ.

నాన్నగారు (ఆలూరి భుజంగరావుగారు) తరచుగా మధుపురి కథల గురించి నాతో చెప్తుండేవారు. ఆయన తను రాసిన విలువైన అనువాదాలనూ, రచనలనూ పోగొట్టుకున్నారు. ఈ విషయం పాఠకులకు విదితమే. 1970 ఆ ప్రాంతాలతో 'మధుపురి' 'భాగోనహీ దునియా కో బదలో' (పారిపోకు! ప్రపంచాన్ని మార్చుకో) రాహుల్ సాంకృత్యాయన్ రాసిన ఈ రెండు గ్రంథాలనూ తెలుగులోకి అనువదించారనీ, ప్రచురణకు ఇస్తామని తీసుకున్న మిత్రులు అనువాద ప్రతులను పోగొట్టారని చెప్తుండేవారు. ఈ గ్రంథాలను తెలుగు పాఠకులకు అందివ్వలేకపోయారని బాధపడుతూ వుండేవారు. ఈ గ్రంథాలు వెలుగులోకి వస్తే బాగుండునన్న అభిప్రాయాల్ని వ్యక్తపరచేవారు.

మరొక విషయం బ్రిటిష్ వాళ్ళు ఏ రకంగానయితే ఆనాడు తమ తమ సైనికుల అవసరాల కోసం, విలాసాల కోసం, దట్టమైన పచ్చని అడవులను ధ్వంసించారో? అదే విధంగా ఈనాటి ప్రభుత్వాలు దేశీయ, విదేశీ పెట్టుబడిదారుల అవసరాలకు అనుగుణంగా సహజ వనరులతో అలలాడే పచ్చని ప్రాంతాలను మరుభూములుగా మారుస్తున్నారు. అణగారిన పేద, బడుగు, గిరిజన జాతుల ప్రజల జీవితాలను ఛిద్రం చేస్తున్నారు. ఇక స్త్రీల మాన ప్రాణాలకు రక్షణే లేదు.

పై చెప్పిన రెండు కారణాల వలన 40 సంవత్సరాల క్రితం రాహుల్ సాంకృత్యాయన్ హిందీలో రచించిన ఈ గ్రంథాన్ని చారిత్రక, రాజకీయ విషయాల పట్ల ఆసక్తి మెండుగా వుండే తెలుగు పాఠకుల కోసం, గతంలో నాన్నగారు ఇచ్చిన ప్రేరణతో, తెలుగులోకి అనువదించాలని నిశ్చయించుకున్నాను.

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ గడ్డం కోటేశ్వరరావుగార్కి, మేనేజర్ మనోహర్ నాయుడుగారికి, విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి. హరినాథ్‌రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. సోదర సమానులైన ఎ.ఎమ్.ఆర్. ఆనంద్‌గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

నా ఈ తెలుగు అనువాదాన్ని నా తండ్రి ఆలూరి భుజంగరావుగారికి అంకితం ఇస్తున్నాను. ఇక ఈ గ్రంథం తెలుగు పాఠకుల చేతుల్లోకి....

– కవిని ఆలూరి

# ఆర్తితో....!



ప్రతి అంశమూ మీతో చర్చించినదే
అనువాద మెళకువలు మీరు నేర్పించినవే
మీరు నా తండ్రి మాత్రమే కాదు
నా గురువూ, నా మార్గదర్శకులునూ
మీరిచ్చిన ప్రేరణతోనే, స్ఫూర్తితోనే
ఈ గ్రంథ అనువాదం సాగింది
మీ జ్ఞాపకాలతో నిండి ఉన్న
"**మధుపురి**" గ్రంథ తెలుగు అనువాదం
మీకే అంకితం.....!

**- కవిని ఆలూరి**

# కథాక్రమం


| | | |
|---|---|---|
| 1. | వృద్ధుడు లాలా | 1 |
| 2. | అయ్యో! ముసలితనం!! | 13 |
| 3. | దురంజయ కుమార్ | 24 |
| 4. | దొరసాని | 37 |
| 5. | మహాప్రభూ | 48 |
| 6. | 'లిప్‌స్టిక్' | 64 |
| 7. | ఠాకుర్జీ | 76 |
| 8. | రాయ్‌బహద్దూర్ | 88 |
| 9. | గురూజీ | 103 |
| 10. | మీనాక్షీ | 118 |
| 11. | 'గోలూ' | 131 |
| 12. | రూపీ | 144 |
| 13. | రావుతు | 155 |
| 14. | కమల్‌సింగ్ | 168 |
| 15. | డోరా | 182 |
| 16. | బిసును | 196 |
| 17. | పేడ్-బాబా | 212 |
| 18. | సుల్తాన్ | 226 |
| 19. | మాస్టర్‌జీ | 238 |
| 20. | చంపో | 251 |
| 21. | నల్లదొర | 263 |

# వృద్ధుడు లాలా

**'లా**భ్‌డాలా' లోని ఇండ్లను చూస్తే, అవి ఎప్పుడో ఏ కృతయుగంలోనో నిర్మించినట్టుగా అనుకుంటారు ప్రజలు. కానీ ఆ ఊరిలో అప్పటికాలంలో కట్టిన ఇళ్ళు ఒకటీ లేదు. ఇప్పటికి నూటముప్పై సంవత్సరాల క్రితం మధుపురిలో మొట్టమొదటి ఇంటిని కట్టటం జరిగింది. అంటే 1820 ఆ ప్రాంతాల్లో మధుపురిలో ఇళ్ళ నిర్మాణానికి పునాదులు పడ్డాయన్నమాట.

విదేశీ భాషతో అపరిచితులైన ప్రజలు సహజంగానే స్థానిక భాషలో ఆ శబ్దాల్ని తమకు అనుకూలంగా మార్చుకుంటూ వుంటారు. వృద్ధుడు లాలా "లవ్‌డేల్" అన్న పదాన్ని "లాభ్‌డాలా"గా అంటుంటాడు. వాస్తవానికి లాలా ఒక్కడే ఇలా అనకపోవచ్చు. గతంలో ఎవరో ఈ శబ్దాన్ని ఇలా మార్చి వుండవచ్చు. మధుపురిలోని చాలా ఊర్ల పేర్లు ఈ విధంగా మార్చినవే. ఒక్క మధుపురిలోనే కాదు హిమాలయాలలోని విలాస నగరాలన్నింటిలో పేర్లను ఈ విధంగానే మార్చారు. మైసూర్‌లోని "హ్యాపీవ్యాలీ"ని సాధారణ ప్రజలు 'హేపావాలా' అనే అంటుంటారు.

లాలా ఆనాటి తన జ్ఞాపకాలను మాకు చెప్తున్నాడు. అతను కూర్చున్న చోటుకు కొంచెం ఎగువన మాట్రిన్ హోటలు వుండేది. ఆ హోటలు నిర్మాణం 70 ఏళ్ళ క్రితం అంటే తాతకు 10, 12 సంవత్సరాల వయస్సు వున్నప్పుడు జరిగింది. తాత మధుపురి వచ్చేటప్పటికి హోటల్ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. తాత తన జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ "ఆ హోటలు కట్టించింది. 'మాట్' (మాట్రిన్) సాహెబ్ 'మాట్' సాహెబ్ తండ్రి జమీందారుగారి అడవుల్ని కాంటాక్టుకు (గుత్తకు) తీసుకున్నాడు. అతని తండ్రి పక్కా తెల్లోడు. "తాత తన కళ్ళముందు జరిగినది, తను చూసినవి, విన్నవి మాత్రమే చరిత్రగా చెప్తున్నాడు. అతని జ్ఞానం ప్రత్యక్షమైనదే కానీ పరోక్షమైనది కాదు. సంవత్సరాలు గడుస్తున్న కొద్దికీ అతని జ్ఞాపకశక్తిలో ఎన్నో మార్పులు చేర్పులు వచ్చాయి. తాతకు తెలియని విషయం ఏమిటంటే.... అతను అడవికి మాత్రమే కాంట్రాక్టరు కాదు. గంగా,

యమునా నదీ ప్రవాహాల గుండా అటవీ ప్రాంతంలోని కలప ఎగుమతిని ప్రప్రథమంగా ఆచరణలో పెట్టింది అతనే! ఐతే, లాలాకు ఈ విషయానికి సంబంధించిన జ్ఞానము లేదు. మధుపురి చుట్టుపక్కల వున్న భూముల్లో మొట్టమొదటగా బంగాళాదుంపల్ని పండించిందీ అతడే! దాదాపుగా ఒక శతాబ్దం క్రితం గంగోత్రికి వెళ్ళే దారిలో దేవదారు కలపతో ఒక విశాలమైన బంగళాను నిర్మించుకున్నాడు. ఐతే, ఇప్పటికీ అది చెక్కు చెదరకుండా వుంది. అదే మధుపురిలో నిర్మించి వుంటే ఎప్పుడో శిథిలమై పోయి వుండేది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసి ఇంగ్లీషు వాళ్ళు వెళ్ళిపోయాక మధుపురికి ఏలినాటి శని పట్టినట్లయింది. మార్టిన్ తండ్రి ఆ భవనాన్ని మధుపురిలో నిర్మించి వుంటే తప్పకుండా శని వక్రదృష్టి ఆ భవనం మీద పడి వుండేదే!

మైళ్ళ కొద్దీ విస్తరించి ఉన్న మధుపురి చరిత్రకు సజీవ ఉదాహరణ ముసలి తాత లాలా. తాత కంటే ముందే అతని బాబాయి ఒకతను బతుకు తెరువుకు మధుపురికి వచ్చాడు. మధుపురి నిర్మాణం చురుగ్గా సాగుతున్న రోజులవి. వేల సంఖ్యలో కార్మికులు భవనాల్ని నిర్మించటానికి వచ్చేవారు. వాళ్ళ తిండీ, తిప్పల కోసం దుకాణాలు వెలిశాయి. మధుపురిలో చాలా ఇళ్ళను ఇంగ్లీషు వారు స్వయంగా దగ్గరుండి కట్టించుకున్నారు. భవనాల నిర్మాణానికి కాంట్రాక్టర్లు అవసరం అయ్యారు. అప్పటికి వంద సంవత్సరాల కంటే ముందే ఆంగ్లేయులు తమ భాషలో వార్తాపత్రికలను ప్రచురించటం, చదవటం జరుగుతుండేది. ఆ వార్తా పత్రికలలో ఇతర విషయాలతో పాటు మధుపురి సౌందర్యానికీ, చల్లని వాతావరణానికీ సంబంధించిన వార్తలను కూడా ప్రచురించేవారు. ఆ వార్తల్ని చదివిన ఇంగ్లీషువారు వేసవికాలాన్ని గడపటానికి పోటీలు పడి మధుపురికి వస్తుండేవారు. ఐతే, బంగళాలు ఎన్ని నిర్మించినా వచ్చే వాళ్ళకు సరిపోయేవి కావు.

ప్రస్తుతం నెయ్యి సేరు ఐదు రూపాయలు అమ్ముతుంది. వెనుకటి కాలాన్ని గుర్తు చేసుకుంటూ లాలా ఇప్పుడు ఎంత గడ్డు రోజులు వచ్చాయి? నా చిన్నతనంలో రూపాయికి సేరున్నర నెయ్యి అమ్మే వాళ్ళు. ఇప్పుడయితే ఐదురూపాయలకు అమ్ముతున్నారు. గోధుమలుకూడా ఆ రేటుకు దొరకవు. ఆ రోజుల్లో కూలీ తక్కువే వుండేది. ధరలూ తక్కువే. లాభాలు తక్కువగానే వుండేవి.....!

పశ్చిమ హిమాలయాలలో విలాస నగరాలలోని వ్యాపారస్థులలో ఎక్కువ శాతం హర్యానీలు వుండేవారు. హర్యానా మార్వాడాకి పొరుగునే వున్నా అనేక విషయాలలో హర్యానీలు కూడా మార్వాడీల లాగానే వుంటారు. ఐతే, హర్యానా వ్యాపారులు మార్వాడీ వ్యాపారులంతగా సంపాదించలేరు. ఒకవేళ ఎవరైనా అలా సంపాదిస్తే అతణ్ణి ప్రజలు హర్యానీ అనరు. మార్వాడీ అనే అంటారు. డబ్బు సంపాదించటంలో ఒక ప్రత్యేకమైన

కళ మార్వాడీలకే వంటబట్టింది. మార్వాడీ వ్యాపారి కట్టుబట్టలతో అస్సాంకు, బర్మాకు బతకటానికి బయల్దేరి వెళ్తాడు. అతని మనవడి టైము వచ్చేసరికల్లా కోటీశ్వరుడవుతాడు. కానీ హర్యానీలు ఇంతగా ఎదగనూ లేరు. ఇంత సాఫల్యాన్నీ పొందలేరు.

తాత లాలా  బంధువులు చాలా మంది చిల్లర మల్లర వ్యాపారాలు చేసేవారు. వాళ్ళు మధుపురిలాంటి  హిమాలయ పర్వతాలలోని విలాస నగరాలలోనే కాకుండా మైదాన ప్రాంతాలలోని గ్రామాలలోనూ వ్యాపారాలు చేసేవారు. మధుపురిలో కేవలం నగల వ్యాపారమే చేసేవారు. కానీ చుట్టుపక్కల గ్రామంలోని వ్యాపారులు దుకాణంలోని వస్తువులను గ్రామస్థులకు ఎక్కువ రేటుకు అప్పుగా ఇస్తుంటారు. డబ్బు వడ్డీకి ఇస్తుంటారు.

కొద్ది సంవత్సరాల క్రితం వరకూ మధుపురిలోని ప్రజలు చాలా నిజాయితీ పరులుగా వుండేవారు. వ్యాపారులు వాళ్ళకు లెక్కాపత్రం లేకుండా వందల, వేల రూపాయలను అప్పుగా ఇచ్చేవారు. పర్వత ప్రాంత ప్రజలు నిజాయితీకి పెట్టింది పేరుగా వుండటమే కాకుండా నిజాయితీలో గొప్ప ఖ్యాతినీ పొందారు. ఇతరుల సొమ్మును చేతితో ముట్టుకునే వారు కాదు.

ఒక తెల్ల దొర పర్వత ప్రాంత ప్రజలను మెచ్చుకుంటూ, తన అనుభవాన్ని ఇలా చెప్పాడు. ఒకసారి అర్థ రూపాయి బిళ్ళ జారి తివాచీ మీద పడింది. పనిమనిషి కొండ ప్రాంతానికి చెందినవాడు. గది చిమ్మటానికి వచ్చాడు. తివాచీ మీద వున్న అర్థరూపాయిని ముట్టుకోకుండా అంతవరకూ తివాచీని కత్తిరించి, ఎత్తి చిమ్మేశాడు. అర్థరూపాయి కంటే తివాచీ విలువైనది. అయినా తివాచీని చింపటానికైనా ఇష్టపడ్డాడు. కానీ అర్థరూపాయి బిళ్ళను మాత్రం చేతితో ముట్టలేదు. తాత లాలా కొండ ప్రాంత ప్రజల నిజాయితీని ఒప్పుకుంటాడు. కానీ ఈ మధ్యన వచ్చిన మార్పుల్ని గురించి మాట్లాడేటప్పుడు నిరాశగా ఇలా అంటాడు. "పంతులుగారూ? ఏమి చెప్పాలి? ఇప్పుడు ఈ కొండ ప్రాంత వాళ్ళు తెలివి మీరిపోయారు. టన్నులకు టన్నులు డాల్డా కొనుక్కుని వెళ్ళి దాన్ని మంచి నేతిగా అమ్ముతున్నారు. సేరు నాలుగున్నర..... ఇంకేం కావాలి?" అని అనేవాడు.

లాలా జన్మస్థానం హర్యానా.... అయితే ఇప్పుడు అతని భాష హర్యానా ప్రాంతపు భాషలాగా లేదు. కిచడీ భాషలాగా మారింది. లాలాకు రాతకోతలు రావు. అతను తన ఖాతా పుస్తకాలలో పద్దుల వరకూ రాసుకోగలుగుతాడు. అతని కంటిచూపు అంతగా మసకబారలేదు. కానీ జ్ఞాపకశక్తి మాత్రం కొంచెం తగ్గింది. అందుకే మాటలను ఒక క్రమంలో చెప్పలేడు. అప్పుడప్పుడు క్రమం తప్పుతూ వుంటాడు. అలాంటప్పుడు మనం కొంచెం అందిస్తే మళ్ళీ తిరిగి తను చెప్తున్న విషయంలోకి వెళ్తాడు. మధుపురిలో ఇప్పటికీ రోజూ చిరుతపులులు వస్తుంటాయి. చిరుత పులులకు కుక్కలంటే రసగుల్లాంత ఇష్టం.

గడచిన 3 సంవత్సరాలలో 8 కుక్కలను అవి తీసుకుపోయాయి. తాత చిరుతపుల్లుల గురించి చెప్తూ "భగవంతుడి దయ! ఈ చిరుత పులులు ఇప్పటివరకూ జంతువులను ఎత్తుకెళ్ళాయి కానీ మనుషులకు ఎలాంటి కీడు చేయలేదు!" భగవంతుడికి దండం పెడుతూ అన్నాడు తాత లాలా.

తాత జ్ఞాపకాలు పేజీలు ఊడిపోయి కాగితాలు చెదిరిపోయిన పుస్తకంలాగా వున్నాయి. వాటన్నింటినీ ఒక క్రమంలో పెట్టటం కష్టమైన పనే! వాటిలో చరిత్రకంటే కొంత అత్యుక్తి కూడా వుండవచ్చు. కానీ ఒక విషయం ఒప్పుకోక తప్పదు తాత లాలాలాంటి వృద్ధులే లేకుంటే మధుపురికి సంబంధించిన చరిత్ర మరుగున పడిపోతుంది. ఇది మనం ఒప్పుకోవాల్సిందే! తాత లాలా స్మృతిపటంలో ఇప్పటికీ ఇంగ్లీషు దొరలూ, దొరసానులూ చెట్టాపట్టాలేసుకుని మధుపురిలోని పచ్చటి వృక్షాల కింద చల్లటి వాతావరణం కింద షికార్లు తిరగడం బాగా జ్ఞాపకం వుంది. తాత చిత్రకారుడు కాదు. చిత్రకారుడే అయి వుంటే ఆనాటి ఇంగ్లీషు దొరలనూ, దొరసానులనూ యథాతథంగా చిత్రించే వాడే! ఒకవేళ తాత చిత్రకారుడై వున్నా చిత్రాలు గీసి మాత్రం ప్రయోజనం ఏముంది? డెబ్బై, ఎనభై సంవత్సరాల క్రితం కట్టిన మధుపురిలోని బంగళాలలో అప్పటి చిత్రాలు ఎన్నో చెదలు పట్టి నాశనం అవుతున్నాయి.

లాలా చెప్పేదాన్ని బట్టి ఆనాటి మధుపురి ఇంద్రపురితో సమానం. కూలీ నాలీ చేసుకుని బతికే వాళ్ళకు చేతినిండాపనీ, కడుపునిండీ తిండీ దొరకేవి ఆరోజుల్లో! నల్లవాడైన కారణంగా తాతకు కూడా తెల్లదొరల చేతల్లో తిట్లూ, చివాట్లూ తప్పేవికావు. దెబ్బలు మాత్రం ఎన్నడూ తినలేదు. ఐతే అది తాత గొప్పతనం ఎంత మాత్రం కాదు. ఎందుకంటే ముందుగానే తోకాడించే పెంపుడు కుక్కలాగా ప్రవర్తించడం అలవాటు చేసుకున్నాడు. లాలా చెప్పేదాన్ని బట్టి తెల్లదొరలు స్వదేశీ రాజుల్నీ, సంస్థానాధీశుల్నీ, జమీందార్లను తిట్టటమే కాకుండా చెయ్యి కూడా చేసుకునేవారట. అలా తెల్లదొరల చేతుల్లో వాళ్ళు తిట్లూ, దెబ్బలూ తిన్నా స్థానిక గిరిజనులకూ, వ్యాపారులకూ కొంత సంతృప్తిగానే వుండేదిట. స్థానిక జమీందార్లూ, సంస్థానాధీశులూ కింది వర్గాల పేద ప్రజలను మనుషులుగానే చూసేవారు కాదట. జంతువులతో సమానంగా చూసేవారట. నోటికి వచ్చినట్లుగా తిట్టేవారట. తెల్లదొరల చేతుల్లో అలాంటి మహారాజులు, జమీందార్లూ, తిట్లూ, దెబ్బలూ తింటూంటే, నిమ్నవర్గాల ప్రజలకు సంతృప్తి కలగటంలో కొంత న్యాయం వున్నమాట వాస్తవమే.

లాలా ఇంకా ఇలా చెప్తున్నాడు. "ఆరోజుల్లో మేము మధుపురిలో వుండే ఇంగ్లీషు వాళ్ళు ఊర్లో తిరుగుతూనే వుండేవాళ్ళం. తెల్లదొరలు కనపడితే పరిచయం వున్నా

లేకపోయినా సలాం కొట్టి పక్కకు తప్పుకోవాల్సిందే! నల్లదొరలు అసలు వూరిలోకి రావడానికే సాహసించే వారు కాదు. ఈ పరిసరాలకు దూరంగా వుండేవారు. అప్పట్లో తెల్లదొరల హవా చాలా ఎక్కువగా వుండేది. ఒకసారి ఏమయిందంటే ఇక్కడొక బంగళా ఖాళీ అయింది. బంగళాల శుభ్రత గురించి చెప్పనక్కరలేదు. రోడ్ల మీద ఒక కాగితం ముక్కగానీ, ఎండుటాకు గానీ కనపడేదే కాదు. పనివాళ్లు ఎప్పుడూ ఊడుస్తూనే వుండేవారు. ఇలాంటి బంగళాలు ఖాళీఅయితే ఇక స్వదేశీరాజుల ఆనందాన్ని పట్టగలమా? వాళ్ళు వెంటనే తీసేసుకునేవారు.

ఒకసారి లాలాకు ఒక స్వదేశీ మహారాజు తెల్లదొరల బంగళాను అద్దెకు మాట్లాడమని చెప్పాడు. ఆ బంగ్లా ఏజెంటు ఆంగ్లో ఇండియన్... ఆ రోజుల్లో ఆంగ్లో ఇండియన్లను తెల్లదొరలు చాలా చిన్న చూపుతో, నీచంగా చూసేవారు. భోజన సమయాలలోనయితే అంటరానివాళ్ళను చూసినట్లు  చూసేవారు. ఐతే, నల్లదొరల మీద ఆంగ్లోఇండియన్లను కొంత గౌరవంగా చూసేవారు తెల్లదొరలు. తెల్లదొరలు తమను అవమాన పరిచినప్పుడల్లా ఆంగ్లో ఇండియన్లు నల్లదొరల్ని తిడుతూ తమ కసిని వాళ్ళమీద తీర్చుకునేవారు. దేశీయ కాంట్రాక్టర్లనూ, వ్యాపారులనూమాత్రం అంతహీనంగా చూసేవారు కాదు. ఆంగ్లో ఇండియన్లు ఈ కాంట్రాక్టర్లు వ్యాపారుల నుండీ కొద్దో, గొప్పో ఆర్థిక లాభం వుంటుంది కదా? ఇక వీళ్ళను హీనంగా ఎందుకు చూస్తారు?

స్వదేశీ మహారాజు ఒకతను బంగ్లాను అద్దెకు చూసిపెట్టమని లాలాకు చెప్పాడు. అప్పుడు లాలా యుక్త వయస్సులో వున్నాడు. ఆ బంగళాకు ఏజెంటు ఆంగ్లోఇండియను. లాలా వెళ్ళి బంగళాను అద్దెకు అడిగినపుడు అతను ఇలా చెప్పాడు. "అయిదువేలు కాదు. పదివేలు ఇచ్చినా నల్లవాడికి బంగళా ఇవ్వం! నల్లవాళ్లు శుభ్రంగా వుండరు. వాళ్ళు ఖాళీ చేశాక బంగ్లాను శుభ్రం చేయించటానికీ, సున్నాలు కొట్టించడానికీ చాలా ఖర్చు అవుతుంది. ఒకసారి నల్లవాడుబంగళాలో వుంటే ఇక ఆ బంగళాను తెల్లవాడు చస్తే అద్దెకు తీసుకోడు.".

అద్దెకు బంగళాను మాట్లాడిపెట్టమన్న రాజాసాహెబ్‌కు లాలాకు మధ్యచాలా లావాదేవీలున్నాయి. రాజాసాహెబ్‌కు అవసరమైన సరుకులనూ, ఇతర సామగ్రిని లాలా దగ్గరే కొనేవాడు. అందువల్ల లాలాకు ఆ రాజాసాహెబ్ నుండి చాలా లాభం వున్నది. కనుక లాలా ఆంగ్లో ఇండియన్ మాట్లాడిన అవమానకర మాటల్ని అతనికి చెప్పలేదు. అలాగని బంగ్లా ఖాళీ లేదని చెప్పి తప్పించుకోనూ లేదు. ఎందుకంటే ఆ బంగ్లా తాలూకు ప్రకటనను రాజాసాహెబ్ పేపర్లో చదివాడు. ఐతే లాలా "ఆ బంగ్లాలోకి అద్దెకు ఎవరో వస్తున్నట్టు వున్నారు. ఐనా, ఆ బంగ్లా తీసుకోవటం వల్ల మీకు ఉపయోగం ఏముంటుంది? ఇక్కడి తెల్లదొరల దౌర్జన్యాన్ని తట్టుకోవాలి కదా? రోడ్డుమీద నడవటానికి వుండదు.

ఎప్పుడూ తిట్లూ, చెప్పు దెబ్బలే? తెల్లదొరలు ఎప్పుడూ తాగి తూలుతూ మీ గౌరవ మర్యాదలకు భంగం కలిగిస్తుంటారు. రాజాసాహెబ్ ఆధునిక భావాలు కలిగి వున్నప్పటికీ ఆత్మాభిమానం కలవాడు. ముందు కాదు కూడదన్నా తర్వాత లాలా చెప్పిన దానికి ఒప్పుకున్నాడు.

ఒకప్పుడు ఆ రోజుల్లో మధుపురిలో తెల్లదొరలు సింహాలలాగా వెన్ను విరుచుకుని తిరుగుతూ వుంటే స్థానిక నల్లవాళ్ళు, రాజులు, మహారాజులు పిల్లులలాగా ఒదిగి, ఒదిగి జీవించేవారు. కాలం మారింది. ఇప్పుడు మధుపురిలో భారతీయులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. మార్టిన్ సాహెబ్ పేరుమీద కట్టిన విశాలమైన ఈ హోటల్లో నాలుగయిదు గదుల్లోనే ఇంగ్లీషువాళ్ళు వున్నారు. మిగిలిన గదులన్నీ భారతీయులే వుంటున్నారు.

భారతదేశం వదిలి ఇంగ్లీషువాళ్ళు వెళ్ళిపోయాక ఢిల్లీ భారతదేశానికి రాజధాని అయింది. వేసవి కాలంలో ఢిల్లీలో 116°F ఉష్ణోగ్రత వుంటుంది. ఇతర దేశాల నుండి విదేశీ రాయబారులు ఢిల్లీకి వచ్చినపుడు ఢిల్లీ ఎండలకు తట్టుకోలేక పోయేవారు. వాళ్ళు శీతల – మంద–సుగంధ చల్లని వాతావరణంలో వుండే మధుపురి గురించి విన్నారు. ఢిల్లీనుంచి మధుపురికి నాలుగు గంటల ప్రయాణం మాత్రమే. వాళ్ళు వాళ్ళ కుటుంబాలతో సహా వచ్చి చల్లని వేసవికాలం నాలుగు నెలలూ మార్టిన్ హోటల్లో గడిపి వెళ్ళేవారు. ఇప్పుడు మధుపురి అంతా భారతీయులదే!

ఇంగ్లీషు వాళ్ళు మన దేశాన్ని వదిలి వెళ్ళినప్పుడు చెల్లాచెదురుగా ఎటువాళ్ళు అటుగా వెళ్ళిపోయారు. వెళ్ళేముందు తమ బంగళాలను అతి తక్కువ ధరలకు అమ్ము కున్నారు. వడ్డీ వ్యాపారుల దగ్గరా, ఇతర వ్యాపారస్థుల దగ్గరా రెండవ ప్రపంచ యుద్ధకాలంలో సంపాయించిన ధనరాశులు మూలుగుతున్నాయి. అవకాశం వచ్చిందే చాలు అన్నట్టుగా ఆ బంగళాలన్నింటినీ వ్యాపారస్తులు కొనేశారు. ఇప్పుడు అంటే ఆరేళ్ళ తరువాత స్వదేశీ వ్యాపారులు ఆ బంగళాలను అమ్మడానికి సిద్ధంగా వున్నారు. సగానికి సగం నష్టానికైనా సరే.... కానీ కొనేవాళ్ళే కరువయ్యారు. ఇంగ్లీషు వాళ్ళ దగ్గర నుండీ దేశీయులు కొన్నప్పుడు ఫర్నిచర్‌తో బంగళాలు నిండి వుండేవి. శుభ్రంగా కళకళలాడుతూ చూడముచ్చటగా వుండేవి. మరి ఇప్పుడో? ఫర్నిచర్ అంతా తీసుకుపోయేరు. ఆరేళ్ల నిర్లక్ష్యానికి గుర్తుగా దుమ్ముకొట్టుకుపోయి, ఎక్కడబడితే అక్కడ బూజులు వ్రేలాడుతూ చూడలేనట్లుగా వున్నాయి.

ఇప్పుడు 'లాభ్‌డాలా'లో భారతీయులే వుంటున్నారు. ఐతే, తాత లాలాకు తమ భారతీయ సోదరులు వుండటం ఏమంత సంతోషంగా లేదు. ఈ రోజుల్లో భారతీయులెవరూ వెనుకటిలా తెల్లదొరల చేతుల్లో తిట్లూ, దెబ్బలూ తినటం లేదు. పరిచయం వున్నా,

లేకున్నా దారినపోతున్న ప్రతి ఇంగ్లీషు వాడికీ వంగి, వంగి దణ్ణాలుపెట్టే దృశ్యాలను ఇప్పుడు ఎవరూ చూడటం లేదు. భారతీయులు ఇంగ్లీషు వారితో సమానమైన హోదాలో వుంటున్నారు. ఐనా, లాలాకు తృప్తిగా లేదు.

## 2

మనము ఇంతకు ముందు చెప్పుకున్నట్టుగా తాత లాలా 10, 12 సంవత్సరాల వయస్సునపుడు మధుపురికి వచ్చాడు. ఇప్పటికీ అతనికి హర్యానాలోని తమ వూరిలో పిత్రార్జితమైన శిధిలమైన పూరిఇల్లు కళ్ళకు కనపడుతూనే వుంటుంది. అతని పిల్లలెవరూ ఆ శిథిల గృహాన్ని ఎప్పుడూ చూడలేదు. ఇప్పుడు ఇక తాతకు ముదిమనవళ్ళు పుట్టారు. వాళ్ళైనా చూస్తారన్న ఆశ లేదు. లాలా సంతానం కలగాపులగంగా వుండే కిచడీ భాషలోనైనా హర్యానా భాషనే ఇంట్లో మాట్లాడుతుంటారు. దీనికీ ఒక కారణం వుంది. పెళ్లి సంబంధాల కోసం తమ జాతివారైన హర్యానీయులతో సంబంధం పెట్టుకోవలసి రావటం. తాత లాలా మధుపురికి వచ్చిన 10,12 సంవత్సరాల తర్వాత యవ్వనుడయ్యాడు. ఇంత తొందరగా వివాహం చేసే స్థితిలో ఇంటి పరిస్థితి లేదు. వివాహం కోసం కొన్ని సంవత్సరాలు వేచి వుండవలసి వచ్చింది. 30 సంవత్సరాలు దాటాక అతనికి వివాహం అయింది. తర్వాత పది సంవత్సరాలు దాటాక కానీ అతడు తన మొదటి సంతానాన్ని చూడలేదు. ఈ శతాబ్ది ప్రథమ శతకంలో లాలా యవ్వనంలోకి అడుగుపెట్టాడు. లాలాకు పెద్దగా చదువు సంధ్యలు అబ్బలేదు. వాళ్ళ బాబాయికీ చదువు లేదు. ఐనా, ఇద్దరూ మాట్రిన్ హోటల్‌కు కాంటాక్టర్లుగా వుండేవారు. అంటే హోటల్‌కు అవసరమైన సరుకుల్ని సప్లయి చేసే పని వీరికి దొరికింది. మార్టిన్ హోటలు చాలా పెద్దది. అందులో ఒక వంద కుటుంబాల దాకా వుండవచ్చు. అటువంటి హోటలుకు సరుకుల్ని సప్లయి చేసే కాంటాక్టర్లుగా దొరకటం అదృష్టమనే అనాలి.

లాలా మాట్రిన్ హోటలును మెచ్చుకుంటూ ఈ హోటలంటే ఏమనుకుంటున్నారు? ఐదవ జార్జి మహారాణి మధుపురికి వచ్చినపుడు ఈహోటల్‌లోనే దిగేది తెలుసా? ఆమె దిగిన గదిని ఎవ్వరికీ అద్దెకు ఇవ్వలేదు. ఇప్పటికీ ఆమె ఫొటో ఆ గదిలోనే వుంది" అన్నాడు.

భారతదేశ సామ్రాజ్ఞి, ఐదవ జార్జిగారి మహారాణి మాట్రిన్ హోటల్లో వచ్చి దిగిన సంఘటన లాలాకు ఇప్పుడే కళ్లముందరే జరిగినంత స్పష్టంగా జ్ఞాపకం వుంది. హోటల్ నలుదిక్కులా తెల్ల సైనికులు కాపలాకాస్తున్నారు. పెద్ద పెద్ద సైనికాధికారులు కానిస్టేబుల్ల లాగా చుట్టుపక్కల జాగ్రత్తగా కాపలా కాస్తున్నారు. ఊరిలోని మిగిలిన బంగళాలన్నీ

ఆంగ్లేయులతో నిండిపోయేవి. మహారాణికి ఏ ఘోషాలు, పరదాలు వుండేవి కావు. అయినా ఆమె దర్శనం దుర్లభమయ్యేది. తెల్లదొరలూ, దొరసానులే రాణిగారి దర్శన భాగ్యం కోసం పడిగాపులు పడేవారు. తెల్లదొరలే ఇలా వుంటే ఇక నల్లవాళ్ళకు రాణీగారి దర్శన భాగ్యం లభించటం దుర్లభమే? ఆనాటి అనుభవాలను జ్ఞప్తికి తెచ్చుకుంటూ అన్నాడు లాలా. కానీ తాత లాలాకు ఒకసారి రాణీగారిని దర్శించుకునే భాగ్యం కలిగింది. వాళ్ళ బాబాయితో పాటు హోటల్ సరుకుల్ని రోజూ సప్లయి చేయవలసి వచ్చేది లాలాకు. అక్కడ పనివాళ్ళతో గాఢమైన సంబంధాల్ని కలిగి వుండేవాడు లాలా. గాఢమైన సంబంధాల్నే కలిగి వుండకపోతే ఈ వృత్తిలో ఎలా రాణించగలడు? మహారాణికీ, ఆమెకు సంబంధించిన వాళ్ళకు పని వాళ్ళుగా తెల్లవాళ్ళే వున్నప్పటికీ ఒక వంటవాడి సాయంతో లాలా రాణీగారి దర్శన భాగ్యాన్ని పొందగలిగాడు.

లాలా బజారు నుండి సరుకులను హోటలుకు సప్లయి చేస్తుండేవాడు. కూరగాయలు, పాలు, వెన్న, బియ్యం ఇలాంటివే కాకుండా మాంసాన్ని కూడా సప్లయి చేసేవాడు. సారాయినీ, ఇతర విలాస వస్తువులనూ హోటల్ వాళ్ళు నేరుగా ఇంగ్లీషు వారి స్టోరు నుండి తెప్పించుకుంటూంటే వారు. ఆ రోజుల్లో మధుపురిలో యూరోపియన్ల అజమాయిషీలో చాలా దుకాణాలుండేవి. హోటల్ వాళ్ళు ఆదుకాణాల దగ్గర నుండే సారాయి లాంటి వాటిని తెప్పించుకునేవారు. తాత లాలా ఎన్నడూ మాంసం తినలేదు. తరతరాలుగా వస్తున్న ఆచారం ప్రకారం శాఖాహారి కావటం వల్ల మాంసాన్ని ఒక రకంగా ఏవగించుకునే వాడు. ఐతే, మాంసం వుడికేటప్పుడు వచ్చే మసాలా వాసనను ఏవగించుకునే వాడు కాదు. లాలా కుటుంబంలోనూ గరం మసాలా వాడతారు కానీ వెల్లుల్లిపాయలు బదులు ఇంగువను వాడతారు. ఇంగువ చాలా పవిత్రమైన పదార్థమన్న విశ్వాసం లాలాకూ, అతని భార్యకు వుంది. వాళ్ళ పూర్వీకులకు కూడా అదే విశ్వాసం వుండేది. ఒకసారి లాలాకు ఇంగువ గురించి ఎవరో చెప్పారు. ఇంగువ తుమ్మజిగురు లాగానే వుండే ఒక చెట్టునుంచీ తీసే జిగురని చెప్పారు. మన దేశానికి ఇంగువను పంపే దేశాల వాళ్ళందరూ మాంసాహరులనీ; ఇక నేతిలో డాల్డాను కల్తీ చేస్తున్నట్టుగానే వాళ్ళూ ఇంగువలో కల్తీ కలుపుతారు? కల్తీ ఏం కలుపుతారో తెలుసా? అప్పటికప్పుడు చంపిన జంతువుల రక్తాన్ని! ఆ జంతువుల చర్మంతోనే ఇంగువను సేరు, రెండుసేర్లుగా మూటకట్టి పంపుతారు. వాళ్ళు ఈ విషయాలను చెప్తున్నప్పుడు లాలా భార్య కూడా ప్రక్కనే వుంది. ఐనా వాళ్ళు ఆరోజుతో ఇంగువ తినటాన్ని ఆపలేదు. తరతరాలుగా వస్తున్న అలవాటాయే! ఎలా మానతారు! ఇప్పటికీ లాలా ఇంట్లో ఉల్లిపాయగానీ, వెల్లుల్లి గానీ వాడరు. ఇంగువను మాత్రం ధారాళంగా వాడుతున్నారు.

లాలా జీవితంలో ఎన్నడూ మాంసం ముట్టలేదు. అతని తరువాత తరాలు మాత్రం మాంసం తినటాన్ని అలవాటు చేసుకున్నారు. కానీ సారాయి విషయంలో మాత్రం లాలా తన పూర్వీకుల మార్గంలో నడవలేకపోయారు. మద్యం సేవించటాన్ని నేర్పిన అతని గురువు స్వజాతీయుడే. లాలాకు శిష్యుడి కుపదేశించినట్టుగా ఇలా ఉపదేశించాడు ఆ గురువు. "మద్యం అంటే మరేమిటో కాదు. ద్రాక్ష రసమే! ఇది చేపలు, మాంసం లాంటిది కానేకాదు. మనం షర్బత్ తాగటం లేదా? ఇదీ అంతే!" అని చెప్పాడు. గురువు చేసిన ఉపదేశాన్ని విన్న లాలా ఒక శుభదినాన మద్యాన్ని తీసుకున్నాడు. ఒకసారి అలవాటయితే మద్యం మనిషిని వదులుతుందా? పైగా ఏ డబ్బు ఖర్చులేకుండా వూరకే  వస్తూ వుంటే మనిషి మాత్రం వదిలి పెడతాడా? మాట్రిన్ హోటల్‌లో విదేశీ మద్యం విస్కీ, షంపేన్, బ్రాందీ కాలువలు కడుతుండేది. ఆ హోటల్‌లోని వంట వాళ్ళకు, వంటవాళ్ళ నుండి లాలాకు కొన్ని ప్రయోజనాలు వుండేవి. ఆ హోటలు చిన్న మేనేజరు ఆంగ్లో ఇండియను. అతడికీ, లాలాకు లావాదేవీలుండేవి. అలా యవ్వనంలోనే మద్యానికి బానిసయ్యాడు. ఇప్పుడు అతనికి వృద్ధాప్యం వచ్చింది. బ్రిటిష్ పరిపాలనా అంతమయింది. మాట్రిన్ హోటల్ ఇప్పటికీ వున్నది. ప్రస్తుతం దాని యజమానులు భారతీయులే. వీళ్ళు ఇంగ్లీషు వాళ్ళలాగా ఖర్చు పెట్టరు. అందువలన యుక్తవయస్సులో తీసుకున్న దీక్షను ఇప్పుడు పూర్తిగా పాటించలేకపోతున్నాడు లాలా.  ఏమైనా కానీ ఇంగ్లీషువాళ్ళు భారతదేశాన్ని వదిలి వెళ్ళిపోయే వరకూ లాలా చాలా సుఖమైన జీవితాన్నే గడిపాడు. ఆ కాలాన్ని 'సత్యయుగం' అనలేడు కానీ 'స్వర్ణయుగం' అని మాత్రం అంటుంటాడు. ఆ రోజులు గుర్తుకు వచ్చినప్పుడల్లా తాత దీర్ఘంగా నిట్టూర్చుతూ "ఆ రోజుల్లో నిజంగా ఆకాశం నుండి బంగారం కురిసేది" అనేవాడు.

లాలా మద్యం తాగటాన్ని రహస్యంగా ప్రారంభించాడు. ఏ నాటికీ రహస్యంగానే వుండాలనే అతని ఉద్దేశం. కాని ఇంట్లో వాళ్లు పసిగట్టకుండా ఎలా వుంటారు? అతని మాట తీరు, నోటి నుంచి వచ్చే వాసన ఇంట్లో వాళ్ళకు తెలియపరుస్తూనే వుండేది. అతని కొడుకులూ, మనవళ్ళూ మద్యం సేవనాన్ని అలవర్చుకున్నారు. ఒక కొడుకు తప్పతాగి వీధుల్లో దొర్లుతుంటే అతడిని ఇంటినుంచి వెళ్ళగొట్టాడు. అతను పెళ్ళాన్నీ, నలుగురు పిల్లల్నీ మధుపురిలోనే వదిలేసి దొరికిన చోటల్లా అప్పు చేసి జాడలేకుండా ఎక్కడికో వెళ్ళిపోయాడు. కొందరు చనిపోయాడని, కొందరు బతికే వున్నాడనీ, ఆ ఊళ్ళో చూశామని, ఈ ఊర్లో చూశామని ఇలా రకరకాలుగా ఊర్లో అంటుండేవారు. అతని భార్యను చూసి పశ్చాత్తాపాన్ని కనపరుస్తూ కొందరు మహిళలు "ఇలాంటి భర్త దొరికిన స్త్రీ అదృష్టవంతురాలు. ఆమెకు వైధవ్యమంటూ వుండదు! నిజమే ఇలాంటి భర్తలుంటే

అతను చనిపోయాడో? లేదో? తెలియదు కాబట్టి, భార్య బతికి వున్నంతకాలం ముత్తయిదువే? కానీ నలుగురు బిడ్డల్తో తినటానికి, తిండి లేక బిడ్డల్ని పస్తులు పెట్టుకునే ఆమె ముత్తయిదుతనాన్ని ఏం చేసుకుంటుంది?

చాలా కాలం క్రితమే లాలా తన కొడుకుల్ని ఇంట్లో నుండి వెళ్లగొట్టాడు. అప్పట్లో ఉన్న కొద్దిపాటి ఆస్తిపాసుల్ని పంచవలసి వస్తుందని కొడుకుల్ని వేరు చేయటం అవుసరం అనుకున్నాడు. మద్యం తనను నాశనం చేస్తుందని ఎన్నడూ లాలా అనుకోలేదు. భగవంతుని దయ వల్ల మాట్రిన్ హోటల్ తన చేతుల్లో వుంది. ఇంక తనకేంటి?' అన్న ధైర్యంతో వుండేవాడు. ఐతే, భగవంతుడి దయ అతనిపై నుండి తొలగిపోయింది. ఏ సారాయి తనను నాశనం చెయ్యదనుకున్నాడో. ఆ సారాయే అతణ్ణిప్పుడు సర్వనాశనం చేస్తోంది. ఇప్పుడు లాలాకు డెబ్భై ఏళ్ళు దాటి పోయాయి. కాటికి కాళ్ళు చాచాడు. చుట్టుపక్కల వాళ్ళు లాలాను చూసి "చిత్రగుప్తుడు కబురు పెట్టటం... మర్చిపోయాడేమో!' అని అంటున్నారు. మద్యమే కాకుండా లాలాకు యవ్వనంలో అలవాటైన మరొక దురలవాటు వుంది. అది జూదం ఆడటం. మధుపురిలోని సంపన్నులు, నల్లదొరలూ 'బ్రిజ్' ఆట ఆడుతుండేవారు. ఇంగ్లీషు వాళ్ళు కూడా 'బ్రిజ్' ఆట ఆడేవారు. మధుపురిలో కొందరికి నిత్యం జూదం ఆడే అలవాటు వుంది. తాత లాలా దేశీయ జూదం బాగా ఆడతాడు. అయితే అతనికి 'బ్రిజ్' ఆటరాదు. దేశీయ జూదంలోనైనా ఎప్పుడూ గెలుస్తాడనీ చెప్పలేం! కానీ, అతని ఇంటిని ఆస్తిపాస్తుల్ని చూసినవారు అతను జూదంలోనే వీటిని సంపాయించాడనే వారు.

## 3

ముసలి లాలా ఇప్పటి వర్తమాన శతాబ్దంలోని అన్ని భాగాన్నీ గత శతాబ్దంలోని చివరి భాగాన్నీ తన కండ్లతో చూశాడు. రెండు ప్రపంచ యుద్ధాలను తన కండ్ల ముందే చూశాడు. మొదటి మహా యుద్ధమపుడు అతను యువకుడు. అంత అనుభవము లేదు. ఆ సమయంలో ధరలు విపరీతంగా పెరిగాయి. అప్పుడు లాలా కొద్దో గొప్పో సంపాదించాడు. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో వ్యాపారులకు హద్దూపద్దూ లేకుండాపోయింది. రెండు చేతులా లాభాలను గడించారు. లాలా జూదంలోనే కాకుండా బ్లాక్‌మార్కెట్ చేయటంలో కూడా నైపుణ్యం సంపాదించాడు. మాట్రిన్ హోటల్ కాంట్రాక్టు వుండనే వుంది. మరొక చిన్నదుకాణం తెరిచాడు. అదీ లాభాల మీదే నడిచింది. యుద్ధం రోజుల్లో మధుపురిలోని ఇతర వ్యాపారస్తులు పదేసి, ఇరవయ్యేసి లక్షలు సంపాయించారు. లాలా అంత సంపాయించకపోయినా బాగానే సంపాయించాడు. అతనికి డబ్బు విలువ

బాగా తెల్సు. సాధ్యమయినంత తక్కువ ఖర్చు పెట్టి ఎక్కువ సంపాయించాలన్న ఆదర్శం గల వ్యక్తి లాలా. యుద్ధం కాలంలో సంపాయించిన డబ్బుతో ఇల్లు కట్టాలనుకున్నాడు. మున్సిపాలిటీలో ప్లాను గీయించి యివ్వకుండా ఇల్లు కట్టటానికి వీలు లేదు. కనుక ఇంజనీర్‌ని పిలిపించి ప్లాను గీయించాడు. లేకపోతే ప్లాన్ పని లేకుండా ఏకంగా ఇల్లు కట్టించేవాడే! అతడు మామూలు డ్రాఫ్టుమెన్‌తో ప్లాను గీయించి మున్సిపాలిటీకి పంపించాడు. ఆ ప్లాను కూడా అతని కల్పితమే! అతడు అగ్గిపెట్టెల్ని ఆదర్శం పెట్టుకుని మేడ కట్టేవాడు. చిన్నచిన్న అనేక గదులతో రెండతస్తుల మేడ కట్టాడు. బ్రిటిష్‌వాళ్ల కాలంలో అతని మేడ అద్దెకు వుండే వాళ్ళతో కళకళలాడుతుండేది. ఇప్పుడు ఆ మేడలో గబ్బిలాలు కాపురం వుంటున్నాయి. ఒక్క లాలా మేడలోనే కాదు మార్టిన్ హోటలు తప్ప మిగతా అన్ని బంగళాలలో ఇప్పుడు అదే పరిస్థితి. ఆ బంగళాలలో దీపం పెట్టి ఎన్నాళ్ళయిందో?

లాలా ఆ భవనాన్ని చాలా ఇష్టంగా కట్టించుకున్నాడు. ప్రతి అంగుళ ప్రదేశము సదుపయోగమయ్యేటట్టుగా చేశాడు. ఎక్కువ గదులు ఉంటే ఎక్కువ అద్దెలు వస్తాయని గదులు ఎక్కువగా వుండేటట్టు దగ్గరుండి కట్టించాడు. బంగళాకు కావల్సిన సిమెంట్, ఇటుకలు, కలప లాంటి వాటిని కంట్రోలు రేటుకు కొన్నాడు. సిమెంట్, కలప ఎక్కువగా వాడటాన బంగళా నకిలీది కాకుండా అసలయిందిగా తయారయింది. అద్దెకు వచ్చిన వాళ్ళు స్నానాల గది లేదని మరుగుదొడ్డి లేదని అంటే అవి లేకపోవటం తన బంగళాకు లోపమని లాలా ఎప్పుడూ అనుకోలేదు. అవుసరం లేనివాళ్ళు ఇలాగే వంకలు పెడుతుంటారని సరిపెట్టుకున్నాడు.

అగ్గిపెట్టెల్ని ఆదర్శంగా తీసుకుని కట్టించిన లాలా మేడ కొన్ని సంవత్సరాలుగా ఖాళీగా పడి వుంది. కనపడ్డ వాళ్లందరికీ 'ఎవరైనా అద్దెకు వచ్చేవాళ్ళుంటే కొంచెం చెప్పండని' అంటుంటాడు. అవతల వ్యక్తి 'అద్దె ఎంత చెప్తున్నావు?' అంటే ప్రభుత్వం నిర్ణయించిన ధర పదిహేను వందలు. పరిస్థితిని బట్టి వెయ్యిరూపాయలకైనా ఇస్తాను" అని అంటాడు.

కానీ వెయ్యి రూపాయలకైనా ఆ బంగళాలో అద్దెకు ఎవరు తీసుకుంటారు? 3,500కు అద్దెకు ఇచ్చిన ఒక బంగళాను 500కే అద్దెకు ఇచ్చారు మొన్నీమధ్యనే! ఎంతో కొంత వస్తే ఇల్లు బాగుచేయించటానికైనా వుంటుంది కదా! అద్దె రాకున్నా తను వుందామన్నా వీలు లేకుండా వుంది. తను వుండి బంగళాను వాడుకలోకి తీసుకువస్తే మున్సిపాలిటీకి పన్ను కట్టవలసి వస్తుంది.

లాలా వృద్ధుడయ్యాడు. మానసికంగా మాత్రం వెనుకటి స్థితిలోనే వున్నాడు. ఈ

వృద్ధాప్యంలో కూడా పెళ్ళానికి కానీ, పిల్లలకు కానీ ఏమాత్రం అలుసు ఇవ్వలేదు. ఇప్పటికీ ఇంట్లో ఎవరూ అతని మాటను కాదనటానికి వీల్లేదు. లాలా ఇలా అంటుంటారు "జీవితం చివరి దశకు వచ్చింది. ఇంక ఇప్పుడేమిటి? ఖర్చులు తగ్గించుకుందామని కొడుకులను విడిగా వుంచాను. ఖర్చులుపెరుగుతున్నాయే కానీ తరగటం లేదు. వడ్డీలు ఎక్కువ తీసుకుంటారని కోమట్లను అంటుంటారు కానీ అవకాశం దొరికితే వడ్డీలు తీసుకోవటానికి అందరూ సిద్ధమే!"

మధుపురిలో స్థానిక జమీందారు ఒకతను వున్నాడు. అతడు నెలకు 6½ % చొప్పున డబ్బు వడ్డీకి ఇస్తుంటాడు. ఒకవేళ కోర్టుకు వెడితే చెల్లక పోతుందేమోనని 5 సం॥ల వడ్డీని కలిపి ఒకసారే నోటు వ్రాయిస్తాడు. ఇతర మహారాజులూ, జమీందార్లు తమ సంస్థానాలు పోతున్నాయని గుండెలు బాదుకుంటున్నారు. పై చెప్పిన జమీందారు మాత్రం వడ్డీ వ్యాపారం ద్వారా గడచిన పది సంవత్సరాలలో ఎన్నో బంగళాలను కొనుక్కున్నాడు. బంగళాల ధర ఇంత దారుణంగా పడిపోకపోతే అతను ఏనాడో కోటేశ్వరుడ య్యేవాడు. స్థిరాస్థి వుంటే ఆ జమీందారు ఎవరికైనా డబ్బు వడ్డీకి ఇచ్చేవాడు. ముసలితాతకు జమీందారుకు వెనుకటి నుండే పరిచయాలు, ఇచ్చిపుచ్చుకోవటాలు వుండటంతో తాత ఇతర్లకు కూడా అప్పుఇప్పించేవాడు. లాలా సొంతానికి అవుసరమయితే జమీందారు కొంత తక్కువ వడ్డీకి అప్పు ఇచ్చేవాడు. జమీందారు తాతకు మేడపైన, ఇతర స్థిరాస్థులపైన కొన్నివేలు ఇప్పటికే అప్పు ఇచ్చాడు. ఇప్పుడు ఆ అప్పు తీరుతుందన్న ఆశ లాలాకు లేదు. లాలా నిజంగా రోజులు లెక్కపెడుతున్నాడు. తన తర్వాత వాళ్లు ఏమైపోతారో అన్న సమస్య అతనికి లేదు. అందరి జీవితాల బాధ్యత తనయితే తీసుకోలేదుగా? తను ఎంతో వాళ్ళూ అంతే! తను పది పన్నెండేళ్ళ వయస్సులో బతకటానికి మధుపురికి రాలేదా?

# అయ్యో! ముసలితనం!!

**శీ**తల మంద సుగంధమైన గాలులను మనదేశంలో ఆహ్లాదకరమైనవిగా భావిస్తుంటారు. అలాగని, ప్రపంచంలోని అన్ని దేశాల ప్రజలకు శీతల మంద సుగంధ వాతావరణం ఆహ్లాదాన్ని కలిగిస్తుందనుకుంటే పొరపాటే! ఎక్కడ ఏది అందుబాటులో వుండదో? అక్కడ దానికి విలువ ఎక్కువగా వుంటుంది. మనకు ఎండలు ఎక్కువ. శీతగాలులు అరుదుగా గానీ వీచవు. కనుక మనదేశంలో శీతగాలులను ఎక్కువగా ఇష్టపడతారు. యూరోప్‌లోనూ, ఇతర ఆసియాలోని $30^0$ అక్షాంశానికి ఉత్తర ధృవం వైపు వున్న శీతల దేశాలలో చలిగాలులను ఎవరూ కోరుకోరు. అవి ఎంత మంద సుగంధ పవనాలను తీసుకువచ్చినప్పటికీ ఆదేశ ప్రజలకు నచ్చవు. మనదేశంలోనూ మధుపురిలాంటి ప్రదేశాలలో నివసించే ప్రజలు శీతల – మంద సుగంధ పవనాలను కోరుకోరు. అయితే, మైదాన తీర ప్రాంతాలలో నినవసించే ప్రజలు ఈ గాలులను చాలా ఆహ్లాదంగా భావిస్తారు. సాధారణంగా సముద్ర మట్టానికి 5వేల ఎత్తున వుండే ప్రదేశాలలో చలి అంత విపరీతంగా వుండదు. శ్రీనగర్‌లాంటి ఎత్తయిన ప్రదేశాలలో ఎక్కువగా మంచు కురుస్తూ వుంటుంది. ఐతే, శ్రీనగర్‌లాంటి ప్రదేశాలు భారతదేశంలో చాలా తక్కువ.

మధుపురి లాంటి విలాస నగరాలు చాలా ఎత్తున ఉండటాన అక్కడ చలి చాలా ఎక్కువగా వుంటుంది. తీర ప్రాంత ప్రజలు ఆ చలిని భరించలేరు. ద్వేషిస్తారు! మధుపురి లాంటి నగరాలలో సంవత్సరమంతా చలి విపరీతంగా వుండదు. సంవత్సరంలో నాలుగు నెలలు అంటే నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరిలో చలి ఎక్కువగా వుంటుంది. అప్పుడప్పుడు మంచు కురుస్తూ వుంటుంది. మిగిలిన ఎనిమిది నెలలూ మధుపురిలో శీతల – మంద – సుగంధ గాలులు ఎంతో ఆహ్లాదంగా వుంటాయి. సంవత్సరంలో 8 నెలలు విలాస ప్రియులను సంతృప్తి పరచటానికి సిద్ధంగా వుంటుంది మధుపురి! ఐతే, అన్ని నెలల్లో అందరికీ సమానమైన ఆహ్లాదం వుండదు. బొంబాయిలోని సంపన్నులు, వ్యాపారస్థులు ముందుగానే అంటే ఏప్రిల్ కల్లా మధుపురికి వస్తారు. ఉత్తర భారత

సంపన్న విలాస ప్రియులు మే సగం గడిచాక వచ్చి జూన్ సగం దాకా వుండి వెళ్తారు. వాస్తవానికి ఈనెలా, నెలన్నర రోజులు విలాస యాత్రికులతో రద్దీగా వుంటుంది. ఇదే ఇక్కడ పెద్ద సీజను. బొంబాయి, గుజరాత్ నుండి వచ్చే యాత్రికులు చాలా తక్కువ సంఖ్యలో వుంటారు. వీరు మధుపురి ప్రజలను అంతగా సంతృప్తి పరచలేరు. కానీ ముందుగానే వచ్చి వీళ్ళు బోణీ చేస్తారు. ఇదీ వీరి ప్రత్యేకత. ఈ సీజను వర్షం మీద ఆధారపడి వుంటుంది. వర్షం జూన్ చివరి దాకా కనక పడకపోతే అప్పుడు సీజన్స్ రెండు నెలలు వుంటుంది. ఈ రెండు నెలలూ విలాస యాత్రికుల ద్వారా కొంత డబ్బు సంపాదించుకుంటారు. స్థానిక ప్రజలు వర్షాలు తొందరగా పడకూడదని దేవుళ్ళని మొక్కుకుంటూ వుంటారు. ఒకవేళ వర్షాలు తొందరగా పడితే మధుపురిలోని ప్రతి ఒక్కరూ ఆదేవుళ్ళనే తిట్టుకుంటూ వుంటారు.

పెద్ద సీజను, నెల, నెలన్నర వుంటుంది. అంటే దానర్థం ఆసీజను తరువాత మధుపురి నిర్మానుష్యంగా మారుతుందని కాదు. పెద్ద సీజనులో వచ్చినంత కాకపోయినా యాత్రికులు వస్తూనే వుంటారు. పంజాబు విలాస ప్రియులు వాస్తవానికి జులైలో గానీ మధుపురికి రారు. వేసవి కాలంలో ఉత్తరప్రదేశ్‌లో వున్నంత ఉష్ణోగ్రత పంజాబులో వుండదు. బనారస్, బందా, అజమ్‌గఢ్, లక్నో లాంటి నగరాలలో 115°-116° వరకూ ఉష్ణోగ్రత వున్నప్పుడు పంజాబ్‌లో 110° డిగ్రీలు కంటే తక్కువ వుంటుంది. 5, 6 డిగ్రీల ఉష్ణోగ్రత మాత్రమే తేడా వుంటుంది. అందువలననే పంజాబు విలాస పురుషులు జులైలో మధుపురికి బయలు దేరుతారు. ఇలా జులైలో మధుపురికి వెళ్ళి రావటం గురించి విన్న వాళ్ళు ఆశ్చర్యపడతారు? ఎందుకంటే వేసవి కాలంలోని ఎండలను, వడగాల్పులను భరించి జులైలో వర్షాలు పడ్డాక మధుపురికి వస్తున్నారు. ఇది ఆశ్చర్యపడవలసిన విషయమే. ఐతే, వాళ్ళు చెప్పేదేమిటంటే వర్షాలు పడుతుంటే ఎండలు తగ్గుతాయి కానీ ఉక్కపోత ఎక్కువగా వుంటుంది. వేడికి సెగ్గడ్డలు వస్తుంటాయి. ఉక్కపోత బాధ పడలేక మధుపురికి వెళ్తుం టామని. కొంచెం ఆలోచిస్తే ఇది ధనికుల అతితనంగా అనిపిస్తుంది. వడగాలిని భరించ గలిగిన వారు ఉక్కపోతను భరించలేరా? జులై, ఆగస్టు నెలలలో పంజాబు పర్యాటకులు మధుపురిలో కనిపిస్తారు. జూన్‌లో వున్నంత రద్దీ, సందడీ ఈరెండు నెలల్లో లేకపోయినా కొంత బెటరుగానే వుంటుంది. జూన్ నెలలో వెయ్యి రూపాయలు పెట్టినా అద్దెకు దొరకని బంగళా జులై నెలలో 200 రూ॥కే దొరుకుతుంది. సెప్టెంబరు దాకా పంజాబు పర్యాటకులు మధుపురిలో వుండి తర్వాత వాళ్ళ ఊళ్ళకు వెళ్లిపోతారు. అప్పటికి బీహార్-బెంగాల్‌లలోని సేఠ్‌లు మధుపురికి వస్తుంటారు. ఢిల్లీ చుట్టుపక్కల ప్రాంతాల నుండి కూడా పర్యాటకులు వస్తుంటారు. ప్రకృతి సోయగాలతో, శోభతో సెప్టెంబరు నుండి అక్టోబరు నెలంతా వుండే

ఈసీజను ప్రత్యేకమైన ఆకర్షణగా వుంటుంది.

అప్పుడప్పుడే వర్షాలు తగ్గుతూ వుండటాన నేలమీద దుమ్ము వుండదు. గాలిలో దుమ్ము లేకుండా నిర్మలంగా వుంటుంది. వేసవి కాలంలో దుమ్ము, ధూళి వడగాడ్పులు వస్తున్నప్పుడు ఆకాశం దుమ్మూ, ధూళితో నిండిపోయి మలినంగా వుంటుంది. ఆ దుమ్మూ, ధూళికి తెల్లని హిమాలయ పర్వతశ్రేణులు కనపడకుండా పోతాయి. రెండవ సీజనులో నయితే ఆకాశం నిర్మలంగా వుండటం వలన హిమాలయ పర్వత శ్రేణులు తెల్లని ధవళ కాంతులతో మెరుస్తూ అద్భుతంగా వుంటాయి. మధుపురికి ఎగువ ఉండే కొండలు వేసవికాలంలో ఏమాత్రం పచ్చదనంలేక ఎండిపోయి చూడటానికే బాధాకరంగా వుంటాయి. సెప్టెంబరులో నయితే బాగా ఏపుగా పెరిగిన పచ్చదనంతో కళ్ళకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంటాయి. మధుపురిలో చిన్నా, పెద్ద కలిపి మొత్తం నాలుగు సీజనులుంటాయి. అన్ని సీజన్లలో ఒకే రకంగా వుండకపోయినా మాల్‌రోడ్డు, ఇంకా ఇతర ముఖ్యప్రదేశాలలో మనుషుల సందడి ఎప్పుడూ కనిపిస్తూనే వుంటుంది. డాన్స్‌స్కూల్స్‌లో బాల్‌డాన్స్‌ను (యూరోపీయ నృత్యం) రోజూ చూడవచ్చు. ఇక నవంబరు నుండి మధుపురిలో స్థానికులు తప్ప బయటివాళ్ళు ఎవరూ కనిపించరు.

## 2

మధుపురిలో బస్టాండు, టాక్సీ స్టాండు వేరువేరుగా వున్నాయి. కొంచెం డబ్బు ఎక్కువ ఖర్చుపెట్టుకోగలిగితే స్టేషను నుండి 22 కిలోమీటర్లు వుండే ఈ ప్రదేశానికే వారు అద్దెకు తీసుకున్న బంగళాదాకా టాక్సీలోనే రావచ్చు. ఐతే, రోడ్లు బంగళాదాకా టాక్సీ వెళ్ళటానికి అనుకూలంగా వుండాలి.

వర్షాకాలం ప్రారంభమయింది. బస్‌స్టాండ్ దగ్గర కూలీలు ప్రయాణీకుల కోసం పోటీ పడుతున్నారు. అదే సమయంలో ఒక మహిళ తన ఇద్దరు పిల్లలతో సహా బస్సు దిగింది. కొంచెం దూరం నుండి చూస్తే ఆమెకు 25 సం॥ల వయస్సు వుంటాయను కుంటారు. ఆమె తన సామానులు కూలీలతో మోయిస్తూ, నౌకర్ని వాళ్ళతో పాటు కల్సి రమ్మని తను రిక్షాలో బంగళాకు బయలుదేరింది. నిజానికి కూలీలతో పాటు నౌకర్ని వుంచవలసిన అవసరం లేదు. ఇప్పటికీ యజమానులు లేకపోతే కూలీలు సామానులు దొంగిలిస్తారన్నది ఇక్కడ లేనే లేదు. సామాన్లు అప్పచెప్పి మన అడ్రస్ ఇస్తే అడ్రస్సు వెతుక్కుంటూనయినా కూలీవాళ్ళు సామాను తెచ్చిఇస్తారు. ఐతే, కూలీలు అప్పుడప్పుడు అడ్రసు తెలుసుకోవటంలో పొరపాటు పడుతూ వుంటారు. మధుపురి లాంటి నగరాలలో రోడ్లపేర్లు, బంగళాల పేర్లు అన్నీ ఇంగ్లీషులోనే వుంటాయి. ఆ పేర్లను చదువురాని ఆదివాసీ

కూలీలు తమకు తోచినట్టుగా మార్చుకుని, వాడుకలో అదే పేరుతో పిలిచే వాటిని గుర్తు తెచ్చుకోటానికి ప్రయత్నిస్తుంటారు. ఈ క్రమంలో పొరబడుతూ వుంటారు. ఎవరో ఒకరు చదువుకున్న వాళ్ళు ఎటూ కనబడతారు. ఆ ఇంగ్లీషు పేరుకు వాడుకలో వున్న పేరును చెప్తారు. ఆ మహిళ ఎర్రగా, సరిపడా ఎత్తు, లావూ వుండి గులాబీ రంగు సిల్కు చీర కట్టుకుని ఆకర్షణీయంగా వుంది. సహజంగానే వర్షాకాలంలో పలుచని చీర కట్టుకోరు. ఐతే, ఆమె రిక్షాలో వెళుతోంది. వర్షమూ కురవడం లేదు.

సామానును పంపించి ఆమె రిక్షాలో కూర్చుండిపోయింది. ఆమెతోపాటు 12, 13 సంవత్సరాల ఆమె ఇద్దరు కొడుకులూ రిక్షాలో కూర్చున్నారు. "బాబూ తప్పుకోండి! తప్పు కోండి" అంటూ రిక్షా లాగుతున్నాడు రిక్షావాడు. కొండతో పాటు మెలికలు తిరిగి వున్న తార్రోడ్లమీద రిక్షావాళ్ళు పరుగెడుతుంటారు. వాళ్ళు ఎక్కించుకున్న బాడుగను త్వరగా దింపేసి మరొక బాడుగను మాట్లాడుకోవాలని తొందరపడుతుంటారు. అవసరాని కంటే రిక్షాలు ఎక్కువగా వుండటాన ఇక బాడుగ దొరకటం దొరకకపోవటమన్నది వాళ్ళ వాళ్ళ అదృష్టం మీద ఆధారపడి వుంటుంది. ఆమె వేషధారణ, అలంకరణ చూస్తే చాలా ఫ్యాషన్‌గా వుండటానికి ఇష్టపడే ఆమెలాగా అనిపిస్తుంది. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే విలాస ప్రియులకూ, ఆధునిక సౌకర్యాలకూ నిలయమైన మాల్‌రోడ్డును వదిలి మైలున్నర దూరంలో వున్న 'స్ప్రింగ్‌డేల్'లో బంగళా తీసుకుంది. సెంటర్‌కు దూరంగా వుంటే ఒక ప్రయోజన మయితే వున్నది! ఈ వర్షాకాల సీజనులో మాల్‌రోడ్డుకు దూరంగా వున్న బంగళాలు తక్కువ అద్దెకు దొరుకుతాయి. ఆమెకూ ఆ విషయం తెలుసు అందుకే ఆమె 'ప్రమోద భవనం'ను అద్దెకు తీసుకుంది. ఈ సంవత్సరమే కాదు ప్రతి సంవత్సరం ఆమె ఇలాగే అద్దెకు తీసుకుంటుంది. 'ప్రమోద్ భవన్' పేరు విని మధుపురిలోని బంగళాలన్నీ ఇప్పుడు ఇలాగే భారతీయ పేర్లతో వున్నాయనుకోవటానికి వీలు లేదు. ఇలాంటి పేర్లతో ఒకటి, రెండు బంగళాలు మాత్రమే వున్నాయి. ఆ బంగళా యజమానులు ఏ ఇంగ్లీషు అతని దగ్గరో బంగళాను కొని వుంటారు. అతని వంశంలో ప్రమోదమన్న పేరు ఏ తరం లోనో వుండి వుంటుంది. అందుకని బంగళాకు ఆ పేరు పెట్టి వుంటాడు. మున్సిపాలిటీ లిస్టులో ఇలాంటి భారతీయ పేర్లు చాలా తక్కువగా కనపడతాయి. చుట్టుపక్కల వాళ్ళకు కూడా ఈ కొత్తపేర్లు తెలియవు. కూలీలు, రిక్షావాళ్లు ఆ భవనాన్ని 'కోతులమేడ'గా అంటుంటారు. ఇంగ్లీషు వాళ్ళ సమయంలో స్థానిక కూలీలు ఆ భవనాన్ని ఆ పేరుతోనే పిలిచేవారు.

ఆమె పేరు ప్రమోదబాల. గేటు తెరుచుకుని బంగళా లోపలకు వెళ్ళింది. అది రెండంతస్తుల భవనం. చూడటానికి చాలా గొప్పగా వుంది. యుద్ధ సమయంలో నయితే మూడు వేలు కట్టినా ఇట్లాంటి బంగళా అద్దెకు దొరికేదేకాదు. ఇద్దరు పిల్లలు, తల్లి

వుండటానికి ఆ బంగళా చాలా ఎక్కువ. ఆమె కింద అంతస్తులో వున్న గదులన్నింటినీ ఉపయోగించుకోలేదు. ఐనా, ఈ చింత బంగళా యజమానులకు వుండాలి కానీ కిరాయి దారులకు కాదు. ప్రమోదబాల అక్కడకు వచ్చేసరికి ఆమె వెనుకనే కూలీలు, నౌకరు వచ్చారు. కూలీలు నౌకరుతో గొడవ పడుతున్నారు. మైలున్నర దూరం చెప్పలేనంత బరువు మోసిన కూలీలకు ఒక్కొక్కరికి అర్థరూపాయి ఇస్తానంటున్నాడు నౌకరు. వాళ్ళు రూపాయిన్నర అడుగుతున్నారు. కాసేపు గొడవపడ్డాక రూపాయికి దిగారు కూలీలు. గవర్నమెంటు వారు ఒక్కొక్క కూలీకి రూపాయి ఇవ్వమని రూలు పాస్ చేసింది. 'రూపాయైనా ఇవ్వమన్నారు' కూలీలు. నౌకరు మాత్రం ఏమి చేయగలడు. దొరసాని ఆజ్ఞ అర్థరూపాయికంటే ఒక్కపైసా ఎక్కువ ఇవ్వాలన్నా యజమానురాలిని అడగాల్సిందే! వచ్చీ రాగానే యజమానురాలు కూలీలను మందలిస్తూ ఇలా అన్నది.

"మేమేమన్నా కొత్తవాళ్ళమనుకున్నారా? మీరు కొత్తవాళ్ళనయితే ఇంకా దోచుకుంటారే?" అని కోపగించుకుంది.

కూలీలు బతిమిలాడుతున్నారు. యాచించారు. ఆ మె కొంతసేపటికి ఆఠానా నుంచి పది అణాలు ఇస్తానన్నది. నౌకరు సామాన్లను సర్దుతున్నాడు. ఆమె చాలా సమయం దాకా 'పది అణాల' మీదే వుండి సామాన్లన్నీ సర్దాక 'పన్నెండు అణాలు' ఇవ్వమని నౌకరుకు చెప్పి లోపలకు వెళ్ళిపోయింది. మున్సిపాలిటీవారు ఒక్కొక్క కూలీకి రూపాయి ఇవ్వాలని చట్టాన్నయితే చేశారు గానీ 'ప్రమోదబాల' లాంటి వాళ్ళనుండి కూలీలకు సరిగా డబ్బు ఇప్పించటంలో బాధ్యతనైతే తీసుకోరు. రిక్షావాళ్ళు ఇలాంటి పర్యాటకులను చాలా మందినే చూస్తుంటారు. నిర్ణయించిన ధరకు అమ్మగారు అర్థరూపాయి మాత్రమే తగ్గించి ఇచ్చినందుకు అదే తమ అదృష్టంగా భావించారు.

దొరసాని ఇద్దరు కొడుకులూ స్టేషన్ దగ్గరే టిఫిన్ చేసేసారు. మధ్యాహ్నానికి కొన్ని బిస్కెట్లూ, స్నాక్సులూ, చాలు. దొరసాని రాగానే కాపలాదారుడు వచ్చి వంటకు ముగ్గురు పనివాళ్ళను మాట్లాడాడన్న శుభవార్త చెప్పాడు. కొద్దిసేపటి తరువాత ముగ్గురు పనివాళ్ళనూ పిలుచుకువచ్చాడు. మధుపురిలో బాగా వంట చేయగలిగిన వంటవాళ్ళు భోజనం పెట్టి నెలకు 40 రూపాయలు ఇస్తే కానీ దొరకరు. భోజనం లేకుండా నెలకు 25 రూపాయలకు ఎవరు ఒప్పుకుంటారు. ఐతే, ప్రమోదబాలకు అంతబాగా వంటచేసే వాళ్ళు అవుసరం లేదు. వంట చేసి పెట్టటానికి ఇప్పుడున్న నౌకరు 'చేతు' సరిపోతాడు. కాకపోతే అంట్లు తోమటానికి ఒకరు, దొరసానమ్మకు ఏ క్షణాన ఏ పని అవసరమవుతుందో? నని చేతులు కట్టుకుని నిలబడటానికి ఒకరు కావాలి. ఐతే, వాళ్లు చెయ్యితిరిగిన వంటవాళ్ళు కానవసరం లేదు. అందుకనే ఆ పనివాళ్ళతో ఎక్కువ సేపు బేరమాడటం ప్రమోదబాలకు ఇష్టంలేదు.

ఆమె బయట వున్న రకరకాల పూల తీగల్ని చూస్తోంది. పచ్చని తీగల నిండా ఎర్రని, పసుపుపచ్చని పూలు విరగకాసి వున్నాయి. ప్రమోదబాల ఆనందంగా వాటిని చూస్తోంది. కాపలాదారుడు "క్రితం సీజన్ వాళ్ళకు పూలను పెంచటం చాలా ఇష్టం. వాళ్ళే వీటిని వేశారు. వాళ్ళుండగా ఇవి పూతకు రాలేదు" అని అన్నాడు. ప్రమోదబాల చుట్టుపక్కల భవనాలలో ఎవరెవరు వుంటున్నారు? అడిగి తెలుసుకుంది. ప్రస్తుతం చుట్టుపక్కల బంగళాలన్నీ ఖాళీగానే వున్నాయి. ఐనా వర్షాకాలంలో ఈ బంగళాలలోకి వస్తారో? రారో? చెప్పలేము. మాల్‌రోడ్డు దగ్గర వున్న బంగళాలలోనే అద్దెకు తీసుకుంటారు. ఇంతదూరం ఎందుకు వస్తారు? మూడు బంగళాల అవతల వున్న నాలుగో బంగళాలో ఆంగ్లో ఇండియన్ వృద్ధురాలు ఒకామె వున్నదని ప్రమోదబాలకు తెల్సింది. ఆమె వృద్ధురాలు అయినా సరదాగా, కలుపుగోలుతనంగా మాట్లాడుతుంది. 'ప్రమోదభవన్'లోకి దిగేవారికి ఆమెతో కాలక్షేపం వుంటుంది.

బంగళా కాపలాదారుని కుటుంబం బంగళాకు పక్కనే వుంటుంది. కాపలాదారు భార్య, ఆమె రెండేళ్ళ కొడుకూ ఎంతకీ కనపడక పోయేసరికి వాళ్ళ గురించి అతడిని అడిగింది ప్రమోద. కాపలాదారు ఏడుపు ముఖం పెట్టి "దాని గురించి అడక్కండమ్మా! నన్ను మోసం చేసి లేచిపోయింది. పక్క బంగళా వంటవాడు నా దగ్గరకు వస్తుండేవాడు. వాడొక పామని నాకేం తెల్సు? మేము కలిసి కట్టుగా స్నేహంగా వుండేవాళ్ళం. సీజను అయిపోతుందనగా నా భార్యను లేపుకుపోయాడు. వెళుతూ, వెళుతూ, నా సంవత్సరం కొడుకునూ తీసుకుపోయాడు" అన్నాడు.

కాపలాదారుని పట్ల ప్రమోదబాలకు సానుభూతి కలిగిందని చెప్పటానికి వీలు లేదు. ఆమె బాగా చదువుకున్నది. ఆధునిక భావాలు కలిగి వున్నది. స్త్రీ పురుషుని కంటే ఏ విధంగానూ తక్కువ కాదని ఆమె అభిప్రాయం. అందువల్ల "ఎండిన మొఖం చెక్కపేడులాగా వున్నాడు. వీడిని వదిలి అందమైన ఆమె మరొకణ్ణి చూసుకోవటంలో తప్పేముంది? అని అనుకున్నది. ఐతే, అతని పట్ల కొంత సానుభూతి ప్రకటించక తప్పదు కదా? ఆమె కొన్ని సంవత్సరాలుగా ఆ బంగళాను అద్దెకు తీసుకుంటోంది. ఎన్నో సంవత్సరాలుగా కాపలాదారునిగా వున్నాడుఅతను? మరి సానుభూతి చూపించకపోతే ఎలా?

## 3

మాల్‌రోడ్డుకు దూరంగా మనుషుల సందడి లేని చోట 'ప్రమోద్‌భవన్'లో వుంటున్న ప్రమోదబాలకు సందడితో కూడిన ఆధునిక జీవితం ఇష్టం లేదనుకుంటే పొరపాటే. సూర్యోదయానికి ముందే నిద్రలేచి వెళ్ళిపోయిన ఆమె అర్థరాత్రికి గానీ బంగళాకు తిరిగి

రాదు. పగటిపూట, ఇతర సమయాలలో ఆమెను బంగళాలో చూడటం అసంభవం. ఆమె భర్త గవర్నమెంటులో ఒక ఉన్నత అధికారి. అతని చేతిలో ఒక డిపార్టుమెంటు వున్నది. అతని జీతం ఎంతైనప్పటికీ పై ఆదాయం ఇంట్లో కనకవర్షాన్నే కురిపిస్తుంది. అటువంటప్పుడు ప్రమోదబాలకు డబ్బుకు కొదవేముంది? అయితే అతను ఎప్పుడూ మధుపురికి రాలేదు. అతను మరొక విలాస నగరానికి వెళ్తుంటాడు. ప్రమోదబాల పిల్లలతో సహా వచ్చి నాలుగు నెలలూ మధుపురిలో గడిపేస్తుంది. ఆమె ఎప్పుడూ భర్త లేకుండానే మధుపురికి వస్తూ వుంటుంది. చుట్టుపక్కల వాళ్ళు ఆమె భర్తతో విడాకులు తీసుకుందేమో నని అనుకునేవారు. ఆధునిక జీవితంలో అదేమంత చెప్పుకోదగిన విషయం కాదు. ఎందుకంటే ఉన్నత వర్గాలలో విడాకులు ఇచ్చుకోవటమన్నది చాలా సర్వసాధారణం అయిపోయింది. కానీ, నిజానికి ప్రమోదబాల, ఆమె భర్త విడాకులు తీసుకోలేదు. వాళ్ళు నెలల తరబడి కలిసి వుండకపోయినా, మాట్లాడకపోయినా ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా గడుపుతున్నా విడాకులు తీసుకోవాల్సిన అవుసరం వారికి అనిపించలేదు.

'ప్రమోదభవన్'కు మాల్‌రోడ్డు మైలున్నర దూరంలో వుంటుంది. అన్‌సీజన్ కాబట్టి రిక్షాలు తక్కువ బాడుగకు దొరుకుతాయి.ఆమె మాల్‌రోడ్డుకూ, 'ప్రమోదభవనానికీ' రోజూ రిక్షాలో తిరుగుతూవుంటుంది. ఆమె రోజూ ఒక హోటల్‌కు వెళుతూ వుంటుంది. 'బ్రిజ్' ఆటను ఆమె చాలా ఇష్టంగా ఆడుతుంది. కానీ, ఆటలో తరుచు ఓడిపోతూనే వుంటుంది. బంగళాలో వున్నప్పుడు ఆమె చాలా గంభీరంగా వుంటుంది. హోటల్‌కు వెళ్లగానే ఆమెలోని గంభీరమంతా పోయి చిన్నపిల్లలా, చలాకీగా నవ్వుతూ కనిపిస్తుంది. ఆమె తల వెంట్రుకలు నల్లగా, వంకలు తిరిగి వుంటాయి. కనుబొమ్మల్నీ, కనురెప్పల్నీ, నల్లని పెన్సిల్‌తో దిద్దుకుంటుంది. కళ్ళు పెద్దగా కనపడటానికి మృగనయనీ అనిపించుకోటానికే కనుచివరల కాటుకను దిద్దుకుంటుంది. అలా అలంకరించుకుని తన అభిమానులైన యువకుల మధ్య ఉన్నప్పుడు మైమరిచిపోతూ వుంటుంది. 'బాల్' డాన్స్‌లో చాలా ప్రావీణ్యత వుండటం వల్ల యువకులు ఆమెతో కల్సి డాన్స్ చేయటానికి ఇష్టపడుతుంటారు. ఈమెను చూసి మిగతా యువతులు ఈర్ష్య పడుతుంటారు.

ఈ మధ్య మధుపురికి గాంధీగారి గాలి సోకినట్లుంది. మధుపురిని 'సుఖా క్షేత్ర' (శుష్కభూమి)గా ప్రకటించింది ప్రభుత్వం. అంటే మద్యపాన నిషేధాన్ని అమలు పరిచింది. మధుపురిలాంటి నగరంలో మద్యపానమే లేకపోతే విలాస ప్రియులకు ఆనందం ఎక్కడిది? ఐతే ప్రజల ఇక్కట్లను ప్రభుత్వం గమనించిందో? ఏమో? నిషేధాన్ని కొంత సడలించింది. దుకాణం నుండి ఎంత మందయినా కొనుక్కోవచ్చు కానీ వాళ్ళు వాళ్ళ బంగళాలలో మాత్రమే తాగాలి. విలాస ప్రియులైన మధుపురి పర్యాటకులకు ప్రభుత్వం చూపిన ఈ

'దయ' తృప్తిని ఎక్కడ ఇస్తుంది? బంగళాలలో కూర్చొని మద్యాన్ని సేవించి హోటల్‌కెళ్లి డాన్సు చేస్తే మజా ఏముంటుంది? ప్రమోదబాలకు ప్రభుత్వం మద్యాన్ని నిషేధించడం ఆలోచన లేకుండా చేసిన ఒక అసభ్యశాసనం లాగా అనిపించింది. ఐతే, సంవత్సరం క్రితం ప్రభుత్వం మధుపురిలో మద్య నిషేదాన్ని తొలగించింది. ప్రమోదబాల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఇప్పుడిక బంగళాలోనే తాగి హోటలుకు వెళ్ళవలసిన అవసరంలేదు. హోటల్ హాల్లోనే మద్యం సేవిస్తూ, బ్రిజ్ ఆట ఆడుతూ, యువకులైన మిత్రులతో నవ్వుతూ, తుళ్ళుతూ కాలం గడపవచ్చు. ఈ వర్షాకాలం నాలుగు నెలలూ ఆమె దినచర్య హోటల్లో తాగడం, బ్రిజ్ ఆట ఆడటం, బాల్ డాన్సులు చేయటం. ఆమె కొడుకుల్ని మధుపురిలోని యూరోపియన్ స్కూల్లో చేర్పించింది. కనుక వాళ్ళు సెలవ రోజుల్లో మాత్రమే తల్లి దగ్గర వుంటారు. ఐతే, ప్రమోదబాల బంగళాలో ఒంటరిగా వుంటోంది అని అనుకోటానికి లేదు. అప్పుడప్పుడు ఆమె దగ్గరకు యువకులైన అతిథులు వస్తుంటారు. వాళ్ళు వారం, పదిరోజులు పాటు బంగళాలోనే వుంటారు. ఆ వారం, పదిరోజులూ బంగళా అంతా సందడిగా వుంటుంది.

ఇతర ధనిక వర్గ మహిళల లాగానే ప్రమోదబాలకు బాగా ఖర్చుపెడుతూ, విలాసంగా జీవించడం ఇష్టం! ఐతే అలా జీవించటానికి భర్త పంపే డబ్బు చాలదు. అప్పుడిక అప్పు చేయక తప్పదు. చేసిన అప్పుల్ని తీరుస్తూనే వుంటుంది కానీ తీర్చకుండా వుండటానికి ఏ మాత్రం ఆస్కారం వున్నా ఎంతో సంతోషపడుతుంది. ఆమె దగ్గర నౌకర్లు ఎక్కువ రోజులు పనిచేయరు. ప్రతినెలా నౌకర్లతో గొడవ పడుతూనే వుంటుంది జీతం దగ్గర. ఆమె జీతం సరిగా ఇవ్వదని నౌకర్లకు తెలిసిపోయింది. అందుకని ఏ నెల జీతం ఆ నెల పూర్తిగా  తీసుకోవాలని నౌకర్లు చూస్తుంటారు. ప్రమోదబాల ఎంతో కొంత చేతిలో పెట్టి మిగిలిన జీతాన్ని తన దగ్గరే వుంచుకుంటుంది. భోజనం లేకుండా జీతం మీద పనికి కుదిరినప్పుడు నెలనెలా జీతం చేతికి అందకపోతే పనివాళ్ళు వంట సరుకుల్ని ఎలా కొనుక్కోగలరు? అందుకనే నౌకర్లు పూర్తి జీతం ఇవ్వమంటారు. ఇలాంటప్పుడే ప్రమోదబాల పక్కదారులు వెతుక్కుంటుంది. పనివాళ్ళ మీద ఏదో వొక దొంగతనాన్ని వేసి పక్కనే వున్న పోలీసుస్టేషన్లో రిపోర్టు చేస్తుంది. పనివాళ్ళ జీతం ఎగరగొట్టటానికి ఇదొక వంక అన్న విషయం పోలీసులకు చాలా కాలంగా తెలుసు. పనివాళ్ళను కోప్పడి, ఆమెచేత కొద్దో, గొప్పో డబ్బు నౌకర్లకి ఇప్పిస్తుంటారు. చిన్న, చిన్నబకాయిలను, పనివాళ్ళ జీతాలను ఎగ్గొట్టటం ఆమెకు అతిసాధారణమైన విషయం. ఆమె కట్టూ, బొట్టూ, మాట తీరు, హుందాతనం చూసినవాళ్ళు పనివాళ్ళకు జీతాలు ఎగ్గొడుతుందని ఎలా అనుకుంటారు? చుట్టుపక్కల వాళ్ళకు, పోలీసులకూ, కొన్ని సంవత్సరాలుగా ఆమె తీరు తెల్సు. అలా

చేయడం తప్పని ఆమె ఎదురుగా ఎవరూ అనరు? ఎందుకంటే ఆమె ఆహ్వానాన్ని స్వీకరిస్తూ, టీ పార్టీలకూ, డిన్నర్‌లకూ, డాన్సులకూ హాజరవుతూ ఆమె కృపా పాత్రులయిన పోలీసు అధికారులూ, ఇతర పెద్దలూ, ఆమె ప్రవర్తనను తప్పు పట్టగలరా?

## 4

ఉదయం 9 గంటలకు ప్రమోదబాల నిద్రలేస్తుంది. ఐనా పనివాళ్ళు మాత్రం ఉదయం 6 గం॥ల కల్లా మంచం దగ్గర బెడ్ టీ రెడీగా వుంచాల్సిందే. 9 గంటలవరకూ అలా వుంచిన టీ చల్లారిపోతుంది. చల్లారిపోయిన టీని పారబోయటం జరిగినా పని వాళ్ళు మాత్రం దీన్ని నియమంగా చేయాల్సిందే. 9 గంటలకు నిద్రలేచి అలంకరించుకో వటానికి అద్దం ముందు నుంచుంటుంది. ఉదయం పూటచేసే ఈ అలంకరణ సాధారణమైన అలంకరణ. ఇక ప్రత్యేక అలంకరణ మధ్యాహ్నం టీ తాగాక నాలుగు గంటలకు ఆరంభమవుతుంది. ఆ అలంకరణకు రెండు గంటల టైము పడుతుంది. ఇక రాత్రికి బాల్‌డాన్సు, బ్రిజ్ ఆటకు తయారు కావాలాయె! ఆమె పళ్ళు దానిమ్మ గింజల్లా వుండి తెల్లగా మెరుస్తూ వుంటాయి. అయితే ఆమె ముప్పై రెండు పళ్ళూ పెట్టుడు పళ్ళని ఎవరికీ తెలియదు. ఆమె అసలు పళ్ళు ఎగుడు దిగుడుగా ఎత్తుగా వుండటాన వాటన్నింటినీ పీకించేసి, వాటి స్థానంలో ముత్యాల్లా మెరిసిపోయే అందమైన పెట్టుడు పళ్ళు పెట్టించుకుంది. ఆమె కనుబొమ్మలు నల్లగానే వుండేవి. ఐతే, బొద్దుగా, కురచగా వుండటం వలన కనుబొమ్మలను పూర్తిగా తీసివేసి పెన్సిల్‌తో విల్లు ఆకారంలో కనుబొమ్మల్ని దిద్దుకుంది. ఆమెకు మూతి పైన సన్నని రోమాలువున్నాయి. అవి కనపడకుండా వుండటానికి చాలా శ్రమ పడుతుంది ఆమె. అవును మరి మీసాలున్న యువతిని ఎవరూ ఇష్టపడరు కదా? అన్నిటికంటే కష్టసాధ్యమైన విషయం ముఖం మీద ముడతలు కనపడ కుండా చేసుకోవటం. ముఖం మీద ముడుతలు నిజమైన వయస్సును తెలియపరుస్తాయి. తన మిత్రమండలి ముందు పలుచన పడే అవకాశం వుంది. అందుకే ఎంతో కష్టపడి ముడతల్ని కనపడనీయకుండా చేసుకుంటుంది. గంటల తరబడి అద్దం ముందు కూర్చొని, క్రీము, పౌడరు ముఖానికి రాసుకుంటూ వుంటుంది. మళ్ళీ తుడుచుకుంటూవుంటుంది. అలంకరించుకుంటూ వుంటుంది. అప్పుడిక ముఖం పువ్వులా వికసిస్తుంది. ఎలాగో ముఖం ముడతల్ని కనపడనీయకుండా చేసుకున్నా, గడ్డంకింద చర్మం వదులై వేలాడుతూ వుంటుంది. గొంతు దగ్గర చర్మం ఒడిలిపోయి వుంటుంది. ఇక అద్దం ముందు కూర్చొని ఆమె పడే బాధను చూస్తుంటే అలంకరణ చేసుకుంటున్నదని పించదు. శత్రువుతో పోరాడుతున్నట్టు అనిపిస్తుంది. వెంట్రుకలకు అంత బాధపడవలసిన అవసరం లేదు.

నల్లరంగు వేసుకుని ఒక 5 నిమిషాలు ఆరబెట్టుకుంటే చాలు. వెంట్రుకలు నల్లగా తుమ్మెద రెక్కల్లా తయారవుతాయి. ఉంగరాలు తిరిగిన తలవెంట్రుకలను చూసి మనస్సులోనే అనుకుంటూ వుంటుంది "తల వెంట్రుకలు లాగానే మిగతా అంగాలు కూడా చెప్పినట్లు వింటే ఎంత బాగుండు!" అని.

ముడుతలు కనపడకుండా వుండటానికి ఎంతో ప్రయాస పడినప్పటికీ సంతృప్తిగా వుండేది కాదు ఆమెకు. అటువంటప్పుడు తనకు తెలియకుండానే "అయ్యో! ముసలితనం" అని తనలో తాను అనుకునేది. ఈ విచార శబ్దాన్ని ముసలితనానికి వాడే బదులుగా గడిచి పోయిన దాన్ని స్మరిస్తూ "అయ్యో! యవ్వనమా!" అని అనుకుంటే బాగుంటుందేమో! కానీ అప్రియమైన వాటిని, శత్రువులను స్మరించుకోవటం మానవ సహజం కదా!

"ముసలితనం అనే శత్రువుతో పోరాడటానికి ప్రమోదబాల సాయంత్రం 4 గం॥ల నుండి అద్దం ముందు కూర్చుంటుంది. అపుడు ఆమెకు తన జీవితమంతా గుర్తుకువస్తుంది. ఆమె భర్త ఇంగ్లాండులో చదివాడు. అతను యువకత్వంలో వుండగానే వంశ ఆచారాలనను సరించి గడ్డాలు, మీసాలు పెంచేశాడు. అతను పొట్టిగా, లావుగా వుండేవాడు. ఆమె తండ్రి బారిస్టరు (లాయరు) విదేశాల్లో చదువుకుని వచ్చిన ప్రభుత్వోద్యోగి తనకు అల్లుడు కావటం కంటే కావల్సింది ఏముంది? పేరు ప్రతిష్టలు ఆస్తిపాస్తులు కలిగిన బారిష్టరు కూతురు ఆమె. అతనికి మాత్రం ఎందుకు నచ్చదు. పెళ్ళి నాటికి ఆమెకు 18 ఏళ్ళ వయస్సుంటుంది. ఆ వయస్సులో గాడిద పిల్ల కూడా అందంగానే వుంటుంది. ప్రమోద బాలను కురూపి అని కూడా అనలేము. కాకపోతే, కనుబొమ్మలు బాగుండేవి కావు. మూతిమీద నల్లని నూనుగు వెంట్రుకలు కనిపిస్తుండేవి. ముఖము కూడా మొరటుగా వుండేది. ఈ వికారాల్తో పోరాడటానికి ఆమె కత్తి కర్రా చేత పట్టింది. కాబోయే భర్తకు ఎప్పుడు పడితే అప్పుడు కనిపించేది కాదు. అద్దం ముందు కూర్చొని గంటల తరబడి అలంకరించుకున్నాకే  కనిపించేది. ఐనా అతనికి కాబోయే భార్య అసలు రూపాన్ని చూడవలసిన పని లేదు. ఎందుకంటే అతనేం బాగుంటాడని? పైగా, అప్పట్లో అతని ఉద్యోగం పెద్దది కూడా కాదు. సంపాదనా లేదు. యుద్ధానంతరం ప్రభుత్వ ఉద్యోగి అయ్యాక డబ్బు బాగా సంపాయించాడంటే అది వేరే విషయం. పెళ్ళి నాటికి వున్న అందం, ఆదాయమే లెక్కలోకి వస్తాయి. వివాహం అయినాక భార్యా భర్తలు ఇద్దరూ చాలా తృప్తిగా కనిపించేవారు. ఇంగ్లాండులో వుండి వచ్చిన యువకుడు తన భార్యలో ఏమేమి ప్రత్యేకతలు వుండాలని కోరుకుంటాడో అవన్నీ ప్రమోదబాలలో వున్నాయి అప్పట్లో.

కాలం మారుతూ వుంటుంది. తర్వాత అతను తన తెలివి తేటలూ, సమర్థతా, వ్యవహార జ్ఞానం కారణంగా తోటి వాళ్ళందరికంటే ముందుకు వెళ్ళిపోయాడు. గ్రేడు

పెరిగింది. దాంతో పాటు జీతమూ, పై ఆదాయమూ కూడా పెరిగింది. ఈలోపు భార్యకు 8 మంది సంతానం కలిగారు. నలుగురు పోయారు. నలుగురు బతికి వున్నారు. వెంట వెంటనే కాన్పులు అవడం వలన ప్రమోదబాల ఆరోగ్యం దెబ్బతిన్నది. భర్తకు ఆమె పట్ల అసంతృప్తి ఏర్పడసాగింది. భర్త అనాదరణను తిరస్కరించినా, ఆర్థికంగా ఆధారపడి వుండటం వల్ల ఏమీ చేయలేకపోయేది. భర్త డబ్బు సంపాయిస్తున్నాడు. ఆ డబ్బుతో ఆమె అవసరాలు తీరుతున్నాయి. మరి అతనికి తలవంచక పోతే ఎలా? భార్యాభర్తలిద్దరూ విడాకులు తీసుకుంటారని అందరూ అనుకొన్నారు. కానీ వాళ్ళు ఆ స్థితిని దాటారు. పెరిగి పెద్దవుతున్న పిల్లలు. వీళ్ళు విడాకులు తీసుకోవటానికి అభ్యంతరం అయ్యారు. ఈ సమస్యకు నిజానికి భర్తే సరైన మార్గం ఆలోచించాడు. పిల్లల భవిష్యత్తు కోసం కొంత స్వాతంత్ర్యాన్ని చంపుకున్నాడు. ప్రమోదబాల కూడా కొంత వరకూ సరిపెట్టుకోవ డానికి అలవాటుపడ్డది. ఎనిమిది మంది పిల్లల తల్లి ఇప్పుడు భర్తకు విడాకులుఇస్తే - మళ్ళీ పెళ్ళికి గ్యారంటీ ఏంటి? మళ్ళీ పెళ్ళి చేసుకోవటం ఆమెకు ఇష్టం లేదు.

రాత్రిపూట 20ఏళ్ళ దానిలా కనిపించే ప్రమోదబాల పగటిపూట పైసాకు పనికిరాదు. భర్తకు విడాకులు ఇస్తే పిల్లలకు దూరం అయి, ఆయన ఇచ్చే కొద్దిపాటి మనోవృత్తితో జీవితాన్ని గడపవలసి వుంటుంది. అలా కాకుండా కలిసి వున్నట్టుగా ప్రపంచానికి కనపడుతూ, భర్త పంపించే డబ్బుల్తో నాలుగు నెలలూ హాయిగా మధుపురిలో వుండి, జీవిత ఆనందాన్ని అనుభవించవచ్చు. అప్పుడప్పుడు ప్రమోదబాల అయ్యో! ముసలితనం' అని అనుకుంటూనే వుంటుంది. ఐతే, ముసలితనానికి భర్తను ఎప్పుడూ బాధ్యుణ్ణి చేయదు. ఇప్పుడు భార్యాభర్తల జీవితాలు రెండూ ప్రత్యేకమైన మార్గాల్లో స్వతంత్రంగానే పయనిస్తున్నాయి. ఇద్దరూ సర్వ స్వతంత్రులై జీవిత ఆనందాన్ని అనుభవిస్తున్నారు. సమాజం దృష్టిలో వాళ్ళిద్దరూ భార్యాభర్తలే! ప్రమోదబాల స్వతంత్రమైన జీవితాన్ని 12 ఏళ్ళుగా గడుపుతోంది. జీవిత సుఖాలన్నీ అనుభవించింది. ఈ సంవత్సరమే బహుశా నటన ఇంక ఎక్కువ రోజులు సాగదేమోనని అనుకుంది. చాలా జాగ్రత్తగా తన వృద్ధాప్యం తాలూకు చిహ్నాలను కప్పిపుచ్చుకుంటుంది. ఐనా, రాత్రిపూట లైట్ల వెలుగులో యువకుల తీక్షణ దృష్టులు ఆమెలోని వృద్ధాప్య లక్షణాలను పసి కట్టేస్తున్నాయి. వెనుకటిలా యువకులను ఆకర్షించలేకపోతోంది. రాత్రిపూట హోటలుకు వచ్చే ఇతర యువతులు తమ కనుచివర్ల నుండి వ్యంగ్యంగా ఆమె వంక చూస్తున్నారు. ఆ చూపులు ప్రమోద బాలలోని నటనను బట్టబయలు చేస్తున్నాయి.

# దురంజయ కుమార్

ప్రపంచంలోని ఇతర దేశాలలో సామంత యుగపు భూస్వామ్య లక్షణాలు ఏనాడో అంతరించిపోయాయి. కానీ భారతదేశంలో మాత్రం బ్రిటిషు పాలకులు ఆ వ్యవస్థను పెంచి పోషించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక భూస్వామ్య వ్యవస్థ అంతమొందక తప్పింది కాదు! స్వతంత్ర్యం వచ్చిందంటే అర్థం బ్రిటిష్ పాలకుల చేతుల్లో వుండే రాజ్యాధికారం ఈదేశ పెట్టుబడిదారుల చేతుల్లోకి మారిందన్న మాట! భారతదేశంలోని బడా పెట్టుబడిదారులందరూ రాజస్థాన్ నుండి వచ్చిన వారే! వాళ్ళకు తమ మాతృ ప్రాంతమైన రాజస్థాన్‌లో ఎటువంటి రాజకీయాధికారం లేదు. అక్కడి ప్రజలను పరిపాలించటానికి ప్రభుత్వం నిరంకుశులైన స్వదేశీ రాజుల్ని, జమీందార్లనూ నియమించింది. ఈ స్వదేశీ రాజులు సర్వ స్వతంత్రులయి ఆ ప్రాంతాల్ని పరిపాలించుకుంటున్నారు. స్వదేశీ రాజుల నిరంకుశ పాలనలో ఫ్యాక్టరీలు గానీ మరే విధమయినటువంటి నిర్మాణాలనుచేసే అవకాశం ఈ బడా పెట్టుబడిదారులకు దొరకలేదు. కనుక భారతీయ పెట్టుబడిదారుల కళ్ళల్లో స్వదేశీ రాజులు ముల్లులా గుచ్చుకుంటున్నారు. భారతదేశానికి స్వతంత్రం వచ్చిందనుకున్నా కళ్ళల్లో ముల్లులా గుచ్చుకుంటున్న స్వదేశీ రాజుల్ని ఏరిపారేయలేకపోయారు పెట్టుబడిదారులు. ఆ పనిని స్వదేశీ సంస్థానాల ప్రజలు చేయగలిగారు. అక్కడి ప్రజలు నిరంకుశ రాజులకు వ్యతిరేకంగా ఉద్యమాలను నడిపారు. తుపాకీ గుండ్లకు బలి అయ్యారు. ఆ రాజులూ, జమీందార్లూ భారత ప్రభుత్వ పెన్షనర్లుగా మాత్రమే వుండిపోయారు. అయినప్పటికీ పెన్షన్లరూపంలో పేద ప్రజల కష్టార్జితాన్నే తింటున్నారు. వందల సంవత్సరాలుగా ప్రజలను దోచుకుంటున్న జమిందారీ వ్యవస్థకు మృత్యుపీడనను అనుభవించవలసిన అవసరం లేకపోయింది. వాళ్ళ హార్ట్ ఫెయిల్ అయినా అహింసాత్మక దోపిడీ బాగా కొనసాగింది. కొందరు తెలివైన మహారాజులు ముందుగానే బంగారం నగలూ, డబ్బూ లాంటి వాటిని భద్రపరచుకున్నారు. అంతేకాకుండా సంస్థాన ధనాగారాన్ని ఊడ్చిపెట్టేశారు. శిథిలమైన భవనాల్ని వదిలిపెట్టి మిగిలిన నివాసయోగ్యమైన భవనాల

న్నింటినీ తమ వ్యక్తిగత ఆస్తిగా మార్చుకున్నారు. మైనర్లు, అయోగ్యులు, మహారాజులుగా వున్న సంస్థానాలలో వారి సంరక్షకులు (గార్డియన్)గా వున్న వాళ్ళు 'అందినంత దోచుకో' అన్నట్టుగా విచ్చలవిడిగా సంస్థానాన్ని దోచేసుకున్నారు. కొన్నిచోట్ల తమ దోపిడీ గురించి ప్రజలకు తెలియకుండా వుండటానికి చారిత్రకమైన రికార్డులను సైతం తగలబెట్టేశారు. ముఖ్యమైన దస్తావేజులెన్నో అగ్నిపాలయ్యాయి. చరిత్రలో మరుగున పడిపోతున్న మహారాజులు ఎందరో తమ భవిష్యత్తును భద్రపరచుకోవడానికి లక్ష అక్రమాలు చేశారు. పైగా వారందరూ అన్నదాతలూ – మహాప్రభువులూనూ! కొందరు వేల వేల ఎకరాల సుక్షేత్రాలను తమ వ్యక్తిగత ఆస్తులుగా ప్రకటించుకుని ట్రాక్టర్లతో వ్యవసాయం చేయడం మొదలు పెట్టారు. పేద రైతుల హక్కుల్ని కాపాడటానికి భారతప్రభుత్వం ఎన్నడూ నడుం కట్టలేదు! కట్టదు కూడా!

దురంజయ్ కుమార్ పై చెప్పిన లాంటి సంస్థానాన్ని కోల్పోయిన ఒక రాకుమారుడు అతని తండ్రి భగవంతుడు దయ తలవటాన 1947 నాటి తుఫానును చూడటానికి ముందే కన్నుమూశాడు. అతను ఒక నిరంకుశ సంస్థానాధీశుడు. భగవంతుడు ముందే పిలిపించుకున్నాడు కనుక సరిపోయింది. లేకపోతే సంస్థానం ఫెయిల్ అవటంతో పాటు ఆయన హార్ట్ కూడా ఫెయిల్ అయిపోయేది. నిరంకుశ ప్రభువుల కీర్తి అతి నిరంకుశమైనది. ఐనా, ఇంగ్లీషు ప్రభుత్వాలు అతని కీర్తి తాలూకు సుగంధాలను తమ దరి చేరని వ్వలేదు. అతను ఎన్నో హత్యలు చేయించాడు. అతని పాలనలో ప్రజల హాహాకారాలు మిన్నంటాయి. ఐనా బ్రిటిష్ ప్రభువులు పట్టించుకోలేదు. తమను భక్తితో కొలిచే సంస్థానా ధీశులు ఎంత క్రూరులైతే మాత్రమేం? ఇంగ్లీషు ప్రభువులు పట్టించుకోరు? స్నేహ ధర్మమాయె!

సంస్థానం చాలా పెద్దది. ఆదాయము కూడా బాగానే వచ్చేది. ఐనా ఆదాయం సరిపోక ధనికులైన వ్యాపారుల దగ్గర అప్పు తీసుకుంటూ వుండేవాడు దురంజయ్‌కుమార్ తండ్రి. అతడికి అందమైన ఆడపిల్లలను తన మహలులో బందీలుగా వుంచుకోవడం ఒక వ్యసనం. అతని మహలులో సుందరాంగులు చెప్పలేనంత మంది వుండేవారు. ఐనా, ఇంకా ఇంకా తెస్తూనే వుండేవారు. అమాయకులైన కొండజాతి అనాగరిక ప్రజలు రాజు పల్లకీ వస్తోందంటే చాలు భయకంపితులయ్యేవారు. తమ కూతుళ్ళనూ, కోడళ్ళనూ ఇళ్ళల్లో దాచేసేవారు. ఐతే, ఎంతవరకని దాయగలరు? మహారాజు అనుభవజ్ఞులైన అధికారులను అన్నిచోట్లా నియమించే వాడు. వాళ్ళు అందగత్తెలు ఎక్కడెక్కడ వున్నారో? తెలుసుకుని మహారాజుకు చెప్తుండేవారు. శ్రీరామచంద్రుడి తండ్రి దశరథ మహారాజుకు 16వేల మంది రాణులు. ప్రస్తుతం మనం చెప్పుకుంటున్న మహారాజుకు 16వేల మందయితే లేరుగానీ వెయ్యిమందికి పైనే రాణులు వుంటారు! 50 మందికి పైగా కూతుళ్ళు వున్నారు.

ఇక కొడుకులు ఒక పటాలమంత మంది వున్నారు. అందులో మన కథానాయకుడు దురంజయ్‌కుమార్ కూడా ఒకరు.

మహారాజు వివిధ దేశాల రాణులను, వివిధ భాషల రాణులనూ అంతఃపురంలో వుంచేవాడు. ఆ రాణులలో మహారాజుగారికి ప్రీతిపాత్రులయ్యే అదృష్టం చాలా మందికే దక్కింది. ఐతే, పట్టాభిషేకం దగ్గరకు వచ్చేసరికి మాత్రం స్వజాత మహారాణి పెద్ద కొడుక్కే సింహాసనం దక్కింది. దురంజయ్‌కుమార్ పటాలం అంతట్లోకి పెద్దవాడే అయినప్పటికీ సింహాసనాన్ని అధిష్టించలేకపోయాడు. అతడి తమ్ముళ్ళల్లో ఒకరు మహారాజు అయ్యారు. ఐతే, గతించిన మహారాజు దురంజయ్‌కుమార్‌పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాడు. మధుపురిలో రెండూ, మూడు బంగళాలనూ మంచి పంటలు పండే భూమిని ఇచ్చిపోయాడు.

దురంజయ్‌కుమార్ నల్లగా వుండేవాడు. నల్లగా వున్నా కనుముక్కు తీరు బాగుండే వాళ్లుచాలా మందే వుంటారు. కానీ దురంజయ్‌కుమార్ అలాంటి కనుముక్కూ తీరు కల వాళ్ళలోనూ కలవడు. ఆరడుగుల పైగా ఎత్తు. ఎత్తుకు తగ్గ లావు వుంటాడు. ఐతే, ఎత్తుకు లావుకు తగ్గట్టుగా అతని మెదడు లేదు. ఐనా, అతణ్ణి మూర్ఖుడు అని అనటానికి లేదు. దురంజయ్‌కుమార్ యువరాజు కాదు. రాజకుమారుల పటాలంలో ఒకరు కావటాన అతనికి అతని చేతి ఖర్చులకు సరిపడా డబ్బు అందేది కాదు. ఎంత ఆదాయం వచ్చినా అంతఃపురంలోని రాణుల రోజువారీ ఖర్చులకే సరిపోయేదికాదు. ఇంక వీళ్లకు ఎక్కణ్ణుంచి వస్తుంది? తండ్రి ఇవ్వాలనుకున్నా ఇంత మందికి ఎంతని ఇవ్వగలడు? మహారాజు దురంజయ్‌కుమార్ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతుండేవాడు. ఐనా, ఖర్చులకు సరిపోయేవి కావు. ఒకవేళ ఖర్చు తగ్గించుకుందామనుకున్నా, ఎలా వీలు? తమ సంస్థానం పెద్దది. అందులోనూ తను మహారాజుగారిపెద్ద కొడుకాయె! హోదాకు తగ్గట్టు ఖర్చు పెట్టాలి కదా? చిన్నప్పుడు చాలా గారాబంగా పెరిగాడు. పెద్దయ్యాక మహారాజు ఒక జాగీరు ఇచ్చారు. అదీ దురంజయ్‌కుమార్‌కు చాలేది  కాదు. ఎలా చాలుతుంది? ఇతని అంగరక్షకులూ, వంతవార్లూ, ముసాహిబులూ చాలా మందేవున్నారు. అందరి ఖర్చులనూ దురంజయ్‌కుమార్ భరించాల్సిందే! తండ్రి బ్రతికి వున్నంత వరకూ ముఖ్యంగా బ్రిటిష్ వాళ్ళు పరిపాలించినంత వరకూ రాజకుమారుడిగానే చలామణీ అయ్యాడు. ఒకసారి మన కథానాయకుడికి మధుపురిలో బంగళా కొనుక్కుంటే బాగుండునని పించింది. ఇంకేముంది అంగరక్షకులనూ, ముసాహిబుల్నీ వెంట బెట్టుకుని మధుపురి వెళ్ళాడు. కొనబోయే బంగళా యజమానురాలు దూరం నుండే కత్తులూ, కటారాలతో, తుపాకులూ బల్లాలు పుచ్చుకుని వస్తున్న ఈ పటాలాన్ని చూసి హడలిపోయింది. వీళ్ళను చూసి బందిపోటు దొంగలని అనుకోవటానికే వీల్లేదు. ఎందుకంటే అప్పటిదాకా మధుపురిలో

చిన్న దొంగతనం జరిగిన ఆనవాళ్ళే లేదు. ఇంక బందిపోటు దొంగలు ఎక్కడ నుండి వస్తారు? ఐతే, బంగళా కొనటానికి వచ్చారని తెలిశాక ఆ బంగళా యజమాని, ఆమె స్నేహితురాళ్ళు పగలబడి నవ్వుకున్నారుట. ఈ విషయం బ్రిటిషు వాళ్ళు పాలిస్తున్నప్పుడు జరిగింది. అప్పుడు ఇంగ్లీషు వాళ్ళు మధుపురిపై పూర్తి అధికారంలో వున్నారు. అంటే ఇంగ్లీషువాళ్ళు మధుపురిని పరిపాలించటం మాత్రమే కాకుండా దాన్ని ఇంగ్లాండుకు ప్రతిరూపంలా, మరొక చిన్న ఇంగ్లాండులా తయారు చేసుకున్నారు. ఆ రోజుల్లో తెల్లదొరలూ, ఆంగ్లో ఇండియన్లూ స్వదేశీ సంస్థానాధీశుల్ని నీగ్రోల్ని చూసినట్టు చూసేవారు.

## 2

సంస్థాన సింహాసనం మీద దురంజయ్‌కుమార్ తమ్ముడు అధిష్ఠించాడు. ఐతే, త్వరలోనే స్వతంత్రం అనే తుఫానుకు సింహాసనాన్ని వదిలి వేసి పెన్షను మీద ఆధారపడవలసి వచ్చింది అతనికి. అతని చెల్లెళ్ళకూ, తమ్ముళ్ళకూ అందరికీ భారత ప్రభుత్వం పెన్షన్ ఇస్తోంది. దురంజయ్‌కుమార్ వాళ్ళందరికంటే ముందే ప్రపంచంలోకి వచ్చాడు. భారత ప్రభుత్వం ఈ విషయాన్ని గమనించింది. అతనిపట్ల ప్రత్యేక దయను ప్రదర్శించింది. అతని జాగీరును పూర్తిగా తీసేసుకోలేదు. భారత ప్రభుత్వం రైతులను సంతృప్తి పరచటానికి జమీందార్లనూ, జాగీర్దార్లనూ పూర్తిగా రద్దు చేస్తామని ప్రకటించింది. ఒక రకంగా చెప్పాలంటే అయిష్టంగానే, తప్పనిసరై అలా ప్రకటించింది. ఐతే, ఆ ప్రకటనకు తొందరపడి కార్యరూపాన్ని ఇవ్వకుండా మనసా, వాచా, కర్మణా అహింసాత్మకతను పాటించింది. సంవత్సరాల తరబడి జమీందార్లనూ, జాగీరార్దులనూ వారి వారి జాగీర్లను ప్రభుత్వానికి ఒప్పజెప్పమని బతిమిలాడారు. బేరాలాడారు. ధర పెంచమని జమీందార్లూ, జాగీర్దారులూ ప్రభుత్వం మీద అలిగారు. వాళ్ళను బతిమిలాడి ఒప్పించేసరికి తలప్రాణం తోకకు వచ్చింది. బహుశా భారత ప్రభుత్వం ఈ పద్ధతిలోనే సోషలిజాన్ని తెస్తుందేమో?

పై కారణాల వల్ల దురంజయ్ కుమార్ జాగీర్లను కూడా ఇంకా ప్రభుత్వం తీసుకోలేదు. ఈ విషయంలో ప్రభుత్వం ఎంత నిదానంగా వుందో? అంతకు రెట్టింపు ఆతురతగా రైతులు వున్నారు. ఇప్పుడు దురంజయ్‌కుమార్ ఆ జాగీరుపట్ల ఎటువంటి ఆసక్తి కనపరచటం లేదు. పరిస్థితులు ఇంత త్వరగా మారిపోతే ఇంక ఆసక్తి ఏముంటుంది? ఒకప్పుడు సిపాయిలలో కలిసి తాను తుపాకులతో, జాగీరుకు వెళితే రైతులు హడలి పోయేవారు. ఇప్పుడు తను అలా వెళితే రైతులు నవ్వుతున్నారు. తుపాకులూ, తూటాలు కూడా వాళ్ళ నవ్వును ఆపలేకపోతున్నాయి. దురంజయ్‌కుమార్ వివశుడై ఏమీ చేయలేక చూస్తుండిపోతున్నాడు. ఇప్పుడే కనుక తన తండ్రి శ్రీశ్రీశ్రీ.... మహారాజులుగారు వుండి

వుంటే పొగరుబోతులైన ఆ రైతుల్లో ఒకరిద్దరినైనా యమలోకానికి పంపించే వాడు! ఐనా ఈ ప్రభుత్వం ఈషమెత్తయినా చేయగలిగేనా? ఇలాంటి మార్పు వచ్చాక ఇంక రాజ కుమారుడికి జాగీరు మీద మనస్సు విరిగిపోయింది. రాజ్యంలోనూ, జాగీరులోనూ ఇటు వంటి పరిస్థితులనే చూసి ఎక్కువ సమయం మధుపురిలోనే గడపటానికి ఇష్టపడుతుండేవారు.

మధుపురిలోని కొండలు మరీ అడ్డదిడ్డంగా తేలు ఆకారంలో, సాలెపురుగు ఆకారం లోనూ వుంటున్నాయి. దీనివలన వంద గజాల దూరానికైనా కొన్ని మైళ్ళ దూరం వరకూ చుట్టి రావల్సి వచ్చేది. ఇంగ్లీషు వాళ్ళు నూటపాతిక సంవత్సరాల క్రితం మధుపురిని తమ నివాసంగా భావించి నిర్మించుకున్నారు. మధుపురి ప్రాంతం హిమాలయాల నుండి 6, 7 అడుగుల ఎత్తున వుంటుంది. అక్కడి చల్లదనం, దట్టమైన అడవి బ్రిటిష్ వాళ్ళను ఆకర్షించింది. అక్కడి నుండి చూస్తే మంచుతో కప్పబడిన హిమాలయ పర్వతశ్రేణులు మెరుస్తూ కనపడుతుంటాయి. ఇంగ్లీషు వాళ్లు ఆ ప్రదేశాన్ని వశం చేసుకొన్నప్పుడు హిమాలయ పర్వత శ్రేణులు కనపడడమే ముఖ్యంగా భావించారు. ఐతే, మొదటగా బంగళాలను కట్టామన్న వాళ్ళు అన్ని విధాలా అనుకూలంగా వుండేటట్టు నిర్మించుకున్నారు. తర్వాత కట్టుకున్న వాళ్ళకు సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇంగ్లీషు వాళ్ళు దుకాణాలకూ, బజార్లకూ దూరంగా వుండే ప్రదేశాల్నే ఇష్టపడేవారు. ఆ ప్రదేశాలలో వుండటం వలన రద్దీకి దూరంగా వుండడమే కాకుండా అక్కడి ప్రకృతి కూడా చాలా సౌందర్యంగా, రమణీయంగా వుంటుంది. అలాగే అక్కడైతే నల్లవాళ్ళ నీడ కూడా పడకుండా వుంటుంది.

ఇంగ్లీషు వాళ్ళు హిమాలయ శిఖరాలు కనపడే ఏకాంత ప్రదేశాలలో తమ నివాసాల్ని ఏర్పరచుకున్నారు. ఈ నిర్మాణాలు మూడు శ్రేణులుగా వున్నాయి. పై చెప్పిన లాంటివి ప్రథమ శ్రేణికి చెందుతాయి. ఇక ద్వితీయశ్రేణికి చెందిన బంగళాలలో హిమాలయ శ్రేణులు కనపడకపోయినా 20 మైళ్ళ దూరంలో క్రింద వున్న మైదాన ప్రదేశాలు కనిపిస్తాయి. మూడవ శ్రేణికి చెందిన బంగళాలలో ఇటు హిమాలయాలు కనపడవు. అటు మైదాన ప్రాంతాలూ కనపడవు. రెండు కొండల మధ్యన వుంటాయి ఆ బంగళాలు. అలాంటి బంగళానే దురంజయకుమార్‌కు లభించింది. నూటపాతిక సంవత్సరాల క్రితం మధుపురిలో భవన నిర్మాణం ప్రారంభమయితే, 25 సంవత్సరాల పాటు ఆ నిర్మాణం నెమ్మదిగా నడిచింది. సరిగ్గా వంద సంవత్సరాల క్రితం మధుపురి భవన నిర్మాణంలో చారిత్రాత్మకమైన పోటీ ఏర్పడింది. ఒక దాన్ని మించిన బంగళా మరొకటి ఏర్పడింది. ఈ పోటీ 50 సంవత్సరాల పాటు సాగింది. మొదటి ప్రపంచ యుద్ధం మొదలయ్యాక మధుపురిలో భవన నిర్మాణం మందగించింది. యుద్ధానంతరం మధుపురిలో కళ తగ్గినట్ట యింది. ఇంగ్లీషు వారు తమ బంగళాలను అమ్మి వేయటం ప్రారంభించారు. భారతీయులు

ముఖ్యంగా రాజులు, జమీందార్లూ ఆ బంగళాల్ని కొనుక్కున్నారు. అప్పుడే దురంజయ కుమార్ కూడా ఒక బంగళాను తన కోసం ఏర్పరచుకున్నాడు. మరి ఆ బంగళాను తండ్రి కొనిచ్చాడో? తనే స్వయంగా కొనుక్కున్నాడో? తెలియదు. అంతఃపురాల్లో పుట్టిపెరిగిన వాళ్ళకు సాధారణ ప్రజల కంటే బుద్ధి కుశలత తక్కువగానే వుంటుంది. వాళ్ళు ఏ పనులనూ స్వయంగా చేసుకోరు. బేరసారాలన్నీ ముసాహిబ్‌ల ద్వారా జరగవలసిందే.! కనుక ఏదైనా కొనటం, అమ్మటం లాంటి విషయాలలో సాధారణంగా నష్టపోతుంటారు. దురంజయ్ కుమార్ తన బంగళాను మొదట చూచాక చాలా అసంతృప్తిని ప్రకటించాడు. బంగళా రెండు కొండల మధ్య వుంది. అటు హిమాలయ శ్రేణులూ కనపడవు. ఇటు మైదాన ప్రాంతాలూ కనపడవు. చలికాలం ప్రారంభమయ్యాక ఆ బంగళాలో వుండవలసి వస్తే దురంజయకుమార్ చాలా బాధపడేవాడు. పగలు ఎంత మాత్రం సూర్యరశ్మి పడని ఆ భవనంలోని చల్లదనానికీ, విసిగి పోయేవాడు. ఐనా, ఇప్పుడేం చేసేట్టు! డోలు మెడకు కట్టినట్టయింది!

దురంజయ కుమార్ భార్య యువరాణికి తమ బంగళాకు సంబంధించిన చింత అసలు లేనేలేదు. ఆమె ఒక సుప్రసిద్ధ సంస్థానాధీశుని కుమార్తె! దురంజయకుమార్ గురించి గర్వంగా చెప్పుకోవటానికి మాత్రం ఏముంది? పెద్ద పటాలంలో ఒకడు! యువరాణి కాపురానికి వచ్చేటప్పుడు ఆస్తిపాస్తులతో వచ్చింది. ఇప్పటికీ ఆమె పుట్టింటి నుంచే కొద్దో, గొప్పో వస్తూనే వుంటాయి. అటువంటప్పుడు తన భర్త గురించీ, ఇతర విషయాల గురించీ పట్టించుకోవల్సిన అవుసరం ఆమెకేంటి? మరొకవైపు కుమార్ కూడా తన తండ్రి అడుగుజాడల్లో నడవటానికి సిద్ధంగా వున్నాడు. తండ్రిలా తనూ అంతఃపురాన్ని అందగత్తెలతో నింపగలడు. కానీ ఏం చేయగలడు? చేతిలో పైసా లేదు. గురి తప్పనివాడై వుండి కూడా బాణాన్ని వేయలేకపోయాడు. ఇక యువరాణి ప్రపంచాన్ని అంతగా పట్టించుకోదు. పట్టించుకోవల్సిన అవసరమూ ఆమెకు లేదు. ఆమె నిద్రలేచేసరికి టేబుల్ మీద మద్యం సీసా రెడీగా వుంటుంది. పొద్దున నిద్రమొఖాన తాగడం మొదలు పెడితే రాత్రి నిద్రపోయే దాకా అలా మద్యం సేవించాల్సిందే! అహర్నిశలూ నిషాలోనే వుంటూ ఈ ప్రపంచంలోని కష్టసుఖాలను మర్చిపోతుందామె! అలా మద్యాన్ని సేవిస్తూనే ఒకరోజు ఆమె కాలం చేసింది. అప్పటికే సంస్థానం భారతప్రభుత్వంలో కలిసిపోయింది. ఐతే, సంస్థానం భారత ప్రభుత్వంలో కల్సిపోయిందన్న విషయాన్ని ఆమె ఎన్నడూ విశ్వసించలేదు.

దురంజయ్‌కుమార్‌కు భార్య చనిపోయిందన్న దిగులు అసలు లేనేలేదు. ఇతర సంస్థాన్నాల్లాగానే మామగారి సంస్థానానికి కూడా 'హార్ట్‌ఫెయిల్' అయింది. భార్య తరఫునుండి ఆదాయమేమీ అందటం లేదు. తనకొచ్చే ఆదాయం చాలటం లేదు. జీవితం

మూడుమూర్ల దుప్పటి అన్న సామెతగా అయ్యింది. తలకు కప్పుకుంటే కాళ్ళకు చాలదు. కాళ్లకు కప్పుకుంటే తలకు వుండదు. ఆదాయం వచ్చే మార్గాలు తగ్గిపోతున్నాయి అన్న దిగులుపట్టుకుంది  దురంజయ కుమార్‌కు. ఉన్న ఆస్తుల్ని అమ్ముకుంటూపోతే ఎన్నాళ్ళు వస్తాయి? అన్న సమస్యా పట్టుకుంది. బావమరుదులు వస్తే ఇంతకు ముందు ఎంత హుషారుగా వుండేవారు. ఏ చీకూచింతా లేకుండా వుండేవారు. ఇప్పుడు వాళ్ళు గొంతు నీళ్ళలో మునిగిపోయారు. ఆదాయం చాలక స్థిరాస్థులను వాళ్ళూ అమ్ముకుంటు న్నారు. బావగారికంటే ముందు బావమరుదులే మధుపురిలోని తమ బంగళాలను అమ్మకానికి పెట్టేరు. అప్పుడు బంగళాలకు బాగానే ధర పలుకుతోంది! ఐతే రాజులు స్వతంత్రించి అమ్ముకోలేదు! ముసాహిబులను మధ్యవర్తులుగా పెట్టుకున్నారు. అమ్మే వాళ్ళూ, కొనేవాళ్ళూ కూడా ముసాహిబులకు తగినంత ముట్టజెప్పాలి. అప్పుడే బంగళా అమ్ముడు పోయేది! మధుపురిలోని బంగళాలకు ధర పలికినన్నాళ్ళూ ముసాహిబులకు తగినంత ముట్టలేదు. ఆ కారణంచేత బంగళాలకు బేరం కుదరలేదు. చివరకు సరిపడా ముట్టచెప్పినా బంగళాల ధర సగానికి సగం పడిపోయింది.

## 3

దురంజయ కుమార్ తండ్రికి తగిన యోగ్యుడైన కుమారుడు. కాకపోతే చరిత్ర ఎదురు తిరిగింది. ఒకదాన్ని మించి మరొకటిగా వుండే ఖరీదైన కుక్కల్ని వందల సంఖ్యలో పెంచాడు. ఆ తండ్రి కొడుకయిన తను నాలుగయిదు కుక్కల్నయినా పెంచకపోతే ఎలా? దురంజయకుమార్ పెంచే కుక్కల్లో "గ్రేట్‌డేన్" కుక్కల జత ఒకటుంది. 'భోటియా' అనే వేటకుక్కల జత మరొకటి వుంది. 'గ్రేట్‌డేన్' కుక్కలు చాలా పెద్దవిగా, భారీగా వున్నా అవి క్రూరమైనవి కావు. మంచి తెలివితేటలు కలవి. మనుషులు తమకు ఏమీ హానీ చేయరని, తామూ మనుషులకు ఏమీ హాని చేయకూడదనీ వాటికి తెల్సు! కొత్త వాళ్ళు వచ్చినప్పుడు మాత్రం అలవాటు ప్రకారం అరుస్తుంటాయి. "భోటియా' కుక్కలు అలాంటివి కాదు. బొచ్చు ఎక్కువగా వుండటం వలన 'గ్రేట్‌డేన్' కంటే కూడా భారీగా అనిపిస్తాయి. బలంగా కూడా వుంటాయి. 'భోటియా' కుక్కల భయంకరమైన అరుపులకు కొత్తవాళ్ళు భయకంపితులవుతారు. దురంజయకుమార్ బంగళా మనుషుల సంచారానికి దూరంగా ఏకాంత ప్రదేశంలో వుంది. సందు చివర బంగళా వుండటాన ఆ సందులోకి, ఆ బంగళా దగ్గరకు ఇతరులు ఎవరూ రారు. ఒకవేళ ఎవరైనా పనిమీద వచ్చినా 'భోటియా' కుక్కలు కట్టేసి వున్నాయో? లేదో? చూసుకుని మరీ వచ్చేవారు. భీకర రూపంలో వుండే 'భోటియా' కుక్కల్ని దురంయజ కుమార్ ఎప్పుడూ కట్టివేసి వుంచేవాడు.

సంస్థానంలోని ముఖ్య పట్టణంలో జాగీరువున్న గ్రామంలోనూ కుమార్‌కు బంగళా లున్నాయి. సీజన్‌లో మధుపురిలో వుంటూ చలికాలంలో ముఖ్యపట్టణంలో వుండటం అతనికి అలవాటు. మధుపురి బంగళాలో వుంటే ఈ నాలుగు కుక్కలే కాకుండా సంస్థాధీన ముఖ్యపట్టణంలోని బంగళాలోనూ, జాగీరువున్న గ్రామంలో కుక్కలూ, గుర్రాలు, కోళ్ళు, పక్షులూ వున్నాయి. ఈమూడు బంగళాలలోనూ నౌకర్లు వున్నారు. చాలా ఖర్చుతో కూడిన జీవితం. అప్పుడు అతని జీవితం మరీ చాలీచాలని దుప్పటిలా లేదు. విందులకూ, వినోదాలకూ, రాజదర్బారులా మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చు పెట్టేస్తున్న రోజులవి. మధుపురిలో ఎక్కడ ఏ విందు జరిగినా, ఏ వినోదం జరిగినా దురంజయ కుమార్ తప్పకుండా వెళ్లేవాడు. విదేశీ మద్యానికి చాలా ఖర్చు పెట్టేవాడు. హోదాకు తగినట్టుగానే కొడుకుల్ని పెంచుతున్నాడు. భారతదేశాన్ని బ్రిటిష్ వాళ్ళు విడిచి వెళ్ళినా వాళ్ళ ప్రభావం మాత్రం ఈ దేశాన్ని విడిచి పెట్టలేదు. దురంజయకుమార్ తన కొడుకుల్ని ఇంగ్లీషు స్కూల్లో చేర్పించాడు. కూతుళ్ళను ఇంగ్లీషు కాన్వెంటులో చేర్పించాడు. పిల్లల్ని హోదాకు తగినట్టుగా పెంచాల్సిందే! ఖర్చులు తగ్గించుకోవాలనుకుంటున్నాడు. కానీ ఏ ఖర్చునయితే తగ్గించుకోవాలనుకుంటున్నాడో, ఆ ఖర్చే విపరీతంగా పెరిగిపోతోంది. తిండి ఖర్చు గురించి ఇక చెప్పనవసరం లేదు. ఒక పక్క ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. మరొకపక్క వచ్చేపోయే వాళ్ళు ఎక్కువ అయ్యారు. ఇవేకాకుండా తన కొత్త ప్రియురాళ్ళకు బట్టలూ, నగలూ కావాలి గదా? ఆహారపదార్థాలకూ,నగలకూ, బట్టలకూ అప్పుపెట్టవచ్చు. కానీ పిల్లల 'ఫీజు' అప్పు పెట్టటానికి కుదరదు కదా! వడ్డీ వ్యాపారులు అతడు ఇవ్వవలసిన అప్పును తలుచుకుని భయపడుతున్నారు. ఇవ్వలేమని చెప్పే ధైర్యం లేక కానీ లేకపోతే ఏనాడో 'అప్పు ఇవ్వం' అని చెప్పేవారు. ప్రతి సంవత్సరం కొద్దో, గొప్పో బాకీ తీరుస్తూ వుంటాడు. ఒకవేళ ఖాతా ఆపివేస్తే మొత్తం బాకీనే తీర్చకుండా మానేస్తాడేమోనన్న భయం వుండటం వల్ల వడ్డీ వ్యాపారులు బాకీ ఇవ్వం అనటానికి సాహసించలేక పోతున్నారు. దురంజయకుమార్ కొందరికి నోట్లు రాసి ఇచ్చాడు. కొందరికి ఇచ్చిన నోట్లకు 'లిమిటేషన్' కూడా దాటిపోయింది.

లాదూరాం, దురంజయ్ కుమార్‌కు విపరీతమైన ధరలకు వస్తువుల్ని అప్పుకు ఇస్తుంటాడు. అడిగినంత వడ్డీ ఇస్తుంటాడు కాబట్టి లాదూరాం నగదు పెట్టుబడి పెడుతూంటాడు! లాదూరం మధుపురిలోని చిన్న వ్యాపారస్తులలో ఒకడు. అతని మొత్తం పెట్టుబడి పదిహేను, పదహారు వేలకు మించదు. అంటే, అదే యుద్ధకాలానికి ముందయితే నాలుగయిదు వేల రూపాయల పెట్టుబడి అవుతుంది. ఈ కొద్ది పెట్టుబడిలో దురంజయ కుమార్ 5,6 వేల వరకూ బాకీ వున్నాడు. ఒకటి రెండుసార్లు డబ్బు అడిగాడు. దురంజయ

కుమార్ బాకీ తీర్చలేదు. సరికదా పక్కకొట్లో నుండి సరుకులు తెప్పించుకుంటున్నాడు. లాదూరాం నాలుగయిదుసార్లు తన మనుషుల్ని డబ్బుకోసం పంపాడు. లాభం లేకపో యింది. చివరకు తనే బంగళా దగ్గరకు బయల్దేరాడు. వరండాలో 'భోటియా' కుక్కలు వున్నాయో? లేవో? ముందే చూసుకున్నాడు. కుక్కలు లేవు. బంగళా బయటనుండి పరిచయస్థుడైన పనివాణ్ణి సైగ చేసి పిలిచి కనుక్కున్నాడు. అతడు 'భోటియా' కుక్కలు వెనుక వైపు వున్నాయని ధైర్యమిచ్చాడు. లాదూరాంకు ప్రాణం వచ్చినట్టయింది. పెద్ద పెద్ద వాళ్ళకు, ఎక్కువ ధరకు వస్తువుల్ని అమ్మటం తేలికయిన విషయం కాదు. ముందు నౌకర్లను మంచి చేసుకోవాలి!

లాదూరాం చెప్పమంటే ఒక నౌకరు దురంజయకుమార్ దగ్గరకు వెళ్ళి "అయ్యా! తమకోసం ఎవరో వచ్చారు?" అని చెప్పాడు.

"ఎవరతను?బంగళా కొనటానికి ఎవరైనావచ్చారా?"

"కాదు అయ్యా! లాదూరాం వ్యాపారి! డబ్బు కోసం వచ్చాడు."

లాదూరాం పేరు వినేసరికి దురంజయకుమార్ వళ్ళు మండిపోయింది.నౌకర్ని, లాదూరాంకు వినపడేంతగా కేకేశాడు. "భియాలి! భోటియా కుక్కల్ని వదిలిపెట్టు!" అన్నాడు.

భోటియా కుక్కల పేరు వినేసరికి లాదూరాం పైప్రాణాలుపైనే పోయాయి. అతను ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటకు పరుగెత్తాడు. బంగళా కంటికి కనపడనంత దూరం వరకూ అలా పరుగెత్తుతూనే వున్నాడు. ఇంటికి వెళ్ళాక లాయర్‌ను కలిశాడు. దురంజయ కుమార్ రాసిచ్చిన నోటుకు కాలం చెల్లిందని తెల్సింది. లాదూరాంకు 103 డిగ్రీల జ్వరం వచ్చినట్టయింది. దురంజయ కుమార్ ఎవరికీ అప్పు తీర్చడు. భవిష్యత్తులో అతని దగ్గర అప్పు చెయ్యనంటాడు. అప్పు ఇచ్చిన వాళ్ళు కోర్టుకు వెళ్ళే సాహసమూ చేయలేరు. ఒకవేళ చేసినా ప్రయోజనం వుండదు.

## 4

దురయంజయ కుమార్‌కు రానురానూ మధుపురిలో అప్పు ఇచ్చేవాళ్ళే కరువయ్యారు. అతనికి డబ్బు అప్పుకు ఇవ్వడం అంటే డబ్బును మూటకట్టి నీటిలో పారేసినట్టేనని అందరికీ తెలిసిపోయింది. ఇక ఖర్చు తగ్గించుకోవాలన్న ఆలోచనలో పడ్డాడు దురంజయ కుమార్. తన నివాసాన్ని మధుపురి నుండి ఎత్తివేయాలనుకున్నాడు. జాగీరు వున్న గ్రామంలో వుండటం పూర్తిగా మానేశాడు. ఇక సంస్థాన్ ముఖ్య పట్టణంలోకి మారాలి. అక్కడ వేసవికాలంలో ఎండలు చాలా ఎక్కువగా వుంటాయి. చెమట... ఉక్కపోత ఎక్కువగా వుంటుంది. అయినా ఏం చేసేట్టు? మధుపురిలో వుంటే ఖర్చుకు డబ్బేది? మధుపురిలో

వుండకపోయినా ముఖ్యపట్టణంలో వుంటే మాత్రం ఖర్చుకు డబ్బు ఎక్కడనుండి వస్తుంది? రోజువారీ ఖర్చుల కోసం ఎంతో సంపత్తిని అమ్మేశాడు. ఇప్పుడు మధుపురిలోని బంగళాను కూడా బేరంపెట్టాడు. ఐతే, ఆ బంగళా ధర మట్టికంటే హీనంగా దారుణంగా పడిపోయింది. అసలు మధుపురిలో బంగళా కొనడం అంటే మెడకు గుదిబండను తగిలించుకోవడమన్న భావన ఏర్పడిపోయింది. మూడు సంవత్సరాల క్రితం వరకూ బంగళాకు ధర పలుకుతూనే వున్నది. ఐతే, అప్పుడు ముసాహిబుల యుక్తుల వల్ల తను బంగళాను అమ్మలేకపోయాడు. ముసాహిబులు (అనుచరులు) మంచివాళ్ళూ వుంటారు! చెడ్డవాళ్ళూ వుంటారు. తమకు ప్రయోజనం ఎక్కువగా వుండనప్పుడు ముసాహిబులు తప్పకుండా మంచిగా ప్రవర్తిస్తారు. దురంజయ కుమార్ పిసినారిగా మారినపుడు ఇంక ముసాహిబులు ఎలా బతుకుతారు? సంస్థానాలు పూర్తిగా దివాళా తీయడం వలన ముసాంహిబులూ, కొజ్జాలూ, దాసీలను తొలగిస్తున్నారు. చండప్రచండులైన ముసాహిబులు దమ్మిడీకి ముగ్గురు చొప్పున దొరుకు తున్నారు బజార్లలో!

దురంజయకుమార్‌కు డబ్బు దిగులు పట్టుకుంది. ఆస్తినంతటినీ అమ్ముకున్నా జరుగుబాటుకు మార్గం లేదు! అన్న ఆలోచన అతణ్ణి తీవ్రంగా వేధిస్తున్నది. అతడింకా యాభైకైనా చేరుకోలేదు. అనుభవించగల వయస్సులోనే వున్నాడు. పిల్లల విషయం పట్టించుకోకపోయినా, తన ఖర్చుల గురించైనా ఆలోచించాలి కదా!

ఒకనాడు ముసాహిబొకడు ఒక దుర్మార్గమైన సలహానిచ్చాడు దురంజయకుమార్‌కు! బంగళా నిచ్చేసి మాజీ మహారాజు కుమారుడి 'ఫామ్'ని తీసుకుందామని. ఈ సలహా ఇచ్చిన సమయానికి దురంజయకుమార్ పట్నంలోని తన మహలులో వున్నాడు. ముసాహిబ్ చెప్పిన మాజీ మహరాజు కుమారుడు కూడా అప్పుడు అదే పట్నంలో వున్నాడు. మాజీ మహారాజు కుమారుడు తన సంస్థానం భారత ప్రభుత్వంలో కలిసేటప్పుడు సాధ్యమయినంత వరకూ సంస్థాన ప్రజల్ని దోచుకున్నాడు. స్థానిక రైతులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములన్నింటినీ లాక్కొని రెండువేల ఎకరాల 'ఫామ్' నొకదాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. దాదాపుగా అన్ని సంస్థానాలన్నింటిలోనూ ఇదే జరిగింది. ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వం ఉన్నత వర్గాల వారి హోదాని, గౌరవాన్ని కాపాడటంలో గట్టి శ్రద్ధనే ప్రదర్శిం చింది. అప్పట్లో మాజీ మహారాజు కుమారుడి చేతిలో డబ్బు బాగానే వున్నది. రెండు ట్రాక్టర్లు కొన్నాడు. పొలంలోనే వుండటానికి వీలుగా బంగళా నొకదాన్ని కట్టించుకున్నాడు. మొదట్లో కొన్నాళ్ళు ఖాకీ చొక్కా – ప్యాంట్ వేసుకుని హాటు పెట్టుకుని తనే స్వయంగా ట్రాక్టర్ నడిపేవాడు. కారు నడిపేవాడికి ట్రాక్టర్ నడపటం పెద్ద కష్టం కాదు కదా! వ్యవసాయాన్ని గురించి అమెరికాలో, ఇంగ్లాండులో ముద్రించిన పుస్తకాల నెన్నింటినో

తెప్పించుకున్నాడు. మంచి విత్తనాలూ, ఎరువులూ, తెప్పించుకున్నాడు ముసాహిబు ఒకతను సిఫార్సు చేయటం వల్ల అతని బంధువును ఉద్యోగంలో పెట్టుకున్నాడు. రెండు మూడు సంవత్సరాల పాటు వ్యవసాయం బాగా సాగింది. ఆదాయం ఎంత వస్తోంది? ఎంత ఖర్చవుతుంది? అన్న విషయాన్ని గురించి ఆలోచించటం తన హోదాకు తగదనుకున్నాడు. మాజీ మహారాజు కుమారుడు! తర్వాత తర్వాత ట్రాక్టర్‌లోని ఏదో ఒక భాగం రోజూ ఇబ్బంది పెడుతూ వుండేది. ఏదో ఒక భాగం చెడిపోతూ వుండేది. కారు నడపగలడు కనుక ట్రాక్టరు కూడా నడిపేవాడు కానీచెడిపోతే బాగు చేసుకోవటం రాదతనికి. మూడు సంవత్సరాలు గడిచేసరికి వ్యవసాయం మీద అతనికి మొదట ఉన్నంత ఉత్సాహం సన్నగిల్లింది. ఆదాయంకంటే ఖర్చు ఎక్కువ అవుతోంది. అప్పు చేయటమో, ఏదైనా అమ్మటమో చేయవలసి వస్తోంది. రాజకుమారుడికి 'ఫామ్' గుదిబండగా అయింది. దాన్ని వదిలించుకోవాలని చూస్తున్నాడు. సొంత వ్యవసాయం ముఖం మొత్తింది!

సొంత వ్యవసాయం చేసేటప్పుడు రాజకుమారుడు వేసవికాలాన్ని గడపటానికి మధుపురికి వస్తుండేవాడు. అతని వెంట యువరాణీ, మిగతా పరిజనమూ వుండేవారు. రాజకుమారుడికి మధుపురిలో సొంత బంగళా లేదు. అతని తండ్రిగారైన మాజీ మహారాజు గారికి వుండేది. దాన్ని ఆయన అన్నగారు తీసేసుకున్నారు. రాజకుమారుడు తనకొక బంగళా వుంటే బాగుండునను కుంటున్నాడు. దురంజయకుమార్ తన బంగళాను కొన్న ధరకే అమ్ముదామనుకున్నాడు. కానీ, నమ్మకస్తుడైన ఒక ముసాహిబు మరొక రకమైన సలహా ఇచ్చాడు. అమ్మటం కంటే మార్పిడి చేసుకోవటం మంచిదన్నాడు. "రాజకుమారుడి ఫామ్ తీసుకుంటే మేలు జరుగుతుందని చెప్పాడు. 'ఫామ్' డబ్బు సంపాయించి పెడుతుందని ఆశ చూపాడు. ఎటూ బంగళాను డబ్బిచ్చి కొనుక్కునే వాళ్ళు దొరకటం లేదు కాబట్టి 'సరే' నన్నాడు దురంజయకుమార్! పైగా, తను బాగా కారు నడపగలనన్న నమ్మకమూ గర్వమూ వుంది మన కథానాయకుడికి. ముసాహిబ్ చెప్పిన ఈ శుభవార్త వినేసరికి అతనికి ఉత్సాహం రెట్టింపయింది. ఖాకీ డ్రస్సు వేసుకుని అమెరికన్ అయిపోదామనుకున్నాడు. దురంజయ్‌కుమార్ ముసాహిబు రాజకుమారుడితో మాట్లాడాడు. మాజీ మహారాజు కొడుకు "మధుపురిలో బంగళా ఎక్కడుంది? ఎలా వుంటుంది?'అనడిగాడు.

దురంజయ్‌కుమార్ ముసాహిబు వినయంగా "అయ్యా! బంగళా మధుపురిలోని తెల్లదొరలు నివసించే బజార్లో వుంది. బాత్‌రూం వుంది. డ్రాయింగ్‌హాలూ, డైనింగ్ హాలు వున్నాయి. ప్రయివేటు సెక్రటరీగానీ, ఇతర నౌకర్లు గాని వుండటానికి విడిగా ఒక బంగళా వున్నది. చుట్టుపక్కలంతా పచ్చదనం! చాలా అందమైన ప్రదేశం బాబుగారూ!" అన్నాడు.

"మరి అక్కడివరకూ మోటారు కారు వెళ్తుందా?"

"బాబూ, జీపు అయితే బంగళా లోపలకు కూడా వెళ్తుంది. కొంచెం దారి బాగు చేస్తే మోటారు కారు కూడా వెళ్తుంది!"

దురంజయ్‌కుమార్ ముసాహిబు, మహారాజు ముసాహిబు మొదటే మాట్లాడుకున్నారు. ఇందులో తమ తమ వాటాల్ని కూడా నిశ్చయించుకున్నారు. నిజానికి దురంజయ్‌కుమార్ తండ్రి కూడా మహారాజే! కనుక, అతడినీ రాజకుమారుడనే అనవచ్చును. కానీ పాఠకులు తికమకపడకుండా వుండటానికి మన రెండవ కథానాయకుడికి మాత్రమే రాజకుమారుడని వాడటం జరిగింది. రాజకుమారుడి ముసాహిబు మధ్యలో అందుకొని "మహాప్రభూ! మధుపురి వూళ్ళోకి జీవు వెళ్ళటమే గొప్ప విషయం! అక్కడి బంగళాల గురించి తమకు తెలియనిదిఏముంది! అందంగా వుంటాయి. ఏకాంతం, విశ్రాంతి, వాటిని దృష్టిలో పెట్టు కునే అక్కడ బంగళాలు కట్టిస్తుంటారు. బంగళాలోకే జీపువెడితే ఇంకేం కావాలి!" అన్నాడు.

రాజకుమారుడు రెండు రోజులు ఆగి ఆలోచించి చెప్తానన్నాడు. మాట వరసకు అలా అన్నాడే తప్ప ఆలోచించుకోవాల్సింది ఏముంది? తనమెడకు వున్న గుదిబండను తీసి దురంజయ్‌కుమార్ మెడకు తగిలించటమేగా? అసలు ఆ 'ఫామ్'ను ఎంతకయినా అమ్మటానికి సిద్ధంగా వున్నాడు. అలాంటప్పుడు మధుపురిలో వస్తే ఇంకా ఆలోచించటానికి ఏముంటుంది?

వెంటనే రాజకుమారుడు తన ముసాంహిబును బంగళా చూసిరమ్మని మధుపురికి పంపించారు. అతను వెళ్ళి వచ్చి బంగళాను విపరీతంగా పొగుడుతూనే "మోటారు వెళ్ళటానికి ఏమాత్రం వీలులేదని" స్పష్టంగా చెప్పేశాడు. మోటారు వెళ్ళకపోతే పోయే ఇతర సౌకర్యాలు వున్నాయి కదా!" అనుకున్నాడు రాజకుమారుడు. ఇటు దురంజయ్ కుమార్ కూడా వెళ్ళి 'ఫామ్'ను చూసి వచ్చాడు. కేవలం రాజకుమారుడు అనుభవం లేకనే తమకు ఈ బంగారు గనిని' ఇచ్చాడని అనుకున్నాడు.

ఆ చలికాలంలో 'ఫామ్' బంగళానూ మార్చేసుకున్నారు. రాతకోతలు కూడా అయిపోయాయి. ఇప్పుడిక దురంజయ్‌కుమార్ 'ఫామ్'కు యజమాని అయ్యాడు. అతని మోటారుకారు డెభై మైళ్ళ దూరాన గల 'ఫామ్'కు దూసుకుపోతోంది. దురంజయ్ కుమార్ తన ముసాహిబుల్తో కలిసి భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నాడు. అతడు చాలా హుషారుగా, ఆనందంగా వున్నాడు. పురాతనమైన బంగళాకు బదులు 'ఫామ్'ను తీసుకున్నాడు. అన్నిటికంటే ముఖ్యమైన విషయం మధుపురిలో అప్పు తీర్చమని వచ్చే వాళ్ళ పీడ వదిలింది. మొత్తం దురంజయ్‌కుమార్‌కు మధుపురిలో రు. 20,000 దాకా బాకీలున్నాయి. వాటిని ఎగ్గొట్టినట్టే! ఆలోచిస్తే ఆ తుక్కుబంగళాకు బదులు బంగారు గని లాంటి ఫామ్ దొరకటమే కాకుండా రు. 20,000లు బాకీ కూడా మాఫీ అయ్యాయి! ఇంకేం కావాలి!

రాజకుమారుడి మనుషులు వెంటనే మధుపురి వెళ్ళి క్రొత్త బంగళాను శుభ్రం చెయ్యడం మొదలు పెట్టారు. మామూలుగా అయితే నాలుగయిదు వారాల తరువాత రాజకుమారుడు మధుపురికి వెళ్ళేవాడు. ఇప్పుడు బంగళాను చూసుకోవాలన్న ఆదుర్దాతో ముందుగానే మధుపురికి వెళ్ళాడు. ఇంగ్లీషువాళ్ళ సమయంలో మోటారు కార్లన్నీ స్టాండింగ్ దగ్గరే ఆగిపోయేవి. వైస్రాయి, లేదా ఆహోదాకు తగిన వాళ్లు వస్తే వాళ్ళ కార్లను మాత్రమే బంగళాదాకా వెళ్ళనిచ్చేవారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక సౌకర్యం ఏర్పడింది. నాలుగు రూపాయలు ఇచ్చి ఎవరైనా కారును మధుపురికి తీసుకువెళ్లవచ్చు. ఐతే, వెళ్లే మార్గం కారు తీసుకువెళ్ళటానికి అనుకూలంగా వుండాలి. బంగళా వరకూ మోటారుకారు ఎటూ వెళ్ళదని తెలుసుకాబట్టి రాజకుమారుడు జీపు వేసుకుని వెళ్ళాడు. 'పరిమిట్' తీసుకుని తన బంగళావైపుకు బయలుదేరాడు. కాని, బంగళా ఇంకా నాలుగు ఫర్లాంగుల దూరంలోనే వుండనగా జీపు ఆగిపోయింది. ఇంక జీపు వెళ్ళటానికి దారి లేదన్నారు. రాజకుమారుడి కోపం వచ్చింది. ఐతే, దారి బాగు చేసుకుంటే పర్వాలేదు జీపు నడపవచ్చు అన్నారు కొందరు. అతడు శాంతించి జీపుదిగి కాలినడకన బంగళాకు వెళ్ళాడు. బంగళాను పనివాళ్ళు శుభ్రం చేసివుంచారు. ఫర్వాలేదనిపించింది. ఐతే, ఫర్నీచరు చాలినంత లేదు! ఐనా సరిపెట్టుకున్నాడు. తన 'ఫామ్' మాత్రం ఏమంత మంచిది గనుక! అని అనుకున్నాడు. నాలుగు రోజులు గడిచేసరికి రాణీగారికి, వారి పిల్లలకూ 'బోర్' కొట్టింది. చుట్టూ అడవిలాగా వుండి చెట్లూ, చేమలూ, వంటరితనం అనిపించింది వాళ్ళకు. పోనీ బంగళా అయినా కొత్తదా అంటే అదీ పాతదే! జీపు అయినా వెళ్లటానికి లేదు. త్వరలోనే రాజకుమారుడికి కూడా మొహం మొత్తింది. అప్పటివరకూ దురంజయ్‌కుమార్‌ను బుట్టలో వేశాననుకున్నాడు. ఇక ఇప్పుడు తనే బుట్టలో పడిపోయాననుకున్నాడు రాజకుమారుడు!

రాజకుమారుడికి దిగులు పట్టుకుంది. ఆ బంగళాను అమ్మికొంచెం సౌకర్యం గల మరొక బంగళాను కొందామనుకున్నాడు. 20-25 వేలు పెట్టుకుంటే ఇంతకంటే మంచి బంగళా వస్తుందన్నారు కొందరు. తన బంగళాను ఎలాగైనా అమ్మించవలసిందిగా ఏజెంట్లకు చెప్పాడు రాజకుమారుడు. ఏజెంట్లకు మంచి కమిషన్ ఇస్తానని కూడా చెప్పాడు. కానీ ఎవరూ బేరానికి రావడం లేదు. ఆ బంగళాను దానం ఇచ్చినా సరే తీసుకోవటానికి ఎవరూ సిద్ధంగా లేరు. తలుపులూ, కిటికీలు, ఇతర సామానులను కూడా సేకరించి అమ్మితే నాలుగు పైసలు రావచ్చుగాని, అవి ఊడదీయటానికి వచ్చిన కూలీలకు ఆ డబ్బులు చాలతాయో? చాలవో అన్నది సమస్య!

# దొరసాని

**హి**మాలయాల్లోని ఆధునిక విలాస నగరాలు కొంతవరకూ హిందూ తీర్థస్థానాలను పోలి వుంటాయి. తీర్థస్థానాలలో ఎలాగయితే తీర్థపురోహితులు (పండా) వివిధ ప్రాంతాలనుండి వచ్చే గృహస్థులను స్వాగతించటానికి సిద్ధంగా ఉంటారో అలాగే ఈ విలాసనగరంలోని బస్టాండ్‌లలో హోటలు వాళ్ళు ప్రయాణీకుల్ని చుట్టుముట్టి ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. వీళ్ళతో పాటు కూలీల గలభా కూడా మొదలవుతుంది.

గడచిన అర్ధశతాబ్దంలో మన సమాజంలో వచ్చిన వివిధ మార్పులను ఈ విలాసనగరాల్లో చూడవచ్చు. అర్ధశతాబ్దం క్రింద హేటు పెట్టుకునే పురుషుల్ని వాళ్ళు నల్లజాతి వారయినా, తెల్లజాతివారయినా 'దొర' అని పిలుస్తుండేవారు. హేటు పెట్టుకోని మిగతా పెద్ద మనుషులను బాబూజీ (అయ్యగారు) అని పిలుస్తుండేవారు. 'సేర్' అన్న పదం అప్పటికింకా వాడుకలోకి రాలేదు. ఇప్పుడు మీరు మధుపురికి కానీ మిగతా విలాస నగరాల్లోకి కానీ బదరీనాథ్-కేదార్‌నాథ్ లాంటి తీర్థస్థానాలకు కానీ వెళ్ళండి. అక్కడ మిమ్మల్ని 'సేర్' అని పిలుస్తారు! అలా వాళ్ళు పిలిచినందుకు మీరు ఆశ్చర్యపడటమో, విచారపడటమో చేయకూడదు మరి! ఎందుకంటే వెనుకటి రోజుల్లో ఉత్తర భారతదేశంలో 'సేర్' అని పిలవటానికి ఒక ప్రత్యేకమైన తలపాగా అవుసరమయ్యేది. కానీ ఇప్పుడు ఎలాంటి తలపాగా తోటి పనిలేదు. తల మీద హేటు పెట్టుకునే ప్రతి ఒక్కరినీ ఏకంగా 'సేర్' అనే పిలుస్తున్నారు. ఐతే ఇలా 'సేట్' అని అందరినీ పిలుస్తున్నా వాళ్ళు ఏ పండితులో, ఆర్థికవేత్తలో అని మీరు అనుకుంటే పొరబడ్డట్టే! సాధారణ ప్రజలు పెట్టారీ పేరును. బహుశా ఈ విలాసనగరాలకు వచ్చే ప్రయాణీకుల్ని బాబా, పండిట్, సేర్ లాలా, మున్షీ' ఇలా రకరకాల పేర్లను జ్ఞాపకం పెట్టుకుని పిలవటం వాళ్ళకు కష్టమనిపించి ఉండవచ్చు. రెండవది ఒకరి పేరుతో ఇంకొకరిని పిలవటం ఇబ్బంది కరంగానూ ఉంటుంది. 'పండిట్'ను 'లాలా' అని పిలిచినా, 'లాలా'ను 'పండిట్' అని పిలిచినా ఇబ్బందే! అందుకే అందరినీ కలిపి 'సేర్' అన్న పదాన్ని స్థానికులు వాడుకలోకి తెచ్చి వుంటారు. లేదా 'సేర్' అన్న

పదం గౌరవ సూచకంగానూ అనిపించి వుండవచ్చు. కాని రాను రాను 'సేఠ్' అన్నపదం చిల్లర వర్తకం చేసుకునే చిన్నపాటి వ్యాపరస్తులకు మాత్రమే పరిమితమైనది. ఉత్తర భారతంలోని 'సేఠ్' దక్షిణంలో 'శెట్టి', 'శెట్టియార్'గా మారిపోయింది. 20వ శతాబ్ద మధ్యకాలంలో 'సేఠ్'లు పాలకులుగా పరిణితి చెందారు. అయితే ఈ పరిణామం భారతదేశంలో కొంత ఆలస్యంగా జరిగింది. ఇక గౌరవ సూచకంగా పిలవటానికి ఇంతకంటే సరియైన పదము ఏముంటుంది? అయినా ఇప్పుడు రాజులు జమీందార్లు ఎందరున్నారని? సాధారణ ప్రజలలో వాళ్ళ ఉనికే లేదు. కాకపోతే వాళ్ళ వేషధారణలో కొంత ప్రత్యేకత ఉండొచ్చు. అయినప్పకీ వాళ్ళను సేఠ్ అనకూడదని ఏముంది? మధుపురి ప్రజలు వాళ్ళను సేఠ్ అని పిలవటానికి వెనుకాడరు. బండ్లు, ఓడలు ఓడలు బండ్లు అవుతాయన్న సామెత ఊరికే రాలేదు! ఇప్పటికాలంలో రాజుల శాసనాలు సేఠ్ల మీద నడవడం లేదు. ఇందుకు భిన్నంగా సేఠ్ల కృపాపాత్రులు రాజులు అయ్యారు.

కథలోని నాయిక సేఠ్ వర్గానికి చెందింది. ఆమెను సేఠానీ (సేఠ్‌భార్య) అనటం సబబుగా ఉంటుంది. కానీ ఆమె చెవుల్లో 'సేఠానీ' అనే ఈ మూడు పదాలు శూలాల్లాగా గుచ్చుకుంటాయి. అదృష్టవశాత్తూ నేను వాడిన 'సేఠానీ' అన్న ఈ పదాన్ని ఆమె చూడటం జరగదు. సేఠానీ పూర్తిగా దొరసానుల్లాగానే ఉంటుంది. కాకపోతే దొరసానుల్లాగా గౌను వేసుకోకుండా చీర కడుతుంది. ఐతే ఎప్పుడూ ఇంగ్లీషులోనే మాట్లాడుతుంది. ఆమె ఉత్తరంలోని హిందీ ప్రాంతానికి చెందినది అయినప్పటికీ కూడా ఇంగ్లీషు దొరసానుల్లాగా పనివాళ్లతో మాత్రమే హిందీలో మాట్లాడుతుంది. అది కూడా దొరసానులు మాట్లాడినట్లు యాసగా మాట్లాడుతుంది.

అందానికి తెల్లరంగు ప్రామాణికం కాదు. ఒకవేళ తెల్లగా వుండటమే అందం అనుకుంటే యూరప్ ఖండంలోని అన్ని దేశాల స్త్రీలు అందగత్తెలే అయి వుండాలి. కానీ యూరప్ స్త్రీలందరూ అందగత్తెలు కారు. భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో 15 నుండి 30 శాతం దాకా సౌందర్యవతులు కనపడతారు. బహుశా యూరప్‌లోని ఏ దేశంలోనూ 15 శాతం మంది సౌందర్యవతులు కనపడరు. 'సేఠానీ' మంచి శరీర ఛాయ కలది. తెల్లగా వుంటుంది. అందంగానూ వుంటుంది. ముప్పై ఏళ్ళు వచ్చినా ఆమె సౌందర్యం ఏ మాత్రం తగ్గలేదు. ఆమె 20 ఏళ్ళ వయస్సులో అనన్య సౌందర్యంగా భాసించినదనటానికి ఎటువంటి సంశయమూ అవుసరం లేదు. విచారించ దగిన విషయం ఏమిటంటే ఆ రోజుల్లో భారతదేశంలో మధుపురిలో సౌందర్యపోటీల ఆచారం లేదు. ఒకవేళ సౌందర్యపోటీలు ఉండి ఉంటే మాత్రం ఈమె తప్పక 'మిస్ మధుపురి' అయి వుండేది. వాస్తవంగా ఈమె సౌందర్యవతి కావటం వలననే కోటీశ్వరుడైన సేఠ్‌కు కోడలు

కాగలిగింది. లేకపోతే ఆమె తల్లిదండ్రులకు కోటీశ్వరుడిని అల్లుడిగా తెచ్చుకునే స్థితి ఎక్కడిది? రాత్రి పగలూ – కలల్లో సైతం ఇంగ్లీషు మాట్లాడుతూ, ఇంగ్లీషు వాళ్ళను అనుకరిస్తూ వుంటుంది. అలాంటప్పుడు దొరసాని అనటమే ఉచితం. కానీ కులాన్ని, వాళ్ళు చేస్తున్న వృత్తిని గురించి ఆలోచించాలి కదా! అలా ఆలోచించినప్పుడు 'సేతాని – దొరసాని' అనటం సబబుగా అనిపిస్తుంది. అలా పిలవటం వలన మనం ఆమెకు ఎలాంటి అన్యాయమూ చేయడం లేదు.

మనం ఆశ్చర్యపడే మరొక విషయం ఏమిటంటే – మన దేశం నుండి బ్రిటిష్‌వాళ్ళు వెళ్లిపోయినా మధుపురిలాంటి నగరాలలో ఇంగ్లీషు ప్రభావం ఏమాత్రం తగ్గలేదు. బ్రిటిష్ వాళ్ళు పరిపాలన ఉన్నప్పుడు ఎలా అయితే ఇంగ్లీషు మాట్లాడేవారో! అలాగే ఇప్పుడూ మాట్లాడుతున్నారు. తేడా ఒక్కటే స్వాతంత్ర్యానికి ముందు బ్రిటిష్ వాళ్ళు మాత్రమే ఇంగ్లీషు మాట్లాడుతుండే వాళ్ళు. ఇప్పుడు రంగుబేధం లేకుండా అందరూ ఇంగ్లీషు మాట్లాడు తున్నారు. దొరసాని! తన పిల్లలతో షికారుకు బయటకు వెళ్ళినపుడు కేవలం ఇంగ్లీషులోనే మాట్లాడుతుంది. అది కూడా ఆక్స్‌ఫర్డ్ ఉచ్చారణలో మాత్రమే. సేఠ్ ఎన్నడూ ఇంగ్లాండు వెళ్ళలేదు– అలాగని ఇంగ్లీషు స్కూళ్ళల్లో కూడా చదవలేదు. సేఠ్ తండ్రి సనాతనుడు వాళ్ళ కుల ఆచారాల వల్ల సేఠ్‌కు యూరోపియన్ లేదా ఆంగ్లోఇండియన్ స్కూళ్ళల్లో చదివే అవకాశమే దొరకలేదు. ఇంగ్లాండును కూడా తండ్రి చనిపోయిన తర్వాతనే చూశాడు. ఇంగ్లీషు ఉచ్చారణ ఒకే రకంగా కాకుండా భిన్నభిన్నంగా ఉంటుందన్న విషయం సేఠ్‌కు తెలిసింది. ఇంగ్లాండు దాకా ఎందుకు స్వచ్ఛమైన ఇంగ్లీషు ఉచ్చారణ కూడా అనేక రూపాలు ఉన్నాయనీ వాటిని అనుసరించే మనుషులకు విలువ ఉంటుందని, ఆక్స్‌ఫర్డ్ ఉచ్చారణను అన్నిటికంటే శ్రేష్ఠమైన ఉచ్చారణగా భావిస్తారనీ, తెలుసుకున్నాడు సేఠ్. అప్పటినుండి ఆక్స్‌ఫర్డ్ ఉచ్చారణే ప్రయత్నపూర్వకంగా అనుకరించటం మొదలు పెట్టాడు. నిద్రలోనూ ఆక్స్‌ఫర్డ్ ఉచ్చారణలో ఉండే ఇంగ్లీషునే ఉచ్ఛరించడం అలవలరచు కున్నాడు సేఠ్. ఇక పతినే అనుసరించే దొరసాని ఈ విషయంలో పూర్తి పతిభక్తిని ప్రదర్శించింది.

సేఠ్ స్వయంగా ఆక్స్‌ఫర్డ్ పరమభక్తుడు అయినప్పుడు దానికి తగినట్టుగా తన భార్యను మలుచుకోకుండా ఎలా ఉండగలడు? ఐతే పసుపుపచ్చని తలపాగా చుట్టుకునే సేఠ్ తండ్రి బతికి వున్నంతకాలం భార్యను పదహారణాల దొరసానిగా తీర్చిదిద్దటానికి సాహసించలేకపోయాడు. 'ముసలాయన పీడ ఎప్పుడు విరగడవుతుందా?' అని ఇద్దరూ ఎదురు చూస్తుండేవాళ్ళు. చిత్రగుప్తుడు రెండు పెగ్గులు ఎక్కువ పుచ్చుకుని ఆ మత్తులో ఉండటాన ముసలాయన కొరకు కబురు పంపటం లేదేమో! అని అనుకునేవారు. ఒకవేళ ఆ కబురు కూడా దొరసానికి 40 ఏళ్ళు దాటాక వస్తే ప్రయోజనం ఏముంటుంది? అని

ఆలోచించేవారు. మొత్తానికి చిత్రగుప్తుడికి మత్తు వదిలినట్టుంది. ఎట్టాగొటా దూతల్ని పంపాడు. దొరసానికి 25 సంవత్సరాలు వయస్సు దాటక ముందే ముసలి సేఠ్ గతించాడు. ఇక భార్యా భర్తలిద్దరి ఆనందానికి అవధులు లేవు. ప్రాపంచిక సౌఖ్యాల్ని అనుభవించటానికి ఇంకా వాళ్లకు పూర్తి అవకాశమూ, సమయమూ వున్నాయి! తర్వాత సంవత్సరమే సేఠ్, సేఠానీ విదేశాలకు వెళ్ళారు. ప్రపంచ యుద్ధం నడుస్తోంది. అట్లాంటి సమయంలో యూరప్ వెళ్ళటం చాలా ప్రమాదకరం. కానీ యుద్ధం అయ్యేదాకా నిరీక్షించే ఓర్పు, సహనం వాళ్ళకు ఎక్కడ వున్నాయి! దొరసాని అక్కడే తన పొడవాటి అందమైన తుమ్మెద రెక్కల్లాంటి నల్లటి కురులను చిన్నగా కటింగ్ చేయించుకుంది. ఇక అవి నేర్పరులైన యూరప్ మంగలాయన చేతిలో ఒక ప్రత్యేక పద్ధతిలో అలంకరింపబడ్డాయి. ఆ వెంట్రుకలు రింగులు రింగులుగా ఉంటాయి కానీ బయట చూస్తే నిర్లక్ష్యంగా అలంకరించినట్టు అనిపిస్తాయి. లోపల ఒక ప్రత్యేక శ్రద్ధతో అందంగా అలంకరించబడి ఉంటాయి. తల వెంట్రుకలను కత్తిరించుకుని కోడలు యూరప్ నుండి మొదటిసారి వచ్చినపుడు అత్తకు ఏమాత్రం నచ్చ లేదు. ఐనా ఏం చేయగలుగుతుంది? భర్త మరణంతోటే కోడలు మీద అధికారం చెలాయించే రోజులు పోయాయని ఆమెకు తెలుసు. అత్తగారు ఇంకా బతికే ఉంది. ఐనా ఏం ప్రయోజనం? తోటకూరలో నుండి తీసిపారేసిన పురుగులా రోజులు గడుపుకుంటోంది. ఈ అనాచారాల్ని చూసి భరించలేక ఆమె తల బద్దలు కొట్టుకుంది. ఐనా ఎవరు వింటారు? ఈ తరం వాళ్లే ఆమె మాటలు అంగీకరించటానికి తయారు గా లేరు. ఇంక రాబోయే తరం గురించి చెప్పవలసింది లేదు.

ఏ ఫ్యాషన్‌నయినా గుడ్డిగా అనుకరించడం ప్రమాదకరం! యూరప్‌లో ఎప్పటినుంచో ఫ్యాషన్ దుకాణాలు (బ్యూటీ పార్లర్) వెలిశాయి. డాక్టర్లలాగానే అక్కడ ఫ్యాషన్ నిపుణులుంటారు. వ్యక్తి రంగు, రూపు, ఆకారాన్ని అంటే లావుగా వున్నారా, బక్కగా వున్నారా ఇలాంటి వాటిని అనుసరించి మందుచీటి (ప్రిస్కిప్షన్) తయారు చేస్తారు. ఇది చాలా ఖర్చుతో కూడుకున్నది. ఐతే మనదేశంలో సినిమా తారల్ని అనుకరిస్తారు. అవి తమకు నప్పుతాయా? లేదా సరిపోతాయా? లేదా? అనేది గమనించరు.ఇలాంటి గుడ్డి అనుకరణ ఒక్కసారి సౌందర్యాన్ని పెంచటానికి బదులుగా తగ్గించే ప్రమాదం వుంది. కానీ ఫ్యాషన్‌లో మునిగితేలే మహిళలు ఇవేవీ లక్ష్యపెట్టరు. ప్రతి ఒక్క మహిళా తనను తాను సౌందర్య వంతురాలిననే అనుకుంటుంది. అఖరికి నిలువుటద్దంలో తననూ తాను చూసుకుంటూ, అలంకరించుకుంటుంది కదా? మరొకరి సలహా ఆమెకు కావాల్నా? అంటారు మనవాళ్ళు. 'ఆప్ రుచి భోజన్ పర్ రుచి. సింగార్' (భోజనం/మనకు రుచిగా ఉండాలి – అలంకరణ చూసే వారికి ఆకర్షణీయంగా ఉండాలి) ఈ సామెత చెప్పేవాళ్ళ

మొహం మీద కొట్టినట్టు చేశారు మనవాళ్ళు. ఈ రోజుల్లో అయితే భోజనం ఇతరులకు రుచిగా ఉండొచ్చు. అలంకరణ మాత్రం తమకు నచ్చిన విధానం గానే ఉండాలి.

దొరసాని ఫ్యాషన్లలో పూర్తిగా సినిమాతారల్నే అనుకరిస్తుందని చెప్పలేము. కానీ ఆమె మూడుసార్లు పారిస్‌లోని ఫ్యాషన్ స్పెషలిస్టుల సలహాలు తీసుకుంది. వాటిని పాటిస్తుంది. ఫ్యాషన్ ఎప్పటికీ ఒకే రకంగా నడవదు కాబట్టి ఆమెకు ఎప్పటి కప్పుడు సలహాలు మాత్రం సినిమాతారలే ఇవ్వగలుతారు. ఆమె నల్లని కురుల్ని మాత్రం భారతదేశంలోని స్పెషలిస్ట్‌లే అలంకరణ చేస్తున్నారు.

## 2

మధుపురి హిమాలయ పర్వతాల్లోని విలాస నగరాలన్నింటిలోకి రాణి లాంటిది. కనుక అక్కడి ఖర్చులు కూడా మిగతా విలాస నగరాలకంటే సహజంగానే అధికంగా వుంటాయి. మైదాన ప్రాంతాలలో ఉష్ణోగ్రత $110^0$ డిగ్రీలను దాటుతున్నదనగా పర్యాటకులు మధుపురికి చేరుకుంటారు. కానీ దొరసాని మాత్రం $100^0$ డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరుకుంటోందనగానే మధుపురికి చేరుకుంటుంది. అప్పుడప్పుడు మార్చి నెల చివరికే మధుపురికి వెళ్లిపోతుంది. తిరిగి ఉష్ణోగ్రతలు తగ్గి చలికాలం ఆరంభమవుతుందనగా మైదాన ప్రాంతానికి వెళుతూంటుంది. అంటే సంవత్సరంలో 7 నెలలు ఆమెకు మధుపురిలోనే గడిచిపోతుంటాయి. ఆమె ఇద్దరు కూతుళ్ళు, ఒక కొడుకు ఇక్కడే యూరోపియన్ స్కూల్లో చదువుతున్నారు. చిన్నకొడుకుకు 5 సం॥లు ఉంటాయి. మద్రాసీ ఆయా సంరక్షిస్తూంటుంది. ఆయా మద్రాసు ప్రాంతపు మనిషి నల్లగా వుంటుంది. స్వచ్ఛమైన ఇంగ్లీషు మాట్లాడుతుంది. కానీ ఆక్స్‌ఫర్డ్ ఉచ్ఛారణలో కాదు. అందువల్ల 'దొరగారు' 'దొరసాని' కన్న సేఠ్‌కు ఆక్స్‌ఫర్డ్ ఉచ్ఛారణతో కూడిన ఇంగ్లీషును నేర్పుతుంటారు.

ఈ విధంగా దొరగారిని వదిలి సంవత్సరంలో ఎక్కువశాతం ఆయన కుటుంబమంతా మధుపురిలోనే వుంటుంది. ఈ కాలంలో సేఠ్ (దొరగారు) కేవలం రెండు మూడు సార్లు మాత్రమే మధుపురికి వస్తుంటారు. వచ్చినా వారం రోజులకంటే ఎక్కువ రోజులు ఉండరు. ఆయనకు వ్యాపార బాధ్యతలు ఎక్కువగా ఉంటాయి. వెనుకటిలాగా వందకు పదో పరకో లాభాన్ని మాత్రమే ఆశించడం ఇప్పటి వ్యాపార లక్షణం కాదు. ఏ సేఠ్ కూడా తక్కువ లాభాన్ని ఇష్టపడటం లేదు. మరి మన సేఠ్ తండ్రి వెనుకటి పద్ధతులతో పాటు ఆధునిక పద్ధతులని కూడా వ్యాపారం చేస్తూ అప్ టు డేట్‌గా ఉంటారు. ఎప్పటి కప్పుడు మార్కెట్ ధరలను, ప్రభుత్వ దృష్టికోణాన్ని గమనిస్తూ ఉంటాడు. గుమాస్తాలను, మేనేజర్లనూ నమ్మడు. మామూలు వ్యాపారం కంటే దొంగ వ్యాపారంలో లాభాలు ఎక్కువ

కనుక తన మిల్లులో తయారయ్యే సరుకుల్ని సగానికి పైగా బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతాడు. మరలాంటప్పుడు బ్లాక్ మార్కెట్‌లో అమ్మిన సరుకుల తాలూకు జమా ఖర్చులను మామూలుగా వాడే ఖాతా పుస్తకంలో వ్రాసి మెడకు తెచ్చుకుంటాడా? మెడకు తెచ్చుకోవటం అంటే 50, 60 లక్షల లాభంలో నుండి 4, 5 లక్షలను అధికారుల చేయి తడపాల్సిందే! సమర్పించుకోవాల్సిందే! ఐతే, ఆ నాలుగయిదు లక్షలనయినా ఎందుకివ్వాలి వాళ్ళకు. మరి బ్లాకు మార్కెట్‌కు సంబంధించిన దొంగ లెక్కలు వ్రాసేటప్పుడు గుమాస్తాలు, మేనేజర్లూ కొంత కొట్టేస్తే సేఠ్‌కు ఎలా తెలుస్తుంది? కనుక ప్రతి పనీ తన కనుసన్నలలోనే జరగాలనుకుంటాడు సేఠ్. తన సమయాన్నంతటినీ ఇలాంటి బాగోగుల్ని (వ్యాపారాన్ని) చూసుకోవటానికే వాడుకుంటాడు. వయస్సు పైబడుతున్న కొద్దీ సేఠ్‌కు డబ్బు మీద కాంక్ష పెరుగుతున్నది. ఖర్చుకు వెనుకాడుతున్నాడు. ఇది దొరసానికి ఏమాత్రం నచ్చని విషయం.

మధుపురిలోని ధనవంతుల బంగళాలు బజారునుండి రెండు మూడు మైళ్ళ దూరంలో వుండేవి. బ్రిటిష్ వాళ్ళకు బజారుకు దగ్గరగా ఉండటం ఇష్టం ఉండదు. కనుక తమ బంగళాలను కొన్ని మైళ్ళ దూరంలో కట్టుకున్నారు. బ్రిటిష్ వాళ్ళను చూసి రాజులు, మహారాజులు, భూస్వాములు, జమీందార్లు కూడా మధుపురిలో ఉండటానికి ఇష్టపడేవారు. కానీ వాళ్ళకు దొరల బంగళాల పక్కనే తమ బంగళాలు కట్టుకోవటానికి అవకాశం ఎక్కడిది? ఇప్పుడు బ్రిటిష్ వాళ్ళు వెళ్ళిపోయాక రాజులు, మహారాజులూ, జమీందార్లు మధుపురికి రావడం ప్రారంభించారు. వాళ్ళ అందమైన బంగళాలన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి. బంగళాలలోని ఫర్నీచర్ చాలా భాగం దెబ్బతింది. పూలకుండీలు పగిలి పోయాయి. సంవత్సరాల తరబడి మరమ్మత్తు లేకపోవడం వల్ల బంగళాల పై కప్పులు బీటు వారి (దెబ్బతిని) లోపలికి వర్షపునీరు వచ్చి పడుతోంది. సంవత్సర సంవత్సరానికి ఎంతో కొంత శిథిలమవుతూనే ఉన్నాయి. గోడలు బలంగా ఉండటం వలన ఇప్పటి వరకూ పై కప్పు నిలచి వున్నది. కానీ లేకపోతే ఎప్పుడో కూలిపోయి వుండేది. చూసేవాళ్ళకు ఆ బంగళాలు ఇంకా ఎక్కువ కాలం వుండవేమో అని అనిపిస్తుంటాయి.

రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు బ్రిటిష్ వాళ్ళు బంగళాల పక్కన భారతీయ జమీందారు ఒకరికి బంగళా కట్టుకునే అవకాశం దొరికింది. అతడు బ్రిటిష్ వాళ్ళకు ధీటుగా తన బంగళాను కట్టించాడు. ఆ రోజుల్లో అంటే రూపాయికి పదిసేర్ల గోధుమలు దొరికే రోజుల్లో జమీందారు ఆదాయం సంవత్సరానికి 25 వేలు. అవీ అతడికి సరిపోయేవి కాదు. బంగళానయితే కట్టించుకున్నాడు కానీ ఎక్కువ రోజులు మధుపురిలో ఉండలేక పోయాడు. మధుపురికంటే యూరప్‌కు వెళ్ళడం నయమనుకున్నాడు ఆ జమీందారు. యూరప్‌కు వెళ్ళాడు. యూరప్ మహిళను వివాహం చేసుకున్నాడు. ఐతే వాళ్ళిద్దరికీ తరువాత సరిపడలేదు. మహారాజు మంగళా 'స్ప్రింగ్‌ఫీల్డ్' (వసంతక్షేత్రం)లో వుంది.

నిజంగానే ఆ ప్రాంతమంతా వసంతశోభతో విలసిల్లుతూ వుంటుంది. రెండవ ప్రపంచ యుద్ధం ఇంకో సంవత్సరానికి ముగిసిపోతుందనగా దొరసాని ఈ బంగళాను జమీందారు దగ్గర అద్దెకు తీసుకుంది. అప్పటినుండి ప్రతి సంవత్సరం 'దొరసాని' ఆ బంగళానే అద్దెకు తీసుకుంటూ ఉంది. యుద్ధకాలంలో చెల్లించినంత అద్దెనే ఇప్పుడూ చెల్లిస్తోంది.

బంగళా చాలా పెద్దది. 8 గదులు వున్నాయి. డైనింగ్ హాలూ, డ్రాయింగ్ హాలూ వున్నాయి. ఆ జమీందారుకు ఇంత పెద్ద బంగళా సరిపోయేది కాదు. ఎంతో మంది అతిధులు వచ్చి పోతుండేవారు. గదులన్నీ అతిథులతో నిండిపోయి కిటకిటలాడుతూ వుండేవి. ఐతే దొరసానికి అంతమంది అతిథులు ఉండరు. ఒకరిద్దరు అతిథులు మాత్రమే ఎప్పుడూ ఉంటూ ఉంటారు. కానీ అన్ని గదులూ ఆమెకు అవుసరం. ఒకటి, రెండు గదులు మినహా మిగిలినగదులన్నీ ఖాళీగానే వుండేవి. అయినా గదులన్నీ రోజూ శుభ్రం చేయాల్సిందే. ఆయాతో సహా మరో 5గురు నౌకర్లను పెట్టుకుంది దొరసాని. వాళ్ళు రిక్షా లాగడానికి ఇద్దరు నౌకర్లు ఉండేవారు. మోటార్ల టైర్ల సొంత రిక్షా ఒకటుండేది ఆమెకు. మధుపురిలో మహారాజులు – జమీందార్లు ఎక్కువగా ఉండే రోజుల్లో సొంత రిక్షాలకు గిరాకీ ఎక్కువగా ఉండేది. సొంత రిక్షా, ఆ రిక్షా లాగడానికి కూలీవాళ్ళు వుండడం ప్రత్యేకమైన హోదాకు చిహ్నంగా ఉండేది ఆరోజుల్లో – అప్పట్లో రిక్షాలాగే వాళ్ళు చాలామంది మధుపురిలో వుండేవారు. వాళ్ళపని జల్సాగా వుండేది. దొరసాని రిక్షా నౌకర్లకు ప్రత్యేకమైన డ్రెస్ కోడ్ ఉండేది. వాళ్ళకు చేతులకు కట్టుకునే బిళ్ళలు కూడా వుండేవి. రిక్షా వాళ్ల గత వైభవం కాలగర్భంలో కల్సిపోయింది. ఇపుడు మొత్తం మధుపురిలో రెండు, మూడు రిక్షాలకు మించి కనిపించడం లేదు. దొరసానికి రిక్షా వుంది, నౌకర్లు వున్నారు. ఐనా తన హోదాను ప్రదర్శించుకోవటానికి ఇప్పుడు అవకాశం లేకుండా పోయింది.

## 3

గత సంవత్సరం దొరసాని యూరప్ వెళ్ళింది. పారిస్ నుండి ఖరీదైన సెంటు సీసాలను తెచ్చింది. ఈ మధ్య ఆ సెంటు సీసాలు ఖాళీ అవటానికి వచ్చాయి. ఆరోజు ప్యారేలాల్ అండ్ సన్స్ దుకాణానికి వెళ్ళింది. ఆమెకు పారిస్ నుండి తెచ్చుకున్న రెండు సెంట్ సీసాలు ఖాళీ అవటానికి వచ్చాయన్న విషయం గుర్తుకు వచ్చింది. పారిస్‌లో తను తెచ్చుకున్న సెంటు సీసాలాంటివి దొరుకుతాయా? అని అడిగింది దొరసాని.

– "ఈ సెంటు పారిస్‌లోనే దొరుకుతుంది. బ్రిటిష్ వాళ్ళ కాలంలో మేము తెప్పించే వాళ్ళం, కానీ భారత ప్రభుత్వం తెప్పించనీయడం లేదు. పైగా కొనేవాళ్ళు లేరు?" అన్నాడు ప్యారేలాల్.

– అయితే ఈ సెంటు ఇక్కడ దొరకదా? ఈ సెంటు లేకపోతే మాకు నడవదు. ముందే తెలిసివుంటే జాగ్రత్తగా వాడుకునేదాన్ని" అన్నది విచారాన్ని వ్యక్తపరుస్తూ.

– అసలు దొరకదని కాదు. అసలు దొరకని వస్తువంటూ ఏముందో చెప్పండి? కాకపోతే కొంత డబ్బు ఎక్కువ ఖర్చువుతుంది. సమయమూ ఎక్కువ పడుతుంది.

– ఐతే దొరుకుతుందంటారు? సంతోషాన్ని ప్రకటిస్తూ చెవుల మీదకు పడుతున్న తల వెంట్రుకల్ని తన ఎర్రరంగు వేసుకున్న గోళ్ళతో సుతారంగా వెనక్కు నెట్టుతూ అన్నది "అయితే తెప్పించండి. ఖరీదెంతయినా ఫర్వాలేదు. కొంచెం త్వరగా తెప్పించండి!"

ప్యారేలాల్ అండ్ సన్స్ చాలా పురాతనమైన కంపెనీ. అనేక ప్రాంతాల వ్యాపారస్థులతో అతనికి లావాదేవీలున్నాయి. అదేరోజు ముంబాయికి ఫోన్ చేశాడు. గోవానుండి సెంటు తెప్పించుకోవచ్చని తెలిసింది. ఫ్రెంచి వాళ్ళు, పోర్చుగీసు వాళ్ళు ఉన్నన్నాళ్ళు భారత ప్రభుత్వం ఏ విదేశీ వస్తువునూ భారతదేశంలోకి రానీయకుండానిషేధించలేదు. ముంబాయి నుండి మనిషి గోవా వెళ్ళాడు. సెంటుతీసుకుని నేరుగా మధుపురికే వచ్చాడతను. సరిగ్గా వారం తరువాత పారిస్‌లోని ఖరీదైన సెంటు ప్యారేలాల్ అండ్ కంపెనీలో వెలిసింది. దొరసాని రోజూ సెంట్లకోసం ఫోను చేస్తూనే వుండేది. సెంటు సీసాలు వచ్చాయని తెలియగానే ఒక్కక్షణం ఆలస్యం చెయ్యకుండా సొంత రిక్షాలో, క్షణంలో ప్యారేలాల్ అండ్ సన్స్ దుకాణం వద్దకు వచ్చింది దొరసాని. ముసలి ప్యారేలాల్ సెంట్ సీసాలున్న కేసును తెచ్చి ఆమె ముందు పెట్టాడు. సెంటు సీసాలున్న కేసు అందంగా, ఆకర్షణీయంగా వుంది. దొరసాని కేసు తెరిచి చూసింది. అవే సీసాలు అదేసెంటు... ధర అడిగింది. ఒక్కొక్క సీసా ఖరీదు నూటయాభై రూపాయలు అన్నాడు ప్యారేలాల్.

'ఫరవాలేదు' అంటూ సీసాలున్న కేసును రిక్షా వాడి చేతికిచ్చింది.

దొరసాని బంగళాకు తిరిగి వస్తున్నప్పుడు చాలా ఉత్సాహంగా, ఆనందంగా వున్నది. ప్యారిస్ సెంటు ముందు ఇతర దేశాల సెంట్లన్నీ దిగదుడుపే!

ఒక్క సెంటు విషయంలోనే కాదు. ఏ వస్తువుకయినా దొరసాని ఇలాగే ధారాళంగా ఖర్చుపెడుతూ వుంటుంది. ప్యారేలాల్ అండ్ సన్స్ దుకాణం లాంటివి మరో పది పన్నెండు దుకాణాలున్నాయి. మధుపురిలో వారందరికీ 'దొరసాని' లాంటివారే కల్పవృక్షాలు. దొరసాని దుకాణానికి వెళ్ళిందంటే తనకు కావల్సిన వస్తువు అది ఎంత ఖరీదయిన దైనా వెనుకాడదు.

దొరసాని మామగారికి సారా తాగడం అలవాటు. ఐతే ఆయన కొడుకులూ, కోడళ్ళు, మనుమలూ – మనుమరాళ్ళూ తాగడానికి ఒప్పుకునే వారు కాదు. దొరసాని పంజాబులో పుట్టి పెరిగింది. ఆమె పుట్టి పెరిగిన ప్రదేశం చాలా నాగరికమైనది. ఆచార వ్యవహారాల్లో ఇంకా ఎక్కువ. ఆమె ఆహార పానీయాల్లో కూడా ముందు ఉన్నది – మాంసం,

మందు లేకుండా ఆమెకు నిముషం గడువదు. నాగరికత ఆమెను 'సిగరెట్' వైపుకు కూడా లాగింది. '556' మార్కు సిగరెట్ ఆమెకు ప్రీతిపాత్రమైంది. ఎప్పుడైనా దుకాణానికి వెళ్ళినపుడు రెండేసి డజన్ల సిగరెట్ డబ్బాల్ని రిక్షాలో తెచ్చుకుంటుంది. ఆమె వర్గానికి, హోదాకు చెందిన, ఇతర స్త్రీలు కూడా ఆమె దగ్గరకు వస్తుంటారు. వాళ్ళను ఆదరించటానికి సిగరెట్లు, ఫారిన్ డ్రింక్స్ తప్పనిసరి. షేర్, విస్కీ, షంపేన్, షార్ట్యా, పోర్ట్, బ్రాంది లాంటి వాటిని ఆమె చాలా ఇష్టపడేది. కొనేటపుడు ఒక్క బాటిల్ కాకుండా రెండు మూడు కేసుల్ని కొనేది. ప్రతి కేసులోనూ ఒక డజను దాకా బాటిళ్ళు ఉంటాయి. విస్కీ ఆమెకు చాలా ప్రియమైనది. 28 రూపాయలకే దొరుకుతుంది. కానీ ఆమె చాలా ఖరీదైన 56 రూపాయల బాటిల్‌నే కొంటుంది. ఒకటేసారి రెండు కేసులు కొంటుంది. షంపేన్ 35 రూపాయల బాటిల్‌ను ఇష్టపడుతుంది. బ్రాంది 30 రూపాయలది కొంటుంది. షార్ట్యా తాగవలసి వస్తే 36 రూపాయలు ఖరీదు చేసే సీసాను వాడుతుంది. ఇంక సీసా పది పన్నెండు రూపాయల ఖరీదు చేసే షేర్ ఇంకా ఇతర మద్యాలు కేవలం రకం మార్పు కోసమే ఆమె పెట్రీలో ఉంటాయి. ఆమె బంగళాలో మద్యాలు కాలవులు గట్టి ప్రవహిస్తుంటా యనటం అతిశయోక్తి కాదు. కానీ దొరసాని మద్యపానంలోనూ నియమబద్ధంగా వుంటుంది. ఆమె వర్గానికి చెందిన మహిళలు ఉదయం నిద్రలేచింది మొదలు రాత్రిపడుకోబోయే దాకా తాగుతూనే వుంటారు. అర్ధరాత్రి నిద్ర లేచినపుడు మాత్రమే వాళ్ళు మామూలు మనుషులుగా వుంటారు. మిగతా సమయాల్లో వాళ్ళు మద్యం మత్తులో ఒళ్ళు తెలియకుండా వుంటారు. కానీ దొరసాని అలా తాగదు. ప్రత్యేక సందర్భాల్లోనే పగటి సమయాల్లో తీసుకుంటుంది. పాన్ నమలుతూ వుంటుంది. సాధారణంగా పొద్దు గూకిన తరువాతే తాగుతుంది. అతిగా మాట్లాడటం ఆమెకు అలవాటు లేదు. కళ్ళు ఎర్రబడతాయి. రంగువేసుకున్న బుగ్గలు మరికొంచెం ఎరుపెక్కుతాయి. లిప్‌స్టిక్ వేసుకున్న పెదవులు కొంచెంగా కంపిస్తాయి. అంతకు మించి ఆమెలో ఇంకేం మార్పు కనపడదు.

## 4

ఆ రోజు దొరసాని ప్యారేలాల్ అండ్ సన్స్‌కు వెళ్ళింది. ఆమె చిన్న కొడుకు కూడా వెంట వున్నాడు. అతడు మూడు కాళ్ళ సైకిలు మరికొన్ని ఆట వస్తువులను మొత్తం మూడు వందలకు తీసుకున్నాడు. ఆమె ప్రత్యేకం అతని కోసం సైనికులు వేసుకునే 'ఎడ్మిరల్' డ్రస్ తీసుకుంది. ఒకటేసారి వెయ్యి రూపాయల వస్తువులను తీసుకోవడం ఆమెకు అలవాటు. ప్యారేలాల్ ముసలివాడు. అనుభజ్ఞుడు. దొరసాని బాకీ 7వేలను మించుతోంది. పాత బాకీ తీర్చాకే కొత్త బాకీ ఇవ్వాలనుకున్నాడు. నౌకరు సామాన్లను

సర్దుతున్నాడు. ఈలోపు ప్యారేలాల్ మృదువుగా, కానీ దృఢమైన స్వరంతో – అమ్మగారు మీ దగ్గరకు మనిషిని పంపించాను. ఒట్టి చేతుల్తో తిరిగి వచ్చాడు. మీరు డబ్బు సర్దుతామన్నారు కదా?" అని అడిగాడు.

– 'ఓ అయామ్ సారీ....." దొరసాని నాటకంలో పాత్రలా నాటకీయంగా మాట్లాడుతూ గుమ్మం దగ్గరకు నడుస్తూ.... "నేను చెక్‌బుక్ తేవడం మర్చిపోయాను" అన్నది.

దొరసాని తన స్నేహితురాళ్ళ దగ్గర 'ఒక చెక్ బుక్ మర్చిపోయాననే' కాదు అనేక రకాలుగా అబద్ధాలాడటం నేర్చుకుంది. ఆమెను మధుపురిలో "స్ప్రింగ్‌ఫీల్డ్" దొరసాని అని అంటుంటారు. ఆమెకు నగల షాపులు, జనరల్ స్టోర్స్, ఫొటో స్టూడియో – ఇలా అన్నిచోట్ల ఆమెకు ఖాతాలున్నాయి. ప్రతిచోటా ఆమెకు వేలల్లోనే బాకీ వున్నాయి. మధుపురికి రాగానే తలా 500లు, తలా 600లు సర్దుతుంది. ఇక అక్కడ నుండి బాకీ పెట్టడం మొదలుపెడుతుంది. సంవత్సరానికి 10 వేలు ఖాతాలో 5 వేలు మాత్రమే చెల్లిస్తుంది. ఆమెకు అక్కడ 20 వేల దాకా బాకీలున్నాయి. సేఠ్ ఈ మొత్తం బాకీని క్షణాల మీద తీర్చగలడు. అయినా అతడు తీర్చకపోవడం దొరసానిని బాధిస్తూ వుంటుంది. వాళ్ళ కులంలో విడాకులు ఇచ్చుకునే ఆచారం లేదు. పైగా వాళ్ళు చేసుకుంది సివిల్ మ్యారేజ్ కూడా కాదు. ఒక సివిల్ మ్యారేజ్ అయి వుంటే సేఠ్ ఎప్పుడో దొరసానికి విడాకులు ఇచ్చివుండేవాడేమో? ఎవరు చెప్పగలరు? ఐతే సేఠ్‌కు పిల్లల మీద అమితమైన మమకారం. అందుకే దొరసానితో సంబంధాన్ని నిలబెట్టుకున్నాడు. రెండు మూడు సంవత్సరాల నుండీ భార్యా భర్తల సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అప్పుడప్పుడు దొరసాని దీర్ఘంగా నిట్టూరుస్తూ అనుకుంటుంది – వయస్సులో ఉన్నప్పుడు నా వెనకా వెంబడి తిరిగేవాడు– కానీ ... ఇప్పుడో?"

సేఠ్ ఇప్పటికీ మధుపురిలో గడిపే ఏడు నెలలకు గాను ముప్ఫై, నలభై వేలు పంపుతూనే వున్నాడు. ఆ లెక్కన నెలకు నాలుగు వేలు పైగానే పడుతుంది. కనుక తను న్యాయంగానే పంపుతున్నానని అనుకుంటున్నాడు. కానీ దొరసానికి నెలకు నాలుగువేలు ఒక లెక్కా! ఆమె ఖరీదైన జీవితానికి అలవాటు పడ్డది. ఆమె దృష్టిలో డబ్బుకు ఏ మాత్రం విలువ లేదు. వస్తువుల్ని కొనటంలోనూ, అవసరమా? అనవసరమా? అన్న ప్రశ్నే లేదు. విపరీతమైన ఖరీదైన వస్తువుల్ని కొనటమే ఆమె పని. ఆమె పెద్దకొడుకులిద్దరూ స్కూళ్లో చదువుకుంటున్నారు. ఎప్పుడో ఒకసారి కానీ రారు. చిన్న కొడుకు ఒక్కడే ఆమె దగ్గర ఉంటాడు. ఒకసారి కొడుకు కోసం చాక్‌లైట్లు కొనటానికి వెళ్ళింది. ఆరు డజన్ల డబ్బాలను రిక్షాలో వేసుకుంది. అంటే 90 రూపాయల చాక్‌లైట్లు కొన్నది.

"అప్పే వ్యాపారానికి అందం" అని వ్యాపారస్తులు అంటూ వుంటారు. దొరసాని

వాళ్ళ మాటనే చరితార్థం చేస్తున్నది. సేఠ్ కూడా తన వ్యాపారం కోసం లక్షల రూపాయలు బ్యాంక్ నుండి అప్పుతీసుకుంటూ ఉంటాడు. అప్పు ఇస్తూను వుంటాడు! అలాంటప్పుడు దొరసాని మాత్రం తప్పేం చేస్తోంది? ప్యారేలాల్ లాంటి వ్యాపారులూ వినియోగదారుల్ని నిలువునా దోచుకుంటున్నారు. వాళ్ళు అమ్మే ప్రతి వస్తువులోనూ సగానికి సగం లాభం చూసుకుంటున్నారు. ఎందరో కొనుగోలుదారుల్ని నిత్యం వ్యాపారులు మోసం చేస్తున్నారు. వాళ్ళల్లో 'దొరసాని' లాంటి కొనుగోలు దారులున్నందుకు బాధ పడవలసిన పనేముంది?" దొరసాని విషయంలోనూ ప్యారేలాల్ లాంటి వాళ్ళు పూర్తిగా నిరాశ పడవలసిన పని లేదు. ఎందుకంటే సేఠ్ ఇప్పటికీ ఇంకా బాగానే సంపాయిస్తున్నాడు.

ఏది ఏమైనప్పటికీ "దొరసాని' పెట్టిన బాకీ అందదన్న అనుమానం వ్యాపారులకు కలిగింది. కోర్టుకు వెళదామంటే ఒకటి ఇంకా ఖర్చు ఎక్కువ అవుతుంది. రెండవది వాళ్ళు అమ్మిన వస్తువులకు అసలైన ధరలను ప్రకటించటానికి వీల్లేదు. ఈ సందేహాలు వ్యాపారులను పట్టి పీడిస్తున్నాయి.

దొరసాని తాకిడికి కోట్లకు పడగలెత్తిన ప్యారేలాల్ లాంటి వ్యాపారులు మాత్రమే కాదు. సాధారణ వ్యాపారులూ ఎందరో ఉన్నారు. ప్రతి వస్తువుకూ రాతకోతలు రాసుకోలేరు కదా! ప్రపంచం ఎంత మారినా కొన్ని వస్తువులను నమ్మకం మీద అప్పుగా ఇవ్వవలసి వుంటుంది. ఖరీదైన బెనారస్ చీరలంటే దొరసానికి చాలా ఇష్టం. చూడటానికి నాలుగు చీరలు తెప్పించుకుని తర్వాత అవి నాకు చేరలేదు అని అంటే ఆమెను ఏం చేయగలరు? ఏ కోర్టు ఆ చీరల ఖరీదును రాబట్టి వ్యాపారులకు ఇప్పించగలదు? అన్నిటికంటే విచారపడవల్సిన విషయం దొరసాని పేదవాళ్ళ సొమ్ము ఎగ్గొట్టడంలో కూడా ఏ మాత్రం సంశయించదు. ఒకసారి నెత్తిన మూట పెట్టుకుని తిరిగి పుస్తకాలు అమ్ముకునే ఒకతను వచ్చాడు. అతడి దగ్గర వంద రూపాయల పుస్తకాలు తీసుకుని, డబ్బుకు రెండు వారాల తర్వాత రమ్మన్నది. అతడు డబ్బుకు వచ్చేలోపే సీజన్ అయిపోయాక ఆమె వెళ్ళిపోయింది. అతను కమిషన్ మీద షాపుల్లో పుస్తకాలు తెచ్చుకుని తిరిగి అమ్ముకుంటాడు. వచ్చేసంవత్సరం కూడా షాపుల నుండి పుస్తకాలు తీసుకోవాలనుకుంటే ఈ సంవత్సరం తీసుకున్న పుస్తకాల డబ్బుల్ని షాపులకు కట్టేయాలి. అలా కడితేనే మళ్లీ పుస్తకాలు ఇచ్చేది! దొరసాని మధుపురి నుండి వెళ్ళిపోయేటప్పుడు పెద్ద పెద్ద వ్యాపారస్థులకే కాకుండా కూరలవాడికి, రొట్టెల వాడికి, పాలుపోసే వాడికి, చాకలికి ఇలా పొట్టకూటిని వెతుక్కునే వాళ్ళ దగ్గర కూడా తీసుకున్న బాకీలు తీర్చకుండానే వెళ్ళిపోయింది. వీళ్ళందరూ వచ్చే సంవత్సరం కోసం ఎదురు చూడవల్సిందే.

# మహాప్రభూ

**బం**గళా గేటు తెరుస్తూ "రారా రమేష్! ఏమిటి నువ్వీ మధ్య కంట్లో నలుసయి పోయావు" అన్నాడు శర్మ.

హిమాలయాలలోని మధుపురిలాంటి విలాసనగరాలు సమతల ప్రదేశంలో వుండవు – శ్యాంశర్మ వుండే బంగళా మాల్ రోడ్డుకు దూరంగా బాగా ఎగుడు దిగుడు ప్రదేశంలో వుంటుంది. రమేష్ వర్మ ఎగువ నుంచీ వస్తున్నాడు. అతని ముఖంలో సంతోషం కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది. రోజూకంటే హుషారుగా అనిపిస్తున్నాడు. మధుపురిలోని యువతీ యువకులకు విలాసానికి కొదవే లేదు. రమేష్ వర్మ ఇంత ఆనందంగా వున్నాడంటే ఆ మధ్య పరిచయమైన సుందరికి ఈ రోజు అతను అత్యంత కృపాపాత్రుడయ్యాడేమో?

రమేష్ వర్మ వరండాలోకి వెళ్ళాడు. అక్కడున్న ఒక కుర్చీలో వర్మను కూచోమని, తనూ కుర్చీలో కూర్చున్నాడు శ్యామశర్మ. బద్ధకంగా, చిటికెలు వేస్తూ, ఆవలిస్తూ "ఇవ్వాళ ఏమిటి చాలా సంతోషంగా వున్నావు?" అని అడిగాడు.

"అవును. ఇవ్వాళ చాలా సంతోషంగా వున్నాను."

"నీ ప్రియురాలు లీల – కృపాకటాక్ష పాత్రుడివైనావా?ఏంటి?"

రమేష్ వర్మ ముఖంలో కొంచెం మార్పు కనిపించింది. అప్పుడు లీల ప్రస్తావన తేవడం అతనికి అంత ఇష్టంగా లేదు. వర్మ అప్పుడే ఆధ్యాత్మిక ఆనందాన్ని పొంది వచ్చాడు. అలా ఆధ్యాత్మిక భావ విహ్వలుడై వచ్చిన అతనికి కాలేజీ రోజుల నాటి ప్రియురాలిని ప్రస్తావన తీసుకువచ్చి మాట్లాడటం బాధాకరంగా అనిపించింది. అతడు కొంచెం గంభీరంగా – "లేదు. నువ్వు పొరబడుతున్నావు. లీల నాకానాడు కళ్యాణీ జలపాతం దగ్గర మామూలుగా పరిచయం అయింది. అందులో ప్రత్యేకత ఏమీ లేదు" అని అన్నాడు.

"అవును. ఆనాడు నాకూ ఆశ్చర్యమే వేసింది. నీ మనస్తత్వం నాకు తెల్సుగా? ఆధ్యాత్మిక చింతనలో మునిగి తేలుతుండే నువ్వు ప్రేమ పాశాల్లో ఎలా బంధింపబడ్డావా

అని అనుకున్నాను. గతించిన యవ్వనం తిరిగి రాదని తెల్సి కూడా, నువ్వు మళ్ళీ లీల ప్రేమలో పడిపోయావనుకున్నాను!".

"ఈ మాటలన్నీ వదిలెయ్ శర్మ! నేను సంవత్సరాల తరబడి ఏ దివ్య ఆనందాన్ని పొందాలని తపిస్తున్నానో – ఆ బ్రహ్మానందాన్ని ఇవ్వాళ పొందగలిగాను!"

"అవును. శర్మా! నువ్వు ఎం.ఎ. సంస్కృతం చదివావు. మన శాస్త్రాలన్నింటినీ అధ్యయనం చేశావు. ఐనా నీలో ఆధ్యాత్మిక ఆనందం పట్ల వుండవలసిన శ్రద్ధ లేదు. ఎందుకనా?" అని నేను ఆశ్చర్యపడుతూ వుంటాను.

"నేను సంస్కృతంలో ఎం.ఎ. చదివిన మాట నిజమే. వేదాంతాన్నీ, యోగాన్నీ ప్రత్యేకమైన విషయాలుగా కూడా తీసుకున్నాను. సంస్కృతం చదివినంత మాత్రాన ఏమవుతుంది?"

"ఏమో అవుతుందని కాదు. నేను రాజనీతిని, అర్థశాస్త్రాన్నీ తీసుకున్నాను. వాటికోసం తలబద్దలు కొట్టుకున్నాను. కానీ సంస్కృతమైనా చదవలేకపోయానని ఇప్పుడు పశ్చాత్తాపడుతున్నాను."

"ఇందులో పశ్చాత్తాప పడవలసినది ఏముంది? పోనీ, ఇప్పటి నుండే చదువు! మానవుడు జీవితమంతా విద్యార్థిగా వుండవచ్చు. మనం సెలవలు అయిపోయే దాకా ఇంకా రెండు నెలలపాటు మధుపురిలోనే వుంటాం గదా? నేను రోజూ సంస్కృతం నేర్పిస్తాను. నేర్చుకో!"

"సంస్కృతం చదవకుంటే పని జరగదనిపిస్తోంది. ఎందుకంటే యోగాభ్యాసానికి సంబంధించినవి, వేదాంత గ్రంథాలు అన్నీ సంస్కృతంలోనే వున్నాయి."

"యోగాభ్యాసాన్నీ, వేదాంతాన్నీ తెల్సుకోవటానికి సంస్కృతంతో పనిలేదు కదా? కబీరుదాసు ఏ సంస్కృతాన్ని చదివాడు? మనభక్త కవుల్లో చాలా మందికి సంస్కృతం తెలియదు".

"స్వామి రామతీర్థ, గ్రంథాల్నీ, వివేకానందుని గ్రంథాలన్నీ చదివాననుకో! వేదాంతాన్ని గురించీ, యోగాభ్యాసాన్ని గురించే ఇంగ్లీషులో ఏమన్నా పుస్తకాలు దొరికితే బాగుండు!"

"వేదాంతానికీ, యోగాభ్యాసానికీ సంబంధించిన గ్రంథాలన్నీ ఇంగ్లీషులో దొరుకుతాయి. కొన్ని హిందీలోనూ దొరుకుతాయి. ఐతే, నువ్వు తెల్సుకోవల్సిన విషయం ఏమిటంటే స్వామి రామతీర్థ కూడా ఇలాగే మూలంలో వేదాంత గ్రంథాల్ని చదవాలన్న ఉద్దేశంతో సంస్కృతం చదవటం ప్రారంభించాడు. నిండు యవ్వనంలో అతను సన్యసించటానికి కారణం ఈ సంస్కృత – వేదాంత గ్రంథ పఠనాలే! దేవుడు మేలు చేస్తే, నువ్వు స్వామి రామతీర్థంలా సన్యసించావనుకో! నిజంగా నువ్వు సంస్కృతం చదవాలనుకుంటే,

చెప్పటానికి నేను సిద్ధం! ఇంకోచోట సంవత్సరం చదివే చదువును మూణ్ణెల్లల్లో నేను నేర్పలేకపోతే, నా పేరు మార్చుకో! నీకెందుకు నువ్వు ప్రారంభించు! యూనివర్శిటీ తెరిచాక, అలహాబాద్ వెళ్ళాక రోజూ ఒక గంట సంస్కృతానికి కేటాయించు! చాలు తిరిగి చూసేసరికి సంస్కృతం వచ్చేస్తుంది! అడగటం మర్చిపోయాను. నువ్వు ఇవాళ బ్రహ్మానందంలో లీనం కావటానికి కారణం ఏంటో?"

"నాకు సద్గురువు లభించాడు!"

శ్యామశర్మ రమేష్ వర్మ ముఖంలోకి సూటిగా చూశాడు"కంగ్రాచ్యులేషన్స్! కాదు గానీ, నిన్ను చూస్తుంటే సన్యాసంలో పడిపోతావేమోనని భయంగా వుంది. ఒకవేళ నువ్విలా పడిపోయినా ఆశ్చర్యపడవలసిన పనిలేదు. పూర్వకాలంలో ముముక్షువులు సప్తనగరాలన్నీ గాలించేవారు సద్గురువుల కోసం! మరి మధుపురి హిమాలయాల్లోనే వుంది. ఇక్కడ నీకు సద్గురువు దొరకటం సహజమే! ఎందుకంటే ఇప్పుడు ఆ సప్తనగరాలు తమ ప్రభావాన్ని కోల్పోయాయి. మధురా, ఉజ్జయినీ లాంటి నగరాలకు ముముక్షువులెవరూ ఇప్పుడు వెళ్ళటం లేదు! ప్రస్తుతం మధురా, ఉజ్జయినీ లాంటి నగరాల్లో అలాంటి మహాత్ములు లేరు కానీ ప్రసిద్ధులైన పండాలు వున్నారు. నీకో విషయం చెప్పనా? అలాంటి మహాత్ముల కంటే పండాలే వెయ్యిరెట్లు నయం!" అని అన్నాడు.

"నిన్ను చూస్తే నాకు ఇందుకే ఆశ్చర్యమేస్తుంది శర్మా! నువ్వు మన ధర్మశాస్త్రాలన్నింటినీ చదివావు. అయినా వాటి గొప్పతనాన్ని ఒప్పుకోవు కదా?"

"వర్మా! నీకు మరొకవిషయం చెప్పనా?మా వంశం, దాదాపుగా డెబ్బై తరాల నుండీ కొన్ని కుటుంబాల వారికి గురువుగా వుంటుంది. ఇప్పటికీ మా కుటుంబానికి శిష్యులు చాలా మందే వున్నారు. వాళ్ళల్లో  గొప్ప పదవుల్లో వున్నవాళ్ళు ఉన్నారు. వాళ్ళు నేనెంత వ్యతిరేకించినా వినకుండా నా పాదాలకు ప్రణామం చేయటానికి సిద్ధపడతారు. సరే, మన సంభాషణ వేరే విషయాల మీదకు పోయేటట్టు వుందిగానీ, నీకు లభించిన ఆ సద్గురువు ఎవరో చెప్పు. వింటాను. నేను ఇందాక చెప్పాను. ఇంతకు ముందు మండిపోయే ఎండాకాలంలో తమ వాగ్ధాటితో శాంతపరచటానికి మహాత్ములు సప్తనగరాలకు వెళు తుండేవారని! కానీ ఇప్పుడు మహాత్ములు వేసవిలో వడగాల్పుల నుండి తమను కాపాడు కోవటానికి హిమాలయాల్లోని ఈ మధుపురి వస్తున్నారు. యోగం-భోగం ఈ రెండూ పరస్పర వైరుధ్యం కలవి కావు. ఒకవేళ వైరుధ్యం వున్నా తప్పులేదు. వైరుధ్యం వున్నప్పుడే సమాగమం సాధ్యమవుతుంది. సరే, నీకు లభించిన సద్గురువు పేరేమిటో చెప్పు!"

"నీకు ఇలాంటి మహాత్ములతో సంబంధాలు లేవు కదా? నేను ఒకవేళ నీకు పేరు చెప్పినా నీకెలా తెలుస్తుంది? చెప్తే, ఎగతాళి చేస్తుంటావు!"

"కానీ రమేష్, నాకు ఇలాంటి విషయాలలో శ్రద్ధ లేని మాట నిజమే! ఐనా, ఇతరుల శ్రద్ధాసక్తుల్ని అవహేళన చేయను. మరొక విషయం ఏమిటంటే నాకు ఎంతశ్రద్ధ లేక పోయినా ప్రతి విషయాన్ని తెలుసుకోవాలన్న జిజ్ఞాస నాకు వుంది. ఈ రోజుల్లో మధుపురిలో పెదాలకు లిప్‌స్టిక్ పూసి, ముఖానికి పౌడరు కొట్టీ, కళ్ళకు కాటుక పూసుకు తిరిగే సుందరీమణులు, సుందరీమణుల్లా కనపడాలని ప్రయత్నం చేసే ఆ సుందరీమణులూ వేల సంఖ్యలో వున్నారు! ఇలాంటి ఈ రసిక ప్రదేశంలో కాషాయాంబరాలు ధరించిన సద్గురువులూ అధికసంఖ్యలోనే తిరుగుతూవుంటారు.! ఐతే, కాషాయాంబరం ధరించిన ప్రతి సద్గురువునూ నీవు స్వీకరించవని నాకు తెల్సు! ఇంతకూ నువ్వు 1008వ జగద్గురువుకి కృపా పాత్రుడివి కాలేదు కదా?"

"లేదు. మతాన్ని వ్యాపారంగా చేసేవాళ్ళంటే నాకు ఒళ్ళు మంట" (ద్వేషం)

"ఐతే మంచిదే! మరి ఇంక ఎవరి శిష్యరికం లభించింది నీకు."

"నువ్వు 'మహాప్రభు!' పేరు వినే వుంటావనుకుంటున్నాను."

"ఓహోఁ.... 'మహాప్రభువు' పేరు వినకేం? విన్నాను. అలాంటి మహాత్ముడి కృపా దృష్టి నీమీద పడ్డదంటే నువ్వు అదృష్టవంతుడివి! రమేష్ అసలు భగవంతుడి అవతారాలను పదికో పన్నెండుకో పరిమితం చేయటం పొరపాటే! భగవంతుడికి అవతారాలను ఇలా పరిమితం చేసిన వాళ్ళు స్వార్థపరులు! హిందూ ధర్మ గ్రంథాల్లో భగవద్గీత ప్రామాణికమైనది. ఆ గ్రంథానికి మించిన గ్రంథం మరొకటి లేదు. భగవద్గీతలో కృష్ణభగవానుడు అనేక చోట్ల ఏమని చెప్పాడో? తెలుసా. వైభవ సంపన్న తేజస్సుగల వ్యక్తులు ఎవరైతే వున్నారో, వాళ్ళందరూ తన అవతారాలేనని చెప్పాడు. పైగా అవుసరం పడ్డప్పుడల్లా తను మరలా, మరలా అవతారాల్ని ఎత్తుతుంటానని చెప్పాడు. కనుక భగవంతుడి అవతారాల్ని పది వరకే పరిమితం చేయటం మహా అపరాధం!ఈ మహాప్రభువు నిజంగా మహాప్రభువే! ఇతడు భగవంతుని అవతారం అనటంలో ఏ మాత్రం సందేహం లేదు!"

శ్యామశర్మ పై మాటల్ని ఎంత గంభీరంగా చెప్పాడంటే, రమేష్‌వర్మ అతని గంభీరాన్ని నిజమేననుకున్నాడు. సంతోషంతో "ఐతే, మహాప్రభువుగారి ఆధ్యాత్మిక శక్తిని నువ్వు ఒప్పుకుంటావా?" అని అడిగాడు.

"నేను ఆధ్యాత్మిక విషయాల పట్ల శ్రద్ధను కనపరచని మాట నిజమే! కానీ నాకు అసలు శ్రద్ధ లేదని అనుకోకు. యవ్వనంలో వున్నాం. తిని తిరగవలసిన సమయం మన శాస్త్రాలు కూడా వృద్ధాప్యంలో యోగసాధన చెయ్యమన్నాయి. నేనదే సరియైన దనుకుంటు న్నాను. మన ఇద్దరి అభిప్రాయాలలో పెద్దగా తేడా లేదు. నువ్వు తగిన వయస్సురాకముందే వైరాగ్యం వైపు చూస్తున్నావు. నేను తగిన వయస్సు కోసం ఎదురు చూస్తున్నాను! అంతే

కానీ మహాప్రభువు నిజంగా ప్రభువనడానికి నాకే సందేహమూ లేదు?"

"కానీ ఎదురు చూడటంలోనే జీవితం గడిచిపోతుందేమో? శ్యామ్. ఈ రోజు మహాప్రభువు అరవై అయిదవ పుట్టినరోజు! ఎందరో స్త్రీ, పురుషులు వారి దర్శనం చేసుకోవటానికి, వారిని పూజించటానికీ వచ్చారు."

"మరి నువ్వు అర్థనూట పదహారులు చదివించావా? లేదా. రమేష్"

"చదివించటం ముఖ్యం కాదు. చదివించాలన్న నియమం లేదు. భక్తులు తమ శ్రద్ధ కొద్దీ చదివిస్తే అది వేరే విషయం" అన్నాడు రమేష్ వర్మ.

శ్యామ్‌శర్మ తన దగ్గర వున్న పత్రికల్లో నుండి ఒక దానిని తీసి దానిలో ప్రచురించిన ఒక ఫోటోను చూపిస్తూ "చూడు, ఇతడూ భారతదేశానికే గర్వకారణమైనొక దివ్య పురుషుడు. మహాత్ముడు! ఐతే, ఇతనుఇప్పుడు లేడు. దివంగతుడయ్యాడు. ఇతని కీర్తి భారతదేశమంతటా మారుమ్రోగిపోయింది. ఇతడి ఖ్యాతికి ముఖ్యకారణం ఇతను ఎవరి దగ్గరా కానుకలు తీసుకోడు. కానుకలు తీసుకోడంటే వందా – రెండు వందలు తీసుకోడు. కిందటి సంవత్సరం ఇతను మధుపురికి వచ్చాడు. తిరిగి వెళ్ళేటప్పుడు శిష్యులు లక్ష రూపాయల దాకా ఇతని ఆస్తిని కొట్టేశారు" అన్నాడు.

"ఆ దిగులుతోనే ఆయన పోయాడంటావు? అంతేనా?"

"కాదు. నేను చెప్పబోయేది అది కాదు. మహాప్రభు దర్శనం కోసం చాలా దూరాలనుండి నాగరికులైన పురుషులు, స్త్రీలు ప్రవాహంలా మధుపురికి వస్తున్నారు. ఢిల్లీలోని ఐ.పి.యస్. ఆఫీసర్లు, భార్యలు బాందనీ చౌక్‌లో పూలమాలలు కట్టించుకుని తమ చిన్నకార్లలో ఈరోజు మధుపురికి వస్తారు. ఇది నిజం. "మహాప్రభువులో ఏదో ఒక దివ్యత్వం వున్నదని కనుకనే ప్రజలు ఇలా ప్రవాహంలా వచ్చేస్తున్నారని సాధారణ మానవులు కూడా అనుకుంటారు. ఇతనిలో ఏ శక్తీ లేకపోతే ఆ వచ్చేవాళ్ళందరూ పిచ్చివాళ్ళా? లేకపోతే భంగుపట్టించారా?".

శ్యామ్ భావాలలో మార్పు వచ్చిందని రమేష్ అనుకున్నాడు. ఈమధ్య మిత్రులిద్దరూ ఏ విషయం గురించీ ఇంత వివరంగా మాట్లాడుకోలేదు. ఇద్దరి భావాలు వేరైనాక ఎక్కడయినా కనపడితే 'నమస్తే' చెప్పుకోవటంతోనే సరిపోతున్నది. మహాప్రభు పుట్టిన రోజుపండుగ వేడుకల గురించి రమేష్‌వర్మ, శ్యామ్‌శర్మకు చెప్పాడు. ఆ వేడుకల సందర్భంగా 'మహాప్రభు' జీవనలీలల గురించి భక్తులకు చెప్పటం జరిగింది. వాటన్నింటినీ వివరంగా శర్మకు చెప్పాడు వర్మ. ఇలా చెప్పటం వలన శర్మమీద కూడా మహాప్రభువుల ప్రభావం పడుతుందని వర్మ ఉద్దేశం!

అంతా విన్నాక శ్యామ్ అన్నాడు. "కానీ రమేష్, నువ్వు రామాయణంలోని ఉత్తరా

కాండను మాత్రమే చెప్పావు. అలాకాదు మిగతా ఏడు కాండలను కూడా విన్నప్పుడే మహాప్రభువుల చరిత్రలోని గొప్పతనం అర్థమవుతుంది.”

రమేష్ ఉత్సాహంగా అడిగాడు. “మహాప్రభువుల జీవితం గురించి నాకంటే నీకు ఇంకా ఎక్కువే తెలుసన్నమాట. చెప్పరాదా? వింటాగా!”.

“అవును, నాకు బాలకాండనుండి ఉత్తరకాండ దాకా ప్రభు చరిత్ర మొత్తం తెలుసు! ఐతే, ఇప్పుడు కాదు మరొకసారి చెప్తాను.”

“పోనీ, ఒక్క బాలకాండైనా చెప్పొచ్చుగా.”

“ఇలా. తొందరపడకూడదు. ప్రభుచరిత్ర బాలకాండనుండి ఉత్తరాకాండ వరకు ఏడు కాండలూ చెపుతాను. ఐతే, ఇవ్వాళ మాత్రం కాదు. మోలూ చాయ్ బిస్కెట్లు పట్టుకువస్తున్నాడు. టీ తాగాక, ఇవ్వాళ మన సమావేశాన్ని ముగిద్దాం!” అన్నాడు శ్యామ్‌శర్మ.

## 2

శ్యామ్‌శర్మ నాలుగు గంటలు దాటితే బంగళాలో వుండడని రమేష్‌కు తెల్సు. అతడికి ప్రభుచరిత్ర పూర్తిగా వినాలని ఉత్సుకతగా వుంది. తరువాత రోజు అతను ఉదయాన్నే టీ–టిఫిన్ అయ్యాక శ్యామ్‌శర్మ బంగళాకు వచ్చాడు. తనూ ఇదే బంగళాలో గది తీసుకుని వుంటే ఎంత బాగుండేదోనని అనుకున్నాడు వర్మ. ఒకటేచోట వుంటే అటు సంస్కృతమూ చదువుకునే వాడు ఇటు ప్రభుచరిత్ర వినేవాడు కదా! ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నాక “ఐతే, సంస్కృత పాఠం మొదలు పెడదామా? ప్రభుచరిత్ర మొదలు పెడదామా!”

“రెండూనూ, ఐతే ముందు ప్రభు చరిత్రయితే బాగుంటుంది!”

శ్యామశర్మ తల మీద వున్న హేట్‌ను తీసి పక్కనున్న కుర్చీలో పెట్టి గంభీర వదనంతో పురాణం చెప్పే పౌరాణికుడిలా “రామాయణం కథా ప్రారంభమెట్టిదనిన.... అని ప్రారంభించాడు. రమేష్ ఆశ్చర్యపడటాన్ని గమనించి “ఆశ్చర్యపడకు! ఎక్కడ రామాయణ పురాణ కాలక్షేపం జరిగితే అక్కడికి హనుమాన్ వస్తాడని ప్రజలు చెప్పుకుంటూ వుంటారు. అతనికి ఆసనం ఏర్పరచటం కోసం తమ తలగుడ్డల్నీ, దుప్పట్లనీ చుట్టు చుట్టి ముందు పెట్టుకుంటారు. ఆ చుట్టు మీదకు హనుమంతుడు వచ్చి కూర్చుంటాడని వాళ్ళ విశ్వాసం! మరి కోటూ, ప్యాంటు, హేటు పెట్టుకునే మనకు తల గుడ్డలు దొరకవు కనుక హేటునే తలగుడ్డగా కుర్చీలో పెట్టాను. హరికథ అనంతమైనదని అంటారు. ప్రభుకథ అనంతమైన దని నేనంటాను. ముఖ్య కథలోకి వెళ్ళేసరికి ఎంత కాలం పడుతుందో! నేను చెప్పలేను కనుక మొదట – కథలను ప్రారంభిస్తాను.

కాశీ భారతదేశంలోని అన్ని నగరాలకూ దగ్గరగా వుండదు. అందువల్ల బ్రాహ్మణ

కుమారులందరికీ సమానమైన లాభాన్ని పొందే అవకాశం దొరకదు. కనుక భారతదేశం లోని చాలా ప్రాంతాలలో చిట్టిపొట్టి కాశీలు అనేకం వెలిశాయి. వీటిని చిన్న కాశీలని అంటారు. ఆ చిన్న కాశీల్లోని సత్రాల్లో బ్రాహ్మణ కుమారులకు భుక్తి గడిచి పోతుంది. పాఠశాలల్లో ఉచితంగా సంస్కృతం నేర్చుకుంటారు. ఇంగ్లీషు ఖర్చుతో కూడిన విద్య. ఆ విద్యను అభ్యసించటానికి ఫీజు కావాలి, పుస్తకాలు ఇంకా ఉండటానికి తిండికీ నగరంలో ఏర్పాట్లు కావాలి. ఇవన్నీ ధనికులకు మాత్రమే సాధ్యమవుతాయి బీదలైన అన్యకులస్తులు అసలు చదువు విషయమే పట్టించుకునే వారు కాదు. కాని బీదబ్రాహ్మణుల బ్రహ్మచారులు వంశపారంపర్యంగా వస్తున్న సంస్కృత విద్యను చిన్న కాశీక్షేత్రాలలో ఖర్చులేకుండా అభ్యసించేవారు. టీకారాం అలా సంస్కృతం అభ్యసిస్తున్న పన్నెండేళ్ళ బ్రాహ్మణ బ్రహ్మచారి!"

టీకారాం బ్రాహ్మణుడే అయినా అతని కుటుంబం తరతరాలుగా విద్యకు దూరమ య్యారు. ఆ కుటుంబం చదువు సంధ్యలు కలది కాకపోయినప్పటికీ వంశపారంపర్యంగా వస్తున్న పౌరోహిత్యం వుంది. ఐతే, టీకారాం దురదృష్టమో ఏమో కానీ అతనికి 10, 11 ఏళ్ళు వచ్చేసరికి ఊరిలోని గృహస్తుల ఇళ్లు ఎన్ని ఉన్నాయో? పురోహితుల ఇళ్ళు అన్ని అయ్యాయి. అంటే ఒక్కొక్క పురోహితుడి ఇంటికీ ఒక్కొక్క గృహస్థు ఇల్లు దొరికిందన్నమాట. ఆ సమయంలో టీకారాం తమ ప్రాంతంలో చిన్న కాశీగా పేరొందిన శివపురానికి చదువుకోవడానికి వెళ్ళాడు. అతని వంటిమీద చొక్కా లేదు. కట్టుకున్న అంగ వస్త్రము చినిగి పీలకలైవుంది. టీకారాం కనుముక్కు తీరుగలవాడే, మంచి రంగు కూడా అయినా మాంసం లేని చర్మంతో ఎముకల పోగులా వున్న శరీరానికి అందం ఏముంటుంది?

టీకారాం దూరపు బంధువు ఒకతను శివాపురంలో చదువుకుంటున్నాడు. అతని దగ్గరకి వెళ్ళాడు టీకారాం. అదృష్టవశాత్తూ అతను వుండే సత్రంలోనే ఇతనికీ భోజనాది ఏర్పాట్లు జరిగాయి.

'లఘుకౌముదీ' అన్న పుస్తకాన్ని తెచ్చుకోగలిగాడు టీకారాం. అర్థంతో పనిలేకుండా, అర్థాన్ని ఆలోచించకుండా రెండుమూడు సంవత్సరాల పాటు బట్టీ కొట్టాడు టీకారాం. ఆ సత్రంలోని కొందరు విద్యార్థులు 'అమరకోశాన్ని' కూడా వల్లెవేస్తున్నారు. 'లఘుకౌముది' చాలనుకున్నాడు టీకారాం. తన స్వగ్రామంలోని ప్రైమరీ స్కూల్లో అక్షర జ్ఞానాన్ని పొందాడు, టీకారం. ఒక సంవత్సరం మాత్రమే చదివాడు. తర్వాత రెండు మూడు సంవత్సరాలు గొడ్లను కాయటంలో వచ్చిన నాలుగు ముక్కలూ మర్చిపోయాడు. బంధువుల అతను అక్షరాలను నాలుగు రోజుల్లో నేర్పించాడు. కాని 'లఘుకౌముది' చదవటానికి రెండు నెలలు పట్టింది. అతను 'మంగళాచరణం' శ్లోకం చదివాడు. తరువాత వారాల తరబడి 'అ–ఈ–ఉ'ను వల్లె వేశాడు. ఐనా, టీకారంకు పరుగెత్తాల్సిన అవసరం ఏముంది?

నాలుగయిదు నెలలు గడిచేసరికి టీకారాం శరీరానికి మాంసము పట్టింది. సత్రంలో పూరీలు – పప్పు రోజూ పెట్టేవారు. అప్పుడప్పుడు బ్రాహ్మణార్థాలకూ వెళుతుండేవాడు. పిలిచిన గృహస్థు పేదవాడయినా హల్వా, పూరీ, తప్పకుండా చేయించేవారు. కొద్దీ గొప్పా ఆర్థిక స్థితి గల వారైతే పరమాన్నం, లడ్డూ, ఇతర పిండివంటలూ తప్పకుండా వడ్డిస్తారు. వెనుకటినుండీ చదువుకున్న విద్యార్థులందరినీ పరిచయం చేసుకున్నాడు. వాళ్ళద్వారా తను స్వయంగా కూడా శివాపురం గృహస్తులను పరిచయం చేసుకున్నాడు. ఆరునెల్ల తరువాత బంధువులతను పెద్ద చదువు చదవటానికి వారణాసి వెళ్ళాడు. అతడలా వెళ్ళిపోవటాన టీకారాంకు ఊపిరి తీసుకున్నట్లయింది. ఎందుకంటే అతను వుంటే చదువు.... చదువు అని ఒకే తీరుగా ప్రాణం తీసేవాడు. ఇప్పుడతని బాధ తప్పింది. లఘుకౌముదిలోని రెండు మూడు పేజీలను ఎలాగొలా కంఠస్థం చేశాడు. బంధువులతను అటు వెళ్ళగానే 'లఘుకౌముదిని' ఒక వస్త్రంలో చుట్టి అటక మీద పెట్టేశాడు. ఐతే, అప్పుడప్పుడూ లఘుకౌముదిని అలా అటక మీదే వుంచి చెయ్యెత్తి నమస్కారం చేస్తుండేవాడు. ఇన్ని రోజుల్లో అతనికి శివాపురంలోని వివిధ రకాల మనుషుల తోటి పరిచయం అయింది. ఈ విధంగా సంవత్సరం గడిచింది. ఇక ఇప్పుడతనికి సత్రాన్ని గురించి కూడా పెద్ద పట్టింపు లేదు. సత్రంలో భోజనం పెట్టకపోయినా ఫర్వాలేదన్న ధైర్యం వచ్చేసింది. నెలకు ఎటూ కనీసం ఇరవై ఐనా బ్రాహ్మణార్థాలు దొరుకుతున్నాయి. బ్రాహ్మణార్థానికి ముందు రాత్రి పస్తువున్నా ఫర్వాలేదు. తర్వాత రోజు మధ్యాహ్నానికల్లా త్రిపుండకాన్ని దిద్దుకొని తెల్లని చొక్కా, ధోవతి ధరించి బ్రాహ్మణార్థానికి బయలుదేరేవాడు. ఇక ఆరోజున టీకారాంకు క్షణం తీరిక వుండేదికాదు.

"రమేష్ మధ్యలో అందుకుని "ఐతే, టీకారాంకు ఏమాత్రం విద్య అబ్బలేదంటావు." అని అడిగాడు.

"విద్య అంటే నీదృష్టిలో పుస్తకాల చదువే అనుకుంటే, ఆ చదువు నిజంగానే అతనికి అబ్బలేదు. కానీ పుస్తకాల చదువే కాదు. మన మునులకు, ఋషులకు 'పుస్తకం' అన్న పేరు కూడా తెలియదు. గురువు నుండే విద్యను అభ్యసించేవారు. మహాపండితులయ్యే వారు" అన్నాడు.

"అంటే, నీ ఉద్దేశ్యం టీకారామ్ చదవకుండా వింటూ పండితుడయ్యాడంటావ్."

"దాదాపు అంతే! ఐతే, నా ఉద్దేశంలో విద్యలో చాలా రకాలున్నాయి. టీకారాం నేర్చుకుంటున్న విద్య ఏమిటంటే – నగర సంస్కృత విద్యార్థి నడవడిక. బ్రహ్మదేవుడు చదువులో ఇతనికి అంత తెలివితేటల్ని ఇవ్వకపోయినా వ్యవహార జ్ఞానంలో తెలివితేటల్ని ఇచ్చాడు. శివాపురంలో రెండు ఏళ్ళు వుండేసరికి అతను మంచి వ్యవహార జ్ఞానాన్ని

సంపాదించుకున్నాడు. పుస్తకం ద్వారా కాకపోయినా ప్రజల్ని చూసి - విని చాలా నేర్చుకున్నాడు."

"ఆరు, ఏడు సంవత్సరాల వరకూ టీకారాం దినచర్యలో ఏవిధమైన మార్పు రాలేదు. అతను 18 సంవత్సరాల యువకుడయ్యాడు. 'లఘుకౌముది' అప్పటికీ అటకమీద అలాగే పడివుంది. పంచ సంధుల్ని దాటి ముందుకు పోవటానికి అతను ఏమాత్రం ప్రయత్నం చేయలేదు. ఈ విషయంలో అనుమానం వస్తే అతడి పుస్తకాన్ని తెరిచి చూడవచ్చు. పుస్తకంలోని మొదటి నాలుగు పేజీలు బాగా నలిగి, చినిగిపోయి మాసిపోయి వుంటాయి. మిగిలిన పేజీలన్నీ కొత్త వాటిలా ఏ మాత్రం నలగకుండా, మాయకుండా వుంటాయి. శివాపురంలో వుండటం వలన అతనికి ఒక ప్రయోజనం అయితే కలిగింది అతనికి అప్పుడప్పుడు హిందీ కథా సంపుటాన్ని చదివే అవకాశం దొరికింది. టీకారాం అంత కుశాగ్రబుద్ధి కలవాడు కాకపోయినప్పటికీ కొంచెం శ్రమచేసినా ఎంతో కొంత పుస్తక జ్ఞానాన్ని సంపాయించుకుని వుండేవాడే! తరువాత అతను ఆర్యసమాజ సభలకూవెళ్ళటం మొదలు పెట్టాడు. వాళ్ళ ఉపన్యాసాల్ని శ్రద్ధగా వినేవాడు. శివాపురంలో భిన్నభిన్న మతాల శాస్త్రార్థాలు జరుగుతుండేవి. టీకారాం వాటికీ హాజరయ్యేవాడు. టీకారాంకు సంస్కృత భాషా జ్ఞానం కానీ ఇతర భాషాజ్ఞానం కానీ అంతగా లేకపోయినప్పటికీ అతడు పూర్తిగా విద్య అబ్బనివాడని అనుకోవటానికి లేదు. పుస్తకం ముట్టుకోని అతని సోమరితనాన్ని చూసి అతని తోటి విద్యార్థులు హాస్యంగా మాట్లాడితే "నేను మన పూర్వీకులయిన ఋషుల మార్గాన్ని అనుసరిస్తున్నాను. జ్ఞానార్జనకు ప్రధాన సాధనం చెవ్వే అనుకుంటున్నాను" - అనేవాడు.

రోజులు గడిచిపోతున్నాయి. టీకారాం బాల్య దశనుండి యవ్వనంలోకి అడుగు పెట్టాడు. అతను తిండీ, బట్టకూ దిగులు లేదు. చేతిలో కొద్దో గొప్పో డబ్బులు వుంటుండేవి. బ్రాహ్మణార్థానికి వెళితే దక్షిణ ఇచ్చేవారు. ఎవరింట్లోనయినా పూజా, పుణ్యవచనం జరిగిస్తే అదనంగా కొంత డబ్బు ముట్టేది. ఇలా క్రమక్రమంగా ఇతని దగ్గర డబ్బు పోగుపడసాగింది. కొన్ని వందలు పోగుచేసుకున్నాడు.

శ్యామశర్మ టీకారాం విద్యార్థి జీవితాన్ని గురించి రమేష్ వర్మకు చెప్పాడు. ఆరోజు అంతటితో ముగించాడు.

## 3

రెండురోజుల తరువాత రమేష్‌వర్మ, శ్యామ్‌శర్మ బంగళాకు వచ్చాడు. ఆరోజుతో టీకారాం చరిత్రను పూర్తి చేయాలనుకున్నాడు శ్యామ్‌శర్మ. ఇలా ప్రారంభించాడు. "టీకారాం

25 సం॥ల వాడయ్యాడు. ఇప్పుడు అందరూ అతడిని 'టీకారాం'గారు అని గౌరవిస్తున్నారు. శివాపురంలోని చాలా కుటుంబాలతో మంచి పరిచయాలు ఏర్పడ్డాయి టీకారాంకు. గృహిణులు అతడిని గొప్పపండితుడనే అనుకునేవారు. సంస్కృత శ్లోకాలను మధుర స్వరంతో గానం చేసేవాడు. వాటిఅర్థాలను చెప్పటానికి బాధపడవల్సిన పనిలేదు. సంస్కృత గ్రంథాలన్నింటికీ అన్ని భాషల్లోనూ టీకాలు వెలువడ్డాయి. అంతటితో తృప్తి పడితే అతని జీవితం హాయిగా వెళ్ళిపోతుంది. తిండికీ, బట్టకూ దిగుల్లేదు. పై డబ్బులు దొరుకుతూనే వుంటాయి. కానీ ఇట్లా జీవితాన్ని గడపటానికి అతని మనస్సు అంగీకరించ లేదు. ఇరవై అయిదేళ్ళు వచ్చాక అతను మనసులో బాధపడుతూ వుండేవాడు. "నేనేమీ చదువుకోలేదు కదా! ఎన్నాళ్ళిలా బతుకుతాను? ఇతరుల ఇళ్ళల్లో పొట్టపోసుకుంటూ...." అని.

టీకారాం వివేకవంతుడు. చిన్న చిన్న విజయాలకే తృప్తి పడడు. అతని వయస్సు వాళ్ళు చాలా మంది 'శాస్త్రి', 'ఆచార్య' పరీక్షలు పాసయ్యారు. కొందరు ఎం.ఎ., ఎం.ఒ.ఎల్ కూడా అయ్యారు. కొందరు కాలేజీల్లో ప్రొఫెసర్లు అయ్యారు. అలాంటి వాళ్ళకు గౌరవమూ లభిస్తోంది. ఆదాయమూ బాగానే వుంది. టీకారాంకు ఇప్పుడు వాళ్ళలా పరీక్షలకు చదివి పాసవటం జరగని పని! ఐతే, అతనికి వ్యవహార జ్ఞానం చాలా ఎక్కువ. ఏదైనా సాధించగలనన్న ఆత్మవిశ్వాసం అతనికి చాలా ఎక్కువ. అతను అనుకుంటాడు. సరస్వతి కూడా లక్ష్మికి ఊడిగం చేస్తుంది కాబట్టి ఏదో విధంగా లక్ష్మిని తెచ్చుకుంటే సరస్వతి లేని లోటు భర్తీ అవుతుంది.

టీకారాం మాట్లాడటంలో చాలా నేర్పరి. అతని మాటల్ని ప్రజలు మంత్ర ముగ్ధులై వింటుంటారు. శివాపురం బజార్లలో మందులు అమ్మేవాళ్ళను చూస్తుంటాడు. వాళ్ళ మాటల్లో పదాలకూ వాళ్ళు మాట్లాడే విధానానికీ ముగ్ధులై గుంపులు గుంపులుగా గుమిగూడి ప్రజలు వింటుంటారు. వాళ్ళు ఎంతో చాకచక్యంగా మందుల్ని అమ్ముకుంటుంటారు. "కళ్ళ జబ్బుకు రాంబాణం లాంటి మందు. అద్భుతంగా పనిచేస్తుంది. నెలరోజుల్లో పనిచెయ్యకపోతే డబ్బు వాపస్. గుంపులోని ఒకరిద్దరు (ముందుగానే మాట్లాడి పెట్టుకున్న వాళ్ళు) 'మీ మందు మాకు బాగా పనిచేసింది. ఇంకో రెండు సీసాలు ఇవ్వండి" అంటూ మందులు అమ్మేవాడికి డబ్బులిచ్చి మందు సీసాల్ని తీసుకుంటారు. మందులు అమ్మే అతను అక్కడున్న ప్రజలకు కళ్ళల్లో మందు కూడా వేస్తాడు. ఒకటి రెండు గంటల్లో నాలుగు రూపాయల మందు అమ్ముకుంటాడు. అలా తిరుగుతూ మందులమ్మే వాళ్ళను చాలా మందినే చూశాడు టీకారాం! 'తను మందులు అమ్మటం మొదలు పెడితే వీళ్ళకంటే కూడా ఎంతో సమర్థవంతంగా మందులు అమ్మగలడు. కానీ, అలా బజార్లవెంట తిరుగుతూ మందులు అమ్మేవాళ్ళకు సమాజంలో గౌరవం ఏముంటుంది? ఆదాయం మాత్రం ఏం

వస్తుంది? అని అనుకున్నాడు. గౌరవంగా మందులు అమ్ముకునే దుకాణదారుల గురించి ఆలోచించాడు. చూస్తుండగానే మందుల కంపెనీలను స్థాపించి లక్షలు ఆర్జించిన వాళ్ళను గురించీ ఆలోచించాడు. ఆ కంపెనీలు తయారు చేసే మందులు ఏమాత్రం నాణ్యమైనవో? టీకారాంకు తెల్సు. దుమ్మూ-ధూళీ సీసాల్లో పోసి వందల సంఖ్యల్లో అమ్మితే ఏ పదిమందికో స్వాభావికంగా గుణం కనిపిస్తే అది ఆ మందుల నుంచేనని వాళ్ళు తృప్తిపడక తప్పదు. ఐతే, టీకారాంకు దుమ్మూ-ధూళిని సీసాల్లో పోసి అమ్ముకోవల్సిన అవుసరం లేదు. అతనికి మొదటే కొన్ని మందులూ – మూలికలూ తెల్సు. తను బ్రాహ్మణార్థాలకు వెళ్ళినపుడు ఆ కుటుంబాలలోని పిల్లలకూ, మహిళలకూ చిన్న చిన్న జబ్బులకు చిట్కాలు చెప్తుండేవాడు. కానీ, మందుల కంపెనీ స్థాపించటం అంత తేలికైన పని కాదు. కంపెనీ ప్రచారానికే చాలా డబ్బు ఖర్చవుతుంది. 20 ఏళ్ళ క్రితం మొదలు పెట్టి వుంటే ఈ పాటికి నిలదొక్కుకునే వాడే. ఇప్పుడు కంపెనీలు చాలా వచ్చాయి. ఆ కంపెనీలతో తనేం పోటీపడగలడు? పోటీ పడాలన్నా చాలా డబ్బుండాలి. చివరకు మందుల వ్యాపారం లాభం లేదని నిర్ణయించుకున్నాడు.

మరింక ధనవంతుడు కావటానికి మార్గం ఏమిటి? అని ఆలోచిస్తూ, ఆలోచిస్తూ చివరకు అతని దృష్టి జగద్గురువుల మీదకు పోయింది. జగద్గురువులకు కానీ మహంతులకు కానీ శిష్యుణ్ణి అయితే బాగుండునని అనుకున్నాడు. కానీ, ఎన్నాళ్ళు శిష్యరికం చేసినా ఏ జగద్గురువో, ఏ మహంతో అయ్యే అవకాశం తనకు లభించదు. ఎందుకంటే, ఆ పదవులకు కావలసిన విద్య తనకు లేదు. ఒకవేళ విద్య వున్నప్పటికీ జగద్గురువులకూ, మహంతులకూ ఎందరో శిష్యులు వుంటారు. వాళ్ళలో ఏ అదృష్టవంతుడికో గాని వారసత్వ అధికారం దక్కదు. జీవితాన్ని ఏ అదృష్టానికో వదిలేసి వుండలేడు టీకారాం. వాస్తవానికి మహంతు కాగలిగిన లక్షణాలు టీకారాంలో చాలానే వున్నాయి. అతని ఆకారము, వేషధారణ మహంతుకు సరిగ్గా సరిపోతాయి. శివాపురంలో ధనవంతమైన మఠాలు చాలానే వున్నాయి. వాటి మహంతులు అంతగా విద్యాజ్ఞానం వున్నవారు కాదు. అయినప్పటికీ టీకారాంకు మహంతు పదవి లభిస్తుందనటానికి వీల్లేదు. ఎందుకంటే మహంతు కావాలంటే, ఎవరో ఒక మహంతుకు అన్నో -తమ్ముడో, మేనల్లుడో, మేనమామో అయివుండాలి. లేకపోతే ఇంకో విధంగా నయినా మహంతుకు దగ్గర సంబంధం కలవారు మాత్రమే వారసులవుతారు. కొన్ని సంవత్సరాల క్రితం ప్రయత్నించి వుంటే తప్పకుండా సాఫల్యతను పొందివుండేవాడే! కానీ, ఇప్పుడు అంత తేలికైన పని కాదు!

మహంతు, జగద్గురు పదవుల గురించి ఆలోచిస్తూనే టీకారాం భావాలు మరొక దిశగా మారాయి. అతనికి మరొక ఆలోచన తట్టింది. మనసులోనే ఇలా అనుకున్నాడు.

ఆఁ.... నాకు ఇది సరైనది. నేనెందుకు మరొకరి శిష్యుణ్ణో, కృపాపాత్రుణ్ణో కావాలి! మనదేశంలో భక్తి, శ్రద్ధలకు కొదవే లేదు. ఎక్కువశాతం ప్రజలు శ్రద్ధా భక్తులు కలిగిన వారు. ఐతే, ఆ శ్రద్ధాభక్తులను ఒక దారిలో వాళ్ళని పెట్టుకోవటం అవసరం. నేనలా ప్రజల భక్తి శ్రద్ధలను దారిలో పెట్టుకోగలను. ఇది అంత ఖర్చుతో కూడిన పని కూడా కాదు. నేను గురువు నవుతాను. స్టేజీమీద నటుడు కొన్ని గంటలే నటిస్తాడు. మహంతులూ – జగద్గురువులూ ఇరవై నాలుగు గంటలూ నటిస్తారు. వారిలా తానూ నటించాలి. కొంచెం కష్టమైనప్పటికీ తను నటించగలడు."

టీకారాం బాగా మాట్లాడగలడు. అందరితో కలిసిపోగలడు. భాషా వ్యాఖ్యానంతో పాటుగా తన సొంత మాటలను కలిపి చాలా ఆకర్షణీయంగా కథలను చెప్పగలడు. టీకారాం ఆర్యసమాజం ఉపదేశకుడు కాకపోవటం అతని దురదృష్టం అనవచ్చు. అతని వినికిడి జ్ఞానానికి, వాక్పటుత్వానికి ఆర్యసమాజ ఉపదేశకుడు అయినట్టయితే ఎంతో రాణించగలిగేవాడు. కానీ జగద్గురువు కావాలన్న భావన స్థిరంగా వున్నాక ఉపదేశకునిగా వుండటం తుచ్ఛమనిపించింది అతనికి!

## 4

హరిద్వారంలో గంగానది పాయ ఒడ్డున యువకుడైన సన్యాసి ఒకతను వెళ్తున్నాడు. అతడు కాషాయ వస్త్రాలను ధరించాడు. అతని వెంట ముగ్గురు శిష్యులున్నారు. ఒకతని చేతిలో బంగారు జరీపోగుగల పట్టు ఛత్ర (గొడుగు) వున్నది. మరొక అతని చేతిలో కూర్చునే ఆసనం వున్నది. మూడవ శిష్యుడు వింజామరలు పట్టుకున్నాడు. గురుశిష్యులు నలుగురూ సాయంకాలం 6 గం॥లకు ఒక శుభ్రమైన ప్రదేశాన్ని చేరుకున్నారు. ఆ సాయంత్రం అక్కడ ఆగారు. రెండవ శిష్యుడు ఆసనం పరిచాడు. గురువుగారు దాని మీద పద్మాసనం వేసుకుని కూర్చున్నారు. మొదటి శిష్యుడు ఛత్రం పట్టుకున్నాడు. మూడవ శిష్యుడు వింజామరముతో విసురుతున్నాడు. ముగ్గరు నలుగురు భక్తులు పోగయ్యారు. కొద్దిసేపటికి 10, 15 మంది దాకా పురుషులూ, మహిళలూ వచ్చారు. ఆ ప్రదేశం చాలా శుభ్రంగా వుంది. బట్టలు మురికి అవుతాయోమోనన్న బెదురు కూడా లేకుండా అందరూ బాసిపట్లు వేసుకుని కూర్చున్నారు. ధార్మిక చర్చ ప్రారంభమయింది. అందరూ చర్చలో పాల్గొంటున్నారు. కాషాయ వస్త్రాలలో వున్న సన్యాసి ముఖము కాంతివంతంగా వుంది. అతడి మాటలో అమృతం వర్షిస్తోంది. సాధువు ముఖంలో ఎంత నమ్రత వుందో, అతని స్వరంలో అంతకంటె ఎక్కువ మాధుర్యం వుంది. ఆ ప్రాంతంలో ఈ మహాపురుషుడు దర్శనం ఇవ్వడం ఇదే ప్రథమం! అతని ముఖవర్చస్సు, స్వర మాధుర్యం శ్రోతలను

విశేషంగా ఆకర్షిస్తోంది. ఒక భక్తుడు ఇలా అడిగాడు."

"స్వామి తమ నివాసం ఏది? ఎక్కడ నుండి వస్తున్నారు?"

"భక్తా! స్థాన, రూప, నామ భేదాలన్నీ మనం కల్పించుకున్నవే! ఇదంతా మాయ? ఎక్కడనుంచి వచ్చావు? ఎక్కడికి వెళ్తావు? ఎక్కడ వుంటావు! ఈ ప్రశ్నల్లో ఏముంది చెప్పు?" అన్నారు స్వాముల వారు.

ప్రశ్నించిన భక్తుడు తను వేసిన ప్రశ్న అసందర్భమైందని అనిపించింది ఇతర భక్తులు" పానకంలో పుడక ఏమిటీ ఇతని ప్రశ్న? అని అనుకున్నారు.

ఒక నెల వరకూ స్వాముల వారి నోటినుండి అమృత వర్షం కురుస్తూనే వున్నది. ఒక వారం గడిచేసరికి హరిద్వారంలోని భక్తులకు స్వాములవారి గురించి తెలిసింది. అప్పటినుండి భక్తులు స్వాముల వారి వెంటే తిరగసాగారు. ఛత్ర–చామర్తాలతో, విలువైన ఆసనంతో, మృదువైన కాషాయ వస్త్రాల్తో వున్న స్వాముల వారిని చూసిన కొందరు నాస్తికులు 'ఏంటి ఈ వేషము? అని అనుకుంటుంటే – అలాంటి నాస్తికులను స్వాముల వారు అసలు లెక్కపెడితే కదా? భక్తులు ఖరీదైన స్వాములవారి వేషాన్ని చూసి "సిద్ధ పురుషులు చాలా రూపాలలో వుంటారు" అని అనుకునేవారు.

స్వాములవారు ఇలాగే వివిధ ప్రాంతాల్లో పర్యటించేవారు. అతనివెంట ముగ్గురు భక్తులు, ఒక వంటవాడు వుండేవారు. ఏ పనికైనా ప్రారంభంలో ఎంతో కొంత పెట్టుబడి పెట్టవలసి వుంటుంది. స్వాములవారు మొదట్లో పెట్టుబడి పెట్టుకున్నారు. కొద్ది రోజుల్లోనే భక్తుల హృదయాలను గెలుచుకున్నారు. భక్తుల హృదయాలను దోచుకోవాలే కాని ఇంక డబ్బుకు కొదవేంటి? ఈ రకంగా స్వాములవారు అఖండమైన అభినయాన్ని అభినయిస్తున్నారు. ఆయన కేవలం సద్గోష్ఠుల్ని మాత్రమే జరిపేవారు. మంత్ర తంత్రాల్ని – మందూ మాకుల్ని ఇచ్చేవారు కాదు. ఎవరికీ భవిష్యత్తును చెప్పేవారు కాదు – సమస్త విషయాలూ తనకు విశదమేనన్న విశ్వాసాన్ని భక్తులకు కలిగించారు.

స్వాములవారు భక్త–జ్ఞాన వైరాగ్యాలతో జ్ఞానానికి ప్రాధాన్యత నిచ్చేవారు. శిష్యులకు బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశించేవారు. సర్వం బ్రహ్మమయ రూపం, అర్థం సర్వం బ్రహ్మమయం అన్నదే అతని సిద్ధాంతం. నిశ్చల దాసు రాసిన 'విచారసాగరం' కాలీకమలీవాలే రాసిన 'అనుభవ ప్రకాశం' లాంటి వేదాంత గ్రంథాల్ని చదివి, వేదాంతంలో నిష్ణాతుడయ్యాడు. అతను ఎప్పుడూ 'పద్మాసనం' వేసుకుని నిశ్చలంగా బ్రహ్మానందాన్ని పొందుతూ ఉండేవాడు. లేకపోతే భక్తులకు ఉపదేశిస్తూ వుండేవాడు. మరొక స్థితిలో భక్తులెవరూ అతడిని చూడలేదు. తనను గురించి ఎవరైనా వివరాలు అడిగితే ఈ శరీరం అశాశ్వతమైనది' అనేసి సంభాషణను మార్చేసేవాడు. కానీ తన భక్తులకు సంబందించిన అన్ని వివరాలను జ్ఞాపకం

పెట్టుకునేవాడు. భక్తుడు ఎన్నాళ్ళకు కలిసినా అతని కుటుంబంలోని సభ్యులందరి క్షేమాన్ని పేరుపేరునా అడిగి తెల్సుకునేవాడు. ఇంత జ్ఞాపకశక్తి వున్న స్వాములవారు కొంచెం కష్టపడితే 'లఘుకౌముది'లోని పంచసంధులతోనే ఆగిపోయేవాడు కాదు.

మహాప్రభువులు రెండు పట్నాలలోనే ఎక్కువగా వుంటున్నాడు. ఆ పట్నాల్లో భక్తులు అతని ముఖారవిందాన్ని అవలోకిస్తూ అమృతాన్ని పానం చేస్తూ తృప్తి పొందుతున్నారు. జ్ఞానాసక్తులైన భక్తులు ఎప్పుడూ ఆయన చుట్టూ పోగుబడి వుండేవారు. ఆయన తన భక్తుల్ని కృతార్థులను చేస్తుండేవాడు.

రమేష్‌కు శ్యామ్ మాటల ద్వారా కథ అర్థమైంది. ఒకానొక గ్రామం నుండి శివపురానికి విద్యార్థిగా వచ్చిన పన్నెండేళ్ళ బ్రాహ్మణ కుర్రవాడే మధుపురిలో భక్తుల పూజలందుకుంటున్న 'మహాప్రభువు' అని. 'మహాప్రభువు'కు సంబంధించిన సమాచారాన్ని శ్యామ్ ద్వారా విన్నాక కూడా రమేష్ వర్మలో అతని పట్ల శ్రద్ధాసక్తులు ఏ మాత్రం తగ్గలేదు. నిజానికి శ్రద్ధా, విశ్వాసం అనేవి ఇనుప కవచాల్లాంటివి. బుద్ధి, తర్కం అనే బాణాలు తీవ్రవేగంతో వచ్చినా ఆ కవచాన్ని ఏమీ చేయలేవు.

'మహాప్రభు' శిష్యమండలిలో పురుషులూ వున్నారు. స్త్రీలూ వున్నారు. యువతీ యువకులూ, వృద్ధులూ అన్ని రకాల వారూ వున్నారు. భక్తులకు తన్మయుడై బ్రహ్మోపదేశం చేసేటప్పుడు 'నేనూ–నీవూ అనుకోవడం, నాదీ–నీదీ అనుకోవడం అజ్ఞాన లక్షణం! బ్రహ్మ నిరామయుడు. అతడు పురుషుడూ కాదు. స్త్రీ కాదు. కర్మం–మతం ఇదంతా మాయ. బ్రహ్మానందంలో, లీనమయిన వాడికి కర్మ–ధర్మాలంటూ వుండవు. బ్రహ్మ ఒక్కడే స్థిరం. మిగిలినదంతా మాయ 'అని' అనేవాడు. ఒక్కొక్క శబ్దాన్ని ఆచి తూచి ఆయన బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశిస్తూ వుంటే శ్రోత మండలి తన్మయత్వంలో మైమరచేది! స్వామి వారి భక్తమండలిలో కరమా అనే ప్రౌఢ స్త్రీ ఒకామె వుండేది. ఆమె ధనికురాలు. తన సర్వసంపదలతో స్వామివారి శిష్యరికాన్ని స్వీకరించింది. ఎన్నో రోజులుగా స్వామివారి ఉపదేశాన్ని వింటోంది ఆమె. ఆమె హృదయంలో స్వామివారి పట్ల అపారమైన శ్రద్ధ ఏర్పడింది. క్రమంగా కరమా పట్ల స్వాముల వారి ప్రవర్తన మధురతమైంది! ఈక్రొత్త ప్రవర్తనకు కారణం మహాప్రభువుల హృదయంలో తన పట్ల అసాధారణమైన దయ ఉత్పన్నం కావటమే అని అనుకుంది కరమ! కానీ స్త్రీ, పురుషుల సంబంధం ఎక్కువరోజులు అలాగే వుండదు. అది బ్రహ్మజ్ఞానం కోసమే కానీ, మరే సంబంధం కోసమో కానీ త్వరలోనే తన సహజత్వానికి దిగిపోతుంది! పరిణామం ఇలా వుంటుందని ముందుగానే ఆమె ఊహించి వుంటే స్వాముల వార్ని అంత దగ్గరకు రానిచ్చేది కాదేమో! ఐతే, కరమలో స్త్రీ సహజమైన బలహీనత వుంది. మహాప్రభువుకు ఒక విషయం ఖచ్చితంగా తెలుసు. భక్త మండలి నిజంగా

తనను దేవుడనుకుంటోంది. ఎన్నో రోజులుగా తమ హృదయాల్లో పెంచి పోషించుకుంటున్న శ్రద్ధను ఎలాంటి పరిస్థితులలోనూ పడగొట్టుకోరు. ఐతే, అట్లా కరమతో రహస్య సంబంధాన్ని సాగించటం స్వాముల వారికి ఇష్టం లేదు. కరమా కూడా అందుకు ఇష్టపడటం లేదు. చివరకు స్వాములవారు కరమను 'శక్తి స్వరూపిణిగా' బాహాటంగా స్వీకరించారు. ఎందరో సిద్ధులూ, సాధువులూ, జగద్గురువులూ తమ శిష్యురాళ్ళలో నుండి శక్తి స్వరూపిణిని ఎన్నిక చేసుకోవడం మన స్వాముల వారికి కూడా తెల్సు. పై చెప్పిన సిద్ధుల్నీ, సాధువుల్నీ, జగద్గురువుల్ని – అనుసరించాడు స్వాముల వారు! మహాప్రభువు శక్తి స్వరూపిణిగా కరమకూ, తనకూ యాగశాల నుండీ సంబంధం వుందని శిష్యమండలిలో ప్రకటించాడు. శక్తి స్వరూపిణి పట్లా, మహాప్రభువుల పట్లా శిష్యుల భక్తి శ్రద్ధలు ఇంకా పెరిగాయి. కరమ సాక్షాత్తు భగవతిగా పూజలు అందుకుంటుంది. ఆమె పాదాలకు అందరూ నమస్కరిస్తున్నారు. ఇంగ్లీషు ఆఫీసర్లూ, వారి దొరసానులూ కరమను 'హర్‌హోలీనెస్' అనటం మొదలు పెట్టారు. కరమ 'హర్‌హోలీనెస్' అయితే అయ్యిందిగానీ, స్వాములవారి మీద ఇంతకు ముందున్న శ్రద్ధ ఆమెలో తగ్గిపోయింది. ఎందుకనో ఆమె హృదయంలో స్వామివారిపట్ల వెనుకటి శ్రద్ధాభక్తులు మృగ్యమైనాయి!

ఇది మాయా ప్రపంచం! ఈ ప్రపంచంలో ఒకరు ఇద్దరు కావటం, ఇద్దరు నలుగురు కావటం సహజం! మహాప్రభువుకూ – శక్తి స్వరూపిణికీ గణపతి – కార్తికేయుల్లా ఇద్దరు కొడుకులు పుట్టారు! ఇద్దరికీ మహాప్రభువు 'హృదయ ప్రియులు' అని పేరు పెట్టాడు. అందరూ ఆ పిల్లల్ని అలాగే పిలిచేవారు!

ఉత్తర భారతదేశంలోని అనేక నగరాలలో మహాప్రభువుకు భక్తులున్నారు. వారి శిష్యుల్లో ఆధునికులైన చదువుకున్న వాళ్ళూ, ధనికులూ అధికంగా వున్నారు. ఇంతకు ముందులా ముగ్గురు శిష్యులు ఇప్పుడు సరిపోవటం లేదు. అతని వెంట ఇప్పుడు డజన్ల కొద్దీ శిష్యులున్నారు. సొంతకారు వుంది! ఇంగ్లీషు చదువుకున్న ప్రైవేటు సెక్రటరీ వున్నాడు. ఏరకమైన ప్రచారం లేకుండానే స్వాములవారి ఖ్యాతి దేశం నలుమూలలకు పాకిపోయింది.

శ్యామ్‌శర్మ ఈ మధ్యన జరిగిన ఒక సంఘటనను చెప్పి కథ ముగించాడు.

పరిచయం వున్నా లేకపోయినా స్వామివారి పుట్టినరోజు పండుగకు రావల్సిందిగా అందరికీ ఆహ్వానాన్ని పంపటం ప్రైవేటు సెక్రటరీ పని! భక్తులతో పాటు ఇంతకు ముందు పరిచయం లేని వారు కూడా మహాప్రభువులు సన్నిధికి వస్తూ వుంటారు. రాజధాని నగరంలోని ఒక కాలేజ్ ప్రిన్సిపాల్ ఒకతను ఒకసారి మహాప్రభువుల సన్నిధికి రావటం జరిగింది. మొహమాటం కోసం అతనూ స్వాములవారి పట్ల కొంత భక్తిని ప్రదర్శించాడు. ఇంకేముంది? స్వాములవారు అతడినీ తన భక్తులలో ఒకడిగా లెక్కకట్టుకున్నారు."

కొద్దిరోజుల తరువాత ఆ ప్రిన్సిపాల్ పేరు మీద స్వాములవారి ప్రైవేటు సెక్రటరీ నుండి జాబు ఒకటి వచ్చింది. అందులో ఇలా వుంది.

'మహాప్రభువులు మీమీద అపారమైన కృప చూపారు. వారు తమ 'హృదయ ప్రియుల'తోటి 'హర్‌హోలీనెస్'తో కల్సి – మీ నివాసానికి దయ చేయాలనుకున్నారు. వారి వెంట పన్నెండుమంది శిష్యులుంటారు! స్వాముల వారికి ఎలా స్వాగతం ఇవ్వాలో, ఎలా వార్ని సత్కరించాలో– మీకు తెలియందికాదు! మహా ప్రభువులకు పాద పూజలు చేయించుకోవాలన్న ప్రత్యేకమైన ఆసక్తి అంటూ ఏమీ లేదు. భక్తులు చేస్తానంటే వారు కాదనరు!

ప్రైవేటు సెక్రటరీ ఇలా జాబు రాయటం ప్రిన్సిపాల్‌గారికి అంతగా నచ్చలేదు. ఐతే, తన విద్యార్థులలో కోటీశ్వరుల పిల్లలు కొందరున్నారు. వాళ్ళ ఇళ్ళల్లో తరచూ స్వాముల వారికి పూజలు చేస్తూ వుంటారు. ఈ మహాప్రభువుల బాధ్యతను ఒక శిష్యుడికి అప్పగించాడు ప్రిన్సిపాల్! ఒకరోజున ఆ విద్యార్థి ఇంటికి తమ కుటుంబంతో సహా స్వాములవారు విచ్చేశారు. స్వాములవారికి స్వాగత సత్కారాలన్నీ నియమంగానే జరిగాయి. రాజధాని నగరంలో కూడా మహాప్రభువుల భక్త మండలి ఏర్పడింది!"

మహాప్రభువుల చరిత్రను సాంతం విన్నాక రమేష్‌వర్మ హృదయంలో అనేక సంశయాలు ఉత్పన్నమయ్యాయి. ఐతే, మూఢ విశ్వాసం ముందు ఆ సంశయాలు చెదిరిపోయాయి.

# 'లిప్‌స్టిక్'

**"కుం**జాయమ్మ కోడల్ని చూశావుగా, నువ్వు?" అలుపు తీర్చుకోవటానికి కూచున్న ఇద్దరు వృద్ధురాళ్ళలో ఒకామె మరొకామెను అడిగింది.

మధుపురి బాగా పెద్ద నగరం అయింది. పెద్ద బజార్లో బంగళాలు చాలా ఎక్కువగా వున్నాయి. మిగిలిన ప్రదేశమంతా అడవులూ, కొండలూ వాటి మధ్యలో అక్కడక్కడా బంగళాలు వున్నాయి. బంగళాలు దూరదూరంగా, అక్కడక్కడా వుండటం వలన ఒకచోటి నుండి మరొక చోటికి వెళ్ళాలంటే మైళ్ళ తరబడి నడవ వలసి వుంటుంది. అలాంటప్పుడు అక్కడక్కడా సిమెంటు బెంచీలను ఏర్పాటు చేస్తే ప్రయాణీకులకు అలుపు తీర్చుకోవడానికి వీలుగా వుంటుంది. మధుపురిలో అక్కడక్కడా సిమెంటు రేకుల షెడ్డులూ వాటికింద సిమెంటు బెంచీలు వేసి వున్నాయి. ఎండల్లో, వానల్లో ప్రయాణీకులు ఆ షెడ్ల కింద తలదాచుకుంటారు. మధుపురిలోని ఎండలు కోమలాంగులను మాత్రమే బాధిస్తాయి. వర్షం అలాకాదు. అందర్నీ సమానంగా బాధిస్తుంది. వర్షాకాలంలో ఈ రేకుల షెడ్డులు ప్రజలకు బాగా ఉపయోగపడతాయి. ఒకప్పుడు ఈ షెడ్లలో చెక్కబెంచీలు కూడా ఉండేవి. మున్సిపాలిటీవారు వాటిని తీసేశారు. సిమెంటు బెంచీలను తొలగించటం కష్టం కనుక వదిలివేశారు. మధుపురికి వచ్చే విలాసయాత్రికులకు బెంచీల మీద కూర్చోవటం అలవాటు. స్థానిక ప్రజలకు బెంచీల మీద కూర్చునే పనిలేదు. ఒట్టి నేలమీదైనా నిరభ్యంతరంగా కూర్చుంటారు. ఇప్పుడు మాట్లాడుకుంటున్న ఇద్దరు వృద్ధురాళ్ళు కింద నేలమీద కూర్చున్నారు. వాళ్ళకు కింద కూర్చున్నామన్న బాధలేదు. ఇలాంటి వాళ్ళను చూసినపుడు మున్సిపాలిటీ వాళ్ళు బెంచీలు అనవసరంగా పడివున్నాయి. పీకి పారేస్తే బాగుండునని అనుకుంటూ వుండేవారు.

"ఎందుకు చూడలేదు? చూశాను. నేను చూడటమే కాదు. ఊరూ, వాడా అంతా చూశారు" అంది రామూ వాళ్ళ అమ్మ.

శ్యాము వాళ్ళ అమ్మ మూతి విరుచుకుంటూ "ఏం పోయేకాలం వచ్చిందో! అర్థమే

కావటం లేదు. కాళ్ళకు పెట్టుకునే పారాణిని పెదాలకు పెట్టుకుంటారా? మా కాలంలో, మా అత్తగారి కాలంలో ముఖానికి ఒక్క బొట్టు మాత్రం పెట్టుకునే వాళ్ళం. పాపట్లో కుంకుమ పెట్టుకోవటం కూడా తెలియదు" అని అన్నది.

"నేను కొత్తగా అత్తవారింటికి వచ్చినపుడు ముఖానగానీ, పాపట్లో గానీ కుంకుమ పెట్టుకునే వారు. అది ఐదవతనానికి గుర్తుగా వుంటుంది. కానీ ఇలా పెదాలకు పారాణి రాసుకోవటం మాకు తెలియదు బాబూ" అన్నది రామూ వాళ్ళ అమ్మ.

"ఇక్కడ మధుపురిలో వెనుక దొరసాన్లు పెదాలకు రంగు వేసుకునేవారు! పెదాలకు ఆ రంగు ఏమిటని నేనొక బంగళా మాలీ భార్యను అడిగాను. ఆమె ఏమందో తెల్సా? మనం ముఖాన, పాపిటలో కుంకం పెట్టుకున్నట్లే వాళ్ళు పెదాలకు పారాణిపెట్టుకుంటారట! మనకు ముఖాన కుంకుమ బొట్టు పెట్టుకోవటం 'ఐదవతనానికి' నిదర్శనం లాగానే దొరసానులకు పెదాలకు పారాణి పెట్టుకోవటం ఐదవతనానికి గుర్తుట" అన్నది మాలీ భార్య.

"దొరసానుల్లో పెదాలకు పారాణిపెట్టుకునే ఆచారం ఎప్పటినుంచో వుంది! దొరసాన్లకేం వాళ్ళు ఎక్కడైనా పెట్టుకుంటారు. వాళ్ళకు ధర్మాధర్మాలంటూ ఏం వున్నాయి గనుక?"

"దొరసానుల్ని చూసి కిరస్తానం వాళ్ళు కూడా పెదాలకు పారాణి పెట్టుకోవటం మొదలు పెట్టారు. కిరస్తానం వాళ్ళు పెట్టుకున్నారంటే అది వేరే విషయం! వాళ్ళది మన మతం కాదు. మన మాట కాదు. కుంజాయమ్మ కోడలు కూడా పెదాలకు పారాణి పెట్టుకోవటం ప్రారంభించింది. కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందంటే ఇదే. ఐన వాళ్ళల్లోనే ఈ దుర్బుద్ధులు పుడుతున్నాయి!"

"ఔను మరి, దుర్బుద్ధి కాకపోతే మరేంటి. ఈ జబ్బు దొరసాన్ల నుండి కిరస్తానం వాళ్ళకు, వాళ్ళనుండి పెద్దింటి కోడళ్ళకూ పాకింది. చక్కగా చీర కట్టుకోవచ్చు. బొట్టూ, కాటుకా పెట్టుకోవచ్చు! ఇదెక్కడి రోగం?"

రామూ, శ్యామూ ఇళ్ళల్లోని ఆడవాళ్ళకు పెదాలకు పారాణి పెట్టుకునే అలవాటు లేదు. ఐతే, ఈ రెండు కుటుంబాల్లోనూ కొత్తకోడళ్ళు, వయస్సులో వున్న కూతుళ్ళూ వున్నారు. కుంజాయమ్మ కోడలుకూ, ఈ రెండు కుటుంబాలలోని కోడళ్ళకూ, కూతుళ్ళకూ మంచి స్నేహం. కుంజాయమ్మ కోడలు కొంతవరకూ చదువుకుంది. మనిషి నల్లగా వుంటుంది. గణపతికి ఎక్కడా తలకాయ దొరకకపోతే ఏనుగు తలను తెచ్చిపెట్టాడు శివుడు! అలాగే కుంజాయమ్మ కోడల్ని సృష్టించేటప్పుడు బ్రహ్మదేవుడికి తలకాయలు దొరకలేదేమో పురుషుడి తలకాయను తెచ్చిపెట్టాడు. ఆమె ముఖం పురుషుడి ముఖం.

నల్లని నలుపు. పురుషుడి ముఖం ఇంక ఆమె పెదాలకు పారాణి (లిప్‌స్టిక్) ఏం అందానిస్తుందో? చెప్పలేం? అసలు పెదాలకు రంగు వేసుకోవటం అస్వాభావికతను ప్రదర్శించటానికి కాదు. బాగా ఎర్రని రంగు కలిగి, నీడన బ్రతుకుతూ కమ్మగా తింటుంటే కోమల శరీరాల పెదాలు సహజంగానే ఎర్రగా వుంటాయి. వెనకటి కవులు అందగత్తెల పెదాలను 'బింబాధరాల'నే వారు. అంటే ఆ అందగత్తెల సౌందర్యాన్ని మరింత ఇనుమడింప చేయడానికి వారి పెదాలు సహజంగానే ఎరుపుదనాన్ని దాల్చాయని అనుకోవాలి! ఐతే, ఆకాలంలోనూ అందరూ 'బింబాధరాలు' కలవారు కాదు, అలాంటి అధరాలు లేనివారు పెదాల్ని, ఎర్రబరుచుకోవటానికి 'అధరరాగాన్ని' వాడుతుండేవారు. అలా 'అధరరాగంతో' పెదాల్ని ఎర్రబరుచుకున్న వారిని కవులు 'బింబాధర'లనే వారు! శరీరానికి రంగుల్ని పులుముకునే అలవాటు అన్ని దేశాల్లోనూ వుంది. మనదేశ ప్రజల తల వెంట్రుకలు సహజంగా నల్లగా వుంటాయి. వయసు మీద పడ్డాక నెరిసి తెల్లబడతాయి. అప్పుడు తలవెంట్రుకలకు నలుపు రంగువేసి కృత్రిమంగా వాటికి సహజ రంగును తీసుకురావడానికి అక్కడి ప్రజలు వెంట్రుకల్ని సహజ రంగులో మార్చుకోవటానికి గడ్డానికీ – తలకూ గోరింటాకు రాసుకునే వారు. మన దేశంలోనూ కొందరు ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్ ప్రజల్ని అనుకరించి తలకూ, గడ్డానికీ, గోరింట రంగు వేసుకుంటారు. ఇది వికృతమైన అనుకరణే అనిపించుకుంటుంది.

రామూవాళ్ళ అమ్మ, శ్యామూవాళ్ల అమ్మ నల్లని పెదాలకు ఎలాంటి 'పారాణి' పెట్టుకోవటం ఉచితం అని తర్కించుకోవటం లేదు. నల్లని పెదాలకు నల్లపారాణా? ఎర్రపారాణా? ఏ పారాణి పెట్టుకోవటమా? అన్నది కాకుండా అసలు ఈ పెదాలకు పారాణి పెట్టుకునే కొత్త ఆచారం ఎందుకు? అని వాళ్ళు తర్కించుకుంటున్నారు! ఎవరు ఎన్ని విధాలుగా తర్కించుకున్నా కొత్త విషయాలూ, కొత్త ఆచారాలూ వస్తూనే వుంటాయి. రామూవాళ్ళ అమ్మా, శ్యామూవాళ్ళ అమ్మా వాళ్ళు యవ్వనంలో వున్న రోజుల్లో కొత్త ఆచారాల్ని ప్రవేశపెట్టిన వారు కాదా? అప్పట్లో పశ్చిమ జిల్లాల్లో పాపట్లో కుంకుమ పెట్టుకునే ఆచారం లేదు. ఈ కొత్త ఆచారాన్ని వీళ్ళే మొదటగా ప్రవేశపెట్టారు. ముప్పై, నలభై తరాల క్రితం, వీళ్ళ పూర్వీకులు 'అధరరాగం' అనే రంగును పెదవులకు రాసుకునే వారు. ఐతే, ఆ 'అధరరాగం' శరీర రంగుల్ని అనుసరించి వివిధ రంగుల్లో లభించిందో? లేదో? మనకు తెలియదు. అప్పట్లో ఎర్రని 'అధరరాగమే' వుండేదనుకోవచ్చును. కనుక కుంజాయమ్మ కోడలు చేసిన అపరాధం ఏమీలేదు. ఆ బజార్లోని కోమటి ఆడపిల్లలలో పెదాలకు రంగు వేసుకున్న మొదటి వ్యక్తి కుంజాయమ్మ కోడలే! అందుకనే, బజార్లోని వాళ్ళందరూ ఆమెను విమర్శిస్తున్నారు!

రామూ, శ్యాముల షాపులు వున్న ఆ బజారు దాదాపుగా ఒక మైలు పొడవు వుంటుంది. ఆ చుట్టుపక్కల ఒక ఇరవై బంగళాలున్నాయి. ఈచిన్న చిన్న వ్యాపారస్థుల కుటుంబాలే కాకుండా వాళ్ళ బంగళా కాపలాదారుల కుటుంబాలూ చాలా వుంటాయి. వీళ్ళందరూ అక్కడే స్థానికంగా వుంటూ వుంటారు! వీళ్ళెవరికీ పెదాలకు రంగు వేసుకునే అలవాటు లేకపోయినా ఆ బంగళాల్లోకి వచ్చే పర్యాటకులకు పెదాలకు రంగు వేసుకోవటం అలవాటే! పర్యాటకులు పేద వాళ్ళై వుండరు కదా! ఎంత ఎండలు మండిపోయినా పేదవాళ్ళు మధుపురిలాంటి ఖరీదైన ప్రదేశంలో వుండలేరు కదా? పర్యాటకులు బాగా డబ్బున్న వాళ్ళు, ధనికులు వాళ్ళల్లో ముసలివాళ్ళు మినహా కుర్రకారంతా పెదాలకు రంగులు వేసుకుంటూ వుంటారు. డబ్బున్న సంపన్నులకు 'లిప్‌స్టిక్' వాడటం అతి సాధారణమైన విషయం!

"కలియుగం వచ్చేసింది! కలియుగం! ఇంక ముందు ఏమి అవుతుంది?" రామూ వాళ్ళ అమ్మ అన్నది.

"నిజమే. కలియుగమే వచ్చి పడింది. కుంజాయమ్మ మాత్రం ఏం చేస్తుంది? ఒకటి రెండుసార్లు కోడల్ని కోప్పడ్డది. ఐతే, కోడలు అత్తను లెక్కచేస్తుందా? ఈ కాలపు కోడళ్ళు అత్తవారింటికి రాగానే మొగుణ్ణి వల్లో వేసుకుని ఆటలు సాగించుకుంటారు! ఆమె భర్త బతికి వుంటే ఇంత అనర్థం జరిగేదా? ఇప్పుడు కొడుకూ – కోడలూ ఒకటయ్యారు. అది ఒక్కతే పెడ అయింది!"

"నీకెందుకు నువ్వు చూస్తూ వుండు? ఈ ప్రపంచంలో ఇంకెన్ని మార్పులు వస్తాయో? ఇంకెలాంటి మార్పులు వస్తాయో?"

"ఇంతకంటే ఇంకేం మార్పులు వస్తాయి? కాళ్ళకు పెట్టుకునే పారాణిని పెదాలకు పెట్టుకుంటున్నారు."

## 2

ఆ బజార్లో కోమట్ల కుటుంబాలు మొత్తం ఏడు వున్నాయి. అందరూ చిల్లరవ్యాపారం చేస్తుంటారు. ఆమొత్తం కుటుంబాలలోనూ మొదటగా పెదాలకు రంగు వేసుకుంది కుంజాయమ్మ కోడలు. ఆనాడు రామూవాళ్ల అమ్మా, శ్యామూ వాళ్ళ అమ్మ ఆమె పెదాలకు రంగు వేసుకోవటాన్ని గురించి చెప్పుకున్నారు. అలా పెదాలకు రంగు వేసుకోవటం కుంజాయమ్మ ఇంటికి పట్టుకున్న శనీశ్వరం అనుకున్నారు. ఆ శనీశ్వరమే తర్వాత అందరి కొంపల్నీ దగ్ధం చేస్తుందని అప్పట్లో వాళ్ళు వూహించలేదు. ఆ బజార్లో వున్న వైశ్య యువతులు బంగళాల్లో దిగుతున్న విలాసినులను చూస్తున్నారు. ఆవిలాసినులు పెదాలకు

రంగు వేసుకుని తమ అందాన్ని ఇనుమడింప చేసుకోవటాన్ని గమనిస్తున్నారు. కొందరు వైశ్య స్త్రీలు పక్క బంగళాల్లో దిగుతున్న విలాసయాత్రికులతో పరిచయాల్ని పెంపొందించు కుంటున్నారు. ఐనా, ఆ బంగళాలలోకి వచ్చే పర్యాటకులు కోమట్లూ, బ్రాహ్మణులేగా? దొరలూ, దొరసానులూ కారుగా? పరిచయం చేసుకోవటానికి భయపడవలసిన పనే ముంది? అలంకరణ వల్ల వాళ్ళు అప్సరసల్లా కనపడటాన్ని కళ్ళారా చూస్తున్నారు. నిద్రపోయి లేచినప్పుడు వాళ్ళముఖాలు, తమ ముఖాల లాగానే వుండేవి. కానీ ఒక అరగంట సేపు అద్దం ముందు కూర్చొని, కనుబొమ్మలను రంగు పెన్సిళ్ళలో దిద్దుకుని , కండ్లకు కాటుక పెట్టుకుని, బుగ్గలకు పౌడరు కొట్టుకుని, పెదాలకు లిప్‌స్టిక్ వేసుకునే సరికి అప్సరసల్లా వుండేవాళ్ళు! ఈ అద్భుతాన్ని చూస్తూ స్థానిక యువతులు చలించకుండా ఎలా వుండగలరు?

మధుపురి మహిళలు సంవత్సరంలో నాలుగయిదుసార్లు సినిమా చూస్తూ వుంటారు. రామూవాళ్ళ అమ్మా, శ్యామూవాళ్ళ అమ్మ లాంటి వృద్ధ మహిళలు 'తులసీదాసు', 'సీతా వనవాసం' లాంటి భక్తిరస ప్రధానమైన పౌరాణిక సినిమాలు చూస్తుంటారు. ఒకసారి వీళ్ళిద్దరూ ఒక పౌరాణిక సినిమానుచూడటానికి వెళ్ళారు. సినిమాను చూస్తూనే తన్మయులై వెనుక సీటులో కూర్చున్న వాళ్ళు అరుస్తున్న పట్టించుకోకుండా లేచి నిలబడి రెండు చేతులూ ఎత్తి తెరమీద కనిపించిన రాములవారికి నమస్కరించారు. సినిమాలు చెడ్డవని వాళ్ళు ఎప్పుడూ అనలేదు. ఇక వయసులో వున్న వాళ్ళు తమ భర్తల్తో తరుచూ సినిమాలకు వెళ్తున్నందుకు ఆశ్చర్యపడవలసిన పనిలేదు. సినిమాల వల్ల వాళ్ళకు వినోదం కలుగుతుంది. ఎన్నో విషయాలు నేర్చుకోవటం జరుగుతుంది. ముఖ్యంగా ప్రేమ గురించి ప్రేమ బీజాలు ఎలా చల్లాలి? అవి ఎలా మొలకలెత్తుతాయి. అవి మొగ్గ తొడగటానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. లాంటి విషయాలు సినిమాలను చూసి నేర్చుకోవచ్చు! భర్తల్ని ఎలా అదుపులో వుంచుకోవాలో కూడా సినిమాలు చూసి తెల్సుకోవచ్చు! వెనుకటి కాలం స్త్రీలు భర్తల్ని వశం చేసుకోవటానికి, వశీకరణ మంత్రాల్నీ, మందుల్నీ వాడుతుండేవారు. ఇప్పటికాలం వాళ్ళకు మందులపైనా, మంత్రాలపైనా పూర్తిగా నమ్మకం లేదని చెప్పలేం కానీ భర్తల్ని వశం చేసుకోవటానికి సినిమాల్లో ప్రయోగించిన వాటినే తామూ ప్రయోగించటానికి ఇష్టపడుతున్నారు. నేడు జీవితంలోని అనేక రంగాలలో సినిమాలే మార్గదర్శకాలవుతు న్నాయి. పశ్చిమ జిల్లాల్లోని స్త్రీలు లంగాలు కట్టుకునే వారు. ఆ ఆచారాన్ని పూర్తిగా మార్చివేశాయి సినిమాలు. ఇప్పటికీ, పెళ్ళికూతురుకు ప్రధానం పెట్టేటప్పుడు లంగా-ఓణీలను పంపటం ఆ జిల్లాల్లో ఆచారంగానే వుంది. అయితే, వాటిని పెట్లో దాచి పెడుతున్నారే కానీ కట్టుకోవటం లేదు. లంగాలు కట్టుకోము. మొరటు అంటున్నారు. కొత్త పెళ్ళికూతుళ్ళ విషయం పక్కన పెడితే, రామూవాళ్ళ అమ్మా, శ్యామూ వాళ్ళ అమ్మ

వీళ్ళిద్దరూ కూడా లంగాలు వేసుకోవడం లేదే? వీళ్లకూ లంగాలు మొరటయ్యాయి? ఇప్పుడు ఎలా బట్టలు కట్టుకోవాలి? ఎలా నగలు పెట్టుకోవాలి? ఎలా మాట్లాడాలి? ఎలా వుండాలి? లాంటి వన్నింటినీ సినిమాలే నేర్పుతున్నాయి. కలర్ సినిమాలు అంతగా రాకపోయినా బ్లాక్ అండ్ వైట్ సినిమాల్లో తారల పెదాలు, వాళ్ళు లిప్‌స్టిక్ వాడినట్టుగా తెలియజేస్తూనే వున్నాయి. కుంజాయమ్మ కోడలూ, ఆ బజారులోని ఇతర యువతులు సినిమాలను చూసి అలంకరణా పద్ధతుల్ని తెల్సుకుంటున్నారు. సినిమాల్లో చూపిస్తున్న ఆధునిక అలంకరణా పద్ధతుల్ని కేవలం యువతులే ముందుకు వచ్చి అలంకరించు కుంటున్నారను కోవటానికి లేదు. వాళ్ళని సినిమాలకు తీసుకువెళుతున్న యువకులు తమ భార్యలు సినిమా తారల్లా వుండాలనీ, అలాగే అలంకరించుకోవాలని కోరుతున్నారు. వేసవికాలంలో అప్పుడప్పుడూ సినిమా తారలు మధుపురికి వస్తూ వుంటారు. అసలే వేసవికాలంలో మధుపురిలో పర్యాటకులు ఎక్కువ ఇంక సినిమా తారలు వచ్చారంటే ఇక మధుపురి బజార్లల్లో ప్రేక్షకులు సముద్ర కెరటాల్లా పుట్టుకొస్తారు. ఉన్నత కుటుంబాలలోని స్త్రీలు కూడా తోపులాటను తట్టుకుంటూ ఒదిగి, ఒదిగి వెళ్ళి సినిమా తారల్ని చూసి వస్తుంటారు. కుంజాయమ్మ కోడలులాంటి స్థానిక యువతులు సినిమా తారల్ని చూడటానికి వెళ్ళలేరు. వాళ్ళ భర్తలో, మరుదులో సినిమా తారలు వచ్చారనీ, బజార్లో సందడికి అదే కారణమని వాళ్ళకు చెప్తూనే వుంటారు! వాళ్ళకూ చూడాలని వున్నా మనసులోనే అణిచేసుకుంటారు. మధుపురికి విలాస యాత్రకు వచ్చే ఉన్నత వర్గాలకు చెందిన మహిళలకూ, సినిమా తారలకూ పెద్దగా తేడా వుండదు. అందుకే దుకాణాల ముందు రిక్షాల్లోనూ, కాలినడకనో సినిమా తారలు వెళ్తున్నా స్థానిక యువతులు గమనించలేకపోతుంటారు. ఐనా సినిమా తారల్ని అనుకరించటమన్నది వాళ్ళకు అత్యవసరం. అలా అలంకరించుకోవటం వలన తాము అందంగా కనపడుతున్నామన్న సంతృప్తే కాకుండా, భర్తలు చెయ్యిదాటి పోతారన్న భయమూ వుండదు. మొన్నా మధ్య స్థానిక వైశ్య యువకుడొకడు తన భార్య ఆధునికంగా లేదని ఆమె అనాగరికానికి విసిగి మరొకామెను తీసుకుని లేచిపోయాడు. కుంజాయమ్మ కోడలు చెప్పేదాన్ని బట్టి అతని భార్య మరీ అనాకారి కూడా కాదు. అందరి లాగానే వుంటుంది. అయితే తన సౌందర్యాన్ని పెంపొందించుకోవటం తెలియదు ఆమెకు.

కుంజాయమ్మ కోడలు 'లిప్‌స్టిక్'కు చాలా ప్రచారాన్ని ఇచ్చింది. చుట్టుపక్కల కుటుంబా లలో 'లిప్‌స్టిక్' అలవాటు అతివేగంగా జరిగింది. పక్కింటామె మరదలు కుంజాయమ్మ కోడలు దగ్గర నేర్చుకుని మరీ పెదాలకు లిప్‌స్టిక్ వేసుకుంటుంది. మొదట్లో ఆ ఇంటి పెద్దకోడలు, తోడికోడలు మీద చిరబురులాడుతుండేది. కానీ, తోడికోడలు అలా అలంక

రించుకుని మహారాణిలా తయారవటం, తనేమో ఇలా వుండటం బాధాకరమనిపించిం దామెకు! అంతేకాకుండా మరదలు అలంకరించుకుని వుండటం తన భార్య అలంకరణ లేకుండా వుండటం ఆమె భర్తకు ఇబ్బందిగా వుంది. అతడు భార్య పట్ల విముఖత ప్రదర్శించడం మొదలుపెట్టాడు. దాంతో పెద్ద కోడలు తనూ పెదాలకు 'లిప్‌స్టిక్' వేసుకోవడం మొదలు పెట్టింది. కుంజాయమ్మ కోడలు ఇంటిపనంతా అంట్లు తోమటం, బట్టలు ఉతకటం, పిండి రుబ్బటం, పిల్లల చాకిరీ అన్నీ స్వయంగా చేసుకుం టుంది. బట్టలు మురికిగా వున్నా, ఇంట్లో నేల మీద చతికిల పడి కూర్చున్నా, రెండుపూటలా పెదాలకు రంగు మాత్రం వేయాల్సిందే! 'కార్యం' అయి మొదటిసారి అత్తవారింట్లో కాలుపెట్టిన క్షణాన్నుంచీ ఆమె పెదాలకు రంగు వేస్తూనే వుంది.

కొత్త విషయాలను ధైర్యంగా స్వీకరించటానికి స్త్రీలు ముందుకు వస్తారా? పురుషులు ముందుకు వస్తారా? అన్నది నిర్ణయించి చెప్పటం కష్టం. కొన్ని కొన్ని విషయాలలో పురుషుల కంటే స్త్రీలే ముందుకు వస్తుంటారు. దానికి కారణమూ వుంది. భర్తల్ని సంతృప్తి పరచటంలోనే స్త్రీల జీవనసారము,సుఖ, సఫలతలూ ఇమిడి వున్నాయి. అలాంటప్పుడు పురుషుల్ని తృప్తిపరచటం ఎలాగా అన్న సమస్య స్త్రీలను వేధిస్తూ వుంటుంది. అందుకు మార్గాల్ని వెతుకుతూ వుంటారు. స్త్రీలు తరతరాలుగా వశీకరణ మంత్రాన్ని అన్వేషిస్తున్నారన్న విషయం మనకు తెలియంది కాదు. భర్తల్ని సంతృప్తి పరచటానికి ఏ కొత్త మార్గం కనిపించినా అనుకరిస్తుంటారు స్త్రీలు. పురుషులలో కూడా స్త్రీలలా కృత్రిమ సౌందర్యం కోసం తహతహలాడేవాళ్ళు వుంటారు. స్త్రీలలా ఇతర్ల కృపాపాత్రులై, ఇతర్లను తృప్తి పరచటానికి కృత్రిమ సౌందర్య సాధనాల్ని ఆశ్రయించాల్సిన అవసరం వారికి లేదు. ఐనా మధుపురిలో కనీకనపడకుండా పెదాలకు 'లిప్‌స్టిక్' వేసుకునే యువకులూ వున్నారు.

## 3

"వాట్ నాన్సెన్స్.... ఈ చచ్చు మొఖాలకి ఏ మాత్రం తెలియదు. కళ్ళకు కాటుక అందాన్నిస్తుంది. అదే బుగ్గకు రాసుకుంటే మసి రాసినట్టు వుంటుంది. వీళ్ళకు ఇలాంటి సామాన్య విషయాలు కూడా తెలియవు."

"వాళ్ళకు తెలియకపోతే నువ్వు తెలియచెప్పాలి శైలా!" శైల తన హేండ్‌బ్యాగు తెరచి, చిన్న సీసాను బయటకు తీసి పెదాలకు లిప్‌స్టిక్ రాసుకుంటున్న శైలతో విమల అన్నది.

"మరీ అధ్వాన్నం! ఈ కోమటోళ్ళు లిప్‌స్టిక్‌ను కూడా సవాసేరు, అణా కానీ లెక్కలో చూస్తారు."

"మంచి వస్తువును అందరూ ఎక్కువగా వాడితే మంచిదే కదా! వీళ్ళు లిప్‌స్టిక్‌ను

వాడుతున్నారని నువ్వెందుకు ఈర్ష్యపడతావు? వీళ్ళు వాడకూడదని ఎక్కడైనా వున్నదా?" అన్నది విమల గంభీరంగా.

"నీకేం, నువ్వెన్ని కబుర్లయినా చెబుతావు? వియోగిని ఐన సీతలా లిప్‌స్టిక్ రాయవు. బొట్టూ, కాటుకతో కూడా నీకు పనిలేదు" అన్నది శైల.

విమల, శైలకంటే అందగత్తె. శైల అతి కష్టం మీద మెట్రిక్ పాసయింది. విమల ఎం.ఎ. పాసయింది. ఆర్థికంగా మంచి సంపన్న కుటుంబం అయినప్పటికీ తన కాళ్ళ మీద తాను నిలబడాలన్న ఉద్దేశంతో ఒక కాలేజీలో ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా పని చేస్తోంది. విమల, శైల ఇద్దరూ చిన్ననాటి స్నేహితులు. ఈ వేసవి కాలాన్ని ఆహ్లాదంగా గడపటానికి ఇద్దరూ మధుపురికి వచ్చారు. ఇద్దరికీ ఒకే బంగళాలో గదులు దొరికాయి. శైల భర్త కోటీశ్వరుడు. ఐతే, తను కోటీశ్వరుడి భార్యనన్న గర్వాన్ని మాత్రం స్నేహితురాలి ముందు ప్రదర్శింపదు. విమల కూడా తాను విద్యాధికురాలినన్న గర్వం వుండదు. అలంకరణ పట్ల విమలకు వున్న అయిష్టతను చూసి ఆమెకు ఆధునికత పట్ల ఆదరణ లేదేమో అనుకుంటాము. అది సరికాదు. ఆమె చాలా ఆధునికమైన భావాలు కలిగినది. రంగులు పూసుకుని, అలంకరించుకుని తిరగటం ఆమెకు ఇష్టం వుండదు. అలాగని అలా తిరిగే స్త్రీలను ద్వేషించదు కూడా. తరతరాలుగా స్త్రీ తన అలంకరణ ఆధారంగా "రూపాజీవ" (రూపమే జీవనాధారం– వేశ్య) జీవితాన్ని గడుపుకుంటుందన్న నగ్న సత్యం విమలకు తెలుసు. అందుకనే అలంకార ప్రియులైన స్త్రీలను ఈర్ష్యతో చూడదు! ఆడది అందంగా వుంటే భర్త బాగా చూసుకుంటాడు. ఆమె జీవితం హాయిగా గడిచిపోతుంది. స్త్రీ, పురుషుడి సంపాదన మీద ఆధారపడ్డన్ని రోజులూ, తన సౌందర్యాన్ని గురించి జాగ్రత్తలు తీసుకోక తప్పదు. శైల సినిమా తారలా కనిపించకపోతే ఎలా? అలా కనిపిస్తేనే కోటీశ్వరుడైన భర్త ఆమె మీద అనురాగాన్ని ప్రదర్శిస్తాడు. భర్త కంటికి అందంగా కనిపించినన్నాళ్ళే తనపై అతను ప్రేమను ప్రదర్శిస్తాడని, తను భర్త కంటికి అందంగా కనిపించని రోజున అతని ప్రేమకు ఏ మాత్రం గ్యారంటీ వుండదని శైలజకు తెలుసు. ఐతే, కుంజాయమ్మ కోడలు లాంటి మలినంగా వుండే బట్టలు కట్టుకుని తెలిసీ తెలియని రీతిలో ప్రదర్శించే ఆమె  పురుషుడ్ని వశపరచుకోవడానికి ఆమోఘాస్త్రముగా ప్రసిద్ధి పొందిన లిప్‌స్టిక్‌ను వాడటం – శైలం ఏ విధంగానూ సహించలేకుండా వుంది.

"ప్రతి పనికీ ఒక పద్ధతంటూ వుంటుంది. ఆ పద్ధతిని బట్టే మనిషి నాగరికుడా, అనాగరికుడా అన్నది తెలుస్తుంది." అన్నది శైల.

"నువ్వు వాడుతున్న లాంటి ఖరీదైన లిప్‌స్టిక్‌ను, ఇతర విద్యావంతులైన, నాగరికులైన పద్ధతి తెల్సిన స్త్రీలందరూ వాడగలరా? శైలా, నువ్వు తెప్పించుకునే లిప్‌స్టిక్ ఇరవై

రూపాయలు. మిగతా స్త్రీలు నీతో సమానంగా కొనగలరా? పద్ధతి తెల్సినా కొనలేరు. ఏ రూపాయి, రూపాయిన్నర ఖరీదు చేసే లిప్‌స్టిక్‌ను వాడుతుంటారు."

"నువ్వలా అంటే నేను ఒప్పుకోను, విమలా, డాక్టరు సలహా ఏంటో తెల్సా? నాసిరకం లిప్‌స్టిక్‌ను వాడితే పెదాలు పుళ్ళు పడతాయట. వాడితే ఖరీదైన లిప్‌స్టిక్‌నే వాడాలి."

"డాక్టర్లు చెప్పటానికేం చెప్తారు. ఈ డాక్టర్లు ఖరీదైన లిప్‌స్టిక్ తయారు చేసే కంపెనీలకు ఏజెంట్లేమో? అందుకే ఖరీదైన లిప్‌స్టిక్ కొనాలని చెప్తున్నారేమో? ఏమైనా గానీ, లిప్‌స్టిక్ ఈనాడు తప్పనిసరి అయింది. మరి అందరి భర్తలూ, నీ భర్తలా కోటీశ్వరులు కారు కదా? ఇరవై రూపాయల లిప్‌స్టిక్‌ను వాడటానికి.

"నీకు లిప్‌స్టిక్ అంటే ద్వేషంలాగా వుంది విమలా?"

"ద్వేషం అనేదేమీ లేదు. స్త్రీ ఆర్థికంగా తన కాళ్ళమీద తాను నిలబడే వరకూ పురుషుడి మీద ఆధారపడక తప్పదు. నిత్యావసరాలకు పురుషుడి మీద ఆధారపడినన్నాళ్ళూ ఆమె తన అందంపై ఆధారపడక తప్పదు. పరిస్థితులకు అనుగుణంగా స్త్రీలలో వస్తున్న పరిమాణాలకు ఏ ఒకస్త్రీ కారణం కాదు. ఏ ఒక్క స్త్రీ దోషి కూడా కాదు."

"ఆర్థికంగా స్వతంత్రురాలివి కావటానికి ఉద్యోగంలో చేరావా నీవు?"

"ఔను శైలా! ఆర్థికంగా స్వతంత్రంగా వుండటానికీ నేను ఉద్యోగం చేస్తున్నాను. తులసీదాసు ఏమన్నాడో తెలుసా? తులసీ కర – పర – కర ధరో, కర–తర–కర–న–ధరో" ఇంకొకరి ముందు చేయిచాపవల్సిన పరిస్థితి వచ్చాక ఇంక స్వాభిమానం ఎలా వుంటుంది? స్త్రీలందరూ స్వావలంబినులు కావాలనీ, ఇతరుల ముందు చేయి చాపవల్సిన పరిస్థితిలో వుండరాదనీ అనుకుంటాను! కానీ ఇలా అనుకోవటం తేలికే, ఆచరణే చాలాకష్టం."

"అంటే నువ్వనేది, సామ్యవాద విప్లవం రావాలంటావు?"

"సామ్యవాద విప్లవం అంటే భయపడుతున్నావా; శైలా? విప్లవం నీ భర్త ఒక్కడి కోసం రాదు. అది మహాప్రవాహంలాగా ముంచుకు వస్తుంది. సర్వాన్నీ ముంచుకు వెళ్ళిపోతుంది. అవతల ఒడ్డుకు చేరుకోగలిగిన వాళ్ళు సుఖకరమైన, సంపన్నమైన జీవితాన్ని గడుపుతారు."

"అయితే, విప్లవం తరువాత ఆ సామ్యవాద ప్రవాహంలో నేనెలా వుంటానో చెప్పు."

"ఎలా వుండేదేముంది? కుంజాయమ్మ కోడల్లా వుంటావు? ఆమె పెదాలకు లిప్‌స్టిక్ వేసుకోవటం నీకు సరిపడదుగా?"

"సరిపడదు అనకు విమలా! ప్రపంచంలోని స్త్రీ లందరూ వాడే లిప్‌స్టిక్‌లు నేనూ వాడటం నాకు ఇష్టం. అయితే, అదొక పద్ధతిగా వుండాలి కదా?"

"కానీ శైలా! నువ్వు పద్ధతి అంటున్న ఆ మూడు అక్షరాలు ఎంత ఖరీదైనవో తెలుసా?

కుంజాయమ్మ కోడలు లాంటిసాధారణ స్త్రీలు ముప్ఫై రూపాయలు పెట్టి జార్జెట్ సిల్క్ చీరల్ని ఏం కొనుక్కోగలరు? అదే ఒక్కచీర చాలదు కదా? బట్టలు మాయకుండా వుండా లంటే కనీసం నాలుగు చీరలైనా వుండాలి! అప్పటికీ ఇంటి పనిపాటలన్నీ చేసుకుంటూ వుంటే నాలుగు చీరలు నాలుగు రోజులలోనే అలుకు గుడ్డలవుతాయి. శుభ్రంగా వుండటానికి నాలుగు చీరెలు కొనుక్కోవటమే కాకుండా, ఇంటి పనిపాటలు కూడా చేయకుండా వుండాలి. అప్పుడు కదా నువ్వు చెప్పిన పద్ధతి అలవడుతుంది. పనిపాటలు మానితే ఆ కుటుంబం బతకటం ఎట్లా?"

"అలాంటప్పుడు లిప్‌స్టిక్ వేసుకోవటం ఎందుకు?" శైలా విసుక్కుంది.

విమల నవ్వుతూ "ఎందుకు? నువ్వెందుకు వేసుకుంటున్నావు? అందంగా కనపడాలన్న ఆశ అందరికీ వుంటుంది కదా?" అన్నది.

లిప్‌స్టిక్ గురించీ, స్త్రీల అలంకరణల గురించీ చాలాసార్లు శైల-విమల చర్చించుకున్నారు.

"మనం ఏ పనినీ ఎవరిచేత బలవంతంగా చేయించలేము. ఉపయోగకరమైన పనిని ప్రజలు సహజంగానే అనుకరిస్తారు.! అన్నది విమల.

"కానీ నువ్వు చెప్తున్న క్రాంతి, విప్లవం సఫలమై, సామ్యవాద సమాజం అవతరిస్తే అందరూ సమానమై పోతారుగా? అప్పుడు స్త్రీలందరూ ప్యారిస్‌లో తయారైన ఇలాంటి లిప్‌స్టిక్‌నే పెదాలకు వేసుకుంటారంటావా?" అన్నది శైల.

"నేను లిప్‌స్టిక్ మీద లెక్చర్ ఇవ్వటానికి రాలేదు. మా విప్లవం సఫలం అయితే స్త్రీ జాతి స్వతంత్రమవుతుంది. అన్ని విధాలా ఆర్థికంగా కూడా. అప్పుడు స్త్రీలకు లిప్‌స్టిక్ అవసరం అవుతుందో? లేదో? నేను చెప్పలేను. ఒకటి మాత్రం చెప్పగలను. ఇప్పుడున్నంత విపరీతంగా లిప్‌స్టిక్ అవసరం అప్పుడు వుండదు. ఒకవేళ లిప్‌స్టిక్ లేకపోయినా అది లేదని బేల కారు. అప్పటి స్త్రీలు! లిప్‌స్టిక్‌కి అప్పుడూ వుంటే సర్వసాధారణలందరి ఉపయోగానికే అందుబాటులో వుంటుంది. ఉన్నత వర్గాల స్త్రీలకు కొందరికి మాత్రమే పరిమితమై వుండదు."

"ఐతే, నేనన్నదే జరుగుతుంది. గాడిదనూ, గుర్రాన్నీ ఒక గాటికి కట్టేసినట్టు నాకు ఒక విషయం ఆశ్చర్యమనిపిస్తుంది. ఇన్ని విషయాలలో మిమ్మల్ని అనుకరిస్తున్నప్పుడూ మాలాగా తలవెంట్రుకలు కత్తిరించుకోవాలి కదా? ఆ పని ఎందుకు చేయరు వీళ్ళు?"

"నాలుగు డబ్బులు చేతిలో వుంటే నీలాగానే తలవెంట్రుకలు కత్తిరించుకుంటారు. నీకు, ఒకసారి తలవెంట్రుకలను కత్తిరించుకోవటానికి అరవై రూపాయలు ఖర్చు అవుతాయి. అంతేకాకుండా ఎంతో జాగ్రత్తగా తలవెంట్రుకలు ఎక్కడ పాడవుతాయోనని

చూసుకుంటూ వుంటావు. ఈ స్థానికులు అంత డబ్బా లేదు? అంత తీరిక మాత్రం ఎక్కడుంటుంది?

"ఐతే, ఇక మేమే ఇవన్నీ మానేస్తాం."

"నువ్వు మానాలనుకున్నా మానలేవు శైలా! ఒకవేళ మానగలిగినా, నువ్వొక్క దానివి మానినందువల్ల ప్రయోజనం ఏంటి? ఈ మధుపురిలో సాయంత్రం అయ్యేసరికి సీతాకోక చిలుకల్లా అలంకరించుకుని తిరిగే రంగుల విసనకర్రలు ఎందరో వున్నారు కదా? వాళ్ళందరూ 'లిప్‌స్టిక్'ను మానేస్తారా? వాళ్ళు మానటం అంటే తమ కాళ్ళను తాము నరుక్కోవటమే! అలాంటి పొరపాటు వాళ్ళు ఎన్నటికీ చేయరు! శైలా, నువ్వు కనుముక్కు తీరు కల దానివి. అలంకరణను మానినా, 'లిప్‌స్టిక్'ను మానినా అనాకారిగా కనిపించవు. కానీ, మన ఉన్నత వర్గాల స్త్రీలలో ఎందరో అనాకారులున్నారు? వాళ్ళందరూ అలంకరణ మానితే, లిప్‌స్టిక్‌ను మానితే దమ్మిడీకి పనికి వస్తారా? కనుక, వాళ్ళతో అలంకరణను విడిచిపెట్టమని గానీ, అలంకరణను ద్వేషించమని గానీ చెప్పటం అనవసరం. చెప్పను కూడాను!" అన్నది విమల.

"ఇది ప్రపంచం. నువ్విలాంటి వేదాంతాల్ని దంచితే మేం భరించలేం" అంది శైల.

"ఇది వేదాంతం కాదు. వేదాంతం పని ప్రజల్ని ఈ ప్రపంచ సమస్యల నుండి దూరం చేయటమే. సరే, ఆ విషయాన్ని పక్కన వుంచితే, కొత్త విషయాన్ని దేన్నీ, సమాజంలోని ప్రజలందరూ వెంటనే స్వీకరించడానికి సిద్ధంగా వుండరు. విద్యావంతులు, కొత్త విషయాల్ని ముందుగా అనుసరిస్తారు. స్వీకరిస్తారు. మరి విద్యావంతులు, దేశ, కాల పరిస్థితులను, పరివర్తనలను గమనిస్తూ వుంటారు కదా? కనుక, త్వరగా మార్పును స్వీకరిస్తారు! కానీ, నిన్ను ఒక మాట అడుగుతాను చెప్పు. ఇక్కడ మధుపురిలో వున్నావు కనుక ఇంత స్వేచ్ఛగా తిరుగుతున్నావు. ఇదే ఇంటి దగ్గర వుంటే తిరగ్గలవా?"

"లేదు విమలా! తిరగలేను. ఇంటి దగ్గర వుంటే ముసలివాళ్ళు నామీద ఊరికే అదేపనిగా గునుస్తుంటారు. ఐతే, వాళ్ళ గునుపుల్ని నేను పట్టించుకోననుకో! వాళ్ళు గునిసినందువల్ల నాకు వచ్చే నష్టమూ లేదు. సేటుగారు ఎప్పుడూ నా పక్షమే వుంటారు. ఐనా, వాళ్ళలా ఏడుస్తూ వుంటే హాయిగా తిరగనే తిరగలేం."

"ఇక్కడ చూడు ఎంత స్వేచ్ఛగా వుందో, కండ్లకు బండెడు కాటుక పెట్టుకో, అడిగే వాళ్ళు లేరు. ఎంత లిప్‌స్టిక్ రాసుకున్నా పట్టించుకునేవారు లేరు."

"నువ్వు మరీ విపరీతంగా మాట్లాడకు విమలా! కాటుక ఆశకు కళ్ళెవరు పోగొట్టుకుంటారు."

"విపరీతంగా కాటుక పూసుకునే వాళ్ళను రోజూ మనం ఎంతమందిని చూడడం

లేదు? సరేకానీ, మన స్త్రీలు పశ్చిమ దేశాల అలంకరణలనూ స్వీకరిస్తారు. ఇటు నాయనమ్మల పద్ధతినీ వదలరు! చాలా విచిత్రమైన విషయం ఇది. ఆ దేశాల స్త్రీలను అనుకరించి జుట్టు కత్తిరించుకున్నావు. 'లిప్‌స్టిక్' వేసుకున్నావు. అంతవరకూ బాగానే వుంది. కాటుక కూడా పెట్టుకుంటావేం? పశ్చిమ దేశాల్లోని స్త్రీలు కాటుక పెట్టుకుంటారా?"

"ఆ దేశాల స్త్రీలకు కాటుక గురించి తెలియదు... కాటుక పెట్టుకుంటే కళ్ళు విశాలమైనవిగా కనిపిస్తాయనటంలో సందేహం లేదు."

"ప్రతి దేశానికీ సౌందర్య నిపుణులను తయారు చేసుకునే అధికారం వుంది. కానీ నా దృష్టిలో ఇదంతా చిన్న పిల్లలు ఆడుకునే ఆటలాగా వుంది. కుంజాయమ్మ కోడలు కానీ శైలారాణి కానీ ఎవరు అలంకరించుకుంటున్నా ఇది అభినయం లాగానే నాకు అనిపిస్తుంది.

"ప్రపంచం ఒక నాటక రంగం అని పెద్దలు అన్నారు కదా! ఇక అభినయించటంలో తప్పేముంది?"

"తప్పని నేను అనటం లేదు కదా! మనం ఇలా అలంకరించుకోవటం వలన వారందరికీ వినోదమూ– ఆనందమూ కల్పించిన వాళ్ళము అవుతాము! కానీ ఈ సీజన్‌లో ఉన్నత వర్గాలకు చెందిన వాళ్ళం మధుపురిలో ఎక్కువ సంఖ్యలో వుంటాము. స్థానికులు నూటికి పదిమంది కూడా ఉండరు. సీజన్ ఉన్న వాళ్ళు ఇక్కడ ఈ విలాసనగరంలో ఓ నూతనమైన ప్రపంచమే వెల్లివిరుస్తుంది. ఢిల్లీ, బొంబాయి, కలకత్తా నగరాల్లో మన సంఖ్య నూటికి పదికి మించదు. ఇక్కడ వున్న స్థానికుల మీద సీజన్ సమయంలో ప్రవాహంలా వచ్చి పడిపోతున్నాం. దాంతో, స్థానికులు ఉక్కిరిబిక్కిరై మనని పిచ్చిగా అనుకరిస్తున్నారు. ఢిల్లీ–బొంబాయి– కలకత్తా నగరాల్లో ఇలా జరగటానికి వీలుండదు. అక్కడ మన సంఖ్య నూటికి పదే! కనుక, అక్కడి ప్రజలు మనని అనుకరించరు?"

విమల చెప్పింది అక్షరాలా నిజం. విలాస నగరాల్లో కొత్త కొత్త ఫ్యాషన్లు క్షణాల్లో ప్రచారమవుతాయి. మైదాన ప్రదేశాల్లోని నగరాలలో ఇంత త్వరగా ఏ ఫ్యాషనూ ప్రచారం కాదు. సీజన్‌లో మధుపురిలాంటి విలాసనగరాల్లో అత్యాధునికులైన సుందరాంగుల ప్రవాహం ముమ్మరం అవుతుంది. ఆ ప్రవాహంలో స్థానిక యువతులు గడ్డిపోచల్లా కొట్టుకుపోతారు!

# ఠాకుర్జీ★

## 1

**ఠా**కుర్జీకీ, విలాస నగరానికీ సంబంధం ఏంటో అర్థంకాక చాలా మంది ఆశ్చర్యపడతారు! 'మధుపురి' అంటే మధు – మద్యానికి – పురి (నిలయమైంది) అని కూడా అర్థం చెప్పుకోవచ్చు. మరి అలాంటప్పుడు మధుపురికీ, దేవుడికీ సంబంధం ఏమిటని ఆశ్చర్యం కలుగక మానదు. వేసవి కాలంలో విలాస ప్రియులు సరదాగా గడపటానికి మధుపురికి వస్తుంటారు. స్థానిక ప్రజల సంఖ్య 8వేల దాకా వుంటుంది. అదే వేసవికాలంలో మధుపురి జనాభా యాభై, అరవై వేల వరకూ పెరుగుతుంది. అంటే వేసవికాలంలో విలాసయాత్రికుల సంఖ్య దాదాపుగా యాభైవేల వరకూ వుంటుంది. స్థానిక ప్రజలకోసరం అక్కడక్కడా కొన్ని దేవాలయాలూ, మసీదులూ వున్నాయి. వేసవికాలంలో విలాసయాత్రికులుగా ఇంగ్లీషువారే ఎక్కువగా మధుపురికి వస్తుంటారు. బ్రిటిష్ ప్రభువులు మధుపురిని ఒక చిన్న ఇంగ్లాండుగా తయారుచేశారు. బ్రిటిష్ వారికి ప్రార్థనల కోసం ప్రార్థనా మందిరాలు అవసరం కదా! అందుకే మధుపురిలో అవసరానికి మించిన చర్చిలనూ, కేథిడ్రల్‌లనూ నిర్మించారు. మొదటి ప్రపంచ యుద్ధం ముగిశాక మధుపురికి ఇంగ్లీషు దొరలు రావటం తగ్గింది. ఇప్పుడు క్రైస్తవ ప్రార్థనా మందిరాలు మధుపురిలో ఒక పెద్ద సమస్యగా తయారయ్యాయి.

లక్షల రూపాయలు ఖర్చుపెట్టి కట్టించిన చర్చి భవనాల్లో సీజన్ సమయంలో ఆంగ్ల భక్తులూ – భక్తురాళ్ళు గుంపులు గుంపులుగా వస్తుండేవారు. అప్పట్లో చందాల రూపంలో చాలా డబ్బులు వచ్చేవి. ఆ చర్చీల మరమ్మత్తు సమస్యగా వుండేదే కాదు. కానీ, ఇప్పుడు ఇంగ్లీషు వాళ్ళు మధుపురికి రావటం చాలా తగ్గిపోయింది. దాంతో చర్చికి వచ్చే భక్తులూ తగ్గారు. ఇప్పుడు వస్తున్న వాళ్ళు ఒకటి రెండు చర్చిలకు సరిపడా కూడా లేరు. ఆ చర్చీలను

★ 'ఠాకూర్' అని దేవుణ్ణీ అంటారు. ముఖ్యంగా గోపాలకృష్ణుణ్ణీ 'ఠాకూర్' అంటారు. దేవాలయాన్ని 'ఠాకూర్ బాడీ' అంటారు. ॥అను॥

కట్టినవాళ్లు అవి కట్టేటప్పుడు 'ఒకప్పటికి దేవుళ్ళ సంఖ్య పెరిగి భక్తుల సంఖ్య తగ్గుతుందన్న విషయాన్ని ఊహించలేకపోయారు.

ఇంగ్లీషు వారి దేవుళ్ళకు కూడా భక్తులను దేవాలయానికి పిలవటానికి పెద్ద పెద్ద గంటలుంటాయి. నల్లవాళ్ళ దేవుళ్ళకూ గంటలుంటాయి. భక్తుల్ని పిల్చుకుంటానికి. అయితే నల్లవాళ్ళవి తెల్లవాళ్ళకు నచ్చవు. డార్జిలింగ్‌లో 'మహాకాలుడనే' దేవుడికి ఒక దేవాలయం వుండేది. అతను హిందువులకూ, బౌద్ధులకూ ఉమ్మడి దేవుడు. ఆ దేవుడు శతాబ్దాలుగా అక్కడే వున్నాడు. ఐతే, ఆ దేవుడిని అక్కడినుండి స్థానభ్రంశం చేయించి ఆ స్థానంలో సువిశాలమైన చర్చినొకదాన్ని కట్టించారు ఇంగ్లీషు వాళ్ళు. మధుపురిలో సాధ్యమయినంత వరకూ స్థానిక దేవుళ్ళను గడపదాటి బయటకు రానీయలేదు ఇంగ్లీషువారు! స్థానికులు తమ క్వార్టర్స్‌లోనో, సందు గొందుల్లోనో భయపడుతూ, భయపడుతూ దేవాలయాన్ని ఏర్పాటు చేసుకునేవాళ్ళు. ఇలాంటి స్థితిలో కూడా మధుపురిలోని ప్రతి చిన్న చిన్న రోడ్లలో హిందువులదో, ముస్లిములదో దేవాలయాలు ఏర్పాటయ్యాయంటే ప్రజలకున్న భక్తి భావన ఎలాంటిదో ఊహించవచ్చు. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసింది. ఇంగ్లీషువారు మధుపురిని వీడివెళ్ళిపోతున్నారు. అదే సమయంలో ఉన్న దేవాలయాలు చాలవన్నట్లు 'ఠాకుర్జీ' దేవాలయం ఒకటి కొత్తది వెలిసింది మధుపురిలో. ఆ దేవాలయానికి సంబంధించిన కథ ఇలా వుంది.

ఆ రోజుల్లో ఒకరాజు వుండేవాడు. అతనికో గారాల కూతురు వుండేది. ఆమెకు అత్తింటికంటే పుట్టింటి మీదనే అభిమానం ఎక్కువ వుండేది. అత్తవారింటికి వెళ్ళేటప్పుడు పుట్టింటి దాసీలను కొందరిని వెంట తీసుకు వెళ్ళింది. ఆ దాసీలను రాజస్థానీ వస్త్రధారణలోనే అంటే లంగా-ఓణీలలోనే వుంచుతుండేది. తనూ అప్పుడప్పుడు లంగా ఓణీని వేసుకునేది. మామూలుగా ఆమె జుట్టు కత్తిరించుకుని, పెదాలకు రంగు వేసుకునీ, ప్యాంట్ వేసుకునీ, ఎత్తు మడమల చెప్పులు వేసుకుని అచ్చు యూరోపియన్ వనితలాగా వుండేది! అయితే, ప్రాచీన ఆచారాలన్నా, కట్టుబాట్లన్నా చాలా అభిమానం!

'రాజకుమారికి మరొక రాజకుమారుడితో వివాహం కావటం సహజం. అలాగే అయింది. మహారాజు తన గారాల కూతురికీ, అల్లుడికీ ఒక విలువైన కానుక ఇవ్వాలనుకున్నాడు. వేసవి కాలంలో గడపటానికి మధుపురిలో ఒక బంగళాను కట్టించి ఇచ్చాడు. కూతురికి మహల్ కట్టించి ఇచ్చే విషయంలో ఆ మహారాజు షాజహాన్‌కు ప్రతిరూపమయ్యాడు. 'తన కూతురికి కట్టించే భవనం ఎలా వుండాల్నా' అని రాత్రిం బగళ్ళు విపరీతంగా ఆలోచించాడు. బంగళా చిన్నదయినా, అద్భుతంగా వుండాలన్నది ఆయన ఉద్దేశం. ఆలోచించగా ఆలోచించగా లండన్ టవర్ అతడి కళ్ళ ముందు

కనపడింది. ఇదేకాక మరికొన్ని కోటలు, నమూనాలు కూడా అతని దృష్టికి వచ్చాయి. చివరకు ఒక నిశ్చయానికి వచ్చాడు. తన కూతురికి ఒక అతి సుందరమైన చిన్న కోటలా కనిపించే బంగళాను కట్టి ఇవ్వాలనుకున్నాడు.

భవన నిర్మాణానికి అనువుగా వుండే ప్రదేశం కోసం మధుపురిలోని కొండల్లో సర్వే ప్రారంభించాడు మహారాజు. సాధారణంగా అయితే ఇంగ్లీషువారి బంగళాల సమీపంలో స్థానిక రాజుకు బంగళా కట్టుకోవటానికి స్థలం దొరకటం అసంభవం. కానీ అవి రెండవ ప్రపంచయుద్ధం జరుగుతున్న రోజులు. తెల్లదొరలు చాలామంది మధుపురి నుండి వెళ్ళి పోయారు. సీజన్ సమయంలోనూ చాలా తక్కువమంది మాత్రమే మధుపురికి వస్తున్నారు. అప్పటికి రెండు దశాబ్దాల క్రితం నుండే ఇంగ్లీషు వారి ప్రభావం భారతదేశంలో సన్నగిల్లటం ప్రారంభమయింది. ఇంగ్లీషుదొరలు భారతీయుల పట్ల తమ అభిప్రాయాల్ని మార్చుకోక పోయినా దొరల్ని దేవుళ్ళుగా కొలిచే స్వదేశ రాజుల దృష్టికోణంలో మార్పు వచ్చింది. మహారాజు నౌకర్లు మధుపురిలోని బంగళాలన్నింటినీ గాలించారు. చివరకు ఒక అత్యంత అనుకూలమైన బంగళా లభించింది. ఆ బంగళాకు ఒక పక్కన మధుపురిలో పేరెన్నికగన్న ఒక హోటలు వున్నది. మరో ప్రక్కన చర్చి వున్నది. మధుపురిలో బంగళాలను ఎత్తయిన రాతిబండల మీద కట్టుకుంటారు. మహారాజు తన కూతురికి తీసుకోదలచుకున్న బంగళా అటువంటి ప్రదేశంలోనే ఉన్నది. ఆ కొండ పైభాగంలోని నలుచదరపు ప్రదేశంలో చిన్న బంగళా అది. చుట్టుపక్కల ప్రదేశం అత్యంత రమణీయంగా వుంటుంది. ఆ బంగళాను మార్చి తన కూతురికి అవసరం అయిన మహల్‌ను చేయాలన్న నిశ్చయానికి వచ్చాడు స్వదేశీ మహారాజు.

రెండవ ప్రపంచయుద్ధం తరువాత మధుపురిలోని బంగళాలకు ధర పూర్తిగా పడిపో యింది. మహారాజు తన కూతురి కోసం చాలా ఖర్చుపెట్టి మహలును ఇవ్వాలనుకున్నాడు. మంచి మహలే వస్తుంది మధుపురిలో! కానీ, అంతమాత్రంతో తృప్తి పడలేదు మహారాజు. తన మనోఫలకం మీద చిత్రించుకున్న మహలును భూమ్మీదకు ఎలా తేగలడు?

రాజకుమారిని ఇంగ్లీషు ఆయాలు పెంచారు. వాళ్ళపెంపకంలో ఇంగ్లీషు పిల్లలాగానే పెరిగింది. ఆమె స్వేచ్ఛగా వుండేది. అంతఃపురంలోని నాలుగు గోడల మధ్య వుండటం ఆమెకు తెలియదు. రాజుల ఇళ్ళల్లో కానీ, జమీందార్ల ఇళ్ళల్లో కానీ మగ పిల్లవాడు పుట్టడంతోనే ఆంగ్ల సభ్యతను రంగరించి ఉగ్గుపాలతో పాటు పడుతున్నారు. ఆ పిల్లలు రంగు మినహా మిగతా అన్నింటిలోనూ ఆంగ్లేయులతో సమానంగా వుండేవారు. అలా పెరిగిన రాజకుమారులకు స్థానిక రాజకుమార్తెలు ఎలా నచ్చుతారు? ఎందరో రాజ కుమారులు స్థానిక రాజకుమార్తెలను తిరస్కరించి శ్వేతాంగినులను వివాహం చేసుకున్నారు.

కొందరు రాకుమారులు స్థానిక రాకుమార్తెలను వివాహమాడాక, తాము పొరబడ్డామని తెల్సుకుని ఆ రాకుమార్తెలను అంతఃపుర బందీలుగా చేసేసి, తాము మాత్రం దొరసానుల సాంగత్యాన్ని అలవరచుకున్నారు. పరిస్థితులు ఇలా తారుమారు అవటం వలన తమ కుమార్తెల విషయంలో మహారాజులు చింతాగ్రస్థులై చివరకు ఒక నిర్ణయానికి వచ్చారు. అంతఃపురంలోనే సొంతంగా దొరసానులను తయారు చేయాలనుకున్నారు.

ప్రాచీన కాలంలో మనదేశంలో ఒక ఆచారం వుండేది. ఉత్తర, పశ్చిమ దేశాలకు చెందిన అతి సాహసికులైన సామంతరాజులను తమ గుప్పెట్లో పెట్టుకోవటానికి చక్రవర్తులు సైనిక బలగాల్ని పెంపొందించుకోవటమే కాకుండా తమ కన్యల్ని ఆ సామంతులకు ఇచ్చేవారు కూడాను! చక్రవర్తుల అంతఃపురంలో రాణులు అసంఖ్యాకంగా వుండేవారు. వాళ్ల సంఖ్య ఒక్కొక్కప్పుడు పదివేల కంటే ఎక్కువ వుండేది. అసలు అంతఃపురంలో రాణులు ఎంతమంది వుండేవారో? ఊహించటం కష్టమే. ఆ రాణుల పేర్లయినా చక్రవర్తికి జ్ఞాపకం వుండేది కాదు. కొందరు రాణుల్ని చక్రవర్తి జీవితంలో ఒక్కసారైనా చూడనైనా చూడలేదు. ఐనా, సామంతులకు తమ కుమార్తెలను సర్దవలసివచ్చేసరికి కుమార్తెల సంఖ్య సరిపోయేది కాదు. అటువంటప్పుడు అందమైన ఆడ శిశువుల్ని తెచ్చి, అంతఃపురంలో పెంచి, వాళ్ళనే చక్రవర్తి కన్యలని సామంతులకు ఇచ్చేవారు. చైనాలో ఈ విధమైన నర్సరీ ఒకటి ఏర్పాటయింది వెనుకటి కాలంలో. భారతదేశంలోని రాజుల అంతఃపురాలు చైనా దేశపు అంతఃపురాలంత విశాలమైన నర్సరీలు కావు. ఐనా, ఇరవయ్యవ శతాబ్దపు ప్రథమ పాదం ముగిసేనాటికి భారతదేశపు రాజు అంతఃపురంలో రాకుమార్తెల నర్సరీలు తయారయ్యాయి.

మన కథానాయకురాలైన రాజకుమారి పై చెప్పిన వాతావరణంలోనే పెరిగింది. రాజకుమారి దొరసానైతే కాగలిగింది కానీ తన మనస్తత్వాన్ని మాత్రం మార్చుకోలేక పోయింది. మార్చుకోవల్సిన అవసరమూ లేకపోయింది. ఆమెను పెంచిన ఇంగ్లీషు ఆయాలకూ, దొరసాన్లుకూ హిందూ స్త్రీ లాగానే భగవంతుడి మీద అనన్య భక్తి శ్రద్ధలుండటాన్ని గమనించింది. ఇంగ్లీషు వాళ్ళలోనూ అనేక శాఖలున్నాయి. రోమన్ కాథలిక్‌లు తమ చర్చిల్లో బాలుడిగా వున్న క్రీస్తు,మరియమ్మల విగ్రహాలు పెట్టుకుంటారు. ఆ విగ్రహాలు చాలా అందంగా వుంటాయి. ప్రొటెస్టంట్‌లు ఆర్య సమాజికుల్లా నిరాకార భగవంతుణ్ణి ప్రార్థిస్తుంటారు. రాజకుమారి తల్లీ, అమ్మమ్మా ఇద్దరికీ భక్తి భావనలు చాలా ఎక్కువ. పూర్తిగా యూరోపియన్ పద్ధతిలో పెరిగిన రాకుమారికి భక్తి భావన తల్లి నుండి అమ్మమ్మ నుంచీ వారసత్వంగా లభించింది. ఆమె ఎప్పుడూ ప్రార్థన సమయానికి తన మహలును ఆనుకుని వున్న మందిరానికి వెళ్ళి ప్రార్థనలో పాల్గొనేది ప్రసాదాన్ని తెచ్చుకునేది.

## 2

రాజకుమారికి పెళ్ళి అయింది. పైన చెప్పినట్టుగా మహారాజుకు తన కూతురి కోసం ఒక మహలును కట్టి ఇవ్వాలన్న ఉద్దేశం కలిగింది. భక్తికి సంబంధించినంత వరకూ రాజకుమారిని అపర 'మీరా' అనవచ్చు. మీరా లాగానే ఈమె కూడా. 'నిత్ ఉఠ్ దరసన్ పాసూఁ!' అని పాడుకుంటుందో? లేదో? తెలియదు కానీ పాడటానికి అందరికీ గొంతు ఉండాలి కదా? రాజకుమారి అంతఃపురంలో ప్రసిద్ధ గాయకుల పర్యవేక్షణలోనే పుట్టి పెరిగింది. అంత మాత్రాన స్వర మాధుర్యం వుండాలని ఎక్కడ వుంది? అయినా, పాట పాడితేనే భక్తి లేకపోతే భక్తి లేనట్టా? మహారాజు భవన నమూనాను చూపించినప్పుడు రాజకుమారి పూజామందిరం లేని భవంతిలో తాను ఎప్పటికీ సుఖపడలేనన్న భావనను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మహారాజుకు తెలియపర్చింది.

అప్పుడు మహారాజు మహలు కోసం ఎంత ఆలోచించి ఒక నమూనాను చేశాడో, ప్రార్థనా మందిర నమూనాకు కూడా అంతే ఆలోచించాడు. అంతే శ్రమపడ్డాడు. ఆ మందిరము మధుపురిలో వున్న ప్రజలందరి కోసం కాదు కాబట్టి చిన్నదిగా వున్నా ఫర్వాలేదు. అయితే, అందంగా వుండాలి. షాజహాను తాజ్‌మహల్‌ను పూర్తి పాలరాయితో కట్టించాడు. మహారాజు పాలరాయితో కట్టించలేక పోయినా సిమెంట్‌తో 'ఠాకుర్‌బాడీ' కట్టించాలనుకున్నాడు. యుద్ధం రోజులవి. ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అయినా, మహారాజు ఖర్చుకు ధారాళంగా ఖర్చుపెట్టాడు. యుద్ధం ముగిశాక తమ జమీందారీకి, జాగీరీకి ముప్పు వస్తుందని ప్రభువర్గం ఎన్నడూ ఊహించలేదు. నిరంతరం తమకు ఆదాయాన్ని ఇస్తున్న జలాలు అకస్మాత్తుగా ఎండిపోతాయని అనుకోలేదు. ఇంకా మహారాజుగారి రైతులు అనేక రకాలైన అక్రమ పన్నుల్ని చెల్లిస్తూనే వున్నారు.

మహారాజు కూడా అంత ఖర్చు మనిషి కాదు. ఖర్చు మనిషే అయి వుంటే, వచ్చే ఆదాయం చాలక జాగీరును ఎప్పుడో తాకట్టుపెట్టేవాడు. అతని జాగీరు ఎప్పుడూ అప్పులపాలు కాలేదు. ఖజానాలో ధనం మూలుగుతోంది. మహారాజుకు భగవంతుని మీద భక్తి, శ్రద్ధలు ఎక్కువ. హిందూ సంస్కృతి పట్ల అతనికి ఎంత శ్రద్ధ వుంది తనలోని భక్తి శ్రద్ధలు ప్రకటితమయ్యేటట్టుగా కూతురి కోసం దేవాలయాన్ని కట్టించాలన్నది అతని దృఢసంకల్పం. అయితే, మహారాజు చివరకు ఒక నిర్ణయానికి వచ్చాడు. ఉత్తర భారతదేశంలో ఒక శతాబ్దం క్రితం నుండి కేవలం శిఖరంతో సాదాగా మందిరాన్ని నిర్మించటం ఆచారంగా వుంది. తన కూతురికీ అలాంటి సాదా అయిన గోపురంతో దేవాలయాన్ని కట్టించాలనుకున్నాడు మహారాజు. కూతురి భవంతికి ఎదురుగా వుండేటట్లుగా ఆ దేవాలయాన్ని కట్టించాడు.

ఈ దేవాలయంలోకి వెళ్ళిన వారు ఇంతటి సుందరమైన, రమణీయమైన ప్రదేశం మధుపురిలో మరెక్కడా లేదంటారు. ఆ దేవాలయ ప్రాంగణంలో నుంచుంటే తూర్పు నుంచీ పశ్చిమానికి సుదూర దూరాల వరకూ బారులు తీరిన హిమశిఖరాలు కనిపిస్తాయి. పచ్చని చెట్లతో వంకర, టింకరగా వ్యాపించి వున్న మధుపురి కోటలు కళ్ళకు ఎంతో ఆహ్లాదాన్నిస్తాయి. ఎత్తు పల్లాలతో సుందరంగా వుండే లోయలు, పర్వతాలూ సువిశాలమైన పటలం మీద చిత్రించిన చిత్రాల్లా మనోజ్ఞంగా కనిపిస్తుంటాయి. ఇన్ని ప్రత్యేకతలతో పాటు మరో ప్రత్యేకత కూడా వుంది. అదేమిటంటే మధుపురి ప్రధాన మార్గానికి అతి దగ్గరలో వుంది ఆ దేవాలయం. దేవాలయానికి అతి సమీపంలోనే బజారు వుంది. బజార్లో ఏ క్షణాన్నయినా రిక్షాలు దొరుకుతాయి. విలాస ప్రియులు గుంపులుగా తిరుగుతూ వుంటారు. అసలు విషయమేమిటంటే, ఆ దేవాలయమూ, భవనమూ, అటు ఏకాంతంలోనూ ఇటు సందడితోనూ వున్నాయి.

యుద్ధకాలంలో రైళ్ళు సైనికుల తోటీ, సైనిక సామాగ్రితోటీ నిండి వుంటున్నాయి. కార్ఖానాలకు బొగ్గు సరిగ్గా సప్లయి కావడం లేదు. బొగ్గు దొరక్కపోవడం వల్ల కట్టెలకు, చెక్కలకు, గిరాకీ వచ్చింది. మామిడి తోటలు వున్నవాళ్ళు, వాటిని నరికించేసి ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. అలాంటి స్థితిలో మధుపురిలాంటి పర్వత ప్రాంతానికి భవన నిర్మాణానికి అవసరం అయిన సామాగ్రిని పంపటం తేలికైన పని కాదు. అయితే మనకు సామెత వుండనే వుంది కదా. "ద్రవ్యేణ సర్వేవశాః" ద్రవ్యం వుంటే, అన్నీ సాధ్యమవుతాయి. బంగారం, ఉక్కును మెత్తపరుస్తుంటారు. నిజమే మరి బంగారం వుండాలే కానీ కొండల్ని బండల్ని ఛేదించైనా కలపను మధుపురికి చేర్చవచ్చు. అటు ప్రపంచ అదృష్టాన్ని అటో ఇటో తేల్చేయాలన్న దృఢ సంకల్పంతో యుద్ధం తీవ్రంగా సాగుతోంది. ఇటు రాజకుమారి భవనానికి పునాదులు పడి గోడలు లేస్తున్నాయి. రాజావారి పనివాళ్ళు పనిలో పూర్తిగా నిమగ్నమైపోయారు. కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు ఎంతో జాగ్రత్త తీసుకుంటున్నారు. తమకు ఇచ్చిన నమూనాకు ఏ మాత్రం తేడా రాకుండా పూర్తి జాగరూకతతో వున్నారు.

రాజకుమారి నిద్రించే గదికి ఎదురుగా మందిర నిర్మాణం జరిగింది. ఆమె ఉదయాన్నే మంచం మీద పడుకునే కళ్ళు తెరవగానే దేవాలయ దర్శన భాగ్యం లభించేటట్టుగా నిర్మించారు. అయితే, అలా దర్శనం చేసుకోవాలంటే దేవాలయం వైపు కాళ్ళు జాపి పడుకోవాల్సి వుంటుంది. కానీ ధర్మపరాయణ, ఆధునిక మీరా అయిన రాజకుమారి అలాంటి అనాచారాన్ని చేయగలదా? యూరోపియన్ దుస్తులు ధరించి, తల వెంట్రుకల్ని కత్తిరించుకున్నప్పటికీ భక్తికి సంబంధించినంత వరకు రాజకుమారి మీరాకు ఏ విధంగానూ తీసిపోదు! కనుకామె పడుకునేటప్పుడు దేవాలయం వైపు తలపెట్టి

పడుకునేదని, నిద్రలేచాక దేవాలయం వైపు తిరిగి గోపురాన్ని దర్శించేదని అనుకోవాలి. దేవాలయ ద్వారాన్నీ, రాజకుమారి నిద్రించే గదికి కిటికీని పెట్టేటప్పుడు ఒక విషయాన్ని ప్రత్యేకం దృష్టిలో వుంచుకున్నారు. రాజకుమారి శయన మందిరంలో నుండి పూర్తిగా బయటకు రాకుండానే కిటికీలో నుండి చూసి ఠాకుర్జీకి నమస్కారం పెట్టుకునే సౌకర్యాన్ని కల్పించారు. మధుపురిలో వర్షాకాలంలో వర్షాలు చాలా ఎక్కువగా పడతాయి. అందువలన అన్ని కాలాల్లోనూ భవనం నుండి దేవాలయానికి వెళ్ళటానికి వీలుండదు.

భవన నిర్మాణానికి ముందు గోడలు, గోపురాలు తయారయ్యాయి. తరువాత శయన మందిరాలూ, స్నానాగారాలూ, భోజనశాలలు, విశ్రాంతి గృహాలు నిర్మించటం జరిగింది. చూస్తుండగానే భవన నిర్మాణం పూర్తయింది. కాంట్రాక్టర్ల ద్వారా కట్టించిన భవనాలు పైన పటారం లోన లొటారంగా వుంటాయన్న విషయం అందరికీ తెలిసిందే! భవన నిర్మాణంలో కాంట్రాక్టర్లు సిమెంటును మిగుల్చుకోవటం, ఇసుకను మట్టిని ఎక్కువగా వాడటం చేస్తుంటారు! లోపల ఎలా వున్నా ఫర్వాలేదు. పైకి అందంగా, దృఢంగా వున్నట్టు కనపడితే చాలు. అన్న ఉద్దేశంలో వుంటారు కాంట్రాక్టర్లు. అలా వుంటేనే తమకు ముట్టే డబ్బుల్లో మూడింట ఒక వంతయినా జేబులో పడదు. ఆధునిక మీరా అయిన రాజకుమారి భవంతిపైకి మాత్రం అందంగానూ, దృఢంగానూ కనపడుతుంది మరి లోపలి విషయం ఎదురుగా వున్న భగవంతుడికే తెలియాలి!

దూరం నుండి చూస్తే దేవాలయం అతి సాధారణంగా వుంటుంది. తెల్లని సున్నం మట్టి వుంటుంది. ఏ ప్రత్యేకతా లేని అతి సామాన్యమైన గోపురం. ఆ గోపురంపైన బంగారు చక్రం. పాలరాతితో కట్టినా ఆ మందిర సౌందర్యం ఇంతకంటే అధికంగా అయితే వుండేది కాదు. ఆలయ నిర్మాణం చేసిన వాళ్ళ ఊహల్లో ఎంత సౌందర్యం వున్నదో అదే ఆలయంలో కనిపిస్తుంది. మధుపురిలోని సాధారణ భవనాల్లోనే కరెంటు వున్నప్పుడు రాజకుమారి కోసం కట్టిన దేవాలయంలో కరెంటు లైట్లు వుండవా? దేవాలయానికి నాలుగు వైపులా, కాంతివంతమైన బల్బుల్ని అమర్చారు. రాత్రిపూట వాటి వెలుగులో శంఖంలా మెరిసిపోతున్న దేవాలయం, అలకాపురిలోని భవ్య గోపురాలను గుర్తుకు తెస్తుంది. ఇంత ఆడంబరంగా దేవాలయం నిర్మాణం జరిగేటప్పుడు మహారాజుగారి ఆర్థిక పరిస్థితి బాగానే వున్నది. భవిష్యత్తులో జమీందారీ పోతుందనీ, ఠాకూర్జీకి నిత్య నైవేద్యానికి కూడా డబ్బులు వుండవనీ ఎవరనుకున్నారు?

వెనుకటి 'మీరా' గిరిధర గోపాలుణ్ణి ఉపాసించటానికి చాలా కష్టాలు పడింది. ఆమెకు విషాన్ని తాగవలసివచ్చింది. అలా కష్టాలు పడిందని అందరికీ తెల్సు. అయితే, ఈనాటి ఈ ఆధునిక మీరా కూడా ఠాకుర్జీని ఉపాసించడానికి అంతే కష్టాలు పడిందని

అనుకోవటానికి లేదు. రాజకుమారి భర్త ఆధునిక యువకుడు అతని విద్యాభ్యాసం యూరోప్ వాసుల పద్ధతిలో సాగింది. అయితే, ప్రాచీనతను ఉపాసించే స్వభావం అన్ని దేశాల సామంతరాజుల పుత్రులలో వున్నట్టుగానే ఆ స్వభావం ఇతనిలోనూ వున్నది. తన 'మీరా'లాగా భక్తిలో లీనం కాలేకపోయినా భార్య భక్తికి అడ్డు తగిలే వాడు కాదు. లక్ష్మీపుత్రుడైన తండ్రికి గారాబాల పట్టి తన భార్య. ఆమెను గౌరవించటం తన ప్రధాన కర్తవ్యమని భావించేవాడు. మహలూ, దేవాలయమూ కట్టించిన అర్ధ శతాబ్దం తరువాత కూడా వాటి కొత్తదనం పోకుండా చూసుకునే వారు. అప్పుడే కట్టించిన వాటి లాగా వుండేవి.

ఠాకూర్‌జీకి రెండు పూటలా నైవేద్యం పెట్టేవారు. గంట కొట్టేవారు. ఒక పూజారి సంవత్సరం పొడవునా వుండేవాడు. ఒక కాపలా జవాను, ఒక మాలి కూడా వుండేవాడు. మధుపురిలో మే పదిహేను నుండి జూన్ చివరి వరకు పర్యాటకులు చాలా ఎక్కువగా వుంటారు. ఐతే, వాళ్ళందరినీ భక్త సమూహాలు అని అనుకోవటానికి వీల్లేదు. జూన్ తరువాత సెప్టెంబర్ వరకూ యాత్రికులు తక్కువగా వస్తుంటారు. ఈనాటి 'మీరా' చలి బాగా పెరిగే వరకు అంటే అక్టోబర్ వరకూ మధుపురిలోనే వుంటుంది. ఆమె మధుపురిలో అక్టోబర్ దాకా వుండటం వల్ల ఠాకూర్జీకి కొంత ప్రయోజనం వుంది. కృష్ణాష్టమీ, దీపావళి లాంటి పండుగలకు దేవాలయాన్ని అలంకరించటం జరిగేది. కరెంటు బల్బుల తోరణాలతో తెల్లనికాంతితో దేవాలయం మెరిసిపోతూ వుంటుంది.

దేవాలయం ప్రధాన మార్గం నుండి రెండు వందల గజాల ఎగువన వుంది. కనుక భక్తి శ్రద్ధలు ఎంత వున్నా రెండు వందల గజాలూ ఎక్కలేక దూరాన్నుంచే దణ్ణం పెడుతూంటారు భక్తులు. ఎత్తు ఎక్కి అక్కడికి వెళ్ళినా కొన్ని అభ్యంతరాలు వున్నాయి. 'ఆధునిక మీరా' అంతఃపురాల్లో వుండే 'అసూర్యపశ్య' కాదు. షర్టూ, ప్యాంటూ వేసుకునే క్రాఫు చేయించుకుని బజార్లలో తిరుగుతున్న ఆమెను ఎవరైనా చూడవచ్చును. తృతీయ శ్రేణి, సినిమా తారలాగానో, సీజన్ రోజుల్లో మధుపురి బజార్లలో తిరుగుతుంటే 'సొసైటీ గర్ల్' లాగానే వుంటుంది ఆమె. అయితే, దేవాలయానికి వెళ్లేటప్పుడు మాత్రం అంతఃపురాంగిని లాగా వుంటుంది.

ఠాకూర్జీ, మీరాకు మాత్రమే పరిమితమైన దేవుడు! అలాంటప్పుడు ఠాకూర్జీ దేవాలయంలోకి దారిన పోయే ప్రతివాడూ ఎలా వెళ్ళగలడు? ముందు మహలులోకి వెళ్ళటానికి అనుమతి తీసుకోవాలి. అనుమతి తీసుకున్న దేవాలయంలోకి వెళ్ళడాన్ని గురించి ఆలోచించాలి. ఇలాంటి అనుమతులు, అభ్యంతరాలు వుంటే ఎందరో భక్తుల్లోని భక్తి శ్రద్ధలు ఎండుకు పోతాయి. చలికాలంలో మహలు నిర్మానుష్యంగా అవుతుంది. ఒక

కాపలా అతను, ఒక పూజారి మాత్రమే వుంటారు. అప్పుడిక ప్రత్యేకం అనుమతి తీసుకోవాల్సిన పని వుండదు. పగటి పూట పెద్ద పెద్ద నల్లని రెండు కుక్కలు తిరుగుతూ వుంటాయి. మహల్ ఆవరణలో! భగవంతుడి మీద ఎంత భక్తి వుంటే మాత్రం ఆ కుక్కల చేత వళ్ళు చీరించుకోవటానికి ఎవరు మాత్రం సిద్ధపడతారు?

ఎముకలు కొరికే చలిలో, బజార్లలో గడిపే ప్రజలకు ఎదురుగా కొండమీద దేవాలయం కనిపిస్తూ వుంటుంది. ఆకాశం మేఘాలతో కూడుకొని వుండి, గాఢనీల వర్ణంలో వున్నప్పుడు, అనంతనీలి ఆకాశంలో నుండి ఉద్భవిస్తూండే తెల్లని దేవాలయ శిఖరం చూడముచ్చటగా వుంటుంది. మొత్తం మధుపురిలోకి ఇలాంటి భవనం ఇదొక్కటే కావటం వల్ల విలాసయాత్రికుల దృష్టిని ఇట్టే ఆకర్షిస్తుంది. ఇందులో సందేహం అవుసరం లేదు. సాధారణంగా యాత్రికులు మధుపురిలోని సమతల ప్రదేశాల్లోనే విహరించటానికి ఇష్టపడతారు. కొందరు సాహసికులైన యాత్రికులు రిక్షాస్టాండుకు వచ్చి తల పైకి ఎత్తగానే రెండు మూడు వందల గజాల ఎత్తున కనిపిస్తున్న భవంతినీ, దేవాలయాన్నీ చూసి అటు వెళ్ళటానికి సిద్ధపడతారు. అయితే, నాలుగడుగుల పైకి రాగానే రెండు నల్లని కుక్కలు దర్శనమిస్తాయి. లేకపోతే 'ఆగండి' అనుమతి లేకుండా ముందుకు వెళ్లకండి! అంటాడు కాపలా అతను. దాంతో వీళ్ళ ఉత్సాహం నీరుగారిపోతుంది.

అమ్మమ్మలూ, నాయనమ్మలూ కథలు చెప్పేటప్పుడు 'అనగా.... అనగా ఒక రాజు... ఆ రాజుగారి ఖజానాకు సహస్ర శిరస్సులు గల ఆదిశేషుడు కాపలా కాస్తున్నాడు' అని ప్రారంభిస్తుంటారు. అలాగే రాజుగారి ఈ ఖజానాకు కాపలా కాయటానికి నల్ల కుక్కలు, చౌకీదారులూ తాచుపాముల్లా తయారయ్యారు. భవంతి, దేవాలయాలూ, యాత్రికులకు పనికిరాని వయ్యాయి. అందుకు మీరాను నిందించటానికి వీల్లేదు. భవన ప్రాంగణంలో పూల తోట వుంది. మనదేశంలోని అధిక సంఖ్యాకులు తమ నాగరిక బాధ్యతలను సరిగా నిర్వహించటానికి సిద్ధపడరు! పూలు కోసుకోవటం, మొక్కల్ని విరచటం, ఎవరూ చూడకుండా వుంటే తెల్లని దేవాలయ గోడలమీద బొగ్గుతో తమ పేరు వ్రాయటం లాంటివి చేస్తుంటారు. బొగ్గుతో తమ పేర్లను రాసి ఆ విధంగా తమ పేర్లను శాశ్వతంగా చేసుకోదలిచారు. అలాంటప్పుడు అనుమతి లేకుండా పైకి వెళ్ళరాదన్న నిషేధాన్ని ప్రకటించడంలో తప్పు లేదు! ఉదయం, సాయంత్రం ఠాకూర్జీకి హారతులిచ్చే సమయంలో ఈ నిషేధాజ్ఞల్ని తొలగించి భక్తులందరికీ దేవాలయాలలోకి ప్రవేశానికి అవకాశాన్ని కల్పిస్తే బాగుంటుంది. అయితే, మధుపురిలాంటివి విలాస యాత్రికుల కోసం ఉద్దేశింప బడిందే కానీ భక్త యాత్రికుల కోసం కాదు.

# 3

మధుపురిలో ఏకాంతవాసం చేస్తున్న 'ఠాకుర్జీ' ఒకానొక తండ్రీ కూతుళ్ళ భక్తి భావనకూ, సహృదయతకూ చిహ్నం! మహారాజు హృదయంలోనూ, రాజకుమారి హృదయంలోనూ ఈ ఠాకూర్జీ పట్ల ఎంతో శ్రద్ధా భక్తీ వుంది. భక్తికి ప్రతీకలైనవి ఉన్నత స్థితిలో వుంటాయి. కానీ కాలం ఎంతటి దౌష్ట్యమైనదో? కదా? ఇంత శ్రద్ధతో ప్రతిష్ఠించిన ఠాకూర్జీకి ఏకాంతవాసాన్ని కల్పించింది! అక్కడ ప్రతిష్టించేటప్పుడు తనకు భవిష్యత్తులో తనకీ స్థానంలో పాలలో పడ్డ ఈగ కంటే ఎక్కువ శ్రద్ధ లభించదని, ఠాకుర్జీ కూడా ఆలోచించి వుండడు. ఒకప్పుడు భక్తిశ్రద్ధలకు చిహ్నమైన ఠాకూర్జీ ఇప్పుడు మహారాజు మూర్ఖత్వానికి చిహ్నం అయ్యాడు. ఇంతకూ అసలు విషయం ఏమిటంటే 'ఠాకూర్జీ' మిగిలిన దేవుళ్ళందరిలోకీ ప్రత్యేకమైన హోదా కలవాడు. ఏ కొండరాయినో శివలింగంగా మలచితే, ఆ శివలింగానికి ఆకాశంనుండి పడే వర్షపు ధారలే చాలు. ఏ ధూపదీప నైవేద్యాలతోటి పని లేదు! మరి ఠాకూర్జీ అలాంటి దేవుడు కాదు. ప్రతిరోజూ ధూపం, దీపం, నైవేద్యం అన్నీ సక్రమంగా జరగాల్సిందే!

అవును! ఇది ఠాకూర్ బాడీ! తన లక్ష్మితో సహా ఠాకూర్జీ మందిరంలో విరాజిల్లు తున్నాడు. వాళ్ళకు కట్టుకోవటానికి బట్టలు కావాలి. నగలూ కావాలి. కొద్దో గొప్పో నగలను భక్తులెవరైనా ఠాకూర్జీకి ధరింప చేద్దామనుకున్నా ప్రయోజనం లేదు. చలికాలం 'ఠాకూర్జీ' దగ్గర నగలు వుంచడమంటే కాపలాదారుకు, పూజారికి ప్రాణాలపై ఆశ వదులు కోవలసి వస్తుంది. నైవేద్యానికి పిండివంటలు వండాలి. గంట కొట్టటానికి, శంఖువు వూదటానికి మరికొందరు దాసదాసీ జనాలుండాలి! ఇదంతా ఖర్చుతో కూడిన పని. దేవాలయాన్ని బాగుచేయడానికీ, పండుగలకు అయ్యే ఖర్చులు అన్నీ కలుపుకుంటే మూడు నాలుగు వేల రూపాయలు కావాలి!

సంస్థానాలు, జమీందారీలు ముగిసిపోయాయి. ఇంక రాజులకూ, జమీందార్లకూ తమ దేహానికి పట్టిన కొవ్వును కరగించుకుంటూ జీవన యాత్రను కొనసాగించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అటువంటప్పుడు ఈ దేవాలయం మెడకో గుదిబండగా మారటానికి ఎంతో కాలం పట్టదు.

పూజారి సంవత్సరమంతా అక్కడే వుంటాడు. అయితే, దేవాలయం గంట మోగని రోజుల్లో 'ఆధునిక మీరా' లేదని మనం ఊహించుకోవాలి! 'మీరా'లేని రోజుల్లో పూజారి రోజూ మామూలుగా ఇచ్చే హారతిని కూడా ఇవ్వడు. ఒకవేళ ఇచ్చినా దీపారాధనలో నెయ్యికి బదులు డాల్డా వాడతాడు. ఈ రకంగా చలికాలం ఆరు నెలలూ తపస్సు చేసుకోమని శూన్యంలో వదిలిపెడతారు. అలాంటప్పుడు అటువంటి భక్తుల్ని ఠాకూర్జీ ఏం ఆశీర్వది

స్తాడు? చలికాలంలో ఠాకూర్జీ దేవాలయంవైపు చూస్తే, ఎవరికైనా జాలి వేస్తుంది. అనంతమైన శూన్యం. అనంతమైన ఉదాసీనత. ఠాకూర్జీ చేసేది లేక మౌనంగా వుండిపోతాడు.

ఇప్పుడే ఇలా ఠాకూర్జీని చూసేవాళ్ళు లేకపోతే వంద సంవత్సరాల తరువాత పరిస్థితి ఎలా వుంటుందో? ఊహించండి. క్రి.శ. 2053లో ఈ భవంతి, ఈ దేవాలయము ఏ స్థితిలో వుంటాయి? ఈనాటి ఈ నవయువతి ఆధునిక మీరా అప్పుడు వుండదు. ఈమె తర్వాత మూడో తరమో, నాలుగోతరమో వుంటుందప్పుడు. ఈమె తాలూకు ఐదవ తరం వాళ్ళకు అనంతమైన ప్రజాసముద్రంలో నీటిచుక్కల్లా లీనమైపోతారు. అప్పుడు వాళ్ళకు తాము మహారాజు వంశజులమన్న అస్పష్టమైన జ్ఞాపకం వుంటుందేమో? అదీ అనుమానమే. ఆ సంతతికి ఠాకూర్జీ దేవాలయం ఒకటి కట్టించటం జరిగిందనీ, ఆ దేవాలయాన్ని ఆనుకుని వున్న భవంతిలో 'ఆధునిక మీరా' వుండేదని తెలియటం కూడా కష్టమే. అసలు తెలియకపోయినా ఆశ్చర్యపడవలసిన పనిలేదు.

హిందూ దేవాలయాలు కానీ, చర్చీలు, మసీదులూ కానీ కేవలం పూజార్చనల కోసమే నిర్మించటం జరగదు. వాటిని కట్టించిన దాతలు ఆ నిర్మాణాల రూపంలో తమ అహంకారాన్ని చిరస్థాయి చేసుకోవటానికి ప్రయత్నిస్తారు. ఇలాంటి నిర్మాణాల వలన తమ పేరు ఎప్పటికీ నిలిచివుంటుందని వాళ్ళు అనుకుంటారు. పర్వతాల్ని తొలిచి శాశ్వతంగా నిలిచి వుండేటట్లు గుహా ప్రాసాదాల్ని కట్టిన వాళ్ళ పేర్లు ఈ రోజున మనకు తెలియవు. కొండల్ని తొలిచి అజంతా, ఎల్లోరా, లాంటి సుందర మందిరాల్ని కట్టిన వారి పేర్లు మనకు తెలియవు. అలాంటప్పుడు మధుపురిలో ఈ మధ్యన నిర్మించిన ఠాకూర్జీ దేవాలయం స్థితి ఏమిటి? ఇది వంద సంవత్సరాల పాటు పడిపోకుండా వుంటుందా? ఇంక దీన్ని నిర్మించిన దాతకు అమరకీర్తి ఎలా లభిస్తుంది?

ఈ దేవాలయంలో కళాత్మకమైన ప్రత్యేకతలు ఏమీ లేవు. అలాంటి కళాత్మక ప్రత్యేకతలు వుంటే వంద సంవత్సరాల తరువాత వచ్చే ప్రభుత్వం, ఆ ప్రత్యేకతల్ని కాపాడుకోవటం కోసమైనా ఈ దేవాలయ సంరక్షణ బాధ్యతల్ని తీసుకుంటుందని ఆశించవచ్చు. దేవాలయంలోని విగ్రహాలు మొద్దుగా, మొరటుగా వున్నాయి. దేవాలయము కూడా ఆకర్షణీయంగా లేదు. ఆ విగ్రహాలు ఏదైనా మ్యూజియంలో పెట్టటానికి కూడా పనికి రావు. ఆలయ నిర్మాణానికి ఉపయోగించిన రాయి – కలప ఎవరికైనా ఉపయోగ పడవచ్చు. వంద సంవత్సరాల తరువాత ప్రజలు రాయి– కలపను తమ సొంత ఉపయోగాలకు ఎత్తుకు వెళితే ఠాకూర్జీ జన్మ ఖైదు నుండి తప్పించుకుని, విశాల ప్రపంచాన్ని చూడగలుగుతాడు.

ఇక భవంతి. భవంతి భవిష్యత్తు మధుపురి మీద ఆధారపడి వుంటుంది. దేశంలో

నానాటికీ దరిద్రం పెరిగిపోతోంది. ఆ కారణంగా మధుపురి రోజురోజుకూ ఎండిపోతూ, రక్తమాంస లేకుండా అవుతున్నది. వేలకు వేలు ఖర్చుపెట్టి కట్టించిన భవనాలన్నీ నిర్మానుష్యంగా పడివున్నాయి. కొన్ని భవనాలలో ఫర్నీచర్, మరికొన్ని భవనాలలో కిటికీలు, దర్వాజాలూ పీక్కుపోయారు. కొన్నింటికి పై కప్పుగా వేసిన రేకుల్ని ద్రౌపదికి చీరలు వలిచినట్టు ఎత్తుకుపోతున్నారు. అందమైన బంగళాలు ఎన్నో అదృశ్యమయ్యాయి. కేవలం వాటి తాలూకు గోడలు మాత్రం మిగిలి వున్నాయి.

వంద సంవత్సరాల తరువాత భారతదేశం ఇలా వుండదని అనుకుందాం. అప్పుడు భారతదేశం ధన ధాన్యా సంపదల్తో తులతూగుతూ వుంటుంది. అప్పటి ప్రజలు మధుపురిని మరికొంచెం విశాల నగరంగా మార్చుకుంటారు. సుందరంగా తయారు చేసుకుంటారు. ప్రజలు, విలాసయాత్రలకు ఇప్పటికంటే అధికంగా అప్పుడు మధుపురికి వస్తుంటారు. ఇప్పటికంటే ఉన్నతంగా ఉపయోగంలో పెట్టుకుంటారు. అయితే, ఒక విషయం మాత్రం గట్టిగా చెప్పగలను. 'నిత్-ఉఠ్-దరశన-పాఁవూఁ! (నిత్యం వుదయాన్నే లేచి దర్శనం చేసుకుంటాను) అని పాడుతూ, ఠాకూర్జీకి నమస్కరించే మరో మూడవ మీరా మాత్రం ఆనాడు వుండదు గాక వుండదు!

# రాయ్‌బహద్దూర్

## 1

**కొ**న్ని సంవత్సరాల క్రితం వరకూ 'రాయ్‌బహద్దూర్' అన్న బిరుదుకు ఎటువంటి డిమాండ్ ఉండేదో. రాయ్‌బహద్దూర్ కాకపోయినా రాయ్‌సాహెబ్ అన్న బిరుదు దొరికినా చాలు తమను తాము కృతకృత్యులమనుకునేవారు. ఆ బిరుదు పొందగలిగితే తమ జీవితం సార్థకం అయినట్టు అనుకునేవారు. తమ పూర్వజన్మ సుకృతం వల్లనే ఇంత గొప్ప బిరుదు తమకు లభించిందనుకునే వారు. ప్రత్యేకమైన కొన్ని సంకేతాలద్వారా ఇంగ్లీషు వారు మన దేశీయుల హృదయాల్లో ఎంత గొప్ప స్థానాన్ని పొందారో చెప్పలేను. ఆర్.వీ (రాయ్ బహద్దూర్) సీ.ఐ.ఇ., సర్. కె.సి.ఐ, లాంటి అక్షరాలను మన దేశవాసులకు ఇచ్చి, మన వాళ్ళ హృదయాలలో మోహజ్వాలల్ని రేపారు. పై అక్షరాలు కొందరికి గౌరవాన్ని తెచ్చి పెడతాయేమో కానీ చాలా మందికి మాత్రం లేనిపోని ఖర్చును నెత్తిన పడేసేటట్టుగా మాత్రమే తయారయ్యాయి. మెజిస్ట్రేట్ మొదలు జిల్లా కలెక్టర్ వరకూ ఎవరికి ఏ విషయంలో చందా అవసరమైనా పై బిరుద నామాల్ని ధరించిన పెద్ద మనుషులకు చెప్తారు. ఈ పెద్ద మనుషులు వాళ్ళ ఆజ్ఞల్ని శిరసావహిస్తారు. వహించక తప్పదు. కానీ వ్యాపారస్థులకు పై బిరుదులు అద్భుత ఫలితాలనిచ్చాయి. వారికి లక్షలు సంపాయించి పెడ్తాయంటే అతిశయోక్తి కాదు. ఏదైనా వృత్తికి సంబంధించిన వారు 'రాయ్‌బహద్దూర్' 'రాయ్ సాహెబ్'లు అయ్యారంటే వాళ్ళరొట్టె విరిగి నేతిలో పడ్డట్టే. మొదటిది బజార్లో పలుకుబడి పెరుగుతుంది. రెండవది ప్రభుత్వ కంట్రాక్టులు అన్నీ వాళ్ళకే వస్తాయి. ఇంక వేలు లక్షలూ, లక్షలు కోట్లూ కావడం ఎంతసేపు? లాలా దయాచంద్‌కు 'రాయ్‌బహద్దూర్' బిరుదు లభించింది. ఆ బిరుదు అతనితో డబ్బు ఖర్చు పెట్టించలేదు. లక్షల రూపాయలు ఆర్జించి పెట్టింది. అతనిని ధనికుణ్ణి చేసింది. దయాచంద్ మొదట చెట్టుకింద ప్లీడరు. సాధారణమైన వకీలు. తరువాత ఇంగ్లీషు వారికి కృపాపాత్రుడయ్యాడు. వకాలత్‌ను వదిలి వ్యాపారాన్ని

ప్రారంభించాడు. వ్యాపారంలో 'రాయ్‌బహద్దూర్' పట్టిందల్లా బంగారమయ్యింది. అపజయం కానీ, వెనుకడుగు వేయటం కానీ అతనికి తెలియదు. తన సఫలతకు కారణం భగవంతుని దయ అంటాడు. నిజం చెప్పాలంటే, అతని సాఫల్యానికి కారణం భగవంతుడి దయకాదు. అతని పట్టుదల, కార్యదక్షతలే కారణాలు. సమయానుకూలంగా వెళ్ళటం ప్రధాన కారణం.

సాధారణంగా పెద్ద పెద్ద జమీందార్లకు ఇంగ్లీషువారు 'రాయ్‌బహద్దూర్' బిరుదును ఇస్తుండేవారు. ఒక్కోసారి ప్రసిద్ధులైన వకీళ్ళకూ ఈ బిరుదును ఇస్తుండేవారు. ముఖ్యంగా ఆ వకీలును గుప్పెట్లో పెట్టుకోవటం అవుసరం. లాభదాయకం అనుకున్నప్పుడు ఇంగ్లీషువారు తప్పకుండా అతనికి 'రాయ్‌బహద్దూర్' బిరుదునిచ్చేవారు.

దయాచంద్ కాలేజీ చదువును ముగించాక ప్లీడరుగా ప్రాక్టీసును ప్రారంభించాడు. చాలాకాలం అతని ప్రాక్టీసు సరిగా నడవలేదు. చివరకు విసిగిపోయి ప్లీడరు వృత్తిని వదిలి కంటోన్మెంట్‌లో సివిలియన్ క్లర్క్‌గా ఉద్యోగాన్ని సంపాయించాడు. అదృష్టవశాత్తూ అతని ఉద్యోగం సైనికులకు ఆహార పదార్థాలను సప్లయి చేసే కాంట్రాక్టర్లతో ముడిపడి వున్నది. ఆ రోజుల్లో ఇంగ్లీషు సైనిక అధికారులు లంచాలు తీసుకోవటానికి కొంచెం వెనుకాడేవారు. అయితే మద్యాన్ని గానీ, ఇతర పదార్థాలను గానీ కానుకగా తీసుకోవటానికి వెనుకాడేవారు కాదు. పండ్లు, ఫలహారాలూ పుచ్చుకునేవారు. దయాచంద్ ఇంగ్లీషువారి నైజాన్ని బాగా గ్రహించాడు. ఇంగ్లీషు వారికి చిట్టిపొట్టి కానుకలను ఇవ్వడంతో మొదలు పెట్టాడు. క్లర్కుగా వున్నప్పుడు తన పై అధికారి అయిన దొరకూ – దొరసానికి పైన చెప్పినటువంటి కానుకల్ని కాంట్రాక్టర్ల ద్వారా పంపిస్తుండేవాడు. దొరకోసం కానుక రూపంలో ఒక రూపాయి ఖర్చుపెట్టామంటే తొంభై రూపాయలు సంపాదించటానికి అవకాశం ఏర్పడుతుందని తెలుసుకున్నాడు కాబట్టి ఎనిమిది సంవత్సరాలుగా చేస్తున్న క్లర్కు ఉద్యోగాన్ని కాలదన్నాడు. అందుకు కారణం, సైనికులకు ఆహార పదార్థాలను సప్లయి చేసే ఒక కాంటాక్టరు దృష్టి దయాచంద్ మీద పడడమే. ఇలాంటి తెలివైనవాడు, చురుకైన వాడు తనకు భాగస్వామిగా వుంటే చాలనుకున్నాడు ఆ కాంటాక్టరు. దయాచంద్‌ను క్లర్క్ ఉద్యోగం మాన్పించి తన వ్యాపారంలో భాగం ఇచ్చాడు. అంతకంటే దయాచంద్‌కు కూడా ఇంకేం కావాలి? తను పెట్టుబడి పెట్టనవసరం లేదు. పెట్టుబడి పెట్టిన తన భాగస్థుడికి అధికంగా లాభాల్ని ఆర్జించిపెట్టటమే. అందులో తనకూ భాగం వస్తుంది. నాలుగేళ్ళల్లో దయాచంద్ సొంతంగా వ్యాపారాన్ని సాగించటానికి అవుసరం అయిన పెట్టుబడిని సంపాయించాడు. అసలు పెట్టుబడి పెట్టిన భాగస్థుణ్ణి కాదని తను స్వయంగా కాంట్రాక్టరు అయ్యాడు. అక్కడే జనరల్ స్టోర్సును ఒకదాన్ని పెట్టాడు. దానికి పెట్టుబడి అంతగా అవసరం లేదు. సరుకులు అప్పుగా తీసుకుని అమ్మినాక డబ్బులు

ఇవ్వవచ్చు. అటు కాంట్రాక్టు పనీ, ఇటు జనరల్ స్టోర్స్ రెండూ నడుస్తున్నాయి. అయితే, ఇతర కాంట్రాక్టర్లు వెనుకటి పద్ధతులు కలవారు. దయాచంద్ అలాకాదు మొదటి ప్రపంచ యుద్ధం జరిగేటప్పటికే ఊహ తెల్సి ప్రపంచాన్ని కళ్ళు విప్పి చూసినవాడు. ఆంగ్ల ప్రభువులతో ఎలా వ్యవహరించాలో అతనికి బాగా తెల్సు. ఇతర కాంట్రాక్టర్లు పాతకాలపు భావాలు కలవారు కావటం వల్ల భోజనాది వ్యవహారాల్లో అంటూ సొంటూ లాంటి ఆచారాలను పాటిస్తుండేవాళ్ళు. దయాచంద్ ఆంగ్ల ప్రభువుల్ని ఆకర్షించడానికి ఎంతకైనా సిద్ధపడేవాడు. అతడు వేసే సూటు, అతడు మాట్లాడే ఇంగ్లీషు దొరల్ని బాగా ఆకర్షించేవి. 'అతను క్లర్కుగానే వున్నట్టయితే, ఎంతో అభివృద్ధి కాదగిన యువకుణ్ణి కాలం దారుణంగా మోసగించింది' అని అనుకునేవారు. ఒకసారి అతను విధివంచితుడయ్యాడు. అట్టడుగు స్థితికి నెట్టివేయబడ్డాడు. అయితే, తన చాకచక్యం వల్లా, నిరంతర శ్రమ వల్లా తొందరగానే తేరుకుని ఉన్నత స్థానాన్ని చేరుకోగలిగాడు.

దయాచంద్ తల్లిదండ్రులది ఒక పల్లెటూరు. వాళ్ళు అక్కడ చిన్న చిల్లర దుకాణం పెట్టుకుని ఎలాగో బతుకు తెరువు చూసుకునేవారు. ఇప్పుడా విషయాన్ని చెప్పినా ఎవరూ నమ్మరు. ఇంతటి అదృష్టం పట్టటానికి ప్రకృతి కూడా కొంత సహకరించింది. అతను చాలా తెల్లగా వుండేవాడు. యూరప్ వెళ్ళి తను ఇటాలియన్ అనో, స్పైన్ దేశస్థుణ్ణో చెప్పుకుంటే ఎవరైనా వెంటనే నమ్మేస్తారు. దయాచంద్ లక్ష్మీపుత్రుడవటంతో పాటే – పైసలే కాదు. కొవ్వు కూడా పెరిగింది. వెనుక ఆస్తిపాస్తులు ఇంతగా పెరగక ముందు మనిషి సన్నగా బక్కపల్చగా వుండేవాడు. కాని దృఢంగా వుండేవాడు. యువకత్వంతో వుండటం వలన ఆరోగ్యంగా వుండేవాడు.

'రూపాయి రూపాయిని పెడుతుంది' అన్న సామెత దయాచంద్ జీవితంలో పూర్తిగా చరితార్థమైంది. లాభం రూపంలో వచ్చిన ప్రతిపైసా మరొక పైసాను తెచ్చి పెడుతోంది అతనికి. దయాచంద్ పేద కుటుంబంలో పుట్టాడు. నిరంతరం పరిశ్రమించి అభివృద్ధికి వచ్చాడు. అయితే, అతడి స్వభావంలో దారిద్ర్య స్థితినుండి పైకి వచ్చిన వాడిలో వుండవల్సిన పిసినారితనం లేదు. ఖర్చుకు వెనుకాడకుండా ధారాళంగా ఖర్చుపెట్టేవాడు. క్లర్కు ఉద్యోగంచేసే రోజుల్లో కూడా అలాగే ఖర్చుపెట్టేవాడు. కావాలంటే తను పస్తు పడుకోనయినా మిత్రులకు టీ పార్టీలు ఇస్తుండేవాడు. ఇప్పుడు దయాచంద్‌కు వెనుకటి స్థితిలేదు. స్వతంత్రంగా కాంట్రాక్టులు చేయడం, జనరల్ స్టోర్స్ పెట్టటం జరిగాక నెలకు కొన్నివేల ఆదాయం వస్తోంది. ఆ ఆదాయంలోంచి ధారాళంగా మిత్రులకు ఖర్చుపెడుతుండేవాడు. అతడి స్వభావంలోని ఈ గుణం కారణంగా చూస్తుండగానే స్థానిక ఆర్యసమాజ శాఖకు సభాపతి అయ్యాడు. నిజంగానే ఆ పదవికి దయాచంద్‌కు మించిన యోగ్యుడు మరొకరు

ఎవరు దొరుకుతారు? ఇతను ఆర్యసమాజానికి చందాలు బాగా ఇస్తాడు. ప్రతి ఆదివారం మందిరానికి హాజరవుతాడు. అధ్యక్ష పదవికి ఇంతకంటే ఇంకేం కావాలి? ఆర్యసమాజాన్ని గురించి రాసిన గ్రంథాల్ని దయాచంద్ పఠించేవాడు కాదు. అతనికి ఆ పుస్తకాల్ని చదవటానికి తీరికే వుండేది కాదు. దయాచంద్‌కు హిందీ, ఉర్దూ రెండు భాషలూ వచ్చు. ఉర్దూలో ఆర్యసమాజానికి సంబంధించిన గ్రంథాలు అనేకం వున్నాయి. అయితే, వాటిని చదవటానికి అతనికి తీరికేది? ప్రతి ఆదివారం మందిరానికి వెళ్ళేవాడు. ఉపన్యాసాల్నీ వినేవాడు. ఉపన్యాసాలు వినటం వలన కలిగిన జ్ఞానం వల్లనే ఆర్యసమాజాన్ని గురించి చాలా విషయాలు తెల్సుకున్నాడు. ఒక పెద్ద నగరం ఆర్యసమాజానికి సభాపతి అయినప్పటికీ దయాచంద్‌లో మత సంబంధమైన గుడ్డినమ్మకం లేదు. వ్యాపార సంబంధంగా ముస్లిం ఉద్యోగుల్తో, పనిపడుతూ వుంటుంది. కాబట్టి ముస్లిం పండుగలకూ, ఉత్సవాలకూ హాజరవుతూ వుంటాడు. ముస్లిం సంస్థలకు చందాలు ఇస్తూ వుంటాడు. అలాగే క్రిస్టియన్ మత సంస్థలకూ పెద్ద పెద్ద మొత్తాల్లో చందాలిస్తూ వుంటాడు. చూస్తుండగానే దయాచంద్ ఆ నగరంలోని గొప్ప వ్యక్తుల్లో ఒకడయ్యాడు. పది సంవత్సరాల క్రితం అతను నెలకు 30 రూ॥ల జీతం తీసుకునే ఒక సాధారణ క్లర్కు. కానీ ఇప్పుడు అతని అభివృద్ధిని చూసి ఈర్షపడేవాళ్ళు వున్నారు. అయితే వాళ్ళ సంఖ్య చాలా తక్కువ. సంపన్న కుటుంబీకులందరూ దయాచంద్‌ను ప్రేమిస్తారు. ప్రశంసిస్తుంటారు. కాంట్రాక్టులు ప్రారంభించిన పది సంవత్సరాలలోపే ప్రభుత్వం అతనికి 'రాయ్‌బహద్దూర్' అన్న బిరుదును ఇచ్చేసింది. అతని ఆకారం, ప్రవర్తనా, ఔదార్యం వీటన్నింటినీ చూశాక 'రాయ్‌బహద్దూర్' అన్న బిరుదును అతని గొప్ప తనానికి తగినట్టుగా వుండదేమోనని జిల్లా మెజిస్ట్రేట్ బాధపడ్డాడు. కుదర లేదు కానీ లేకపోతే సి.ఐ.ఇ. బిరుదును ఇప్పించేవాడే మెజిస్ట్రేట్?

## 2

'రాయ్‌బహద్దూర్' లందరూ సహజంగానే ఆంగ్లేయులకు పరమ భక్తులు అంటే అలా వుండగలిగిన వాడే 'రాయ్‌బహద్దూర్' అవుతాడు. మన దయాచంద్ కూడా అలాంటి రాయ్‌బహద్దూర్! ఇతనికి ఇంగ్లీషు వాళ్ళంటే ఎనలేని భక్తి శ్రద్ధలు. వాస్తవానికి, ఇంగ్లీషు వారి రాయ్ (అభిప్రాయం)లో రాయ్ (తమ అభిప్రాయం) కలపటంలో బహదూర్లు (వీరులు) కావటం వల్ల 'రాయ్ బహద్దూర్' బిరుదునిస్తున్నారు వాళ్ళు. అంటే 'జీహుజూర్' అంటూ తోకాడించటంలో వీరులని అర్థం. బిరుదు పొందాక ఇంక అంతటితో ఆగిపోతే ప్రయోజనం? ఇంగ్లీషు వారు భారతదేశంలో స్థిరంగా వుండే మాత్రమే 'సర్' అన్న బిరుదునో! 'రాజా' అన్న బిరుదునో పుచ్చుకోవచ్చు అని అనుకుంటూ వుండేవాడు రాయ్. బహద్దూర్!

ఉప్పు సత్యాగ్రహం జరుగుతున్న రోజులవి. దేశ భక్తుల్ని లాఠీఛార్జి చేస్తున్నారు. జైళ్ళలో కుక్కుతున్నారు. అరెస్టులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆ రోజుల్లో 'రాయ్ బహద్దూర్' జిల్లా కలెక్టరును తరుచూ కలుస్తుండేవాడు. ఉప్పు సత్యాగ్రహం చేస్తున్న దౌర్భాగ్యుల్ని లాఠీఛార్జితో దారికి తేవాల్సిందే గానీ, మరో రకంగా దారికి తీసుకురాలేమని చెప్తుండేవాడు. అతనికి ఒక విశ్వాసం వుండేది అదేమిటంటే భారతీయుల్ని మానవులుగా తయారు చేసి, భారతదేశాన్ని శాంతి, సమృద్ధం చేయగల శక్తి ఒక్క ఇంగ్లీషు వారికే వుంది. వాళ్ళు మాత్రమే అలా చేయగలరు అని నమ్మేవాడు. ఇంగ్లీషు ప్రభుత్వాన్ని వ్యతిరేకించేవారు 'రాయ్ బహద్దూర్' దయకు అపాత్రులయ్యేవారు.

మన 'రాయ్‌బహద్దూర్' ఇంగ్లీషు వారి గారాలపట్టి. అలాంటప్పుడు ఇంగ్లీషు ప్రభుత్వాన్ని వ్యతిరేకించే, ద్వేషించే దేశభక్తులు అతణ్ణి సరియైన దృష్టితో ఎలా చూస్తారు? అయితే, రాయ్ బహద్దూర్ అన్ని సంస్థలకూ సమానంగా చందాలు ఇచ్చేవాడు. విద్యా సంస్థలకూ ఇచ్చేవాడు. గొప్ప వకీలు, కాంగ్రెసువారు ఏదైనా విద్యా సంస్థకు అధ్యక్షుడై వుంటే అలాంటి విద్యా సంస్థకు తప్పక చందా ఇచ్చేవాడు. అతనికి ఒక విషయం బాగా తెల్సు. డబ్బే ముఖ్యం. 'సర్వేగుణాః కాంచన మా శ్రయంతి' అని వూరికే చెప్పారా?

ఏదైనా రాజకీయ ఆందోళన ఉగ్రరూపం దాల్చటం అతనికి ఇబ్బంది కలిగించేది. తీవ్రంగా ఉద్యమాలు నడుస్తున్న నగరాలలో, అతనికి వుండటం కష్టమయ్యేది. అయితే, ఇప్పుడతని వ్యాపారసంస్థలు అన్ని నగరాలలోనూ వున్నాయి కనుక అలాంటి ఉపద్రవాలు వచ్చినప్పుడు కొంతకాలం స్థాన చలనం చేస్తుంటాడు. రాయబహద్దూర్ రెండవ ప్రపంచ యుద్ధకాలంలో రెండు చేతులా సంపాదించాడు. ఖర్చు కూడా పెట్టాడు. ఇప్పుడతడు నడివయస్సుకు వచ్చాడు. వ్యాపారం మూడు పువ్వులూ, ఆరు కాయలూ కాస్తున్న తొలి రోజుల్లోనే ఒక చదువుకున్న మహిళను వివాహం చేసుకున్నాడు. సంతానం కలిగింది. అతని ఇల్లు అత్యధికుడైన ధనికుడి ఇల్లు ఎలా వుంటుందో? అలాగే అలంకరించి వుంటుంది. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో ఆర్యసమాజకులు తమ స్త్రీలతో ఆంగ్ల సభ్యతా, భాషా పట్ల వారికి వ్యామోహం కలగకుండా చాలా జాగ్రత పడేవారు. తమ స్త్రీలను ఆర్య మహిళలుగా చేయాలని తపించేవారు. అందుకనే వాళ్ళ చదువును సంస్కృతం వరకే పరిమితం చేసేవారు. లేదా దేశ భాషల్ని చెప్పించే వారు. అయితే రాయ్‌బహద్దూర్ ఆర్యసమాజకుడు అయినప్పటికీ, అతని భార్య ఏ సంస్కృతం వరకో? దేశ భాషల వరకో పరిమితం కాకుండా మెట్రిక్ పాసయ్యింది. తల్లి మెట్రిక్ వరకూ చదివితే, కూతుళ్ళు అంతవరకే చదివి ఆగిపోరు కదా? ఇంగ్లీషు ప్రభుత్వంలో అభివృద్ధిని సాధించాలంటే తప్పనిసరిగా ఇంగ్లీషు చదివి వుండాలి. అప్పుడే పిల్లలు తమ జీవితాల్లో ముందుకు

పొగలుగుతారు. ఈ సత్యాన్ని రాయ్‌బహద్దూర్ బాగా అర్థం చేసుకున్నాడు. తన కొడుకులకూ, కూతుళ్ళకూ చిన్నప్పటి నుంచీ ఉగ్గుపాలతో ఇంగ్లీషును రంగరించి పట్టించాడు. రాయ్ బహద్దూర్ ఇలా ధైర్యంగా, ఆదర్శవంతంగా ఇంగ్లీషు సామ్రాజ్యాన్ని ఏకంగా ఇంట్లోనే ప్రవేశపెట్టాడు. అప్పుడు ఇతర ఆర్య సమాజికులు వాళ్ళ వాళ్ళ గృహాలలో ఆంగ్లాన్ని ప్రవేశపెట్టాల్నా? వద్దా? అన్న మీమాంసలో పడిపోయారు. హిరణ్య కశ్యపుడి ఇంట్లో ప్రహ్లాదుడు పుట్టాడు. తండ్రి ఆచారాల్ని, భావాల్ని కాదనే సంతానం కలగటం సహజం. కానీ ఈ విషయంలో రాయ్‌బహద్దూర్ అదృష్టవంతుడనే అనాలి. అనాటి కుటుంబంలో కాంగ్రెస్‌ను కానీ, కాంగ్రెస్ నాయకులను కానీ అభిమానించే ప్రహ్లాదులెవరూ పుట్టలేదు!

'రాయ్ బహద్దూర్' బంగళాల్లో తరుచూ ఇంగ్లీషు దొరలకు విందులు జరుగుతూ వుండేవి. ఆ విందుల్లో ఆర్య సమాజీకులూ, హిందువులూ, వదిలివేసిన అనేక పానీయాలనూ, ఆహార పదార్థాలనూ ఆంగ్ల రెస్టారెంట్ నుండి తెప్పిస్తుండేవాడు. ఇలా చేస్తున్నందుకు ఒక్కొక్కసారి అతను తన ప్రశంసకుల విమర్శలకు గురి అవుతుండేవాడు. అవును, ఈ ప్రపంచంలో సేవావ్రతం చాలా కఠినమైనది! రాయ్‌బహద్దూర్ తెల్లవారి సేవావ్రతాన్ని స్వీకరించాడు. ఆ వ్రతాన్ని చాలా ధైర్యంగా నిర్వహిస్తున్నాడు. అలాంటప్పుడు ఒక్కొసారి ఆత్మీయుల విమర్శలకూ గురికావాల్సి వస్తుంది. అంత మాత్రాన కలత చెందితే ఎలా?

రాయ్‌బహద్దూర్ ఎప్పుడూ కొద్ది లాభాన్ని మాత్రమే ఆశించేవాడు కాదు. 'తింటే ఏనుగు కుంభస్థలాన్నే తినాలి' అనే రకం ఆయన. ఎన్నోసార్లు తన సర్వస్వాన్నీ పెట్టి నిలదొక్కుకోవటం జరిగింది. కొత్త కొత్త వ్యాపారాల్ని అతి సాహసంతో ప్రారంభించిన రోజులూ వున్నాయి. అలా ప్రారంభించిన వ్యాపారాల్లో దెబ్బ తినటమే కనుక జరిగి వుంటే రాయ్‌బహద్దూర్ పిసినారి అయి వుండేవాడే, కానీ తన జీవితంలో అలాంటి రోజు రాదని అతడికి గట్టి విశ్వాసం. సాహసంతో వ్యవహరించాల్సిన సమయంలో ముందుగానే విఘ్నవినాయకుళ్ళను ఆకట్టుకునేవాడు. ముఖ్యంగా అతడి వ్యాపారం ప్రభుత్వం వద్ద కాంట్రాక్టులు తీసుకోవటం ఒక్కోమాటు తన శక్తికి మించి కాంట్రాక్టులు తీసుకునే వాడు. దెబ్బ తింటామేమోనన్న భయం వున్నప్పటికీ దెబ్బతినే వాడు కాదు. ఎట్లయినా నిర్వహించేవాడు.

ఈ విధంగా రాయ్‌బహద్దూర్ అభివృద్ధిని సాధించాడు. కానీ ప్రభుత్వ విధానాల్ని చూసినపుడు ఒక్కోమాటు చాలా బాధపడేవాడు. రాజద్రోహులైన కాంగ్రెస్ వారిని ప్రభుత్వం దండించవల్సిన విధంగా దండించనందుకు వ్యథ పడేవాడు. ఈ రాజద్రోహులకే (అతని ప్రాంతంలో కాదు) ఆంగ్ల ప్రభుత్వం కొన్ని ప్రాంతాలల్లో పరిపాలనా అధికారాన్ని ఇచ్చింది. జీవితాంతం తెల్లవారి సేవావ్రతాన్ని స్వీకరించిన రాయ్ బహద్దూర్‌కు బ్రిటిష్ ప్రభుత్వం

చేసే అనాలోచితమైన పనులు మింగుడు పడనివయ్యాయి. మొదట అనన్య భక్తుడిలా విలవిల్లాడాడు. తరువాత ఆలోచించాడు. ఎవరు చేశారు? భవిష్యత్తు ఎలా వుంటుందో? కనుక అన్నింటికీ ఒకే బాణం ఉండకూడదు. తన ప్రాంతంలో అయితే కాంగ్రెస్ ప్రభుత్వం లేదు. ఇంగ్లీషు వారి పరమ భక్తులే తమ ప్రాంతీయ ప్రభుత్వంలో వున్నారు. ఎంత తమ ప్రాంతంలో ఇంగ్లీషువారి పరమ భక్తులు రాజ్యమేలుతున్నా తను కళ్ళు మూసుకుని వుండకూడదని తెల్సుకున్నాడు రాయ్‌బహద్దూర్! ఇప్పటికీ రాయ్‌బహద్దూర్ ఇంగ్లీషు వారి మీద వున్న భక్తిశ్రద్ధల వల్లనే డబ్బు సంపాయించుకుంటున్నాడు. అయితే, అతని మనస్సులో వెనుకటి అనన్య భక్తి కొంత తగ్గింది. అందుకు మరొక కారణమూ వుంది. తన వృత్తిలోకి ఈ మధ్యకాలంలో ముస్లిం షావుకార్లు కూడా చొరబడ్డారు. ఇంగ్లీషు దొరలు వారినీ వీపు నిమురుతున్నారు. ఇవన్నీ చూశాక భవిష్యత్తులో తనకూ, తన వ్యాపారానికీ తన ప్రాంతంలో స్థానం లేకుండా పోతుందేమోనని అనుమానం కలిగింది అతనికి. కనుక త్వరత్వరగా ఇతర ప్రాంతాలలో కూడా తన వ్యాపారానికి శాఖల్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఇంత చేసినా, రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత రాయ్‌బహద్దూర్ అదృష్టం అనే సూర్యుడు పశ్చిమ దేశంలోకి ఒదిగిపోయాడు. అనుకోకుండా సంభవించిన కొన్ని నష్టాలను భరించాల్సి వచ్చింది. అయినా, తట్టుకున్నా తూలిపోయిన వాడి క్రిందనే లెక్క.

## 3

యుద్ధం ముగిసిపోయి ఇంగ్లీషువారు ఈ దేశం నుండి వెళ్ళిపోయేనాటికి రాయ్‌బహద్దూర్ పరిస్థితి అది. దేశంలోని రాజకీయ పరిస్థితులు చాలా వేగంగా మారుతున్నాయి. రాయ్‌బహద్దూర్ లాంటి దూరాలోచన వున్న వ్యక్తులు కూడా ఊహించలేనంతగా మారుతున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తన వ్యాపారాన్ని మార్చుకోవాలని అనుకుంటూనే వున్నాడు. ఇంతలోనే 1947 రానే వచ్చింది. ఇంగ్లీషువారు కాంగ్రెస్ వారికి దేశాన్ని అప్పజెప్పి వెళ్ళిపోయారు. ఆ తరువాత అతని స్వస్థలంలో కూడా స్వరాజ్యం అనే అగ్ని అంటుకుంది. అతడూ తన యజమానుల లాగానే సర్వాన్నీ విడిచి వెళ్ళవలసిన వాడయ్యాడు. ఎంత స్వస్థలం నుండి వెళ్ళిపోవాల్సి వచ్చినా మరీ ఒట్టి చేతులతో మాత్రం లేడు. అప్పటికి ఢిల్లీలో తన వ్యాపారసంస్థ ఎటూ వుండనే వుంది. ఈ మధ్య మధుపురిలోనూ హోటలు నొకదాన్ని కొన్నాడు రాయ్‌బహద్దూర్! ఆ హోటలు ఒక ఆంగ్లేయుడిది. దాన్ని కొనటానికి కొంత అప్పు చేయవలసి వచ్చింది. రాయ్‌బహద్దూర్‌కు!

రాయ్‌బహద్దూర్ వయస్సు వృద్ధాప్యాన్ని సమీపిస్తోంది. వయస్సుతోపాటు అతని

ప్రభావమూ, ఐశ్వర్యమూ కూడా వృద్ధాప్యాన్ని సమీపించాయి. ఇప్పుడు కొత్తగా ఏర్పరచుకుని సాధించుకునే ధైర్యమూ, శక్తీ రెండూ లేవు. అయితే, 30 రూ॥లకు క్లర్కుగా చేరి ఏ ప్రత్యేకతల వల్ల ఈ స్థితికి ఎదగగలిగాడో? ఆ ప్రత్యేకతలు ఇప్పటికీ వున్నాయి అతనిలో.

అతను మధుపురిలో వుండిపోవాలన్న నిర్ణయానికి వచ్చాడు. అలా నిర్ణయించుకోవటానికి ఇంకొక కారణమూ వున్నది. ప్రస్తుతం అతనికున్న వ్యాపార సంస్థలన్నింటిలోకీ మధుపురిలో వున్న హోటలే పెద్దది. అలాంటప్పుడు మధుపురిలోనే వుండటం సరైనదనుకున్నాడు. మధుపురికి వచ్చేప్పటికి అతనిలో ఇంగ్లీషు దొరల మీద సేవావ్రతం పూర్తిగా పోలేదు. సేవావ్రతం తాలూకువి బయటపడకుండా సాధ్యమయినంత వరకూ జాగ్రత్త పడుతున్నాడు. ప్రజలు తనను వేలెత్తి చూపుతారన్న భయం అంతగా లేదు. అతడి వ్రతనిష్ఠ పూర్తిగా చెదిరిపోక ముందే ఇంగ్లీషు ప్రభువులు పెట్టే, బేడా, మూటా ముల్లే సర్దుకుని వెళ్ళిపోయారు. ముందు దిగ్భ్రమ చెందినా తరువాత తేరుకుని తెల్ల దొరల మీద తనకు వున్న భక్తి శ్రద్ధలను కాంగ్రెస్ దొరల మీదకు మళ్ళించాడు. రాయ్‌బహద్దూర్ సూక్ష్మబుద్ధి కలవాడు. ఎటు సూర్యుడు ఉదయిస్తే అటు తిరిగి నమస్కరించడం శ్రేయస్కరం. అన్న సిద్ధాంతాన్ని మొదటినుండీ విశ్వసిస్తున్నాడు. అట్లాగని ఒక్కసారిగా కాంగ్రెస్‌లో జొరబడటానికి బిడియపడుతున్నాడు. మధుపురిలో వెనుకటి నుండే వుంటున్న కాంగ్రెస్ పండాలు కొందరు వున్నారు. వాళ్ళు ఈ కొత్త పండాను తమలో కలుపుకోవటానికి ఎవరూ సిద్ధపడలేదు. వ్యతిరేకించారు కూడాను. కానీ రాయ్‌బహద్దూర్ గత జీవిత చరిత్ర కాంగ్రెస్ పండాలకు తెలియదు. అందువల్ల ఈకొత్త పండా (పూజారిని) తమలో కలుపుకోవటానికి ఎటువంటి అభ్యంతరాల్ని, కారణాల్ని చూపించగలరు? ఈ ప్రశ్నను వేసుకోకూడదు. ఎందుకంటే, లోపాల్ని చూపించటమే ముఖ్యం అనుకున్నప్పుడు, తాము చూపించదలుచుకున్న లోపాలు ఎదుటి వ్యక్తిలో లేకపోయినా తామే సృష్టించి ఆరోపించకూడదని ఏముంది? స్థానిక కాంగ్రెస్ నాయకులు రాయ్‌బహద్దూర్ మీద ఆ అస్త్రాన్నే ప్రయోగించారు. కొన్ని అపవాదులను లిస్టు రాసుకుని మరీ ప్రచారం చేశారు. ఎన్ని అభ్యంతరాలు వున్నా కొత్త దొరలకు అనన్యభక్తుడు కావాలని దృఢ నిశ్చయం చేసుకున్నాడు. రాయ్ బహద్దూర్! అధునాతనమైన, అన్ని సౌకర్యాలు వున్న పెద్ద హోటల్‌కు అతడు యజమాని. ఇంక అతణ్ణి కాంగ్రెస్ దొరలకు అనన్య భక్తుడు కాకుండా ఎవరు ఆపగలరు?

మధుపురి నుండి ఇంగ్లీషు దొరలు వెళ్ళేటప్పుడు తమ బంగళాలను కారుచౌకగా అమ్ముకుని వెళ్ళారు. పెద్ద పెద్ద 'సేటు'లు ఆ బంగళాలను కొనుక్కున్నారు. కొందరు పెద్దలైతే తమ మిల్లులోని కార్మిక సంక్షేమ నిధి నుండి డబ్బులు తీసుకుని మధుపురిలో ఇంగ్లీషు దొరల బంగళాలను కొన్నారు. ఇలా కార్మిక సంక్షేమ నిధిని ఖర్చు పెట్టటం

వలన ఒకే దెబ్బకు రెండు పిట్టల్ని కొట్టినట్టయింది. ఒకటి కార్మికుల సంక్షేమ నిధి తాలూకు డబ్బుకు ఇన్‌కంటాక్స్ వుండదు. రెండవది ఆ డబ్బుతో కొన్న బంగళాలలో చింకి పేలికలు కట్టుకునే కార్మికులు వచ్చి వుండడమన్నది సంభవం కాదు! కనుక వాటిని కొన్న పెద్దలకే అవి ఉపయోగపడతాయి. అసలు, ఇలాంటి సౌకర్యాలను వూహించుకునే కార్మిక సంక్షేమ నిధిలో డబ్బు వేస్తూ వుంటారు మిల్లు యజమానులు. ఆ డబ్బుకు ఇన్‌కంటాక్సు వుండదుగా? ఏ నిధితో ఆ బంగళాలను కొన్నప్పటికీ, ప్రస్తుతం ఆ భవనాల్లో మాత్రం 'సేటు' వర్గానికి చెందిన పెద్దమనుషుల కుటుంబాలు వుంటున్నాయి. శాసనాలు, నియమాలు, నిబంధనలూ అన్నీ చిన్న వాళ్ళ వరకే పరిమితం! అవి పెద్దవాళ్ళకు అన్వయింపబడవు. కార్మిక సంక్షేమ నిధి డబ్బుతో మధుపురిలో విలాస భవనాల్ని కొనుక్కోవడం మోసం కాదా? అయితే, దీన్ని మోసమని ఎవరు అనగలరు? ఎవరు అంటున్నారు? శాసనాల్ని, న్యాయ శాస్త్రాల్ని తిరగేసిన న్యాయాధీశులూ, కాంగ్రెస్ మంత్రులూ ఇప్పుడా భవనాల్లో విడిదికి దిగుతున్నారు. అక్రమ ధనంతో ఆ భవనాల్ని కొన్న 'సేటు' వర్గపు పెద్ద మనుషులవంక వేలెట్టి చూపే సాహసం ఎవరికి వుంటుంది? వాస్తవం చెప్పాలంటే కార్మిక సంక్షేమ నిధిలోనుండే డబ్బు తీసి ఈ భవనాల్ని కొనవల్సిన అవుసరం ఏముంది? బ్లాక్ మార్కెట్‌లో సంపాయిస్తున్న కోట్ల రూపాయలను ప్రభుత్వానికి ఆచూకీ తెలియకుండా చేయగలిగే ఈ పెద్దలకు మధుపురిలో బంగళాకోసం ఖర్చుపెట్టిన కొన్ని లక్షల రూపాయలు ఒక లెక్క ఏంటి? సంక్షేమ నిధి డబ్బుతో ఈ భవనాల్ని కొన్న ఉద్దేశం వేరు. ఇవి ఇక్కడ కాంగ్రెస్ మంత్రులకు విడిది గృహాలుగా వుపయోగపడుతున్నాయి. కాంగ్రెస్ వాళ్ళు ఎల్లకాలం ఆ భవనాల్లో వుండరు కదా? మంత్రులు వుండని సమయాల్లో వాటిని కొన్న 'సేటు' కుటుంబాలు వుంటారు.

రాయ్‌బహద్దూర్ పరిస్థితి కొంత ఇబ్బందికరంగానే వున్నది. 'సేటు' వర్గపు ఈపెద్ద మనుషుల బంగళాలతో అతడి హోటలు పోటీ పడగలగాలి. అప్పుడు గాని వాళ్ళకు పోటీగా నిలబడలేడు. వెనుకటి ఆర్థిక స్థితి ఇప్పుడతనికి లేదు. ప్రస్తుతం అతని పెట్టుబడి అంతా కలిపినా పది పదిహేను లక్షలకు మించి వుండదు. అటు తనకు పోటీదారులయిన 'సేటు' వర్గంలో ప్రముఖమైన సేటు 'జగత్‌సేటు'. సంవత్సర ఆదాయం కోట్లల్లో వుంటుంది. జగత్‌సేటు లాంటి వాళ్ళు తమ అతిథి గృహాల్లో కాంగ్రెస్ దొరలకు, చాలా అట్టహాసంగా, ఆడంబరంగా డబ్బును ఖర్చుపెట్టి మరీ ఆతిథ్యాన్ని ఇస్తూ వుంటారు. మరి అంత ఖర్చుపెట్టి కాంగ్రెస్ దేవతలకు ఆతిథ్యాన్ని ఇవ్వటం రాయ్‌బహద్దూర్‌కు సాధ్యమా? అయితే, రాయ్ బహద్దూర్ హోటల్లో కొన్ని ప్రత్యేకతలు వున్నాయి. ఆ ప్రత్యేకతలు సేటు వర్గపు పెద్ద మనుషుల భవనాల్లో లేవనే చెప్పాలి. ఇతని హోటల్లో ఆధునికమైన సౌకర్యాలన్నీ వున్నాయి.

అవి వాళ్ళ బంగళాల్లో లేవు. వృద్ధ కాంగ్రెస్ దొరలకు 'సేటు'లు అప్పుడప్పుడూ కానుకలు కూడా ఇస్తూ వుంటారు. కానీ కాంగ్రెస్ దొరల కూతుళ్ళకూ, కొడుకులకూ, కోడళ్ళకూ ఆ భవనాలు ఏ మాత్రం నచ్చవు. అక్కడ వాళ్ళు దిగరు. వాళ్ళకు 'రాయ్‌బహద్దూర్' హోటలు ఆధునికతతో నిండు యవ్వనంలో వున్న అనన్య సౌందర్యవతిలాగా వాళ్ళను ఆహ్వానిస్తుంటే వృద్ధ భవనాల వంక కన్నెత్తి అయినా చూస్తారా?

స్వాతంత్ర్యం వచ్చాక కాంగ్రెస్ పెద్దల సంతానం కూడా మధుపురికి రావటం ప్రారంభించారు. వాళ్ళు మధుపురికి రావటం ఏకాంత వాసానికి కాదు. ఆధునికులయిన నూతన సమాజంలో కలుస్తూ సర్వసౌఖ్యాల్ని అనుభవించటానికి వస్తున్నారు. వీరి తాతలో, తండ్రులో ఒకప్పుడు కాంగ్రెస్‌లో  సేవ చేసిన మాట నిజమే! ఇప్పటికీ వాళ్ళు కాంగ్రెస్‌లో బాధ్యతగల పదవులలో వున్న మాట నిజమే. అంత మాత్రాన వీళ్ళు జీవిత సౌఖ్యాల్ని గాంధీకి తాకట్టుపెట్టాలని ఎక్కడా రాసిపెట్టి లేదు కదా! ఇప్పుడు ఖద్దరు ధరించే గొప్ప గొప్ప కాంగ్రెస్ మంత్రుల కూతుళ్ళూ-కోడళ్ళూ తలకు పోసుకునే షాంపుల కోసం వందరూపాయలు ఖర్చుపెడుతూ, ఎంతో త్యాగమూర్తులని ప్రజలు భ్రమపడుతూన్న ప్రసిద్ధ కాంగ్రెస్ నాయకుల సంతానమే ఇట్లా వుంటే భవిష్యత్తులో రాబోయే నూతన తరం (గాంధీగారి శిష్య సంతతి) ఎర్రని విదేశీ ద్రాక్ష సారాయిని త్యాగం చేసి బతకగలుగుతుందా? అన్న అనుమానం సాధారణులకు రాకమానదు. ఇంతకూ చెప్పేదేమిటంటే, కాంగ్రెస్ దేవతల సంతానమయిన దేవ కుమారులు, దేవ కుమార్తెలూ వుండటానికి అనువైన ప్రదేశం రాయ్‌బహద్దుర్ హోటలే! అక్కడయితేనే వారు కోరుకున్న బాల్ డాన్సులూ, ఆహారపదార్థాలు, మిత్ర సమాగమమూ లభిస్తాయి! ఈ దృష్టితో చూసినపుడు రాయ్‌బహద్దూర్ 'సేటు' వర్గపు పెద్దలకు ఏ రకంగానూ తక్కువ కాదనిపిస్తుంది. ఒక్కోసారి వృద్ధ కాంగ్రెస్ పెద్దలు సేట్లు బంగళాల్లో దిగితే, వారి సంతానం 'రాయ్‌బహద్దూర్' హోటల్లో దిగటం జరుగుతూ వుంటుంది. సేటు వర్గీయులు కాంగ్రెస్ దేవతల్ని పూజించి కోట్లు సంపాదిస్తే, రాయ్‌బహద్దూర్  దేవకుమారుల్ని, దేవకుమార్తెలని సేవించి ఇతనూ కోట్లు సంపాయిస్తున్నాడు. క్రితంసారి గందరగోళం జరిగినప్పుడు రాయ్‌బహద్దూర్ చాలా ఇబ్బందుల్లో పడ్డాడు. ఒక పక్క రుణదాతలు,ఇంకోప్రక్క ఇన్‌కంటాక్స్ వాళ్ళు, మరోపక్క తమ ప్రాంతంలో విడిచివచ్చిన ఆస్తిపాస్తులన్నీ చెల్లాచెదరవుతాయేమో నన్న భయమూ వేధించాయి. దేవకుమారుల్ని, దేవకుమార్తెల్ని ఉపాసించటం ద్వారా ఎలాగో అప్పట్లో తన నావను ఒడ్డుకు తెచ్చుకున్నాడు. ఆ రోజుల్లో రాత్రిళ్ళు నిద్రపట్టేది కాదు. అప్పుల వాళ్ళు ఎప్పుడు దావా వేస్తారో, హోటలు వదులుకుని పోవాల్సి వస్తుందేమోనని ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని వుండేవాడు. దేవకుమారులూ – కుమార్తెలు అతడి మొర ఆలకించి

వరాలు ప్రసాదించారు. రాయ్‌బహద్దూర్ ఆ పరిస్థితులనుండి బయట పడ్డారు – బాకీలన్నీ తీర్చుకున్నాడు. మధుపురిలోని పెద్ద హోటలు అతనికి సొంత ఆస్థి కింద మిగిలింది. కొంత సంపత్తీ మిగిలింది.

రాయ్‌బహద్దూర్ యువకత్వాన్ని దాటి వృద్ధాప్యంలోకి అడుగుపెట్టాడు. పుష్టికరమైన తిండి కారణంగా ప్రౌఢవయస్కుడిలా కనిపిస్తూ వుంటాడు. ఈ వయస్సులో కొత్త వాటిని ఏమి సాధిస్తాడు. కొత్త కోర్కెల్నీ, ఆదర్శాల్నీ, నిర్మించుకునే బాధ్యత కూతుళ్ళకూ, కొడుకులకూ వదిలి తనుతన వయస్సుకు తగినట్టు ప్రశాంతంగా వుంటున్నాడు. 20 లక్షల దాకా స్థిర చరాస్థులువున్నాయి.వాటి మీద ఏ అప్పు లేదు. ఇప్పుడితనికి భవిష్యత్తుకు సంబంధించిన చింత లేదు. తను మొదటినుండీ ఏ సేవానిరత దీక్షను తీసుకున్నాడో ఆ వ్రతాన్ని ప్రశాంతంగా చక్కగా నిర్వహించుకోగలుగుతున్నాడు. మధుపురిలోని ఆధునిక సౌకర్యాలు గల గొప్ప హోటలుకు తాను యజమాని. సేవావ్రతాన్ని సాగించటానికి ఇంత కంటే సదవకాశం ఇంకేముంటుంది? చిన్నా – పెద్దా మంత్రులు, లీడర్లు ఎవరు మధుపురికి వచ్చినా రాయ్‌బహద్దూర్ తప్పకుండా విందు ఇచ్చేవాడు. మరొక విషయం ఏమిటంటే ఇంగ్లీషు వాళ్ళు వెళ్ళిపోయాక వాళ్ళు ఇచ్చిన బిరుదులు కూడా పక్కన పడేయడంజరిగింది. అయితే, జీవితంలో ఎంతో శ్రమించి సంపాయించుకున్న 'రాయ్‌బహద్దూర్' అన్న తన బిరుదును వదులుకోలేకుండా వున్నాడు దయాచంద్. వదులుకోక ఏం చేస్తాడు? గతంలో 'సర్' అని పిలిపించుకున్న వాళ్ళందరూ ఇప్పుడు 'మిస్టర్ల'గా మిగిలిపోయారు. ప్రజలు మర్చిపోకుండా వుండేందుకు 'స్టేట్స్‌మన్' పత్రిక మాత్రం అప్పుడప్పుడూ వాళ్ళపేర్ల ముందు 'సర్' బిరుదును ప్రచురిస్తోంది. అలాంటి మహా మహావాళ్ళకే గతి లేకపోతే, ఇక దయాచంద్ తన బిరుదును గురించి ఏం దిగులు పెట్టుకుంటాడు. అతడి నౌకర్లు అతడిని 'బడా సాహెబ్' అని పిలుస్తుంటారు. అతడి పెద్ద కొడుకును ఛోటా సాహెబ్ అన్న బిరుదును భద్రపరిచారు. హోటల్‌కు వచ్చేవారు, ఇతర ప్రజలూ 'లాలాజీ' అని గానీ వేరే పేరుతో కానీ పిలుస్తారే తప్ప 'రాయ్‌బహద్దూర్' అని మాత్రం పిలవటం లేదు. కానీ దయాచంద్‌కు మాత్రం ఇప్పటికీ 'రాయ్‌బహద్దూర్' అన్న పేరుతో పిలిపించుకోవాలన్న కోర్కె వున్నది. అతడికి ఇప్పటికీ అర్థం కాని దేమిటంటే 'రాయ్‌బహద్దూర్' అన్న నామం భారతీయ నామమే కదా? అలాంటప్పుడు ఇంగ్లీషువారు వెళ్ళిపోయినంత మాత్రాన ఈ భారతీయ నామాన్ని తిరస్కరించవలసిన అవసరం ఏమున్నది?

## 4

రాయ్‌బహద్దూర్ ఇప్పటికీ వెనకటిలాగానే సేవావ్రత దీక్షను చేస్తున్నాడు కానీ వెనుకటి అనన్య భక్తి మాత్రం ఇంగ్లీషు వారితోనే గతించింది. అతను ఇంగ్లీషు వారిని పూజిస్తున్న

ప్పుడు ఇలా మధ్యలో విరమించుకోవాల్సి వస్తుందని కల్లో కూడా అనుకోలేదు. ఉన్నత వర్గాల కన్యల వివాహాల్లా తనకూ జీవితాంతం ఇది ఒక్కటే వివాహం అనుకున్నాడు. భక్త మీరా "మేరాతో గిరిధర్ గోపాల్ దూసరా నా కో ఈ" అని పాడి తన అనన్య భక్తిని చాటుకుంది. రాయ్‌బహద్దూర్ కూడా గద్గదస్వరంలో 'మేరాతో గౌరాంగ్ ప్రభు దూసరా నా కోఈ ' అని పాడదామనుకున్నాడు కానీ విధి వక్రించింది. గౌరాంగ్ ప్రభు (తెల్ల ప్రభువులు) గతించారు. రాయ్‌బహద్దూర్ వాళ్ళతో సహగమనం చేయలేక బ్రతికి వున్నాడు. ఆ తరువాత కాంగ్రెస్ ప్రభువుల పరిణయ సూత్రంలో బంధింపబడ్డాడు. ఈ క్రొత్త జీవితమూ అతనికి సంతృప్తికరంగానే వుంది. మొదట్లో కొన్నాళ్ళు అసంతృప్తిగానే వున్నా త్వరలోనే సంతృప్తిని అలవరుచుకున్నాడు. ఇప్పుడు అతని భక్తికీ, ప్రేమకూ పాత్రులయిన వారు అనేకులున్నారు. కాంగ్రెస్ మంత్రులూ, లీడర్లూ, ఇంగ్లీషు వాళ్ళ నిరంకుశ అధికారంలో కూడా పెద్దలుగా చలామణి అయిన వాళ్ళూనూ తన భజనకు యోగ్యులుగా అనుకుంటున్నాడు అతను. ఇప్పుడు అతను ఇలాంటి దేవతల (దేవేతరులు) ప్రజల సేవలోనూ ఉత్సాహాన్ని చూపుతున్నాడు. మధుపురిలోని హరిజనుల కోసం ఏ పని చేయాలన్నా, టెలిఫోన్ సహా తయారుగా వుంటున్నాడు. పెద్ద సాహెబ్ హోటలు నిర్వహిస్తున్నాడు. కనుక సేవావ్రతంలో పూర్తి సమయాన్ని వెచ్చించగలుగుతున్నాడు. రాయ్ బహద్దూర్ హరిజన భక్తి చూసి మంత్రులు కూడా సంతృప్తి చెందేవారు. హరిజనుల కోసం అతను ఏమి డిమాండ్ చేసినా రాయ్‌బహద్దూర్‌ను నిరాశ పర్చేవారు కాదు. కానీ ఇంతటి దానికే రాయ్‌బహద్దూర్ సంతృప్తిని ఎలా పొందగలడు? అతని మధుపురిలోని కార్మికుల కష్టాలను కూడా దూరం చేయాలనుకున్నాడు. కార్మికులు సంఘాలు కూడా ఇతనిని మించి మరింకెవరిని నాయకుడిగా ఎన్నుకోగలరు? ఒకరోజు అతను కార్మికుల మీటింగ్‌ను ఏర్పాటు చేశాడు. కార్మికులందరూ కృతజ్ఞతా భావంతో అతడినే నాయకుడిగా ఎన్నుకున్నారు. కార్మిక నాయకులలో వుండవల్సిన కొన్ని ముఖ్య లక్షణాలు రాయ్ బహద్దూర్‌లో వున్నాయి. తను రాయ్‌బహద్దూర్ అయివుండి కూడా బట్టలు మాసిపోతాయన్న బాధ లేకుండా కార్మికులతో పాటు గోనె పట్టాల మీద కూర్చుని వాళ్ళ కష్టసుఖాలను విచారిస్తాడు. గంధర్వుల మహాప్రాసాదం లాంటి తన హోటల్‌లో ఏ రకమైన సంశయం లేకుండా కార్మికులకు టీ పార్టీలు ఇస్తూ వుంటాడు. కార్మిక నాయకులకు స్వాగతం పలకటానికి అతడి ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే వుంటాయి. అసలు నాకు తెలియక అడుగుతున్నాను. 'మజదూర్ సభా' అధ్యక్షుడికి ఇంతకంటే మంచి లక్షణాలు ఏముండాలి?

మధుపురిలోని కార్మికులు సంవత్సరమంతా అక్కడ వుండరు. సంవత్సరానికి ఐదు నెలలు మాత్రమే అక్కడ వుంటారు. రెండు సీజన్లూ అయ్యాక పర్వత లోయల్లోని తమ

గ్రామాలకు వెళ్ళిపోతారు. అలాంటి కార్మికుల్ని సంఘటిత పరచటం తేలికైన పనికాదు. ఇలాంటి కష్టసాధ్యమయిన పనిని సాధించినందుకు రాయ్‌బహద్దూర్‌ని తప్పకుండా అభినందించాలి. కార్మికుల కష్టసుఖాలకు సంబంధించిన బాధల్ని అధికార్లకు తెల్పటం తన పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వం ద్వారా కార్మికులకు కొన్ని సౌకర్యాలు కల్పించటం అతను తన ఆదర్శంగా పెట్టుకున్నాడు. కాంగ్రెస్ మంత్రులకూ రాయ్ బహద్దూర్ అంటే ఎటూ అభిమానం వుంది. తమకూ తమ వర్గానికి చెందిన వారికి తన హోటల్ ద్వారా ఆతిథ్యాన్ని ఇచ్చి భక్తి శ్రద్ధలను ప్రదర్శిస్తున్న రాయ్‌బహద్దూర్ అంటే మంత్రులకు అభిమానం ఎందుకు వుండదు? ఇతడు సిఫార్సు చేస్తున్న చిట్టిపొట్టి సౌకర్యాల్ని మంత్రులూ, ఇతర ఉద్యోగులూ కార్మికులకు కల్పిస్తూనే వున్నారు. కార్మికులకు సంబంధించినంత వరకూ రాయ్ బహద్దూర్ ఆదర్శం అంతటితోటే ఆగిపోయింది. కార్మిక కర్షక రాజ్యాన్ని స్థాపించాలన్న ఊహ అతడికి ఎన్నడూ రాలేదు. రాదు కూడా. రాయ్‌బహద్దూర్ కృపా పాత్రులని చెప్పుకునే కొందరు కార్మిక నాయకులు తమ ఆదర్శాన్ని చిన్న చిన్న సంస్కరణల వరకే కొనియాడుతున్నారు. నిజమైన కార్మిక నాయకులు, కార్మిక కర్షక రాజ్యాన్ని కలలు కనేవారు మధుపురిలో ఇంతవరకూ అడుగు పెట్టలేదు. అటువంటప్పుడు రాయ్‌బహద్దూర్ కార్మిక నాయకుడు కావటం సబబు కాదని ఎవరన గలరు? లక్షాధికారులయిన కార్మిక నాయకుల్ని ప్రజలు అనవసరంగా విమర్శిస్తుంటారు. అలాంటి విమర్శలు చేసేవారు మధుపురిలోనూ వున్నారు. అలాంటి వాళ్ళ విమర్శల్ని పట్టించుకోవల్సిన అవసరం రాయ్‌బహద్దూర్‌కు లేదు!

రాయ్‌బహద్దూర్ దూరదృష్టి కలవాడు. గుడ్లన్నింటినీ ఒకేచోట పెట్టి అన్నింటినీ ఒకేమారు కుళ్ళబెట్టుకునే రకం కాదు. తన గుడ్లను చాలా బుట్టల్లోకి సర్దిపెట్టుకున్నాడు. ఒక బుట్టలోవి కుళ్ళిపోయినా పెద్ద నష్టమేమీ రాదు. రాయ్‌బహద్దూర్ కాంగ్రెస్ దేవతల్లో ప్రముఖులనే సంతోషపెట్టి ఆశీర్వచనాలు పొందాడు. అలాంటప్పుడు కాంగ్రెస్‌లోని చిన్న చిన్న దేవుళ్ళు నిందించినా పట్టించుకోవాల్సిన పనేముంటుంది? ఇంగ్లీషు దొరలకు 'జీహుజూర్' కొట్టడంతోనే అతనికి తల పండిపోయిందని ఎవరైనా నిందించినా, కాంగ్రెస్ వాళ్ళు మాత్రం చేసిందేమిటి? అప్పుడేదో కష్టపడ్డారు. భగవంతుడు దయదలిచాడు. ఈనాడు అనుభవిస్తున్నారు. పరిమిట్లు, కంట్రోలు పుణ్యమా అని తమ ఇండ్లను లక్ష్మీ నివాసాల్ని చేసుకున్నారు. వాళ్ళ శక్తి ననుసరించి వాళ్ళ అన్నదమ్ముల్ని, మేనల్లుళ్ళనీ, బావమరుదుల్నీ, కీలకమైన ఉద్యోగాలు ఇప్పించారు. అలాంటప్పుడు రాయ్‌బహద్దూర్ స్వార్థపరుడని ఎలా నిందించగలరు? తాము స్వయంగా గాజు మేడల్లో వుంటూ ఇతరుల గాజుమేడల మీద రాళ్ళు వేయటం లాంటి పనిని కాంగ్రెస్ వారు చేయరు? అధికారంలోకి

వచ్చిన వెంటనే కాంగ్రెస్ ప్రభువులు ఒక ప్రకటన చేశారు. 'గతాన్ని మర్చిపోండి, గతం గతం నాస్తి' అన్నారు. కాంగ్రెస్ ప్రభువుల ఈ ఔదార్యంకారణంగా 1942లో కొన్నివేల మంది దేశభక్తుల్ని హత్యచేసిన జాతి హంతకులైన పోలీసు అధికార్లు అత్యున్నత పదవుల్లో వున్నారు. హత్యలకు గురైన ఆ దేశ భక్తుల సంతానాన్ని రోడ్లమీద వదిలివేశారు? కనీసం తింటానికి తిండి కూడా లేకుండా అడుక్కుతినే స్థితిలో వాళ్ళను వుంచారు. ఇంగ్లీషు వాళ్ళ చెప్పులు నాకి బతికిన కుక్కలే ఈనాడు ఢిల్లీలోని కాంగ్రెస్ దేవతలకు ముఖ్యులయ్యారు. వాస్తవానికి ఇంగ్లీషు దొరల చెప్పులు నాకి పొట్టలు పెంచుకున్న ఈ దుష్టులే భారత ప్రభుత్వం అనే నావను నడుపుతున్నారు. ఒక ఉద్యోగులనే కాదు. గతంలో ఇంగ్లీషు దొరలకు అనన్యభక్తులైన దేశ ద్రోహులందర్నీ కాంగ్రెస్ వారు ఆదుకుని వారికి గొప్ప పదవులను ఇచ్చారు. ఆనాడు రామచంద్రుడు "గుణికా, గ్రద్ధ, అజామిళుడు" వీళ్ళను ఉద్ధరించాడట. ఈనాడు మన కాంగ్రెస్ దేవుళ్ళు అలాంటి వారిని అనేకమందిని ఉద్ధరిం చారు. ఉద్ధరించిన రాముడిలా విడిచి పెట్టలేదు. సరికదా తమ కులాల్లో, వర్గాల్లో ఉన్నత స్థానాన్ని కల్పించారు. సంరక్షించారు. వాళ్ళతో వివాహ సంబంధాల్ని ఏర్పరచుకుని, బంధుత్వాల్ని కలుపుకున్నారు. రోటీ–బేటీ ఒకటి చేసేశారు. అంతటి పాపులే కాంగ్రెస్ దేవుళ్ళ కారుణ్యం వలన తరించినపుడు రాయ్‌బహద్దూర్ తరించటం తప్పని ఎవరు అనగలరు? అసలు రాయ్‌బహద్దూర్ చేసిన అపరాధం ఏముంది? ఇంగ్లీషు ప్రభువుల్ని కొలిచాడు? అంతేగా.... ఆనాడు ఇంగ్లీషు ప్రభువుల అనన్య భక్తులు ఎందరో దేశానికి ఎన్నో రకాలుగా ద్రోహం చేసినవారు ఈనాడు గొప్ప పదవుల్లో వున్నారు కదా? రాయ్‌బహద్దూర్ అలాంటివి ఏమీ చేయలేదు కదా?

రాయ్‌బహద్దూర్ మధుపురిలో స్థానిక కాంగ్రెస్‌కు అధ్యక్షుడయ్యాడు. రెండు సంవత్సరాల క్రితం రాయ్‌బహద్దూర్ స్థానిక కాంగ్రెస్‌కు అధ్యక్షుడవుతాడనే ఎవరితో నైనా అంటే నమ్మేవారు కాదు? మన దేశంలో ప్రతిదీ నత్తనడక నడుస్తోందని ఎవరనగలరు? ఎందుకంటే కొన్ని పనులు అమిత వేగంతో జరుగుతున్నాయి. రెండు సంవత్సరాల క్రితం అసంభవం అనుకున్నవి ఇప్పుడు సంభవమవుతున్నాయి. అయితే, కొన్ని పనులు నత్తనడకలో కాదు, అంతకంటే మెల్లిగానే జరుగుతున్నాయి. ముఖ్యంగా ఆఫీసుల్లో ఫైళ్ళు మహా మెల్లగా నడుస్తున్నాయి. ఇంగ్లీషు వారి సమయంలో ఒక ఉద్యోగితో జరిగిపోయిన పని ఇప్పుడు ఐదుగురు ఉద్యోగులున్నా, ఫైళ్ళు చెదలు తిని పోయేవరకూ, ఆఫీసుల్లోంచి కదలటమే లేదు. ఒకవైపున ఇంత మందగతిలో పనులు జరుగుతూ, మరొక పక్క అతి తీవ్రవేగంతో మార్పులొచ్చి నెలకు రెండు వందల జీతం తీసుకుంటున్న ఉద్యోగి క్షణాల మీద పదిహేనువందల జీతం తీసుకునే పదవిలోకి వెళ్తున్నాడు. దేశంకోసం

ఎన్నడూ ఏ త్యాగమూ చేయని ఎలాంటి ప్రతిభా పాటవలూ లేని కొన్ని కుటుంబాల వారు ఈనాడు ప్రభుత్వంలో గొప్ప పదవుల్లో వున్నారు. కొన్ని సంవత్సరాలుగా వస్తున్న సివిల్ లిస్టును చూస్తే, కేంద్రంలో గానీ, రాష్ట్రాల్లో గానీ, అన్ని పనులూ, నత్తనడకతోనే నడవటం లేవన్న విషయం స్పష్టమవుతుంది. మనదేశంలో, నల్లదొరల ప్రభుత్వంలో అసంభవం అనుకున్న పనులు సంభవం అవుతున్నాయి. అలాంటప్పుడు రాయ్‌బహద్దూర్ స్థానిక కాంగ్రెస్‌కు అధ్యక్షుడయితే ఆశ్చర్యపడవల్సిన పనేముంది? ఇంగ్లీషువారి సమయంలో, మధుపురిలో కాంగ్రెస్ వాళ్ళు చాలా తక్కువ సంఖ్యలో వుండేవారు. వెనుక మధుపురి ఇంగ్లీషువారి ముఖ్య స్థావరం. సంవత్సరానికి నాలుగు నెలలు బ్రిటిష్ సైనికులు అక్కడ వుండేవారు. అక్కడి ప్రజల జీవనోపాధి ఇంగ్లీషు దొరలకూ, ఆదొరల పరమ భక్తులయిన నల్లదొరలకూ, సేవ చేయటమే! ఆ స్థితిలో, మధుపురిలో కాంగ్రెస్ వారు వుండే పరిస్థితులెక్కడివి? కాంగ్రెస్‌ను గురించి మాట్లాడుకోవాలంటే ప్రజలు వెనకా, ముందూ ఆలోచించేవారు. ఎవరూ వినకుండా, రహస్యంగా మాట్లాడుకునేవారు. గాంధీ టోపీ పెట్టుకోవాలన్నా అంతే! చుట్టుపక్కల ఎవరూ లేరని నిర్ధారణ చేసుకుని రహస్యంగా గాంధీ టోపీని పెట్టుకునేవారు. ఇతర ప్రదేశాల్లో స్వాతంత్ర్యోద్యమం ముమ్మరంగా సాగుతూన్న రోజుల్లో మధుపురిలో ఒకరిద్దరు మాత్రమే జైలుకు వెళ్ళి వుంటారు. ఆనాడు జైలుకు వెళ్ళిన ఒకరిద్దరు రహస్యంగా 'గాంధీజీ' కి జై అన్న అరడజను మంది తెల్లవాడు లేకుండా చూసుకుని గాంధీటోపీని పెట్టుకున్న డజను మంది తాము ఎంతో త్యాగధను లమని గుండెలు బాదుకుంటున్నారు. అలాంటివారు కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాయ్ బహద్దూర్ పనికిరాడని విమర్శిస్తున్నారు. అసలు వాళ్ళకంటే రాయ్ బహద్దూర్‌కి కాంగ్రెస్ లోతులు బాగా తెల్సు. ఏమో త్యాగాలు చేశామని గుండెలు బాదుకుంటున్న నాయకులకు ప్రజల్లో పలుకుబడి ఏ మాత్రం లేదని రాయ్‌బహద్దూర్‌కు తెల్సు. అయితే, వాళ్ళు పైన వున్న కాంగ్రెస్ నాయకుల కృపా దృష్టివల్ల కాంగ్రెస్ నాయకులమని చెప్పుకుంటున్నారు. రాయ్‌బహద్దూర్ కూడా పై నున్న నాయకులు కృపాదృష్టిని బాగానే పొందగలిగాడు. స్థానిక నాయకులు ఇన్నాళ్ళూ గాఢనిద్రలో వున్నారు. ఇప్పుడే కండ్లు తెరిచారు. అయినా, చేతులు కాలాక ఆకులు పట్టుకుని ప్రయోజనం ఏముంటుంది? ఇప్పుడు మధుపురిలో కాంగ్రెస్ నాయకత్వంలో రాయ్‌బహద్దూర్‌కు పోటీ ఎవరూ లేరు!

# గురూజీ

## 1

**వే**ల సంవత్సరాలుగా మిథిల (విదేహ) ప్రాచీన విద్యలకు నిలయంగా వుండేది. పూర్వకాలంలో జనకుడు బ్రహ్మవిద్యలో పోటీల్ని నిర్వహించి గెలిచిన బ్రహ్మజ్ఞానికి వేల సంఖ్యలో ఆవుల్నిఇస్తుండేవాడట. అంతగా కాకపోయినా ఈనాటికీ ఆ వెనుకటి ఆచారం ఏదో ఒక రూపంలో బతికి వుంది. మిథిలలో మిగతా ప్రాంతాలకంటే ప్రాచీన విద్యలంటే అక్కడ ఈనాటికీ గౌరవం ఎక్కువగానే వుంది. ఇతర ప్రాంతాలలో సంస్కృతం సంపాదనకు తోడ్పడని విద్య కావటం వలన సంస్కృతాన్ని బాయ్‌కట్ చేశారు. సంపాదించి పెట్టే ఇంగ్లీషు విద్యను అభ్యసిస్తున్నారు. కానీ మిథిల బ్రాహ్మణులలో సంస్కృతాన్ని వదిలి ఇంగ్లీషు విద్యవైపు మొగ్గిన వారి సంఖ్య చాలా తక్కువ. మిథిలలో వున్నన్ని సంస్కృత విద్యాలయాలు భారతదేశంలోని మిగిలిన ప్రాంతాలలో లేవు. ఇక్కడ అత్యధిక సంఖ్యలో విద్యార్థులు సంస్కృతాన్ని అభ్యసించటమే కాకుండా సంస్కృతంలోని వివిధ శాస్త్రాల్ని, శాఖాబేధాల్తో సహా అభ్యసించటానికి తమ జీవితంలో అధిక భాగాన్ని ఖర్చుపెడుతుంటారు. బీద విద్యార్థులు మిథిలలో ఛాత్రవృత్తి (స్కాలర్‌షిప్)ని పొందుతూ లేదా చుట్టుపక్కల వున్న ధనికుల ఇళ్ళల్లో వారాలు చేసుకుని సంస్కృతం నేర్చుకునే అవకాశం ఇప్పటికీ వుంది. బీద బ్రాహ్మణ విద్యార్థులు ఇంగ్లీషు చదవటానికి అనేక అభ్యంతరాలు ఎదురవుతాయి. స్కూలు ఫీజు కట్టాలి. తిండికీ, పుస్తకాలకూ డబ్బు కావాలి. ఇవన్నీ ఎక్కడ నుండి వస్తాయి? కాబట్టి ఇంగ్లీషు విద్యను అభ్యసించలేకపోయారు. మిథిల ఇప్పటివరకూ దిగ్గజాల లాంటి మహా పండితుల్ని తయారు చేసింది. మండన మిశ్రా, వాచస్పతి మిశ్ర, ఉదయనుడు, పార్థసారధి మిశ్ర, గంగేశ్ ఉపాధ్యాయ – లాంటి మహా పండితులందర్నీ మిథిల మనకు ఇచ్చింది. ఇప్పటికీ ఎందరో పండితుల్ని ఇస్తోంది మిథిల!

ప్రస్తుతం ఆహార ధాన్యాల ధరలు చుక్కలనంటుతున్నాయి. వెనుక 20 మందికి

స్కాలర్‌షిప్ ఇస్తే, ఇప్పుడు 5గురికి ఇవ్వడం గగనంగా వుంది. స్వదేశ సంస్థానాలూ, జమీందారులు రద్దు కావటం వలన సంస్కృత పాఠశాలలూ వాటిలో చదువుకునే విద్యార్థులూ, బాగా నష్టపోయారు. అయినా మిథిలలో సంస్కృత పండితులు ఎక్కువగానే వున్నారు. కనుక మిథిలలోని సంస్కృత పండితులు బతుకు దెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్ళటం అనాదిగా వస్తున్నదే! ప్రతి గ్రామంలోనూ పండితులు డజన్ల కొద్దీ వుంటే అధ్యాపక వృత్తి ఎవరికి లభిస్తుంది?

సహాయ నిరాకరణోద్యమం జరుగుతున్న రోజులవి. బీహార్‌లో ఉద్యమం అగ్ని జ్వాలల్లా వ్యాపించింది. మిథిలలోని సంస్కృత పండితులు ఆ ఉద్యమం పట్ల దృష్టి పెట్టటానికి తయారుగా లేరు. మిథిలలోని పండితులు బ్రాహ్మణ యువకులకు ఐదు వందల సంవత్సరాల క్రితం నాటి చదువు చెప్తున్నారు. యువకుల బుర్రల్లో ఆనాటి భావాలే నాటుకుని వున్నాయి. అలాంటప్పుడు ఎంతటి ప్రతిభా సంపన్నుడైనప్పటికీ కూపస్త మండూకం కాక మరి ఇంకేమౌతారు? మూర్ఖమైన ఆచారాల్ని, ఏ ఒక్కదాన్నీ వదిలి పెట్టటానికి వాళ్ళు సిద్ధంగా లేరు. ఎవరైనా ఇతర దేశం వెళితే చాలు తప్పనిసరిగా ప్రాయశ్చిత్తం చేయించుకోవల్సిందే! ఇతర దేశం వెళ్ళిన వాడు ఎటూ ఇతర జాతీయులు స్పర్శించిన నిషిద్ధ పదార్థాలని తిని వుంటాడని పండితులు నిర్ధారించుకునే వారు. శాస్త్రీయంగా ప్రాయశ్చిత్తం జరగాల్సిందే అనేవారు. అంటే, బ్రహ్మజ్ఞానులూ, పండితులూ అయిన బ్రాహ్మణులకు 'సంతర్పణ' చేయాలన్న మాట. ఇతర ప్రాంతాలకు వెళ్ళి, ఎన్నో కష్టాలు పడి సంపాయించుకున్న సంపాదనను 'సంతర్పణ'లో ఖర్చు పెట్టటానికి ఎవరికి మనసొప్పుతుంది? భోజనం విషయంలో మిథిల బ్రాహ్మణులలో ఇప్పటికీ వెనుకటి సాంప్రదాయాన్నే పాటిస్తున్నారు. "పంచ పంచనఖా భక్ష్యాః' అన్న మహావాక్యాన్ని అక్కడి బ్రాహ్మణులందరూ ఒప్పుకుంటారు. కనుక అక్కడి మహాపండితులూ, ధార్మిక నిష్టాపరులు చేపలూ, మాంసాన్నే కాకుండా ఐదుగోళ్ళు వున్నాయి కనుక తాబేళుని కూడా స్వాహా చేస్తారు. అయితే మాంసాన్ని సాత్విక ఆహారంగానే స్వీకరిస్తారు. దానిలో ఉల్లిపాయ, వెల్లుల్లి గానీ, గరం మసాలాకానీ ఉండదు. ఈ మాంసం పదార్థాలను వంటగది బయటకు తెచ్చుకుని తినరు. పంక్తి భోజనానికి అర్హులైన వారు వండివార్చినా తినరు. వారి దేశ, కాల పరిజ్ఞానం కూడా భిన్నంగా వుంటుంది. ఐదు వందల సంవత్సరాల క్రితం వున్న భూగోళ జ్ఞానాన్ని అనుసరించి రచించిన గ్రంథాన్ని అధ్యయనం చేస్తున్నప్పుడు, ఆధునిక భూగోళాన్ని తెలుసుకోనప్పుడు ఏ దేశం ఎక్కడ వుందో? వారికి ఎలా తెలుస్తుంది?

అలాంటి మిథిల నగరంలోని ఒకానొక రత్నం 'గురూజీ'. అతని చదువు సంధ్యలన్నీ వంశపారంపర్యంగా వస్తున్న ఆచారాల ప్రకారమే జరిగాయి. తమ గ్రామంలోని సంస్కృత

పండితుని దగ్గర విద్యాభ్యాసాన్ని సాగించాడు. అక్షరాలు వచ్చే వరకయినా ప్రైమరీస్కూలుకు వెళ్ళలేదు. రెండు మూడు సంవత్సరాలు ప్రైమరీ స్కూలుకు వెళ్ళినా దేశ పటాన్ని చూడటమో కనీసం తమ జిల్లాకు సంబంధించిన భూగోళ జ్ఞానాన్ని తెల్సుకోవటమో జరిగి వుండేది. కానీ అతనలా ప్రైమరీ స్కూల్లో చదవలేదు. సంస్కృతము మాత్రమే చదివాడు. పండితుడ య్యాడు. పండితులు అధికంగా వున్న చోట ఎంత గొప్ప పండితులైనా 'అగ్ర' స్థానాన్ని పొందటం కష్టం. ఒకవేళ అగ్రస్థానాన్ని పొందగలిగినా, జీవిక కోసం అన్యప్రాంతాలకు వెళ్ళవలసిందే! మిథిల లోని పండితులెవరూ మ్లేచ్ఛ దేశాలయిన అన్య ప్రాంతాలకు వెళ్ళాలని కోరుకోరు. కానీ పొట్టకోసం వెళ్ళక తప్పదు కదా? అన్యమ్లేచ్ఛ ప్రాంతాలలోని బ్రాహ్మణులు వైదిక కాలం నుండి అనాచారంగా వస్తున్న పవిత్రమైన ఆహారం 'మీన మాంసాల్ని' త్యాగం చేశారు. వాటిని అపవిత్రమైన ఆహారంగా భావిస్తున్నారు. అలాంటి దుస్థితిని ధర్మ నిష్టాపరులైన మిథిల బ్రాహ్మణులు ఎలా సహించగలరు? అంతేకాక ఆ మ్లేచ్ఛ ప్రాంతాలలో సంవత్సరాల తరబడి శాఖాహారంతో వుండి స్వదేశానికి వస్తే ప్రాయశ్చిత్తం చేసుకోవలసి వుంటుంది. గురూజీకి తన ఇరవై నాలుగూ, ఇరవై అయిదేళ్ల వయస్సులో విద్యాధ్యయనాన్ని పూర్తిచేసుకుని తరువాత దరిద్రంతో సతమతమౌతున్న తననూ, తన కుటుంబాన్ని ఉద్ధరించుకోవటానికి తప్పని సరై అన్య ప్రాంతాలకు వెళ్ళవలసి వచ్చింది.

ఆనాడు మిథిల మహారాజయిన జనకుడు తన కూతురు సీతను 'వీర్యక్రేయ'గా ప్రకటించాడు. అయితే, అది ఆనాడు క్షత్రియ కన్యల వరకే పరిమితం అనుకుంటున్నాను. ఆనాడు, ఈనాడు, ఎప్పుడూ బ్రాహ్మణకన్యలు 'ద్రవ్యక్రీయలు'గానే వుండిపోయారు. ద్రవ్య క్రీయలు కాని బ్రాహ్మణ కన్యలు చాలా అరుదుగా కానీ లభించరు. ఈమధ్య మిగతా వారిని చూసి ద్రవ్యానికి బ్రాహ్మణ కన్యల్ని అమ్మటం ఒకరిద్దరు మానుకున్నారు. దర్భంగా జిల్లాలోని 'సౌరాష్ట్ర' లో కొన్ని వేల వృక్షాలు గల మామిడితోట ఈనాటికీ వుంది. ఆ తోటలో ప్రతి సంవత్సరం ఒక పెద్ద తిరునాళ్ళ (మేళా) జరుగుతుంది. ఆ తిరునాళ్ళకు కొన్నివేల మంది బ్రాహ్మణులు పెళ్ళి సంబంధాలు కుదుర్చుకోవటానికి వస్తుంటారు. అసలు ఈ తిరునాళ్ళు పెళ్ళిళ్ళ తిరునాళ్ళగా ప్రసిద్ధి చెందింది. పెళ్ళిళ్ళ పేరమ్మలు చాలా మంది వస్తుంటారు. వాళ్ళ దగ్గర బ్రాహ్మణ కుటుంబాలకు సంబంధించిన వంశాల వారీ వివరాలున్న దస్త్రాలుంటాయి. వారికి సాక్ష్యం, సలహా లేకుండా ఏ వివాహమూ జరగటానికి వీల్లేదు. అతనే వధూవరుల వంశాల వివరాల్ని తెలియపరిచి, వివాహ ప్రామాణికతను ధృవీకరిస్తాడు. ఒక్కొక్కసారి ఈ పెళ్ళిళ్ళ పేరయ్యలు డబ్బాశకు అన్యకులాలకు చెందిన కన్యల్ని బ్రాహ్మణ కన్యలుగా చూపించటమూ జరుగుతూ వుంటుంది. అయితే, అలాంటి

సంఘటనలు చాలా అరుదుగా గానీ జరగవు. వివాహ వయస్సు వచ్చిన బ్రాహ్మణ యువతీ, యువకుల కుటుంబాల వాళ్ళందరూ ప్రతి సంవత్సరమూ ఆ తిరునాళ్ళకు హాజరవుతూ వుంటారు. ఆ గృహస్థులతో పాటు వరుడు తప్పక వెళ్ళాలి. వధువు రాకపోయినా ఫర్వాలేదు. వధువుకు పదేళ్ళు కానీ అంతకంటే తక్కువ వయస్సు వున్నా ఫర్వాలేదు. వరుడికి కనీసం ఇరవై ఏళ్ళయినా వుండాలి. మిథిలలోని ఇతర కులాల ప్రజలు మొగపిల్లలకు కట్నాలు అడుగుతూ వుంటే బ్రాహ్మణులు మాత్రం కన్యాశుల్కాన్ని అడుగుతున్నారు. బ్రాహ్మణ కుటుంబాల్లో ఆచారంగా వస్తున్న కన్యాశుల్కం ఒక్కొక్కసారి వందలు, వేలు దాకా సందర్భానుసరించి పలుకుతూ వుంటుంది. గురూజీ తన జన్మస్థానంలోనే ఒకవేళ వుంటే, తిండి తినీ, తినకా రోజుల్ని గడిపేవాడే కానీ పెండ్లి మాత్రం చేసుకోగలిగే వాడు కాదు. పెండ్లి అయ్యాక నెలా, రెండు నెలల పాటు అత్తవారింట్లో పెట్టే మనుగడుపు (అల్లుడికి ఆతిథ్యాన్ని ఇవ్వటం) నూ తినగలిగేవాడు కాదు. అత్తవారింట్లో మనుగడుపు అంటే రుచికరమైన మత్స్య–మాంసాల్ని, పిండివంటల్ని తినబెట్టడం అన్నమాట. తమ గ్రామంలోనే వుంటే, గురూజీకి ఆ అదృష్టం ఎక్కణ్ణుండి పడుతుంది.

'గురూజీ'కి అప్పటికింకా ఆ నామం స్థిరపడలేదు. దాదాపుగా ముప్ఫై సంవత్సరాలకు పైగా కర్మక్షేత్రంలో కష్టపడితే అతనికా బిరుదు లభించింది. గురూజీ ఛాందస కుటుంబంలో పుట్టినప్పటికీ పొట్టకోసం అన్యదేశ ప్రవాసాన్ని స్వేచ్ఛా పూర్వకంగా స్వీకరించడం ఆ కుటుంబాల్లో ఆచారంగా వస్తున్నదే! మిథిల లోని బ్రాహ్మణ కుటుంబాలలోని పండితులు సహజంగానే బ్రతుకు తెరువును వెతుక్కుంటూ ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. అలా వెళ్ళి వచ్చిన పండితులు ఆ ప్రాంతాల గురించి చెప్పగా కొన్ని విషయాలు తెలుసుకున్నాడు గురూజీ. వాళ్ళ ద్వారా తెల్సుకున్న విషయాలే గురూజీకి తెల్సిన భౌగోళిక జ్ఞానం పశ్చిమ ప్రాంతాల్లో శాస్త్రజ్ఞానం గల పండితులు తక్కువ. కనుక మంచి పాండిత్యం కలవారికి పశ్చిమ ప్రాంతాల్లో డిమాండ్ ఎక్కువ. అందుకనే మిథిల బ్రాహ్మణులు పశ్చిమ ప్రాంతాలకు వెళ్ళటానికి ఉత్సాహాన్ని చూపిస్తారు. మిథిలకు దక్షిణాన వున్న బెంగాలులో ఇంగ్లీషు విద్య మీద మోజు పెరగటం వలన సంస్కృత పండితులకు అక్కడ అంతగా స్థానం లభించదు. అయితే, మిథిల వంట బ్రాహ్మణులకు బెంగాల్‌లో మంచి డిమాండ్ వుంది.

మిథిల పండితులు పశ్చిమ ప్రాంతాల రాజస్థానాలకూ, ఇతర ప్రాంతాలకు ఎక్కువగా వెళుతూ వుంటారు. రాజస్థానంలో మహారాజులుంటారు. అదృష్టం కలిసివచ్చి వారి ఆస్థానాల్లో, ఆస్థాన పండితులుగా దొరికితే ధనానికి ధనం గౌరవానికి గౌరవం లభిస్తాయి. ఆస్థాన పండితులు కావటం అందరికీ సాధ్యం కాకపోయినా, కావాలని ఆశ అయితే వుంటుంది కదా? గురూజీకి తను రాజస్థానంలో పండితుడవుతాడన్న విశ్వాసం లేదు.

కనీసం ఏ సంస్కృత పాఠశాలలోనైనా అధ్యాపకుణ్ణయితే చాలనుకున్నాడు. అక్కడ సాధారణ సంస్కృత పాఠశాలల్లోని అధ్యాపకులకు మిథిలలోని అధ్యాపకులకంటే రెండు, మూడు రెట్లు అధికంగా జీతం లభిస్తుంది. తమ గ్రామంలోని పండితులు గురూజీకి ముందుగా కొన్ని విషయాలను చెప్పి వుంచారు. పశ్చిమ ప్రాంత ప్రజలు ధర్మ శాస్త్రానుసారం భ్రష్ఠులయ్యారు. కనుక మత్స్యమాంసాల్ని తినటం మహాపాపంగా పరిగణింపబడుతుంది. వేల సంవత్సరాలుగా, మహాపురుషుల కాలం నుండీ ఎంతో పవిత్రమైనదిగా భావిస్తున్న 'మధుపర్కాన్నీ' మాంసం లేకుండానే స్వీకరించాలక్కడ. (మత్స్యం – కచ్ఛపం– వరాహం) విష్ణుమూర్తి యొక్క ఈ మూడు అవతారాల్ని) గమనికలోకి తీసుకోని మిథుల పండితులకు ధర్మ భ్రష్ఠులూ, శాకాహారులూ, నివసించే ప్రాంతాలకు వెళ్ళాలని ఎందుకు అనిపిస్తుంది? అనిపించకపోయినా వెళ్ళక తప్పదు కదా? పొట్టకోసం ఏమైనా చేయాలి మరి? ఒకదేశ రాజస్థానంలో, సంస్కృత పాఠశాలల్లో నౌకరీ దొరికిందీ అనుకుందాం! అక్కడి బ్రాహ్మణులకు మత్స్యమాంసాల్ని తినము అని ప్రమాణం చేసి చెపితే కానీ నమ్మరు. చెప్పటమే కాకుండా త్రికరణ శుద్ధిగా పాటించాలి. ఇంట్లో వండుకోవటానికి వీలుండదు. చాటుగా ఏ హోటల్ నుండో వండిన మాంసాన్ని తెచ్చుకు తినాలంటే, తమ వంటశాలల్లో వండిన మాంసాన్నే తినవచ్చు కానీ వేరేచోట వండిన మాంసాన్ని తినకూడదన్న నియమం ఒకటి వున్నది కదా?

గురూజీ తాను విన్నదాన్ని బట్టీ, తనకు తెలిసిన దాన్ని బట్టి పశ్చిమ దేశాల్లో ఎంతో కష్టంగా జీవితాన్ని గడపవలసి వుంటుందనుకున్నాడు. 'పరదేశు–కలేసు–నరేసుహ్రుకో' (మహారాజుకయినా పరదేశ వాసం క్లేశదాయకమే) అన్న మహాకవి వాక్యం నిజమనుకున్నాడు.

## 2

ఒకరోజున శుభముహూర్తాన గురూజీ దర్భంగా జిల్లాలోని తమ గ్రామంనుండి పశ్చిమానికి ప్రయాణం సాగించాడు. రైళ్ళు ఎటూ వున్నాయి. కొన్ని రూపాయలు ఏర్పరచుకుని ఎక్కడికయినా వెళ్ళవచ్చును. కానీ ఎక్కడికయినా వెళితే ఉద్యోగం దొరుకుతుందన్న గ్యారంటీ ఏముంది. కనుక, ఉద్యోగం దొరికే చోటుకే వెళ్ళాలి. గురూజీ ప్రాచీన పద్ధతుల్లో కేవలం సంస్కృతాన్ని మాత్రమే చదివాడు. మనిషి తెలివి తేటలు వున్నవాడే. తెలివి తేటలే లేనివాడయితే ఊరు విడిచి ఇతర ప్రాంతాలకు వెళ్ళాలన్న సాహసోపేతమైన నిర్ణయాన్ని తీసుకునే వాడుకాదు. ఉత్తర భారతదేశంలోని పశ్చిమ నగరాలలో గురూజీకి బంధువులు కొందరున్నారు. దాదాపుగా బంధువులున్న నగరాలన్నింటికీ బతుకు తెరువు కోసం వెళ్ళాడు. అక్కడ కొన్నాళ్ళు, ఇక్కడ కొన్నాళ్ళు సంస్కృత పాఠశాలలో అధ్యాపకుడిగా పని చేశాడు.

సంస్కృత పాఠశాలల్లో చాలా తక్కువ జీతం  ఇస్తారు. అంతకంటే ఇతర పాఠశాలల్లో సంస్కృత అధ్యాపకుడిగా ఉద్యోగం తెచ్చుకుంటే కొంతవరకూ నయం. అయితే అలాంటి ఉద్యోగం సంపాదించాలంటే ఇంగ్లీషు భాషాజ్ఞానమూ కొంత వుండాలి. అందుకే గురూజీ సంస్కృత పాఠశాలల్లో పనిచేస్తూనే ఇంగ్లీషు 'ఎ.బి.సి.డి.'లు కూడా నేర్చుకున్నాడు. ఒక పుస్తకాన్ని కూడా చదివేశాడు. 'అమరకోశం' లాంటి కోశం ఇంగ్లీషులోనూ వుంటే బాగుండు కంఠస్థం చేయవచ్చు ననుకున్నాడు. నలుగురినీ అడిగాడు. అమరకోశం లాంటి కోశం వల్లించటానికి పనికి వచ్చేది ఇంగ్లీషులో లేదని చెప్పేవారు. ఇంగ్లీషులో అలాంటికోశం ఏమీ లేదని తెలుసుకున్నాక విద్యా విషయంగా ఇంగ్లీషువారు చాలా వెనుకబడి వున్నారని అనుకున్నాడు. అయితే, అలాంటి కోశం ఇంగ్లీషులో లేదని చెప్పిన వారికి తెలియదు కానీ పద్యబద్ధమైన 'కోశం' లేకపోవచ్చు కానీ, వచనంలో పర్యాయవాచి శబ్ద కోశం ఇంగ్లీషులోనూ వుంది. దాన్ని మేధావులు, కవులు ఉపయోగిం చుకుంటూనే వున్నారు. సాధారణులకు అకారాది క్రమంలో వున్న మామూలు శబ్దకోశాలే ఎక్కువ ఉపయోగకరంగా వుంటాయి. వల్లించడంలోని సౌకర్యం గురూజీకి బాల్యం నుండి తెల్సు! వల్లించగా, వల్లించగా విద్య త్రవ్వగా త్రవ్వగా నీరూ లభిస్తాయన్న విశ్వాసం గురూజీకి వుంది. వల్లించటం అనే ప్రక్రియ ఇతరులకు కష్టదాయకంగా కనిపిస్తుంది. కానీ గురూజీకి మాత్రం వల్లించడం అంటే నల్లేరు మీద బండి తోలినట్టే! తన విధానాలకు సరిపడే గ్రంథాలు ఇంగ్లీషులో లేనందుకు చాలా విచార పడ్డాడతడు! ఎన్నోసార్లు అనుకున్నాడు. "లఘుకౌముదిలా వల్లించటానికి వీలైన వ్యాకరణ సూత్రాలు గల గ్రంథమూ, అమరకోశం లాంటి వల్లించటానికి వీలుగా పద్యబద్ధమైన పర్యాయం వాచి శబ్దకోశమూ – ఇంగ్లీషులోనూ వుంటే ఎంత బాగుండేది". రెండు గ్రంథాలనూ కంఠస్థం చేసేసి ఇంగ్లీషునూ ఔపోసన పట్టుకునే వాణ్ణి కదా! "తను కోరుకున్నవేవీ ఇంగ్లీషులో దొరకకపో యినప్పటికీ కొంచమైనా ఇంగ్లీషును అభ్యసించాలనుకున్నాడు. అలా అభ్యసించినందువల్ల కొంత లాభమూ వుంది. ఏ ఇంగ్లీషు స్కూలులోనయినా, సంస్కృత ఉపాధ్యాయుడిగా ఉద్యోగాన్ని సంపాదించుకోవచ్చు. అయితే హైస్కూళ్ళ యాజమాన్యం సంస్కృతానికి ఉపాధ్యాయుల్ని నియమించకుండా సంస్కృతం వచ్చిన ఇతర ఉపాధ్యాయులతో సంస్కృతాన్ని చెప్పించి సరిపెట్టుకుంటారు. ఒకవేళ ఎవరినైనా నియమించినా అక్కడ పనిచేసే వాళ్ళే సరిపోతారు. గురూజీకి ఎవరో కొండ ప్రాంతాలకు వెళ్ళమని, "కొండ ప్రాంతాల్లో ఇంగ్లీషు కొద్దిగా వచ్చినా, సంస్కృత పండితుని ఉద్యోగాన్ని సంపాదించవచ్చు. మైదాన ప్రాంతాల కంటే కూడా జీతం ఎక్కువగా వుంటుంది!" అని సలహా ఇచ్చారు.

తీర ప్రాంతాలలో వుండే తమ గ్రామాలను వదిలి పశ్చిమ నగరాలలో బతుకు

దెరువు కోసం వెళ్ళిన యువకులకు అక్కడినుండి మధుపురికి వెళ్ళటం పెద్ద సమస్య కాదు. ఒక శుభదినాన గురూజీ మధుపురికి వెళ్ళాడు.

మిథిల పండితుల పాండిత్యాన్ని అన్ని ప్రాంతాల వారూ ఒప్పుకుంటారు. మధుపురికి వెళ్ళగానే పరిచయస్థులు గౌరవంతో గురూజీని ఆదరిస్తారనడంలో ఎట్లాంటి సంశయం లేదు. గురూజీకి ఇంగ్లీషు రాని మాట వాస్తవమే అయినప్పటికీ, ఆకారణంగా వారిని ఆదరించటంలో కానీ వారికి భృతిని కల్పించడంలో కానీ ఎలాంటి లోపమూ వుండదు. ఎందుకంటే అతిశీతల ప్రదేశం కావటం వలన మధుపురికి సాధారణంగా పండితులు ఎవరూ వెళ్ళరు.

ముప్పై, ముప్పై ఐదు సంవత్సరాల క్రితం మధుపురిలో సంస్కృత పండితులు అవసరాని కంటే చాలా తక్కువమంది వుండేవారు. మిథిల యువకుడికి మధుపురికి రాగానే ఉద్యోగం దొరికింది. గురూజీ అన్న బిరుదూ లభించింది. ఒకప్పుడు ఇంగ్లాండు నుండి ఒక భూఖండాన్ని తెచ్చిపెట్టారా అన్నట్టుగా ఇంగ్లీషు వాళ్ళతో నిండి వుండేది మధుపురి. గాంధీగారి సహాయ నిరాకరణోద్యమం ముమ్మరంగా సాగుతున్న రోజులవి. ఇంగ్లీషువారి ప్రభావం భారతదేశములోని ఇతర ప్రాంతాల ప్రజల హృదయాలలోంచి ఎగిరిపోయిందనే చెప్పాలి. అలాంటి సమయంలో మధుపురిలో 'సహాయ నిరాకరణో ద్యమం' అన్నమాటే వినిపించేది కాదు. వేసవి కాలంలోనూ, వర్షాకాలంలోనూ ఇంగ్లీషు వాళ్ళు మధుపురిలో అధిక సంఖ్యలో కనిపిస్తూ వుంటారు. కొన్ని ప్రాంతాలలోనయితే నల్లవాళ్ళు అసలు కనిపించనే కనిపించరు. వేసవి, వర్షాకాలాలలో ఇంగ్లీషు వర్తకులూ, మత ప్రచారకులు కూడా అక్కడకు వస్తుంటారు. వాస్తవానికి క్రిస్టియన్లకు సంస్కృతం నేర్పటం మహాపాపమని గురూజీకి తెల్సు. అయితే, మిథిల పండితులు నాస్తికులైన ఆర్య సమాజీకులకూ, జైనులకూ – విద్యను అమ్మటం లేదా? వాళ్ళకు విద్యను అమ్మినప్పుడు క్రిస్టియన్ ఫాదర్‌లకు అమ్మితే ఏం? ఇతర్లకు సంస్కృతం చెబితే 40–50 రూపాయలు ఇచ్చి అధ్యాపకులకు గొప్ప మేలు చేసినట్టు మాట్లాడతారు. కాని ఫాదరీలు అలాకాదు. ఇతరులు యాభై ఇచ్చేచోట తాము వంద రూపాయలు ఇస్తారు. గొప్ప మేలేదో చేసినట్టూ మాట్లాడరు! గురూజీకి మొదటగా ఉద్యోగం ఇచ్చింది తెల్ల ఫాదరీలే. విద్య చెప్పి, జీతం తీసుకుంటే అది విద్యను అమ్ముకోవటమే కదా? విద్యను ఎటూ అమ్ముకోవటం తప్పనప్పుడు, చవకగా ఎందుకు అమ్ముకోవాలి, మంచి ధరకే అమ్ముకుంటే సరిపోయే కదా! మిథిల బ్రాహ్మణులు అందరూ ఇతర ప్రాంతాలకు వెళ్ళినప్పుడు విద్యను డబ్బుకు అమ్ముకుంటూనే – ఆహార వ్యవహారాల ద్వారా, ఆచారాల ద్వారా తమ బ్రాహ్మణత్వాన్ని కాపాడుకుంటూ వుంటారు. అలాగే గురూజీ కూడా తన బ్రాహ్మణత్వాన్ని కాపాడుకోవటానికి నిశ్చయించుకున్నాడు. గురూజీ

కల్లాకపటం ఎరుగని పండితుడు. తన పనిని ఎంతో నిమగ్నతతో చేసేవాడు. అతని విద్యార్థులకు అతనంటే అభిమానం. విద్యార్థులకు చక్కగా ఉన్నత విద్యాబోధన చేసేవాడు. కొంచెం ఆలస్యమయినా తన పరిచయస్తులలో మంచి స్థానాన్నే ఏర్పరచుకున్నాడు గురూజీ. గురూజీని అభిమానించే వారి సంఖ్య త్వరలోనే పెరిగిపోయింది. అతని అభిమానులందరూ తెల్లవాళ్ళే. అలాంటప్పుడు హైస్కూల్లో సంస్కృత అధ్యాపకుడి ఉద్యోగం దొరకటంలో అభ్యంతరం ఏముంటుంది? స్కూల్లో ఉద్యోగం దొరికిందని తన అభిమానులైన ప్రైవేటు విద్యార్థులకు నష్టం ఏమీ కలగ నిచ్చేవాడు కాదు. సాయంత్రం స్కూలు అయ్యాక వాళ్ళను చదివించేవాడు. ఇప్పుడు గురూజీ మధుపురిలోని ఒక ఎయిడెడ్ హైస్కూల్లో సంస్కృత పండితుడిగా ఉద్యోగానికి కుదిరాడు.

## 3

మధుపురి యూరోపియన్‌ల నగరం. ఈ నగరానికి వచ్చాక గురూజీలో కొంత మార్పు వచ్చింది. దర్భంగా జిల్లాలోని ఒక గ్రామంలో వున్నప్పుడు ఎలా వున్నాడో, ఇప్పుడూ అలాగే ఎలా వుండగలడు? మొదటి ఒకటి రెండు సంవత్సరాలు పంచ కట్టుకునే చలికాలాన్ని గడుపుదామనుకున్నాడు. కానీ మధుపురి చలి సాధారణమైనది కాదు. చలికాలంలో అక్కడ నీరు గడ్డ కట్టేంత చలిపెడుతుంది. అంతచలిలో దర్భంగా జిల్లాలోని మిథిల బ్రాహ్మణులు ధరించే ధోవతీ, బొందుల చొక్కాతో గడవదు. మొదటి చలికాలంలోనే ధోవతితో వుండలేమని గురూజీ తెల్సుకున్నాడు. ఎప్పుడయినా తమ ప్రాంతం వెళ్ళవలసి వస్తుంది గనుక ఒక ధోవతీని, మిర్జయా (బొందుల చొక్కా) నొక దాన్ని ట్రంకుపెట్టెలో వుంచుకోవటం అవసరం అనుకున్నాడు. రెండవ సంవత్సరం నుండి కోటు, పైజామా ధరించడం మొదలు పెట్టాడు. మెడ దగ్గర మాసినట్టుగా వున్న వున్ని కోటూ ప్యాంటు లాంటి పైజామాను మొదటిసారిగా ధరించినప్పుడు 'తను రెండు సంవత్సరాలు అనవసరంగా చలికి బాధపడ్డాను కదా! అని అనుకున్నాడు. అప్పటినుండి గురూజీ పైజామా, మెడ దగ్గర మాసినట్టుగా వుండే కోటూ ధరిస్తున్నాడు. వేసవికాలం ధోవతి కట్టుకోవచ్చు కానీ స్కూలుకు వెళ్ళేటప్పుడు ధోవతి కట్టుకోవటం సరియైనదిగా అతనికి అనిపించలేదు. స్కూలుకు వెళ్ళేటప్పుడు కానీ మిషనరీలకు సంస్కృతం చెప్పటానికి వెళ్ళేటప్పుడు కానీ అతను కోటూ, పైజామానే వేసుకుంటున్నాడు. ఆ దుస్తులే అతనికి గౌరవనీయమైనవిగా, సుఖకరమైనవిగా అనిపిస్తున్నాయి. మిథిల ప్రాంతంలో పెట్టుకునే తలపాగా మధుపురి వరకూ గురూజీని అనుసరించింది. మధుపురిలో దాని అవసరం అంతగా కనుపించలేదు. అప్పటికీ దేశమంతా గాంధీ టోపీ ప్రచారం అయింది. అయితే, మధుపురిలో గాంధీ టోపీకి ఎటువంటి స్థానం

లేదు. గురూజీ గాంధీ టోపీతో స్కూలు వెళ్ళలేదు. మిషనరీల దగ్గరకూ వెళ్ళలేదు. కనుక, గాంధీటోపీకి రంగు వేసుకుని పెట్టుకున్నాడు. కోటూ, పైజామా, రంగువేసిన గాంధీ టోపీ – ఇది అతని వేషం. బయటకు వెళ్ళేటప్పుడే కాదు, ఇంట్లోనూ గురూజీ ఇదే వేషంలో కాలం గడిపేవాడు.

తమ బ్రాహ్మణత్వాన్ని కాపాడుకోవటానికి మిథిల బ్రాహ్మణులు నిత్య స్నాన, జప, పూజానుష్ఠానాల్తో పాటు స్వహస్తులయ్యేవారు. అంటే తమ వంట తామే చేసుకు తినేవారు. అలా చేస్తే కానీ బ్రాహ్మణ ధర్మం రక్షించబడదని వారి విశ్వాసం. అయితే, కూపస్థ మండూకాలైన వీళ్ళు నిత్యం పఠించే ధర్మ గ్రంథాల్లోనే, మతాచారాలు దేశ కాలానుగుణంగా మారుతూ వుంటాయని చెప్పటం జరిగింది. మధుపురి లాంటి శీతల ప్రదేశంలో ఎంత మతాచారాల్ని పాటించాలనుకున్నా నిత్యం స్నానం చేయటం అనవసరం. హిమాలయ ప్రాంతంలో వుండే గాలిలో అపూర్వమైన శక్తి వున్నదనీ, ఆ గాలి అన్నింటినీ పవిత్రం గావించగలదనీ మన ఋషులే అంగీకరించారు. వేడినీళ్ళు వుండే, వెచ్చని స్నానాల గది వుంటే నిత్యం స్నానం చేసినా ఫర్వాలేదు. కానీ, గురూజీ ఇల్లు విడిచి మధుపురికి వచ్చింది నాలుగు పైసలు సంపాయించుకోవటానికి వేడినీళ్ళు పోసుకోవటానికి కాదు కదా!

మధుపురి వచ్చిన రెండు సంవత్సరాలకే గురూజీ నాలుగు పైసలు సంపాయించు కున్నాడు. సౌరాష్ట్రంలో పెళ్ళిళ్ళ సభకు వెళ్ళాడు తన కోసం ఒక కన్యను ఎన్నుకున్నాడు. ఎర్రని ధోవతి పసుపు బట్టల్ని కట్టుకుని పెళ్ళికొడుకు అయ్యాడు. నెలరోజులు అత్తవారింట్లో వుండి మధురాతిథ్యాన్ని పొందాడు. తరుణ బ్రాహ్మణ కన్యల మధురాలాపాల్ని విన్నాడు. వ్యంగ్య వాక్కులకు పులకించాడు. పెళ్ళి అయినాక సంవత్సరానికి ఒకసారి ఇంటికి వెళ్ళి వస్తున్నాడు. గృహిణిని వెంట తీసుకువెళ్ళటం మిథిల బ్రాహ్మణుల్లో ఇప్పటికీ ఆచారం కాదు. అందువల్ల భార్యను ఇంటిదగ్గర వుంచి తాను మాత్రం సంవత్సరానికి రెండుసార్లు ఇంటికి వెళ్ళి వస్తూ వుంటాడు. భార్యను కూడా మధుపురికి తీసుకువెళ్లటానికి అవకాశం వుంటే గురూజీ సుఖకరమైన జీవితాన్ని గడిపేవాడు. వండకుండానే తిండి వస్తుంటే ఇంక చింత ఏముంటుంది? అయితే, ఈ సౌఖ్యం గురూజీ భాగ్యంలో లేదు. ఆయన తర్వాతి తరం ఆ సౌఖ్యాన్ని అనుభవించగలదు. గురూజీ వయస్సువాడే మరో బ్రాహ్మణుడు. మధుపురిలోనే వేరే బజార్లో వుంటున్నాడు. అతనూ దర్భంగా జిల్లా వాడే. కానీ అతను సంస్కృత పండితుడు కాదు. ఆంగ్ల విద్వాంసుడు. సిగరెట్ లేకుండా ఒక్క క్షణం వుండలేదు. ఆహార విహారాలలో కూడా స్వతంత్రుడు. మిథిల ప్రాంతపు ఆచారాల్ని ఏనాడో వదిలివేశాడు అతను. ఒకసారి ఇంగ్లాండు కూడా వెళ్ళివచ్చాడు. ఇలా ఇష్టం వచ్చినట్టు తిని తిరిగినప్పటికీ అతణ్ణి కులంలోంచి వెలివేయటం జరగలేదు. జన్మస్థానమైన మిథిలకు వెళ్ళినప్పుడు

ఆంగ్ల పండితుడైన ఆ బ్రాహ్మణుడినే ప్రజలూ, బ్రాహ్మణులు కూడా ఎక్కువగా గౌరవిస్తుంటారు. ఇదంతా గురూజీ గమనిస్తున్నాడు. అర్థం చేసుకోవాలనుకుంటున్నాడు కానీ అతనిలా తయారు కాలేకపోతున్నాడు. గురూజీకి ఒక విషయం తెల్సు. 'సమరథ్ కో నహీదోష్ గుసాయీ' అన్న తులసీదాసు పదాన్ని అతనెప్పుడూ మరువలేదు. (సమర్థుడు ఏం చేసినా దోషం వుండదు).

మైదాన ప్రాంతాలలోని స్కూళ్ళల్లో వేసవికాలం సెలవలు ఎక్కువగా వుంటాయి. కానీ మధుపురిలోని స్కూళ్ళకు జనవరి – ఫిబ్రవరి నెలల్లో ఎక్కువగా సెలవలు ఇస్తారు. మధుపురి నుండి ప్రతి సంవత్సరం మిథిల వెళ్ళటం ఖర్చుతో కూడిన పనే. అయినా, వెళ్ళక తప్పదు కదా అయితే, అప్పుడు రైలు ఛార్జీలు ఇప్పుడంతగా లేవు. గురూజీ తన యవ్వనంలో నియమం తప్పకుండా ప్రతి సంవత్సరం ఇంటికి వెళ్ళి వస్తుండేవాడు. నలుగురైదుగురు సంతానం కలిగాక ఈ నియమాన్ని కొంత వరకూ సడలించాడు. గురూజీ చన్నీళ్ళతో స్నానం చాలా సంవత్సరాల పాటు చేశారు. ఆర్థిక స్థితి కొంత మెరుగుపడ్డాక వేడినీళ్ళతో స్నానం చేయటం ప్రారంభించాడు. మధుపురిలాంటి శీతల ప్రదేశంలో నిత్యం స్నానం చేయాలన్న నియమాన్ని పాటించడం కష్టం. ఆ కష్టానయినా గురూజీ పడగలుగుతున్నాడు. కానీ స్వయంగా వండుకునే బాధ పడలేకపోతున్నాడు. ఒక ధోవతిని తువ్వాలు వేసుకుని వంట చేసుకోవటం మే, జూన్ నెలల్లో అయితే ఫర్వాలేదు కానీ మిగిలిన నెలల్లో ఇబ్బందిగానే వుంటుంది. నవంబర్ – డిసెంబర్ నెలలలో అలా వంట చేసుకోవటం నరక యాతనను అనుభవించినట్టుగా వుంటుంది. చలికి వణుకుతూ అలా వంట చేసుకుంటే సగం ఆకలిని చలే మింగేస్తుంది. గురూజీ పాతకాలపు మనిషి. పాతకాలపు పండితుడు. అయినా మరీ అంత ఛాందసుడు కాదు. గడగడలాడించే మధుపురి చలి అతణ్ణి హింసించిన మాట నిజమే. అదే చలి అతడిని కొంత ఆలోచింప జేసింది. అతనికి కొంత తెలివితేటలనూ ఇచ్చింది. ఎందుకు అనవసరమైన బాధల్ని పడతావు? ఇలా బాధ పడినందువల్ల నీకు వచ్చే ప్రయోజనం ఏమిటి? ఇంగ్లీషు పండితుణ్ణి చూడు చక్కగా బంగళాలో వుంటున్నాడు. సుఖంగా జీవితాన్ని గడుపుతున్నాడు. నువ్వు ఇహ జీవితంలో ఇంత కష్టపడ్డందుకు పరం (స్వర్గం)లో ఓ బంగళా నీకోసం రిజర్వు చేసే వుంటుంది. కానీ దేశంలోని ఇతర బ్రాహ్మణులు నిన్ను అనుమానిస్తారంటావు. నువ్వు ఇక్కడ ఇష్టం వచ్చినట్టు తిని త్రాగి జీవితాన్ని గడిపావని అక్కడ వాళ్ళకు ఎవరు చెప్తారు?' అని ప్రశ్నించింది అతనిలోని వ్యవహార జ్ఞానం.

దర్భంగా జిల్లాలోనూ ఈ మధ్య గాంధీగారికి జై కొట్టడం ఎక్కువైంది. కాంగ్రెస్ ప్రచారము బాగా సాగుతోంది ఇప్పుడు. వెనక ఆ జిల్లాలో హిందూ భోజనాలయం

ఒక్కటీ వుండేది కాదు. ఇప్పుడలా కాదు. ప్రతి పల్లెలోనూ, నగరంలోనూ హిందూ భోజన హోటళ్ళు వెలిశాయి. ఆ హోటళ్ళల్లో మత్స్య మాంసాదులకు కొదవ వుండదు. ఆ హోటళ్ళలో పల్లెటూర్ల నుండి వచ్చిన బ్రాహ్మణ పండితులు భోజనం చేస్తుంటారు. అయితే చాలా రహస్యంగా భోజనం చేస్తారు. ఇంత తెలుసుకున్నాక భోజనం విషయంలో వెనుకటి ఆచారాల్ని తు.చ. తప్పకుండా పాటించడం అవివేకం అనుకున్నాడు గురూజీ. మధుపురిలో వైష్ణవ భోజనశాల ఒకటుంది. అందులో నిఖార్సయిన బ్రాహ్మణులు వంట చేసిపెడుతూ వుంటారు. అదికాక గౌడ, బ్రాహ్మణ హోటలూ ఒకటి వుంది. ఆ హోటల్లో భోజనం చేయాలని నిర్ణయించుకున్నాడు గురూజీ. ఇలా హోటల్లో భోజనం చేయటం వలన డబ్బులూ మిగుల్తున్నాయి. శ్రమా తగ్గుతుంది. ఆ హోటల్లో మాంసాహారం దొరుకుతుంది. కానీ మధుపురిలో వున్నన్నాళ్ళు మత్స్యమాంసాదుల్ని ముట్టరాదని నిర్చయించుకున్నాడు. అయితే, ఈ లోటును సెలవల్లో తన వూరు వెళ్ళినప్పుడు పూర్తి చేసుకునేవాడు. మధుపురిలో గురూజీ వుంటున్న బజార్లో కోమట్లు ఎక్కువగా వుండేవారు. వాళ్ళందరూ శాఖాహారులు. వాళ్ళు గురూజీని గౌరవంగా 'గురూజీ' అని పిలుస్తుండేవాళ్ళు. అప్పుడప్పుడు పురాణ కాలక్షేపం చేస్తుండేవారు. తిథి, వార, నక్షత్రాలను అడుగుతుండేవారు. దాన దక్షిణాలు ఇస్తుండేవారు. వీళ్ళందరూ గురూజీని ఎంతో గౌరవించేవారు. ఒకవేళ గురూజీ మాంసాహారి అని తెలిస్తే ఆ బజారులోని కోమట్లు ఎవరూ ఇంక అతనిని గౌరవించరు. మధుపురిలోని గౌడ భోజనశాలను కోమట్లు పవిత్రమైనదిగానే భావిస్తారు. కానీ గురూజీ ఇలా ఇతర శాఖలకు చెందిన గౌడ బ్రాహ్మణ హోటల్లో భోజనం చేశాడని స్వగ్రామంలో తెలిస్తే ఇంకేముంది? అక్కడి బ్రాహ్మణులు గురూజీ చేత గంగ ఇసుకను నమిలిస్తారు. గంగలో మునిగిస్తారు. అంతటితో వదలరు. ఒక మనిషిని సాక్షిగా పెట్టుకుని గయా వెళ్ళమంటారు. అన్ని ఘట్టాల్లోనూ ఏడు తరాల పితరులకు తర్పణాలు ఇచ్చి అక్కడి పురోహితుడి దగ్గర నుండి ప్రమాణ పత్రాన్ని తీసుకు రమ్మంటారు. మైధిలీ భాషా కవి నాగార్జునునికి ఉన్నన్ని తెలివితేటలు గురూజీకి లేవనే చెప్పాలి. ఆ తెలివి తేటలే వుంటే – సాక్షితో పాటు పాట్నాలో ఒక మంచి సినిమా చూసి తరువాత హోటల్లో ఆ 'సాక్షి'కి కడుపునిండా తినిపించి ఇంక మెల్లగా సాక్షితో "డబ్బును ఎందుకు అనవసరంగా శ్రాద్ధానికి , తర్పణాలకనీ ఖర్చుపెట్టిస్తావ్? ఈ విధంగా రెండు రోజుల పాటు జల్సా చేసి, తరువాత మిగిలిన డబ్బును చెరిసగం పంచేసుకుందాం! ఇంక పండా ప్రమాణపత్రం అంటావా? అర్థరూపాయి ఇస్తే పండా ప్రమాణపత్రం ఇచ్చేస్తాడు! సరేనా" అని చెప్పుకునేవాడు.

మైథిలీ భాషాకవి నాగార్జునుడు చాలా విచిత్రమైన వ్యక్తి. ప్రతిసారీ ప్రాయశ్చిత్తం అయ్యాక పిలక కత్తిరించుకుని, దేశం మీద పడి ఇష్టమొచ్చినవన్నీ తినేవాడు. శాఖా

భేదాలనూ, కుల భేదాలనూ అసలు పాటించేవాడు కాదు. మరి అంత ధైర్యం గురూజీకి ఎక్కడిది? గౌడ, బ్రాహ్మణ హోటల్లో చేయటం, కోటూ, పైజామా వేసుకోవటంలో తృప్తి పడి ఆగిపోయేవాడు గురూజీ.

మధుపురిలోని స్థానికులతో గురూజీకి మంచి పరిచయాలు ఏర్పడ్డాయి. సనాతన అభిప్రాయాల్నీ, ఆచారాల్నీ అభిమానించే కోమట్లతో అతడికి పలుకుబడీ పరిచయాలు వున్నాయి. ఆంగ్ల పాఠశాలల్లో సంస్కృత పండితుడు కావటం వలన అధునాతన భావాలు కలవారిలోనూ అతనికి పలుకుబడి ఏర్పడింది. గురూజీ అందరితోనూ ఎంతో సహృదయతతో వ్యవహరిస్తూ వుంటాడు. అతడి మాటల్లో కానీ ప్రవర్తనలో కానీ ఎటువంటి కల్లా కపటమూ వుండదు. అందుకనే అతని పరిచయస్థుల సంఖ్య, మిత్రుల సంఖ్య ఎక్కువగా వుండేది. మధుపురిలోని ఆంగ్ల పాఠశాలల్లోని యూరోపియన్ ఉపాధ్యాయులు కూడా గురూజీని చాలా గౌరవంగా పలుకరించేవారు. ఫాదరీలు అతని పట్ల ప్రత్యేకమైన అభిమానాన్ని ప్రదర్శించేవారు. మధుపురిలో జరిగే అన్ని విందు పార్టీలకు, టీ పార్టీలకూ గురూజీని పిలుస్తూ వుండేవారు. వాటిని ఎప్పుడూ తిరస్కరించేవాడు కాదు గురూజీ. హిందువుల టీపార్టీలకూ వెడతాడు. క్రిస్టియన్ల పార్టీలకూ హాజరవుతాడు. విందుకు పిలిచిన క్రిస్టియన్లు ఒక శాకాహారి తమ విందుకు హాజరయినందుకు బాధపడరు. గురూజీ కూడా ఏ మాత్రం బాధపడకుండా వెళ్ళి ఒక చివర కూర్చుంటాడు. బిస్కెట్లు, పళ్ళూ, ఫలహారాలూ టీ – ఇవన్నీ ఈ మిథిల బ్రాహ్మణుడి ముందుకు తెచ్చి పెడతారు. వాటిల్లో కనీసం టీ అయినా తాగడు గురూజీ. గురూజీ విద్యార్థులు కొందరు చదువు పూర్తి చేసుకుని ఉద్యోగాలు చేస్తున్నారు. వాళ్ళు ఇలాంటి పార్టీలకూ, విందులకూ హాజరవుతూ వుంటారు. గురూజీ తన ముందు పెట్టిన బిస్కెట్లనూ, టీని, పండ్లు పలహారాలతో వెనక తన శిష్యుల ముందుకు జరుపుతూ వుంటాడు. పండ్లునైనా తినవచ్చు కదా? అదీ తినడు! ఇంత మధురమైన ఆహారాన్ని ఎవరు వదులుకుంటారు. అయినా మిథిల బ్రాహ్మణులు ఎవరు చూస్తారు కనుక? గౌడ బ్రాహ్మణ హోటల్లో భోజనం చేయటం లేదా? అలాగే ఇవీ స్వీకరిస్తే ఎవరు నిందిస్తారు కనుక అయితే పండ్లు తిన్న తరువాత మంచినీళ్ళు అవసరం అవుతాయి. క్రిస్టియన్ వంటవాళ్ళు గాజు గ్లాసులు పట్టుకువచ్చి ఇచ్చిన నీళ్ళను తాగవలసి వస్తుంది. ఆ భయంతో పండ్లను కూడా ముట్టుకోడు. ప్రతి సంవత్సరం గురూజీ ఇలాంటి విందులకు ఎన్నింటికో వెళ్తుంటాడు. అయినా తన జాగ్రత్తలో తను వుంటాడు. మొదట్లో కోమట్ల చేతివంటను కూడా ముట్టుకునేవాడు కాదు. తర్వాత తర్వాత 'ఘృతపక్వం, పయః పక్వం' – తింటే తప్పు లేదనుకున్నాడు. పాలతో, నేతితో చేసిన వంటల్ని మాత్రమే స్వీకరిస్తున్నాడు.

# 4

గురూజీ మధుపురి వచ్చి దాదాపుగా ముప్ఫై సంవత్సరాలు దాటింది. సీజన్ సమయంలో మధుపురి జనాభా ఏడెనిమిది రెట్లు పెరిగి పోతుంది. అయితే, వ్యాపారస్థులూ, ఉపాధ్యాయులూ – ఇతర స్థానిక ప్రజలూ గురూజీకి బాగా పరిచయులయ్యారు. ఇప్పుడు మధుపురి గురూజీకి సొంత వూరుకంటే ఎక్కువ అయింది. మిథిలలోని సంస్కృత పండితులెవరూ వూహించలేనంతగా సంపాయించారు గురూజీ. సముద్ర తలానికి ఐదారువేల అడుగులు ఎత్తున గల మధుపురి వాతావరణం అతనికి సరిపోయింది. చలికాలంలో నెలకు పదిహేను రోజులు మాత్రమే తమ గ్రామానికి వెళ్ళి వస్తూవుంటాడు. చలికాలం అక్కడ ఎండలు పెద్దగా వుండవు అయినా, ముప్ఫై ఏళ్లుగా మధుపురిలో వుంటున్న గురూజీకి అది ఒక లెక్క కాదు. ఇప్పుడతడి వయస్సు 56 సంవత్సరాలు. ఇంక ఉద్యోగ విరమణ చేయవలసిన సమయం వచ్చింది. ఉద్యోగ విరమణ చేసి స్వగ్రామానికి వెళితే వేసవికాలంలో దర్భంగా జిల్లాలో విపరీతమైన వడగాడ్పులను ఎలా తట్టుకోవాలన్న బాధ అతడిని వేధించసాగింది. పాతిక సంవత్సరాలు వచ్చేదాకా ఆ ఎండల్లో, ఆ వాతావరణంలోనే పెరిగాడు. అయినా ఇప్పుడు భయపడుతున్నాడు. ఇంతేకాక, తను పనిచేస్తున్నది ఎయిడెడ్ స్కూలు. తనకు ప్రావిడెంట్ ఫండ్ కొద్దిగా వస్తుంది. పెన్షన్ సౌకర్యం లేదు. వచ్చే కొద్ది డబ్బుతో జీవితాన్ని ఎలా గడపాలి? ఉద్యోగ విరమణ అయి స్వగ్రామానికి వెళ్ళాక నెలజీతం వుండదు. ఆర్థికంగా కొంత ఇబ్బంది. అయినా, ఆకలితో బాధపడే పరిస్థితి అయితే వుండదు. మధుపురిలో సంపాయించిన డబ్బుల్లో కొంత డబ్బును కూడబెట్టుకున్నాడు. ఆ డబ్బుతో కొంత భూమిని కొనుక్కున్నాడు. సొంతగా వ్యవసాయం చేసుకున్నా తాను తిని మరొకరికి పెట్టగలడు. అందుకే కబీరు దాసు ఇలా అన్నాడు. కహై కబీర్ కుఛ్ ఉద్ధమకీజై, ఆప్ ఖాయె ఔరన్ కో దీజై.' (కృషి చేయండి. మీరు తిని మరొకరికి పెట్టండి).

ఇప్పటిదాకా గురూజీ తను కొన్న పొలాన్ని సగం పంట తనకు ఇచ్చే విధంగా కౌలుకు ఇస్తున్నాడు. ఇప్పుడు వాళ్ళ ఊళ్ళోనూ 'దున్నే వాడికే భూమి' అన్న నినాదం మిన్నంటుతోంది. ఇంత కష్టపడి కొనుక్కున్న భూమి ఎక్కడ చెయ్యి దాటి పోతుందో నన్న భయం పట్టుకుంది గురూజీని. ఒక్కోసారి 'దున్నే వాడికే భూమి' అన్న వారిమీద విపరీతంగా కోపం వచ్చేది. కానీ ఎవరిని మాత్రం ఏమనగలడు? ఏకంగా బావిలోనే భంగు కలిపారు? ఇంక దూరంగా ఎలా వుండగలడు? అసలు ప్రపంచమే మారిపోయింది. గురూజీ ఇప్పటికీ మధుపురిలో తనను ఆహ్వానించిన విందులకు వెళ్ళి ఒక్క చుక్క నీళ్ళయినా తాగకుండా వస్తుంటాడు. స్వగ్రామంలో అతని అన్న కొడుకు ఎర్రజెండా పట్టుకుని ఊర్లన్నీ

తిరుగుతున్నాడు. తన తండ్రి తాతల కళ్ళముందే శూద్రులతో పాటు కూర్చొని పంక్తి భోజనాలు చేస్తున్నాడు. అంతే కాకుండా నన్ను కులం నుండి వెలివేయండి చూస్తాను' అని సవాలు విసురుతున్నాడు. ఇంక అతణ్ణి కులం నుండి వెలివేయటం ఎవరి వల్ల అవుతుంది? అతను ఒక్కడే తినటం కాదు. ఎంతో నిష్టగల వాళ్ళమని చెప్పుకుంటున్న అనేక బ్రాహ్మణ కుటుంబాలలోని యువకుల చేత కోడిగ్రుడ్లు బాహాటంగా తినిపించాడు. ఈ పరిస్థితులను విన్నప్పుడు – కళ్ళతో చూసినప్పుడు గురూజీ చాలా బాధపడుతున్నాడు. ఒక్కోసారి తనలోతానే నా వరకూ నేను నా ధర్మాన్ని నిలబెట్టుకున్నాను అనుకుని కొంత సంతృప్తి పడుతున్నాడు. ఒక్కసారి ఇలాకూడా అనుకుంటున్నాడు. నేను అనవసరంగా జిహ్వను చంపుకుని నష్టపోయానేమో!

'పృథ్వి మీద కలికాలం పూర్తిగా అవతరించింది. ఇంక పూర్వీకుల ఆచారాలకు మనుగడ లేదు'అని గురూజీ తెల్సుకున్నాడు. గురూజీ కూడా జీవితంలో ఒక హద్దు వరకూ ముందుకు నడిచాడు. ఆ హద్దును దాటి ముందుకు పోవటానికి సాహసించలేక పోయాడు. అయితే, ఆ సాహసాన్ని రేపు తన కొడుకులూ, అతని మనవళ్ళూ ప్రదర్శిస్తారు. భవిష్యత్తులో అతని మనవడు మధుపురిలోని ఏదైనా విందుకు హాజరయితే తాతలా ఆకలి కడుపుతో తిరిగి రాడు. కడుపునిండా విందు భోజనాన్ని ఆరగించి వస్తాడు. ఈ తాత చచ్చి స్వర్గానికి వెళ్ళాక, ఆ మనవడి పిండ ప్రదానాన్నే స్వీకరించాలి, తప్పదు!

గురూజీకి ఈ విషయాల పట్ల అంతగా చింత లేదు. ఎందుకంటే ఇది ఒక ఇంటికి పట్టిన జబ్బు కాదు. మహమ్మారిలా అంతటా వ్యాపించింది. కానీ ఉద్యోగం పోతే ఎలా అన్నా ఆలోచన గురూజీని వేధిస్తోంది. ఆ మధ్య వాళ్ళనీ, వీళ్ళనీ పట్టుకుని ఇంకా రెండు సంవత్సరాలు ఉద్యోగం చేయటానికి అనుమతి తెచ్చుకున్నాడు. అలాగే మరి నాలుగు సంవత్సరాల పాటు పొడిగించుకుంటూ వెడితే జీవితం మధుపురిలోనే గడిచిపోతుంది అని అనుకుంటుండగానే ఇంగ్లీషు వాళ్ళు వెళ్ళిపోయారు. ఇంగ్లీషు వాళ్ళు వెళ్ళిపోయాక మధుపురిలో సంస్కృతానికి ఆదరణ పెరగకపోగా తరిగిపోయింది. దాని బదులుగా ఇంగ్లీషుకు ఎక్కువ స్థానం లభించింది. మధుపురిలోని ఇంగ్లీషు మీడియం కాన్వెంటులలో ఈ మధ్య విద్యార్థులకు సీటు దొరకటమే కష్టమై పోయింది. గురూజీ ఆంగ్ల భాషా పండితుడు అయి వుంటే రిటైర్ అయినా అక్కడే ట్యూషన్లు చెప్పుకుంటూనో మరోపని చేసుకుంటూనో వుండిపోయేవాడు.

స్కూల్లో ఉద్యోగం పోయింది. ఆ తరువాత కూడా చాలా రోజుల వరకూ క్రొత్త ఆర్డర్ను కోసం ఎదురు చూస్తూ మధుపురిలోనే వుండిపోయాడు గురూజీ! రికమండేషన్ కోసం తిరిగాడు. కానీ ప్రయోజనం లేకపోయింది. ప్రావిడెంట్ ఫండ్‌లోని డబ్బుల్ని

ఖర్చుపెడుతూ మధుపురిలోనే కూర్చోవటం అనవసరం అనుకున్నాడు గురూజీ స్నేహితులకు ఆయన సౌమ్యమైన ఆకారం శాశ్వతంగా తమకు దూరం కావటం ఇష్టంలేదు.

గురూజీ పాండిత్యం పట్ల కానీ పౌరోహిత్యం పట్ల కానీ అంతగా శ్రద్ధ చూపలేదు. అతనికి బ్రాహ్మణత్వం కేవలం 'పండిత్‌జీ' 'గురూజీ' అని పిలిపించుకునేంత వరకే పరిమితం! చివరకు గురూజీకి మధుపురిని వదిలి వెళ్ళవలసిన సమయం వచ్చింది. అతను మధుపురి వచ్చినప్పుడు యువకుడు, అప్పుడు అతని ముందు సుదీర్ఘమైన భవిష్యత్తు వుంది. కానీ ఇప్పుడు మధుపురిని విడిచి వెళ్తున్నప్పుడు వృద్ధుడు ఆనాడున్న సుదీర్ఘమైన భవిష్యత్తు ఈనాడు లేదు. భవిష్యత్తు వున్నా లేకపోయినా ప్రాణం వున్నన్నాళ్ళు జీవితం పట్ల శ్రద్ధ వహించక తప్పదు కదా!

చివరకు మధుపురిని వదిలి వెళ్ళే క్షణాన, తన సమస్త సుగుణాల తోటీ మధుపురి గురూజీ ముందు చిరునవ్వు నవ్వుతూ నిలబడ్డది. ముప్పైకి పైగా వేసవి కాలాలనూ, వర్షాకాలాలనూ గడిపాడు అతను ఇక్కడ. ఎంత ఆనందంగా కాలం గడిచిందో? ఏనాడూ ఉక్కపెట్టిగానీ, విసురుకోని గానీ ఎరుగడు. ఇన్ని సంవత్సరాలలో ఎంతోమంది మిత్రులు ఏర్పడ్డారు తనకిక్కడ. ఇక దర్భంగా జిల్లాలోని మారుమూల పల్లెల్లో జీవితాన్ని గడపాలి. అక్కడ ఇలాంటి సహృదయులైన మిత్రులు లభిస్తారా? ఈర్ష్యా, ద్వేషాలతో కుమిలిపోయే ముఖాలే కనిపిస్తాయక్కడ.

ఒకరోజున అభిమానులు, భక్తులూ, మిత్రులూ అందరూ గురూజీకి వీడ్కోలు ఇచ్చారు. అతడు మధుపురిని విడిచి వెళ్ళిపోయాడు.

# మీనాక్షి

మధుపురిని ఇంగ్లీషు వాళ్ళు తమ విలాసాల కోసం నిర్మించుకున్నారు. చాలాకాలం పాటు మధుపురి ఇంగ్లీషు వాళ్ళకు విలాసనగరంగానే వున్నది. ఇంగ్లీషు వాళ్ళు వెళ్ళిపోయాక మధుపురిని సామంతవర్గానికి చెందిన వాళ్ళు అంటే రాజులూ, జమీందార్లూ, జాగీర్దార్లూ తమ విలాసనగరంగా చేసుకున్నారు. 'గ్రీష్మ కాలేన శీతలం' అన్న సంస్కృత ఉక్తిని సామంత వర్గీయులు అర్థం చేసుకున్నారేమో! వేసవికాలంలో మధుపురి వైపుకు పరుగులు పెట్టారు. ఇంగ్లీషు వాళ్ళు ఈ దేశం నుండి వెళ్ళక ముందు సామంత వర్గీయులు మధుపురిలో పెద్దగా కనిపించేవారు కాదు. ఇంగ్లీషు దొరలు రంగు భేదాన్ని ఖచ్చితంగా పాటించేవారు. ఆ కారణాల వల్ల పై వర్గానికి చెందిన ఒకరిద్దరు మధుపురికి వచ్చినా, వాళ్ళు ఒదిగి ఒదిగి వుండవలసి వచ్చేది. అప్పటికి ఇంకా అంతఃపురాలలో ఘోషా పద్ధతి నిరాఘాటకంగా సాగుతూనే వున్నది. ఎవరూ తమ రాణులను తమతో పాటు తెచ్చేవారు కాదు. ఒకవేళ ఎవరైనా తమరాణితో వచ్చినా ఇక్కడ ఆమెను ఒంటి స్థంభం మేడలో వుంచినట్టు వుంచవలసి వచ్చేది. 20వ శతాబ్దం నుండి మధుపురి తన యవ్వనాన్ని దాటి వార్ధక్యంలోకి అడుగుపెట్టింది. అప్పటినుండే మహారాజుల అంతఃపురాల్లోకి ఆధునిక సభ్యత తాలూకు ప్రభావం కొంచెం కొంచెంగా పడుతోంది. మొదటి ప్రపంచ యుద్ధ సమయానికల్లా మధుపురికి వృద్ధాప్యం వచ్చేసింది. అప్పటికే అంతఃపుర తాళాలూ బద్ధలు కొట్టటం జరిగింది. కానీ తలుపులు అలాగే వున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఆ తలుపుల్ని పడదోయటం జరిగింది. రెండవ ప్రపంచ యుద్ధం ముగియటంతోనే ఇంగ్లీషు వాళ్ళు పెట్టే బేడా సర్దుకుని యూరోప్‌కు తరలి వెళ్ళారు. అప్పటినుండి మధుపురి సామంత రాజులకు ముక్తి భోగ్య అయింది. అనేక అంతఃపురాలు శతాబ్దాల తరబడిగా పేరుకుంటున్న అంధకారాన్నుండి బయటపడి వెలుగును చూడసాగాయి. కొన్ని అంతఃపురాలలో ఘోషా పద్ధతి ఇంకా వున్నప్పటికీ ఆ అంతఃపుర స్త్రీలు మధుపురికి వచ్చినప్పుడు స్వేచ్ఛగా

విహరిస్తున్నారు. ఈమధ్య రాజస్థానపు ఒకానొక మహారాణీ తన కూతుర్నీ, కోడల్నీ వెంట పెట్టుకుని మధుపురికి వచ్చింది. ఆమె తలమీద కొంగు కప్పుకోకుండా అలాగే నెరసిన తల వెంట్రుకలతో మధుపురి బజార్ల వెంట తిరగటాన్ని ఎందరో చూశారు. ఒకరోజు ఆ మహారాణీకి దూరపు బంధువు ఒకామె బజార్లో ఎదురయింది. అప్పుడు ఆమె తడబడుతూ, కంగారుపడి నెత్తిన చెంగు కప్పుకుంది. ఆజన్మం అంతఃపురాలలో బందీలయిన వృద్ధ స్త్రీలే ఇలా మధుపురిలో స్వేచ్ఛగా తిరుగుతుంటే 20–25 సంవత్సరాలయినా నిండని నవ యువతుల విషయం ఇంకేం చెప్పగలం! అయితే ఈ స్వేచ్ఛ మూడునాళ్ళ ముచ్చటే అయింది. ఆ వెనుకటి అంధకారంలోకి నెట్టబడలేదు కానీ జమీందారీ వ్యవస్థకు మృత్యుకాలం సమీపించింది. జమీందారీలను, జాగీర్దారీలను ప్రభుత్వం తీసేసుకుంది. లెక్కప్రకారం వచ్చే డబ్బుతో మధుపురిలో జల్సా చేయటం సంభవం కాదు కదా?

అన్ని అంతఃపురాలలోనూ ఆధునిక సభ్యత తాలూకు వెలుగులు ఒకేసారి ఒకే మోతాదులో రాలేదు. కొన్ని అంతఃపురాలు తలుపులను పూర్తిగా తెరిచేశారు. కొన్ని అంతఃపురాల తలుపులకు కేవలం నెర్రెలు మాత్రమే ఏర్పడ్డాయి. వాటిల్లో నుండి వచ్చే అతి తక్కువ వెలుగునే స్వీకరిస్తున్నాయి! ఈ కారణంగా అంతఃపురాల్లోని స్త్రీల వికాసమూ అసమానంగానే వున్నది. అయినా, అంతఃపుర స్త్రీలకు మరొక సౌకర్యం వుంది. జాతిని గురించీ, కులాన్ని గురించీ పట్టించుకోకుండా వివిధ కులాలకు చెందిన రాజస్థానపు రాజులూ పరస్పరం వివాహ సంబంధాలను ఏర్పరచుకునేవారు. ధర్మ శాస్త్రాల్లో నిషేధించబడిన సముద్రయాత్రను మొట్టమొదటగా ప్రారంభించినది రాజపుత్రులే! వంద సంవత్సరాల క్రితం మొదటగా ఇంగ్లాండు వెళ్ళిన రాజపుత్రులు తమతోపాటు గంగా జలాన్నీ భారతదేశపు మట్టినీ తీసుకువెళ్ళేవారు. వంద సంవత్సరాల క్రితం విషయాన్ని పక్కన పెడితే, ఈ శతాబ్దంలో పండిత మాలవీయజీ ఇంగ్లాండు నుండి తిరిగి వచ్చాక ఆచారానికి సంబంధించిన మూర్ఖత్వానికి తల వంచారు. ఇక మన దేశ నేత తిలక్‌గారైతే ఇంగ్లాండ్ నుండి తిరిగి వచ్చాక పాప ప్రక్షాళనార్థం ప్రాయశ్చిత్తం చేసుకోవటం అవుసరం అనుకున్నారు. ఈ శతాబ్దంలోని రాజస్థానపు రాజపుత్రులు ఇలాంటి మూర్ఖమైన ఆచారాలకూ, భావాలకూ తొందరగానే స్వస్తి చెప్పారు. రాజస్థానీ రాజపుత్ర రాజులకు ఆహార నియమాల విషయంలో పెద్దగా పట్టింపు వుండదు. అంతేకాదు భోజన విషయాలలోనూ పెద్దగా పట్టింపు వుండదు. వంట ఇళ్ళు ప్రత్యేకంగా వుండాలన్న నియమమూ లేదు. భోజనం వంట ఇంట్లో మాత్రమే చెయ్యాలని వుండదు. భోజనం చేసే ప్రదేశానికీ, వంట ఇంటికీ ఫర్లాంగు దూరం వుంటుంది. నౌకర్లు చెప్పులు వేసుకుని

భోజన పదార్థాలను తెచ్చి వడ్డిస్తూ, తీసుకు వెడుతూ వుంటారు. తమ పంక్తిలో ముస్లిం నవాబులు కూర్చున్నా భోజనం చేయటానికి వీళ్ళు సంకోచించరు. వెనుక వివాహాది విషయాలలో జాతి పట్టింపు వుండేది. అయితే, ఈ మధ్య జాతి పట్టింపు కూడా పోయింది. పదిహేను వందల సంవత్సరాల క్రితం పైసా – తల్వార్‌ల ప్రాబల్యం వల్ల నీచ జాతులు కొన్ని ఉన్నతమైన జాతులుగానూ, ఉన్నతమైన జాతులు కొన్ని నీచ జాతులుగానూ మారిపోతూ వుండేవి. అదే పద్ధతి ఇప్పుడు మళ్ళీ కొనసాగుతోంది. చరిత్ర పునరావృతం అయింది. తిరువాంకుర్, తోభిన్, పుదుక్కోట లాంటి కొన్ని సంస్థానాల మహారాజులను మినహాయిస్తే భారతదేశంలోని మిగిలిన మహారాజులందరూ తమలో తాము వివాహ సంబంధాల్ని ఏర్పరచుకుని బంధుత్వాల్ని కలుపుకున్నారు. ఇది మన కళ్ళముందే జరిగింది. ఇలా బంధుత్వాన్ని కలుపుకోవటాన్ని చూసి ప్రజలు ఆశ్చర్య చకితులయ్యారు. నిన్న మొన్నటి కుమ్మరులూ, గొల్లలూ, జాట్లు, కుర్మీలూ, కల్వార్లూ చూస్తుండగానే రాజపుత్ర మహారాజులు అయిపోయారు. పై చెప్పిన కులాల వారు సంస్థానాధీశులు కాగానే సూర్యవంశపు, చంద్రవంశపు, అగ్ని వంశపు – రాజకన్యల్ని వివాహమాడారు. ఆ రాజకన్యల్ని వివాహమాడాక వీరు రాజపుత్రులు కాక మరేమవుతారు? ఇలాంటి వివాహాల వలన అంతఃపురాల మీద గొప్ప ప్రభావం పడ్డది. పుట్టింట్లో ఎప్పుడూ ఘోషాను పాటించని రాజకన్యలు, వివాహం అయి అత్తవారిళ్ళకు వచ్చాక నాలుగు గోడల మధ్య ఎలా వుండగలరు? మొదట్లో మొఖానికి ముసుగు లేకుండా తల మీదవరకే కొంగు కప్పుకుని ఎవరయినా రాణి బయటకు వస్తే చాలు, ఏదో జరగకూడనిది జరిగినట్టుగా ప్రజలు ఆశ్చర్య చకితులు అయ్యేవారు. ఇప్పుడు మధుపురిలో ఇదంతా సాధారణమయిపోయింది. తల మీద కొంగు కప్పుకుని తిరిగే రాణులను పాత కాలపు వాళ్ళుగా భావిస్తున్నారు. ఇప్పుడు మధుపురిలో రాణులెవ్వరూ పొడవాటి వెంట్రుకలను వుంచుకోవటం లేదు. తల వెంట్రుకలను చక్కగా కత్తిరించుకుంటున్నారు. అయితే, నేను ముందే చెప్పినట్టుగా ఈ ఆధునిక సభ్యత తాలూకు ప్రభావం అందరి మీదా ఒకేలా పడదు. కొందరు రాణులు, ప్యాంటూ, షర్టులూ వేసుకుని, వెంట్రుకలను కత్తిరించుకుని పిల్లలతోటి, భర్తలతోటి ఇంగ్లీషులోనే మాట్లాడుతుంటారు. పనివాళ్లతో, నౌకర్లతో హిందీలో మాట్లాడినా, మాట్లాడే విధానం, వ్యాకరణమూ ఇంగ్లీష్ దొరసానులను మించి వుంటుంది. ఆధునిక సభ్యతను ఇంతగా తమలో ఇముడ్చుకున్నా పొడగాటి బొట్టు పెట్టుకోవడాన్ని మానలేదు ఈ రాణులు. పాతకాలపు కోడళ్లలాగా అత్తమామల కాళ్ళకు నమస్కరిస్తూ వుంటారు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో అత్తగారికి కాళ్ళు పిసికి తమ హిందూ సభ్యతను నిలబెట్టుకుంటూ వుంటారు.

ఇంక భక్తి భావన గురించి ఇక చెప్పనక్కరలేదు. గుడిలోకి వెడితే భక్తి పారవశ్యంలో సాష్టాంగ నమస్కారాలు చేస్తుంటారు. ఇలాంటి రాణులనూ, రాజకుమారీలనూ మనం ఆధునిక సభ్యతా పరులని ఎలా అనగలం?

వీరు ఆధునిక సభ్యతను దీక్షగా తీసుకున్న మొదటి తరం రాణులు అట్లా కాకుండా ఆధునిక సభ్యతా దీక్షను తీసుకుని మూడవ తరం గడుస్తున్న అంతఃపుర రాణులూ వున్నారు. వీరు ఇంకో రకంగా వుంటారు. మామూలుగా చూస్తే మొదటి తరంలోనూ, మూడవ తరంలోనూ తేడా వున్నట్టుగా గమనించలేము. ఇద్దరికీ తల వెంట్రుకలను కత్తిరించి వుంటాయి. ఇద్దరూ ప్యాంట్లు వేసుకుంటారు.... కానీ, పరిశీలనగా చూస్తేనే ఇద్దరిలో వ్యత్యాసం కనపడుతుంది. మూడవతరం రాణికి ముక్కులు కుట్టి వుండవు. ముక్కుపుడకలు వుండవు. ముఖాన కుంకుమ బొట్టు వుండదు. అయితే, సినిమా తారలను ముఖాన కనీ కనపడకుండా ఈ మూడవ తరం రాణులూ – రాజకుమార్తెలూ అనుకరిస్తూ తిలకం దిద్దుకుంటూ వుంటారు. ఉగ్గుపాలతో పాశ్చాత్య సభ్యతను అలవరచుకున్న ఈ మూడవ తరం రాజకుమారీల నడవడికల్లో ఏ మాత్రం తెచ్చిపెట్టుకున్నతనం కనిపించదు. వీళ్ళు ధరించే చొక్కాలు, ప్యాంట్లు – కోట్లు ఏ మాత్రం అవాస్తవికంగా వుండవు.

ఆధునిక సభ్యతలో మునిగిపోయిన ఇలాంటి రాజకుమార్తెలు, సీజన్ సమయంలో మధుపురిలో చాలాకాలం కనపడుతూ వుంటారు. సాయంత్రాలు హోటళ్ళలోని నృత్యశాలల్లో బాల్ డాన్సులు చేస్తూ కనిపిస్తూ వుంటారు ఈ రాజకుమార్తెలు. ఉన్నత స్థానంలో వున్న ప్రభుత్వ అధికారి గానీ, మంత్రిగారు గానీ వస్తున్నారంటేనూ, అలాంటి వారికి స్వాగతం ఇస్తున్నారంటేనూ వీళ్ళు ముఖ్యంగా అక్కడికి చేరుకుంటారు. అలాంటి స్వాగతోత్సవాలలో వీళ్ళకు ప్రథమ స్థానాన్ని ఇస్తూ వుంటారు. ఇంతవరకూ అంతఃపురాల అంధకారంలో ఊరూ, పేరూ లేకుండా వున్న ఈ రాజకుమార్తెలు ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తున్నారు.

మీనాక్షి అలా ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తున్న, ఆధునిక సభ్యతలో నిండా మునిగిన ఒక రాకుమార్తె. ఈమె వేసవి సీజన్‌లోనే కాకుండా సీజన్ అయిపోయాక కూడా మధుపురిలో కనిపిస్తుంది. ఎండలు బాగా వున్న రోజుల్లో రిక్షాలో తిరుగుతూ కనిపిస్తుంది. చల్లగా వుండే రోజుల్లో కాలినడకనే తిరుగుతూ కనిపిస్తుంది. 'మీనాక్షి' అన్న పేరు ఈమెకు తగినది. హిమాలయాల నుండి కన్యాకుమారి వరకూ, అస్సాం నుండి రాజస్థాన్ వరకూ వ్యాపించిన ఈ విశాల భారతదేశంలో 'మీనాక్షీ' అన్న పేరుకు తగిన స్త్రీ ఈమె ఒక్కతే అనుకుంటున్నాను. ఆమెవి విశాల నేత్రాలు. ఇంతటి విశాల నేత్రాలను జైన గ్రంథాలలో కానీ, పెద్ద పెద్ద కళ్ళు గల దేవతా విగ్రహాలలో కానీ చూడగలం. ఇంక మరెక్కడా

చూడలేము. ముఖం కంటె పెద్ద కళ్ళు విగ్రహాలలోనే కానీ మనుషులలో సంభవం కాదు. ఇలాంటి అసంభవం మీనాక్షి పట్ల సంభవమయింది. మీనాక్షి కళ్ళు ముఖం కంటె పెద్దవి. కనుబొమ్మలు కళ్ళకు చాలవు. అందువల్ల రోజూ కనుబొమ్మల్ని నల్ల పెన్సిలుతో దిద్దుకుంటుంది. ఆధునిక నాగరికతలో మునిగినప్పటికీ ప్రాచీన అలంకరణను బాయ్‌కట్ చేయలేదు. కళ్ళకు వెనుకటి స్త్రీలు పెట్టుకున్నట్టు కాటుక పెట్టుకుంటుంది. కను చివర్ల వరకూ రేఖల్ని లాగి దిద్దుకుంటుంది. ఇలా కాటుక రేఖల్ని దిద్దుకోవటం కళ్ళు పెద్దవిగా కనిపించాలని కాదు. అలా కనిపించవలసిన అవసరమూ లేదు. కాకపోతే, కనుబొమ్మలు కళ్ళకు తగినట్టుగా కనిపిస్తాయి. తెల్లని అగ్నిగోళాల్లో నల్లని కనుబొమ్మలు అద్భుతంగా మెరిసిపోతూ కనిపిస్తాయి. పెట్టుడు కనుబొమ్మల లాగానే పెట్టుడు కనుగుడ్లు పెట్టుకోవటానికి వీలుండదంటే, ఆమె రెండు కళ్ళూ లక్షల ఖరీదు చేస్తాయి. మీనాక్షి ముఖానికి ఎన్నడూ బొట్టు పెట్టుకోదు. అలా ముఖాన్ని మలినపరచుకోవటం ఆమెకు ఇష్టం లేదు. తల వెంట్రుకలను చిన్నగా కత్తిరించుకోవటం వల్ల ఉంగరాలు తిరిగినట్టుగా వున్న గిరజాల జుట్టు గాలికి రేగుతూ వుంటుంది. మీనాక్షి తల్లి కూడా మీనాక్షి లాగానే తల వెంట్రుకలను కత్తిరించుకుని, ప్యాంటు వేసుకుని మధుపురి బజార్లలో తిరుగుతూ కనిపిస్తుంది. చూసే వాళ్ళు ఇద్దరూ అక్కచెల్లెళ్ళు అని అనుకోవల్సిందే! తొలి తరమే ఇలా ప్యాంట్లు వేసుకుని, క్రాపులు చేయించుకుని ఆంగ్ల వనితల్లాగా తయారై తిరుగుతూ వుంటే ఇంక మలి తరాన్ని గురించి చెప్పవలసినది ఏముంటుంది. అయితే మీనాక్షి లాంటి కళ్ళు ఆమె తల్లికి లేవు.

మీనాక్షి కళ్ళను చూసి తరువాత ఆమె ఆకారాన్ని శరీర అందచందాల్ని చూస్తే బ్రహ్మదేవుడి బుద్ధిహీనతకు తప్పనిసరిగా జాలిపడతాం. ఇంత చక్కని కళ్ళను ఇచ్చిన బ్రహ్మదేవుడు మిగిలిన అంగాల విషయంలో పిసినారితనాన్ని ప్రదర్శించాడు. ఆమె ముఖం కళ్ళకు తగినట్టుగా వుండదు. ముఖం పొడుగ్గా, చెక్కపేడులాగా వుంటుంది. ముఖంలో కళాకాంతులూ అంతంత మాత్రమే. ఆమె ఎప్పుడూ ఎర్రని గ్రీసును బుగ్గలకు రాసుకుంటుంది. గడ్డానికీ రంగు రాసుకుంటూ వుంటుంది. ముఖానికి ఎప్పుడూ పౌడరు రాసుకుంటూ వుంటుంది. ఇంతగా తయారైనప్పటికీ అద్దంలో ముఖం చూసుకోగానే మనస్సు చివుక్కు మంటుంది ఆమెకు. బ్రహ్మదేవుడి కిరాతకాన్ని కనుపించకుండా చేయలేకపోయాను గదా!" అని నిట్టూరుస్తుంది. బ్రహ్మదేవుడు తనకు ప్రసాదించిన అనాకారితనాన్ని కనుపించకుండా చేయలేకపోవడంతో విసిగిపోయి కోపంతో తన దగ్గరున్న లిప్‌స్టిక్ నంతా పెదాలకు పట్టించేస్తుంది. ఈప్రపంచంలో పెదాలకు బండెడు లిప్‌స్టిక్‌ను పట్టించే యువతి ఎవరైనా వుందా? అంటే అది మీనాక్షీ అనే యువతి మాత్రమే! సొగసుగా

కత్తిరించిన గిరజాలు తిరిగిన నల్లని తల వెంట్రుకలు సినిమా తారల తల వెంట్రుకల్ని తల తన్నేట్టుగా వుంటాయి. అయితే ఏం ప్రయోజనం? ముఖం వంక చూసేసరికి చూసిన వాళ్ళ మనస్సు నీరసపడిపోతుంది. బ్రహ్మగీచిన గీతను తుడవటం ఎవరి వశం? మొత్తం శరీర అంగాలన్నీ మీనాక్షి మీద ఏ ఘోరమైన కుట్రనో పన్నుతూ వుంటే, కళ్లు మాత్రం ఆ కుట్రలో చేరకుండా ఆమె పక్షాన నిలచివున్నాయా అని అనిపిస్తుంది చూసేవారికి. చేతులూ, కాళ్ళు చెక్కతో చేసి తగిలించినట్టుగా వుంటాయి. ఎంత మంచి ప్యాంటూ, ఎంత ఖరీదైన కోటు కూడా చేతులూ – కాళ్ళూ యొక్క అనాకారితనాన్ని కనపడకుండా చేయలేక పోతున్నాయి. మీనాక్షికి ఎర్రరంగంటే చాలా ఇష్టం. ఆమె ఎర్రని లిప్‌స్టిక్‌ను పెదాలకు వేసుకుంటుంది. కోటూ ఎర్రనిదే వేసుకుంటుంది. అప్పుడప్పుడూ 'ఆటగాళ్ళు' వేసుకునే లాంటి కోటును వేసుకుంటుంది. అయితే, కోటు వేసుకున్నంత మాత్రాన ఆమెకు ఆటల పట్ల అభిరుచి వుందో? లేదో? చెప్పలేం. మధుపురిలో చలి ఎక్కువ. చలి బాధే లేకపోతే, చౌక్కా, పైజామాలోనే ఆమె రోడ్ల వెంట తిరుగుతూ వుంటుంది. ముఖం వంక చూడకుండా వుంటే కనుక చౌక్కా, పైజామాలో ఫరవాలేదనిపిస్తుంది. ముఖంలోనూ కేవలం కళ్ళను మాత్రమే చూడగలిగేటట్టయితే, కాళిదాసు దగ్గర నుండి ఈనాటి కవుల వరకూ ఎందరో కవులు కళ్ళను గురించి రచించిన కొన్నివేల వాక్యాల్ని చదివిన ఆనందం లభిస్తుంది మనకు. కాళ్ళూ చేతులూ ఎలా వెదురు పుల్లల్లా సన్నగా వున్నాయో అలాగే మొత్తం శరీరమంతా చూద్దామన్నా మాంసం లేకుండా కట్టె పేడులా వుంటుంది. దాంతోపాటు పొడుగయిన మనిషి కూడా. ఇక నడక విషయానికి వస్తే అటు గజగామినికాదు, ఇటు హంసయానాకాదు. మాట్లాడటంలోనూ చిన్నతనం నుండి ఇంగ్లీషు ఆయాలు, టీచర్లు నేర్పిన పద్ధతిలో నిదానంగా ముక్కుతో మాట్లాడటం అలవాటు చేసుకుంది. అయితే, స్వర మాధుర్యం మాత్రం శూన్యం.

మీనాక్షి ఈ ఇరవై ఐదవ శతాబ్దంలో – ప్రేమ వంచితగానే వుండిపోతుందా అని అనిపిస్తుంది. ఇంతకంటే అన్యాయం మరొకటి వుండదు కదా? పురుషుడు ఎంత కృతఘ్నుడో కదా? అసలు ఇంత అందమైన కళ్ళను కోరే పురుషుడు ఒక్కడూ లేకపోవటం ఏమిటి? రాజవంశాల్లో, ఈనాడు కవి హృదయం గల పురుషుణ్ణి (రాకుమరుణ్ణి) పుట్టించే శక్తి లేకపోయిందా? లేకపోతే ఏమిటి ఈదారుణం? వెనుకటి మహారాజులు ఎంతటి రసిక హృదయులు? ఒకగొప్ప కవిత్వం కోసం, ఒక గొప్ప శ్లోకం కోసం కొన్ని లక్షల మొహరీల్ని ధారపోసేవారు. కొందరు మహారాజులైతే ఏకంగా తమ అర్ధరాజ్యాన్ని ధారపోశారని కూడా చెప్తుంటారు. మరి అటువంటప్పుడు మీనాక్షి కళ్ళను – అవి సాధారణమైనవి

కావు. షఫరీ చాపల్లాంటి కళ్ళు – వాటిని ప్రేమించే ఒక పురుషుణ్ణి కూడా సృష్టించకపోవడం ఎంత ఘోరం? బ్రహ్మ పాషాణ హృదయుడు అనటానికి ఈ ఒక్క విషయం చాలదా? ఈ మీనాక్షి ఏ అంతఃపురంలోనో వుండి ప్రపంచపు వెలుగును చూడకుండా వుంటే, ఈమె మృగనయనాలు కమల నయనాలు, మీన నేత్రాలు ప్రపంచ ప్రజల దృష్టిలో పడకుండా వుంటే, అప్పుడు ఈమెకు ప్రియుడు లభించకపోయినా ఒక రకంగా వుంటుంది. కానీ, ఇప్పుడు మీనాక్షి సంవత్సరానికి ఆరునెల్లు మధుపురి బజార్ల వెంటే తిరుగుతున్నది. ఎందరో పురుషులు ఆ కండ్లను ఒకసారి కాదు మళ్ళీ మళ్ళీ చూస్తుంటారు. అయినా, ఆమెను ప్రేమించే పురుషుడు ఎక్కడా లేడనే చెప్పాలి. ఆమెను ప్రేమించే పురుషుడు రాజకుమారుడై వుండాలి. అప్పుడే అతనికి మీనాక్షి వైపు ప్రేమ హస్తాన్ని చాచే అధికారం లభిస్తుంది. మీనాక్షి పది సంవత్సరాలుగా మధుపురికి వస్తోంది. ఈ పది సంవత్సరాలలో ఎందరో రాజకుమారులు మధుపురికి వచ్చారు. మీనాక్షి తిరిగిన బజార్లల్లోనే వాళ్ళు తిరిగారు. అందులో ఒక్కరయినా మీనాక్షిని ప్రేమించ కూడదా! పురుష ప్రపంచం ఎంతక్రూరమైనదో? మీనాక్షికి వెనుకటి రాజకుమార్తెల మీద ఈర్ష్య కలుగుతుంది. అంతఃపురాల అంధకారంలో మ్రగ్గిన ఆవెనుకటి రాజకుమార్తెలు తమకంటే నయం అనుకుంటుంది. ఆరోజుల్లో అంతఃపుర కన్యలను వివాహమాడే రాకుమారులు ముందుగా కన్యల్ని చూడరు. పెళ్ళప్పుడూ చూడరు. పెళ్ళి అయి భర్త ఇంటికి వెళ్ళాక మాత్రమే భార్యను చూస్తారు. అలాంటి సౌకర్యం ఈనాడు లేకపోయింది కదా? ఉంటేనా, ఏ చెలికత్తె ద్వారానో తన సౌందర్యాన్ని గురించి అత్యుక్తుల్ని పలికించేది. తను కోరిన రాకుమారుడి దగ్గర. అంతటితో ఆ రాకుమారుడు తనను పరిణయం ఆడేవాడు. చెలికత్తెతో అబద్ధాలు కాకుండా కళ్ళ సౌందర్యానికి సంబంధించిన బీహార్ 'దోహా' (ద్విపద) నొకదాన్ని చెప్పిస్తే సరిపోతుంది. పౌడర్లూ, స్నోలూ, అధరరాగాలూ, ముఖ చూర్ణాలూ అస్తమిస్తున్న యవ్వనాన్ని ఎక్కువ రోజులు బతికించలేవు. మీనాక్షి యవ్వనం గడిచిపోతు న్నది. ఇప్పుడే తుమ్మెదలు వ్రాలటం లేదు. యవ్వనం పూర్తిగా గడిచిపోయాక వాల్తాయా? అసలు వసంతంలోనే ఆకర్షింపబడని తుమ్మెదలు నకలు వసంతంలో ఆకర్షింపబడతాయా?

మధుపురి ఇప్పుడు ఇంగ్లీషు వాళ్ళది కాదు. పూర్తిగా భారతీయులది. మిషనరీలుగా దేశంలో మిగిలిపోయిన కొద్ది మంది ఇంగ్లీషు స్త్రీ పురుషులు మాత్రమే సీజన్‌లో మధుపురికి వస్తున్నారు. అక్కడ భారతీయ భాషల్ని నేర్పే కేంద్ర పాఠశాల ఒకటుంది. సీజన్‌లో ఆ పాఠశాల విద్యార్థినీ విద్యార్థుల సంఖ్య రెండు మూడు వందలు వరకూ వుంటుంది. ఆ విద్యార్థినులతో యూరోపియన్ స్త్రీలూ కూడా వుంటారు. ఎలా అయితే యూరోప్‌లో

ఎందుకూ పనికిరాని పురుషులు మిషనరీలు అయిప్రపంచంలోని ఇతర దేశాల్లో క్రీస్తు జండాను పాతటానికి వెళ్తూ వుంటారో! యూరప్‌లోని అలాంటి స్త్రీలే క్రీస్తు జండాను పాతటానికి వివిధ దేశాలకు పోతూ వుంటారు. సీజన్‌లో మధుపురి విద్యాలయాల్లో చదవటానికి వచ్చే మిషనరీ దొరసాన్లు అలాంటి వారే! కురూపత్వానికి పోటీలు నిర్వహించేటట్టయితే వాళ్ళలో కొందరు ప్రథమ బహుమతిని పొందగలుగుతారు. కొందరు విశ్వకురూపులుగా ప్రసిద్ధినే పొందగలుగుతారు. ఇలాంటి కురూపులు అందాల మార్కెట్‌కు అధినాయకులు ఎలా కాగలరు? మిషనరీ దొరసాన్లే కాకుండా ఇతర ఆంగ్ల స్త్రీలు కూడా కొందరు మధుపురికి వస్తుంటారు. ఇతర ఆంగ్ల స్త్రీలు సాధారణంగా విదేశీ రాయబారులకు సంబంధించిన వాళ్ళయి వుంటారు. వీళ్లు మధుపురి వచ్చినప్పుడు హోటళ్ళల్లో బస చేస్తుంటారు. వీళ్ళను కొంతవరకూ అందగత్తెలే అనవచ్చు. ఈ రకంగా ఇప్పుడు మధుపురిలోని అందాల మార్కెట్‌లో భారతీయుల ఆధిపత్యం స్థిరపడిపోయింది. ఈ ఆధిపత్యం దేశంలోని అందాల మార్కెట్‌లోనే అయినందుకు దేశాభిమానులందరూ తగు మాత్రంగా అభిమానపడవచ్చును. ఈ సౌందర్యాధిక్యతను కొందరు 'నాటు సీసాలో సీమసారా' అని విమర్శించవచ్చు. పరిహసించనూ వచ్చు. అయితే దోషాలను వెతికేవారు తులసీదాసు విషయంలోనూ వున్నారన్న విషయాన్ని మనం మర్చిపోకూడదు.

మధుపురి అందాల మార్కెట్‌లో ఆధిపత్యాన్ని సంపాదించిన భారతీయ స్త్రీలను మూడు వర్గాలుగా విభజించవచ్చు. ఒకటవ వర్గంలో రాణులూ, రాకుమార్తెలూ, రెండవ వర్గంలో గొప్పగొప్ప ఉద్యోగస్థుల ఇళ్ళల్లో పెరిగిన సీతాకోక చిలుకలు. వీరు అందంలోనూ, నాగరికతలోనూ రాణుల్ని, రాజకుమార్తెలను మించి వుంటారనటంలో ఎటువంటి సందేహం లేదు. మూడవవర్గం సేటు భార్యలు (సేఠానీలు) సేటు కుమార్తెలు. ఈ మూడు వర్గాలే కాకుండా, చిన్న చిన్న ఉద్యోగస్తుల భార్యలూ, కూతుళ్ళూ అప్పుడప్పుడు కనిపిస్తూ వుంటారు. అందాల మార్కెట్‌లో ఆధిపత్యం సంపాదించుకోవటానికి ఒక అందం వుంటే చాలదు. లక్ష్మి కూడా తోడు వుండాలి. లక్ష్మి అంటే సౌందర్యలక్ష్మి అని కాదు. ధనలక్ష్మి. ఫ్యాషన్ ప్రపంచం ఖర్చుతో కూడిన ప్రపంచం. కాబట్టి ఆ ప్రపంచంలో అందం కంటే కూడా డబ్బుకే ఎక్కువ ప్రాధాన్యత వుంటుంది. వెనుకటి రోజుల్లోనూ 'వ్యాపారే వసతి లక్ష్మీః అన్న సూక్తిని చెప్పారు. బహుశా ఆ రోజుల్లో పై వాక్యాన్ని మనస్ఫూర్తిగా చెప్పలేను అనుకుంటున్నాను. ఎందుకంటే రాజశాసనం సామంతుల చేతుల్లో వుండేది. సామంతుల తీక్షణమైన ఖడ్గాలు మహా ధనాఢ్యుల ధనాగారాల్ని సైతం క్షణంలో ఖూనీ చేస్తుండేవి. కనుక ఆ రోజుల్లో 'వ్యాపారే వసతి లక్ష్మీః' అన్న ఉక్తి ప్రచారంలో వున్నప్పటికీ లక్ష్మికి

నిజమైన అధిపతులు సేటు వర్గీయులు (వ్యాపారస్థులు)కాదు. అయితే, ఇప్పటి పరిస్థితి వేరు. ఇప్పుడు మన ప్రభుత్వ యంత్రాంగమంతా కేవలం సేటు వర్గీయుల శుభ చింతన కోసమే వుంటోంది కనుక వారికి చరిత్రలో ఎన్నడూ లభించని, అపూర్వమైన స్థానం లభించింది. నిజం చెప్పాలంటే ఈనాటి శాసనసూత్ర ధారులు సేటు వర్గీయులే. వీళ్ళ ఇళ్ళల్లో బ్యాంకులు, బీమా కంపెనీలు, బ్లాకు మార్కెట్టు ఇలా బహుముఖంగా ధనరాశు లు వచ్చిపడుతూ కల్పవృక్షాన్ని స్ఫురింప చేస్తాయి. ఈ రోజుల్లో ఒక్కొక్క సేటు కోటీశ్వరుడు అనిపించుకోవటాన్ని అవమాన కరం అనుకుంటున్నారు. ఈ సేటు వర్గీయులు మధుపురికి కొత్తగా వచ్చిన అతిథులు. సామంత వర్గీయుల కంటే, ఉద్యోగ స్థుల కంటే వీరి సంఖ్య తక్కువే. అయినా ఆధిపత్యంలో మాత్రం సేటు వర్గానిదే పై చేయి. గతంలో తెల్లదొరలు కట్టించుకున్న గొప్పగొప్ప భవనాలన్నీ ఈనాడు ఈ సేటు వర్గీయుల (వ్యాపారస్థుల) చేతుల్లోనే వున్నాయి. అంత పెద్ద పెద్ద బంగళాలలో పది, పదిహేను మంది నౌకర్లతో వుండగల స్థోమత ఒక్క సేటు వర్గీయులకు మాత్రమే వున్నది. ఈ వర్గానికి చెందిన యువతీ యువకులలో ఆధునిక నాగరికత కట్టలు తెంచుకుంది. కానీ ప్రవాహ వేగం ఇంకా తీవ్రస్థాయిని అందుకోలేదు. ఈ వర్గపు యువకులు ఇళ్ళలోని పాత ఆచారాలను మధుపురికి వచ్చినా వదలటం లేదు. ప్యాంటు వేసుకుంటారు. దానిపైన మెడ దగ్గర పూర్తిగా మూసి కుట్టిన పాతకాలపు కోటును వేసుకుంటారు. టైట్‌వే-లేడ్‌లీ సూట్లను ప్రత్యేకం మధుపురిలో వేసుకోవటానికి కొని తెచ్చుకుంటారు. అయితే, అవి వేసుకుని నడిచే నడక వేరుగా వుంటుందని మర్చిపోతారు. అలాంటి సూట్లు వేసుకుని, ధోవతి లాల్చీలు కట్టుకుని తమ తాతలువెనుక ఎలా నడిచేవారో? అలా నడుస్తారు. వాళ్ళ మాటల్లో ఆధునికత్వం కనిపించదు. మధుపురిలోని పెద్ద బజార్లో నడుస్తూ ఇంగ్లీషు తప్ప మరో భాషలో మాట్లాడకూడదన్న విషయం ఆ యువకులకు ఈనాటికీ తెలియదు. ఆధునికమైన సూటూ – కోటూ వేసుకున్న యువకులు బజార్లో నడుస్తున్నప్పుడు తమ బంధువులతోటి అయినా ఇంగ్లీషులోనే మాట్లాడాలి తప్ప మరే ఇతర భాషలలో మాట్లాడకూడదన్న విషయం వీరికి తెలియదు కదా! ఈ సేటు కుమారులకు డబ్బయితే వున్నది కానీ బుద్ధి సూక్ష్మత తక్కువ. బజార్లో నడుస్తున్నప్పుడు మార్వాడీ భాషలోనో, వచ్చీరానీ హిందీలోనో మాట్లాడుకుంటూ వుంటారు. వీళ్ళకు తమలోపం ఏమిటో తెలియటం లేదు. అయితే అప్పుడప్పుడు వీళ్ళు పక్కన నడుస్తున్న జంట్స్ అండ్ లేడీస్ వీళ్ళను చూసి నవ్వుకుంటూ తమ ప్రియాతి ప్రియమైన ఇంగ్లీషు భాషలో వ్యంగ్యంగా మాట్లాడుకుంటూ వుంటారు. తమ మీద వస్తున్న విమర్శల వెల్లువ వీళ్ళ చెవిన పడుతూనే వున్నాయి.

శతాబ్దాలుగా అంతఃపురాలు సుందరీమణుల ప్రదర్శన శాలలుగా వున్నాయి. అంతేకాదు సుందరీ మణులను తయారుచేసే నర్సరీలుగా కూడా పని చేశాయి. ఒకప్పుడు అంతఃపురాల్లో అనన్య సౌందర్యవతులు పుడుతుండేవారు. ఆ సౌందర్యవతులను, స్వయంవరం పోటీల్లో విజయం పొందిన వారికి బహుమతులుగా ఇచ్చేవారు. స్వయం వర ఆచారం కనుమరుగవడంతో అంతఃపురాలు అందగత్తెల నర్సరీలనే ప్రత్యేక బిరుదుని కోల్పోయాయి. అంతఃపురాలలో ఒక్క రాజకుమార్తెలే కాకుండా రాజకుమారులు కూడా పుడుతుంటారు కదా! మరి రాజకుమారులలో అందవిహీనులు వున్నప్పుడు రాజకుమార్తె లలో కూడా వుండాలి కదా? ఏమైనా కానీ, రాజకుమార్తెల్ని జగత్ ప్రసిద్ధులయి సౌందర్యరాశులుగా చేసిన ఘనత అంతఃపురాలదే! దేశంలోని సౌందర్య రాశులను వుచ్చు వేసి లాగినట్టు అంతఃపురాల్లోకి లాగేవారు. 'అంతఃపురంలోకి వెళ్ళిన స్త్రీ, అంతఃపురాంగన కాక మరింకేమవుతుంది? ఇంతేకాక మన ఋషులు స్త్రీ రత్నాల కోసం ప్రత్యేకమైన విధానాన్నే ప్రకటించారు. 'స్త్రీ రత్న దృష్కులా దపి' అన్నారు. దీంతో అంతఃపురాలు అన్ని కులాల నుండి స్త్రీ రత్నాల్ని స్వీకరించి అందాల మార్కెట్‌లో తమ గుత్తాధిపత్యాన్ని ప్రకటించుకున్నాయి. ఇప్పుడా గుత్తాధిపత్యం లేకపోయినప్పటికీ ఈ హీన దశలోనూ పోటీకి నిలబెడితే, సేటు కుమార్తెల కంటే, సేటు భార్యలకంటే సామంత వర్గపు స్త్రీలే సౌందర్యవతులన్న సత్యం బయటపడుతుంది. మధుపురిలో వీరిరువురినీ దగ్గరదగ్గరగా చూస్తున్న వారికి ఈ విషయం ఇంకా త్వరగా అర్థమవుతుంది.

ఈ రెండు వర్గాలే కాకుండా మూడవ వర్గం ఉద్యోగస్తులది. ప్రభుత్వంలో, ఉన్నత మైన పదవుల్లో వున్న వారి భార్యలూ, కూతుళ్ళు, మేధావులయిన విద్యావంతుల నుండే ఈ ప్రభత్సగులు వచ్చారు కనుక, వీరినీ మేధావివర్గంలో కలపవచ్చు. అయితే, గడచిన మూడు దశాబ్దాల నుండే స్వయంవర ఆచారం ప్రకారమే సుందరీ మణులందరూ కేవలం ఉద్యోగస్థులలోనే పంపిణీ అయ్యేవారు. ఐ.పి.ఎస్. అయిన అల్లుడికోసం ఒక్కోగృహస్థు, రాజర్షి భగీరథుడు చేసినంత తపస్సు చేస్తుంటాడు. ఒక్కో తండ్రి తన కూతుర్ని భవిష్యత్తులో తనకు లభించబోయే ఐ.పి.ఎస్. అల్లుడికి తగినట్టుగా తయారు చేయటానికి ఎంత బాధపడతాడో, ఎంత ధనాన్ని వెచ్చిస్తాడో చెప్పలేను. ఆమెను చదివిస్తాడు. ఆధునిక సమాజంలోని సభ్య ఆచారాలన్నింటినీ నేర్పిస్తాడు. వాటికి అనుగుణంగా కూతుర్ని తీర్చిదిద్దుతాడు. ఇంగ్లాండు నుండి వచ్చిన కాబోయే అల్లుడి సమస్త కోర్కెల్ని తీర్చగల సమర్థురాలిగా కూతుర్ని తయారు చేస్తాడు. మూడు దశాబ్దాల కాలం నుండి ప్రచారంలోకి వచ్చిన ఈ వివాహాల్ని స్వయంవరాలనే అనవల్సి వస్తుంది. వెనుకటి స్వయం వరాలకూ,

ఈ స్వయం వరాలకూ ప్రధానమైన తేడా ఒకటి వుంది. వెనుకటి స్వయంవరాల్లో కన్య వరుణ్ణి ఎన్నుకునేది. ఈస్వయంవరాల్లో అట్లా కాదు. వరుడే కన్యను ఎన్నుకుంటాడు. ఇంగ్లీషు వాళ్ళకాలంలో సంవత్సరానికి యాభైమంది దాకా ఐ.పి.యస్.లయ్యేవారు. వారిచేత వరింపబడటానికి కొన్ని వేల మంది నవ నాగరికతను సంతరించుకున్న కన్యలు పూలమాలను చేతపట్టుకుని సిద్ధంగా వుండేవారు. ఈ స్వయంవరంలో ఒక సంవత్సరం విఫలమయినప్పటికీ కన్యగానీ, కన్య తండ్రిగానీ నిరాశ పడేవారు కాదు. తరువాతి సంవత్సరం తిరిగి పోటీలో నిలబడేవారు. తమ చేతుల్లోని జయమాలలు వాడిపోయే వరకూ అలాప్రతి సంవత్సరం పోటీలో పాల్గొంటూనే వుండేవారు.

సౌందర్యాన్ని ఎన్నిక చేసే అధికారం సామంతవర్గం, సేటు వర్గం చేతుల్లో నుండి ఉద్యోగస్థుల చేతుల్లోకి వచ్చేసింది. మధుపురిలోని సామంతవర్గ, సేటువర్గ స్త్రీలు ఉద్యోగస్తుల భార్యల ముందూ – కూతుళ్ళ ముందూ సూర్యుడి మందు దివిటీల్లా ఎలాతెలా పోతున్నారు. సామంత వర్గీయుల్లో కొందరు ఇప్పటికే బాగా ఖర్చుపెట్టగలిగే స్థితిలోనే వున్నారు. సేటువర్గపు సుపుత్రులు, సుపుత్రికలను గురించీ వారు పెట్టే ఖర్చును గురించీ ప్రత్యేకంగా ఇంక చెప్పనక్కరలేదు. మధుపురిలో వారు పెట్టేఖర్చును ముసలిసేట్లు చూడరు. చూస్తే ఇంకేముంది? గుండె ఆగి చచ్చిపోతారు. అలాంటి ప్రమాదం ఎప్పటికీ సంభవించదు. ఎందుకంటే ముసలిసేట్లు మధుపురికి ఎన్నడూ రారు కనుక! బ్లాక్‌మార్కెట్ పుణ్యమా అని ముసలిసేట్లు జమాఖర్చులు రాయటం నేర్చుకున్నారు. అయితే, యువకులు వృద్ధులకు తీసిపోతారా? అసలు ముసలిసేట్లకు తమ ఖర్చుల వివరాలను తెలియపర్చవలసిన అవుసరం వారికి లేదు. వీళ్ళల్లో ఒకప్పటి ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ శిథిలమైనది. సేటు భార్యలూ – సేటు కుమార్తెలూ తమ వర్గానికి చెందిన సహజమైన కట్టూ–బొట్టూను త్యజించారు. సిగ్గూ–బిడియాల్ని విడిచిపెట్టారు. అంతఃపుర పంజరాల్లో బంధింపబడిన స్త్రీ రత్నాలు స్వాతంత్ర్యాన్ని పొందినట్టుగానే, సేటు వర్గపు స్త్రీలు కూడా స్వాతంత్ర్యాన్ని పొంది ముందుకు వస్తున్నారు. వీరిలోనూ వయస్సును బట్టి నాగరికతలో వ్యత్యాసం కనపడుతుంది. ముసలివారు ఆరుగజాల చీర, ఎత్తు మడమలూ వేసుకున్నప్పటికీ లంగా, ఓణీని వేసుకున్నట్టుగా నడుస్తారు. సినిమా తారల ననుసరించి, ఒకటి రెండు అమూల్యమైన నగలతో అత్యాధునికంగా అలంకరించుకుని వెళ్తున్నప్పటికీ, అనుకోకుండానే వీరి చెయ్యి తలమీద కొంగు లాక్కోవటానికి వెళ్తూ వుంటుంది. వెనుకటి ఆచారాల తాలూకు ఛాయలు ఇంకా వీళ్ళను వదలలేదు. అయినా, వీళ్ళు సాధించిన అభివృద్ధి తక్కువదా? వీళ్ళ అత్తగార్లను తలుచుకుని వీళ్ళను చూస్తే అప్పుడు కానీ వీళ్లు సాధించిన అభివృద్ధి ఏమిటో? బోధపడదు.

వీరి భర్తల్లో కోటూ ప్యాంటు వేసుకుని పంచ కట్టుకున్నట్టుగా నడుస్తుంటే, వీళ్ళను అని ప్రయోజనం ఏముంటుంది? అయితే, రావణాసురుడి మహారాజధాని లంకలోనే విభీషణుడు పుట్టుకు వచ్చాడు గదా? అలాగే సేఠానీలలో కూడా నగనాగరికతను వంటపట్టించుకున్న వాళ్ళు లేకపోలేదు. కొందరు ప్రౌఢాంగనలూ, నవ యువతులూ ఐ.పి.ఎస్. భార్యల్ని – కూతుళ్ళనీ తల తన్నేట్టుగా వుంటారు. నిత్య వ్యవహారాలలో ఇంగ్లాండు నుంచి అప్పుడే దిగివచ్చినట్టుగా వ్యవహరిస్తుంటారు. వాళ్ళ కూతుళ్ళతో, కొడుకులతో కూడా ఇంగ్లీషులోనే మాట్లాడతారు. "పితా రక్షతి కౌమారే, భర్త రక్షతి యవ్వనే, పుత్రస్తు స్థవిరే భావే న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి" అన్న ఋషి వాక్యాల్ని అటక మీద పెట్టి సేటు భార్యలు ఒంటరిగా విమానాల్లో విదేశాలకు కూడా వెళ్తున్నారు. సేటు వర్గపు నవ యువతులు సామంత వర్గపు స్త్రీలనూ, ఐ.పి.ఎస్.ల భార్యల్ని ఆదర్శంగా పెట్టుకున్నారు. మధుపురిలోని సేటు వర్గపు స్త్రీలల్లో కొత్తదనం తాలూకు బెదురు ఇంకా కనపడుతూనే వున్నది. అయినా కొందరు మాత్రం గొప్ప అభివృద్ధినే సాధించారు. ఇప్పుడిప్పుడే సేటు పుత్రులూ, పుత్రికలూ యూరోపియన్ స్కూళ్ళల్లో చదవటం ప్రారంభిస్తున్నారు. సముద్రయానం వల్ల మతభ్రష్ఠులవుతారన్న పెద్దల వాక్యాల్ని పక్కన పెట్టి నిత్యం ఇంగ్లాండుకూ, అమెరికాకూ షికార్లు కొడుతున్నారు. అయితే, చాలా మంది సేటులు తమ భార్యలు చనిపోతే, యూరోప్ సేటులను ఆదర్శంగా పెట్టుకుని మళ్ళీ పెళ్ళి చేసుకోకుండా ఏకపత్నీవ్రతు లనిపించు కుంటున్నారు.

సామంత వర్గీయులూ, సేటువర్గీయులూ ఉన్నతోద్యోగులూ – ఈ మూడు తెగల వారూ ఒక నావను ఎక్కారు. వారి జీవిత పద్ధతులూ, ఆచారాలు రోజురోజుకూ దగ్గరవు తున్నాయి. మన భారతదేశపు కుల వ్యవస్థ ఈ మూడు వర్గాల ప్రజల్ని ఏకం కాకుండా అడ్డుకుంటున్నది. యూరోప్‌లో కూడా ఒకప్పుడు మహారాజులు, సామంతుల్తో వివాహ సంబంధాల్ని అంగీకరించేవారు కాదు. ఇక కోటీశ్వరులయిన సేటు వర్గీయుల్ని ఆకు కూరలోని పురుగులా చూసేవారు. కానీ ఇప్పుడు అక్కడ రాజవర్గం, సామంతవర్గం, సేటు వర్గం – మూడు వర్గాలూ కలిసిపోయాయి. లక్ష్మీ పుత్రులందరూ ఒకే జాతిగా పరిణతి చెందారు. అర్ధ శతాబ్దం క్రితం భారతదేశంలోని వివిధ కులాలకూ, జాతులకూ చెందిన సంస్థానాధీశులందరూ ఒక కులంలోకీ, జాతిలోకి, పరిణతిని చెందారు. అందరూ రసపుత్రులయిపోయారు. అలాగే, ఈనాటి ఈ మూడు వర్గాలూ ఏక జాతిగా, ఏకవర్గంగా పరిణతి చెందే రోజు చాలా దగ్గర్లో వుంది. ఈ లక్ష్మీపుత్రులకూ, ప్రభుత్వాధినేతలకూ వ్యతిరేకమైన మరోవర్గం భారతదేశంలో ఉద్భవిస్తున్నది. ఆ వర్గం క్రమంగా పుంజు

కుంటున్నది. ఆవర్గం పుంజుకున్న సర్వాన్నీ అంతర్హితం చేసుకున్న రోజున మీనాక్షి లాంటి వాళ్ళకు నష్టపోవాల్సిన  పని వుండదు.

ఆనాడు ఆమె భర్తల్ని ఎన్నుకునే క్షేత్రం విస్తృత మవుతుంది. అయినా ప్రయోజనం ఏముంటుంది? ఎప్పుడో కదా? ఆ అవకాశం ప్రస్తుతం ఆమె సామంత వర్గంలోనే కదా భర్తల్ని ఎన్నుకోవల్సింది. ఆ వర్గాన్ని దాటి ఒక్క అడుగు కూడా ముందుకు వేయటానికి వీలులేదు కదా? తనలాగా నవనాగరికతను అభిమానిస్తున్న సామంత వర్గపు స్త్రీలందరూ భర్తల్ని ఎన్నుకునే క్షేత్రాల్ని విస్తృతం చేసి వివిధ జాతుల్లో నుండి భర్తల్ని ఎన్నుకోవడం ప్రారంభిస్తే తనూ అడుగు ముందుకు వేయగలదు. ఆ శుభఘడియను వచ్చేనాటికి మీనాక్షి యవ్వన ప్రాంగణాన్ని దాటే పోతుంది. ఆ నూతన యుగం తొందరగా ప్రారంభం కావటానికి మీనాక్షి తనుగా తాను ఏమీ ప్రయత్నం చేయలేదు. మిగిలిన వాళ్ళు ప్రయత్నించి అన్య జాతుల పురుషుల్ని ప్రేమించి ఆ యుగాన్ని తేగలిగితే లాభపడటానికి మాత్రం తను సిద్ధం.

మీనాక్షి దయనీయస్థితిని చూస్తే కాలింపోంగ్ జైలు వార్డన్ బలియా జిల్లా నివాసి తివారి జ్ఞాపకం వస్తున్నాడు. అతనికి యాభై ఏళ్ళ వయసుంటుంది. అంతవరకూ వివాహం కాలేదు. ఇక అవుతుందన్న నమ్మకమూ లేదు. చాలా దయనీయ స్వరంలో "వితంతు వివాహాలు ప్రారంభం అవుతాయి. అయితే నేను చూడను" అని అనేవాడు.

'పోనీ మీరు ఏ బ్రాహ్మణ బాల వితంతువునయినా వివాహ మాడకూడదా?' అంటే తల అడ్డంగా తిప్పేవాడు. తనుగా సాహసించి, ముందుకు అడుగు వేసి, నూతన మార్గాన్ని నిర్మించే ధైర్యం అతనికి లేదు. ఇంకెవరైనా మార్గాన్ని నిర్మిస్తే తను ఆ మార్గంలో నడుస్తానంటాడు.

# 'గోలూ'

**"రాం** రాం బాబూజీ!"

"రాం రాం, గోలూ!" అన్నాను నేను.

మధుపురిలో 'గోలూ' కూలీ చేసుకుని బతుకుతూ వుంటాడు. ఎక్కువశాతం ఈ వర్గం ప్రజలు పరస్పరం కలుసుకున్నప్పుడు "రాం...రాం..." అని చెప్పుకుంటారు. తమకంటే పై స్థితిలో వున్నవారిని కలుసుకున్నప్పుడు మాత్రం 'సేఠ్‌జీ' అని సంబోధన చేస్తారు. అయితే, 'గోలూ' మిగతా వారిలా కాకుండా తమ కంటే పై స్థితిలో వున్నవార్ని కలిసినప్పుడు 'రాం...రాం' అనే అంటాడు. ఇది అతడి వృద్ధాప్యం వలన అయి వుండవచ్చు. వాస్తవానికి 'గోలూ'కు యాభై ఏళ్ళకు మించి వయసు వుండదు. కానీ, చాలా వృద్ధుడిలా కనిపిస్తాడు.

చలికాలం విలాస యాత్రికులు అక్టోబరు సీజనును ముగించుకుని తమ ఇళ్ళకు వెళ్ళిపోయారు. ఈ రెండవ సీజనులో మొదటి సీజనులో వచ్చినంత మంది విలాస యాత్రికులు రారు. అయినప్పటికీ, ఆరిపోతున్న దీపపు కాంతిలా నిర్మానుష్యమవుతున్న మధుపురి మళ్ళీ కళకళ లాడుతుంది. కూలీ చేసుకుని బతికే ప్రజలకు ఎంతో పని దొరుకుతుంది. వ్యాపారస్థులకూ, దుకాణదారులకూ కొద్దీ గొప్పా డిమాండ్ పెరుగుతుంది. వాళ్ళ వస్తువులు మరికొన్ని అమ్ముడుపోతాయి. కానీ నవంబర్ నెల చివరకు వచ్చేసరికి విలాస యాత్రికులు అందరూ దాదాపుగా వెళ్ళిపోతారు. ఇకప్పుడు మరెక్కడా వుండటానికి అవకాశం లేనివాళ్ళు మాత్రమే మధుపురిలో వుండిపోతారు. నాకు మరెక్కడా వుండటానికి చోటు లేదు. గోలూకు లేదు. అందుకే ఇద్దరం రెండవ సీజన్ అయ్యాక కూడా మధుపురిలోనే వుండిపోయాం. ఈ స్థితే మా ఇద్దరిలోనూ ఒకరి మీద మరొకరికి సోదర భావాన్ని కలిగించింది. వెన్నెలరాత్రి. ఆ రోజు రాత్రి ఏడెనిమిది గంటలప్పుడు చెట్ల కింద పడివున్న ఎండు పుల్లల్ని ఏరుకుంటూ, వాటిని ఎలక్ట్రిక్ లైటు స్తంభం దగ్గర పోగుచేస్తున్నాడు గోలూ. పగటిపూట కనుక వచ్చినట్లయితే ఇంకా మంచి పుల్లలు దొరికేవి. ఎక్కువా

అనువాదం : **కవిని ఆలూరి**

దొరికేవి. అయితే, పగటిపూట ఎలా రాగలడు? పని చేసుకోవాలి కదా? పగటి పూట పనేమీ లేకపోతేనే పుల్లల కోసం వెళుతూ వుంటాడు. ఇంతకు ముందులా మధుపురి చుట్టుపక్కల అడవులు దట్టంగా లేవు. పల్చబడ్డాయి. మధుపురిని దాటి చాలా దూరం వెళితే కానీ చెట్లు కనపడవు. అయితే, రోజుకు రెండు మూడు సార్లు నగరానికి ఆ చివర నుండీ ఈ చివర వరకూ నడిచే గోలూకు ఇది కష్టమైన పని కూడా కాదు. చలికాలంలో రోజుకు రెండుసార్లు నగరానికి ఆ చివరనుండీ ఈ చివర వరకూ నడవటానికి అవకాశం వుండే కూలీ దొరికితే తనను తాను అదృష్టవంతుడనుకుంటాడు. గోలూ ఎక్కువగా చిల్లర వర్తకులైన కోమట్ల దగ్గర కూలి పనిచేస్తూ వుంటాడు. ఇతర కూలీలు రూపాయి ఇస్తే కానీ మోయని బరువుకు, గోలూ పన్నెండు అణాలకే మోసుకు వెళతాడు. అందుకనే వ్యాపారులు ఎక్కువగా కూలీ మోయటానికి గోలూనే పిలుస్తుంటారు. గోలూ మధుపురిలోని ఇళ్ళవైపుకు ఎక్కువగా వస్తుంటాడు. ఆ ఇళ్ళ పక్కనున్న వ్యాపారస్థులు స్థానిక ప్రజల మీద ఆధారపడ్డ వాళ్లు కావటం వలన సంవత్సరం పొడుగునా వ్యాపారం సాగుతూనే వుంటుంది వాళ్ళకు. గోలూ, ఆ వ్యాపారస్థులకు పర్మినెంటు కూలీ అని వేరే చెప్పనక్కర లేదనుకుంటున్నాను.

మధుపురి సెంటర్‌కు రెండు మైళ్ళ దూరంలో మేముంటున్నాము. గోలూ ఇతర కూలీలు వుండే చోట సెంటర్‌కు దగ్గరగా వుంటాడు. అతని బంధువులందరూ అతడి లాగానే కూలీ పనులు చేసుకుని బతుకుతూ వుంటారు. ఒకసారి గోలూకు పూర్తి అంధత్వం వచ్చేసింది. అప్పుడు డాక్టరు ఆపరేషన్ చేసి చూపు తెప్పించాడు. అప్పట్నుండి మొద్దు కళ్ళద్దాలు పెట్టుకుంటూ వుంటాడు. కట్టెపుల్లలు ఏరుకునేటప్పుడు కళ్ళజోడు వుంటుంది. బంధువులు అతనికోసం కూడా రొట్టెలు చేసి వుంచుతారు. అందరికీ వంటకు కావాల్సిన పుల్లల్ని గోలూ ఏరుకు వెళుతుంటాడు.

గోలూ చాలా సన్నగా, బలహీనంగా, ఎముకల గూడులా వుంటాడు. చేతికర్రను నేలకు తాకిస్తూ నడుస్తాడు. ఎంత సన్నగా వున్నా ఒక మణుగు బరువు మోస్తూ వుంటాడు. ఒకవేళ ఎప్పుడయినా తక్కువ మోస్తే, ఆ తక్కువ మందం వ్యాపారస్థులు సగం కూలీనే ఇస్తుంటారు. గతంలో అతని ముఖం పచ్చగా, కళకళలాడుతూ వుండేది. ఇప్పుడు రక్తం లేక పాలిపోయింది. అంత చిన్న శరీరంతో మణుగు బరువును నిదానంగా మోస్తూ వుంటాడు. ఒక్కొక్కసారి మధుపురికి ఆ చివర నుండీ ఈ చివరకూ కూలీ మోసుకు పోవాల్సి వుంటుంది. అంటే నాలుగు మైళ్ళు వెళ్ళి నాలుగు మైళ్ళు రావాల్సి వుంటుంది. రానూ పోనూ కలిపి మొత్తం ఎనిమిది మైళ్ళు. కూలీ దొరకాలే కానీ ఎనిమిది మైళ్ళేంటి? పన్నెండు మైళ్ళయినా నడుస్తాడు గోలూ. అతడు ఎంత దూరమైనా ఒక క్రమమైన

వేగంలో నడుస్తూనే వుంటాడు. మందకొడిగా నడుస్తున్నాడు. తినటానికి లేదు. మధ్యలో అలుపు తీర్చుకోవటానికి కొన్ని మజిలీలు వున్నాయి. గోలూ నడవటం కానీ, అలుపు తీర్చుకోవటం, కాసేపు ఆగటం కానీ అంతా ఒక యంత్రంలాగా జరిగిపోతూ వుంటుంది. దారిలో ఎవరైనా పరిచయస్థులు కనపడితే 'రాం....రాం' అంటూ వుంటాడు. లేకపోతే నిరంతరం భూమిని తన కాళ్ళతో చదును చేస్తూ మజిలీ వచ్చిన చోట ఒక క్షణం ఊపిరి తీసుకుంటూ వెళ్ళిపోతూ వుంటాడు. గోలూను చూస్తూ వుంటే మోసే పశువులు జ్ఞాపకం వస్తూ వుంటాయి. వాటికీ, గోలూకు మధ్య ముఖ్యమైన వ్యత్యాసం ఏమిటంటే, పశువులు తమ ఇష్టప్రకారం బరువులు మోయవు. గోలూ అలా కాదు తన ఇష్టప్రకారమే మోసుకు వెళుతుంటాడు. ఏదో ఒక రకంగా బ్రతకాలి. బ్రతకాలంటే తిండి తినాలి. ఇంక కూలీ మోయక ఏం చేస్తాడు?

మధుపురి ఏడెనిమిది వేల అడుగుల ఎత్తున వున్నది. చలికాలంలో అక్కడ మంచు గడ్డ కడుతూ వుంటుంది. అయినా, గోలూ చలిని ఏ మాత్రం లెక్క చేయకుండా బరువుల్ని మోస్తూ వుంటాడు. అతనికి ఎండా, వానా, చలీ అన్ని కాలాలూ సమానమే! శీతాకాలంలో చలినుండి తనను తాను కాపాడుకోవటానికి గోలూ ఎలాంటి బట్టల్ని వేసుకుంటాడో ఊహించుకోవటం కష్టం కాదు. పాతగుడ్డల వ్యాపారి దగ్గర ఎప్పటిదో ఓ పాత ఉన్ని కోటునూ, ఓ పైజామానూ కొనుక్కున్నాడు. వాటిని సంవత్సరాల తరబడిగా వాడుతున్నాడు. ప్రతి సంవత్సరం అవి చినుగుతూ వుంటాయి. చినుగులను కుట్టుకుంటూ వుంటాడు. ఆ కోటుకూ, పైజామాకు కుట్టులేని చోటు లేదు. వాటిని ఏనాడూ ఉతకటానికి వేసి వుండడు. తనూ ఉతుక్కోడు. వాటిని నీళ్ళల్లో ముంచితేనే పీలికలై చేతికి వచ్చేటట్టుగా వున్నాయి. కాళ్ళకు టైరు చెప్పులు. తలమీద గఢనాల్ ప్రాంతీయులు ధరించే టోపీ! ఆ టోపీ బట్టనెత్తి వున్న వాళ్లకు చాలా రక్షణను ఇస్తుంది. అయితే గోలూకు బట్టతల లేదు.

గోలూ రోజంతా పశువులా బరువులు మోస్తూనే వుంటాడు. కంచరగాడిదలు కూడా రోజుకు అన్ని గంటలు అలా మోయటానికి నిరాకరిస్తాయి కదా? అతడలా యువకుడిగా వున్నప్పటి నుండీ బరువులు మోస్తూనే వున్నాడు. వెనుక ఇతర అలవాట్లు ఏమైనా వున్నాయేమో? కానీ ఇప్పుడు ఏ అలవాట్లు లేవతనికి. సాధారణంగా కొండప్రాంతాల ప్రజలు పగలంతా కాయకష్టం చేశాక, ఆ అలసటనూ, బాధను మర్చిపోవటానికి పొద్దు గూకంగానే సారాయి తాగుతుంటారు. అయితే, గోలూ తాగగా నేనింతవరకూ చూడలేదు. మధుపురికి ఇటు చివర్న సారాయి చాలా చౌకగా అమ్ముడవుతూ వుంటుంది. ఇది దొంగ సారాయి. మధుపురికి చుట్టుపక్కల వున్న గ్రామాలలోని ప్రజలు తమ ఇళ్ళలోని ధాన్యాన్ని

కుళ్ళబెట్టి సారాయి తయారు చేసుకుంటూ వుంటారు. ఇలా తయారు చేసుకున్న సారాయి చాలా చౌక! అక్కడి ప్రజలు అనాదినుండే సొంతంగా సారాయి తయారు చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఆ కొండ ప్రజల అనాది ఆచారమైన సారాయి తయారు చేసుకోవడాన్ని నిషేధించలేదు. ఒకవేళ నిషేధించినా ప్రయోజనం వుండదు. చౌకగా దొరికే కాపుసారాయిని తాగాలనుకునే వాళ్ళు మధుపురికి ఇటు చివరకు వస్తారు. సీసాకు 60 రూ॥లు పెట్టగల వాళ్ళకు ఖరీదైన సారాయి 'సెంటర్'లో ఎప్పుడూ దొరుకుతూనే వుంటుంది.

బాధాకరమైన గోలూ జీవితం ఎప్పుడు పరిసమాప్త మవుతుందో? ఎవరు చెప్పగలరు? శీతాకాలంలో మంచు కురిసే రాత్రుల్లో అతని గుండెలు చలికి తట్టుకోలేక బాధపెడుతూ వుంటాయనుకుంటున్నాను. అయినా, బాధను లెక్కచేయడు. చేస్తే జీవితం ఎలా గడుస్తుంది. గోలూను చూసినప్పుడు విలాసయాత్రికుల్లో ఈ మానవుడు ఎందుకు ఇట్లాంటి జీవితాన్ని గడుపుతాడన్న ఆలోచన మొలకెత్తదేమో? అతణ్ణి గురించి బాగా తెలిసిన వాళ్ళ హృదయా ల్లోనూ ఇలాంటి ప్రశ్న ఉదయించదనుకుంటున్నాను. బహుశా గోలూ లాంటి దురదృష్ట వంతుల్ని రోజూ ఎంతో మందిని చూస్తున్నారేమో? కానీ, గోలూ లాంటి జీవితాన్ని గడిపే వాళ్ళు ఈ ప్రపంచంలో లేరని చెప్పవచ్చు. మధుపురిలో ఇంతటి బాధామయజీవిని మరొకర్ని చూడలేదు నేను. ప్రపంచంలో ఇలాంటి జీవితాన్ని గడిపే జీవులు ఇంకెవరైనా వుండ వచ్చును. అయితే, వాళ్ళు గోలూలాగా ఒంటరిగా లేరని చెప్పగలను. వాళ్ళకు, భార్యా బిడ్డలూ, అన్నదమ్ములూ వుంటారు. అందరితో కలిసి బాధల్ని పంచుకుంటూ జీవితాన్ని గడుపుతారు.

## 2

ఈ శతాబ్ది ప్రారంభంలో భారతదేశపు జనాభా ఇప్పుడున్నంత లేదు. ఇప్పుడున్న జనాభాకు మూడింట ఒక వంతు తక్కువగా వుండేది. ఇప్పటికే, వృద్ధులు ఆనాటి విషయాల్ని చెప్తూ వుంటారు. వాటిని మనం పూర్తిగా నమ్మినట్టయితే, ఆ కాలం 'సత్తెకాల' మేనని అనుకుంటాము. ఏమైనా కానీ ఒక విషయమైతే నిజం! అప్పటికీ కేదార్‌నాథ్ ప్రాంత ప్రజలకు దొంగతనం అంటే ఏమిటో తెలియదు. అబద్ధం ఆడటాన్ని నేర్చుకోలేదు వాళ్ళు. ఇతర ప్రాంతాలనుండి వచ్చిన యాత్రికులు కేదార్‌నాథ్ ప్రాంత ప్రజలను పొగుడుతూ వుండేవారు. ఇప్పటికీ వృద్ధులు తమ చిన్నతనం నాటి రోజుల్ని కలలు కంటూ వుంటారు. ఆ రోజుల్లో రూపాయికి ఇరవై సేర్ల గోధుమలూ, సేరున్నర నెయ్యి అమ్మేవారట! అంటే ఆహార సమస్య ఇప్పుడున్నంత తీవ్రరూపంలో వుండేది కాదు ఆనాడు. అట్లాంటి రోజుల్లోనూ బీదలూ– పస్తులు పడుకునే వారూ వున్నారు. కూలి చేసుకునే

ప్రజలు సంవత్సరంలో నాలుగయిదు నెలల పాటు కూలీ లేకుండా ఉండవల్సినప్పుడు పదార్థాలు చౌక అయి మాత్రం ప్రయోజనం ఏముంటుంది? వాటిని కొనటానికి ప్రజల దగ్గర డబ్బు వుండాలి కదా?

ఈ శతాబ్ద ప్రారంభంలో కేదారనాథ ప్రాంతపు ఒక కొండ గ్రామంలో గోలూ పుట్టాడు. తండ్రి మంచి వయస్సులో వున్నాడు. తల్లిదండ్రులకు అతను మొదటి సంతానమైనా అయి వుండాలి. లేదా బ్రతికిన వాళ్ళల్లో మొదటి వాడయినా అయి వుండాలి. భారతదేశంలోని ఇతర ప్రాంతాలలోలాగానే ఇక్కడా పిల్లలు బ్రతకటానికి కాదు చావటానికే పుడుతూంటారు. పుట్టగానే చచ్చిపోయే వారు కొందరైతే, మరికొందరు పుట్టిన కొన్ని నెలలదాకా, సంవత్సరాల దాకా బ్రతికి తర్వాత చనిపోతూ వుంటారు. యవ్వనం కాలం దాకా బతికి వుండేవారు చాలా కొద్ది మంది మాత్రమే. ఇక యాభై జీవితాన్ని అనుభవించగల అదృష్టవంతుల్ని వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు.

పిల్లలు గుడిసెలో పుట్టినా, మహలులో పుట్టినా తల్లిదండ్రులకు ఆనందయకులే అవుతారు. గోలూ తండ్రి వంటరివాడో, లేక అతనికి అన్నలు, తమ్ముళ్ళు వున్నారో? లేదో? తెలియదు. ఒకవేళ వున్నా విడిగా వుండి వుండేవారేమో! గోలూ తండ్రి నివసించిన ఇల్లు రాతిగోడల పైకప్పు వున్న చిన్న పెట్టె లాంటిది. ఎక్కువ ఎత్తుగా వుండదు. మనుషులు వేల సంవత్సరాల జీవితానుభవం వల్ల తాము నివసించే ప్రదేశాలకు తగిన ఇళ్ళను నిర్మించుకోవటం నేర్చుకున్నారు. గోలూ పుట్టిన గ్రామంలో చలికాలం చలి చాలా ఎక్కువగా వుంటుంది. మంచు గడ్డ కట్టుకుపోతూ వుంటుంది. అలాంటి ప్రదేశాల్లో ఎత్తయిన ఇళ్ళను కానీ కిటికీలు గల ఇళ్ళను కానీ కట్టుకోరు. గోలూ తండ్రి ఇల్లు అలాంటిదే. దానిని ఇల్లు అనే కంటే మిద్దె అనటం తగినదిగా వుంటుంది. ఆ మిద్దె క్రింద భాగంలో పశువులు వుంటాయి. పై భాగంలో మనుషులు వుంటారు. అక్కడ అన్ని మిద్దెలూ అలాగే వుంటాయి. గోలూ తండ్రి మిద్దెపై భాగంలో రెండు గదులున్నాయి. క్రింద భాగంలో రెండు గదులూ ఉన్నాయి. ఆ గదుల వైశాల్యం ఒక మనిషి పడుకుని కాళ్ళు జాపుకుంటే కాళ్ళు ఒక గోడకూ, తల ఒక గోడకూ తాకుతూ వుంటాయి.

గోలూ తండ్రి ఇల్లు కింద నది వొడ్డున వున్నట్టయితే, సేద్యానికి వరి పండే భూమి కొంత వుండి వుండేది. కానీ వాళ్ళ మిద్దె కొండపైన ఎగువకు వున్నది. మొత్తం ఊరంతా కొండపైనే వుంటుంది. అక్కడ భూమిని చదును చేసుకుని పంటలు పండించుకుంటూ వుంటారు. అంటే, కొండరాళ్ళతో నలుచదరంగా వుండే చిన్న చిన్న మడులు కట్టుకుని వాటిలో మట్టి తెచ్చి పోసుకుని పంటలు పండించుకుంటూ వుంటారు. వాటిని 'భూము'లని గానీ, మడులని గానీ అనేకంటే వెడల్పుగా వుండే మెట్లు అంటే సరిపోతుంది. గోలూ

తండ్రికి అక్కడ ఎక్కువ మడులు లేవు. గ్రామాన్ని దాటి కొంచెం ఎగువకు వెళితే కొంత ఖాళీ ప్రదేశం కనపడుతుంది. అడవిని నరికి కొంత ఖాళీ ప్రదేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే, రాళ్ళతో గట్లు పెట్టుకోలేదు. వర్షాకాలంలో ఆ భూమిలో విత్తనాలు జల్లుకుంటూ వుంటారు వూరి ప్రజలు. దేవుడి దయ పంట పండితే పండుతుంది లేకపోతే లేదు. అట్లాంటిదే గోలూ తండ్రికీ కొంత వుంది. బాల్యంలో అందరూ సుఖకరమైన జీవితాన్ని గడుపుతారు. తల్లిదండ్రులు తాము పస్తు పడుకొని అయినా పిల్లలకు కడుపునిండా తిండి పెడుతూ వుంటారు. బాల్యం నిశ్చింతగా వుంటుంది. పిల్లలు పెద్దవాళ్ళు అవుతున్న కొద్దీ పరిస్థితులను అర్థం చేసుకుంటూ వుంటారు. పరిస్థితుల ప్రభావం కూడా వాళ్ళ మీద పడుతూ వుంటుంది. గోలూ బాల్యం నుండే పేదరికంలో జీవితాన్ని గడిపాడు. వాళ్ళ ఇంట్లో మేకల కంటే చిన్నవి రెండు ఆవులు వుండేవి. అవి మేకలు ఇచ్చినన్ని పాలూ ఇచ్చేవి. వాళ్ళకు ఎద్దులు లేవు. అసలంత భూమీ లేదు. ఎవరినైనా అడిగి ఒక పూటకు ఎద్దుల్ని తెచ్చుకుని వున్న కొద్ది భూమినే దున్నుకునే వారు. లేదా చిన్న తవ్వకాన్ని ఒకదాన్ని తీసుకుని ఆ కొద్ది భూమినీ త్రవ్వుకుని విత్తనాలు జల్లుకునే వారు. తమ రెండు ఆవుల్నీ అపనికి తీసుకువెళ్ళటం గోలుకూ సరదాగా వుండేది. గోలూ గోచీ పెట్టక ముందు నుంచీ ఆ ఆవుల్ని అడవికి తోలుకు వెళుతుండేవాడు. ఒక్క గోలూనే కాదు ఆ గ్రామంలోని పిల్లలందరూ తమ తమ పశువుల్ని తోలుకు వెళుతుండేవారు. గ్రామం దాటి ఇంకా ఎగువకు వెళితే నరికివేయగా మిగిలిన అడవి ఇంకా కొంత వుంది. ఆ అడవికి గ్రామంలోని పశువులన్నింటినీ తోలుకు వెళుతుంటారు. వెళ్ళేటప్పుడు ఆహారాన్ని మూటకట్టుకు వెళ్తారు. అక్కడే మధ్యాహ్నం భోజనం చేసి సాయంత్రం పశువుల్తో పాటు ఇంటికి వస్తారు. ఊరికి దిగువన నది వుంది. ఆ నది నీటిని ఊరిలోని ప్రజలందరూ తాగుతూ వుంటారు. ఆ గ్రామంలో సంవత్సరం పొడవునా కొద్దీ, గొప్పా మంచు కురుస్తూనే వుండటాన అక్కడ ఎవరూ రోజూ స్నానం చేయరు. స్నానం చేయటం సరదా అయిన విషయంగా భావిస్తారు. గోలూకు స్నానం విషయంలో అంతగా పట్టింపు వుండేది కాదు. ఎన్నడో ఒకనాడు చేస్తే చేసేవాడు. లేకపోతే లేదు. బట్టల విషయమూ అంతే! పేదవాళ్ళ దగ్గర సరియైన బట్టలు ఎటూ వుండవు. చినిగి, పాతబడిన బట్టలనే కట్టుకుంటూ వుంటారు. ఆ గుడ్డ పీలికలను వుతకటం అంటే, అవి కూడా లేకుండా చేసుకోవటమే అవుతుంది. అలాంటి చినిగిన గుడ్డపీలికల్ని ఎప్పటికీ వేసుకునే వుంటారన్నా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు.

గోలూ పది పన్నెండేళ్ళ వాడయ్యాడు. అప్పటికీ తల్లిదండ్రులు చేసే పనులన్నింటినీ అతడు నేర్చుకున్నాడు. పొలం దున్నటం, కలుపు తీయటం, అడవికి వెళ్ళి కట్టెలు కొట్టుకు రావటం. ఈ పనులన్నింటినీ చేసేవాడు. పొలంలోకి ఎరువుల్ని మోసుకు వెళ్ళేవాడు.

పొలానికి ఏమీ మోసుకుని వెళ్ళినప్పుడు ఏకుల్నీ, ఉలినీ వెంట తీసుకువెళ్ళి దారిలో నడుస్తూ వడుకుతుండేవాడు. ఇప్పుడు ముసలితనంలో కళ్ళు కనపడక కఱ్ఱసాయంతో నడిచే గోలూను చూసి ఒకప్పుడు అతను మంచి పాటగాడని ఎవరు అనుకుంటారు? అతడు తీసే రాగాలాపన దూరాన గల పర్వతాల్లో ప్రతిధ్వనించేదని ఎవరూహించగలరు? అతను తన తోటి పిల్లలతో పందెం వేసుకుని పాడేవాడు. గోలూ స్వరం మధురంగా వుంటుందని చెప్పలేము. కానీ మైదాన ప్రాంతాలలోని ప్రజల స్వరం కంటే పర్వత ప్రాంతాల్లోని ప్రజల స్వరం కమనీయంగా వుంటుంది. పండుగలు వచ్చినప్పుడు ఊరి ప్రజలతో పాటు గోలూ కూడా నాట్యం చేసేవాడు. గోలూ రసపుత్ర జాతికి చెందినవాడు. మైదాన ప్రదేశాల్లోని ఆ జాతి ప్రజలు నాట్యం చేయరు. అయితే, కొండ ప్రాంతాలలోని రసపుత్ర జాతికి చెందిన పేదవారు తమ జాతిలో నిషిద్ధమైన కొన్ని పనులను పట్టింపులేమీ లేకుండా చేస్తూంటారు. ఆ గ్రామాల్లో రసపుత్రులే కాదు, బ్రాహ్మణులు కూడా విధవా వివాహం చేసుకుంటారు. ఒకసారి వివాహిత అయిన స్త్రీ భర్త నచ్చకపోతే అతణ్ణి వదిలి మరొకరిని వివాహం చేసుకోవచ్చు. అయితే ఈ రెండవ భర్త మొదటి భర్తకు, మొదటి వివాహానికి అయిన ఖర్చును ఇచ్చుకోవలసి వుంటుంది.

పంట ఇంటికి వచ్చినప్పుడు గోలూ కుటుంబ సభ్యులకు కడుపునిండా తినటానికి తిండి దొరికేది. మిగిలిన రోజుల్లో ఒకపూట తినటానికి దొరికినా మహాభాగ్యం అనుకునేవారు. వసంత ఋతువు వచ్చి పనసపండ్లు పండి ఎరుపుకు తిరిగే సరికి పిల్లలూ, పెద్దలూ, అందరూ ఆనందంతో 'కాఫల్ సాక్యో' (పనసపండ్లు పండాయి–) అంటూ నాట్యం చేయటం ప్రారంభిస్తారు. పనస పండ్లలో గుజ్జు తక్కువ. టెంకె ఎక్కువగా వుంటుంది. అయితే, ఆ గుజ్జు బాగా పుష్టికరమైన ఆహారం. ఆ పండ్ల గుజ్జులు కడుపు నింపుకోవచ్చు. గోలూ పెద్దవాడవుతున్నాడు. నిశ్చింతగా జీవించే జీవితం గతించింది. బాధల్ని అనుభవించటానికి జీవితాన్ని సమాయత్తం చేసుకోవల్సిన సమయం వచ్చింది. తల్లిదండ్రులు అతడిని తిట్టటం, కొట్టటం సహజమే. వాటికి అతడు అలవాటు పడ్డాడు కూడాను. కానీ, ఇప్పుడిప్పుడే తల్లిదండ్రుల తిట్లనూ, దెబ్బలనూ సహించలేకపోతున్నాడు. ఈ మధ్య గోలూ తల్లి అతని మీద చేయి చేసుకోవడం మానివేసింది.

## 3

తల్లి పోయే నాటికి గోలూకు పదిహేడేళ్ళు. చివరి సంతానం పుట్టంగానే పోయింది. ఆ తర్వాత కొద్ది రోజులకే తల్లీ వెళ్ళిపోయింది. అప్పటికి తండ్రి వయస్సులోనే వున్నాడు. ఇంకా ఇంట్లో వండి పెట్టే దిక్కులేదు. ఈ రెండు కారణాల వల్ల గోలూ తండ్రి మళ్ళీ పెళ్ళి

చేసుకోవాలనుకున్నాడు. అయితే, పెళ్ళి కావాలంటే డబ్బు కావాలి. డబ్బుది పెద్ద సమస్య కావడం వల్ల పెండ్లిని వాయిదా వేసుకున్నాడు గోలూ తండ్రి. కొండ ప్రాంతాలలోని గ్రామాలలో వరకట్నం ఆచారం లేదు. కన్యాశుల్కమే ఆచారం. పెళ్ళి చేసుకోదలచిన వాళ్ళు డబ్బుపెట్టి పిల్లను కొనుక్కోవలసిందే! గోలూ తల్లిని కొనుక్కోవటానికి అతని తండ్రి తనకున్న పొలాల్లోంచి మంచి పొలాన్నొక దాన్ని అమ్ముకున్నాడు. కొండ గ్రామాల్లోని జీవితం బాధామయం అనటంలో సందేహం లేదు. అయితే, కొడుకు చేతికి అందివచ్చాడు. యాత్రలకు అనుకూలమైన రోజుల్లో బదరీ–కేదారం వెళ్ళే యాత్రికుల సామాన్లను మోసి నాలుగు డబ్బులు సంపాయించుకోవచ్చు. అయితే, ఆ రోజుల్లోనూ గ్రామంలోని ప్రజలందరూ సామాన్లు మోయటానికి ఎగబడటం వల్ల కూలీ దొరకటం కష్టమయింది. అంతేకాక, యాత్రలకు వచ్చే వాళ్ళందరూ ఖర్చు పెట్టగలిగిన వాళ్లే వుండరు కదా! సగానికి పైగా యాత్రికులు చూసి చూసి డబ్బు ఖర్చు పెడుతుంటారు. ఇక్కడ కంటే, మధుపురిలాంటి విలాస నగరంలో కూలీ బాగా దొరుకుతుంది. డబ్బులూ ఎక్కువగా లభిస్తాయి. గోలూ గ్రామస్థులలో ఇద్దరు, ముగ్గురు యువకులు కూలీ మోయటానికి మధుపురికి వెళ్ళారు కూడాను. గోలూ కూడా తమ గ్రామ యువకుల్ని అనుసరించి తన అదృష్టాన్ని పరీక్షించుకోదలిచాడు. ఒకరోజున గోలూ తండ్రి సంతోషంగా కొడుకుని మధుపురికి పంపించాడు. ఆనాటి నుండీ ఈనాటి వరకూ గోలూ ఈ గాడిద జీవితాన్ని గడుపుతున్నాడు. మధుపురి వచ్చాక తను విన్నట్టూ, తను ఊహించినట్టూ పరిస్థితులు లేవని తెల్సుకున్నాడు గోలూ! మధుపురిలో కూలీ మోయటానికి పోటీ ఎక్కువగానే వుంది. ఆ ప్రాంత కొండ గ్రామాల ప్రజలకూ, నేపాల్ ప్రాంత కొండ గ్రామాల ప్రజలకూ, కూలీమోసే విషయంలో పెద్ద పోటీ! నేపాల్ ప్రాంత ప్రజలు ఈ ప్రాంత ప్రజల కంటే ఎక్కువ బరువు మోస్తారు. తక్కువ కూలీ తీసుకుంటారు. వాళ్ల పోటీని తట్టుకోవటం కష్టం. కానీ, ముప్ఫై ఏళ్ళ క్రితం గోలూ మొదటగా మధుపురికి వచ్చినప్పుడు కూలీ మోసే విషయంలో నేపాల్ కూలీలకు ఈనాడు వున్నంత గుత్తాధిపత్యం లేదు.

మధుపురికి వచ్చాక మొదట్లో కొన్నాళ్ళ పాటు అతడికి కూలీ దొరకలేదు. ఇంటి దగ్గర నుండి తెచ్చుకున్న పిండితో రొట్టెలు చేసుకుని తిని గడిపాడు. తరువాత కూలీ దొరకటం ప్రారంభించి తర్వాత రిక్షా లాగటానికి కుదిరాడు. సాధారణంగా కేదార్‌నాథ్ ప్రాంతపు కూలీలు రిక్షా లాగటానికి కుదురుతూ వుంటారు. నేపాల్ ప్రాంతపు కూలీలు నెత్తిమీద బరువులు మోస్తుంటారు. గోలూ, మరి ఐదుగురూ కల్సి ఓ రిక్షాను అద్దెకు తీసుకున్నారు. ఆ రిక్షాను కింద బస్సులు ఆగే చోటుకు వెళ్ళి యాత్రికుల కోసం ఎదురు చూస్తుండేవారు. అప్పటికి ఇప్పటిలా బస్సులు ఎక్కువగా లేవు. మధుపురికి ఇంగ్లీషు

దొరలు, రాజులూ – నవాబులూ, ఉన్నత ఉద్యోగస్తులూ, విలాస యాత్రికులూ వస్తుంటారు. దొరలూ, మహారాజులూ వస్తుంటారు. కనుకనే మధుపురి కొండ దిగువున ఎన్నో బస్సులు కనిపిస్తుంటాయి. అప్పట్లో మధుపురి వరకూ బస్సులు రావటానికి, వీలుండేది కాదు. మధుపురికి రెండు మైళ్ళ దూరంలో కొండ దిగువన బస్సులు తిరుగుతుండేవి. అక్కడ నుండి ఊర్లోకి రిక్షాల మీద వస్తుండేవారు విలాస యాత్రికులు. రిక్షా వాళ్ళు సాధారణంగా ఇంగ్లీషు దొరల బాడుగ దొరికితే బాగుండు అని అనుకుంటూ వుంటారు. వాళ్ళయితే అడగకుండానే మంచి కిరాయి ఇస్తారు. ఇంగ్లీషు దొరల తరువాత రాజుల్ని నవాబుల్ని చెప్పుకోవచ్చు. అయితే, వాళ్ళ నౌకర్లు, వాళ్ళు ఇచ్చే కిరాయిలో కొంత కొట్టేస్తుంటారు. ఇంక సేట్లు, ఉద్యోగస్థుల బాడుగ దొరికితే పొద్దున్నే ఎవరి ముఖం చూశామా? అని తిట్టుకుంటారు. పర్వత ప్రదేశాల్లో నెత్తిమీద బరువుల్ని మోయటం కానీ రిక్షా లాగటం కానీ రెండూ ప్రాణాంతకమైన పనులే! కొండ దిగువునుండి ఎగువకు రిక్షా లాగటం అంటే పై ప్రాణాలు పైనే పోతుంటాయి రిక్షా లాగే మనిషికి. కానీ రిక్షాలో కూర్చున్న అతనికి సరదాగా వుంటుంది. దర్జాగా రిక్షా ఎక్కి వెళ్ళిన వాళ్ళు తీరా కిరాయి ఇవ్వవలసి వచ్చేసరికి పేచీ పెడుతూ వుంటారు. ఈనాటికీ సాధారణంగా జరిగే విషయం కిరాయి మాట్లాడుకోకుండా రిక్షాలో ఎక్కి కూర్చుంటారు. బంగళా దగ్గర దింపాక మున్సిపాలిటీ నిర్ణయించిన ప్రకారం కిరాయి అడుగుతాడు రిక్షావాడు. రిక్షా ఎక్కివచ్చిన మనిషి గొడవ పడుతుంటాడు. రిక్షా వాళ్ళకూ యాత్రికులకూ రోజూ కోట్లాటలు జరగటం లేదంటే అది రిక్షా వాళ్ళ మంచితనమే అనాలి!

మొదటి సీజన్‌లోనే గోలూ రిక్షా కూలీగా కుదురుకున్నాడు. డబ్బులు చేతిలో వుండేవి కానీ సీజన్ అయిపోయాక ఇంటికి వెళ్ళేటప్పుడు ఎంతో కొంత డబ్బు తీసుకువెళ్ళాలి కాబట్టి తిండికి కూడా చూసి, చూసి ఖర్చు పెట్టుకునేవాడు గోలూ. మొదటి సీజన్ జూన్ లోనే అయిపోయింది. ఆ సంవత్సరం సగం సీజన్ అయ్యే వరకూ గోలూ ఖాళీగానే వున్నాడు. రెండవ సీజను అంత ముఖ్యమైనది కాదు. వర్షాకాలంలో సవారీ దొరికితే దొరుకుతాయి లేకపోతే లేదు. నవంబర్ నెల ప్రారంభంలో ఇతర కూలీలతోపాటుగోలూ కూడా తన ఇంటికి బయలుదేరాడు. అప్పటికి అతను 40 రూపాయల వరకూ దాచాడు. తండ్రికి బట్టలు కొన్నాడు. సంపాయించే కొడుకును పేద తండ్రి ప్రేమగా చూడటం సహజం. తండ్రి గోలూకు గొప్పగా స్వాగతం ఇచ్చాడు. చలికాలం గడిచాక మళ్ళీ మధుపురికి వెళ్ళమన్నాడు తండ్రి. వంట చేసి పెట్టటానికీ కాకుండా పొలం పనిలో సాయం చేయటానికే ఇంట్లో ఆడదిక్కు వుండటం అవసరం అని చెప్పాడు తండ్రి. గోలూ తండ్రి తన పెళ్ళిని గురించి మాట్లాడుతున్నా డనుకున్నాడు. మరుసటి సంవత్సరం గోలూ వంద రూపాయలు

మిగుల్చుకున్నాడు. అంత డబ్బు మిగుల్చుకోవటమే కాకుండా తొందరలో వివాహం జరుగుతున్నందుకూ గోలూ సంబర పడ్డాడు.

## 4

వివాహం జరిగింది. అయితే, గోలూ క్కాదు. గోలూ తండ్రికి. సంపాయించే కొడుకును దూరం చేసుకోవటం తండ్రికీ ఇష్టం లేదు. సవతి తల్లికీ ఇష్టం లేదు. కానీ, సవతి తల్లి మీదా, తండ్రి మీదా గోలూకు మాత్రం చాలా బాధగా వుంది. తండ్రికి ఇలా అయితే కొడుకు తన చెయ్యి దాటిపోతాడేమోనన్న అనుమానం. భయం గోలూకు కలగసాగాయి. కొడుకు పెళ్ళికి సంబంధాలు వెతకటం ప్రారంభించాడు. అయితే ఆ సంబంధాలు వెతకటానికి పది సంవత్సరాలు పట్టింది. అప్పటికి లగ్నం కుదిరి పెళ్ళి జరిగింది. నిజానికి గోలూ పెళ్ళి ఎప్పుడో జరగవలసింది. తండ్రి అశ్రద్ధ వల్లా కొడుకు అమాయకత్వం వల్లా ఇన్నాళ్ళు ఆలస్యమయింది. గోలూ గొడ్డులా చాకిరీ చేసి డబ్బు సంపాయించేడు. తండ్రి ఖర్చుపెట్టుకునేవాడు. తన భార్యకు కొన్ని నగలు చేయించుకున్నాడు. కోడలికీ కొన్ని వెండి నగలు చేయించాడు. కోడలు తండ్రి వియ్యంకుడికీ, కన్యాశుల్కం కింద కొంత డబ్బు ఇచ్చాడు. ఇంతేకాకుండా తాగి తందనాలాడటానికి చాలా ఎక్కువ ఖర్చుపెట్టాడు. అంతటితో ఆగినా బాగుండేది. పెళ్ళి పేరున ఒక వెయ్యి రూపాయలు అప్పు గోలూ నెత్తికి వేశాడు. కొండ గ్రామాలలోని కూలీలెవరూ తమ భార్యల్ని మధుపురికి తీసుకురారు. గోలూ కూడా తన భార్యను మధుపురికి తీసుకు రావద్దనుకున్నాడు. ఇంగ్లీషువారి సమయంలో మధుపురికి విలాస యాత్రికులతో పాటు కొన్ని వందల మంది తెల్ల సోల్జర్లు వస్తుండేవారు. వాళ్ళు స్థానిక స్త్రీలను అవమాన పరుస్తూ, పట్టపగలు మానభంగాలు చేస్తుండేవారు. ఇలాంటి స్థితిలో ఏ కూలీవాడు మాత్రం మధుపురికి తన భార్యను తెచ్చుకోవాలనుకుంటాడు?

గోలూకు ఇద్దరు సవతి తమ్ముళ్ళు పుట్టారు. మొత్తం కుటుంబ బాధ్యత అంతా అతని మీదనే పడ్డది. అయితే, ఇంట్లో ఆడవాళ్ళు ఇద్దరూ వుండటాన వ్యవసాయపు పనులు కొంచెం చురుగ్గా సాగుతున్నాయి. మేకల సంఖ్య పెరిగింది. ఆవులూ ఐదు అయ్యాయి. ఆ మిద్దెలో వసతి లేదు కానీ వుంటే పశువుల సంఖ్యను మరింత పెంచుకో వచ్చును. వెయ్యిరూపాయల అప్పు కనుక లేకపోతే ఇంటి ఆదాయం దాదాపుగా ఇంటి ఖర్చుకు సరిపోతూ వుండేది. కానీ వెయ్యి రూపాయలకు వడ్డీ పెరిగిపోతోంది. బాకీ తీర్చేయడాన్ని గురించిన తొందర తండ్రి కంటె కొడుకునే ఎక్కువ బాధిస్తోంది. ఉన్న కొద్ది పాటి భూమినీ బాకీ తీర్చటానికి ఇచ్చేస్తే ఇంకతను ఊరూ, పేరూ లేనివాడై పోతాడు.

సీజన్ అయ్యాక ఎక్కడికి వెళ్ళగలడు? గోలూ ప్రతి సంవత్సరం సీజన్‌లో మధుపురికి వెళ్తున్నాడు. పాత కూలీ కావటం వల్ల రిక్షాను లాగే ఆరుగురికి నాయకుడయ్యాడు. యాత్రికులు గోలూ రిక్షాను ఎక్కడానికే ఎక్కువగా ఇష్టపడేవారు. అతడి మంచితనం వల్లా, చురుకుతనం వల్లా నిరంతరం పరిశ్రమించి అధికంగా డబ్బు సంపాయించేవాడు. సీజన్ అయ్యాక ఇంటికి వెళుతూ ఇతర కూలీల కంటే ఎక్కువ డబ్బును సంపాదించుకుని వెళ్ళేవాడు. ఇలా డబ్బు సంపాయించుకోవటం తన అదృష్టమని అతను అనుకునేవాడు. ఒక్క అప్పు తీర్చటమే అయితే ఎప్పుడో తీర్చేవాడు. కానీ అప్పు తీర్చడమే కాకుండా తండ్రి కోరికల్ని ఎన్నింటినో తీర్చవలసి వచ్చేది అతనికి. సీజన్ అయి ఇంటికి తిరిగి వెళ్ళేటప్పుడు తల్లిదండ్రులకు బట్టలు కొనుక్కొని వెళ్ళవలసి వచ్చేది. ఇవేకాకుండా తండ్రి ప్రతి సంవత్సరం కొత్త అప్పుల్ని చేస్తుండేవాడు. వాటిని తీర్చడమూ అవసరమే! మొత్తం అప్పుల్ని తీర్చేసరికి రెండవ ప్రపంచ యుద్ధం ముగియటానికి వచ్చింది. అప్పుడే గోలూ తండ్రి చనిపోయాడు.

ఇప్పుడిక గోలూ 'ఇంటిపెద్ద' అయ్యాడు! ఖర్చులోనే కాదు. సంపాదనలోనూ అతనే పెద్ద! కనుక ఇంట్లో అతని మాటే చెల్లుబాటు అవుతోంది. అతని సవతి తమ్ముళ్ళు పదహారు, పదిహేడు ఏళ్ళవాళ్ళయ్యారు. గోలూకు భవిష్యత్తులో మంచి రోజులు వస్తాయన్న ఆశ కలుగుతోంది. రిక్షా వాళ్ళు కఠిన శ్రమ చేస్తారు కనుక తొందరగానే గుండెలూ, ఊపిరితిత్తులూ దెబ్బతింటాయి. ఈ కఠిన శ్రమ మూలకంగానే గోలూ శరీరం ఎముకల గూడులా తయారయింది. అతనికి కంటి బాధలూ ఎక్కువయ్యాయి. కళ్ళు సరిగా కనిపించడం లేదు. కళ్ళు పోతాయన్న భయం లేకపోయినా చూపు సరీగా కనిపించటం లేదు. రెండో ప్రపంచ యుద్ధం అయ్యాక కూడా రెండు మూడు సంవత్సరాల పాటు సీజన్ సమయంలో మధుపురికి వెళ్ళాడు గోలూ! తరువాత అతని కళ్ళు పూర్తిగా కనపడకుండా పోయాయి. ఇక ఇంటి దగ్గర వుండి పోవాల్సిన వాడయ్యాడు. పేద కుటుంబాలు సంపాదన లేకుండా తిని కూర్చునే వ్యక్తిని ఎన్నాళ్ళని భరించగలవు. క్రమంగా గోలూకు తన ఇంట్లోనే గౌరవం తగ్గిపోతూ వుంది. అవమానాన్ని భరించాల్సి వస్తోంది. సూటీ-పోటీ మాటలూ, ఎత్తిపొడుపులూ ఎక్కువయ్యాయి. ఇలాంటివి సహించటం గోలూకు అలవాటు లేదు.

మధుపురిలోని కళ్ళ డాక్టరు తన కళ్ళను బాగు చేస్తాడని తెల్సుకున్నాడు గోలూ. తనలాగానే మధుపురికి కూలీ మోసే ఒక కూలీని బతిమిలాడుకున్నాడు. అతను గోలూను తన వెంట మధుపురికి తీసుకు వెళ్ళటానికి అంగీకరించాడు. 'ఒకసారి చూపు పోయిందంటే ఇక రావడం కష్టమని అనవసరంగా శ్రమపడి మధుపురికి వెళ్ళవద్దని' ఆ కొండ

గ్రామాలలోని పది మందీ పది రకాలుగా చెప్పారు గోలూకు. ఎవరు ఎన్ని చెప్పినా మానవుడు ఆశాజీవి కదా! తోటి కూలీ చెయ్యి పట్టుకుని కష్టతరమైన పర్వతాలను ఎక్కుతూ, దిగుతూ, కర్రసాయాన్ని తీసుకుంటూ మధుపురికి చేరాడు గోలూ! అతని కళ్ళను డాక్టరు పరీక్ష చేసి 'ఒక కంటికే ఆపరేషన్ చేయటానికి వీలవుతుందని, రెండవ కంటికి ఇంకా కొన్నాళ్ళు పోవాలని' చెప్పాడు డాక్టరు. గోలూ చాలా ఆనందపడ్డాడు. ఒక కన్ను వచ్చినా చాలు. తన పొట్టకు తాను సంపాదించుకోవచ్చు ననుకున్నాడు. కంటికి ఆపరేషన్ జరిగింది. పచ్చని పట్టీ కట్టారు. మూడు వారాల తరువాత డాక్టరు మొద్దు కళ్లజోడు ఒకటి ఇచ్చాడు. కొన్నాళ్ళ పాటు కంటికి శ్రమనిచ్చే పనులు ఏమీ చేయవద్దన్నాడు. కానీ ఒక వారం రోజుల తరువాత నుంచే గోలూ కంటికి శ్రమ ఇవ్వడం మొదలు పెట్టాడు. మరి అతను బతకాలి కదా! బతకాలంటే సంపాయించటం అవసరం కదా? ఇప్పుడు ఇంతకు ముందులాగా రిక్షా లాగలేడు. రిక్షా లాగాలంటే వేగంగా పరుగెత్తాలి. కళ్ళు కనిపించక పోతే ఎలా పరుగెత్తగలడు? అందువల్ల వేరే పని ఏదైనా చూసుకోవాలి. రిక్షా త్వరగా లాగలేకపోతే గుర్రాల్ని కొట్టినట్టు కొరడాలతో అయితే కొట్టారు కానీ వాళ్ళు అనే మాటలు కొరడా దెబ్బల కంటే చురుగ్గా వుంటాయి. పైగా, ఎక్కువ సంచీలను తీసుకోవాలన్న ఆశ, కొరడాకంటే కూడా వేగంగా తోలుతూ వుంటుంది రిక్షా వాళ్ళను. ఇవన్నీ పక్కకు పెట్టినా కన్ను కనపడకుండా రిక్షా లాగుతానంటే ఎవరూ రిక్షాను ఇవ్వరు కదా?

గోలూ రిక్షా లాగటం మానుకుని మూటలు మోయటం ప్రారంభించాడు. అతడి స్వభావం అందరికీ తెలుసు. త్వరలోనే కూలీ సంపాయించటం మొదలు పెట్టాడు. రెండు సంవత్సరాల తరువాత రెండో కంటికీ ఆపరేషన్ చేయించుకున్నాడు. అయినా, వెనకటిలా చూపు ఆనటం లేదు. వెనకటిలా తిరిగి రిక్షాను లాగగలడన్న ఆశను వదులుకున్నాడు. చేతికర్రను నేలకు ఆనిస్తూ, వీపున బరువు మోసుకుంటూ ఒక చోటినుండి మరొక చోటికి బరువులను మోసుకెళ్ళటం అతని నిత్యకృత్యమయింది. మొదటి సంవత్సరం తన వరకే సంపాదించుకోగలిగాడు. అందువల్ల ఇంటికి వెళ్ళలేదు. చలికాలాన్ని మధుపురి లోనే గడిపాడు. రెండవ సీజన్‌లో సీజన్ పూర్తికాగానే కొంత డబ్బు సంపాదించుకుని వెళ్ళాడు. ఇంటి దగ్గర అతడెన్నడూ వూహించని పరిస్థితిని చూశాడు. అతని భార్య, సవతి తమ్ముడికి చెందినది అవటాన్ని చూసి అతని దుఃఖం ఆగలేదు. అతను ఎద్దులాగా శ్రమించి చచ్చీచెడీ సంపాయించి తండ్రికి డబ్బులు ఇచ్చాడు. అతని పెళ్ళికి ఖర్చు పెట్టాడు. అప్పు తీర్చాడు. కుటుంబాన్ని పోషించాడు. కానీ, అతని భార్య అతను అంధుడయి, వయస్సుకు ముందే ముసలివాడవటం చూసి ఆమె అతడిని వదిలి మరిది చెంత చేరింది. గోలూ చెప్పి చూశాడు. కానీ తొందరగానే అతనికి చెప్పటం వలన ఏమాత్రం వుపయోగం

లేదని అర్థమయింది. తమ్ముణ్ణి కొడితే మాత్రం ఏం లాభం? అతను మొదటిలాగా సంపాయించలేక పోతున్నాడని అతనికి తెలుసు. ఇంగ్లీషు వాళ్లు మధుపురిని వీడి వెళ్ళాక మధుపురి స్థితి రోజురోజుకూ దిగజారింది. ఒకవేళ దిగజారకపోయినా వెనుకటిలాగా సంపాదన వుండదు. ఒకవేళ అతను వెనకటిలాగా సంపాయించగలిగితే ఇంట్లో బహుశా గోలుకు కొంత ఆదరణ వుండి వుండేది. అతని భార్య కూడా అతని వద్దకు వచ్చి వుండేదేమో! కానీ, మధుపురికి వెనకటిలా మారే స్థితీ లేదు. గోలూ స్థితీ మారదు.

చాలా కష్టంగా సీజన్ లేని రోజుల్లో గ్రామంలో వుండి సీజన్‌లో తిరిగి మధుపురికి వచ్చేశాడు శాశ్వతంగా. ఇక ఇప్పుడు అతనికి మరొక ఇల్లు లేదు. అతను కష్టంగా తనకోసం మధుపురిలో పన్నెండు నెలలూ వుండటానికి వసతి ఏర్పరచుకున్నాడు. కూలీ తక్కువ తీసుకుంటేనే అతనికి కూలీ మోయటానికి దొరికేది. గోలూ అది కూడా చేశాడు. మొద్దు కళ్ళద్దాలు పెట్టుకుంటే కొంత చూపు కనపడుతుంది. అతను అనిశ్చితమైన స్థితిలో మరలా జీవితాన్ని ప్రారంభించాడు.

కళ్ళకు పొగ తగలకుండా రక్షించుకోవాలనీ లేకపోతే పూర్తి అంధత్వం వచ్చే ప్రమాదమున్నదని డాక్టరు చెప్పారు. కంటి చూపు లేకపోతే ఏమీ చేయలేమని అతనికి బాగా తెలుసు. కాబట్టి అతను కంటిచూపు మీద ప్రత్యేక దృష్టి పెట్టేవాడు. ఒకవేళ అతని భార్య అతనితో వుంటే అతను ఆచారాన్ని పక్కకు పెట్టి అయినా భార్యను తనతో పాటు మధుపురికి తెచ్చుకునేవాడే. ఇప్పుడు అతనికి తిండికోసం ఇంకొకరి మీద ఆధారపడవలసి వస్తోంది. పేద ప్రజలు ఎన్ని కష్టాలలో వుంటారో వాళ్ళ హృదయాల్లోని దయార్ద్రత–సహృదయత అంతగా పెరుగుతూ వుంటాయి. గోలూతో పాటు కూలీ మోసే మరో అతను గోలూకు రొట్టె చేసి పెట్టి ఇవ్వటానికి అంగీకరించాడు. అతని వంటకు అవుసరం అయ్యే మొత్తం కట్టెపుల్లల్ని పోగు చేసుకు వచ్చే బాధ్యత గోలూ తీసుకున్నాడు. పగటిపూట కొంచెం తీరిక దొరికితే అంటే కూలీ దొరక్కపోతే అడవికి వెళ్ళి లావుపాటి కట్టెల్ని ఏరుకు వస్తాడు. ఆరోజు పగలు తీరిక దొరకలేదు. అందుకే పొద్దుపోయాక రోడ్డుపక్కనున్న చెట్టుకింద సన్నని కట్టెపుల్లల్ని ఏరుకుంటున్నాడు గోలూ!

# రూపీ

**ఆ** జీవితం ఒక ఊబిలాంటిది. ఆ జీవితం ఆమెకు ఏ మాత్రం తగినది కాదు. ఊబిలాంటి ఆ జీవితం నుండి బయటపడాలని ఆమె చాలాసార్లు ప్రయత్నించింది.

★ ★ ★

మధుపురికి నూట ఇరవై ఐదు సంవత్సరాల క్రితం ఇంగ్లీషువారి విలాసాల కోసం నిర్మించిన విలాసనగరం. ఈ నగర నిర్మాణం జరగటానికి ముందు అక్కడ దట్టమైన అడవి ప్రాంతముండేది. స్థానిక ప్రజలు అక్కడక్కడా నివసిస్తూ వుండేవారు. అయితే వీరంతా వెనుకబడిన అనాగరిక జాతులకు చెందినవారు. 'వెనుక బడటం' అన్న మాటను తప్పు అర్థంలో తీసుకోకూడదు. ఆధునిక సభ్యతలో ఎంత వెనుకబడి వున్నా నిజాయితీలో ముందుంటారు. వాళ్ళు ఇతరులతో పోల్చితే ఇప్పటికీ వారిలో నిజాయితీ ఇంకా వుంది. 'వ్యభిచారం' అనేది ఆ ప్రజలలో అసలు లేనే లేదు. అయితే, ఇతర ప్రాంతాలలో శతాబ్దాల క్రితమే అంతరించిపోయిన ఒక పురాతన ఆచారం మాత్రం వాళ్ళల్లో ఇప్పటికీ చెల్లుబాటవుతోంది. ఆ ఆచారంలో అతిథి సేవను పరమధర్మంగా భావిస్తారు. అతిథిని దేవుడిలా చూసుకుంటారు. అతిథి సత్కారాలలో భాగంగా భోజనాది వసతులే కాకుండా గృహస్తు తన భార్యను కూడా అతిథి సేవకు పంపిస్తాడు. ఇతర ప్రాంతాల నుండి వచ్చిన అతిథులు ఈ రకమైన సేవలను దురుపయోగం చేస్తున్నారని వాళ్ళకు అర్థం అయినప్పటి నుండీ ఆ ఆచారాన్ని ఆచరించటం మానుకున్నారు. ప్రపంచంలో పేదరికం లేనిదెక్కడ? అన్నిచోట్లా వుంది. అయితే ఇక్కడ పూట గడవని వాళ్ళే ఎక్కువ. స్థితి కలవారు బహు కొద్ది మంది మాత్రమే. స్థానిక స్త్రీలు సహజంగానే సౌందర్యవంతులు. కనుముక్కు తీరు గలవారు. ఇది ఒక రకంగా వాళ్ళకు శాపంలా తయారయింది. మధుపురి నిర్మాణం జరిగాక ఇక్కడకు వచ్చే విలాస ప్రియులు స్థానిక స్త్రీల జీవితాలను నరకప్రాయం చేశారు.

ఆ అమ్మాయి వాళ్ళ అమ్మ యవ్వనవతిగా వున్నప్పుడు మధుపురిలో జరిగే తిరునాళ్ళకు, ఉత్సవాలకు తన స్నేహితులతో పాటు వస్తుండేది. అలా వస్తుండగా ఒక స్వదేశీ సైనికుడితో

ఆమెకు పరిచయం అయింది. అతను ఆమెను తన ఊరికి తీసుకుపోయాడు. వేరే కాపురం పెట్టి కలిసి జీవించటం మొదలు పెట్టారు. తరువాత వాళ్ళకు ఒక ఆడపిల్ల పుట్టింది. అందచందాలలో తల్లిని మించి వుండేది. ఆ అమ్మాయికి రూపీ అని పేరు పెట్టారు. రూపీ చిన్నతనం నుండీ నాగరిక వాతావరణంలో పెరిగింది. రూపీ తండ్రి తన కూతురి గురించి ఎన్నో కలలు కన్నాడు. అతని కలలు కల్లలే అయినాయి. రూపీ నాలుగవ ఏట ఆమె తండ్రి హఠాత్తుగా మరణించాడు. రూపీ తల్లి యవ్వనంలో వుంది. ఆమె చెడు స్వభావం కలది కాదు. ఆమె చేసిన పనులన్నీ పరిస్థితుల ప్రభావం వలన చేసినవే. అసహాయురాలైన యువతికి ప్రపంచమే శూన్యంగా అనిపిస్తుంది. ఆమె సైనిక భర్త ఊర్లోనే ఆమెకు జత దొరికి వుండేదే! బహుశా ఆమెకు ఆ ఊర్లో వుండటం ఇష్టం లేకపోయిందో? లేక స్వతంత్ర కొండ జీవితాన్ని జీవించాలని వుందో? కానీ ఆమె తిరిగి మధుపురికి వచ్చేసింది. మధుపురిలోని సన్నని బక్కపల్చని కాపలాదారునితో ఆమెకు సంబంధం కలిసింది. కాపలాదారు తన తమ్ముడితో కలిసి వుండేవాడు. ఇప్పటికీ ఇక్కడ ఇంకా పాండవ వివాహ పద్ధతే వున్నది. ఈ పద్ధతిలో అన్నదమ్ములు ఒకే స్త్రీని వివాహమాడతారు. ఆమె తన చిన్న భర్తను 'మరిది' అని పిలుస్తుంది. పెద్ద భర్త చనిపోతే చిన్న భర్తకు 'భర్త' స్థానాన్ని ఇస్తుంది. బయటి ప్రాంతాల నుండి వచ్చిన వాళ్ళ దగ్గర ఈ పద్ధతిని గురించి దాయటానికి ప్రయత్నిస్తూ వుంటారు.

"అసలే కోతి ఆ పై కల్లు తాగింది" అన్న సామెతను గ్రామజీవితం నాగరిక జీవితంగా మారటానికి వుపయోగించలేము. అయితే కొండ ప్రాంత గ్రామీణ జీవితాల మీద నాగరిక జీవన ప్రభావం పడినప్పుడు అది అతిగా మారుతుంది. గ్రామ జీవితంలో కొంత స్వాతంత్ర్యం వుంటుంది. కానీ అక్కడి సమాజ నియమాలు, ఆచారాలు వ్యక్తిని ఒక మార్గంలో పెడుతుంటాయి. గ్రామీణులు తమ కులస్థుల, మతస్థుల ఆచారాలకు విలువనిచ్చి వాటిని విధిగా పాటించవలసి వస్తుంది. కొండ గ్రామాల స్త్రీ ఒక పురుషుణ్ణి వదిలి మరొక పురుషుణ్ణి వివాహం చేసుకోవటం ఆచారమే. అయితే, మొదటి భర్తకు వివాహ సమయంలో అయిన ఖర్చులలో కొంత తిరిగి ఇవ్వవలసి వుంటుంది.

స్వదేశీ సైనికుడి భార్యమధుపురికి చేరాక మధుపురిలోని విలాసజీవితం ఆమె మీద తన ప్రభావాన్ని వేయసాగింది. కాపలాదారుని జీతం కొంత వుంటుంది గనుక! పైగా ఆమెకు ముగ్గురు, నలుగురు పిల్లలు వెంట వెంటనే పుట్టారు. మొత్తం ఏడెనిమిది మంది పొట్టలు నిండాలి. చాలాకష్టం! ఇంటిల్లపాది ఎప్పుడూ పనిచేయటానికి సిద్ధంగా వుండేవారు. దగ్గరలోని అడవికి వెళ్ళి కట్టెలు కొట్టి అమ్మేవారు. బంగళాలో కూరగాయలు పండించటానికి కావల్సినంత స్థలం కూడా వుంది. కూరగాయలు పండించుకుని అమ్ముకోవచ్చు. కానీ

నీటి కొరత వలన ఆ భూమిని ఉపయోగించుకోలేకపోయారు. మధుపురిలో పాల వ్యాపారం బాగాసాగుతుంది. పాలు అమ్మేవాళ్ళు పాలల్లో నీళ్ళు కలపకుండా కఠిన శాసనాలున్నాయి. అయినా నీళ్ళు కలపటం ఆగే పని కాదు! కొంతమంది కాపలాదారులు ఆవుల్నీ, మేకల్నీ పెంచుకుంటారు. పాలూ అమ్ముకోవచ్చు. కసాయిలు మేకలకు ఎక్కువ రేటూ ఇస్తుంటారు. కాపలాదారు ఎప్పుడూ పశువుల్ని పెంచలేదు. అతను కాపలాకాసే బంగళా మధుపురికి చివర వుంది. అక్కడికి అడవి చాలాదగ్గర. బహుశా చిరుతపులులు వచ్చి ఆవుల్ని, మేకల్ని ఎత్తుకుపోతాయని భయమో? లేక పశువుల్ని కొనటానికి డబ్బు అందకనో? ఏమైనా అతను పశువుల్ని పెంచటానికి ఇష్టపడలేదు. కాపలాదారు వుండేది మధుపురికి చివరన కావటాన ఒక సౌకర్యమయితే వుంది అదేమంటే చుట్టుపక్కల కొండ గ్రామాలు దగ్గరగా వుండటాన ఆ గ్రామాలలో తయారైన కాపు సారాయిని తెచ్చి ఎక్కువ ధరకు మధుపురిలో అమ్మటం. ఆ రోజుల్లో చుట్టుపక్కల గ్రామాలన్నీ స్వదేశీ సంస్థానాలకు చెందినవి కాబట్టి అక్కడ సారాయి కాయటానికి ఏ ఇబ్బందీ వుండదు. ఇప్పటికీ ఆ గ్రామాలలో కాపుసారాయి తయారవుతూ వుంటుంది. ప్రభుత్వం వారిని ఏమీ చేయలేదు. చట్టాన్ని కఠినంగా అమలుపరిస్తే గ్రామస్థులను జైల్లో పెట్టవలసి వస్తుంది. అలా వేల సంఖ్యలో గ్రామస్థులను జైల్లో పెడితే వాళ్ళందరికీ ప్రభుత్వమే తిండి పెట్టవలసి వస్తుంది కదా? ఖర్చులను భరించడం ప్రభుత్వానికి తలనొప్పిగా తయారవుతుంది. అయితే, మధుపురిలోని బంగళాలలో కాపుసారాయి కాయటం కష్టసాధ్యమైన పనే! అప్పుడప్పుడూ పోలీసులు దాడులు చేస్తుంటారు. మరి మన కాపలాదారు మాత్రం తెలివి తక్కువవాడా? పోలీసుల్లో కొంతమందికి 'సదావర్తం' కింద సారాయి పోయటం ప్రారంభించాడు. ఆ ఏడెనిమిది మంది గల కుటుంబానికి బతుకు దెరువు మార్గం కాపుసారా అమ్మటం ఒక్కటే!

## 2

"బుభుక్షితహః కిం న కరోతి పాపం" అన్న సూక్తి ఆ కుటుంబంలో సంభవించింది. పిల్ల పెరిగితే కుండ పెరుగుతుందంటారు. పిల్లలందరూ పెరిగి పెద్దవారయ్యారు. పిల్లలు పెద్దవాళ్ళయితే వాళ్ళ అవసరాలూ పెరుగుతాయి. వాళ్ళ కులాచారం ప్రకారం పెద్ద పిల్లను తమ కులంలోనే ఎవరికైనా ఇచ్చి పెళ్ళి చేస్తే కొంత ఓలి వస్తుంది. అయితే ఆ ఓలి చాలా తక్కువ మొత్తంలో వస్తుంది. పెళ్ళి ఖర్చులకు ఒకటి రెండు నెలలకు కూడా సరిపోదు. తల్లిమీద నగరవాసపు లక్షణాలు బాగానే వంట పట్టాయి. ఆమె ఇద్దరు భర్తలు మధుపురిలో వుండేవారు కావటాన చాలా విషయాలు వాళ్ళకూ తెలుసు! వివాహానికి ఓలి తీసుకోవటం అంటే అమ్మాయిని అమ్మటమే. అసలు విషయం ఆలోచిస్తే డబ్బు

తీసుకుని పిల్లను ఇచ్చినా, పిల్లను అమ్మినా రెండు ఒకటేగదా! పిల్లను అమ్మటమే ప్రధానమైనపుడు లాభదాయకమైన పద్ధతిలో ఎందుకు అమ్ముకోరాదు? ఒకేసారి పిల్లను అమ్ముకుంటే కొద్దిమొత్తంలోనే డబ్బు వస్తుంది. ఏరోజుకారోజు అమ్ముకుంటే ఎక్కువ డబ్బులు వస్తాయి. అదో స్థిరమైన ఆదాయానికి మార్గమూ అవుతుంది. రూపీ కాపలాదారుని సొంత కూతురు కాకపోవటం వల్లనే పై ఆలోచనలు వాళ్ళకు వచ్చాయి అని అనుకోవటానికి లేదు. ఒకవేళ రూపీ వాళ్ళ సొంత కూతురయినా వాళ్ళు అలాగే ఆలోచించేవారు.

అమ్మాయి నవయవ్వనంలో వుంది. తల్లి సారాయి వ్యాపారం చేసేది. సారాయి తాగటానికి వచ్చేవాళ్ళు అమ్మాయితో పరిహాసాలాడుతుండేవారు. ఆమె తల్లి మధుబాల. ఆమె అమ్మాయికోసం దారిని క్లియర్ చేసింది. కానీ అక్కడకు వచ్చే వారందరూ నిషాప్రియులు మాత్రమేనని మధుబాల తెల్సుకుంది. ఎప్పుడో ఒకమారు దొరికే విటుల వల్ల ఏం ఆదాయం వస్తుంది? రూపీ తల్లి కూతురికి సలహా ఇచ్చింది. సలహా ఇవ్వటమే కాదు ఆమె కూతుర్ని తీసుకుని ఒక పెద్ద నగరంలో విడిచిపెట్టి వచ్చింది.

వేశ్యావృత్తి ఈనాటి నాగరిక సభ్యతలో ఒక ముఖ్యమైంది. నగరాల అస్తిత్వంతోపాటు వేశ్యావృత్తి కూడా అస్తిత్వంలోకి వచ్చింది. వేశ్యావృత్తి నగరాల్లో అనేక రకాలుగా, అనేక పద్ధతుల్లో జరుగుతుంది. కొంతమంది గానా బజానాలతో పాటు వేశ్యావృత్తిని చేస్తుంటే, మరికొందరికి ఏ కళలతోనూ ఎటువంటి సంబంధం వుండదు. కేవలం వృత్తిని మాత్రమే చేస్తుంటారు. మూడవరకంలో చిల్లర మల్లర పనులు చేసుకునే వాళ్ళుంటారు. వాళ్ళు ఈ వృత్తిని పార్ట్ టైంగా పెట్టుకుంటారు. వీళ్ళల్లో కూడా పూర్తిగా వేశ్యావృత్తినే నమ్ముకుని బతికేవాళ్ళు వుంటారు. ఇక్కడ సామూహికంగా వేశ్యావృత్తిని చేస్తుంటారు. వీటినే వేశ్యా గృహాలంటారు. రూపీ తల్లి రూపీని ఇలాంటి గృహాలలోనే విడిచి వచ్చింది. తల్లి ఈ వేశ్యాగృహాలలో పూర్తిగా అపరిచితురాలై వుంటే ఒక్కసారిగా కూతుర్ని అక్కడకు తీసుకుపోయి దింపటం సంభవం అయ్యేది కాదు.

ఆ అమ్మాయికి రూపీ అని పేరు పెట్టటానికి కారణం ఏమైనప్పటికీ ఈనాటి జీవితంలో రూపం తోటి బ్రతుకు దెరువు చూసుకుంటుంది కాబట్టి 'రూపాజీవ' అని అంటే సరిపోతుంది. తల్లి ఆమెను ముందునుంచీ ఆ వృత్తికి తగినట్టుగా తయారు చేయకపోయి వుంటే ఆమెకు ఆ జీవితాన్ని ప్రారంభించటం చాలా బాధాకరమయ్యేది. రూపీచల్లని వాతావరణంలో పుట్టి పెరిగింది. దేశంలోని ఇతర నగరాల వాతావరణం ఆమెకు ఐదారునెల్ల వరకే నివాస యోగ్యంగా వుంటాయి.

రూపీ మొదటి సంవత్సరం వేశ్యాగృహంలో గడిపింది. అక్కడే ఒక వృద్ధ దళారీ మహిళ (బ్రోకర్) రూపీకి అవసరమయిన ఏర్పాట్లన్నింటినీ చేసేది. ఇల్లు – ఆహారం,

ఇతర సౌకర్యాలన్నింటినీ చూపించేది. ఇదంతా ఊరకే ఆమె చేసేది కాదు. విటుల్ని కుదిర్చినందుకు, ఇతర సౌకర్యాలను కల్పించినందుకు రూపీ సంపాదనలో సగభాగం దాకా బ్రోకర్ తీసుకునేది. అలా సగభాగం తీసుకున్నప్పటికీ మొదటిసంవత్సరం చలి కాలంలో కొత్త బట్టలు కుట్టించుకుని కొన్ని నగలు చేయించుకుంది. తల్లి, అన్నదమ్ములకు కూడా కొత్త బట్టలు కొన్నది. ఇంతేకాకుండా వంద రూపాయలతో మధుపురికి వచ్చింది.

తరువాత ప్రతి సంవత్సరం వేసవి, వర్షాకాలాలలో మధుపురిలోనే వుండేది. చలి, వసంతకాలాలలో ఇతర నగరాలలో వుండేది. ఆమె చదువుకోలేదు. చదువుకున్న సమాజంలో పెరగనూ లేదు. కనుక వున్నతమైన ఆదర్శాలంటే ఆమెకు తెలియదు. కానీ ఎంత నికృష్టమైన జీవితాన్ని గడుపుతున్నప్పటికీ వ్యక్తిగత స్వార్థం రూపీలో అణుమాత్రం లేదు. ఆకలితో అలమటించే తమ కుటుంబానికి సాయం చేయటమే పరమావధిగా అనుకునేది. 'కర్తవ్యం' అన్న పదాన్ని కూడా రూపీ ఇంతవరకూ వినలేదు. ఆకలితో వుండే తన కుటుంబ సభ్యుల్ని చూసినపుడు ఆమె హృదయం తల్లడిల్లిపోయేది. వాళ్ళ ఆకలిని తీర్చటానికి తనకు చేతనైన పద్ధతిలో ప్రయత్నించేది.

## 3

నెలలూ, సంవత్సరాలూ గడిచిపోతున్నాయి. పదిహేను, పదహారేళ్ళ వయస్సులో రూపీ ఈ వృత్తిలోకి దిగింది. అప్పటికంటే ఇప్పుడు ఆమె బుద్ధి కొంత వికసించింది. మొదట్లో తల్లి కొంగు పట్టుకు తిరిగే పసిపిల్లలా వుండేది. తల్లి ఎటు నడిస్తే ఆమె అటే నడిచేది. ఇప్పుడలా కాదు. సొంతంగా ఆలోచిస్తోంది. ఆమె సంపాదన వలన కుటుంబ పరిస్థితులు ఏమాత్రం మారలేదు. ఆమె డబ్బులు ఇంటికి ఇచ్చినప్పుడు నాలుగయిదు నెలల పాటు అందరూ కడుపునిండా తినేవారు. కొన్ని రోజులకే ఇచ్చిన డబ్బులు ఖర్చయిపోయేవి. విటులు దొరకటం కష్టమయి డబ్బులు పంపలేనప్పుడు కుటుంబం మొత్తం పస్తులు పడుకోవలసి వచ్చేది. డబ్బులు వున్నప్పుడు చినిగిన బట్టల బదులు మంచి బట్టలు వచ్చేవి. అయితే, నాలుగయిదు రోజులు గడచి మళ్ళీ పస్తులు పడుకోవలసి వచ్చినప్పుడు ఆ బట్టలను దుకాణంలో అమ్మేవారు. మళ్ళీ పాత చినిగిన బట్టలే వాళ్ళ వంటి మీదకు వచ్చేవి. రూపీ చినిగిన బట్టలతో వుండలేదు. అలా చినిగిన బట్టలు వేసుకుంటే విటులను ఆకర్షించలేదు కదా! రూపీకి మంచి తిండీ అవసరమే. పుష్టిగా నిగనిగలాడుతూ వుండాలంటే మంచి తిండి తినాలి గదా! కనుక కుటుంబం మొత్తం ఆకలితో పస్తున్నప్పుడు రూపీని మాత్రం ఆకలితో పస్తు పడుకోనిచ్చేవారు కాదు.

వేశ్యావృత్తి పాపమని అన్ని మతాలు చెప్తాయి. వేశ్యావృత్తి చేసే వాళ్ళను నరకంలో

యమభటులు భయంకరమైన బాధలు పెడ్తారని భయపెడుతుంటారు కూడాను! ఎంత పాపమని చెప్పినా, నరకంలో కఠిన శిక్షలుంటాయని భయపెట్టినా వేశ్యావృత్తి తగ్గటానికి బదులు ఇంకా ప్రబలిపోతోంది. నరకంలో చనిపోయాక విధించే శిక్షల గురించి అటుంచితే పోను పోను ప్రకృతే దీనిని భరించటానికి సిద్ధం కాలేకపోయింది. ఈ జన్మలోనే మన కళ్ళముందే వ్యభిచారానికి శిక్ష సుఖరోగాల రూపంలో ప్రాప్తిస్తున్నది. గనేరియా, సిఫిలిస్ లాంటి సుఖరోగాలయితే ప్రపంచమంతటా వ్యాపించాయి. ధనిక దేశాలలోని నగరాలలో మొదట వ్యభిచారం తర్వాత ఈ రోగాలు పాకాయి. విలాస నగరాలలో వీటి ప్రభావాన్ని గురించి చెప్పనక్కరలేదు. చల్లని కొండ ప్రాంతాలలో ఇంగ్లీషువారు సైనిక శిబిరాలను నిర్మించారు. ఆ శిబిరాల చుట్టుపక్కల పదిమైళ్ళ లోపుగల పల్లెలలోని ప్రజలు సుఖ వ్యాధులతో అల్లాడుతున్నారు. ఇంగ్లీషు సైనికుల కారణంగా పల్లె ప్రాంతాలు సుఖవ్యాధులకు నిలయాలయ్యాయి. వీటి కారణంగా అనేక కుటుంబాలు, అనేక వంశాలు సంతానం లేకుండా అంతరించి పోయాయి. సిమ్లా చుట్టుపక్కల పల్లెలలో సుఖ వ్యాధుల భీకర రూపాన్ని చూడవచ్చు. ఆ పల్లెల్లో సగానికి పైగా కుటుంబాలు సంతానం లేక నాశనం అయ్యాయి. గనేరియా వ్యాధికి పెన్సిలిన్ అమోఘమైన మందు. అయితే ఒకమారు నయమవగానే వ్యాధి ఆ వ్యక్తిని విడిచిపోయిందను కోవటానికి వీలు లేదు. ఈ వ్యాధి సమాజంలో ఎక్కువగా వ్యాపించినప్పుడు స్త్రీ పురుషుల కలయిక ద్వారా మరలా వ్యాపిస్తుంది. సిఫిలిస్ అంతకంటే దారుణమైన వ్యాధి. ఈ వ్యాధి సంతాన విహీనులను చేయదు కానీ ఈ వ్యాధి వలన కుష్టురోగం వచ్చే ప్రమాదం వుంది. రూపీయైనా ఈ వ్యాధుల నుండి ఎలా తప్పించుకో గలుగుతుంది. వ్యభిచార వృత్తిని ప్రారంభించి మూడేళ్ళ యినా అయ్యిందో? లేదో? సిఫిలిస్ పట్టుకుంది. దుకాణం బజార్లో పెట్టుకున్నాక సరుకును ఒకరికి అమ్మి మరొకరికి అమ్మననటానికి కుదరదు కదా? పదిహేను వందల సంవత్సరాల క్రితం శూద్రకుడు 'మృచ్ఛకటిక'లో ఇలా రాశాడు.

*బాష్పాంస్నాతి విచక్షణో ద్విజవరః మూర్ఖోపి వర్ణాధమః*
*ఫుల్లాం నా మ్యతి వాయసోపి, విహగో, యా నామితా వర్హిణా*
*బ్రహ్మక్షత్ర విశః తరం తి చయథా త థైవే తరే*
*సావాపీవ లతేవ నౌరివ జనం వేశ్యాసి సర్వం భజ॥*

ఈ విధంగా బావి, లత, నావ లాగా వేశ్య కూడా బేధభావము లేకుండా అందరికీ సేవ చేయాలి! ఆనాడే కాదు ఈ నాటికీ ఇదే వర్తిస్తుంది.

రూపీకి వచ్చిన రోగం భయంకరమైనది. పుండ్లు పడిపోయి లేచి నడవటమే కష్టమైపోయింది రూపీకి. మధుపురిలో హాస్పటల్‌కు వెళ్ళింది. వైద్యం చేస్తున్నారు. రోజుకు

7 రూ॥లు వైద్యానికి ఖర్చుపెట్టటం ఎక్కువకాలం ఆమెకు సాధ్యపడలేదు. పుండ్లు పూర్తిగా మానకముందే హాస్పటల్ నుండి వచ్చేసింది. సవతి తండ్రికి ఊర్లో కొంత భూమీ, సొంత ఇల్లు వున్నాయి. రూపీని అక్కడకు పంపించివేశారు. ఆమెకు తన జీవితం చాలా బాధాకరమైనదని తెల్సిపోయింది. మొన్నటి జబ్బులోనే ఆమెకు మృత్యుఛాయలు కనిపించాయి. ఇక ముందు ఆ వ్యాధి ముదిరితే మృత్యువు కంటే హీనమైన కుష్టువ్యాధిలోకి దిగుతుందని బహుశా రూపీకి తెలియదేమో! వ్యాధి బయటపడకుండా దాచి వుంచినంత కాలం విటులు వస్తారు. వ్యాధి ఏ మాత్రం బయటపడినా విటులు రారు. తెలిసి, తెలిసి చేతులారా గొంతుకు ఉరిత్రాడు ఎవడు బిగించుకుంటాడు చెప్పండి? విటులు రాక, దుకాణం కట్టేస్తే బ్రతకడం ఎట్లా? అడుక్కు తినాల్సిందే కదా? ఋషీకేశం లాంటి అనేక పుణ్యక్షేత్రాలలో వేల సంఖ్యలో అడుక్కుతింటున్న కుష్ఠువాళ్ళను బహుశా రూపీ చూసి వుండదు. వాళ్లందరూ ఒకప్పుడు తనకంటే అందగత్తెలేననీ, తనలాగానే వాళ్ళూ ఒకప్పుడు 'రూపాజీవ' లేనని రూపీకి తెలియదు. ఏమైనా కానీ ప్రమాదంలో వున్నానని అర్థం చేసుకుంది రూపీ. రోగం రావటం వలననే కాదు! ఆమెకు జీవితం కొంత అర్థమవుతూనే వుంది. రూపం శాశ్వతం కాదనీ, యవ్వనం చూస్తుండగానే మేఘాల నీడలాగా గడిచిపోతుం దని! ఆమెకు అర్థమయింది. ఈ జీవితం నుండి ఎలా బయటపడగలనా! అన్న దిగులు పట్టుకుంది రూపీకి. ఆరోగ్యం కుదుట పడ్డాక సంవత్సరంలో సగభాగం నగరాలలోని వేశ్యాగృహాలలోనూ, మిగతా సగభాగం తన తల్లి గుడిసెలోనూ జీవితాన్ని గడపవలసి వస్తోంది ఆమెకు. వేశ్యాజీవితం చులకనే. కానీ. దానినుండి బయటపడటం అంత తేలికైన పనికాదు. మొదట్లో ఆమె ముఖంలో చిరునవ్వు స్పష్టంగా కనపడేది. ఇప్పుడు ఆమె ముఖంలో అప్పుడప్పుడు మాత్రమే కనిపిస్తోంది. అదీ తెచ్చిపెట్టుకున్నట్టుగా! రూపీ 'గణికే' కానీ లజ్జావిహీనురాలు మాత్రం కాదు. శాస్త్రంలో 'సలజ్జ గణికా నష్టా' అని చెప్పటం జరిగింది. కనుక రూపీలోని 'సిగ్గు' ఆమె వ్యాపారాన్ని దెబ్బతీసింది. రూపీ అందగత్తె. బంగారానికి పూతపూసినట్టు యవ్వనం ఆమె అందాన్ని మరింత ఇనుమడింప చేసింది.

4

అంధకారంలో వెతుకులాడుతున్నట్టుగా అయ్యింది రూపీ జీవితం. ఆమె దగ్గరకు వచ్చిన ప్రతి విటుడూ ఎక్కడలేని ప్రేమ కురిపించేవాడు. 'నీకోసం ఏమైనా చెయ్యటానికి నేను సిద్ధం' అనేవాడు. వందలమంది విటుల నోటినుండి ఈ రకమైన అబద్ధాలను రూపీ వింటూనే వుండేది. వినీ వినీ చివరకు పురుషజాతి మీదనే విశ్వాసం సన్నగిల్లింది ఆమెకు. కొన్నాళ్లకి మళ్ళీ వెనుకటి వ్యాధి తిరగబెట్టింది. ఆమె ఈసారి ఏ హాస్పటలుకూ వెళ్ళలేదు.

వైద్యమూ చేయించుకోలేదు. వైద్యం అనవసరం అనుకుంది. కానీ బెల్లంమీద వాలే ఈగల్లా విటులు ఏమాత్రం తగ్గలేదు. ఆమె దగ్గరకు వచ్చే విటులు రెండు రకాలు వుండేవారు. పర్మినెంట్ విటులు. అప్పుడప్పుడూ వచ్చిపోయే వాళ్ళు. ఇతర నగరాలలో వేశ్యాగృహాలు ఊరికి చివరగా ఏ మారుమూలలో వుంటాయి. అక్కడికి విటులు రావాలంటే రహస్యంగా, భయపడుతూ రావాల్సి వుంటుంది. మధుపురిలో అయితే అలాకాదు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోవచ్చు. మధుపురిలోనూ చట్టమూ, లా, పోలీసులు అన్నీ వున్నాయి. కానీ గుడిసెలలో కాపు సారాయి ఎలా అమ్ముడవుతుందో, రూపమూ అలాగే అమ్ముడుపోతుంది. మధుపురికి ధనవంతులు, స్థితిమంతులు మాత్రమే తమ భార్యల్ని వెంటబెట్టుకు వచ్చేవారు. చిన్నచిన్న ఉద్యోగస్థులూ, చిల్లర వ్యాపారులూ, కూలీలు చుట్టుపక్కల కొండ ప్రాంతాల వాళ్ళయినా, ఇతర నగరాల వాళ్ళయినా తమ వెంట భార్యల్ని తెచ్చుకునే వారు కాదు. రూపీ వెల తక్కువ తీసుకుంటూ అందరికీ అందుబాటులో వుండేది. అందుకే ఆమెకు విటుల కొరత వుండేది కాదు. గడచిన ఐదారేళ్ళల్లో ఆమె చాలా కాలంపాటు చాలాసార్లు మధుపురి నుండి స్వగ్రామానికి వెళ్ళి కొన్నాళ్ళు గడిపి వస్తుండేది. అంటే పాతరోగం మాటిమాటికీ తిరగబడుతూ వుండటాన. ఆమె వ్యాపారానికి అభ్యంతరంగా వుండేది.

రూపీకి 25 సంవత్సరాలు దాటాయి. పాకిస్తాన్ ఏర్పడటం వలన పంజాబ్ నుండి పారిపోయి వచ్చిన సాధారణ ప్రజలు అనేకమంది మధుపురిలో నివాసాన్నేర్పరచుకున్నారు. వాళ్ళంతా చిన్న చిన్న వృత్తులు, చిట్టిపొట్టి వ్యాపారాలు చేసుకు బతికేవాళ్ళు. వాళ్ళల్లో కొందరు ఆమెకు పర్మినెంటు విటులయ్యారు. వాళ్ళలో కొందరు వివాహం చేసుకుంటామని ఆమెకు ఆశలు కల్పించేవారు. స్త్రీలు తక్కువగా వున్నచోట వాళ్ళ విలువ పెరగటం సహజమే కదా!

రూపీ దగ్గరకు రోజూ వచ్చే విటులలో యువకుడైన దర్జీ వుండేవాడు. అతను మొదటిసారి రూపీ దగ్గర వివాహ ప్రస్తావన తెచ్చినపుడు ఆమె తిరస్కరించలేదు కానీ విశ్వసించలేకపోయింది. కానీ జీవితం పట్ల ఆదుర్దా ఆమెకు ఎక్కువయింది. ఒకవైపు రోగం, మరొక వైపు యవ్వనం చేజారిపోతోందన్న భయం. ఆ సంవత్సరం వేసవిలో దర్జీ ఆమె దగ్గరకు రోజూ వస్తూ వుండేవాడు. చలికాలంలో కొండ దిగి నగరానికి వెళ్తూ తనతో పాటు రూపీని కూడా తీసుకువెళ్ళటానికి సిద్ధపడ్డాడు.

రూపీ దర్జీతో క్రింది నగరాలలోని ఒక నగరానికి వెళ్ళింది. వెనుక ఆ నగర వేశ్యాగృహాలలో తను కొన్నాళ్ళు వున్నది కూడా! దర్జీ ఆమెను చాలా ప్రేమగా, గౌరవంగా చూసుకున్నాడు. అన్ని సౌకర్యాలనూ కల్పించాడు. మొదట అతని తల్లిదండ్రులు వ్యతిరేకించినా తర్మాత ముఖసమ్మతిని తెలిపారు. వాళ్ళకు తెలుసు. వాళ్ళ జాతి కన్యను

తెచ్చుకోవటానికి వాళ్ళు ఓలీ చెల్లించాలి. ఓలి కట్టే స్థితి వాళ్ళ దగ్గర లేదు. మధుపురిలో రూపీ వాళ్ళమ్మను ఎవరైనా రూపీ గురించి అడిగిన వెంటనే అత్తవారింటికి వెళ్ళిందని గర్వంగా సమాధానం చెప్పేది.

చలికాలం దర్జీతోపాటు క్రిందినగరంలో వున్నరూపీ ఎండాకాలం మధుపురికి తిరిగి వచ్చింది. దర్జీ ఆమెతో రాలేదు ఎందుకంటే అతని నగరంలోనే అతనికి పనులు బాగా దొరుకుతున్నాయి. మధుపురిలో దర్జీల సంఖ్య బాగా పెరిగిపోయింది. అవసరానికంటే ఎక్కువ మంది దర్జీలు అక్కడ వున్నారు. రూపీని చూడగానే తెలుస్తుంది దర్జీ ఆమెను చాలా బాగా చూసుకున్నాడని! ఆమె బుగ్గల మీద నునుపుదనం వచ్చింది. ఆమె శరీరం మాంసంతో నిండి నిగనిగలాడుతోంది. ఆమె కండ్లు విప్పారి మెరుస్తున్నాయి. దర్జీ ఆమెకు మంచి బట్టలు, సల్వార్, కమీజ్ కుట్టించాడు. ఒక ఖరీదైన అందమైన ఓవర్‌కోటు కొనుక్కుంది. అది ఆమె అందాన్ని మరింత ఇనుమడింప చేస్తోంది. వేసవి కాలంలో క్రింది నగరంలోని వేడిని భరించలేదని రూపీని చల్లని ప్రాంతమైన మధుపురికి పంపించాడు దర్జీ.

అయితే, మధుపురిలో ఆమె తన కుటుంబంతోనే కలిసి వుండాలి. సవతి తండ్రి సారాయి దుకాణంలోనే వుండాలి. ఆ దుకాణంలో తల్లి సారాయి అమ్ముతూ వుంటుంది. సారాయి కోసం నిషాప్రియులు వస్తుంటారు. వాళ్ళే కాకుండా వెనుకటి రూపీ విటులు కూడా అక్కడకు వస్తుంటారు. చేతికి వచ్చే లక్ష్మిని రూపీ తల్లి ఎలా జారవిడుచుకుంటుంది? రూపీ విటులు కొత్తగా వచ్చిన అందాలతో వున్న రూపీని ఎలా వదులుకుంటారు? తాను మధుపురికి వచ్చి చాలా పెద్ద పొరపాటు చేశానని అనుకుంది రూపీ. అయితే, ఆమె తెలుసుకుని ప్రయోజనంలేదు. ఆమెకు చదువురాదు. ఆమెకు చదువు వచ్చివుంటే క్రింది నగరాలలో $115^{\circ}$, $120^{\circ}$ల ఎండలు కాస్తున్నాయని తెలిసేది. అంత వేడిలో కొండ ప్రాంతాలలో నివసించే వారు తట్టుకుని వుండలేరు. ఎండలు ఎక్కువ కాస్తున్నాయని తెలిసినప్పటికీ ఆమె తన దర్జీ భర్తకు లెటర్లు రాయించింది. వచ్చి తనను తీసుకువెళ్ళమని కోరింది. ఇంత ఎండల్లో ఆమెను తెస్తే బాధపడుతుందనుకున్నాడేమో! దర్జీ ఆ లెటర్లకు సమాధానం రాయలేదు. అతనూ రాలేదు. రూపీ చాలా కష్టంగా ఒక నెలరోజులు తనను తాను రక్షించుకోగలిగింది. ఆ నెలరోజుల్లోనూ ఆమె తల్లి, సవతి తండ్రి ఏదో ఒక వంకతో ఆమెను కసురుకుంటూనే వుండేవారు. అందరూ కలిసి మళ్ళీ రూపీని ఆ ఊబిలోకే నెట్టివేశారు.

వేసవి గడిచింది. రూపీ మధుపురికి వచ్చి మూడు నెలలయింది. కొంచెం ఆలస్యంగా ఆమె ఒళ్ళు బరువెక్కినట్లుగా వుంటోందని ఆమెకు అర్థమయింది. దర్జీ తొందరగా వచ్చి తీసుకు వెళితే బాగుండునని రూపీకంటే ఎక్కువగా రూపీ తల్లికి తొందరగా వుంది. దర్జీ

ఉత్తరాలు రాస్తూనే వున్నాడు. అతడు తన ప్రేమను ప్రకటించటానికి అప్పుడప్పుడు సినిమా పాటలలోని కొన్ని పంక్తుల్ని కూడా చేర్చి మరీ ఉత్తరాలు రాస్తున్నాడు. ఒకసారి హఠాత్తుగా నా తల్లిదండ్రులు నిన్ను తీసుకురావటానికి అంగీకరించటం లేదని రాశాడు.

రూపీకి కాళ్ళ కింద భూమి కదిలినట్టయింది. ఇప్పుడు తనేం చేయాలి? అంతవరకూ తల్లికి భయపడే రూపీ ఆనాడు తెగించింది. రూపీ తల్లితో "నేనాఊబి నుండి బయటపడ్డాను. నువ్వు మళ్ళీ ఆ ఊబిలోకి నన్ను నెట్టేశావు" అన్నది. దర్జీ రాసిన ఉత్తరాన్ని చదివించుకుని భోరున ఏడ్చింది రూపీ.

చట్టం దృష్టిలో వాళ్ళ సారాయి కొట్టు నిషేధించబడింది. అయినా నిషా ప్రియులం దరికీ తెలిసిందే కాబట్టి సజావుగానే వాళ్ళు సారా కొట్టు సాగుతోంది. రూపీ మధుపురికి వచ్చిందని తెలిశాక ఆమె వెనుకటి విటులూ సారాయి కొట్టుకు రాసాగారు. వాళ్ళలో దర్జీ స్నేహితులూ కొందరున్నారు. ఆ స్నేహితులు, రూపీ ఊబిలోకి దిగిందని ఉత్తరాల ద్వారా దర్జీకి తెలియపర్చారు. అందువల్లనే అతడు రూపీని తీసుకువెళ్ళనని ఉత్తరంలో రాశాడు. అంత మాత్రానికే ఆమె నిరాశ పడలేదు. తన తప్పేమీ లేదనీ, తనను తీసుకువెళ్ళ మనీ బ్రతిమాలుతూ ఎన్నో ఉత్తరాలు రాయించింది. చివరకు దర్జీ మనస్సు మెత్తబడింది. రూపీచెయ్యి దాటిపోతే తానూ జీవితమంతా అవివాహితుడుగానే వుండవల్సి వస్తుందని భయపడ్డాడేమో కానీ ఒకరోజున అతను రూపీని తీసుకుపోవడానికి మధుపురికి వచ్చాడు. లోపల అనుమానంగానే వున్నా, అతడితో వెళ్ళిపోవడానికి రూపీ సిద్ధపడింది.

## 5

కూతుర్ని దర్జీతోపాటు పంపించివేసింది తల్లి. అడక్కపోయినా 'కూతుర్ని అత్తవారింటికి పంపించా'నని నలుగురికీ చెప్పుకుంది. అత్తవారింటికి వెళ్ళాక తల్లి కూతురికి రెండు మూడు ఉత్తరాలు రాసింది. ఒక్కదానికీ జవాబు రాలేదు. ఒకరోజు అకస్మాత్తుగా దర్జీ రూపిని తీసుకువచ్చి తల్లి దగ్గర దింపి వెళ్ళిపోయాడు. ఒక్క క్షణం కూడా ఆగలేదు. రూపీ ముఖం పాలిపోయి వుంది. జబ్బు పడ్డదానిలా వుంది. కళ్ళు లోపలకు పీక్కుపోయాయి.

దర్జీ చాలా మంచివాడు. అందులో సందేహం లేదు. అతడు రూపీకోసం కొన్న బట్టల్నీ కానీ, నగలను కానీ తీసుకోలేదు. తల్లిదండ్రులతో పోట్లాడి అయినా రూపీని తన దగ్గరే వుంచుకునే వాడే కానీ ఆమె ఐదునెల్ల గర్భవతి అని ఈ మధ్యనే తెల్సింది దర్జీకి. రూపీని తను పుట్టింటికి పంపించి ఆరు నెలలు అయింది. అంతకు పైనే అయిందేమో! మరి అలాంటప్పుడు ఐదునెల్ల గర్భంతో రూపీ వచ్చిందంటే అది తన వల్ల కలిగిన గర్భం ఎలా అవుతుంది? దర్జీ సహించలేకపోయాడు. అతని కులాచారం ప్రకారం ఇతర కులాలకు

చెందిన కన్యల్ని చేసుకోవచ్చు కానీ గర్భవతి అయిన కన్యల్ని వివాహం చేసుకోకూడదు. పెద్దలు నిందించకుండా వుండటానికి దర్జీ ఒక డాక్టర్ని తీసుకువచ్చి గర్భాన్ని తీయించి వేశాడు. రెండు మూడు నెలల గర్భం అయితే ప్రమాదం వుండదు కానీ ఐదు నెలలు దాటటాన చాలా ఎక్కువగా రక్తస్రావం అయింది. మధుపురికి వచ్చేటప్పటికి ఇంకా రక్తస్రావం అవుతూనే వున్నది.

రూపీ జీవితంలో ఒక్కటేసారి వెలుగు వచ్చింది. ఆ వెలుగులో ఆమె తన భావి జీవితానికి సంబంధించిన ఎన్నో కలలను కన్నది. స్వప్న లోకాల్లో విహరించింది. కానీ మళ్ళీ నరక కూపంలో పడిపోయింది. నరక ప్రాయమైన ఆ జీవితాన్ని ఆమె కోరుకోలేదు. దరిద్రం, బాధలూ ఆమెను ఆ నరక కూపంలోకి తోసేసాయి. అలా రక్తస్రావం అవుతున్నప్పుడు మధుపురిలో వుండటం కంటే తన సవతి తండ్రి గ్రామంలో వుండటం నయమని అక్కడికి వెళ్ళిపోయింది రూపీ. ఈసారి రెండు సీజన్లనూ ఆ పల్లెలోనే గడిపింది. సారా దుకాణానికి రద్దీ తగ్గింది. గడ్డాల వాళ్ళూ, టోపీల వాళ్ళూ రోజూ ఎందరో వచ్చేవారు. వాళ్ళందరూ రావటం తగ్గించేశారు. నడక దారిలో కూడా గడ్డి మొలిచింది. అవును. ఇది సహజమే కదా! నడిచే మనుషులు తగ్గినప్పుడు గడ్డి మొలవటం!

అక్టోబరులో మళ్ళీ ఆ దారిలో సందడి ఏర్పడింది. రకరకాల ఆచారాలు సారా దుకాణంవైపుకు వస్తూ పోతూ కనిపిస్తున్నాయి. రూపీ వచ్చిందన్న విషయం నలుగురికీ తెల్సింది. మళ్ళీ అదే జీవితం ప్రారంభమయింది. దర్జీకొన్న ఓవరు కోటును వేసుకుని అప్పుడప్పుడూ బయటకు వెళ్ళి వస్తోంది రూపీ! మధుపురిలో ఆమె క్షేమాన్ని కోరేవాళ్ళు కొందరున్నారు. ఆమె ఆ ఊబినుండి బయటపడాలని కోరుకునే వాళ్ళూ, బయటపడితే చూసి ఆనందించే వాళ్ళూ వున్నారు. వాళ్ళెవ్వరికీ ముఖం చూపించలేకపోతోంది. తనలో తానే క్రుంగిపోతూ ఒక యంత్రంలా నడుస్తోంది. ఆమె మనస్సులో ఆశలూ–ఆకాంక్షలూ ఏమీ లేవు. ఎంతో ప్రయత్నం చేసి, ఎన్నో సంవత్సరాలు ఎదురుచూసి, సమాజం కల్పించిన అనేక ఆటంకాల్ని అధిగమించి బయటకు వచ్చింది ఒకసారి! కానీ, వచ్చి మాత్రం ప్రయోజనం ఏం జరిగింది? ఇంక దర్జీ లాంటి వ్యక్తి రూపీకి ఎక్కడ దొరుకుతాడు?

మధుపురిలాంటి విలాసనగరంలో ఈ ఊబిలో చిక్కుకున్నది ఒక్క రూపీ మాత్రమే కాదు. ఇంకా అనేక మంది చిక్కుకున్నారు. తమ జీవితాన్ని సర్వనాశనం చేసుకున్నారు. మధుపురి సౌందర్యాన్ని గురించి పొగిడేటప్పుడు, ఆ సౌందర్యాన్ని ప్రసాదించటానికి తమ జీవితాల్ని వివశులై బలిపెట్టుకున్న రూపీలాంటి అభాగినులను కనీసం జ్ఞాపకమైనా చేసుకోము!

# రావుతు

**భా**రతదేశం వ్యవసాయం ప్రధానమైన దేశం. ఈ దేశంలోని అధిక సంఖ్యాకుల ప్రధాన వృత్తి వ్యవసాయం. మనదేశంలోని కొన్ని ప్రాంతాలు అధిక జనాభాతో కిక్కిరిసి వున్నాయి. అలాంటి ప్రదేశాలలో భూమిని సవ్యంగా పంచినప్పటికీ భూమిలేని వారు చాలా మందే మిగిలి వుంటారు. జన సంఖ్య ఎక్కువగా వుండే ప్రాంతాల ప్రజలు బతుకు తెరువు కోసం ఇతర ప్రాంతాలకు ఇతర దేశాలకు వెళ్ళటం సహజం. ఉత్తర ప్రదేశ్‌లోని తూర్పు ప్రాంతం, బీహార్ రాష్ట్రంలోని ఉత్తర భాగం మొత్తం ఉత్తర భారతదేశంలోనే జన సంఖ్య ఎక్కువగా వుండే ప్రాంతాలు. దక్షిణ భారతదేశంలో తమిళనాడు కూడా జనసంఖ్య ఎక్కువగా వున్న ప్రాంతమే. అధిక జనాభా కారణంగానే 'అవధ' నుండి 'మిధిల' వరకూ గల ప్రజలు అనేకమంది పొట్ట చేతపట్టుకుని కూలీలై ఫిజ్, గయానా, ట్రినిడాడ్ మొదలైన దేశాలకు వెళ్లిపోయారు. ఆనాడు ఈ దేశం నుండి వెళ్ళిన వారి సంతానమే ఇప్పుడు ఆయా దేశాల్లో మానవ హక్కుల కోసం పోరాడుతున్నారు. భారతీయుల్ని కూలీలుగా ఆ దేశాలకు తీసుకు వెళ్ళిన వాళ్ళువారినీ వారి సంతానాన్నీ ఈ నాటికీ కూలీలుగానే పరిగణిం చాలని చూస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా బ్రిటిష్ – గయానాలోని రాజ్యాంగాన్నీ మంత్రి మండలిని కూడా పక్కకు పెట్టి అక్కడి భారతీయుల్ని కూలీలుగానే పరిగణించాలని పట్టుపట్టింది చర్చిల్ ప్రభుత్వం! ద్వీపాంతరాలకు భారతీయుల్ని పంపించే పద్ధతి చాలా దారుణంగా వుంటుంది. ఒకసారి కనక అమాయకుడైన రైతు, కానీ కూలీ కానీ, కూలీలను పంపించే ఏజెంటు మాటల్లో పడిపోయాడంటే ఇక జన్మలో తప్పించుకోలేడు. 18వ శతాబ్దంలో ఆఫ్రికన్ ప్రజల్ని వలలు వేసి పట్టుకుని విదేశాలకు బానిసలుగా అమ్మేవారు. భారతీయుల్ని వలలు వేసి పట్టకపోయినప్పటికీ కాంట్రాక్టు అనే వలలో బంధించేవారు అలా వెళ్ళటానికి అంగీకరించే వారిని జన్మఖైదీలుగా పరిగణించేవారు. వీరిని పట్టుకు వెళ్ళటంలో కాంట్రాక్టర్లకు బ్రిటిష్ పోలీసులు సహకరించేవారు. ఇప్పటికీ అవధి, భోజపురి, మైధిలి, మాట్లాడే ప్రజలు బతకటానికి కలకత్తా–ముంబాయి పట్టణాలకు వలస వెళుతూ

అనువాదం : **కవిని ఆలూరి**

వుంటారు. కలకత్తాలోనూ, బొంబాయిలోనూ హిందీ ఇంత వాడుకలో రావటానికి సగం కారణం ఈ కూలీలే! మద్రాసులో కూలీలు చౌకగా దొరుకుతారు. అక్కడ పోటీ ఎక్కువ. లేకపోతే, వీళ్ళు మద్రాసుకు కూడా వెళ్ళేవాళ్ళే! అండమానులు దాటి, రంగూన్, సింగపూర్‌లకు కూడా వీరు కూలీలుగా వలస వెళ్ళారు.

కలకత్తా, బొంబాయి ఈ రెండు పట్నాలు సూదంటు రాయిల్లా కూలీలను తమవైపు ఆకర్షిస్తుంటాయి. అయితే, కూలీలు కలకత్తా ముంబాయి వరకే వెళ్ళి ఆగిపోరు. కొంత మంది కూలీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవటానికి పంజాబ్ వరకూ వెళ్ళేవారు. పంజాబులకూ, లాహోరుకూ వెళ్ళే కూలీలు సాధారణంగా అవధీభాష మాట్లాడే వారై వుంటారు. భోజుపురీ మాట్లాడే కూలీలు అతి తక్కువ మంది మాత్రం వెళ్ళేవారు. పంజాబుకు ఇంగ్లీషు వాళ్ళు పంజాబులో తెల్లసైనికుల శిబిరాన్ని, నల్ల సైనికుల శిబిరాల్ని ఏర్పాటు చేశారు. సైనిక శిబిరాలను ఏర్పాటు చేసినప్పుడు ఇంగ్లీషు దొరలు ఒక విషయంలో జాగ్రత్త తీసుకున్నారు. సైన్యంలోకి పంజాబీలకంటే తూర్పువాళ్ళను ఎక్కువగా తీసుకున్నారు. తూర్పు అంటే, ఎంతవరకూ తూర్పు? అన్న విషయం వెనుకటి నుండి వివాదాస్పదంగానే వుంది. ఒకప్పుడు అంబాలా జిల్లాలోని శరావతినదికి తూర్పున వున్న దేశాన్ని 'తూర్పు'గా భావించేవారు. సంస్కృత నైయ్యాకరణాలు నిర్ణయించిన ఈ నిర్ణయాన్ని ప్రజలు అంగీకరించలేదు. పంజాబు వాళ్ళ మీరట్‌ను తూర్పు అంటారు. మీరట్ వాళ్ళు గంగకు అవతల వైపు వున్నా 'రుహేల్‌ఖండ్'ను తూర్పు అంటారు. ఈ క్రమం చాలా దూరం వెళు తుంది. 'రుహేల్‌ఖండ్' ప్రజలు అవధి వాళ్ళను, అవధి వాళ్ళు భోజుపురి వాళ్ళనూ, వాళ్ళు మిథిల వాళ్ళనూ 'తూర్పువాళ్ళు' అనేస్తారు. మీరట్ కమిషనర్ జిల్లాల్లో కూలీలకు కొదవలేదు. కానీ దేరాడూన్ అలా కాదు. అక్కడ ఎప్పుడూ కూలీలకు కొరత వుంటుంది. ముఖ్యంగా 'సినాలిక్ కూ, హిమాలయాలకూ మధ్య వున్నలోయల్లో తూర్పు ప్రాంతపు కూలీలకు గిరాకీ ఎక్కువ. 1815లో బ్రిటిష్ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని నేపాల్ రాజ్యం నుండి లాక్కున్నది. అప్పుడీ ప్రాంతపు జనాభా 10, 15 వేలు మాత్రమే ఉన్నది. సువిశాల మైన భూఖండం. మొత్తం భూమంతా ఖాళీగా పడి వుండేది. దట్టమైన అడవులు. అడవుల్లో ఏనుగులు – పులులూ తిరుగుతూ వుంటాయి. ఈ క్రూరజంతువుల కంటే కూడా భయం కరమైనది మలేరియా దోమలు. ఈ దోమలు ఆ ప్రదేశంలో నివాసాన్ని ఏర్పరచుకోవటానికి వెళ్ళే ప్రజల్లో మూడువంతుల మందిని తుడిచిపెట్టేవి. అయినా, మృత్యువును కూడా ఎదిరించి ఆ ప్రదేశంలో నివాసాల్ని ఏర్పరచుకోవడానికి వెళ్ళేవారు. అలా వెళ్ళేవాళ్ళల్లో పక్కనే వున్న సహరాన్‌పూర్ జిల్లా రైతులు ముఖ్యులు. ఆ నిర్జీవ ప్రదేశంలో ప్రజల సంఖ్య కొంచెం కొంచెం పెరగసాగింది. వ్యాపారస్తులు అవుసర మయ్యారు. కర్నాల్, రోమతక్,

హర్యానా ప్రజలు కొద్దిమంది మాత్రమే అక్కడకు చేరుకున్నారు. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవడానికి. అయితే వీళ్ళెవరూ పనులకు పనికి రారు. కూలీలు అవుసరం అయ్యారు. హిమాలయ లోయల్లో కూలీలకు డిమాండ్ పెరిగిందన్న విషయం తూర్పు కూలీల చెవిన పడ్డది. లాహోర్ వరకూ వెళ్ళటానికి సాహసించే అవధీ–భుజపురి ప్రాంత కూలీలు ఇటువైపుకు దృష్టిపెట్టారు. ఈ రోజున డెహరాడూన్ ప్రాంతంలోని ఏ పెద్ద రైతుకూ తూర్పు కూలీల్లేకుండా క్షణం జరగదు.

## 2

తూర్పు దేశాల్లో గొల్లల్ని 'రావుతు' లంటారు. వీళ్ళు ఉత్తరప్రదేశ్‌లోనూ, బీహార్‌లోనూ అధికసంఖ్యలో వున్నారు. ఉన్నత కులాలవారు వీరికి తగిన స్థానాన్ని ఇవ్వకపోయినా వీరు తమ ఆత్మాభిమానాన్ని కోల్పోలేదు. యుద్ధం చేయటంలో, శౌర్యంలో వీరికి వీరే సాటి. ఒకప్పుడు ఈజాతి ప్రజలు పశుపాలన చేసేవారు. పాలూ, పెరుగూ, నెయ్యి అమ్ముతుండేవారు. దాన్నే ప్రధానమైన వృత్తిగా చేసుకున్నారు. ఇప్పటికీ కొందరు పశు వుల్ని పెంచడం, పాలూ, పెరుగూ అమ్మటాన్నే ప్రధానమైన వృత్తిగా పెట్టుకున్నారు. అయినప్పటికీ చాలా మంది రావుతులు ఇతర వృత్తుల్ని అనుసరిస్తున్నారు. అడవుల్ని నరికి వేయటంతో పాటు పశుసంపదా క్షీణించింది. పశువులు తరిగిపోవడంతో చాలామంది 'రావుతు'లు కూలీ పనులు చేసుకోవటమో లేదా కొంత భూమిని సంపాయించు కుని వ్యవసాయం చేసుకోవటమో ప్రారంభించారు. కానీ, బ్రాహ్మణులు ఏర్పరచిన వర్ణ వ్యవస్థ కేవలం ప్రమాణ పత్రంగానే వుపయోగపడదు. ఉన్నత కులస్థులయిన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య (కోమటులు = కాయస్తులు)లకు సమస్త ఆర్థిక వనరులను అప్పగించింది. అటువంటప్పుడు పేద 'రావుతు'లు సన్నకారు రైతులుగానూ, వ్యవసాయ కూలీలుగానే వుండిపోవటంతో ఆశ్చర్యం ఏముంటుంది? మన కథానాయకుడు, అలాంటి ఒక 'రావుతు'. 'రావుతు' అన్న పదానికి అర్థం 'రసపుత్రుడు' ఎంత గొప్ప బిరుదు. ఇప్పుడు ఉత్తరప్రదేశ్, బీహార్ ప్రాంతాలలో వున్న 'రావుతు'లని పిలవబడుతున్న గొల్ల పూర్వీకులు ఈ దేశానికి 'శక్‌భూమి' నుంచి వచ్చారు. శకజాతికి చెందినవారు. అప్పట్లో ఈ దేశంలో శకుల పరిపాలన సాగుతోంది. కనుక ఆ జాతికి చెందినవారు వారినందరినీ, వారి సంతానాన్నీ రావుతు (రసపుత్రులు) లన్నారు. కాలమనే మహాప్రవాహంలో వ్యవసాయ కూలీలుగా మారి పాలు పెరుగూ అమ్ముకునే గొల్లల్ని 'రావుతు' లనటం పరిహాసమే అవుతుంది.

మన కథానాయకుడైన 'రావుతు' ఇరవై ఏళ్ళ వయసులో బతుకు తెరువుకు పశ్చిమ

ప్రాంతాలకు వెళ్ళాడు. అక్కడ తమ గ్రామస్తుడో, బంధువో కలిశాడు. అతని పరిచయంతో కొన్నాళ్ళు కూలీ నాలీ చేసుకుంటూ గడిపాడు. ఆ ప్రదేశంలో మలేరియా ఎక్కువ. ఒకటి, రెండు సార్లు మలేరియా వచ్చింది. అయినా బతికి బయటపడ్డాడు. బలంగా, దృఢంగా వున్నాడు. ఆరోగ్యం మంచిది. మలేరియా దోమలు అతడిని ఏమీ చేయలేకపోయాయి. కొందరు దురదృష్టవంతులు ఈ ప్రాంతాలకు పొట్ట చేత పట్టుకుని బతుకు దెరువుకు వస్తారు. ఆహార సమస్యను శాశ్వతంగా పరిష్కరించుకుని యమపురికి వెళ్ళిపోతారు. 'రావుతు' ఒక్కొక్కసారి వరిచేలల్లో పని చేసేవాడు. ఒక్కొక్కసారి కాలువలు తవ్వటానికి కూలీలాగా వెళ్ళేవాడు. రెండు మూడేళ్ళ కొకసారి ఇంటికి వెళ్ళి వస్తుండేవాడు. ఇప్పటిలా రైలు ఛార్జీలు ఎక్కువగా లేనప్పుడు కూలీ చేసుకునే వాళ్ళకు ఇంటిధ్యాస ఎక్కువగా పీడిస్తూ వుంటుంది. ప్రతి పైసా కూడబెడుతూ వుంటారు. తల్లిదండ్రులకూ, అన్నదమ్ములకూ పెట్టటం ఇష్టం లేకపోయినా తన పెళ్ళికోసమో, పెళ్ళి అయిన వాడయితే భార్య కోసమో డబ్బు కూడబెట్టక తప్పదు కదా! కనుకనే 'రావుతు' ప్రతి సంవత్సరం ఇంటికి వెళ్ళి రావాలన్న కోర్కెను చంపుకున్నాడు. కొంత డబ్బు పోగు చేసుకున్న తరువాత వివాహం చేసుకున్నాడు. వాళ్ళ జాతిలో ఆడపిల్లలు గానీ, మగపిల్లలు గానీ అమ్ముడు పోయే ఆచారం లేదు. అప్పటికింకా! విధవను పెళ్ళాడినా ఎవరూ చిన్నచూపు చూసేవారు కారు.

మలేరియా వ్యాపించే ప్రదేశంలో కూలిపనులు చేసుకుంటూ, మలేరియాతో సంఘర్షిస్తూ చాలా సంవత్సరాలు గడిపాడు. అతనికి సంతానం కూడా కలిగారు. ప్రతి మానవుడికి బుద్ధీ, ప్రకృతీ భిన్నంగా వుంటాయి. 'రావుతు' పుట్టిన ప్రదేశంలో వుండే ఎందరో ప్రజలు తిండి సమస్యను తీర్చుకోవడానికి దూరప్రాంతాలకు వలస వెళ్ళిన వారు వున్నారు. అయితే వాళ్ళు అలా వెళ్ళడంలో తెలివి తేటలూ ముందుచూపు కనపడదు. కడుపు ఆత్రం, మాత్రం కనపడుతుంది. కానీ 'రావుతు' ప్రత్యేకమైన వ్యక్తిత్వం కలవాడు. మలేరియాతో సంఘర్షిస్తున్న సమయంలోనే అతనికి మధుపురికి వెళ్ళాలనిపించింది. మధుపురి అక్కడకు దూరం కాదు. కూలీ ఎక్కువ వస్తుంది. అయితే, మధుపురి, సంవత్సర మంతా పనులు వుండవు. సంవత్సరానికి 5, 6 నెలలే పనులు దొరుకుతాయి. ఈ కారణం వల్లనే తూర్పు వాళ్ళు మధుపురికి వెళ్ళాలనుకోరు. ఎంత మలేరియా, పీడిస్తున్నా పశ్చిమ దేశాల్లోనే కూలీ పనులు వెతుక్కుంటారు. కొండగ్రామాల కూలీల పోటీకి తట్టుకోలేక కూడా తూర్పు ప్రాంతపు కూలీలు మధుపురికి రారు.

మధుపురి వచ్చాక 'రావుతు' ఒక మెట్టుపైకి ఎక్కాడు. చేలల్లో వ్యవసాయ కూలీగా పనిచేస్తున్న వాడల్లా తోటలో పనిచేసే కూలీగా మారాడు. మధుపురికి వచ్చిన కొత్తల్లో

ఒక అనుభవజ్ఞుడైన తడమాల్ దగ్గర ఆ వృత్తికి సంబంధించిన విషయాలను తెల్సుకున్నాడు. మధుపురిలో తోటమాలిలకు బాగా డిమాండ్ వుండేది. మొదట కొన్నాళ్ళు 'రావుతు' తనకు వృత్తికి సంబంధించిన విషయాలను నేర్పిన తోటమాలి దగ్గరే కూలీకి కుదిరాడు. ఉన్న స్థితిలో సంతృప్తి పడి వుండటం 'రావుతు' స్వభావానికే విరుద్ధం! తోటమాలి కింద కూలీగా ఎక్కువ రోజులు పని చేయలేదు అతను. మధుపురిలోని రెండు పెద్ద పెద్ద హోటళ్ళకు చెందిన తోటమాలి అయిన ఒక వ్యక్తికి సహాయకుడిగా వున్నాడు కొన్నాళ్ళు! అతని పని అందరికీ నచ్చింది. కొద్ది రోజుల్లోనే స్వయంగా సమర్థుడైన తోటమాలి అయ్యాడు. హోటల్ మేనేజరును సంతోషపెట్టడం ఎలాగో అతనికి బాగా తెల్సు. కొన్ని సంవత్సరాల తర్వాత ఆ రెండు హోటళ్ళకు సంబంధించిన తోటలకు పెద్ద తోటమాలి అయ్యాడు 'రావుతు'.

## 3

'రావుతు' తోటమాలి అయ్యాడు. బాగా అనుభవాన్ని గడించాడు. హోటల్ చార్మ్‌లో ప్రధాన కూలీగా పని చేస్తున్నాడు. అతని చేతికింద ఐదారుగురు పనిచేస్తున్నారు. ఆదాయం బాగానే వస్తోంది. జీతం కాక హోటల్ గదుల్లో వుండటానికి వచ్చిన వాళ్ళుకొంత 'బక్షిష్' ఇస్తుంటారు. అయితే అతని సంసారము పెరిగింది. పిల్లలు పెద్దవాళ్ళు అయ్యారు. ఆదాయం వస్తున్నది కానీ చాలటం లేదు. 'రావుతు' ఏం చెయ్యాలన్న ఆలోచనలో పడ్డాడు. హోటల్ బంగళాలో కొంత ఖాళీప్రదేశం వుంది. కూరగాయల మొక్కల్ని పెంచటం అతనికి ఎలాగూ తెల్సు. కూరగాయల మొక్కల్ని పెంచుతున్నాడు. కానీ మాలీ ఉద్యోగాన్ని మానేసి కూరగాయల వ్యాపారంలో దిగటం అతనికి ఇష్టం లేదు. అంత ధైర్యమూ చెయ్యలేకపోతు న్నాడు. క్రిందనున్న కొండ గ్రామాల్లో సేరు పావలా అమ్మే కూరగాయలు మధుపురిలో మూడు పావులకు అమ్ముతారు. తోటమాలీ ఉద్యోగం చేస్తూనే అవకాశం దొరికినప్పుడు కొండ క్రింద గ్రామాలనుండి కూరగాయల్ని తెచ్చి మధుపురిలో అమ్మాలని నిర్ణయించుకు న్నాడు. అయితే, ప్రత్యేకం దుకాణం పెట్టాలన్న ఉద్దేశం అతనికి లేదు. అలాగనక పెడితే షాపు రెంటనీ, అదనీ ఇదనీ లాభం రాకుండా పోతుంది. ఒకవేళ షాపును అద్దెకు తీసుకుంటే షాపు దగ్గరకు వచ్చే వాళ్ళకు మాత్రమే కూరగాయల్ని అమ్మగలడు. అప్పుడతని దగ్గర కొనేవాళ్ళ సంఖ్య తక్కువగా వుంటుంది. మధుపురి బంగళాలలో సీజన్‌లో వచ్చి వుండేవాళ్ళ దగ్గర నౌకర్లు వుంటారు. నౌకర్లను దుకాణాలకు పంపించి కూరగాయలు తెప్పించుకుంటూ వుంటారు. అయితే నౌకర్లు అణా వస్తువుకు బేడ చెబుతారు. అలాగని తాజా కూరల్ని

తీసుకునేవారు. తను బుట్టనెత్తిమీద పెట్టుకుని బంగళాల దగ్గరకు తీసుకు వెళితే తాజా కూరల్ని చూసి తీసుకుంటారు కదా? మధుపురి బంగళాలు రెండు సీజన్లలోనూ పూర్తిగా నిండి వుండవు. సీజన్‌లు అయిపోయాక కూడా బంగళాల్లో కొంతమంది విలాస యాత్రికులు వుంటూనే వుంటారు. చలికాలంలో బంగళాలు పూర్తిగా ఖాళీ అవుతాయి. అయితే, కొన్ని చోట్ల రోడ్ల మీద దుకాణాలు వుంటాయి. స్థానికులు ఎటూ వుంటారు. కాళ్ళల్లో సత్తువ వుండి తిరిగితే తప్పకుండా కూరగాయలు అమ్ముడవుతాయని 'రావుతు' అనుకున్నాడు. క్రింద వుండే నగరాల నుంచే తక్కువ ధరకు కూరగాయల్ని కొనుక్కొని వచ్చేవాడు. గంప నెత్తిమీద పెట్టుకుని తిరిగేవాడు. జాగ్రత్తగా మంచి మంచి కూరల్ని తెచ్చి అమ్మేవాడు. దుకాణాలలో కంటే రెండు పైసలు తక్కువకే ఇచ్చేవాడు. అటువంటప్పుడు ఒక్కసారి కొన్నవాళ్ళు వాడుకగా ఎందుకు కొనుక్కోరు?

'రావుతు'కు ఎక్కువ రోజులు తలమీద గంపపెట్టుకుని కూరగాయల్ని అమ్మనవసరం లేకపోయింది. ఆదాయం పెరగటంతో కూలీ అతణ్ణి పెట్టుకున్నాడు. అతను క్రింద వున్న నగరాలకు వెళ్ళి కూరగాయలు పట్టుకు వస్తాడు. గంప నెత్తిమీద పెట్టుకుని మధుపురిలోనూ అమ్ముతాడు. మధుపురిలో చాలా బంగళాలు కొండలపైన వున్నాయి. ఆ బంగళాల దగ్గరకు గంప నెత్తిన పెట్టుకు వెళ్ళటం కష్టసాధ్యమైన పని. మొదట్లో రావుతు చాలా శ్రమ పడ్డాడు. ప్రతి బంగళాకు ఎక్కీ దిగీ! ఇప్పుడు బాధ లేదు. కూలీ అతను గంప మోసుకు వస్తుంటాడు. రావుతు త్రాసు పట్టుకు వెళుతుంటాడు. ఇలా గంపనెత్తిమీద పెట్టుకుని మధుపురిలో కూరల్ని అమ్మటం ప్రారంభించింది 'రావుతే'. అంతకు ముందు పళ్ళు, ఇతర వస్తువులు ఇలా అమ్మేవారు కానీ కూరలు అమ్మేవాళ్ళు కాదు. ఈ కూరల అమ్మకంలో అప్పట్లో పోటీ లేకపోవటమూ అతని అదృష్టమే! కానీ, రెండవ ప్రపంచ యుద్ధంప్రారంభం అయినాక మధుపురిలో ఎన్నో మార్పులు జరిగాయి. 'రావుతు'కు పోటీగా నెత్తిమీద గంప పెట్టుకుని కూరగాయలు అమ్మేవాళ్ళు మరి కొందరు కూడా తయారయ్యారు. రెండవ ప్రపంచ యుద్ధం వల్ల మధుపురి ఇంతకు ముందు ఎన్నడూ లేనంతగా జనసమర్ధంగా మారిపోయింది. అమెరికన్ సైనికులు రూపాయి అడిగిన కూలీ అతనికి ఐదు రూపాయలు ఇచ్చి 'నీకు రూపాయి సరిపోదు. ఐదు రూపాయలైనా వుండాలి' అని చెబుతున్నారు. మరి ఆ సైనికులు 'డాలర్' ఉండే దేశంనుండి వచ్చారాయే! ఇక్కడ రూపాయి లాగానే అక్కడ డాలర్ వాడుకలో వుంటుంది. అయితే ఒక డాలరు మూడు రూపాయల కంటే ఎక్కువ ఖరీదు చేస్తుంది.

అయితే,రావుతు అమ్మే కూరగాయల్ని అమెరికన్ సైనికులు తినరు కదా? వాళ్ళు

హోటళ్ళల్లో భోజనం చేస్తారు. అమెరికన్‌సైనికుల ఔదార్యంనుండి లాభాన్ని పొందే అదృష్టం రావుతుకు లేదు. మధుపురిలో కుక్కగొడుగుల్లా ఎక్కడ పడితే అక్కడ హోటళ్ళు తలెత్తాయి. వాటిల్లో కొన్నింటికి వాడుకగా కూరగాయల్ని ఇవ్వటం కష్టం కాదు. అయితే, యుద్ధం కారణంగా వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. క్రింద నగరాలలోనే కూరగాయలు చాలా రేటు పలుకుతున్నాయి. రావుతు మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. ఉన్న కూలీని తీసివేసి తన వూరినుండీ మరొక కూలీని తెచ్చి పెట్టుకున్నాడు. వెనకటి కూలీ మధుపురికి చెందినవాడు. అతనికి ఎక్కువ కూలీ ఇవ్వవలసి వుంటుంది. తన వూరి వాడైతే ఎంత ఇచ్చినా సరిపోతుంది. మధుపురి కావటం వలన కూలీని పెట్టవల్సిన అవుసరం కలిగింది. అదే తన గ్రామమే అయితే వేరే కూలీతో పనేలేదు. భార్య గంపను నెత్తిమీద పెట్టుకుని అతని వెంట తిరిగేది. కానీ, మనదేశంలో శరీర శ్రమను అవమానకరంగా భావిస్తారు. మనదేశంలో శారీరక శ్రమ చేయనివాడే పెద్దమనిషిగా చలామణి అవుతాడు. బజారునుండి ఏ చిన్న వస్తువు తెచ్చుకోవాలన్నా మనకు కూలీ అవుసరం అవుతాడు. దురదృష్టవశాత్తూ మన చేతులతోటే ఆ వస్తువును తెచ్చుకోవలసి వస్తే తెల్లని కాగితంలో చుట్టి ఎవరూ చూడకుండా తెచ్చుకుంటూ వుంటాము. సోమరులను గౌరవించి, ఎక్కువ ఆర్థిక వనరులను ఇచ్చే అవకాశాలన్నింటినీ వారికోసం భద్రపరచి, శ్రామికుల్ని, కష్టజీవుల్ని అగౌరవ దృష్టితో చూసి వారికి ఆర్థిక వనరులు వచ్చే సదుపాయాల్ని ఏ మాత్రమూ లేకుండా చేయటం ఈ దేశపు దౌర్భాగ్యం. మధుపురికి వచ్చాక రావుతు కూడా నాగరికమైనవి అని అనుకుంటున్న పై అభిప్రాయాలకు లోనయ్యాడు. ఐదారుగురు కూలీలకు పెద్దగా వున్న తనను నలుగురూ 'కూలీ' అని ఎక్కడ అనుకుంటారోనని బాధ పడుతున్నాడు. మధుపురికి అతను కూలీగా రాలేదు. తోటమాలీగా వచ్చాడు. కింద నగరంలో వ్యవసాయ కూలీగా పనిచేసే రోజుల్లోనే తెల్లని బట్టలు వేసుకోవటం లాంటి నాగరిక లక్షణాలను అలవరచుకున్నాడు. అవధి భాషను మాట్లాడటం ఏనాడో మానేశాడు. వ్యవసాయ కూలీగా వున్నప్పుడు పెట్టుకునే బట్ట టోపీ బదులు మంచి టోపీని పెట్టుకుంటాడు. జంతువుల్ని అనుసరించి దుస్తులు మారుస్తున్నాడు. ఇలాంటి స్థితిలో భార్య చేత కూరగాయల గంపను ఎలా మోయించగలడు?

రావుతు అనవసరమైన ఖర్చులు పెట్టేవాడు కాదు. అతని భార్య కూడా పొదుపరే! పిల్లలు చిన్నవాళ్ళుగా వున్నప్పుడు పని ఎక్కువగా వుండేది ఆమెకు. అన్ని పనులూ ఆమెనే చేసుకునేది. ఇప్పుడు పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. రావుతు ఇన్ని సంవత్సరాలలోనూ కొంత డబ్బును కూడబెట్టుకున్నాడు. ఆ డబ్బుతో కొంత భూమిని తమ గ్రామంలో కొనుక్కున్నాడు.

ఆ భూమిని సాగు చేయటానికి పిల్లల్ని అక్కడికి పంపించాడు. ఇప్పుడు రౌతాయన్ (రావుతు భార్య)కు వెనుకటిలాగా పని ఎక్కువ లేదు. భర్తకు, తనకూ వండిపెట్టుకోవడం తప్ప. ఆమె రైతు కుటుంబంలో పుట్టింది. చిన్ననాటినుండీ కష్టపడి పనిచేసింది. ఇప్పుడు ఊరికే సోమరిగా ఎలా కూర్చోగలదు? ఆమె స్వరం కంచు కంఠం లాంటిది. రెండు ఫర్లాంగుల వరకూ వినపడుతుంది. పన్నెండేళ్ళ క్రితం మధుపురికి రాకముందు ఆమె ఇంత సన్నగా వుండేది కాదేమో? ఏమైనా కానీ, మనిషి క్షణం కూడా ఖాళీగా వుండదు. వెనుకంటి కంటే పెద్ద మార్పులూ ఏమీ రాలేదు. వెనుక గాగ్రా – చున్నీ వేసుకునేది. ఇప్పుడు చీర కట్టుకుంటున్నది. ముక్కుపుడక వెనుక వుండేది. ఇప్పుడూ వున్నది. తన విశ్వాసాన్ని అనుసరించి పూజా – నమస్కారాల్ని చేసుకుంటూ వుంటుంది. ఎంత చలికాలమైనా రోజూ స్నానం చేయవలసిందే! అదీ చన్నీళ్ళతో! మంచు గడ్డకట్టే చలిలోనూ ఒక్క చీరతో ఎలా వుండగలుగుతుందో! తెలియదు. అసలు అంత చలిని ఆమె ఎలా తట్టుకోగలుగుతుందో! ఆమెలో ఒక దోషం వున్నది. ఇరుగు పొరుగున వున్న వారిని పరిచయం చేసుకుని స్నేహం చేయటం ఆమెకు రాదు. అలాగని ఎవరితోనూ విరోధమూ పెట్టుకోదు. ఎవరైనా కావాలని ఆమెతో పోట్లాట పెట్టుకుంటే ఇక వాళ్ళ గతి దుర్గతే. పోట్లాటలో ఆమె కాళిక! ఆమె అవధి భాషలో మాట్లాడుతుంది. హిందీ, కొండ ప్రాంత ప్రజల భాషనూ అర్థం చేసుకుంటుంది. అయితే తను తూర్పు అవధీ భాషలో మరొక భాషాశబ్దాన్ని కలవనీయదు. కానీ, రావుతులో మార్పు వచ్చింది. అతని భాషలోనూ మార్పు వచ్చింది. అవధీ–హిందీ మిశ్రమ భాషను మాట్లాడుతున్నాడు రావుతు. మారిన అతని వేషానికీ అతని భాషకు సరిపోయింది.

## 4

ప్రస్తుత పరిస్థితి సంతృప్తికరంగా లేకపోవటంతో మళ్ళీ తన జీవిత విధానాన్ని మార్చేసుకోవాలనుకున్నాడు రావుతు. ఒకటి మాత్రం నిశ్చయంగా తెలిసిపోయింది అతనికి. అతను కూరగాయల వ్యాపారాన్ని తప్ప మరొక వ్యాపారాన్ని చేయలేడు. అయితే, రెండు మూడు వందలు పెట్టుబడి పెట్టి కూరగాయల దుకాణం పెట్టుకోగలడు కానీ అలా దుకాణం పెట్టి నిర్వహించగలిగిన ఓర్పు–శక్తీ కోమట్లకే కానీ తనకు లేవని రావుతుకు తెలుసును. అతనికి తిరగటం అలవాటు. ఇష్టము కూడాను. అలాంటప్పుడు ఈగల్ని తోలుకుంటూ దుకాణంలో కూర్చుని ఏం చేయగలడు. మధుపురిలోని బంగళాలకు నౌకర్లు వుండటానికీ, గుర్రాల్ని కట్టేయటానికీ ప్రత్యేకంగా కొన్ని గదులు వుంటాయి. ఒక్కో బంగళాకు

దొరలు వుండే గదుల కంటే ఇటువంటి ఔట్‌హౌసులే ఎక్కువగా వుంటాయి. ఒకప్పుడు ఇంగ్లీషు దొరలు వచ్చేటప్పుడు నౌకర్లనూ, గుఱ్ఱాలనూ వెంటపెట్టుకుని అట్టహాసంగా వచ్చేవారు. అప్పుడు ఈ ఔట్‌హౌస్‌లు చాలేవికావు. కానీ రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో పరిస్థితులు కొంతవరకూ మారాయి. బంగళాలు దొరలతో నిండిపోయి ఈ ఔట్‌హౌస్‌లు మాత్రం ఖాళీగా వుండిపోయాయి. రావుతుకు ఆ ఔట్‌హౌస్ ల్లోనే ఒక గది దొరికింది. అతనున్న ఔట్‌హౌస్ బంగళా మధుపురికి బాగా చివరన అలా సెంటరుకు దూరంగా వున్న బంగళాలు యుద్ధ కాలంలోనూ ఖాళీగానే వున్నాయి. కనుక, రావుతుకు ఎక్కువ శ్రమపడకుండానే గది దొరికింది. అతడుంటున్న ఔట్‌హౌస్ బంగళా ముందు ఖాళీ స్థలం బాగానే వున్నది. ఆ బంగళా ఇంగ్లీషుదొర చేతుల్లో వున్నన్ని రోజులూ ఆ ఖాళీ స్థలంలో పండ్ల చెట్లూ, మొక్కలూ వుండేవి. సీమరేగులూ, యాపిల్ పండ్లు బాగా కాసేవి. ఇంగ్లీషుదొర దగ్గర ఆబంగళాను స్వదేశీరాజు ఒకతను కొన్నాడు. వాటిని పట్టించు కునే వారు లేక ఎండిపోయాయి. ఇప్పుడా ప్రదేశమంతా కూరగాయల మళ్ళు పెట్టుకోవ టానికి అనువుగా ఖాళీగా వుంది. రావుతు కూరగాయలు మళ్ళీ పెట్టాడు. పనిలో భార్య కూడా సహకరించేది. అప్పటికే క్రింది నగరానికి వెళ్ళి కూరగాయలు కొనుక్కొచ్చుకొని అమ్ముతూనే వున్నాడు.

రావుతుకు మరొక ఆలోచన వచ్చింది. పక్కన బంగళాకు సంబంధించిన భూమి రెండెకరాలు ఖాళీగా పడి వుంది. మధుపురిలో అందమైన బంగళాలను కట్టించిన ఇంగ్లీషువారు అక్కడ కూరగాయలు పండించాలని ఎప్పుడూ అనుకోలేదు. తమ బంగళాల తాలూకు భూముల్లో పండ్లు, పూలూ పండించుకునేవారు. అయితే, ఇంగ్లీషు వాళ్ళు వెళ్ళిపోయాక పట్టించుకునేవారు లేక అవి ఎండిపోయాయి. పక్క బంగళాకు మరొక సౌకర్యంకూడా వుంది. బంగళాకు సంబంధించిన నీటికుండీ ఒకటుంది. వర్షాకాలం బంగళాలో పడిన నీరంతా దానంతట అదే ఆ కుండీలోకి వచ్చి పడుతుంది. వర్షాకాలం వెళ్ళిపోయాక ఈ కుండీలలోని నీళ్ళను మళ్ళకు పెట్టుకోవచ్చు. మధుపురిలో ఏప్రియల్, మే నెలల్లో వర్షం పడదు. ఆ నెలల్లో తప్పకుండా భూమికి నీరు పెట్టుకోవలసి వుంటుంది. భూమి వుండి నీటి సౌకర్యం వుండటం కంటె రైతులుకు కావల్సింది ఇంకేముంది? పక్క బంగళాకు సంవత్సరాల తరబడి అద్దెకు ఎవరూ రావడం లేదు. ఆ బంగళాలోకి ఎవరైనా అద్దెకు వస్తారన్న ఆశను వదులుకున్నాడా యజమాని. అతని దగ్గర రెండెకరాల భూమిని స్వల్పంగా కౌలు ఇచ్చే పద్ధతిన తీసుకున్నాడు రావుతు.

రావుతు ఆలోచనలు వినేవారికి గొంతెమ్మ కోరికల్లా వుంటాయి. రెండెకరాల భూమి,

నీటి సౌకర్యం, కూరగాయల్ని మంచి ధరకు అమ్ముకోవడానికి ఊళ్ళో వాడికలు, మంచి విత్తనాలు, మంచి ఎరువూ వుంటే, ఎంతైనా పండించవచ్చునని అతనికి తెల్సు. అన్నింటి కంటే బటాణీలకు మంచి గిరాకీ వుంటుంది. మధుపురి శీతలప్రదేశం. మే నెలలో మేలురకం బఠాణీలు బాగా పండుతాయి అక్కడ. కొండ క్రింది నగరాలలో సేరు రెండు రెండున్నర రూపాయలకు తేలికగా అమ్ముకోవచ్చును. మధుపురిలోనూ బాగానే అమ్ముడు పోతాయి. మిగిలినవి ఢిల్లీకి పంపుకోవచ్చును. ఏ రకంగా చూసినా బఠాణీ పంటకు ఇబ్బంది లేదు. రెండవ ప్రంచ యుద్ధానికి ముందునుండి మధుపురికి లారీలూ, బస్సులూ వెళుతున్నాయి. మధుపురి స్థానికులు నిజంగా సోమరులు. లేకపోతే, కాయగూరల్ని పండించి ఢిల్లీలో అమ్ముకుని లక్షలు సంపాదించుకోవచ్చు. డార్జిలింగ్ ప్రాంతానికి చెందిన వాళ్ళు కలకత్తాలో కూరగాయలు అమ్ముకుని ధనవంతులయ్యారు. ఒక్క మధుపురి విషయమే కాదు. చుట్టుపక్కల వున్న కొండ గ్రామాల ప్రజలూ అంతే! నాలుగు డబ్బులు సంపాదించుకోవటానికి పనికి వచ్చే ఇలాంటి మార్గాలను అనుసరించరు. రావుతుకు తెల్సుకానీ ఇంతవరకూ అతను బఠాణీపంటను పండించలేదు. కూరమళ్ళలో వేసే కూరగాయల మొక్కలు మధుపురికి చాలవు. ఇంకా బయటకు తీసుకువెళ్ళి ఏం అమ్ముతాడు?

ఇప్పుడిప్పుడు బఠాణీ, క్యాబేజీ, కాలీఫ్లవర్, గాజర్ గడ్డలు పండిస్తున్నాడు. బఠాణీలను నవంబర్‌లోనే చల్లుతాడు. మిగిలిన వాటిని చలికాలం వెళ్ళాక నాటుతాడు. వ్యవసాయానికి రైతు కష్టపడి పనిచేయటం ఒక్కటే చాలదు. వాతావరణమూ సహకరించాలి. అప్పుడే రైతు కృషి ఫలిస్తుంది. సమయానికి ఒడగళ్ళు పడటమో, పురుగు పట్టడమో జరిగితే నోటి దగ్గరకు వచ్చిన పంట ధ్వంసం అయిపోవడమే కానీ మరొకటి వుంటుందా? అంతదాకా ఎందుకు? పశువులూ-జంతువులూ రైతు శ్రమను వృధా చేయవా? క్రిందటి సంవత్సరం కొద్ది భూమిలో బంగాళాదుంపల్ని వేశాడు రావుతు. వాటిని లేళ్ళు, దుప్పులూ తినేశాయి. కుక్కల్ని పెంచాడు. వాటిని చిరుతపులులు తినేశాయి. రావుతు మధుపురికి సెంటర్‌లో కాకుండా సెంటర్‌కు చాలా దూరంలో అడవుల్ని ఆనుకుని వుంటున్నాడు. రెండెకరాల్లో బఠాణీ వేస్తే ప్రక్కనే అడవులు వున్నాయి. జంతువులు పంటను బతకనిస్తాయా?

## 5

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన రెండు మూడు సంవత్సరాల వరకూ రావుతు ఇలాగే బాధపడ్డాడు. ఎన్ని బాధలూ, ఇబ్బందులూ వున్నా కూరగాయల్ని పండిస్తూనే వున్నాడు. అతని భార్యకూ ఇప్పుడు చేతినిండా పని వుంది. మొక్కల్ని చూసుకోవడం,

కలుపు తీయడం అన్నీ ఆమె బాధ్యతలే! పొలం దున్నటానికి రెండు ఎద్దుల్ని తీసుకున్నాడు.

మధుపురిలో పొలం అమ్మకం లాభదాయక మైన వ్యాపారమే! పాలు, పెరుగు అమ్మటం రావుతు వృత్తి కూడా. కానీ అతని దృష్టి ఎన్నడూ ఈ వ్యాపారం మీదకు పోలేదు. పాల వ్యాపారం చేయదలచుకుంటే సొంతగా ఆవుల్నీ, గేదెల్నీ పెంచవలసిన అవసరం లేదు. క్రింది గ్రామాలకు వెళ్ళి తక్కువ రేటుకు పాలు కొనుక్కుని వచ్చి లాభానికి అమ్ముకోవచ్చు. ఒకటి రెండు ఆవుల్ని పెంచినా వాటిని ఇంటి పాలకోసం, కోడెదూడల్ని పెడతాయేమోనన్న ఆశకూ పెంచుతారు. రావుతు భార్య పేడను వృథాపోనిచ్చేది కాదు. పిడకలు చేసేది. అడవి పక్కనే వున్న కట్టెలతో అన్నం వండేది కాదు. పిడకలతో వండిన వంట చాలా రుచిగా వుంటుందని అంటుంది ఆమె.

రావుతు తన అనుభవంతో ఆ కొద్ది భూమిని సేద్యం చేయడం వల్ల ప్రయోజనం వుండదని తెల్సుకున్నాడు. ఈ కొద్ది భూమిలోనే సేద్యం చేస్తే పెట్టిన పెట్టుబడి కూడా రాదనుకున్నాడు. అయితే, కూరగాయల్ని పండించటంలో మంచి అనుభవాన్ని సంపాయించాడు. మధుపురికి ఒక చివరన వుంటున్నాడు రావుతు. అటువైపు వున్న ప్రజలందరూ అతనికి బాగా పరిచయులయ్యారు. బంగళాలన్నింటి గురించి తెల్సుకున్నాడు. తను వుంటున్న ప్రదేశానికి దగ్గరలోనే ఒక బంగళా వుంది. ఆ బంగళా యజమాని దొరసాని. విధవరాలు. ఆ బంగళాకు ముందువైపున ఒక ఎకరం, వెనుక వైపున ఒక ఎకరమూ సేద్యానికి పనికివచ్చే సమతలమైన భూమి వుంది. ఆ బంగళాలోకి ఎన్నో సంవత్సరాల నుంచి ఒక్కళ్ళు అద్దెకు రావటం లేదు. రావుతు ఆమె దగ్గర వెనుకవైపున వున్న ఎకరం భూమిని అద్దెకు తీసుకున్నాడు.

దొరసాని వేసవికాలంలో, వర్షాకాలంలో మాత్రమే మధుపురిలో వుంటుంది. ఆమె రావుతుకు ఔట్‌హౌస్‌లోని మూడు గదుల్ని ఇచ్చింది. ఈ బంగళా అడవికి దూరంగా వుండటం వలన పంటల్ని నాశనం చేసే జంతువులతో ఇబ్బంది లేకుండా పోయింది. అయితే, ఎర్రమూతికోతులూ, నల్లమూతి కోతులూ చేతికందివచ్చిన కూరగాయల్ని నాశనం చేస్తున్నాయి. అవి పగటిపూట మాత్రమే మడుల మీదకు వస్తాయి. వాటినుండి పంటలను కాపాడుకోవటానికి కుక్కనొకదాన్ని పెంచాడు. నాటు కుక్కపిల్ల. తెలిసిన వాళ్ళను అడిగితే జాతి కుక్క నొకదాన్ని ఊరకనే ఇచ్చేవారే. అయితే, అతడికి జాతి కుక్కల మీద మోజు లేదు. తను పెంచుతున్న కుక్కపిల్లకు 'టైగర్' అని పేరు పెట్టాడు. ఏ క్షణాన దానికి ఆ పేరు పెట్టాడోగాని అది నిజంగా 'టైగర్' అని పించుకుంటున్నది. ప్రజల ఘన విశ్వాసం. కనుకే కుక్కలకు ఇంగ్లీషు పేర్లు పెడుతుంటారు.

రావుతు భార్య అప్పుడప్పుడు 'టైగర్' టైగర్ అని గట్టిగా పిలుస్తూ వుంటుంది. మేఘగర్జన లాంటి ఆమె స్వరం  చుట్టుపట్ల కొండల్లో ప్రతిధ్వనిస్తూ వుంటుంది. వెనుకటి బంగళాలో కంటే రావుతుకు ఇక్కడకు వచ్చాక కూరగాయల అమ్మకంలో కొంత లాభం కనిపించింది. ఇక్కడ పంటలకు రక్షణ వుంది. భూమీ అధికంగానే వుంది. అయితే రెండు నెలలు వర్షాలు సరిగా కురవవు. ఏప్రిల్, మే నెలలు చాలా పొడిగా వుంటాయి. ఆ నెలల్లో నీటి సౌకర్యాన్ని ఎలా కల్పించుకోవాలా? అతనికి అర్థం కాని సమస్య అయింది. అలాంటప్పుడు పంటలు దైవాధీనం మీదే ఆధారపడి వుంటాయి. వర్షాలు సరిగా పడ్డాయా? పంటకు భరోసా వుంటుంది. సమయానికి చినుకు పడకపోతే పూలూ పూసి కళకళ లాడాల్సిన బఠానీ పైరు చప్పగా మారుతుంది. గడచిన రెండు సంవత్సరాలలోనూ ఋతువులు రావుతుకు అంతగా సహకరించలేదు. అయినా అతను నిరాశ చెందలేదు.

రావుతు గొల్ల. బీద వ్యవసాయ కూలీ వర్గానికి చెందినవాడు. అయినా, తన మీద మరొకరు అధికారం చెలాయించడాన్ని ఎంత మాత్రం సహించడు. దొరసాని నిఖార్సయిన బ్రిటిష్ వనిత. ఆ రోజుల్లో భారతీయ పెద్ద ఆఫీసరును వివాహమాడి భారతదేశానికి వచ్చింది. ఇంగ్లీషు వారి ప్రభుత్వం పోయినా ఇంకా ఆమె ఆ వెనుకటి హుకుంను నిలబెట్టుకో వాలనుకుంటుంది. రావుతు నల్లవాడు కావడం వల్ల అతడిని హీన దృష్టితో చూడటం, ఇష్టమొచ్చినట్టు నోరుపారేసుకోవడం ప్రారంభించింది. ఇలాంటివి సహించ టానికి రావుతు సిద్ధంగా లేడు. అతని భార్యా సిద్ధంగా లేదు. రావుతు భార్య దొరసాని మాటకు మాట అంటూంది. దాంతో దొరసాని రావతును తన భూమిలో నుండి  వెళ్ళగొట్టాలని పట్టుపట్టింది. అయితే, రావుతుకూ ఒక విషయం తెలుసు. తనాభూమిని సాగులోకి తేవటానికి ఐదు సంవత్సరాలుగా కష్టపడుతున్నారు. అలాంటప్పుడు ఆ భూమీ మీద తనకూ కొంత హక్కు వుంది. రావుతు కోర్టుకు వెళ్ళాడు. మధుపురిలోని ఒక లాయరు అతని తరఫున వాదించాడు. దొరసాని ఓడిపోయింది. అయితే, పై కోర్టుకు వెళ్ళవచ్చు ఆమె. కానీ ఈలోపే ఆమెకు కాలం తీరి వెళ్ళిపోయింది.

రావతు, అతని భార్య మధుపురికి వచ్చి ఇరవై సంవత్సరాలు పైనే అవుతోంది. వాళ్ళు తాము సేద్యం చేస్తున్న భూమిలో కొంతభాగాన్ని సొంతం చేసుకున్నారు. నీటిదే పెద్ద సమస్య అయింది. ఎరువుకు కూడా అంత బాధపడవలసిన అవసరం లేదు. మధుపురిలో చుట్టుపక్కల కొండ గ్రామాల నుంచీ ఆవుల్లీ – గేదెల్నీ తోలుకు వచ్చి కొందరు పాల వ్యాపారం చేస్తూ వుంటారు. అక్కడకు వెళ్ళి పశువుల ఎరువును తెచ్చుకోవచ్చు. ఓపికగా మొయ్యాలి. కోతుల సమస్యను పరిష్కరించటానికి 'టైగర్' ఎలాగూ వుంది.

అయితే, అప్పుడప్పుడు కోతులు టైగర్ చూడకుండా పొట్ట నింపుకుంటూ వుంటాయి.

మధుపురిలోని బంగళాలలో కూరగాయల్ని పండించుకోవటానికి పనికి వచ్చే భూమి చాలానే వుంది. నీటి సౌకర్యాన్ని కల్పించుకుని, కోతల బెడద లేకుండా చేసుకుంటే చాలు. మధుపురికి ఇతర ప్రాంతాల నుండీ కూరగాయల్ని తెప్పించుకునే అవసరమే వుండదు. అవుసరం అయితే మధుపురే ఇతర ప్రాంతాలకు కూరగాయల్ని సరఫరా చేస్తుంది. అయితే, ఈ విషయాన్ని గురించి మధుపురి మున్సిపాలిటీకి ఇంతవరకూ ఆలోచన కలగలేదు. పెద్ద నీటి హౌస్ ఏర్పాటు చేసుకుని వర్షపునీరు పడేటట్టు చూసుకుంటే రావుతుకు నీటికోసం దేవుడిమీద ఆధారపడవలసిన పనిలేదు. అయితే, అంత పెద్ద హౌస్ కట్టించుకోవానికి అతనిదగ్గర పెట్టుబడి లేదు. అప్పుడప్పుడే వస్తున్న మొక్కలకు పురుగు పడుతుంది. అలాంటప్పుడు డి.డి.టి.ని చల్లే ఏర్పాట్లు వుండటమూ మంచిది. క్రింది నగరాలలో మున్సిపాలిటీ వాళ్ళు డి.డి.టి.ని చల్లే ఏర్పాట్లు చేశారు. కానీ, మధుపురి మున్సిపాలిటీకి ఆ ఆలోచన ఇంతవరకూ కలగేలేదు. ఈ నగరానికి చెందిన బాధ్యతలన్నింటినీ ప్రభుత్వం తీసేసుకుంది. ఇప్పటికి పదకొండు సంవత్సరాలు గడిచినా ఒక్కపనీ జరగలేదు. కానీ అన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరిగినట్టు రికార్డ్సు వున్నాయి.

రావుతు, అతని భార్య ఇప్పుడు మధుపురి నివాసులు అయిపోయారు. మధుపురి భూమి వారిని విడిచిపెట్టదు. ఇక వారు మధుపురిలోనే మహాప్రయాణానికి సన్నాహం చేసుకుంటారు. రావుతు తెలివి కలవాడు పరిశ్రమి. అతను జీవితమంతా శ్రమపడినందుకు ప్రతిఫలం ఆ కొద్ది భూమేనా?

# కమల్‌సింగ్

గఢ్వాల్ ప్రాంతపు విలాసనగరాలలో మధుపురి ఒకటి. ఈ నగరం మిగతా ప్రాంతాలకు భిన్నంగా వుంటుంది. ఒకవేళ భిన్నంగా లేకపోయినా, ఉన్నదని విలాస ప్రియులూ వారిని ఆధారంగా చేసుకుని బతికే ఇతరులూ అనుకుంటారు. మధుపురిలో అతి సుందరమైన ప్రాసాదాల్ని నిర్మించిన ఇంగ్లీషు వారికి  స్థానిక వ్యాపారులు తమకు సేవ చేస్తూ బానిసలుగా బతకవల్సిందే గాని మరే అధికారమూ లేదు అన్న అభిప్రాయం వుండేది. ఇంగ్లీషు వాళ్ళు వెళ్ళిపోయాక వారి స్థావర సంపత్తి అంతా మైదాన ప్రాంతపు జమీందార్ల చేతుల్లోకి ఇతర ధనవంతుల చేతుల్లోకి వెళ్ళిపోయింది. వాళ్ళే మధుపురికి నాయకులయ్యారు. స్థానిక ప్రజలు ఇప్పటికీ పశువుల్లా పగలల్లా శ్రమచేసి బ్రతకటానికి ప్రయత్నిస్తూన్నారు. స్థానిక ప్రజల జీవితాలలో ఏ మాత్రమూ మార్పు రాలేదు. ఆ నికృష్టమైన జీవితానికి కూడా పోటీ వున్నది అంటే ఆశ్చర్యపడవలసి వస్తుంది. సీజన్ సమయంలో చుట్టుపక్కల వుండే కొండ గ్రామంనుండి స్థానికకూలీలు మధుపురికి వస్తుం టారు. వాళ్ళకంటే కూడా అధికంగా నేపాల్‌కూలీలు వస్తుంటారు. బరువు మోయటంలో నేపాల్ కూలీలు దిట్టలు. వాళ్ళలా స్థానికులు మోయలేరు. అయినా పోటీ పోటీయే! ఇంత పోటీ వున్నా నేపాల్ నుండి ప్రతి సంవత్సరం కూలీలు బ్రతకటానికి వస్తున్నారంటే స్థానిక కొండ గ్రామాలలో కంటే నేపాల్‌లో ఇంకా ఎక్కువ పేదరికం, దరిద్రం ఉన్నాయని తెల్సుకోవచ్చు. స్థానిక ప్రజలు ఒక్క కూలీ మోయటమే కాకుండా మున్సిపాలిటీలోని చిట్టిపొట్టి ఉద్యోగాలలో కూడా వుంటున్నారు. రోడ్లు వేయటం, భవన నిర్మాణం లాంటి పనులకు ఒకప్పుడు గఢ్వాల్ నుండి కూలీలు వస్తుండేవారు. ఇప్పుడు వాళ్ళకూ పని దొరకటం లేదు. పాకిస్తాన్ ఏర్పడక ముందు భవన నిర్మాణ కూలీ పనిని లధక్ చుట్టుపక్కల నివాస ముండే బాల్తీ కూలీలు చేస్తుండేవారు. ఒక్క మధుపురిలోనే కాదు. హిమాలయ పర్వతాలల్లోని పశ్చిమ ప్రాంతమంతట్లోనూ, మధ్య ప్రాంతంలోనూ రోడ్లు వేయటం, భవన నిర్మాణం లాంటి కూలీ పనులను బాల్తీ కూలీలు చేస్తుండేవారు. బాల్తీస్థాన్ నేపాల్

కంటే కూడా పేద దేశం అక్కడి ప్రజలు కఠోర పరిశ్రమ చేస్తారు. సముద్ర మట్టానికి పది పన్నెండు వేల అడుగుల ఎత్తున ఉంటారు. కనుక బాల్తీ ప్రజలు చలికి బాగా తట్టుకుంటారు. మధుపురిలో రోడ్లు వేయటం, భవన నిర్మాణం చలికాలంలోనే జరుగుతాయి. కనుక రోడ్ల నిర్మాణంలోనూ, భవన నిర్మాణంలోనూ బాల్తీ కూలీలే ప్రధానంగా పని చేస్తూ వుంటారు. 1947లో దేశం అంతట్లోనూ జరిగిన మత కలహాల తాలూకు ఛాయలు మధుపురిలోనూ కనిపించాయి. బాల్తీ కూలీలు ఆ అల్లర్లలో ప్రాణాలు అరచేత పెట్టుకుని మధుపురి నుండి వెళ్ళిపోయారు. అలా వెళ్ళిన వాళ్ళు ఈనాటి వరకు మళ్ళీ తిరిగి చూడలేదు. వాళ్ళ దేశం బాల్తీస్థానం, పాకిస్తాన్‌లో కలిసిపోయింది. లేకపోతే అల్లర్లు తగ్గుముఖం పట్టాక, ఆ అల్లర్లతో మధుపురిని వదిలి వెళ్ళిన ముస్లిములు చాలా మంది తిరిగి వచ్చినట్లుగా వాళ్ళూ తిరిగి వచ్చే వారే? తమ వృత్తినీ చేసుకునేవారే!

మధుపురి చుట్టుపక్కల నున్న కొండ గ్రామాల ప్రజలు సభ్యతలోనూ, సంస్కృతిలోనూ బాగా వెనుకపడి వున్నారు. అయితే, ఆర్థికంగా మాత్రం గఢ్‌వాల్‌కు చెందిన ఇతర ప్రాంతాల ప్రజలకంటే వీరు మంచి స్థితిలోనే వున్నారు. అందుకు కారణం అనాది నుండి ఆచారంగా వస్తున్న పాండవ వివాహం కావచ్చు. ఈ కొండ గ్రామాల్లో ఎవరో ఒకరు ఇద్దరు తప్ప కూలీ చేయటానికి పెద్దగా రారు. సాధారణంగా వీళ్ళు బంగళాలకు కాపలాదార్లుగానో, మున్సిపాలిటీలో చిరుద్యోగులుగానో చేరతారు. వీళ్ళు చుట్టుపక్కల గ్రామాలనుండి తెచ్చి మధుపురిలో పాలూ, పెరుగూ అమ్మడం ముఖ్య వృత్తిగా పెట్టుకుంటారు. మధుపురిలో పాలపేరుతో కటిక నీళ్ళు అమ్ముతారు. నెయ్యిపేరుతో మూడు వంతులు డాల్డా కలిపిన నెయ్యిని అమ్ముతారు. ఇంత వెనుక బడిన ప్రాంతపు ప్రజలు పాలల్లో నీళ్ళు కలపడమే కాకుండా, నెయ్యిలో డాల్డా కలపటం నేర్చుకున్నారంటే జీవిత సంఘర్షణ మనిషిని ఏ స్థితికి తీసుకువస్తుందో వూహించవచ్చు. అయినప్పటికీ వీళ్ళను ఇతర ప్రాంతాల ప్రజలకంటే కూడా అమాయకులనే అనవల్సి వస్తుంది. వీళ్ల అమాయకత్వం వల్ల స్థిరమైన ఏ ఉద్యోగంలోనూ వీళ్ళను ఉండనీయరు. అలాంటి ఉద్యోగాలు ఏమైనా వుంటే ఇతర ప్రాంతాలవాళ్ళు కొట్టుకుపోతారు. మంచి విషయమేమిటంటే ఈ కొండ ప్రాంత ప్రజలు మద్యపాన ప్రియులు. ఏ క్షణానైనా గొంతు వరకూ తాగి ఒళ్ళు తెలియకుండా పడుంటారు. అలాంటి వారికి బాధ్యత గల స్థిరమైన ఉద్యోగాల్ని ఎలా ఇస్తారు?

కేదార్‌నాథ్, బద్రీనాథ్‌కు వెళ్ళిన యాత్రికులు పరిసర ప్రాంతాల్లో ఒక దృశ్యాన్ని తప్పకుండా చూస్తారు. అక్కడ రైతులు కొండల మీద అడవుల్ని నరికి అంచలంచలుగా మెట్లు పెట్టినట్టుగా గట్లు, గట్లుగా తమ వ్యవసాయ క్షేత్రాన్ని నిర్మించుకున్నారు. జనసంఖ్య ఎక్కువగా వుండటాన వాళ్ళకు అలా చేయవలసి వచ్చింది. ఇలా చేసినా తిండి సమస్య

తీరకపోవటాన గఢవాల్ పుత్రులు ఎక్కడ రొట్టె దొరికితే అక్కడికి వలసలకు వెళ్ళాల్సిన వారయ్యారు. కమల్‌సింగ్ మధుపురికి ఇరవై ఏళ్ళ క్రితం అలా బతకటానికి వచ్చినవాడే! అప్పుడతడు యువకుడు. తన అదృష్టాన్ని పరీక్షకు పెట్టటానికి మధుపురికి వచ్చాడు. కొన్ని రోజులు పాటు కూలీపనులు చేసుకున్నాడు. అంట్లు తోమాడు. అయితే అతను తెలివైన యువకుడు. మధుపురిలో అతనికి ఒక పరిచయస్థుడు కనిపించాడు. అతడి సహకారంతో మున్సిపాలిటీలో సంవత్సరమంతా వుండే ఉద్యోగాన్ని సంపాదించుకున్నాడు. ఉద్యోగం కంటే కూలీ పనిలో ఎక్కువ ఆదాయం వచ్చేది. అయితే, రోజూ కూలీ దొరుకుతుందన్న గ్యారంటీ లేదు! సీజన్‌లో మాత్రమే దొరుకుతుంది. అలాంటప్పుడు సంవత్సరమంతా వుండే మున్సిపాలిటీ ఉద్యోగం నయం కదా! మున్సిపాలిటీలో కరెంటు మేస్త్రీ కింద కూలివాడుగా పనిచేసేవాడు. అయితే, విడిగా కూలీ పని చేసినప్పుడింత కష్టం చేయనవసరం లేదు. కొన్ని సంవత్సరాలు గడిచేసరికి కరెంటు తీగలకు సంబంధించిన కొన్ని విషయాలు అతనికీ అర్థమయ్యాయి. కరెంటును ఆపటం, కరెంటు ఇవ్వటం, అవుసరం అయినప్పుడు కరెంటు వైర్లను జాయింట్ చేయటం లాంటివి నేర్చుకున్నాడు. మరికొన్ని సంవత్సరాలు గడిచేసరికి కరెంటుకు సంబంధించిన జ్ఞానాన్ని తన మేస్త్రీతో సరిసమానంగా తనూ నేర్చుకున్నాడు. జ్ఞానాన్నయితే తెలుసుకున్నాడు. కానీ మేస్త్రీ పనిదొరకటం అంత తేలిక కాదు. ఒక్కొక్క ఉద్యోగానికి వందల సంఖ్యలో అభ్యర్థులు ఎదురు చూస్తున్నప్పుడు కమల్‌సింగ్‌కు మేస్త్రి ఉద్యోగం దొరకటం సంభవమా? కమల్‌సింగ్‌కు మేస్త్రి కింద కూలీగా పనిచేసినందుకు నెలకు ఇరవై రూపాయలు జీతం ఇచ్చేవారు. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు ఇరవై రూపాయలు సంపాదించటం అంటే ఇప్పుడూ ఎనభై రూపాయలు సంపాదించటంతో సమానం. ఉద్యోగంలో చేరిన మొదట్లో కొంత డబ్బును మిగిల్చి తల్లిదండ్రులకు పంపించేవాడు. డబ్బు కూడబెట్టకుండా వుంటే జీవితమంతా పెళ్ళి కాకుండానే వుండిపోవల్సి వస్తుందేమోనన్న భయం వుండేది అతనికి. సంపాయించే కొడుకు పెండ్లి చేయకపోతే చెయ్యి దాటిపోతాడేమోనన్న భయం తల్లిదండ్రులకూ వుంది. అప్పట్లో ఆడపిల్లలకు డిమాండ్ అంతగా లేదు. వంద – నూటపాతిక రూపాయలు పెట్టుకుంటే ఆడపిల్ల దొరకటానికి అభ్యంతరం వుండేది కాదు. కొద్ది సంవత్సరాలలోనే పెళ్లికి అవుసరం అయిన డబ్బును పోగు చేసుకున్నాడు. వివాహం జరిగింది. వయస్సులో వున్న పల్లెటూరి పిల్లను విలాసనగరానికి తీసుకురావడం తెలివైన పని కాదు. కమల్‌సింగ్ భార్యను మధుపురికి తీసుకురాలేదు.

కొన్ని సంవత్సరాల వరకూ కమల్‌సింగ్ జీతం ఇరవై రూపాయల్లోనే వుండిపోయింది. అయితే, జీతం పెంచుకోవటానికి పై అధికారికి ఒక నెల జీతం దక్షిణ ఇచ్చుకున్నాడు.

వెంటనే అతనికి ఐదు రూపాయల జీతం పెరిగింది. ఇరవై అయిదు రూపాయలు అయింది జీతం. మధుపురిలో పేదలకు ఇళ్ళు అద్దె పెట్టనవసరం లేకుండానే దొరుకుతాయి. ప్రతి బంగళాకు ఔట్‌హౌస్ లుంటాయి. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు ఇంగ్లీషు దొరలు నౌకర్లతో సహా వచ్చేవారు కనుక ఔట్‌హౌస్‌లు అవుసరం అయ్యేవి. ఇప్పుడా సంరంభం లేదు. సెంటర్‌కు కొంచెం దూరంలో వున్న బంగళాల ఔట్‌హౌస్‌ల్ని సేనలు వుండటానికి నిరభ్యరంతంగా ఇచ్చేస్తున్నారు. అలా ఇవ్వటం వల్ల బంగళా యజమానికీ లాభమే. ఇంట్లో దీపం పెట్టుకునేవాళ్ళు వుంటే ఇళ్ళు త్వరగా పాడయిపోవు. పాడయిపోయినా వున్నవాళ్ళు బాగుచేయించుకుంటారు. బంగళాకు ప్రత్యేకం కాపలా మనిషి అవుసరం వుండదు. అయితే ఇలాంటి ఔట్‌హౌస్‌లు దొరకాలంటే సెంటర్‌కు బాగా దూరం వెళ్ళాలి. కమల్‌సింగ్ ఒంటరిగా వుంటున్నాడు. బలంగా, దృఢంగా వున్నాడు. రోజుకు పదిమైళ్ళయినా ఈజీగా నడవగలడు. అతనొక బంగళాకు ఆనరెరీ కాపలాదారుడయ్యాడు. అతనూ, అతనితోపాటు ఇంకా ఇద్దరు, ముగ్గురు కలిసి వుంటున్నారు. అందరూ కలిసి సొంతగానే వంట చేసుకునేవారు. కట్టెపుల్లలు కొనుక్కోవాలన్న సమస్యలేదు. పనినుంచి వస్తూ కట్టెపుల్లల్ని ఏరుకుని తెచ్చుకునేవారు. మధుపురిలో ఎటుచూసినా చెట్లే వున్నాయి. కట్టెలకు కొదవ వుండదు. దూరపు బంగళాలలో కొన్నింటికి సొంత చెట్లు వున్నాయి. కొన్నింటికయితే సొంత వనాలే వున్నాయి. నీటికీ పెద్ద సమస్య లేదు. మున్సిపాల్టీవారి నీటి పంపు వుంది. బంగళాకు యజమాని పన్ను కడతాడు. మున్సిపాలిటీ వాళ్ళు సమృద్ధిగా నీటినిపంపుతారు!

## 2

వివాహం అయ్యాక కమల్‌సింగ్ మరొక భవనపు ఔట్‌హౌస్‌లోకి మారాడు. ఒక్కడే వుండేవాడు. ఒక సంవత్సరం అయ్యాక భార్యను తెచ్చుకుంటే బాగుండుననుకున్నాడు. రోజూ వంట చేసుకునే బాధా తప్పుతుంది. పుల్లల్ని కూడా ఆమె ఏరుకు తెచ్చుకుంటుంది. బంగళాకు ఆమె కాపలా కాస్తుంది. తన గదిలో మొత్తం కలిపితే పాతిక రూపాయల సామాను కూడా లేదు. అయితే, బంగళాకు కాపలాదారు అవుసరం. ఏ వస్తువు పోయినా కష్టమే. భార్య వుంటే ఇంక వస్తువు పోతుందన్న భయం వుండదు. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు మధుపురిలో దొంగతనం అన్నమాటను ఎవరూ వినలేదు. ఇంతలో కమల్‌సింగ్ ఉద్యోగంలో కూడా కొంత అభివృద్ధి వచ్చింది. అతణ్ణి రెండవ లైనుమెన్‌గా వేశారు. ప్రస్తుతం జీతం పెరగక పోయినా భవిష్యత్తులో పెరుగుతుందన్న ఆశ ఒకటి కలిగింది. మున్సిపాలిటీ వాళ్ళు క్వార్టరు నొకదాన్ని ఇచ్చారు. ఈ క్వార్టరు మున్సిపల్

ఆఫీసుకు రెండున్నర మైళ్ళ దూరంలో వుంటుంది. అంటే రోజూ అంతదూరం కమల్‌సింగ్ నడవాల్సిందే! అతనికి ఇచ్చిన ఇంటిని మొదట్లో కరెంటు ఆఫీసుకోసం కట్టించారు. ఆ సమయంలో మధుపురి ఇంగ్లీషు వాళ్ళ ఆధీనంలో వుంది. నగరం ఇంకా పెరుగుతుందన్న ఉద్దేశంతో ఇటు చివర్న కూడా ఒక కరెంటు ఆఫీసును కట్టించారు. అందుకనే గోడలకు రంధ్రాలు, ప్లగ్గులు వున్నాయి. కానీ ఇంగ్లీషు వాళ్లు వెళ్ళిపోయాక మధుపురి పెరగలేదు. రెండవ కరెంటు ఆఫీసు అవసరం లేకపోయింది.

కమల్‌సింగ్ మున్సిపాలిటీ వారు ఇచ్చిన ఇంట్లో ప్రవేశించాడు. ఈ ఇల్లు మధుపురికి ఇటు చివర్న వుంది. రోజూ ఐదు మైళ్ళు నడిస్తే కాని పని జరగదు. అలాంటప్పుడు వండిపెట్టటానికి భార్యను తెచ్చుకోవటం అవసరం అనుకున్నాడు. భార్య వస్తే వంట చేసుకునే బాధ్యత తనకు తప్పుతుంది!

కమల్‌సింగ్ తల్లిదండ్రులు మరణించారు. అన్నా వదినెలు ఉన్నారు. కానీ వాళ్ళకూ కమల్‌సింగ్‌కూ అంతగా సరిపడటం లేదు. అత్తమామలూ అభ్యంతరం చెప్పటం లేదు. భార్య కూడా ఇప్పుడు కొంచెం పెద్దదయింది. వెనుకటిలా అమాయకురాలు కాదు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న శుభఘడియ సమీపించబోతోంది. భార్యను మధుపురికి తెచ్చుకోవాలన్న కోర్కె ఇన్నాళ్ళగా అతని హృదయంలోనే వుండిపోయింది. శీతాకాలంలో ఒకరోజు సెలవు పెట్టుకుని వెళ్ళి భార్యను తెచ్చుకున్నాడు. భార్య రాకముందు ఇల్లంతా బోసిపోతూ వుండేది. భార్య వచ్చాక ఇంటికి ఎంతో కళ వచ్చింది. మొత్తం రెండు గదులది ఆ ఇల్లు. కరెంటు వుంది. నీటిపంపు వుంది. అన్ని ఇతర సౌకర్యాలూ వున్నాయి. భార్య వచ్చాక ఆ చిన్న గదుల ఇల్లే స్వర్గతుల్యమైంది. 'న గృహం గృహ మిత్యాహుః గృహిణీ గృహ ముత్యతే' (గృహిణే గృహానికి అందం) అన్న సంస్కృత సూక్తి కమల్‌సింగ్‌కు తెలియదు. భార్యరాక ముందు ఆ రెండు గదుల్నీ చిమ్ముకునేవాడు కాదు. ఎంతో అసహ్యంగా వుండేది. భార్య రాగానే గదుల్ని చిమ్మింది. పేడ పట్టుకువచ్చి అలికి ముగ్గులుపెట్టింది. గిన్నెలన్నీ తళ తళ లాడేట్టు తోమింది. ఇంట్లోనే కాకుండా చుట్టుపట్ల కూడా శుభ్రం చేసింది. భార్యకు ఇరవై రెండు ఇరవై మూడేళ్ళు వుంటాయి. పుట్టింట్లో వుండగా, పెళ్ళి అయ్యాక కూడా చాలా రోజుల వరకూ అడవులకు కట్టెలకు వెళ్లేదామె! అడవుల్లో, కొండల్లో తన స్నేహితురాళ్ళతో కల్సి జానపద గీతాల్ని పాడేది. అడవులు, కొండలు బాగా పరిచయం. వాళ్ళ పుట్టిల్లు రెండువేల అడుగుల ఎత్తున వున్నది. మధుపురి కంటే అక్కడ ఎండలు ఎక్కువ. మధుపురిలో ఎండలు అసలు లేవు. భర్తకు ఇచ్చిన క్వార్టరు దాదాపు పట్నానికి చివర్న వున్నది. దాన్ని ఆనుకునే అడవి వుంది. ఈ క్వార్టరు తరువాత కూడా రెండు

మూడు బంగళాలు వున్నాయి. అయితే, అవి పూర్తిగా అడవిలో వున్నట్టుగానే వుంటాయి.

క్వార్టరు చుట్టూ కొద్ది ఖాళీ భూమి వుంది. దానికి దడి కట్టారు. భార్య చెప్పటం వల్ల కమల్‌సింగ్ ఆ భూమిని అంతటినీ తవ్వాడు. సీజన్ సమయంలో చుట్టుపట్ల గ్రామాల నుండి ఎన్నో కుటుంబాలు తమ పశువుల్ని తీసుకుని మధుపురికి వస్తారు. ఆ పశువులకు ఎరువు సమృద్ధిగా లభిస్తుంది. కొండ గ్రామాల్లోని స్త్రీలు భూమిదున్నటం మినహా మిగిలిన వ్యవసాయపు పనులన్నింటినీ చేస్తారు. నాటువేయడం, కలుపు తీయటం, కోత కోయటం అన్ని పనులూ స్త్రీలే చేస్తారు. స్త్రీల ముందు పురుషులు సోమరులుగా కనిపిస్తారు. అయితే, కమల్‌సింగ్ అలాంటివాడు కాదు. భార్యతో పాటు తనూ అన్నిపనులూ చేసేవాడు. అతని భార్యకు వ్యవసాయానికి సంబంధించిన పనులన్నీ వచ్చు. తమ క్వార్టరు చుట్టూ వున్న భూమిలో రెండేసి గజాల వెడల్పుగల మళ్ళను తీసింది. మధుపురికి వచ్చాక ఆమెకు ఒక మగపిల్లవాడు కలిగాడు. ఆ పిల్లవాడిని చూసుకుంటూ మళ్ళను తవ్వుతుండేది. మధుపురి భూమిలో మట్టికంటే రాళ్ళు-రప్పలూ ఎక్కువ. పూల మొక్కల్ని వేసుకోవాలను కున్న వాళ్ళు ఎక్కడనుంచైనా మట్టి తెచ్చుకుని కుండీలల్లో మొక్కల్ని పెట్టుకుంటారు. కమల్‌సింగ్ భార్య మట్టి తవ్వి తెచ్చుకుని మళ్ళల్లో పోసేది. అంతేకాకుండా రాళ్ళూ రప్పలూ ఏమాత్రం లేకుండా ఏరిపారేసింది. తమ ఇంట్లో నీటి పంపువుంది. అయితే, దాంతో నీళ్ళు లెక్కప్రకారం వాడుకోవాలి. ఎక్కువ వాడుకుంటే డబ్బు కట్టవలసి వుంటుంది. ఇంటి నీళ్ళు మడులకు పెట్టుకుని మున్సిపాలిటీ వారికి డబ్బు కట్టలేరు. కానీ వంద గజాల దూరంలో మున్సిపాలిటి వాళ్ళ బజారు పంపు వుంది. రేకు డబ్బాల్లో ఆ పంపునుండి నీళ్ళు పట్టుకు వచ్చి పోసేవాడు భర్త. భార్య మళ్ళను నీళ్ళతో తడుపుకునేది.

అతను భార్యను మధుపురికి ఎముకలు కొరికే చలికాలంలో తెచ్చాడు. క్రమంగా చలికాలం వెళ్ళిపోయింది. మార్చినెల రాగానే కూరగాయల మళ్ళు పెట్టటంలో మునిగిపోయారు. కూరగాయల మొక్కల్ని పెంచటం కమల్‌సింగ్‌కు తెలుసు. గోధుమవరి, మొక్కజొన్నలు సాగుచేయటం అతడి భార్యకు తెల్సు. ఇంకా బంగాళాదుంపలు, సొరకాయలు పండించగలదు. కమల్‌సింగ్ ఒక మడిలో ఉల్లిపాయ నారు వేశాడు. మరో దాంట్లో టమోటా వేశాడు. క్యాబేజీ ఒక దాంట్లో వేశాడు. భార్య చెప్పటం వలన కొన్ని మళ్ళల్లో గోధుమలూ వేశాడు. గోధుమ, మొక్కజొన్న వేయడం వల్ల పెద్దగా లాభం వుండదు. అంతేకాక సరిగా పంట చేతికి వస్తుందన్న నమ్మకమూ వుండదు. అయినా భార్య మాట కాదనలేక ప్రతి యేడూ కొంత ప్రదేశంలో గోధుమ, మొక్కజొన్న వేస్తుండేవాడు. తమ క్వార్టరు బయట కూడా కొంత మంచి భూమి వుంది. దాంట్లోనూ చిన్నచిన్న మళ్ళను

చేసి కూరగాయల పాదుల్ని పెట్టారు. పంట చేతికి రావటానికి సిద్ధంగా వుంది. మానవ శ్రమ అవసరం. శ్రమ చేయడానికి కమల్‌సింగ్ అతని భార్యా ఎప్పుడూ సిద్ధమే! ఆమె వంట చేసి, పిల్లవాడి పని చూసుకుని మిగిలిన సమయమంతా మళ్ళల్లో పని చేస్తుండేది. ఆదివారంనాడు ఇతర తీరిక సమయాల్లోనూ అతను భార్యకు సహాయపడు తుండేవాడు. కమల్‌సింగ్ ఉదయం 8 గంటలకు ఉద్యోగానికి వెళ్ళేవాడు. మళ్ళీ రావడం పొద్దుగూకిన తరువాత.

భార్యను తెచ్చుకున్నాక అతనికి వంటరితనం పోయింది. వంట వండుకునే బాధాతప్పింది. కూరగాయలు సమృద్ధిగా పండుతున్నాయి. గతంలో కూరగాయలు కొనుక్కునేవాడు. ఇప్పుడు తాము వాడుకోవటమే కాకుండా ఇతర్లకు అమ్ముతున్నాడు. గోధుమలు అంతగా పండక పోయినా పదిపదిహేను రోజుల వరకూ సరిపోతాయి.

## 3

కమల్‌సింగ్ భార్య కాపురానికి వచ్చిన చాలా సంవత్సరాలకు కానీ మొదటి సంతానాన్ని కనలేదు. సాధారణంగా కోడలు ఆలస్యంగా సంతానాన్ని కనటం ఏ అత్తకూ నచ్చదు. కోడలు కాపురానికి వచ్చి ఎన్ని సంవత్సరాలయినా బిడ్డను కని ఇవ్వలేకపోతే అత్తలకు తమ కోడలు గొడ్డుమోతుదేమోనన్న అనుమానం కలుగుతుంది. కానీ కమల్‌సింగ్ భార్య విషయంలో అలాంటిదేమీ జరగలేదు. మొదటి పిల్లవాణ్ణి ఆలస్యంగా కన్నది. తరువాత మూడేళ్ళకు ఆడపిల్లను, ఆ తరువాత సంవత్సరానికి మరొక పిల్లవాణ్ణి కన్నది. ఈ మూడేళ్ళ కాలాన్ని చక్కగా వాడుకున్నారు కమల్‌సింగ్, అతని భార్య. ఇప్పుడు వాళ్ళు ఏర్పరచుకున్న కూరగాయల మడుల వలన ఇప్పటికీ కొంత ఆదాయం వస్తూనే వుంది. మొదటి పిల్లవాడికి 'నేమ్' అన్నపేరు పెట్టారు. తరువాత పుట్టిన ఆడపిల్లకు సారో (సరస్వతి) అన్న పేరు పెట్టుకున్నారు. పిల్లలు తల్లిదండ్రులకు ఖర్చుదార్లు అవుతారు అంటారు. నిజంగానే ధనికుల ఇళ్ళల్లో సంతానం పెరిగితే ఖర్చు పెరుగుతుందేమో కానీ కమల్‌సింగ్ లాటి బీదల ఇంట్లో సంతానం కలిగితే ఖర్చు పెరగదు. వాళ్ళకు తల్లిపాలే సరిపోతాయి. ఒకవేళ సరిపోకపోయినా పట్టించుకునేదెవరు? తల్లి ధరించే చింపిరి బట్టలే వాళ్ళకూ సరిపోతాయి. బయట ఒక బట్ట పరిచి పిల్లల్ని పడుకోబెడతారు. ఎండ తగిల్తే పిల్లలకు కళ్ళు దెబ్బతింటా యంటారు కొందరు. 'అదంతా డబ్బు కలవాళ్ళ అనవసరమైన భయమే కానీ మరొకటి కాదు' అంటారు కమల్‌సింగ్ భార్య లాంటి వాళ్ళు. డబ్బున్న వాళ్ళ ఇళ్ళల్లో బిడ్డ పుడితే అతని శరీరం రంగు మార్చటానికి పాలల్లో స్నానం చేయిస్తారు. పాలు కలిపిన నలుగు పెడతారు.

అలా చేస్తే తెల్లబడతారని వాళ్ళ ఆశ. కానీ కమల్‌సింగ్ లాంటి వాళ్ళు ఇంటపుట్టిన బిడ్డకు వంటికి రాచుకోవటానికి ఆముదమే వుండదు. ఇక నలుగు పెట్టుకోవటమంటే వాళ్ళకేం తెల్సు. శరీరం మీద, ముఖం మీద వున్న నూగు పోవటానికి ఆముదమూ, నలుగూ పెట్టి మృదువుగా రాచి నూగు వెంట్రుకలు పోయేట్టు చేస్తారు. కానీ కమల్‌సింగ్ భార్య తన బిడ్డల వంటిమీద నూగు పోవటానికి చేసే ప్రక్రియ చాలా దారుణమైనది. పొయ్యిలోని బూడిదను అప్పుడే పుట్టిన శిశువు శరీరం మీద రుద్ది నూగు వెంట్రుకలు పోయేట్టు చేస్తుంది.

ఎంత తక్కువలో చూసుకున్నా ఖర్చు పెరగకుండా వుండదు కదా? కమల్‌సింగ్ భార్య ఒక మేకపిల్లను పట్రమ్మని చెప్పింది భర్తకు. యుద్ధం ముగిసింది. అయినా, వస్తువుల ధరలు నాలుగు రెట్లు పెరిగాయి. ఇప్పుడు కమల్‌సింగ్‌కు 32 రూపాయల జీతం వస్తోంది. పది రూపాయల కరువు భత్యం. మొత్తం నలభైరెండు రూపాయలు వస్తున్నాయి. అయితే, ఈ నలభై రెండు రూపాయలూ యుద్ధానికి ముందున్న 14 రూపాయలతో సమానం. ఒక చిన్న మేకను కొనటానికి నెల జీతంలో సగం ఖర్చుపెట్టవలసి వచ్చింది. కమల్‌సింగ్ దగ్గరకు వచ్చాక మేక రెండు పిల్లల్ని పెట్టింది. ఆరునెల్ల తరువాత వాటిలో ఒక పిల్లను అమ్మి మేకను కొనటానికి పెట్టిన డబ్బును రాబట్టుకున్నాడు. రెండో మేకపిల్లతో కమల్‌సింగ్ కొడుకు ఆడుకుంటున్నాడు.

మధుపురిలో ప్రధానమైన మూడు బజార్లలో బంగళాలు దగ్గర దగ్గరగా వుంటాయి. మిగిలిన బంగళాలన్నీ దట్టమైన వనాల్లో అక్కడొక్కటీ అక్కడొకటిగా వుంటాయి. ఐదో ఏడు వచ్చేసరికి కమల్‌సింగ్ పెద్దకొడుకు 'నేమ్' అల్లరివాడయ్యాడు. తనను కొడతారన్న భయం లేకుండా తనకంటే పెద్దపిల్లల మీద కొట్లాటకు వెళ్ళేవాడు. అంతేకాకుండా మిగతా తోటి పిల్లలను రాళ్ళతో కొట్టేవాడు. దీంతో చాలామంది పిల్లల తలలు కూడా పగిలాయి. అప్పటినుంచి తోటి పిల్లలు అతనంటే భయపడేవారు. ఐదు సంవత్సరాలు కూడా సరిగా నిండని 'నేమ్' చుట్టుపక్కల వాళ్ళదగ్గర టాక్స్ వసూలు చేస్తుండేవాడు. 'టాక్స్' అంటే మరేమీ లేదు. అతనికి తినటానికి ఏమైనా పెట్టాలి. లేకపోతే వాళ్ళ తోటల్లో పూలు వుండవు. కిటికీల అద్దాలు మిగలవు. తల్లి తండ్రీ అతడిని బాగా కొట్టేవారు. అయినా కొంటె చేష్టలు మానేవాడు కాదు. ఇంట్లో మేకలు వుండటం వలన 'నేమ్' అల్లరిని భరించనవసరం లేకుండా పోతోంది. అంతేకాకుండా కొంత ఆదాయమూ వస్తోంది. 'నేమ్' ను తల్లి ఉదయాన్నే చద్దిపెట్టి మేకల్ని ఇచ్చి అడవికి పంపుతుంది. ఇతర పిల్లల్తో కలిసి అడవికి వెళ్తాడు 'నేమ్'. నాలుగైదు మేకపిల్లల్ని తీసుకుని అడవికి వెళ్ళేవాడు నేమ్.

పొద్దుగూకితే కానీ ఇంటికి వచ్చేవాడు కాదు. కొంచెం పెద్దగా అయ్యాక ఒక ఆవుదూడను కూడా జత చేశారు. ప్రతి సంవత్సరం ఐదారు మేకల్ని అమ్మేవాడు కమల్‌సింగ్. వాటిమీద ఒక వంద రూపాయలు వచ్చేవి. మేకపాలు తాగవచ్చన్న విషయం కమల్‌సింగ్‌కు తెలియదు. తమగ్రామాలలో మేకపాలు తాగరు. కానీ, క్రింది గ్రామాలనుండి వచ్చిన ఒకాయన 'పిల్లలకు మేకపాలు మంచిదని' చెప్పాడు. కమల్‌సింగ్ భార్యకు మాత్రం మేకపాలు మంచివన్న నమ్మకం కలగలేదు. ఎందరు చెప్పినా మేకపాలను మాత్రం పిల్లలకు వాడలేదు. ఆవుదూడ పెద్దదయి ఈనింది. ఆవుపాలను పిల్లలకు పోయటం మొదలు పెట్టారు. ఆవుపాలను తాగవచ్చు కానీ మేకపాలు పనికిరావని వాళ్ళ అభిప్రాయం. అయితే కొండలప్రాంతాల అవులు రోజుకు ఒకపూట సేరు పాలు ఇస్తాయి. ఆవులకు, మేకలకు మేతను గురించిన సమస్యే లేదు. పగటిపూట కొడుకుగానీ, తల్లిగానీ ఎవరికి వీలుంటే వాళ్ళు మేపుకు వస్తారు. చలికాలం మేతకు కొంచెం కష్టం అవుతుంది. చలికాలంలో పచ్చిగడ్డి ఎండిపోతుంది. అందుకని వర్షాకాలంలోనే చలికాలానికి అవసరం అయిన గడ్డిని జాగ్రత్త పెట్టుకునేవాడు కమల్‌సింగ్.

సరస్వతి తరువాత మూడవ ఆడపిల్ల, నాలుగవ ఆడపిల్ల పుట్టింది. మగపిల్లవాడు మరొకడు కలిగితే బాగుండునన్నది వాళ్ళ ఉద్దేశ్యం. ఆడపిల్లలకు కట్నం ఇవ్వవలసిన అవసరం లేకపోయినా ఇంకొక మగపిల్లవాడు పుడితే బాగుండుననుకునేవారు.

## 4

ఐదుగురు, తల్లీ తండ్రీ కలిపి మొత్తం ఏడుగురు బ్రతకాలి. కమల్‌సింగ్‌కు కరువు భత్యం కలుపుకుని 59  రూపాయలు మాత్రమే జీతం వస్తుంది. అంటే యుద్ధానికి ముందు ఈ 59 రూపాయలూ కేవలం 25 రూ॥లు విలువచేసేవి. కమల్‌సింగ్ ఉద్యోగంలో చేరిన మొదట్లో 20రూ॥లు జీతం తీసుకున్నాడు. 59 రూ॥లలో ఏడుగురి మనుషులు ఎలా బ్రతకుతారో వూహించడం ప్రముఖ ఆర్థికవేత్తలకు కూడా సంభవం కాదు. వాళ్ళకూ కుటుంబ జీవితం పెద్ద సమస్యగా తయారయింది. అయితే, ఈసమస్యకు సమాధానం అంత కష్టమైన పని కాదు. మనుషుల్లాగా బ్రతకటం మానుకుంటే, సంవత్సరం అంతా పిల్లలకు బట్టలు కొనకుంటేనూ, రోగానికీ, ఆకలికీ, దప్పికకూ అన్నింటికీ భగవంతుడి మీద ఆధారపడితే, పిల్లలూ, పెద్దలూ వాళ్ళనూ, వీళ్ళనూ అడిగి చినిగిన బట్టలు తెచ్చుకుని ధరిస్తే, అప్పుడు 59 రూ॥లతో ఏడుగురు బతకటం సంభవమవుతుంది. చుట్టుపక్కల వున్న బంగళాల్లో ప్రతి సంవత్సరం విలాసయాత్రికులు వస్తూ వుంటే కమల్‌సింగ్ కుటుంబం

ఒకరకంగా బ్రతకగలుగుతోంది. బంగళాల్లోకి వచ్చిన వాళ్ళకు అతని భార్య పనిచేసి పెడుతోంది. ఏదో ఒకటి అడిగి తెచ్చుకుంటోంది. యుద్ధం అయిపోయి, పాకిస్తాన్ ఏర్పడ్డాక మధుపురిలోని దూరప్రాంతాల బంగళాల్లోకి విలాసయాత్రికులు రావటమే లేదు. సెంటర్‌లో వున్న బంగళాలలోకే యాత్రికులు దిగటం కష్టంగా వుంటే ఇంక దూరపు బంగళాలకు ఎక్కడనుండి వస్తారు. ఈవిధంగా ఆ కుటుంబానికి దొరికే పై ఆదాయం కూడా పోయింది.

కమల్‌సింగ్ అతని కుటుంబాన్ని చూశాక వీళ్ళు మానవ జీవితాన్ని గడుపుతున్నారని ఎవరూ అనుకోరు. అయితే, మధుపురిలో ఇంతకంటే కూడా నికృష్టమైన జీవితాల్ని గడిపేవాళ్ళు అనేకమంది వున్నారు. అలాంటి కుటుంబాలు కమల్‌సింగ్ భార్యకు కూడా తెలుసు. మానవ స్వభావం విచిత్రమైనది. తమకంటే బాధలు పడే వారిని చూసి సంతృప్తి పడతాము. సుఖపడేవారిని చూసి ఈర్ష్యపడతాము.

జీవితాలు భారంగా నడుస్తున్నాయి. 59 రూ॥లకు విలువ ఏమీ లేదు. వాటిలో నలభైరూపాయల దాకా రేషన్‌కే సరిపోతుంది. మిగిలిన వాటిల్లో అన్నిఖర్చులూ వెళ్ళాలి. మేకల మీద నెలకు ఒక పది, పదిహేను రూపాయలు వస్తాయి. అది వాళ్ళ కుటుంబానికి గొప్ప ఆశ్రయం. తను వుంటున్న క్వార్టరును కొంత అభివృద్ధి పరచుకున్నాడు కమల్‌సింగ్. వాళ్ళనూ, వీళ్ళనూ అడిగి రేకులు తెచ్చుకుని వసారా వేసుకున్నాడు. ఆ వసారాలో వంట చేసుకునేవారు. రెండు గదులలోనూ ఒకదాంట్లో పశువుల్ని కట్టేసేవారు రాత్రిపూట. మరొక దాంట్లో తాము వుండేవారు. ఈ మధ్య రాత్రిపూట చిరుతపులి ఒకటి తిరుగుతోంది. ఆవుల్నీ, మేకల్నీ గదిలో కట్టేయకపోతే బతకనీయదు. కూరగాయల మళ్ళల్లో సంవత్సర మంతా ఏదో ఒకటి కాస్తూనే వుంటుంది. అయినప్పటికీ కమల్‌సింగ్ ఏమాత్రం మిగుల్చు కోలేకపోతున్నాడు. వచ్చే ఆదాయంతో ఆ కుటుంబం కడుపునిండా రెండుపూటలా తినడానికి సరిపోతే చాలు.

'నేమ్' ఇప్పుడు స్కూలుకు వెళుతున్నాడు. మధుపురిలో నిర్బంధ విద్యావిధానం అమలులో వుంది. అయినా కమల్‌సింగ్ నిరక్షరాస్యుడే అయినప్పటికీ చదువు విలువ బాగాతెల్సు. అతడికి చదువు వచ్చివుంటే ఎప్పుడో ఫస్ట్‌గ్రేడ్ లైన్‌మెన్ అయివుండేవాడు. కొడుకును చినిగిన బట్టలతో బడికి పంపలేడు కనుక పాలవ్యాపారి దగ్గర ఒక పాత చొక్కాను, ఒకలాగూనూ, ఒక టోపీని కొనుక్కుని తెచ్చి ఇచ్చాడు. 'నేమ్' లాంటి పేద పిల్లలకు చెప్పులతో పని వుండదు. వారి దగ్గరకు వచ్చేసరికి చెప్పులూ విలాసవస్తువుల లాగానే మారిపోతాయి. చలికాలం మంచు గడ్డకట్టుకు పోతూ వుంటుంది. అయినా 'నేమ్'కు చెప్పుల అవసరంకలగదు. చెప్పులు లేకుండానే తిరుగుతూ వుంటాడు.

## 5

ఆ సంవత్సరం రెండోసీజన్ కూడా అయిపోవచ్చింది. విలాస యాత్రికులు చాలా మంది మధుపురి నుంచి వెళ్ళిపోయారు. అక్టోబర్ నెల చివరకు వచ్చింది. అప్పటికి చలి ఇంకా ముదరలేదు. ఒకరోజున కమల్‌సింగ్ కడుపులో సన్నగా నొప్పి మొదలయింది. రెండు మూడు రోజుల వరకూ అతను బయటకు రాలేకపోయాడు. కడుపులో నొప్పి, జ్వరము నాలుగవ రోజుకల్లా అతను స్పృహ తప్పాడు. సవారి కట్టి అతణ్ణి హాస్పటల్‌కు తీసుకువెళ్ళారు. డాక్టర్ నిమోనియా అని చెప్పారు. నిమోనియా అంటే ఏమిటో భార్యకు అర్థం కాలేదు. ప్రమాదకరమైనది అని డాక్టర్ చెప్పిన మాటలు మాత్రం అర్థం అయ్యాయి. 'ఆయనకు ఏమైనా అయితే తన గతి, ఈ ఐదుగురు పిల్లల గతి ఏమవుతుంది? చాలా కష్టపడి వసారా వేసుకున్నారు. మళ్ళుచేసుకున్నారు. ఆ తరువాత మున్సిపాలిటీ వాళ్ళు ఆ గదుల్లో తనను వుండనివ్వరు' అని అనుకుంది. అతని భార్య ఆమె అనుకున్న దాంట్లో కల్పన ఏమీ లేదు. పైగా ఆమె అతి భావుకత్వంలో ఏడ్చి హంగామా చేయలేదు. ఇప్పుడు వాళ్ళు గడుపుతున్నది అంత గొప్ప జీవితం కానేకాదు. పిల్లల్ని వెంట వేసుకుని పైసా పైసాకూ అడుక్కోవటం ఇంతకంటే దురదృష్టకరమైన పరిస్థితి కదా? అక్కడికి హాస్పటలు మూడుమైళ్ళ దూరంలో వుంది. నాలుగవ కూతురు ఇప్పుడిప్పుడే కూర్చుంటున్నది. పిల్లల్ని ఒంటరిగా విడిచి ఆమె హాస్పటలుకు వెళ్ళలేదు. భర్త హాస్పటలులో వున్నాడు. భర్తను చూడకుండానూ వుండలేదు? చంటిపిల్లను తీసుకుని, మిగిలిన ముగ్గరు పిల్లల్ని చూస్తుండమని 'నేమ్'కు చెప్పి వెళ్ళవచ్చు. 'నేమ్' బాధ్యతలేని పిల్లవాడు. అతడిమీద పిల్లల్ని వదిలి వెళ్ళటం ఎలా? అతడు తన తోటి పిల్లలతో ఆడుకోవటానికి వెళతాడు. ఒక్కొక్కసారి సరస్వతినీ వెంట తీసుకు వెళతాడు. మరి మిగిలిన పిల్లలు. గుండె రాయి చేసుకుని పిల్లల్ని వదిలి హాస్పటలుకు వెళ్ళేది. మరీ చిన్న పిల్లలు ఏడుస్తుండేవాళ్ళు! దరిద్రుడి సంతానం ఏడ్చినా ఎవరు పట్టించుకుంటారు. వినేవాళ్ళు లేకపోయినప్పుడు ఎంతసేపని ఏడుస్తారు? ఆకలి అయితేనో, మరేదైనా బాధ కలిగితేనో ఏడుస్తారు. ఏడ్చిఏడ్చి నిద్రపోతారు. పిల్లలు ఏడుస్తారేమో? తొందరగా వద్దామని తల్లి అనుకుంటుంది కానీ త్వరగా రావటం ఎలా? మూడు మూళ్ళు వెళ్ళటానికీ, మూడుమైళ్ళు రావటానికి మొత్తం ఆరు మైళ్ళు నడవాలి. ఇంతా చేసి వెళ్ళాక కొంతసేపైనా అక్కడ వుండాలి కదా? ఒక్కోసారి సాయంత్రాలప్పుడు రెండవ కూతురు కిందకు దిగి తల్లికోసం ఎదురుచూస్తూ రోడ్డు మీద కూచుని వుండేది. చీకటి పడుతున్న సమయంలో పిల్లనలా ఒంటరిగా మార్గమధ్యలో చూసిన సహృదయులకు కన్నీళ్ళు ఆపుకోవటం కష్టమయ్యేది. అలాంటి

సమయాల్లో సాధారణంగా చిరుతపులులు తిరుగుతూ వుంటాయి ఆ ప్రాంతాల్లో. సంవత్సన్నర వయస్సున్న చిన్నపిల్ల శూన్యమైన భవిష్యత్తును చూడటానికి దృష్టి సారిస్తూ అలా కూర్చుని వుంటే చూసి సహించగలగటం రాతి గుండెలకే సంభవం. ఇంతవరకూ మధుపురిలో చిరుతపులులు మనుషుల్ని చంపటం జరుగలేదు. అయినా, ఇంత చిన్నపిల్లను ఒంటరిగా చూసిన చిరుతపులి వదిలిపెడుతుందా?

మూడురోజుల వరకూ డాక్టరు కూడా నమ్మకం లేదన్నాడు. నాలుగవ రోజున హాస్పటల్ నుండి వచ్చేటప్పుడు ఆమె ముఖం కళకళలాడుతోంది. కమల్‌సింగ్ ప్రమాదం నుండి బయటపడ్డాడు. మరి కొన్నాళ్ళ తర్వాత అతను హాస్పటల్ నుండి ఇంటికి వచ్చాడు. జబ్బు నయం అయింది. అయితే మనిషి చాలా బలహీనంగా వున్నాడు. డాక్టరు మాంసంతో చేసిన 'షోరబా' తాగమన్నాడు. కానీ, మాంసం సేరు రెండున్నర రూపాయలు అమ్ముతోంది. అప్పటికే భార్య ఎలాగో రెండు మూడు రోజులు మాంసపు 'షోరబా' తాగించింది. మరో పదిరోజులు ఇంటి దగ్గర వున్నాడు. అప్పటికీ పూర్తిగా బలం రాలేదు. ఇంక సెలవలూ లేవు. కమల్‌సింగ్ పూర్తిగా కోలుకున్నాక ఉద్యోగంలో చేరాడు.

జీవితనావ తిరిగి యధాప్రకారం పయనించటం ప్రారంభించింది. పేదరికం ఎటూ వుండనే వుంది. అయితే, ఈ భయంకరమైన కాళరాత్రిని గడిచారు. కానీ ఆ సంతోషం ఎక్కువరోజులు నిలబడలేదు. ఐదారురోజుల తరువాత ఒకరోజున పెద్దకూతురు సరస్వతికి జ్వరం వచ్చింది. రెండవరోజునే కాళ్ళూ చేతులూ కదల్చలేకపోయింది. పక్షవాతం వచ్చేసింది. చచ్చిపోతుందన్న భయం లేకపోయినా, ఆ పిల్ల జీవితం ఏమవుతుందో? నన్న సమస్య ఏర్పడ్డది. పక్షవాతం వచ్చిన అమ్మాయిని ఎవరు పెండ్లిచేసుకుంటారు. కమల్‌సింగ్ కూతుర్ని భుజాన వేసుకుని హాస్పటల్‌కు పరుగెత్తాడు. డాక్టరు 'ఇది పోలియో. దీనికి మందు లేదు' తీసుకువెళ్ళు' అన్నాడు. డాక్టరు లాభం లేదన్న తరువాత తల్లిదండ్రి చేయగలిగింది ఏమిటి? ఆ మాంసపు ముద్దను భుజాన వేసుకుని ఇంటికి వచ్చేశాడు కమల్‌సింగ్. సరస్వతి ఎప్పుడూ మంచంలోనే పడివుంటుంది. ఎవరైనా ముద్ద కలిపి నోట్లో పెడితే తింటుంది. మల, మూత్రాలు కూడా ఇతర్లు బాగు చేయవల్సిందే!

డాక్టరు లాభం లేదని చెప్పినా, వాళ్ళు వీళ్ళు చెప్పిన ఇంటి వైద్యాలన్నింటినీ చేస్తూనే వున్నారు. ఎన్ని చేసినా మార్పేమీ రాకపోవటంతో డాక్టరు మాటనే ఖరారు చేసుకున్నారు. ఇంతలో పక్క బంగళాలో వున్న వాళ్ళను కల్సుకోవటానికి అనుభవం గల నాటువైద్యుడు ఒకతను వచ్చాడు. పక్క బంగళావాళ్ళు మరీ మరీ చెప్పటం వల్ల అతనొచ్చి సరస్వతిని చూశాడు. 'ఇది పక్షవాతం. మందులు పనిచేయవు. ప్రత్యేకమైన నూనె ఒకటి వుంది.

అదిరుద్దితే కొంత నయం అవవచ్చు. అని చెప్పి ఆ నూనెను తయారుచేసుకునే పద్ధతినీ, అవసరమైన నాటు మందుల్నీ రాసి యిచ్చాడు. మొత్తం పది, పన్నెండు అణాల ఖర్చు. తల్లీ, తండ్రి ఆ నూనెను తయారు చేసుకున్నారు. రోజూ సరస్వతి కాళ్ళకూ, చేతులకూ మాలిష్ చేసేవారు. నెలరోజుల తరువాత కాళ్ళు చేతుల్ని కదిలించింది. రెండు నెలల తరువాత మంచాలు పట్టుకుని నడవటం మొదలు పెట్టింది. నాలుగైదు నెలలు గడిచే సరికి తనంతట తాను నడవటం, తనంతట తాను తినటం ప్రారంభించింది. ఎవరి సహాయమూ లేకుండా. తనంతట తాను నడిచివెళ్ళి పక్కనే వున్న బండమీద కూర్చొని ఎండకు చలి కాగటం చూసిన క్షణాన. తల్లిదండ్రులకే కాదు ఇరుగుపొరుగు వాళ్లకు కూడా సంతోషమయింది.

మళ్ళీ వాళ్ళ జీవితం కొంత సుఖమయమయింది. కష్టాలు కొంచెం తగ్గినా సుఖమనే అనుకుంటారు వాళ్ళు. ఒక్క సంవత్సరం లోపల తాను అతిపెద్ద ప్రమాదం నుంచీ బయటపడ్డాడు. కూతురూ బతికి బయట పడి తన పని తాను చేసుకుంటోంది. ఇవి అతనికి వచ్చిన భయంకరమైన బాధలు. అయితే ఆఫీసులో కమల్‌సింగ్‌తో పాటు పని చేసే ఉద్యోగి ఒకతను ఈర్ష్యాభావంతో కమల్‌సింగ్ చాలా సంవత్సరాలుగా ఇక్కడ వుంటున్నాడు. అతణ్ణి ట్రాన్స్‌ఫర్ చేయాలి అని చెప్పారు. అధికారికీ కమల్‌సింగ్‌ను బదిలీ చేయటం కరెక్టేనని పించింది. అతడిని పక్కనున్న మరొక పట్నానికి బదిలీ చేశాడు. తన ట్రాన్స్‌ఫర్‌ని గురించి విన్నప్పుడు కమల్‌సింగ్‌కు గుండెలు గతుక్కుమన్నాయి. తను మధుపురికి వంటరిగా వచ్చాడు. ఇక్కడే తన కుటుంబమూ స్థిరపడింది. ఈ మధ్యనే అతనికి ఆరవసంతానం మగపిల్లవాడు కలిగాడు. ఆరుగురు పిల్లలు. భార్యా భర్త మొత్తం ఎనిమిదిమంది. కొత్త ప్రాంతంలో ఎలా బతకాలి? క్రింది నగరాలలో ఇలా కూరగాయలు పండించుకోవటానికి భూమి దొరకుతుందా?పశువులకు మేత దొరుకుతుందా? కట్టెలు కొనుక్కోవల్సి వస్తుందేమో! 59 రూ॥లతో ఇవన్నీ కలుపుకుని ఎనిమిది మంది ఎలా బ్రతకగలరు! ఇంద్రుడి వైభవాన్ని చూసి ఈర్ష్యపడటం సహజం. కానీ, కమల్‌సింగ్ జీవితాన్ని చూసి ఈర్ష్యపడుతున్నారంటే, ఏం అనగలం? అతను ఇప్పుడు ఏంచేయాలి? ఆఫీసులో బ్రతిమిలాడుకున్నాడు. ప్రయోజనం లేకపోయింది. పక్క బంగళాలో వుంటున్న ఒక పెద్ద మనిషికి తన కథనంతా చెప్పుకున్నాడు. ఆ పెద్దమనిషికి అతని పట్ల జాలి కలిగింది. అతను ఒక లెటరు రాసి ఇచ్చిన తనకు పరిచయమైన మున్సిపాలిటీ అధికారి దగ్గరకు పంపించాడు. కమల్‌సింగ్ ఆ జాబును తీసుకెళ్ళి ఇచ్చాడు. కానీ ఫలితం లేకపోయింది. కమల్‌సింగ్ జీవితం దయనీయమైనది. అతని పిల్లలందరూ మధుపురిలోనే పుట్టారు.

మధుపురిలోనే పెరిగారు. కింద నగరాల్లో ఎండలు ఎక్కువ. అక్కడి వడగాడ్పులకు పిల్లలు తట్టుకోలేరు. అతను పిల్లల్ని చాలా ప్రేమగా చూసుకుంటాడు. విపరీతమైన వడగాడ్పులు వుండే ఆ కొద్ది ప్రదేశంలో పిల్లల్ని ఎలా కాపాడుకుంటాడు.

కమల్‌సింగ్‌కు వెంటనే డ్యూటీలో చేరమని ఆర్డరు ఇచ్చారు. అతని కుటుంబాన్ని మరో నెలరోజుల పాటు ఆ క్వార్టరులో వుండటానికి అనుమతి ఇచ్చారు. ఆ క్వార్టరుతో మున్సిపాలిటీ అవుసరం లేదు కనుక వుండమన్నారు. లేకపోతే అన్నాళ్ళు వుండనీయరు. తన నలభై రూపాయల మేకను 20 రూ॥లకే అమ్ముకున్నాడు కమల్‌సింగ్. ఆ మేక చూడిది. అమ్మిన రెండోరోజునే మూడు పిల్లల్ని పెట్టింది. తను ఎంతో కష్టపడి సమకూర్చుకున్న వస్తువులన్నింటినీ సగానికి సగం నష్టానికి అమ్ముకున్నాడు. కట్టెపుల్లల్ని అమ్మేశాడు. గడ్డిని అమ్మేశాడు. ఇంకా అనేకమైన వస్తువుల్ని అతని దృష్టిలో విలువైన వాటినీ ఇతరుల దృష్టిలో పనికిరాని వాటినీ అమ్మేశాడు. ఆనెల అతను ప్రతి ఆదివారం వచ్చాడు. క్రమక్రమంగా తాను నిర్మించుకున్న గూటిని తన చేతుల మీదుగానే ధ్వంసం చేసుకున్నాడు. ఆ నెల అలా గడిచింది. తరువాత ఒకరోజున వాళ్ళందరూ తమ గూటివైపు అశ్రుపూరిత నయనాలతో దీనంగా చూస్తూ మధుపురిని విడిచి శాశ్వతంగా వెళ్ళిపోయారు. ఇప్పటికీ ఆ క్వార్టరూ, అతను నిర్మించుకున్న వసారా అలాగే వున్నాయి. వాటిని చూసినప్పుడు కమల్‌సింగ్ జీవితమంతా కళ్ళకు కట్టినట్టు కనుపిస్తుంది. హృదయం అవ్యక్తమైన బాధతో కుచించుకుపోతుంది.

## డోరా

"ఇంట్లో పిల్లదానికి జరం వస్తోంది. తింటానికీ ఏమీ లేదు. అమ్మగారూ! మీరూ కోప్పడుతున్నారు!" అన్నదొక స్త్రీ కన్నీళ్ళు కారుస్తూ! ఆమె స్వరం చాలా కరుణా జనకంగా వుంది. వయస్సు ముప్పైను దాటకపోయినా మనిషి చూడటానికి నలభై ఏండ్ల దానిలా వుంది. ఆమె రూపమూ, స్వరమూ ఆమె బాధామయ జీవితాన్ని తెలియపరుస్తున్నాయి.

"మొన్ననేగా నూనె తెచ్చింది? అప్పుడే అయిపోయిందా?" అని అడిగాడు ఒకతను. "క్షమించండి!" ఆమె అలాగే తలవంచుకుని అతనికి సమాధానం చెప్పింది. ఆమె కండ్ల నుండి చెంపల మీదుగా కన్నీరు ధారకట్టింది. ఇంతలో ఎముకల గూడులా వున్న ఒక పిల్లను ఒకతను చేతులమీద వేసుకుని హాస్పటల్ నుండి తీసుకువచ్చాడు. ఆ పిల్ల ఆమె మూడవ కూతురు.

★ ★ ★

ముప్పై సంవత్సరాల క్రితం నాటి మాట. అప్పటికీ, ఇప్పటికీ జీవితంలో ఎంత వ్యత్యాసం వచ్చింది. ఒక మహా యుగం గడిచి మరో మహా యుగంలోకి అడుగుపెట్టినట్టుగా వుంది. గోపాలుడు మధుపురిలో నేర్పరైన వంటవాడు. అతని వంటను ఇంగ్లీషు దొరలూ మెచ్చుకునేవారు. కనుకనే మధుపురిలోని ఇంగ్లీషువారి క్లబ్బుల్లో వంటవాడుగా వుండగలుగుతున్నాడు. జీతం నెలకు యాభై రూపాయలు ఇస్తారు. ఆనాటి యాభై రూపాయలు ఈనాటి నూటయాభై రూపాయలతో సమానం. పైన వచ్చే ఆదాయమూ బాగానే వుంటుంది. వచ్చిపోయే అతిథులందరూ బహుమానం ఇస్తుంటారు. రోజుకు రెండు మేకల మాంసం అవసరం అవుతుందక్కడ. మాంసం అమ్మే కసాయి గోపాలుడికి కొంత బహుమానం ఇస్తుంటాడు. ఇవ్వకపోతే అతని మాంసం బాగా లేదని మరొకళ్ల దగ్గర వాడుక పెట్టిస్తాడు. కూరగాయలు, సారా, చట్నీ అమ్మేవాళ్ళందరూ గోపాలుడిని తృప్తి పరచవలసిందే! గోపాలుడు దొంగ కాదు. అబద్ధీకుడూ కాదు. అసలు ఆ రోజుల్లో మధుపురి ప్రాంతంలోని స్థానిక ప్రజలు ఇప్పటికంటే నిజాయితీ పరులుగా వుండేవారు.

వంటచేసి అతనికి మామూళ్ళు అందరూ ఇస్తారు. అలా మామూళ్ళు తీసుకోవడం తప్పుగా ఎవరూ అనుకోరు. క్లబ్బు మేనేజరు ఆంగ్లో ఇండియన్ దొర. యోగ్యత, జీతం కంటే ఎక్కువ సంపాయించటం అతనికి నిషిద్ధమని తెలుసు. అయితే, అతనూ మామూళ్ళు తీసుకోవటం తప్పు అని అనుకోడు. అతనికీ మామూళ్ళు అందుతూనే వుంటాయి కదా! ఆ మామూళ్ళ ఆచారం ఒక్క ఆల్ఫ్సు క్లబ్బు వరకే పరిమితం కాదు. మధుపురిలోని క్లబ్బులన్నింటిలోనూ ఈ ఆచారం వుంది.

గోపాలుడు తెల్లని బట్టలు వేసుకుని తిరుగుతూ వుండేవాడు. మధుపురిలో పెద్ద సీజను, చిన్న సీజనూ జరుగుతాయి. ఈ రెండు సీజనుల సమయంలో మధుపురిలో అంతగా చలి వుండదు. కాకపోతే, వర్షాకాలంలో విపరీతమైన వర్షంతో పాటు ఈదురుగాలి కూడా ప్రారంభమయితే తప్పకుండా చలిపెడుతుంది. అలాంటి సమయాల్లో వేసుకోవడానికి గోపాలునికి ఉన్ని దుస్తులు వున్నాయి. మధుపురిలోని ఇతర వ్యాపార సంస్థల లాగానే ఆల్ఫ్సు క్లబ్బు కూడా మే నుండి అక్టోబరు వరకూ నడుస్తుంది. అక్టోబరు తరువాత దుకాణదారులందరూ తమ దుకాణాలకు తాళాలు వేసుకుని వెళ్ళిపోతారు. నౌకర్లు ఎవరిదారిన వారు వెళ్ళిపోతారు. అయితే, ఆల్ఫ్సు క్లబ్బులాంటివి ఒక కాపలాదారుడినీ, ఒక వంట వాడినీ చలికాలంలోనూ మధుపురిలోనే వుంచుతారు. ఈ కారణంగా, మిగతా పనివాళ్ళు సీజన్ అయిపోగానే ఉద్యోగం మాని వెళ్ళిపోతారు. గోపాలుడు మాత్రం సంవత్సరమంతా ఉద్యోగంలో వుంటాడు. అవసరం అయితే కూలీలను వెంటపెట్టుకుని బంగళాకు అవసరం అయిన మరమ్మతులు చేయిస్తుంటాడు. మధుపురిలో చలికాలంలోనే ఎక్కువగా బంగళాలకు మరమ్మతులు చేయిస్తుంటారు. బంగళాలన్నీ అద్దెకు ఇచ్చేవే! వాటిని మరమ్మత్తు చేయించాల్సిన బాధ్యత బంగళా యజమానిదే! ఫర్నీచరు కానీ, పరదాలు గానీ, పార్టీషన్‌లు కానీ – ఏవైనా బాగు చేయించవలసి వస్తే ఆ వ్యాపార సంస్థకు సంబంధించిన మేనేజరు చలికాలం ఆరునెలలూ అక్కడ వుండి బాగుచేయిస్తాడు. ఆల్ఫ్సు క్లబ్బుకు చలికాలంలో గోపాలుడే మేనేజరు. చలికాలమంతా అతనికి జీతం మాత్రమే అందుతుంది. పై ఆదాయం వుండదు. మధుపురి అచ్చంగా ఇంగ్లీషువారి నగరమే. అప్పట్లో ఇంగ్లీషువారి ప్రతాపం ఎక్కువగా వుండేది. క్లబ్బుల్లో లాగే అతిథులు రెండు, మూడు నెలలకు ముందే తమ గదిని రిజర్వు చేయించుకునేవారు. లేకపోతే గది దొరకటం కష్టం అయ్యేది. కొందరయితే ఈ సంవత్సరం సీజను గడుపుకు వెళ్ళిపోతూ, వచ్చే సంవత్సరానికి గది అడ్వాన్సు కట్టివెళ్ళిపోతారు.

గోపాలుడు కొండ గ్రామాలకు చెందిన రసపుత్రుడు, నిరక్షరాస్యుడు. కాకపోతే, అతికష్టం మీద హిందీలో సంతకం చేయగలడు. అతను గోధుమరంగు శరీరాన్ని

వస్త్రధారణను చూసి అతను నిరక్షరాస్యుడని ఎవరూ అనుకోలేదు. అతను బాల్యంలోనే ఆల్ఫ్సు క్లబ్బులో పనిచేయడం మొదలు పెట్టాడు. అతనికి మొదటి ప్రపంచ యుద్ధం రోజులు చాలా బాగా జ్ఞాపకమున్నాయి. ఆ యుద్ధం ముగియడంతో పాటే గోపాలుని అదృష్టరేఖ స్పష్టం అవసాగింది. చిన్నతనం నుండి మధుపురిలోని ఉన్నత సమాజంలో సంబంధాలుండటం వల్ల అతనూ ఆవర్గ ప్రజల్లో ఒకడయ్యాడు. నిజానికి నౌకర్లు, దాసులూ తాము ఏ వర్గానికి సేవలు చేశారో ఆ వర్గ లక్షణాలను అలవరచుకుంటారు. గోపాలుడు చిన్నవాడుగా వున్నప్పుడు ఆల్ఫ్సు క్లబ్బు హోటల్లోనే పని చేస్తుండేవాడు. క్రమంగా ఆ హోటలు వంటవాడితో గోపాలుని పరిచయం అయింది. ఆ హోటలు వంటవాడికి గోపాలుని వయస్సు వున్న కూతురు ఒకతి వుంది. గోపాలుడు హిందువు. వంట అతను క్రిస్టియన్. క్రిస్టియన్ అయినా అతను ఆ చుట్టుపక్కల గ్రామాలకు చెందినవాడే. చివరకు గోపాలుడు ఆ వంటవాని కూతురుని పెండ్లాడటానికి తానూ క్రిస్టియన్ అయ్యాడు. మతం మారినా పేరు మారలేదు. గోపాలుడిగానే వుండిపోయాడు. ఆమె తల్లిదండ్రులకు ఒకతే కూతురు. గోపాలుడి మామకు ఒకటే కోర్కెవుండేది. ఎట్లాగయినా తన తరువాత అల్లుడు తన స్థానానికి వస్తేచాలు. అతను తెల్లదొరలు తినే పదార్థాల్ని ఎలా చెయ్యాల్నో జాగ్రత్తగా అల్లుడికి నేర్పించాడు. పెళ్ళయిన రెండు మూడు సంవత్సరాలకే గోపాలుడు మామ దగ్గర అసిస్టెంటు వంటవాడయ్యాడు. మరో రెండు సంవత్సరాల తరువాత మామ చనిపోయాడు. గోపాలుడు ప్రధాన వంట వాడయ్యాడు. అత్త ఆ తరువాత చాలా సంవత్సరాల వరకూ బతికింది.

ఇప్పుడు గోపాలుడు ఆల్ఫ్సు క్లబ్బులో ప్రధాన వంటవాడయ్యాడు. భార్య మొదటి సంతానంగా కూతుర్ని కన్నది. ఆ తరువాత కలిగిన సంతానం చనిపోయారు. మొదటి కూతురు మాత్రమే బతికింది. అందుకే ఆ అమ్మాయి అంటే గోపాలుడికి విపరీతమైన ప్రేమ. తనూ భార్య చర్చికి వెళ్ళేప్పుడు కూతుర్ని కూడా తీసుకువెళ్ళేవాడు. చర్చి ఫాదర్ భార్యపేరు బహుశా 'డరోతి' అయి వుంటుంది. గోపాలుడు తన కూతురుకి 'డరోతి' అని పేరు పెట్టాడు. కానీ, భారతీయులకు ఆ పేరు అర్థం కాలేదు. ఫాదరీ భార్య ఆ అమ్మాయిని ప్రేమతో 'డోరా' అని పిలవటం ప్రారంభించింది. 'డోరా' (అంటే నూలుపోగు) అని అర్థం. ఆ పేరులో ప్రజలకు ఒక అర్థమూ కనిపించింది.

## 2

డోరా ఆ కుటుంబానికి ఒక్కగాని ఒక్క సంతానం. తల్లీ, తండ్రీ అమ్మమ్మా నెత్తిన పెట్టుకుని చూసుకునేవారు. ఆ అమ్మాయిని గారాబంగా పెంచారు. వాళ్ళ గారాబానికి

తగినట్టుగా డోరా ముద్దుగా, అందంగా వుండేది. ఎందుకు అందంగా వుండదు? తండ్రి రసపుత్రుడు ఖస్ (శక) జాతికి చెందినవాడు. తల్లీ ఆ జాతికే చెందినది కావటం వల్ల మంచి శరీరఛాయతో చూడముచ్చటగా వుండేది. కొనదేలిన ముక్కు, పొడవైన ముఖం, అందమైన కండ్లు, గోపాలుడు అల్ఫ్సిక్లబ్ హోటలుకు ప్రధాన వంటవాడు. లక్ష్మీదేవి అతని ఇంట్లో తిష్ట వేసినట్టుగా వుంది. రెండు సీజన్లలోనూ కుటుంబ ఖర్చులు పోగా వెయ్యిరూపాయల దాకా పై ఆదాయం సంపాయించేవాడు. చలికాలం మామూలు జీతం ఎలాగూ వస్తుంది. గోపాలుడు తన కూతుర్ని అల్లారుముద్దుగా పెంచుకున్నాడు. డోరాకు ఆరవ ఏడు వచ్చాక క్రొత్త ఫాదరీ బడికి పంపించమని బలవంతం చేశాడు. గోపాలుడు ఫాదరీల బడికి పంపించడం ప్రారంభించాడు. మధుపురిలో 3 ఏళ్ళ నుండి టీనేజర్సు వరకూ చదువు కోవటానికి సౌకర్యం గల ఇంగ్లీషు కాన్వెంటులు చాలా వున్నాయి. స్కూళ్లూ వున్నాయి. ఆ స్కూళ్ళల్లో, కాన్వెంట్‌లలో మొత్తం భారతదేశం నుండి ఆంగ్ల బాలబాలికలు వచ్చి చదువుకుంటూ వుంటారు. ఇప్పుడిప్పుడే తెల్లదొరలు సంతానానికే కాకుండా నల్లదొరల సంతానానికీ ఆ స్కూళ్ళల్లోనూ, కాన్వెంట్లలోనూ చదువుకోవటానికి అనుమతినిచ్చారు. ఆ విద్యాసంస్థల్లో చదువుకోవటమంటే చాలా ఖర్చుతో పని. తెల్ల దొరల తరువాత అంత ఖర్చు పెట్టగలవాళ్ళు నల్లదొరలే! సాధారణ ప్రజలు అంత ఖర్చు ఎలా భరించగలుగుతారు? నల్లదొరల పిల్లలు కొందరు ఆ కాన్వెంట్లల్లో చదువుతున్నారు. అయితే, తమ పిల్లల్ని మధుపురి కాన్వెంట్లలో చదివిస్తున్న నల్లదొరలు ఎవరూ క్రిస్టియన్లు కారు? గోపాలుడు క్రీస్టియన్ అయినా అతని కుటుంబము ఉన్నత వర్గంలో చేరదు. కారణం అతను వంటవాడు. అతడి ఆదాయమూ ఆదర్శమూ దానికి తగినట్టుగానే వున్నాయి. 'డోరా' అతని మొదటి సంతానం అన్నమాట నిజమే! కానీ, ఆ సంతానమే పురుష సంతానమయినట్లయితే, చదివించాలన్న తాపత్రయం ఇప్పటికంటే ఇంకా ఎక్కువగా వుండేది గోపాలుడికి. ఏమైనా కానీ, తన కూతుర్ని కాన్వెంటుకు పంపకుండా మామూలు క్రిస్టియన్ స్కూలుకు పంపుతున్నాడు గోపాలుడు. అయితే, ఇంట్లో ఆ పిల్ల చదువుకు తగిన వాతావరణమూ లేదు. అంత కష్టపడి చదవటం ఆ పిల్లకు ఇష్టమూ లేదు. తల్లీ, అమ్మమ్మా కూడా చదివితే, చదివింది లేకపోతే లేదు అన్నట్టు ఊరుకునేవారు. మొదటి సంవత్సరం డోరా ప్రతిరోజూ స్కూలుకు వెళ్ళింది. రెండో సంవత్సరంలో ఒకరోజు వెళితే రెండు రోజులు మానుకునేది. ఇరుగు పొరుగు ఆడపిల్లల్తో ఆడుకుంటూ వుండేది. ఇంట్లో వాళ్ళు పట్టించుకునే వారు కాదు. 'డోరా'కు పది సంవత్సరాలు వచ్చేసరికి ఇంక ఆమెకు చదువు అనవసరం అన్న నిర్ణయానికి వచ్చారు. నిజానికి ఆ అమ్మాయికి చదువుకోవాలన్న కోరిక గానీ అవుసరం గానీ లేదు.

డోరా ప్రతి ఆదివారమూ తల్లిదండ్రులతో, అమ్మమ్మతో కలిసి చర్చికి వెళుతుండేది. మధుపురిలోని క్రిస్టియన్లు దేవుడూ రంగు భేదాల్ని పాటిస్తారు. మధుపురిలో కొన్ని రోడ్లు కేవలం ఇంగ్లీషువాళ్ళు నడవటానికి మాత్రమే నిర్ణయించబడినాయి. సాధారణ భారతీయుడు ఆ రోడ్లపై నడవనే నడవడు. అయితే, ఆ రోడ్లల్లో నల్లదొరలు నడిచినా, చీవాట్లు – చెప్పు దెబ్బలు తప్పవు. రోడ్లమీద, హోటళ్ళల్లో, క్లబ్బుల్లో ఎక్కడ చూసినా రంగు బేధం ప్రధానంగా కనిపిస్తుంది. ఆల్ఫ్సు క్లబ్ మెంబరుగా భారతీయుడుఎవరూ వుండటానికి వీల్లేదు. ఆ హోటల్లో భారతీయులకు గది ఇచ్చేవారు కాదు. ఆల్ఫ్సుక్లబ్బుల్లో భారతీయ క్రిస్టియన్లయిన వంటవాళ్ళనూ, ఇతర పనివాళ్ళనూ తప్ప మరో భారతీయుణ్ణి చూడలేము. ఆల్ఫ్సు క్లబ్బు పనివాళ్ళల్లో కొందరు ఆంగ్లో ఇండియన్లు కూడా వున్నారు. అయితే తమ శరీరపు రంగుతో కల్సిపోయేంత తెల్లగా వున్న ఆంగ్లో ఇండియన్లని, తమతోపాటు ప్రార్థనకు అంగీకరించేవారు ఇంగ్లీషువారు. ఆ రంగులేని వాళ్ళు క్రిస్టియన్లు అయినా కలిసి ప్రార్థించటానికి అనుమతి వుండదు. రంగుదే కాకుండా భాషా పెద్ద సమస్య. తెల్లవాళ్ళ దేవుడు ఇంగ్లీషులోనే పాటల్నీ, ప్రార్థనలనూ అర్థం చేసుకుంటాడు. దేశీయ క్రిస్టియన్లు దేవుడు దేశీయుల భాషలోనే అర్థం చేసుకుంటాడు. కనుకనే గోపాలుడు. అతని కుటుంబమూ హిందీలో ప్రార్థన జరిగే చర్చకు వెళతారు. హిందీలో ప్రార్థనలు జరిగే చర్చీలు మధుపురి మొత్తంలో ఒకటో రెండో వున్నాయి. ఎంతో భక్తి భావన వుంటే కానీ మధుపురిలోని ఇటు చివర్న వున్న నల్లవారి చర్చికి అటు చివర్న వున్న నల్లవాళ్ళు రారు. హిందీలో ప్రార్థన జరిగే చర్చి ఆల్ఫ్సు క్లబ్బుకు దగ్గరలోనే వుంది. పైగా వాళ్ళకు క్రీస్తు పట్ల భక్తీ ఎక్కువగానే వుంది. ప్రతి ఆదివారం హిందీలో ప్రార్థనలు జరిగే చర్చికి ఆ కుటుంబం హాజరవుతూ వుంటుంది.

డోరా స్కూలుకు వెళ్ళనని మారాం చేసినా చర్చికి వెళ్ళడానికి చాలా ఉత్సాహంగా తయారయ్యేది. ఆదివారంనాడు తెల్లవారుజామునే నిద్ర లేచేది. చక్కగా అలంకరించుకుని, తల దువ్వుకుని, ఎర్ర రిబ్బన్లతో జడలు వేసుకునేది. ముఖానికీ, కాళ్ళకూ, చేతులకూ పౌడరు రాసుకునేది. కాళ్ళకు బూట్లు వేసుకునేది. వాటిని ప్రత్యేకం ఆదివారం చర్చికి వెళ్ళేటప్పుడు మాత్రమే వేసుకునేది. డోరా తల్లికీ, అమ్మమ్మకూ ఆధునికమైన అలంకరణలు అంతగా తెలియవు. క్లబ్బులోకి వస్తుండే దొరసానులూ, వారి పిల్లలూ ఎలా అలంకరించు కుంటారో కూడా వాళ్లకు తెలియదు.

దొరసాన్లు తమ పిల్లల పెంపకం కోసం ఆయాల్ని పెట్టుకుంటూ వుంటారు. సాధారణంగా ఆయాలు నల్లవాళ్లే వుంటారు. అయితే, బాగా ఇంగ్లీషు వచ్చిన నల్లవాళ్ళనే ఆయాలుగా పనికి పెట్టుకుంటారు. ఇంగ్లీషు వచ్చిన వాళ్ళయితే తమ పిల్లలతో ఇంగ్లీషులోనే

మాట్లాడతారు. లేకపోతే, దేశ భాషలలో మాట్లాడటానికి ప్రయత్నిస్తారు. అలా నల్లవాళ్ళ భావాలూ, భాషా వాటి తాలూకు ప్రభావం తమ పిల్లలమీద పడుతుందని ఇంగ్లీషు దొరసానుల భయం. ఆంగ్లో ఇండియన్లనూ ఆయాలుగా పనికి పెట్టుకోవచ్చు కానీ వాళ్ళకు చాలా జీతం ఇవ్వాలి. సాధారణ దొరలూ, దొరసాన్లూ ఆంగ్లో ఇండియన్లను భరించలేరు. గోపాలుడు తన భార్యను ఆయాగా దొరసాన్ల దగ్గర పనికి కుదర్చాలని అనుకోలేదు. చుట్టుపక్కల పిల్లలు ఎలా అలంకరించుకుంటారో చూసి అలాగే డోరాను అలంకరించేవారు డోరా తల్లీ, అమ్మమ్మ! డోరా గొంతులో స్వరమాధుర్యం వుంది. చర్చిలో ప్రార్థనాగీతాల్ని పాడుతుండేది. స్థానికుల్ని క్రీస్తుమతంలోకి మార్చే పని ఇంగ్లీషు ఫాదరీలు చేస్తుంటారు. వాళ్ళకు భారతీయుల సంగీతం అంతగా నచ్చదు. ఒక్క సంగీతమే కాదు పేర్లూ నచ్చవు. అప్పటి ఫాదరీ ఏ కారణం వల్లనో గోపాలుడి మీద దయ చూపాడు. లేకపోతే అతడి పేరును డేవిడ్‌గానో, జేమ్స్‌గానో మార్చేసేవాడు. చర్చిలో 'ఈసుమసీ మేరే ప్రాణ్ బచైయా (ఏసయ్యా! నా ప్రాణాల్ని రక్షించు) అన్న పాటను పాడేవారు. అయితే ఆ పాటపాడేపద్ధతిని బట్టి అది హిందీపాట అని ఎవరూ అనుకోలేరు. ఫాదరీ గారి భార్య స్వరం కలిపి పాడబోతోంది కానీ సాధ్యపడదు. హిందీ పాట పాడలేని ఆమె అసమర్థతను చర్చి పియానో కప్పిపుచ్చుతుంది. ఇంతకూ చెప్పవచ్చేదేమిటంటే 'ఈసూ మసీ మేరే ప్రాణ్ బచైయా!' అన్న హిందీ పాట అచ్చం ఇంగ్లీషు పాటలాగా తయారయింది. డోరా మధురమైన కంఠంతో, ఇంగ్లీషు వాళ్ళ స్వరంతో ఆ పాట పాడుతుంది. చర్చికి వచ్చిన వారందరూ డోరా పాటను మెచ్చుకునేవారు. హిందీ పాటను ఖూనీ చేస్తున్నామనీ కానీ, భారతీయ సంగీతాన్ని అవమాన పరుస్తున్నామని గానీ డోరాకు ఏం తెల్సు?

## 3

డోరాకు పదహారేళ్ళు వచ్చాయి. సహజంగానే అందమైనది. ఈ వయస్సు గొప్పతనాన్ని గురించి అనుభవజ్ఞులు ఇలా అన్నారు. – " ప్రాప్తేతు షోడనే వర్షే గర్దభీ హ్యాప్స రాయతే!"

రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమయి మూడేళ్ళయింది. యుద్ధం మధుపురిని ధనంతో నింపిపోయింది. మామూలుగా నయితే సీజన్ సమయంలో దొరలూ, దొరసానులూ, ఎటూ వచ్చేవారు. వీళ్ళే కాకుండా సైనికులు పెద్ద సంఖ్యలో వచ్చేవారు. కొంతమంది సంవత్సరమంతా మధుపురిలోనే వుండిపోయేవారు. ఆల్ఫ్స్ క్లబ్ అదృష్టం పండింది. దాంతో పాటు గోపాలుడి ఆదాయం కూడా పెరిగింది. అతని కుటుంబం సుఖ సంపదలతో తులతూగిపోతోంది. పన్నెండేళ్ళు దాటగానే డోరాను స్కూలు మాన్పించాడు తండ్రి. నాలుగయిదు సంవత్సరాలు చదివినా మూడవ క్లాసు కూడా పాస్

కాలేకపోయింది. చదువుకోవాలని ఎంతమాత్రమూ ఇష్టం లేదు డోరాకు. అమ్మమ్మ రెండు సంవత్సరాల క్రితమే చనిపోయింది. డోరా తల్లి దండ్రులు జీవితమంతా ఇలాగే గడచిపో తుందనుకున్నారు. కూతురు మూడో క్లాసు వరకూ చదువుకుంది.

గోపాలుడు క్రిస్టియను మతం పుచ్చుకున్నా అతనిలో వెనుకటి భావాలు సంస్కారము అలాగే వున్నాయి. అతనిని ఎవరైనా నిమ్నజాతికి చెందినవాడని అంటే కొట్లాటకు దిగేవాడు. రసపుత్రుల్లో సహజంగా వుండే జాతీయాభిమానం అలాగే వున్నది. యుద్ధసమయం కావడం వల్ల ఇంగ్లీషు సైనికులు మధుపురికి ప్రవాహంలా వస్తున్నారు. రోడ్ల మీద ఎక్కడ చూసిన వాళ్ళే. అలాంటప్పుడు వయస్సు వచ్చిన కూతుర్ని బయటకు పంపటం కరెక్టు కాదని అనుకున్నాడు గోపాలుడు. ఆ రోజుల్లో ఆంగ్లో ఇండియన్ తల్లిదండ్రులు తమ కూతుళ్ళను మధ్యవర్తి సహకారంతో భర్తల్ని వెతుక్కోవటానికి పంపించేవారు. 'అదృష్టం కలిసి వచ్చి ఏ అమెరికన్ సైనికుడో కుదిరితే, డబ్బుకు డబ్బు వస్తుంది. కూతురు గొప్పజాతికి చెందినది అవుతుంది! అనుకునేవారు ఆంగ్లోఇండియన్ తల్లిదండ్రులు. కానీ గోపాలుడు తన కూతుర్ని బయటకు పంపించటానికి భయపడుతుండేవాడు. బయటకు పంపించాలని ఎన్నడూ అనుకోలేదు. కూతురికి పెళ్ళి చేయాలని తొందరపడ్డాడు.

త్వరపడి చేసిన పని విధం చెడుతుందంటారు. త్వరపడితే డోరాకు తగిన వరుడు దొరకటం కష్టం. మెట్రిక్ దాకా చదువుకున్న చక్కని క్రిస్టియన్ యువకులు మధుపురిలో చాలా మంది వున్నారు. అయితే, వాళ్ళెవరూ డోరాను వివాహమాడటానికి సిద్ధంగా వుండరు. చదువులేని ఒక వంటవాడి కూతుర్ని వివాహమాడతారా? ఆ సంవత్సరం గోపాలుడు మిత్రుల సహాయంతో మధుపురిలోని తమ వర్గానికి చెందిన యువకుల్ని అందర్నీ విచారించాడు. చివరకు గోవాకు చెందిన క్రిస్టియన్ యువకుడు దొరికాడు. గోపాలుడు ముందుగానే అతనికి సంబంధించిన అన్ని విషయాలనూ కనుక్కున్నట్లయితే కాబోయే అల్లుడు గురించి చాలా విషయాలూ తెలిసేవి. కానీ, అతను త్వరగా పెళ్ళి చెయ్యాలన్న ఆత్రంలో వున్నాడు కదా! మంచిచెడ్డల్ని విచారించుకుంటే ఈ యువకుడు చెయ్యిదాటిపోతాడేమో, కూతురికి ఈ సంవత్సరము పెళ్ళి కాదేమోనన్న భయం పట్టుకుంది గోపాలునికి. తమ ఆల్ఫ్సు క్లబ్ కాపలాదారుని కూతురు ఒకామె పట్ల ఈ మధ్యనే అవాంఛనీయమైన సంఘటనలు జరిగాయి. ఈ అమ్మాయి ఒక అమెరికన్ సైనికుడి వలన సర్వనాశనం అయింది. అలాంటిది తన కూతురిపట్ల ఎక్కడ జరుగుతుందోనని భయపడుతున్నాడు.

గోపాలుడు కాబోయే గోవా అల్లుణ్ణి చూసి వచ్చాడు. అతను గోపాలుడికి నచ్చాడు. కానీ, పెళ్ళికి సిద్ధమయ్యే సరికి ఒక సమస్య వచ్చి పడింది. అల్లుడు రోమన్ కాథలిక్

శాఖకు చెందినవాడు. డోరా తల్లిదండ్రులు ప్రొటెస్టెంట్ సాంప్రదాయ అనుయాయులు. రోమన్ కాథలిక్ శాఖకు చెందిన వాళ్ళు వేరే శాఖకు చెందిన వాళ్ళను వివాహమాడాలంటే వాళ్ళు రోమన్ కాథలిక్ శాఖను ఆశ్రయించాలి. అప్పుడు కానీ వివాహం జరగదు. అంటే డోరా తన సాంప్రదాయాల్ని మార్చుకోవాలన్న మాట. పెళ్ళికొడుకు డోరాను రోమన్ కాథలిక్ సాంప్రదాయంలోకి మార్చమని అంతగా పట్టుబట్టలేదు కానీ అతని బాబాయి ఒకతను మార్చితే కానీ వివాహం జరగటానికి వీల్లేదని గట్టిగా పట్టుబట్టాడు. గోపాలుడు అందుకూ సిద్ధమయ్యాడు. అతనికి అభ్యంతరం ఏమీ లేదు. మొదట క్రిస్టియన్ మతాన్ని స్వీకరించేటప్పుడు కొంత ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బంధువులందరి తోటి సంబంధాలను తెంపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బంధువులతో సంబంధాల్ని తెంపుకుని ఒక క్రిస్టియన్ అయ్యాక ఇక శాఖ మార్చుకోవటం సమస్యే కాదు.

డోరా పెళ్ళి రోమన్ కాథలిక్ చర్చిలో జరిగింది. ఆ చర్చిలో ఉదయం పూట తెల్లదొరలూ – దొరసాన్లూ దేవుణ్ణి ప్రార్థిస్తూ వుంటారు. సాయంత్రంపూట నల్లవాళ్లు ప్రార్థన చేస్తూ వుంటారు. కూతురు పెళ్ళిరోజున గోపాలుడు మనస్ఫూర్తిగా ఖర్చుపెట్టాడు. తమ వర్గానికి చెందిన దేశీయ క్రిస్టియన్ మహిళ నౌకామెను ఏర్పాటు చేశాడు. ఒకప్పుడు ఫాదరీలు భారతీయ క్రిస్టియన్లు పేర్లను మాత్రమే కాకుండా వేషంలోనూ పూర్తి మార్పులు తీసుకువచ్చేవారు. భారతీయ క్రిష్టియన్ స్త్రీలు దొరసానులను అనుకరించి తాము గౌన్లు వేసుకునేవారు. ఇప్పుడలా కాదు. క్రిస్టియన్ స్త్రీలు అన్య భారతీయ స్త్రీలలా చీర కట్టుకుంటున్నారు. డోరా ఖరీదైన సిల్కు చీర కట్టుకుంది. తెల్లని బూటు వేసుకుంది. తలమీద సన్నని బట్టను కప్పుకొంది. చలికాలం కావటం వల్ల మధుపురిలో గులాబీలు దొరకవు. క్రింది గ్రామాల నుండి గులాబీలను తెప్పించారు. డోరా తన రెండు చేతులతోనూ రెండు గులాబీ పూలగుత్తులను పట్టుకుంది. వివాహం రోజున గోపాలుని మిత్రులు, హితులూ అందరూ చర్చికి వచ్చారు. సహజంగానే డోరా అందగత్తె. ఆరోజు సౌందర్య దేవతలా భాసిల్లింది. తెల్లని దుస్తులు నల్లవాళ్ళను మరీ నలుపెక్కిస్తాయి. ఎర్రవాళ్ళను మరీ ఎరుపెక్కిస్తాయి. డోరా ఎర్రని శరీరం ఛాయ గలది. ప్రత్యేకం ఏ 'రూస్' రాసుకోకుండానే ఆమె బుగ్గలు ఉషాలాలిత్యాన్ని స్ఫురణకు తెస్తుంటాయి. చర్చికి వచ్చిన యువకుల్లో, చదువు సంధ్యలు ఎక్కువగాలేని కారణాన గతంలో డోరాను వివాహ మాడటానికి తిరస్కరించిన యువకుడు కూడా వున్నాడు. అతను ఈరోజు డోరాను చూసి పశ్చాత్తాప పడుతున్నాడు. పెళ్ళికొడుకు నల్లవాడు కాకపోయిన అందమైన వాడని అనలేము. అందగత్తెను గాడిదకిచ్చి పెళ్ళి చేసినట్లుగా వుందనేది అందరి అభిప్రాయము. పెళ్ళి కొడుకు ఒకవేళ హిందువు అయి వుంటే ఇంత అందమైన భార్య దొరకటం తన పూర్వజన్మ

సుకృతమనేవాడే! క్రిష్టియన్లు పూర్వజన్మను నమ్మరు కానీ యూదులు, ముస్లిములు లాగా మంచి చెడ్డలన్నింటినీ భగవంతుని మహిమగా చెప్తుంటారు. పెళ్ళి తర్వాత గోపాలుడు విందు ఇచ్చాడు. విందులో తమ వాళ్ళకు ఇచ్చేవన్నింటినీ హితులకూ, మిత్రులకు కూడా ఇచ్చాడు. సీజన్ ముగిసింది. కానీ క్లబ్ చలికాలంలో కూడా నిండిపోయే వుంది. చాలామంది సైనికాధికారులు ఆ క్లబ్బులో దిగారు. అందుకని గోపాలుడికి ఖర్చు అవుతుందేమోనన్న భయం లేదు. మంచి మందు అతిథులకు ఏర్పాటు చేశాడు. క్లబ్బు మేనేజరు ఆంగ్లో ఇండియను. అతను ఇంగ్లీషువాళ్ళకు అంటరాని వాడయినా నల్లని క్రిస్టియన్లు, వంటవాళ్ళతో కలిసేవాడు కాదు. అతనికి, అతని భార్యకు గోపాలుడు వేరుగా వంట ఏర్పాటు చేశాడు. కొంతమంది క్రిస్టియన్ యువకులు విందు ఇంకా బాగుండటానికి గాన సభ అవుసరం అనుకున్నారు. కానీ, డాన్స్ చేయటాన్ని ఇంకా వీళ్ళ వర్గంలో ప్రచారంలో లేదు. పాటలు కూడా ఈసూ మసీ మేరే ప్రాణ్ బచైయా" అనే ట్యూన్‌లోనే సంతృప్తి పడవలసి వస్తుంది.

తన అల్లుడి పినతండ్రి (బాబాయి) పనిచేసే హోటలు చలికాలంలో మూత పడుతుంది. చలి ముదరగానే ఆ హోటల్లోని పనివాళ్లందరూ తమ తమ గ్రామాలకు వెళ్ళిపోయారు. పినతండ్రి కొడుకును, కోడల్ని కూడా తీసుకువెళతానన్నాడు. అయితే, గోపాలుడు కూతుర్ని పంపనన్నాడు. అల్లుణ్ణి కూడా తన దగ్గరే వుండి పొమ్మన్నాడు. తను ఎలా అయితే మామ స్థానాన్ని ఆక్రమించుకున్నాడో, తన అల్లుడు కూడా తన స్థానాన్ని ఆక్రమించుకోవాలనేది గోపాలుని అభిప్రాయం అయి వుండవచ్చును. అల్లుడు దూరంగా వుంటే మరి కొన్నాళ్ళ పాటు అతని చెడు వ్యసనాలు మామకు తెలియకుండా వుండేవి. కానీ, ఇప్పుడు ఇంట్లోనే అతను వుంటే తెలియకుండా ఎలా వుంటుంది? అల్లుడు మంచి తాగుబోతు. మామ రోజూ కొద్దిగా సారాయి తెచ్చి ఇస్తుంటాడు. అది అతనికి చాలదు. బాటిళ్ళకు బాటిళ్లు విస్కీ, షాంపైన్ తాగేస్తానని చెప్పాడు కానీ అది అంత నిజం కాదు. అంత ఖరీదైన మందును అతను ఎక్కడ నుంచి తెచ్చుకుని తాగగలడు? ఆ ఖరీదైనది అతనికి ఏం సరిపోతుంది? అతనికి నాటుసారా కావాలి. ఇంట్లో భార్యను కొట్టో, తిట్టో డబ్బులు తీసుకుని మధుపురికి అటు చివరకు వెళ్ళేవాడు. అక్కడ కొండ గ్రామాల నుండి తెచ్చిన కాపు సారాయి అమ్ముడవుతూ వుంటుంది. దాన్ని తాగేవాడు. చాలా పొద్దుపోయాక సారా నిషాలో ఒళ్ళు తెలియని స్థితిలో, ఒకటి రెండుచోట్ల క్రిందపడి ఇంటికి చేరుకుంటాడు. అతను ఇంటికి వచ్చిన దగ్గరనుండి ఒక తుఫాను ప్రారంభం అవుతుంది. పెళ్ళాన్ని అకారణంగా కొడతాడు. తిడతాడు. అత్తమామలు అతని బాధ పడలేకుండా వున్నారు. ఇది ఎప్పుడో ఒకరోజు విషయంకాదు. వారంలో దాదాపు నాలుగయిదు రోజులు వుంటుంది. గోపాలుడు కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నాడు. కూతురికి తనే ఉరిత్రాడు తెచ్చిపెట్టినట్ట

యింది. డోరా సరీగా రెండు వారాలు కూడా పెళ్ళి సంతోషాన్ని అనుభవించలేదు.

గోపాలుడు వుండే క్వార్టరు క్లబ్బు గదులకు దగ్గరలోనే వుంటుంది. గదుల్లో దొరలు నిద్రపోయే సమయమూ, అల్లుడు తాగి వచ్చి కూతుర్ని కొట్టే, తిట్టే సమయమూ ఒకటే అయింది. ఈ గొడవకు దొరలకు నిద్రాభంగం ఎక్కడ కలుగుతుందోనని గోపాలుడు భయపడుతుండేవాడు. అందుకని అల్లుడు ఇంటికి రాగానే అతని అరుపులు బయటకు వినపడకుండా తలుపులన్నీ బిగించి వేసేవాడు. ఒళ్ళు తెలియని స్థితిలో అల్లుడు వుండేవాడు. అలాంటి స్థితిలో అతని మీద కోపగించుకోవటం ఇంకా అనర్థాలకు దారి తీస్తుందేమోనని సంకోచిస్తూ వుండేవాడు. గోపాలుడు మైకంలో లేనప్పుడు అల్లుణ్ణి మంచిగా దగ్గరకు పిలిచి ఇలా వుండటం తగదని చెప్దామనుకునే వాడు. చెప్పేవాడు. కానీ మామ మంచితనం చూసిన కొద్దీ అల్లుడు కొమ్మెక్కి కూర్చునేవాడు. అతడిని అనునయించటానికి మామ మరికొంత డబ్బును ఇస్తుండేవాడు.

గోపాలుడు ఏనాడో మహాపాపం చేసుకున్నాడు. లేకపోతే అలాంటి అల్లుడు దొరకడు. ఒక్కోసారి అతను తెగత్రాగి ఒళ్ళు తెలియక రోడ్లమీద పడిపోతూ వుండేవాడు. ఎవరైనా తెలిసినవాళ్ళు చూసి ఇంటికి పంపిస్తే సరి, లేకపోతే నిషా తగ్గేవరకూ అలాగే ఏ సైడు కాలువలోనో పడివుండి నిషా తగ్గాక అర్థరాత్రికి ఇల్లు చేరుకునేవాడు. వాడు అలాగే పడి చనిపోతే బాగుండునని లేకపోతే ఏ చిరుతపులో ఎత్తుకుపోయినా బాగుండునని అనుకునేవాడు గోపాలుడు. కానీ చిరుతపులులు చాలా తెలివైనవి. అవి అతణ్ణి ఎత్తుకు వెళ్ళవు. మానవులతో శత్రుత్వాన్ని పెంచుకుంటే పరిణామం ఏం జరుగుతుందో వాటికి తెల్సు. అత్తమామలు వంగిన కొద్దీ వంచుతున్నాడు అల్లుడు. "నా క్వార్టరు క్లబ్బుకు కొంచెం దూరంగా వుంటే వీని సంగతి తేల్చేవాడిని" అని అనుకునేవాడు గోపాలుడు.

మార్చి వచ్చింది. చలి కొంచెం తగ్గింది. మధుపురిలో కాలాల గురించి కరెక్టుగా చెప్పలేము. రెండు, మూడు రోజులు ముసురుపట్టి వర్షం కురిస్తే తప్పకుండా మంచుగడ్డలు పడతాయి. చలి పెరుగుతుంది. మధుపురిలోని స్థానికులు వసంత ఋతువు వచ్చిందంటే, ఆనందపడతారు. మైదాన ప్రాంత ప్రజలకంటే, చాలా ఉత్సాహంగా వసంత ఋతువు వేడుకల్ని చేసుకుంటారు. కానీ గోపాలుడి కుటుంబానికి వసంత ఋతువు ఆనందోత్సవం రాలేదు. ఆ కుటుంబంలో ఆనందం అల్లుడు అడుగుపెట్టిన రోజునే అంతమయింది.

## 4

1947వ సంవత్సరం ఆగస్టు నెల వచ్చింది. ఇంగ్లీషు వాళ్ళు భారతదేశాన్ని విడిచి శాశ్వతంగా వెళ్ళిపోయారు. మధుపురి విధవరాలయింది. వైధవ్యాన్ని ప్రామాణీకరించటా

నికేనా అన్నట్టు ఆ సంవత్సరం ఆగస్టు నెలలో మధుపురిలో అనేకమైన మార్పులు జరిగాయి. భారతదేశం విభజించక ముందు లాహోరులోని ధనికులూ, పశ్చిమ పంజాబుకు చెందిన ఇంకా అనేక నగరాలలోని ధనికులు మధుపురికి వచ్చి వుండేవారు. రోజూ రేడియో చెవి దగ్గర పెట్టుకుని వింటుండేవారు. లాహోరు ఎటువైపుకు అయిందోనని మధుపురిలోని పశ్చిమ పంజాబుకు చెందిన ధనికులు ఆదుర్దా పడుతుండేవారు. అయితే, లాహోరు పాకిస్తాన్‌కే వెళ్ళిపోతుందని అనుకునేవారు. అందులో సందేహము లేదు. ఎందుకంటే లాహోరు చుట్టుపక్కల గ్రామాలలో ముస్లిం జనాభా ఎక్కువ. ఒకవేళ లాహోరులో హిందూ జనాభా ఎక్కువే వున్నా, చుట్టూ పాకిస్తాన్‌ను ఏర్పాటు చేసి మధ్యలో లాహోరును మాత్రం భారతదేశంలో వుంచటానికి ఇంగ్లీషు వాళ్లు ఒప్పుకుంటారా? హిందువులు భారతదేశాన్ని విడిచిపెట్టమని ఇంగ్లీషు వాళ్ళను బాధపెట్టారనో, ముస్లిములు స్వాతంత్ర్యం కోసం పోరాడలేదనో ఇంగ్లీషువాళ్ళు ముస్లింలకు లాహోరును ఇచ్చేస్తారనుకోవటం సరికాదు. ఇంగ్లీషువాడు హిందువులను హింసించటంలో ఇంకేమైనా కొరతవున్నదేమో. దాన్ని కాస్తా పూర్తి చేద్దామనుకున్నాడు. అటువంటప్పుడు మధుపురిలోని కోటీశ్వరులైన హిందువులు రాయ్‌బహద్దూర్‌లూ, రాయ్‌సాహెబ్‌లూ తమకు ప్రభువైన ఇంగ్లీషువాడు దయతలచి లాహోరును తమకే వుంచుతాడనుకోవటం దురాశ కాదా? లాహోరు పాకిస్తాన్‌లో పోవటంతో పాటు పంజాబులో హిందువుల రక్తంతో వసంతోత్సవాల్ని జరుపుకుంటు న్నారన్న అత్యుక్తితో కూడిన వార్తలు పత్రికల్లో వస్తున్నాయి. మధుపురిలోని పంజాబీలకు రక్తం ఉప్పొంగసాగింది. మధుపురిలో వున్న పది మంది ముస్లిములనయినా చంపి తమ రక్తపు పొంగును తగ్గించుకుందామనుకున్నారు.

ఇంగ్లీషు వాళ్ళు మధుపురిలోని తమ స్థిరాస్థులను విడిచిపెట్టి వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళాక గోపాలుడు ఆల్ఫ్స్ క్లబ్బుకు వంటవాడిగానే వున్నాడు. మధుపురి ఇంగ్లీషు వాళ్ళ చేతుల్లో వున్నప్పుడు ఆంగ్ల దొరలు విపరీతంగా వచ్చేవారు ఆ క్లబ్బుకు! ఇప్పుడా దొరలు రావటం లేదు. ఆదాయం లేకుండా గోపాలుడు సుఖకరమైన జీవితాన్ని ఎలా గడపగలడు! భగవంతుడు గోపాలుని ప్రార్థనను విన్నాడు గావును అల్లుడు ఒక సంవత్సరం క్రితం మధుపురిని వదిలి వెళ్ళిపోయాడు. గోపాలుడు విసిగిపోయి ఒకసారి అల్లుడి మక్కెలు విరగ్గొట్టాడు. దాంతో హడలిపోయిన అల్లుడు చెప్పా పెట్టకుండా వెళ్ళిపోయాడు. అల్లుడు వెళ్ళిపోవటంతో సముద్రంలో పడ్డవాణ్ణి ఒడ్డుకు చేర్చినట్టుగా అయ్యింది గోపాలునికి. అతని భార్యకు, డోరాకు కూడా అలాగే అనిపించింది. అయితే, అల్లుడు వెళుతూ డోరాను ఇద్దరు పిల్లల తల్లిని చేసి వెళ్ళాడు. గోపాలుడు ఆర్థికంగా చాలా

ఇబ్బందులలో పడ్డాడు. 50 రూపాయలు ఇప్పుడు ఇస్తూనే వున్నారు కానీ ఇప్పటి యాభై రూపాయలు వెనుకటి పదిహేను రూపాయలకు సమానం అయ్యాయి. పైగా పై ఆదాయం పూర్తిగా లేకుండాపోయింది. భవిష్యత్తు ఎలా వుంటుందో? గోపాలునికి తెలియదు.

మానసిక వ్యధ కూడా రోగానికి కారణం అవుతుంది. వెనుక సుఖవంతమైన జీవితాన్ని గడిపాడు గోపాలుడు. ఇంక అలాంటి జీవితం తిరిగి లభిస్తుందన్న ఆశ లేదు అతనికి. కుటుంబంలో ఆర్థిక బాధలు ఎక్కువయ్యాయి. గోపాలుడు దిగులుతో కుంగిపోయాడు. మనిషి చిక్కి సగమయ్యాడు. సీజను ప్రారంభమయింది. మధుపురి జనాలతో నిండిపో యింది. అయితే, వాళ్ళందరూ పంజాబు నుండి వచ్చిన కాందిశీకులు. ఔటుహౌజులోని ఒక్కోగదిలో పదిమంది దాకా వుంటున్నారు. బంగళాలూ-హోటళ్ళు ఖాళీగా పడివున్నాయి. యుద్ధం ముగిసిన తర్వాతనుండి ఇంగ్లిషు దొరలు మధుపురికి రావటం దాదాపుగా తగ్గించేశారు. ఆ సంవత్సరం జరిగిన రక్తపాతాన్ని గురించి విని అసలు రావటం మానేశారు. నవాబుల్లో చాలా మంది పాకిస్తాన్ వెళ్ళిపోయారు. ఒకళ్ళు, ఇద్దరు వున్నా తమ మహలును దాటి బయటకు రావటం లేదు. పరిస్థితులు అననుకూలంగా వుండటం వలన ఆ సంవత్సరం మహారాజులూ జమీందార్లు కూడా మధుపురికి రావటం మానుకున్నారు. యుద్ధం ముగిసినప్పటి నుంచీ ఆల్ఫ్స్ క్లబ్‌కు నల్లవాళ్ళు రావటానికి అనుమతిచ్చారు. ఆ హోటలుకు యజమానులే నల్లవాళ్ళయ్యారు. ఆ సంవత్సరం ఆల్ఫ్స్ క్లబ్బు హోటల్ గదుల్లో సగమైనా నిండలేదు. మొదటి సీజన్‌లోనే గోపాలుడు అనారోగ్యం పాలయ్యాడు. మే, జూన్ నెలల్ని అలాగే అనారోగ్యంతో గడిపేశాడు. వర్షాలు పడటం మొదలవగానే అతనూ మంచాన పడ్డాడు. తిరిగి భూమిమీద కాలు పెట్టలేదు. ప్రాపంచిక బాధలన్నింటినీ వదిలి శాశ్వతంగా వెళ్ళిపోయాడు.

కానీ, డోరా తన ఇద్దరు బిడ్డల్ని, తల్లినీ తీసుకుని ఎక్కడికి పోగలదు? గోపాలుడు చనిపోయాక అతని కుటుంబాన్ని ఔట్‌హౌజులో ఎందుకు వుండనిస్తారు? తను పుట్టిపెరిగి సుఖకరమైన బాల్యాన్ని గడిపిన ఆ యింటిని వదిలి వెళ్ళిపోవలసి వచ్చింది.

★ ★ ★

ఒక సంవత్సరం తరువాత డోరా తల్లి కూడా ఇహలోకపు దుఃఖాన్నుండి బంధ విముక్తురాలయింది. డోరాకు పరిచయుడైన ఒక వ్యక్తి తను వుంటున్న ఔట్‌హౌజ్‌లోని ఒక గదిని ఉచితంగా వుండటానికి ఇచ్చాడు. మధుపురిలో గదులు వుండటానికి లభించడం పెద్ద సమస్య కాదు. కానీ ఇద్దరు పిల్లలను పోషించుకోవటం డోరాకు శక్తికి మించిన విషయం. స్త్రీకి వివాహం సరదా కోసం జరిపించే తంతుగా భావించటానికి వీల్లేదు. ముఖ్యంగా డోరాలాంటి స్త్రీలకు వివాహం జీవితావసరాల్లో అతి ప్రధానమైనది. ఆమెకు

21-22 సం॥లు వుంటాయి. తండ్రిపోయాక పడ్డ కష్టాల కారణంగా ముసలి దానిలా కనిపించినా ఆశ్చర్యపడవలసిన పనిలేదు. అయినప్పటికీ డోరా శరీరంలో ఇంకా కొంత శక్తి వుంది. ముఖంలో కాంతి వుంది. గులాబీ పువ్వులాంటి 16 ఏళ్ళ డోరాకు, తండ్రి అంత ప్రయత్నం చేస్తే గాడిదలాంటి వరుడు దొరికాడు. ఇప్పుడామె మరో భర్తను కోరినా, అంతకంటే మంచివాడు ఎక్కణ్ణుండి వస్తాడు? డోరా ఒక సోమరిపోతు అయిన వంటవాణ్ణి ఆశ్రయించింది. దేశీయ క్రిస్టియన్‌లకు ఇంగ్లీషు దొరల అభయహస్తం శాశ్వతంగా అదృశ్యం అయింది. పని దొరకటం లేదు. ముస్లిం వంటవాళ్ళు చాలామంది పాకిస్తాన్ వెళ్ళిపోయారు. ఇంకా మధుపురిలోనే వున్న వంటవాళ్ళు ఎంత తక్కువ జీతం ఇచ్చినా పనిచేస్తామని రోడ్లవెంట తిరుగుతున్నారు. అలాంటి వాళ్ళల్లో ఒకడు డోరాకు కుదిరాడు. కానీ అతను డోరాను, ఆమె ఇద్దరు సంతానాన్ని పోషించలేకపోయాడు. ఆమెకు మరో సంతానాన్ని కలిగించి చెప్పకుండా వెళ్ళిపోయాడు. మరి ఇంకొకతన్ని ఆశ్రయించింది. అతనూ అలాగే చేశాడు. ఇద్దరు పిల్లల్ని కల్పించి వెళ్ళిపోయాడు. ఇప్పుడు 28సం॥ల డోరా 5గురు పిల్లలతో ఇంకొకరి దగ్గర వుంటోంది. అతని నిద్రమగత ముఖాన్ని చూస్తే అతను కొకైన్ లాంటి మత్తు పదార్థాలు తీసుకుంటాడని స్పష్టంగా తెలుస్తుంది. తల్లీదండ్రీ ఇచ్చిన వస్తువుల్నీ, సొమ్ముల్నీ అమ్ముకుని ఇంతవరకూ పిల్లల్ని పోషించుకుంది. మొదట తన వంటి మీది సొమ్ముల్ని పెట్టి డబ్బు అప్పు తెచ్చుకుని గడిపేది. చుట్టుపక్కల ఇళ్ళల్లో పాచిపని చేసేది. కాని పాచిపని చేసి సంపాదించిన సంపాదనతో ఎవరి పొట్టలు నిండుతాయి?

డోరా తన బట్టలన్నింటినీ అమ్ముకుంది. ఒక పాత సిల్కుచీరను, మడమలదగ్గర పగిలిన ఒక బూట్ల జతను మాత్రం అట్టేపెట్టుకుంది. ఇంట్లో వున్నప్పుడు ఏ చినిగిన బట్టలో చుట్టుకుని గడిపేది. కానీ, బయటకు ఆ బట్టల్తో వెళ్ళడం ఆమెకు ఇష్టం లేదు. ఇప్పటికీ ఆమెకు ఎంతో కొంత అప్పు దొరుకుతోందంటే ఆ సిల్కు చీరె కారణంగానే! డోరాకు అడుక్కోవటం అలవాటు లేదు. ఆమె స్థితి అడుక్కునే స్థితి అయినా ఆత్మాభిమానం చావలేదు. అప్పు అడుగుతుందే కానీ ముష్టి అడగదు. ఈ సంవత్సరం ఆమె గదికి పక్కన వున్న గదిలో ఉదార హృదయులుగా కనిపించే దంపతులు వచ్చారు. ఒకరోజున ఆ ఇంటి ఆయన్ని డోరా అర్ధరూపాయి అప్పు అడిగింది. అప్పు తిరిగి తీర్చలేదని అతనికి అర్థం అయింది. లేదన్నాడు. డోరా తలవంచుకు వచ్చేసింది.

డోరాకు మొత్తం 5గురు సంతానం. నలుగురు కూతుళ్ళు, ఒక కొడుకు. అందరూ ఎర్రగా, చక్కగా వుంటారు. అయితే, దరిద్రమన్న కారునలుపు వాళ్ళ ముఖాన అలుము కున్నది. పెద్ద పిల్లకు 11 ఏళ్ళు వుంటాయి. ఆకలయితే పిల్లలందరూ తల్లి దగ్గరకు వచ్చి ఏడుస్తుంటారు. తల్లి విసిగిపోయి కోపగించుకునేది. కానీ, మరుక్షణంలోనే మనస్సు

మార్చుకునేది. తనకంటే ఈ ప్రపంచంలో వీళ్లను ఆదరించేవాళ్ళు ఎవరు వున్నారు? 'కుపుత్రో జాయేత్ క్వచిదపి కుమాతాన భవతి' డోరా కుమాత కాదు. ఆమె కష్టాలు అధికం కావటానికి ఇదీ ఒక కారణమే! అన్ని అవమానాలనూ సహించి, అప్పుతెచ్చి, పాచిపని చేసి బిడ్డల్ని పోషించుకోవాలని చూస్తుంది. ఇంత కష్టపడి పోషించిన బిడ్డలు పెద్దవాళ్ళయ్యాక ఎలా తయారవుతారు? ఎవరు చూశారు? ఏనాడూ కడుపునిండా తిండి ఎరగని ఆ పిల్లలు చదువుకోవటానికి అవకాశం లభిస్తుందని కలలో కూడా ఊహించటానికి అనర్హులైన ఆ పిల్లలు – ఉత్తమ పౌరులు అవుతారనో, జ్ఞానవంతులు అవుతారనో ఆశించడం దురాశే అవుతుంది.

డోరా బజారు వెనుకవైపున వున్నగదిలో ఉచితంగా వుండనిస్తేవుంటోంది. ఆ గదిలో ఆమె నాలుగవ భర్తా, ఇంకా ఇద్దరు ముగ్గురు పురుషులూ వుంటున్నారు. వాళ్లు ఆమె మరుదులు కావచ్చు. సీజన్ సమయంలో వాళ్ళకు ఎక్కడైనా ఉద్యోగం దొరికితే దొరుకుతుంది. డోరా అందరికీ వండిపెడుతుంది. సీజన్ సమయంలో పిల్లలకు ఏ అర్ధన్నమో దొరుకుతుంది. ఆ తర్వాత ఎలా బతుకుతారో ఆలోచించడం కూడా అసంభవమే! ప్రక్క గదుల్లోని విలాసయాత్రికలు వచ్చి వుంటారు. ప్రతి సీజన్‌లోనూ క్రొత్త ముఖాలు కనిపిస్తూ వుంటాయి ఆ గదుల్లో. అదీ కొంత వరకూ నయమే. ఎప్పుడూ ఒకళ్ళే వుంటే, మాటిమాటికీ వాళ్ళనే అప్పు అడగవలసి వస్తుంది. బీదల బాధలు బీదలకే అర్థమవుతాయి. పక్కనుండే పంజాబీ కుటుంబ నౌకరు డోరా స్థితిని గమనించాడు. తమ యజమానులు తినగా మిగిలిపోయిన పదార్థాలను డోరాకు ఇచ్చేవాడు. కాల్చుకోగా మిగిలిన బొగ్గుల్ని, కట్టెల్ని కూడా డోరాకు ఇచ్చేవాడు. యజమానులు చూడకుండా వాళ్ళ పంపులో నీళ్ళు తెచ్చుకునేది డోరా! చినిగిన బట్టలు కట్టుకునే డోరా రోజూ తమ పంపుకు వచ్చి నీళ్ళు పట్టుకు వెళ్ళటం బాధ అనిపించింది పంజాబీ మహిళకు. ఆరోజున ఆమె డోరాను ఇక మా పంపుకు రావద్దని విదిలించేసింది. అప్పుడు డోరా కన్నీళ్ళు పెట్టుకుంటూ తన స్థితి ఎంత కరుణాభరితమైనదో! చెప్పటానికి ప్రయత్నించింది. ఆమె తల్లిదండ్రులు చనిపోవటమే మంచిదయింది. బ్రతికివుంటే అల్లారు ముద్దుగా పెరిగిన కూతురి దుస్థితిని చూసి కుమిలి పోయేవారు. డోరా రోజూ భగవంతుడిని ప్రార్థిస్తుంది. "ఓ యహోవా! నన్ను నా తల్లిదండ్రుల దగ్గరకు పంపించు!" అని. కానీ భగవంతుడు బీదల ప్రార్థనలను అంత త్వరగా వింటాడా?" కాళరాత్రిలాంటి బాధాసర్పద్రష్టమైన ఆమె జీవితం ఇంకా సగమైనా గడవందే!

# బిసును

నేపాల్‌ను మినహాయిస్తే అస్సాం నుండి లథక్ వరకూ వున్న భారత సరిహద్దు టిబెట్ అంటే చైనా ప్రజారాజ్యపు సరిహద్దుతో కల్సి వుంది. ఈ రెండు దేశాల సరిహద్దులూ కలిసే చోట ప్రకృతిదృశ్యాలు అనేక రకాలుగానూ, మనోహరంగానూ వుంటాయి. ఏవో కొత్త లోకాల్లో ఉన్నట్లుగా వుంటుంది. వృక్షాలతోనూ పర్వతాలతోనూ నిండివున్న మార్గంలో కొంత  దూరం దాకా ప్రయాణం చేస్తూనే వుంటాం. ఇంతలోనే ప్రకృతి పరివర్తన చెందుతుంది. వృక్షాలతో, పచ్చదనంతో శోభాయమానంగా వున్న ప్రకృతి ఒక్కసారిగా ఎండువారిపోయినట్టుగా అవుతుంది. ఎక్కడా పచ్చదనం అన్నమాటే కనిపించదు. యాత్రికులకు రాత్రిపూట చలి కాచుకోవటానికి కట్టెపుల్లలు కరువవుతాయి. పశువుల ఎరువునే ఇంధనంగా ఉపయోగించవలసి వస్తుంది. అలాంటి ప్రాకృతిక దృశ్యాలు గల భారత టిబెట్టు మార్గంలో వున్న ఒక గ్రామం 'కనం'! ఆ గ్రామానికి క్రింద రెండు మైళ్ళదూరంలో శతధృ నది. 'ఘూఘర్' అన్న పేరుతో ప్రవహిస్తూ వుంటుంది. (శతదృ – నూరింతలు పరుగులు తీసేది. ఘూఘర్ – ఘర్ఘరమని ధ్వని చేసేది) ఈ నది మానస సరోవరం చెంతనున్న 'రావణహ్రదం' అన్న సరోవరం నుండి ఉద్భవిస్తుంది. కనం గ్రామం నుండి ఘూఘర్ నదీ తీరానికి రావటానికి దాదాపుగా రెండు మైళ్ళు క్రిందకి దిగవల్సి వస్తుంది. ఆ రెండు మైళ్ళూ దిగటం అతి భయంకరమైనది. ఆ దిగుడు ప్రాంతంలో దిగటానికి కానీ, ఎక్కటానికి కానీ ఆ కొండప్రాంత ప్రజలే సరిపోతారు. కనం గ్రామం దగ్గర ప్రవహిస్తున్న సతలజ్ (శతధృ) నదికి ఒకవైపున దేవదారు, ధుపి వృక్షాలతో నిండిన వనాలు వున్నాయి. అక్కడ నుండి కేవలం ఒకటి రెండు మైళ్ళు ఎగువకు వెళితే చాలు. చెట్లూ చేమలూ లేని  పర్వత పీఠభూమి కనిపిస్తుంది. అదే టిబెట్ – భారత్ దారి. ఆ పీఠభూమిలో పల్చగా గడ్డి మాత్రం వుంటుంది. ఆ గడ్డిని పశువులన్నీ మేయవు. ఆ గడ్డి మొక్కలలోనే గొప్ప ఔషధాలుగా పనిచేసే మొక్కలూ వుంటాయి. అవేకాక సాంబ్రాణి – అగరులాంటి సువాసనలతో గుబాళించిపోతున్న పొదలూ కొన్ని వుంటాయక్కడ. కొంచెం

స్పీడుగా నడవగలిగిన వాళ్ళయితే 'కనం' నుండి ఒక్కరోజు నడిచి భారతదేశపు చిట్టచివరి గ్రామమైన 'నమగ్యా'ను చేరుకోవచ్చు. 'నమగ్యా' గ్రామానికి ఒక మైలు ఎగువున శతధృ నదిలో కలిసే చిన్న కాలువ ఒకటివుంది. ఆ కాలువే భారతదేశానికీ, టిబెట్‌కూ సరిహద్దని స్థానిక ప్రజలు చెప్పుకుంటారు. అయితే బ్రిటిష్ ప్రభుత్వం కానీ, బ్రిటిష్ ప్రభుత్వ అడుగు జాడలతో నడుస్తున్న భారత ప్రభుత్వం కానీ ఆ కాలువను ఈ నాటికీ తమ దేశపటాల్లో రేఖాంకితం చేయలేదు. సతలజ్ నదితో పాటు భారత్–టిబెట్ దారి 'నమగ్యా' వరకూ వెళ్ళి అక్కడితో ఆగిపోతుంది. సతలజ్ నదిని అనుసరించి ముందుకు పోవచ్చును కానీ ఆ నది ఒకచోట పర్వతాన్ని కోసుకుంటూ వెళ్ళిపోయింది. అక్కడ సతలజ్ నదిననుసరించి ముందుకు పోవటమూ ఎవరి వశమూ కాదు. కనుక మరో చిన్న నదిని అనుసరించి కొంత దూరం ఎగువకు వెళ్లాక పర్వత అగ్రభాగం తగులుతుంది. దాన్ని దాటి అవతలి వైపుకు వెళితే టిబెట్ భూభాగానికి వెళ్ళినట్టే! అక్కడినుండి 'షిప్కి' వెళ్ళిపోవచ్చు.

'కనల' దాటాక వచ్చే మొదటి గ్రామాన్ని 'స్ఫూ' అంటారు. అది కొంచెం పెద్ద గ్రామమే. ఈ 'స్ఫూ' గ్రామం భారతదేశం నుండి టిబెట్టు సరిహద్దుకు నాలుగు గంటలు ప్రయాణం చేస్తే అక్కడ వుంది. అక్కడ క్రిస్టియన్ మిషనరీలు స్కూలు నొకదాన్ని, హాస్టలు నొకదాన్ని కట్టించారు. క్రిస్టియన్ ఫాదరీలు చుట్టుపక్కల నున్న టిబెట్టు వారిని క్రిస్టియన్ మతంలోకి మార్చటానికి అక్కడ దిగారనేది వేరే చెప్పనవసరం లేదనుకుంటున్నాను. ఫాదరీల కోరికపై ఆంగ్లప్రభుత్వం 'స్ఫూ'లో ఒక పోస్టాఫీసునూ కట్టించింది. ఒక రహదారి బంగళానూ కట్టించింది. 'స్ఫూ' గ్రామం పెద్దదే అయినా, చెట్లూ – చేమలతో, పచ్చదనంతో ప్రకృతి సీమలో వున్న మొదటి గ్రామం 'కనమే' అనవచ్చును. 'స్ఫూ'లో ఎండుదనం తప్ప పచ్చదనం వుండదు. ఇది ప్రకృతికి సంబంధించిన సరిహద్దు. ఈ సరిహద్దు కనం దాటిన తరువాత ప్రారంభమైనా, స్ఫూ దగ్గర స్పష్టంగా వ్యత్యాసం కనిపిస్తుంది. ఇంతే కాకుండా భాషా సంబంధమైన వ్యత్యాసం కూడా 'కనం' నుండే ప్రారంభమవుతుంది. 'కనం' గ్రామ ప్రజలు కనౌరీ (కిన్నెర) భాషను మాట్లాడతారు. కనౌరీభాష కిరాత భాషా సమూహానికి చెందినది. రాజకిరాత, మగర, గురుంగ, తమంగ, నేవార, లింబూ, యాఖా, లెప్చా మొదలుగాగల భాషలు పై భాషా సముదాయానికి చెందినవే. తూర్పు ప్రాంతానికి చెందిన కిరాతక వంశ ప్రజలు కండ్లూ, బుగ్గలూ, మంగోలు ప్రజల ఆకృతిని చెంది వుంటాయి. అట్లాగని వీరికీ చైనా భాషకూ సంబంధం వున్నదనుకోవటం పొరపాటే అవుతుంది. కనౌరీ భాషను మాట్లాడే ప్రజల్లో మంగోలు జాతికి చెందిన ముఖాకృతి ఎక్కడో గానీ కనపడదు. సతలజ్ నదిని దాటి అవతలకి వెళ్ళామంటే అక్కడ మంగోలు జాతి లక్షణాలు అసలు కనుపించవు. ఎర్రని శరీరఛాయ, పొడుగాటి కొనదేలిన ముక్కులు,

పొడుగు ముఖాలు ఖచ్చితమైన ఖాస్ (శక) జాతి ప్రజల్లా వుంటారు అక్కడి వాళ్ళు. వీరందరూ కనౌరీ మాట్లాడేవారే! కానీ, కనమ్‌లోని ప్రజల్లో మంగోలు జాతి లక్షణాలు కొద్దో గొప్పో కనిపించటానికి కారణం వుంది. కనం టిబెట్ భారతదేశపు ప్రధానమార్గంలో వుంది. అనేక శతాబ్దాల పాటు టిబెట్ పశ్చిమ ప్రాంతానికి చెందిన రాజులు 'కనం' గ్రామాన్ని పరిపాలించారు. పశ్చిమ టిబెట్‌కు చెందిన అవతార పురుషుడని ప్రసిద్ధి నొందిన లామాలో– ఖేన్–రింపో–ఛే కు సంబంధించిన ముఖ్య మఠం కనంలోనే వుంది. కనౌరీ మాట్లాడే ప్రజలు బౌద్ధులు. క్రింది గ్రామాల్లోని కనౌరీ మాట్లాడే, ప్రజలు కొందరు బ్రాహ్మణ పురోహితుల్ని పెట్టుకున్నారు. అయినా, వారిలోనూ లామాల పట్ల గౌరవం బాగానే వుంది. కేవలం రసపుత్రులు అనిపించుకోవాలన్న కోర్కె వల్లనే వాళ్ళు బ్రాహ్మణ పౌరోహిత్యాన్ని ప్రారంభించారని చెప్పవచ్చు. ఒక్క 'కనం' విషయమే ఆలోచిస్తే ఆ గ్రామంలో వున్న వారందరూ బౌద్ధులే.

ప్రకృతి కనౌరీ భాష మాట్లాడే ప్రజల్ని విచిత్రమైన పరిస్థితిలో వుంచింది. వాళ్ళు పూర్తి సంచారులు కారు పూర్తి స్థిర నివాసులూ కారు. సగం సంచారులుగా వుంచింది ప్రకృతి వాళ్ళను. పశుపాలన వేల సంవత్సరాలుగా వస్తున్న వారి ముఖ్య వృత్తి. పశ్చిమ టిబెట్టుతో వారికి వ్యాపార సంబంధాలు వేల సంవత్సరాలుగా వున్నాయి. సతలజ్ ప్రవహించే ప్రదేశం కనౌరీభాషా ప్రాంతాల కంటే బాగా దిగువన వుంటుంది. అంతకంటే దిగువన వుండే ప్రదేశం మరొకటి లేదు. అయినా, అవీ ఆరువేల అడుగులకు తక్కువ వుండదు – ముందుకు పోయిన కొద్దీఎత్తు పెరుగుతుంది. 'నం' అనే గ్రామం ఒకటుంది. అదీ కనౌరీ భాష మాట్లాడే ప్రజలదే! 'నం' గ్రామం పదివేల అడుగుల ఎత్తున వుంది. చలికాలంలో మంచుగడ్డ కడుతుంది అక్కడ. ఆ హిమపాతానికి పచ్చదనం వుండదు కనుక అక్కడి పశువులు చలికాలంలో 'ఓకు' వృక్ష ఆకుల్ని తింటాయి. ఇవి ఏకాలంలో నైనా ఎండిపోవు. పైగా ఇవి ముళ్ళ చెట్లు. అక్కడి ప్రజలు ఈ ముళ్ళచెట్లను చాలా జాగ్రత్తగా తమ ప్రాంతాలలో పెంచుతారు. ఉష్ణ దేశీయులైన మైదాన ప్రజలు మామిడిచెట్ల పట్ల చూపే ప్రత్యేకమైన శ్రద్ధను మనం కనౌరీ ప్రజల్లో ఓకు చెట్ల పట్ల చూడవచ్చు. వాళ్ళు ఓకు ఆకులను చలికాలం రాగానే తమ పశువులకు మేపటాన్ని ప్రారంభించరు. తాము ప్రోగుచేసుకున్న మేత అయిపోయాక ఓకు ఆకుల్ని మేపుతారు. ఓకు ఆకుల్ని ఎంతగా మేపినా కనౌరీ ప్రజలు తమ పశువుల్ని చలికాలంలో అక్కడే గనక వుంచితే వాటిని ఏ విధంగానూ మృత్యువు నుండి రక్షించుకోలేరు. అందుకనే చలికాలం ప్రారంభం కాగానే ప్రతి కుటుంబంలో నుండి సగం మందికి పైగా తమ పశువుల్ని తోలుకుని సిమ్లా, మండి, డెహరాడూన్ ప్రాంతాలలో వున్న అడవులకు వెళ్ళిపోతారు. పై అడవులలో

హిమపాతం పెరగదు కనుక పచ్చదనానికి కొదవ వుండదు. వెళ్ళేటప్పుడు వచ్చేటప్పుడు దొరికిన మేతను తమ పశువులతో మోయిస్తారు. బాటసారుల మూటల్ని కూడా తమ పశువుల చేత మోయించి కొంత డబ్బు సంపాయించుకుంటారు. కిన్నెర స్త్రీ పురుషులు బాల్యం నుండీ మైదాన ప్రాంత ప్రజల్ని చూస్తుంటారు. అయినా స్త్రీలూ, బాలికలూ మైదాన ప్రజల భాషల్ని నేర్చుకోరు. చలికాలం రాగానే వీళ్ళు కిందికి దిగి వచ్చేస్తారు. అంతే వసంత ఋతువు రాగానే పైకి తమ ప్రదేశాలకు వెళ్ళిపోతారు. మే నెలకు ముందే తమ గ్రామాలను చేరుకుంటారు. అప్పటికి మంచు కరిగిపోతుంది. తమ భూముల్ని దున్నుకుంటారు. నాట్లు ప్రారంభిస్తారు. జూన్ రాగానే మళ్ళీ టిబెట్టు వైపుకు ప్రయాణం సాగిస్తారు. ధాన్యాన్ని, పశువుల్నీ అమ్ముకోవటానికి పర్వతాగ్రాల్ని అధిగమించి షిప్కీ మీదుగా పశ్చిమ టిబెట్టులోని పశుపాలుర దగ్గరకు వెళతారు. ఈ విధంగా కనౌరీ భాష మాట్లాడే ప్రజలు చలికాలం డెహరాడూన్ అడవులలోకి వస్తుంటారు. వర్షాకాలంలో మానస సరోవర ప్రాంత శీతల ప్రదేశాలకు వెళ్ళిపోతుంటారు. టిబెట్టులో పశువుల్నీ, ధాన్యాన్ని అమ్ముకోవటం వాళ్ళ ఆదాయానికి ప్రధానమైనది. తమ గొర్రెల నుండి దొరికే ఉన్నిని వస్త్రాలుగా నేసుకుంటారు. తమ అవసరాలకు సరిపోగా మిగిలిన వున్నిని కాన్పూర్ లాంటి నగరాలలోని బట్టల మిల్లుల ఏజెంట్లకు అమ్ముతారు.

## 2

అప్పటికి బిసునూ పసిపిల్లవాడు. బిసునూ కనం గ్రామంలోనే పుట్టాడు. జాతీయ వారసత్వంగా తిరుగుబోతు స్వభావం అతని రక్తంలో కల్సి జీర్ణించుకుపోయింది. చిన్నప్పటి నుండీ తల్లి ఒడిలో ఆడుకుంటూ చలికాలాలను మండీ–డెహరాడూన్‌లలో అడవులలో గడిపాడు. కొంచెం పెద్దవాడై పశువుల్ని మేపే వయసు వచ్చాక తన తండ్రులలో ఒక తండ్రి వెంట పశువుల్ని తోలుకుని చలికాలంలో క్రింది అడవులకు వచ్చేసేవాడు. ప్రకృతి క్రూరత్వం నుండి రక్షణ పొందటానికి అధిక సంతానం పనికిరాదన్న విషయాన్ని కనౌరీలు (కిన్నెరలు) ఎన్నడో తెలుసుకున్నారు. అధిక సంతానం వలన దరిద్రం, ఆకలిచావులు తప్పవని తెల్సుకున్నారు. అయితే, సంతాన నిరోధానికి వాళ్ళు ఒక పద్ధతిని అనుసరించారు. పాండవ వివాహాన్ని అమలులో పెట్టుకున్నారు. ఈనాటికీ కనౌరీ భాషను మాట్లాడే ప్రాంతాలలోని ప్రతి ఇంట్లోనూ పంచ పాండవులు వుంటారు. ప్రతిఇంట్లోనూ ద్రౌపది వుంటుంది. ఈ సామాజిక విధానాన్ని ప్రభుత్వమూ అంగీకరించింది. అక్కడ అన్నదమ్ములం దరికీ ఒకే భార్య వుంటుంది. ఈ నియమాన్ని ఉల్లంఘించిన సోదరుడికి పిత్రార్జితంలో భాగం లభించదు. కనుక అక్కడ తండ్రి, బాబాయి అని పిలవకుండా పెద్ద తండ్రి, చిన్న

తండ్రి అని పిలుస్తారు. బిసును వసంత ఋతువును, వర్షఋతువును, హేమంతాన్ని – కనం గ్రామానికి ఎగువన వున్న అడవుల్లోనూ, దిగువన వున్న అడవుల్లోనూ గడుపుతూ వుండేవాడు. కనౌరీ జాతిలో వుండే సహజమైన ఔత్సాహం – బిసునూలోనూ వుంది. ఆడుతూ పాడుతూ రోజుల్ని గడపటం వాళ్ళ జాతీయ లక్షణం. వర్షాకాలంలో వాళ్ళ గ్రామంలో పది పన్నెండు అంగుళాల వర్షం కురుస్తుంది. ఇంట్లో ఒకరిద్దరిని వుంచి మిగిలిన వాళ్ళందరూ పశువుల్ని తీసుకుని దిగువన వున్న అడవులకు వెళతారు.

టిబెట్టు సరిహద్దున వుండే ఈ భారతీయులు సంచారులు అనటంలో సందేహం లేదు. అయితే, చెట్లనుండి విడిపోయే ఎండుటాకుల్లా ప్రకృతిలో కొట్టుకుని పోవడమే వాళ్ళ వృత్తి అని అనకూడదు. వాళ్ళ సంచారానికీ పరిధి వుంది. నిర్దిష్టమైన కొన్ని ప్రదేశాలలోనే వాళ్ళు తమ పశువుల్ని వెంటబెట్టుకుని తిరుగుతూ వుంటారు. వాళ్ళల్లోనూ అందరూ తిరుగుతారని చెప్పలేం. తమ గ్రామాన్ని కేంద్రంగా పెట్టుకుని తిరుగుతూ వుంటారువాళ్ళు. అన్నదమ్ములందరూ కలిసి ఒకే స్త్రీని వివాహం ఆడే ఆచారం వుండటం వల్ల అవివాహితులైన స్త్రీలు చాలామంది వుండిపోతుంటారు వాళ్ళజాతిలో. అలాంటి స్త్రీలందరూ బౌద్ధమతంలో చేరి భిక్షిణులు అయిపోతారు. ఆ ప్రాంతంలో ప్రతి ఇంట్లోనూ ఇద్దరో, ముగ్గురో భిక్షిణులు వుండనే వుంటారు.కనంలోని భిక్షుణులు అందరూ ఒక మఠాన్ని కట్టుకొని దాంట్లో వుంటున్నారు. స్వావలంబనులై బతుకుతున్నారు. వాళ్ళు తమ ఇంటివాళ్ళ దయాధర్మాల మీదగానీ, గ్రామస్థుల దయాధర్మాల మీద గానీ ఆధారపడి బ్రతకరు. ఆ భిక్షుణులు పొలం పనులు చేస్తారు. తాము పండించుకున్న పంటలను తెచ్చుకుని తింటూ వుంటారు. వాళ్ళల్లో కొందరు మతపరమైన పూజా పునస్కారాలకు అవుసరం అయినంత వరకూ చదువుకున్నారు. మత సంబంధమైన భక్తి భావన వాళ్ళందరిలోనూ ఎలాగూ వుండనే వుంటుంది. ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా భిక్షువు వుంటారు. కొందరు భిక్షువులు విద్యాధ్యయన నిమిత్తం లాసా వెళుతుంటారు. బిసునూ గ్రామానికి చెందిన యువకులు కొందరు చదువుకోవటానికి లాసా వెళ్ళారు. చదువు పూర్తి చేసుకుని అక్కణ్ణుండి వచ్చాక పెద్ద గుంబా (విహారం)లో వుంటున్నారు. బిసునూ కూడా భిక్షువు కావల్సిన వాడే కానీ కాలేదు. బహుశా అతనికి 'గుంబా' జీవితం కంటే గ్రామ జీవితమే నచ్చి వుంటుంది. కిన్నెర జాతి సహజంగానే ఉత్సవాలతో, వినోదాలతో ఆనందంగా జీవితాన్ని గడిపే జాతి. అలాంటి జాతిలో పుట్టిన పది పన్నెండేళ్ళ పిల్లవాడు తల గొరిగించుకుని, కాషాయాం బరాల్ని కట్టుకుని బౌద్ధ శ్రమణుడై గుంబాలోకి వెళ్ళటం నిజంగానే సమస్యగా వుంటుంది. కొందరు పిల్లలకు గుంబా జీవితం నచ్చకపోవచ్చు. బిసునూ గ్రామ జీవితంలోని వినోదాల్ని వదులుకోలేకపోయాడు.

పదమూడు సంవత్సరాలు వచ్చాక ఒకసారి బిసునూ తన పెద్దతండ్రి (ఆ ప్రాంతాలలో పెద్ద తండ్రి అన్న మాటకు అర్థం తల్లికి పెద్ద భర్త అని) తో వ్యాపారపరంగా టిబెట్టుకు వెళ్ళాడు. అంతకు ముందు తమ ప్రదేశాలకంటే దిగువున వుండి సస్యశ్యామలమైన ప్రదేశాల్ని చూశాడు. కానీ టిబెట్టు అంటే తమకంటే ఎగువ ప్రకృతిని అతను చూడలేదు. 'సుమనం' నుండి వచ్చే ఒక నదిని దాటగానే ప్రకృతికి పరదా పడినట్టుగా అయింది. ఎక్కడా చెట్లూ –చేమా, వనం అంటూ కనిపించకుండా కొండలూ, భూమి ప్రత్యక్షమయ్యాయి. అలాంటి భూమిని బిసునూ ఇంతకు ముందు చూడలేదు. ఎంతో ఆశ్చర్యంతో ఆ భూమిని అలా వుండటానికి గల కారణాన్ని బిసునూ తన పెద్ద తండ్రిని అడిగాడు. అతను సమాధానం ఏమీ చెప్పలేక "ఇప్పుడీ భూమి ఇంతే' అన్నాడు. కానీ ఆలోచిస్తే ఆ భూమి అలా వుండటానికి గల కారణం "వర్షించే మేఘాలు ఎంతో దూరం నుంచి, వీక్షణ సముద్రం నుంచీ రావాలి. ఈమధ్యదారిలో ఎన్నో పర్వతాలు వాటిని అడ్డుకుంటాయి. పర్వతాలన్నింటినీ తప్పించుకుని చాలా కొద్ది మేఘాలు మాత్రమే ఆ ప్రాంతానికి వెళతాయి. అది కూడా చాలా ఎత్తుకు వెళ్ళిపోవడం వల్ల నీటిని వర్షించే శక్తిని కోల్పోతాయి. ఈ కారణంగా అక్కడ వర్షాలు నామమాత్రంగా వుంటాయి. అందువల్ల భూమి ఎండువారి పోతుంది". ఈ విషయం బిసునూ పెద్ద తండ్రికి తెలియదు. వ్యాపారం మీద టిబెట్టు వెళ్ళేవాళ్ళు గాడిదల మీద సామాను వేసుకుని, గొర్రెలను, మేకలను వెంటబెట్టుకుని వెళ్ళిపోతుంటారు. వన విహీనమైన ఆ ప్రదేశానికి వెళ్ళేసరికి వ్యాపారుల నడక మందగిస్తుంది. దారిలో గ్రామాలు తగిలినా ఆగరు. ఆ గ్రామాల్లో ఆగటం వలన ప్రయోజనం వుండదు. వాళ్ళ పశువులకు మేత కూడా దొరకదు. వాళ్ళు ఆ గ్రామంలో ఆగకపోయినా వెళ్ళేదారిలో వుంది కనుక గ్రామంలోంచి వెళ్ళక తప్పదు. మొదటి గ్రామం స్ఫూ! ఆ గ్రామంలో మాట్లాడే భాష తమ భాష కాదని తెలుసుకున్నాడు బిసును. అంతవరకూ నాలుగయిదు చలికాలాల్ని క్రింది ప్రదేశాల్లో గడిపాడు. అతనికి హిందీ కొద్ది కొద్దిగా వచ్చు. ఆ వచ్చీ రాని హిందితోనే స్ఫూ గ్రామ ప్రజలతో రెండు ముక్కలు మాట్లాడాడు. నమగ్యా వరకూ అతనికి వచ్చిన హిందీ, సహకరించింది. షిప్కీలో అతను బలవంతంగా మూగవాడయ్యాడు. భాషే కదా మనిషిని మాట్లాడేటట్లు చేస్తుంది. భాషరాని వాడు మూగవాని కిందే లెక్క గదా! తను కూడా గుంబా (బిహార్)లోకి వెళ్ళినట్టయితే కొంత అక్షర జ్ఞానం కలిగేది. టిబెట్టు భాషను అర్థం చేసుకోగలిగే వాణ్ణి కదా? అని అనుకున్నాడు బిసునూ. కానీ గంబాలోకి వెళ్ళటం అంటే ఎంతో త్యాగం చేయాలి. ఇప్పుడు ఇంకేం చేయగలడు? ఇలా ప్రయాణం చేస్తూనే టిబెట్టు భాషను నేర్చుకోవాలి!

షిప్కీని దాటి వాళ్ళు పూర్తిగా టిబెట్టు భూభాగంలోకి ప్రవేశించారు. అక్కడ గ్రామాలు

పధ్నాలుగు, పదిహేను వేల అడుగుల ఎత్తున వుంటాయి. అక్కడ చలి విపరీతంగా వుంటుంది. అయినా, బిసునుకు భయం లేదు. అతను సంవత్సరమంతా ఉన్ని బట్టలు వేసుకోవటానికి అలవాటు పడ్డాడు. పెదతండ్రి మరికొందరు (తమతోపాటు తమ గ్రామం నుంచి వచ్చినవాళ్ళు) ఒక గ్రామంలో మజిలీ చేశారు. ఉన్నికి తమ ధాన్యాన్ని కొలిచి ఇస్తారు. ఉన్ని పట్టుకు వస్తు మార్పిడి చేస్తున్నారు. గొర్రెల ఉన్నిని తామే కత్తిరించుకోవాలి. ఉన్నిని కత్తిరించటంలో తనూ తండ్రికి సాయం చేసేవాడు బిసును. పెదతండ్రి గ్రామస్తులతో టిబెట్టు భాషలోనే మాట్లాడేవాడు. వినీ వినీ కొన్ని శబ్దాలు బిసునుకు జ్ఞాపకం వుండిపోయాయి. రెండు నెలల తరువాత తమ వస్తువుల్ని ఉన్నికి మార్చుకుని తిరిగి గ్రామానికి కనం వచ్చేశారు. ప్రయాణం అంటే ఇలా వుండాలి అనుకున్నాడు. సుదీర్ఘమైన ఈ యాత్రను చేశాక ఒక కష్టమైన యాత్రను చేశానన్న భావన కలిగింది బిసునుకు. తమ గ్రామంలో కొందరు కులమత వ్యత్యాసాల్ని అంగీకరించే బ్రాహ్మణ మతాన్ని అనుకరించే వారైనా టిబెట్టుకు వెళితే మాత్రం అక్కడి ప్రజలతో భోజనం చేస్తూ వుంటారు. టిబెట్టు ప్రజలు గోమాంస భక్షకులని తెలిసి కూడా పట్టించుకోరు. ఇక కనౌర్, నేలంగ్, దర్మా ప్రజలు బౌద్ధులే! వాళ్ళకు టిబెట్టు వాసులతో కలిసి భోజనం చేయటానికి అభ్యంతరం ఏముంటుంది? వాళ్ళ మతగురువులందరూ టిబెట్టు నుండే కదా వచ్చేది. అంతేకాదు. బౌద్ధులకు ఈ మాంసం తినవచ్చు – ఈ మాంసం తినకూడదు అన్న నిషేధం లేదు. కులమత వ్యత్యాసాలు అంతకంటే లేవు. అలాంటప్పుడు తాము టిబెట్టు ప్రజల్ని మ్లేచ్ఛులని ఎలా అనగలరు? బిసునూ తల్లిదండ్రులు బౌద్ధమతానుయాయులు.

స్వాభావికమైన జీవితాన్ని గడిపేవారి బాల్యమూ, యవ్వనం ఎక్కువకాలం నిలిచి వుంటాయి. సహజమైన జీవితాన్ని గడిపేవారు ఆటపాటల్ని, నృత్యగానాదుల్ని ఆలంబనగా చేసుకుని జీవితాన్ని సాగిస్తారు. బిసునూ తన వయస్సుకంటే ఐదు సంవత్సరాలు చిన్నవాడుగా కనిపిస్తున్నాడు. టిబెట్టు వెళ్ళి వచ్చాక తన యాత్రానుభవాలను స్నేహితులందరికీ చెప్పాడు. అంతరకూ టిబెట్టు వెళ్ళని తన మిత్రుల దగ్గర ఆ భాషాపదాల్ని కొన్నింటిని తప్పుడు ఉచ్చారణతో పలికి వినిపించేవాడు. తనుకూ హూణ భాష మాట్లాడటానికి వచ్చని అనిపించుకున్నాడు. భారత–టిబెట్టు హద్దుకు ఇటు భారత భూభాగంలో వున్న టిబెట్టు భాష మాట్లాడేవారిని కనౌరీలు, జాడ్ (జాట్)లు అంటారు. సరిహద్దుకు అటూ టిబెట్టులో వున్న టిబెట్టు భాష మాట్లాడేవారిని హూణులంటారు. టిబెట్టు వాళ్ళను హూణులని ఎందుకు అంటున్నారు? కారణం ఏమిటి? హూణులు మధ్య ఆసియాను దాటి దక్షిణం వైపుకు ఎన్నడూ రానేలేదు. భారతదేశంలోకి అసలు రానేలేదు. కానీ ఏధాలూ, ఏఫతాల్‌లూ భారతదేశానికి వచ్చారు. వీరికీ హూణులకూ చాలాకాలం సంపర్కం

వున్న కారణంగా వీరినే శ్వేతహూణులు అనేశారు. బిసునూ తను చూసిన విషయాలు స్నేహితులకు చెప్పటమే కాకుండా అక్కణ్ణుంచి తెచ్చిన మజ్జిగను ఎండబెట్టి, ఎండు చర్మంలా తయారు చేసి, కత్తితో కోసి ముక్కలు చేసి చిన్న చిన్న ముక్కల్ని అందరికీ పంచాడు.

## 3

అలా చాలా సంవత్సరాలు తన తల్లిదండ్రులతో కలిసి టిబెట్టు వెళ్ళాడు బిసునూ! అతనికి 24 ఏళ్ళ వయస్సు వచ్చింది. అన్నదమ్ముల్లో బిసును పెద్దవాడుకాదు. పెద్దవాడు అయినట్టయితే ఇంటి బాధ్యతలు తీసుకొనవలసి వచ్చేది. వివాహానికి సిద్ధపడవలసి వచ్చేది. ప్రతి సంవత్సరం అలా టిబెట్టుకు వెళ్ళిరావటం వలన టిబెట్టు భాషనూ, వాళ్ళ ఆచార వ్యవహారాల్ని బాగా అర్థం చేసుకున్నాడు. ప్రతి సంవత్సరమూ టిబెట్టు వైపు యాత్ర వెళ్ళే శుభసమయం కోసం ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తుండేవాడు. టిబెట్టుతో ఇలా వ్యాపారం చేసేవాళ్లు ఒక్క కనౌరీలే కాదు. వీళ్ళు కొంతవరకూ స్థిర నివాసులు. వీరేకాక ఖంబా ప్రజలు పశ్చిమ టిబెట్టుతో వ్యాపారం నిరంతరం చేస్తూనే వుంటారు. వాళ్ళు ఖచ్చితమైన తిరుగుబోతులు. పశ్చిమ టిబెట్టుతో వ్యాపారం చేయడంలోనే వారి జీవితం గడిచిపోతుంది. 'ఖంబా' అనే పదానికి శబ్దార్థం 'ఖాం' దేశీయుడని 'ఖాం' దేశం అంటే, టిబెట్టు చైనా సరిహద్దుల్లో తూర్పుప్రాంతాన గల టిబెట్టులోని ఒకానొక ప్రదేశమన్న మాట. ఈ ఖంబాలకు నిజంగా ఆ 'ఖాం' దేశంతో సంబంధం వుందా? అని ఆలోచిస్తే, సంబంధం వున్న లక్షణాలు పెద్దగా కనిపించవు. వీరి భాషా, కట్టు–బొట్టు ఆచారాల్లో 'ఖాం' ప్రాంతపు ప్రభావం బొత్తిగా కనిపించదు. ఖంబాలు ఖచ్చితమైన సంచారులు (తిరుగుబోతులు) చలికాలంలో ఢిల్లీ, అమృతసర్ ఇతర మైదాన ప్రాంతాలలోని నగరాలకు వస్తుంటారు. వేసవి కాలంలో మానస సరోవర ప్రాంతానికి వెళ్ళిపోతారు. గుడారాలే వాళ్ళ ఇళ్ళు. గడియారంలోని ముళ్ళులా ప్రతిరోజూ ప్రతినెలా వాళ్ళు ప్రయాణిస్తూనే వుంటారు. ఈ ఖంబాలు ఏ దేశ ప్రజలో ఖచ్చితంగా చెప్పలేము. ప్రస్తుతం మనదేశంలోని మైదాన ప్రదేశాల్లో తిరిగే సంచార జాతుల వారి పూర్వీకులు వేల సంవత్సరాలకు పూర్వం నుండీ పశ్చిమ ఆసియాలోని వివిధ దేశాలలో తిరుగుతుండేవారు. వీళ్ళు తమతో పాటు ఎలుగుబంట్లనూ, కోతుల్ని, ఇతర వస్తువుల్ని తీసుకువెళ్ళి ఆ దేశాల్లో అమ్ముతుండేవారు. రాజకీయ కారణాలు ఒత్తిడి చేయనంత వరకూ, చైనా దేశంలో 'అడ్డుగోడ' నిర్మించనంత వరకూ వీరు తమ మాతృదేశమైన భారతదేశంలో సంబంధాల్ని కలిగి వున్నారు. కానీ, కాలక్రమంలో తూర్పుకు వచ్చి సింధు నదిని దాటి భారతదేశంలోకి రావటానికి బదులు పశ్చిమాసియాకు వెళ్ళిపోయారు. ఆంధ్రాప్రాంతంలో వీరిని 'ఇరానీ'లంటారు. పిన్నీసులూ,

సూదులూ, బాకులూ అమ్ముతుంటారు. వీరినే మధ్య ఆసియాలో, ఇరాన్‌లో లోలీలనీ రష్యాలో 'సిగాన్'లనీ, యూరప్‌లోని కొన్ని దేశాలలో 'రోమన్'లనీ, ఇంగ్లాండులో 'జిప్సీ'లనీ అంటారు. తమ భాషలో వీళ్ళని 'రోమ్'లని కానీ 'డోమ్'లని కానీ అంటారు. ఖంబాలకూ, ఈ 'రోమ్'లకూ ఆకారాల్లో ఎటువంటి పోలిక కనిపించకపోయినా, ఇతర అనేక విషయా లలో సామీప్యత కనిపిస్తుంది. ఇంతవరకూ ఖంబాలకు తాము అటు చైనా ప్రజలమని కానీ ఇటు భారతదేశ ప్రజలమని కానీ ఖచ్చితంగా చెప్పుకోవల్సిన పరిస్థితులు ఏర్పడలేదు. ఇప్పుడలా చెల్లదు. మన సరిహద్దు ఎర్రగీతతో గుర్తించబడి వున్నది. వాళ్ళు వెనుకటిలా స్వతంత్రంగా తిరగటం ఇప్పుడు సంభవం కాదు.

మధుపురిలో దాదాపుగా పది పదిహేను ఖంబా కుటుంబాలు నివసిస్తున్నాయి. వీళ్ళు వేసవికాలంలో మధుపురికి వచ్చే విలాస యాత్రికులకు టిబెట్టులో తయారైన చిన్న చిన్న ఆట వస్తువులను అమ్ముతూంటారు. చలికాలంలో ఢిల్లీలోని బజార్లల్లో తమ దుకాణాలను పరుస్తారు. టిబెట్టులో కొత్తగా మార్పులు వచ్చీ రావటంతోనే మనదేశంలోని పోలీసుల దృష్టి ఈ ఖంబాలాల మీద పడింది. ఢిల్లీలో వున్న మంగోలు జాతి ముఖ (ముద్ర) కవళికలు వున్న ఒక ఇరవైమంది ఖంబాలాలను బలవంతంగా విదేశీయులన్నారు. వాళ్ళకు ఫొటోలు, పాస్‌పోర్టులు అంటకట్టారు. ఆ సంవత్సరం మధుపురిలోని ఖంబాలల్లో చాలా కలవరం మొదలైంది. అక్కడ వున్న వాళ్ళందరినీ టిబెట్టు ప్రజలు అనేశారు. వాళ్ళు తమ గుడారాల్లో టిబెట్టు భాషనే మాట్లాడుకుంటూ వుంటారు. అయితే, వాళ్ళల్లో ఎవరూ టిబెట్టు ప్రాంతాన్ని చూడనైనా చూడలేదు.

ఈ ఖంబాలాలకూ టిబెట్టు ప్రభుత్వానికీ వున్న సంబంధం ఏమిటంటే టిబెట్టుకు వెళ్ళినప్పుడు వీళ్ళు అక్కడి అధికారులకు భారతదేశం నుండి తెచ్చిన వస్తువు నొకదాన్ని కానుకగా ఇచ్చేస్తారు. భారతదేశంలో అలాంటి కానుకలు ఏమీ ఇవ్వరు. అయితే, ఈ ఖంబాలాలకూ ఓ ప్రభుత్వం కానీ, రాజుకానీ లేడని అనుకోవటానికి లేదు. వాళ్ళకు 'గోవా' (పెద్ద) ఒకరు వుంటారు. అతనే వాళ్ళజాతి అంతటికీ రాజుతో సమానం. ఖంబాల రాజు నిరంకుశుడుగా వుండటానికి వీల్లేదు. అతడు ఒకవేళ అసమర్థుడైతే మరొకతన్ని 'గోవా'గా నియమించుకుంటారు. ఖంబాలాలకు స్థిర నివాసం వుండదు కనుక వాళ్ళకు సరిహద్దుల సమస్య వుండదనుకుంటారు. కానీ అలా కాదు. వేల సంవత్సరాలుగా వస్తున్న జీవితానుభవాల్ని బట్టి, వాళ్ళ జీవన సంఘర్షణలను బట్టి తాము తిరిగే భూభాగాలకు కొన్ని సరిహద్దుల్ని వాళ్ళు ఏర్పరచుకున్నారు. కనౌరీ ఖంబాలు మానస సరోవరం నుండి పతంజ్ మీదుగా సిమ్లా, మండే, అంతకంటే కూడా కింద వుండే నగరాలకు వచ్చి పోతూ వుంటారు. వీళ్ళకు ప్రత్యేకంగా ఒక 'గోవా' వున్నాడు. అలాగే గంగోత్రి నుండి,

భగీరథ తీరం వెంబడి నైలంగ్ మీదుగా టిబెట్టుకు వెళ్ళే ఖంబాలాలు వున్నారు. వాళ్ళకూ ప్రత్యేకంగా 'గోవా' వున్నాడు. భారతదేశం నుండి పశ్చిమ టిబెట్టుకు వెళ్ళే వివిధ ప్రాంతాల ఖంబాలాలందరికీ విడివిడిగా సంఘాలున్నాయి. గోవాలున్నారు.

ఖంబా జీవితం బిసునూకు బాగా నచ్చింది. అది గుంజకు కట్టివేసిన బర్రెదూడ జీవితం లాంటిది కాదు. ఒక ఊరుకానీ, ఒక క్షేత్రం కానీ ఏదీ వాళ్ళను బంధించదు. తమ స్వాతంత్ర్యాన్ని గురించి చెప్తూ ఒక ఖంబా యువకుడు ఇట్లా అన్నాడు. మేము టిబెట్టులో వరి అన్నం, మిఠాయిలు తినగలం. టిబెట్టు ప్రజలకు ఈ పదార్థాలు దొరకటం దుర్లభం! అలాగే క్రింది ప్రాంతాలకు వచ్చినప్పుడు ఇక్కడి ప్రజలు కలలో కూడా చూడని గొప్ప పదార్థాలను తింటాము. మాలాగా తినగల అదృష్టము, మాలాగా బట్టల్ని వేసుకునే అదృష్టం అటు మానస సరోవర ప్రాంత ప్రజలకూ లేదు. ఇటు క్రింది ప్రజలకూ లేదు. మేమే కనక ఒక చోట స్థిర నివాసాన్ని ఏర్పరచుకుంటే ఈ గొప్ప ఆహారాన్ని, మంచి వస్త్రాల్ని పోగొట్టుకున్నవాళ్ళం కామా?" ఖంబా యువకుడు ఎవరైనా బిసునూ దగ్గర తమ జీవితంలోని అద్భుతాన్ని పొగిడేశాడో ఏమో చెప్పలేము. కానీ బిసునూకు సంచార జీవితమంటే ఇష్టం. మురికి గ్రామాల్లో, ఇరుకు గొందుల్లో మగ్గి పోవల్సిన అవుసరం వాళ్ళకు లేదు. అడవుల్లోనో, మైదానాల్లోనో ఉన్ముక్తమైన ఆకాశం కింద తమ గుడారాల్ని వేసుకుంటూ వుంటారు. గూడారాలే వాళ్ళకు సర్వస్వం. ఎక్కువ వర్షం కురిసే ప్రదేశాల్లో ఎలాగూ వాళ్ళు వుండరు. గుడారాలే చాలు వాళ్ళకు. బిసునుకూ తమ గ్రామంలోనే ఖంబాలాలు పరిచయం అయ్యారు. వాళ్ళు దిగువకు వెళ్ళేటప్పుడు, ఎగువకు వెళ్ళేటప్పుడు సంవత్సరానికి రెండుసార్లు ఖంబాలా గుడారాలు కనం గ్రామపు శివార్లలో వెలుస్తూ వుంటాయి. అప్పుడప్పుడూ తమ వస్తువుల్ని అమ్ముకోవటానికి గ్రామంలోకి వస్తుంటారు వాళ్ళు. అయితే, ఈ ఖంబాలాల వల్ల తనకు ప్రయోజనం లేదు. బిసునూ తమగ్రామాన్ని వీడి చాలా దూరం యాత్ర చెయ్యాలనుకున్నాడు. తమ గ్రామానికి ఒక్క రెండు రోజుల ప్రయాణం దూరంలోనే టిబెట్టు వుంది. గుంబాలో చేరి చదువుకునే బౌద్ధ విద్యార్థులు లాసా వెళుతుంటారు. తమ గ్రామం మీదుగా ఎగువకు వెళ్ళి, సరిహద్దును దాటి లాసా వెళ్ళాలంటే కొన్ని నెలలు ప్రయాణం చెయ్యాలి. అంత ప్రయాణాన్ని చెయ్యలేక సరిహద్దున గల టిబెట్టు ప్రజలు లాసా వెళ్ళవలసి వచ్చినప్పుడు దిగువకు వచ్చి రైల్లో 'సిలిగోడ్' వెళ్ళి అక్కడనుంచి 'కాలింపోంగ్' మీదుగా టిబెట్టుకు వెళుతూ వుంటారు. తమ గ్రామస్థులలో కొందరు తీర్థయాత్రలు చేయటానికి బుద్ధగయ, బనారస్ కూడా వెళ్ళారు. బిసునూకు ఆ తీర్థయాత్ర గురించి అంతగా తెలియదు. ఒకమాటు తన తండ్రితో చాంగ్‌థాంగ్ వెళ్ళాడు. సంచారులైన పశువులకాపర్ల దగ్గర ఉన్ని కొనటానికి అక్కడకు వెళ్ళారు. గొర్రెల ఉన్నినీ,

ఇంకా ఇతర వస్తువులను కొనుక్కోవటానికి అక్కడకు కొన్ని సంతలు కూడా వుంటాయి. వాటిలో 'గ్యానిమా' ప్రసిద్ధమైనది. అక్కడికి ఖంబాలాలూ వస్తుంటారు.

అప్పుడు బిసునూ యవ్వనంలో వున్నాడు. అతని కళ్ళు మంగోలు జాతికి చెందినట్టుగా వుంటాయి. పొడగరి అందమైన వాడు ఆరోగ్యవంతుడు. చాలాసార్లు టిబెట్టు యాత్ర చేయటం వల్ల టిబెట్టు భాషనూ, మాతృభాషలా మాట్లాడగలడు. ఒకసారి గ్యానిమాలో చాలా రోజులపాటు మకాం వేశాడు. అప్పుడు అతనికి ఒక ఖంబా యువతి పరిచయం అయింది. పరిచయం ప్రేమగా మారింది. కానీ, ఆ ప్రేమను బిసునూ తండ్రి ఎట్లా అంగీకరిస్తాడు? ఇంట్లో అన్నదమ్ములందరికీ ఉమ్మడి వధువు సిద్దంగా వుంది. ఆమెను కాదని బిసునూ స్వతంత్రించి మరొక యువతిని ప్రేమిస్తే తండ్రి సహించగలడా? అయితే, ఖంబా యువతికి ఆ ప్రజలనుండి పెద్ద వత్తిడి ఏమీ రాలేదు. ఖంబాలు తమ జాతి ప్రజలు ఇతరులను వివాహమాడటానికి ఒప్పుకోరు. కానీ గట్టిగా వ్యతిరేకించడమూ చేయరు. అయితే, తమ స్త్రీ, పురుషులు తమ గుంపులో కాకుండా మరొకరిని వివాహ మాడటాన్ని ఇష్టపడరు.

ఒకరోజున యువతీ యువకులు ఇద్దరూ 'గ్యానిమా' నుండి పారిపోయారు. ఆ ప్రాంతంలో 20 మైళ్ళు వెళితే కాని ఊరు తగలదు. మధ్యలో ఎక్కడైనా రెండు దార్లు వున్నాయంటే ఏదారిన వెళితే గమ్యాన్ని చేరుకుంటామో చెప్పే దిక్కు వుండదు. అలాంటి ప్రదేశాల్లో ఇలా లేచిపోవటం దుస్సాహసం కాక మరేమవుతుంది? కానీ బిసును సాహసికుడు. అభ్యంతరాల్ని లెక్క చేయడు. గతంలో కూడా అనేకసార్లు మానస సరోవర యాత్ర చేశాడు. మానస సరోవరాన్ని హిందువులు ఎంత పవిత్రమైనదిగా భావిస్తారో? బౌద్ధులూ అంతే పవిత్రమైనదిగా భావిస్తారు? వాళ్ళు పారిపోవటం సరియైన సమయంలోనే పారిపోయారు. తమ కోసం వెతకటానికి ఏమాత్రం సమయాన్ని వాళ్ళు ఖర్చు పెట్టటానికి వీలులేని పరిస్థితులలో వాళ్ళను వుంచి మరీ లేచిపోయారు. ఆ సమయంలో వీళ్ళను వెతకటాని కోసం ఏ మాత్రం ఆలస్యం చేసినా ప్రథమ హిమపాతం జరుగుతుంది. ఎన్నో పశువులూ, ఎందరో మానవులు నశిస్తారు. ఖంబాలులూ, కనౌరీలు వీళ్ళను వీళ్ళ ఖర్మానికి వదిలి కిందకి దిగిపోయారు.

## 4

శారీరక శ్రమ చేయటం వాళ్ళకు ఎటూ అలవాటే! బిసునూయే కాదు. అతని ప్రేమికురాలు కూడా శ్రమ పడుతుంది. మణుగు బరువును వీపుమీద వేసుకుని ఎంత ఎత్తయినా ఎక్కుతుంది. ఎంత దూరమైనా నడుస్తుంది. గాడిదల్ని, గొర్రెల్ని, మేకల్ని ఎలా

తోలుకు వెళ్ళాల్నో, ఎలా మంద వేయాల్నో ఆమెకు బాగా తెలుసు. 25 సంవత్సరాల క్రితం 'గరవ్యాంగ్' వ్యాపారులూ, ఖంబాలాలూ కూడా మానస సరోవర ప్రాంతంనుండే ఉన్నినీ, చమరీ వాలీల్ని పట్టుకు వచ్చి కింది ప్రదేశాల్లో అమ్ముతుండేవారు. అలాంటప్పుడు బిసునూకూ, అతని ప్రేయసికీ కూలీ దొరకటంలో అభ్యంతరం ఏముంటుంది? కూలికి కుదిరారు. దీపావళి సమయానికి అల్మాడాలోని తిరునాళ్ళకు వచ్చారు. తమ యజమాని గొర్రెల్ని చూస్తూనే, తమ సొంత వస్తువుల్ని కొన్నింటిని మోసుకు తెచ్చుకున్నారు. యజమాని పని అయిపోయాక కూలీ తీసుకుని 'రాణీఖేత్' మీదుగా కాశీపూర్ చేరి తమ వస్తువుల్ని అమ్ముకున్నారు. ముందు పట్నాల్లో అమ్ముకోవటానికి అవుసరం అయిన వస్తువుల్ని కొనుక్కున్నారు. దారిలో మరికొందరు ఖంబాలాలు కలిశారు. వాళ్ళదగ్గర చౌకగా ఒక గాడిద పిల్లని కొనుక్కున్నారు. పూర్తి 'ఖంబా'గా అనిపించుకోవాలంటే గుడ్డవేసిన డేరా తప్పనిసరిగా వుండవల్సిందే! ఒక పాత డేరా గుడ్డనూ కొనుక్కున్నారు. ఇక పక్కా ఖంబా దంపతులై పోయారు. మానస సరోవర యాత్రకు బయలుదేరారు!

ఏదో ఒక ఖంబా గుంపులో నియమంగా సభ్యులయ్యేవరకూ వాళ్ళకు బాధలు తప్పవు. బిసునూ తన తండ్రి ఖంబా వాడేనని చెప్పుకున్నాడు. భార్య ఎటూ ఖంబా యువతే! కానీ వీళ్ళు ధరమా ఖంబాలు కారు కనుక ఖంబా గోవాకు, ఇతర ఖంబా పెద్దలకూ మాంసంతో, సారాతో విందు చేసి వాళ్ళను ప్రీతిపాత్రులను చేసుకోవాలి. అప్పుడు కానీ వాళ్ళు ఖంబా సమాజంలో చేరలేరు. మొదటి సంవత్సరం విందు చేయలేకపోయారు. గుంపుపెద్దలూ వాళ్ళను తొందరపెట్టలేదు.

బిసునూ ఇప్పుడు పూర్తిగా ఖంబా అయిపోయాడు. చాలా సంవత్సరాల పాటు అతను మానస సరోవరము – ఢిల్లీల మధ్య వ్యాపారం చేసుకుంటూ తిరిగాడు. గుంపు పెద్దలకు విందు ఇచ్చాడు. తన గాడిదనూ, ఇతర వస్తువులనూ కులపెద్దలకు ఒప్పగించి బుద్ధగయ, బనారస్ తీర్థయాత్రలు చేసి వచ్చాడు. ఖంబాలు దేశాలన్నీ తిరుగుతూ వుంటారు. అయినా, వాళ్ళకు కల్లా కపటం తెలియదు. మోసం చేయటమంటే ఏమిటో కూడా వాళ్ళకు తెలియదు. తమ గోవాల్లాగా ధనవంతులవ్వాలని ఖంబాలు ఎవరూ అనుకోరు. తమ బంధువులు ఎవరైనా కనిపిస్తారన్న భయం లేదు బిసునూకు! వాళ్ళు తిరిగే రూట్లు వేరు. ఇతను తిరిగే రూట్లు వేరు. బిసునూ పారిపోయి వచ్చిన కొద్ది సంవత్సరాలకే తండ్రులు మరణించారు. అన్నలూ తమ్ముళ్లూ వున్నారు. వాళ్ళు బిసునూను మరిచిపోయారు. బిసునూ వాళ్ళనూ మర్చిపోయాడు. కనంలో తమకు భూమి వుంది. మంచి ఇల్లూ వుంది. పశువులూ వున్నాయి. అయినా, కనం వెళ్ళాలని అతను ఎన్నడూ అనుకోలేదు. ఈ జీవితమే అతనికి నచ్చింది.

# 5

గరగ్యాంగ్ ఖంబాగా వుండటం బిసునూకు నచ్చలేదు. ఒకసారి టిబెట్టు వస్తువుల్ని కొన్నింటిని ఢిల్లీలో అమ్మటానికి వెళ్ళాడతను. అక్కడ అతను గంగోత్రికి చెందిన నేలంగ్ ఖంబాల్ని కలుసుకున్నాడు. మానససరోవరం నుండి ఢిల్లీ రావటానికి తాము వెళ్ళే మార్గం కంటే 'నేలంగ్ ఖంబా'లు వెళ్ళే మార్గం సుగమమైనదని తెల్సుకున్నాడు. ఇంకేముంది 'నేలంగ్ ఖంబాల' గుంపులో చేరిపోయాడు. ఒక గుంపుకు చెందిన ఖంబా మరొక గుంపుకు తన సభ్యత్వాన్ని మార్చుకోవచ్చు. బిసునూ తెలివికలవాడు. కలివిడి స్వభావం కలవాడు. త్వరలోనే కొత్త గుంపులో కలిసిపోయాడు. 'గరగ్యాంగ్' సమూహంలో కలవడం వల్ల చలికాలంలో ఢిల్లీలోని ఇంగ్లీషు వాళ్ళకూ, ఇతర విదేశీలయుకూ తన వస్తువుల్ని అమ్ముకునే అవకాశం లభించటమే కాకుండా, మధుపురికీ రాగలిగాడు. కొన్ని ఖంబా కుటుంబాలు సంచార జీవితానికి విసిగిపోయాయి. వీళ్ళుమధుపురిలోనే వుండి సీజన్ సమయంలో తమ వస్తువుల్ని అమ్ముకుంటూ వుంటారు. వీళ్ళు వస్తువుల కోసం టిబెట్టు వెళ్ళకుండా, టిబెట్టు వెళ్ళి వచ్చిన ఇతర ఖంబాల దగ్గర వస్తువుల్ని కొనుక్కుంటారు. చలికాలంలో ఢిల్లీ వెళ్ళి అక్కడ తమ వస్తువుల్ని అమ్ముకుంటారు. బిసునూ కూడా మధుపురికి వెళ్ళాడు. నాలుగు రోజుల పాటు రోడ్డుపక్కన వస్తువుల్ని పరుచుకుని వ్యాపారం చేశాడు. అయితే, మధుపురిలోనే స్థిరంగా వుండిపోవాలనుకున్నది అతని ఉద్దేశం కాదు.

అనుకోని విషయాలు అనేకం జరుగుతూ వుంటాయి జీవితంలో! పర్వత మార్గాలు చాలా ప్రమాదకరమైనది. ఒకసారి మేకలు వెళ్ళే మార్గంలో వెళ్తున్నాడు బిసునూ. కాలు జారింది. కొన్ని వందల గజాల లోతున వున్న గొయ్యిలో పడిపోయాడు. గుంపులోని మిగిలిన వాళ్ళు ఎలాగోలా బయటకు తీశారు. సంచారులకు సొంత వైద్యులు వుంటారు. వాళ్ళకు సొంత మందులూ వుంటాయి. కొంతకాలం సొంతవైద్యము చేశారు. మనిషి బతికాడు కానీ తుంటి ఎముక దెబ్బతిన్నది. కాలు ఈడ్చుకుంటూ నిదానంగా నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అట్లా నిదానంగా కాలు ఈడ్చుకుంటూ నడుస్తూ ఢిల్లీ నుండి మానస సరోవరానికీ, మానస సరోవరం నుండి ఢిల్లీకి ఎలా వెళ్ళగలడు. అందుకే మధుపురిలో స్థిర నివాసం ఏర్పరచు కోవాలనుకున్నాడు.

మధుపురిలో వున్న పది పన్నెండు కుటుంబాలతో మరొక కుటుంబం వచ్చి కల్సింది. బిసునూ మధుపురిలోని ఒక పురాతనమైన వీధిలో చిన్నకొట్టును అద్దెకు తీసుకున్నాడు. తినటం, తాగటం, జల్సా చేయటమే ఖంబాల జీవిత లక్ష్యం. లాభం ఎక్కువగా వుంటే ఇంకా కొంచెం ఎక్కువ ఖర్చుపెడ్తారు. అయితే, వ్యర్థమైన ఖర్చులు పెట్టరు. తన చిన్న దుకాణంలో విలాసయాత్రికులకు అవసరం అయిన ఎన్నో వస్తువుల్ని తెచ్చిపెట్టుకున్నాడు.

టిబెట్టు దేశపు టీ కప్పులు, బొమ్మలు, చైనా దేశపు వస్తువుల్ని, మరికొన్ని ఇతర వస్తువుల్ని కూడా తెచ్చిపెట్టాడు. సూదులూ, దారం, రంగురంగుల ఊలు, గాడిద మెళ్ళల్లో కట్టే గంటలూ, ఇలా ఎన్నో వస్తువుల్ని అమ్ముతూ వుంటాడు. అతను తీసుకున్న దుకాణం మూడు గదులది. చివరకు ఒక వసారా వుంది. వసారాలో అతని భార్య కుంపటి మీద వంట చేస్తూ వుంటుంది. బిసునూ పుట్టి పెరిగింది వరి పండే ప్రదేశంలో కాదు. అక్కడ గోధుమను ఎక్కువగా వాడతారు. కానీ, యవల రొట్టెను ఎక్కువగా తింటూ వుంటారు. బంగళాదుంపలు విపరీతంగా పండుతాయి. ఇతర కూరగాయలూ బాగానే పండుతాయి. కనుక, గోధుమ, యవ, జొన్న రొట్టెల్ని తింటారు. సంచారులకు ఒక ప్రాంతానికి సంబంధించిన ఆహారం ఎప్పుడూ కావాలంటే ఎలా వస్తుంది? బిసునూ టిబెట్టుకు వెళ్ళినప్పుడు యవల పిండి తినేవాడు. క్రింది ప్రాంతానికి వచ్చినప్పుడు వరి అన్నం తినేవాడు. మాంసం కొద్దో గొప్పో రోజూ వుండాల్సిందే! కాలు విరిగాక సంచార జీవితాన్ని బలవంతంగా విరమించుకున్నాడు. ఆ జీవితం జ్ఞాపకం వస్తే ఇప్పటికి అతని మనస్సు బాధపడుతూ వుంటుంది.

మధుపురిలో స్థిరనివాసాన్ని ఏర్పరచుకున్న రెండు సంవత్సరాలకే రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభం అయింది. మధుపురి అదృష్టం పండింది. ఇంగ్లీషు సైనికులు, అమెరికన్ సైనికులు మధుపురికి రావటం మొదలుపెట్టారు. వాళ్ళకు టిబెట్టుకు,చైనాకు చెందిన కళాత్మకమైన వస్తువులంటే చాలా ఇష్టం. బిసునూ దుకాణంలో కూర్చునేవాడు. అతని భార్య వీపుకు పెట్టెనొకదాన్ని కట్టుకుని దాన్లో వస్తువుల్ని పెట్టుకుని హోటళ్ళ చుట్టూ తిరుగుతూ అమ్మేది. ప్రతిరోజు పదిహేను ఇరవై రూపాయల దాకా లాభం వుండేది. యుద్ధ సమయంలో సంపాదనకు మంచి అవకాశం దొరికింది. కొంచెం జాగ్రత్తపడి వుంటే బిసునూ పది పదిహేను వేల రూపాయలదాకా సంపాదించుకునేవాడే!

1947 ఆగస్టు నెల వచ్చింది. ఇంగ్లీషు వాళ్ళు వెళ్ళిపోయారు. విదేశీ మిషనరీలు, ఢిల్లీలోని, యూరప్‌కు చెందిన రాయబారుల కుటుంబాలు కొన్ని మాత్రం సీజన్‌లో మధుపురిలో వుంటున్నాయి. వీళ్ళకు మాత్రమే తన వస్తువులను అమ్ముకుంటే బిసునూ కుటుంబం గడిచేదెట్లా? మధుపురిలోని ఇతర దుకాణాలకు పట్టినట్టే బిసునూ దుకాణానికి శని పట్టింది. ఇంకా మధుపురిలోనే వుంటే పెట్టుబడిలోంచే తినవల్సి వస్తుంది. శీతాకాలంలో ఢిల్లీ అయినా వెళితే బాగుండుననుకున్నాడు. అయితే, ఢిల్లీ వెళ్ళినా పరిస్థితులు బాగుపడతాయనేది సంశయమే! ఖంబాలులు టీ కప్పుల్ని, ఇతర చిట్టిపొట్టి వస్తువుల్ని టిబెట్టువనీ, చైనావనీ చెప్పి అమ్ముతూ వుంటారు. నిజానికి అవి టిబెట్టువూకాదు, చైనావీ కాదు. ఏ ఢిల్లీలోనో, అమృతసర్‌లోనో తయారైనవి. ఇక్కడ తయారైనంత మాత్రాన

మూలానికి భిన్నంగా వుంటాయని కాదు. ఎవరైనా తగిన ధర పెట్టటానికి సిద్ధం అయితే నిజంగా చైనాలోనో, టిబెట్టులోనో తయారైన కప్పు సాసర్లను అమ్ముతారు.

ఇంగ్లీషువాళ్లు వెళ్లిపోయాక మధుపురిలోని ఇతర వ్యాపారాల లాగానే ఖంబాల వ్యాపారమూ పడిపోయింది. ఖంబాలుల జీవితాలు సంకటంలో పడ్డాయి. తిండీ–తిప్పలకు కూడా బాధపడుతున్నారు. మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్టు, టిబెట్టును ఎర్రచైనా ఆక్రమించటంతో భారతదేశంలోని ఖంబాల పరిస్థితి మరీ అధ్వాన్నమయింది. సరిహద్దుల్లో కాపలా కట్టుదిట్టమవటంతో ఢిల్లీకి ప్రతి సంవత్సరం వచ్చే ఖంబాలు ఇబ్బందుల్లో పడ్డారు.

బిసునూను ఖంబా గుంపులోకి మార్చిన ప్రేమికురాలు ఒక మగశిశువును కని చనిపోయింది. మరో ఖంబా స్త్రీని వివాహ మాడాడు. ఈ సంబంధానికి చెందిన అత్తా–మామ, బావమరుదులు అందరూ ఇబ్బందుల్లోనే వున్నారు. ఈ మధ్య (1951లో) బిసునూ ఢిల్లీ వెళ్ళాడు. పోలీసులు అతణ్ణి పట్టుకున్నారు. చైనావాడిగా అతనిని ప్రామాణీకరించి ఫొటోతో సహా పాస్‌పోర్ట్ అంటగట్టారు. ఆ సంవత్సరం చలికాలాన్ని ఢిల్లీలో గడిపి వేసవిలో మధుపురికి వచ్చారు ఖంబాలు. వాళ్ళల్లో గొప్ప అలజడి కలిగింది. వాళ్ళందర్నీ చైనా వాళ్ళు అని అనేశారు. ఖంబాలు పోలీసు ఆఫీసర్లతో 'మేము చైనావాళ్ళం కాదు. టిబెట్టు వాళ్ళమూ కాదు. మేము ఇక్కడి వాళ్లమే! మాలో చాలామంది ఈ మధుపురిలోనే పుట్టారు" అన్నారు.

"పోలీసు ఆఫీసర్లు అంగీకరించలేదు! మీ ముఖకవళికలు చూస్తుంటే మీరు టిబెట్టు దేశస్థులని చెప్పేస్తున్నాయి. టిబెట్టు దేశస్థులు కనుక మీరు తప్పకుండా చైనా పౌరులు. మీరు ఈ కాగితాల్ని దగ్గర పెట్టుకోండి. ఎక్కడికి వెళితే అక్కడి పోలీసులకు చూపండి వీటిని. అక్కడి పోలీసుల పర్యవేక్షణలో మీరు వుండాలి" అన్నారు. ఒక్క మధుపురిలోని ఖంబాలపట్ల మాత్రమే ఇలా జరగలేదు. లధక్‌లో, స్పితీలో వివిధ ప్రాంతాలలో వున్న ఖంబాలుపట్ల ఇలాంటి సంఘటననే జరిగింది. మంగోలు ముఖకవళికలు వున్న ప్రతివాడూ, విదేశస్థుడూ, చైనా వాడూ అయి వుండడని నిశ్చయించుకుంటే, లధక్‌నుండి అస్సాం వరకూ వున్న కొన్ని లక్షల మంది భారతీయుల్ని భారత పౌరసత్వం నుండి తొలగించవలసి వస్తుంది. మధుపురిలో నివాసాన్ని ఏర్పరచుకున్న ఖంబాలు కొంతమంది తమ పిల్లల్ని చదివించుకున్నారు. ఇద్దరు ఎఫ్.ఎ. వరకూ చదివారు. ఒకతను బి.ఎ. వరకూ చదివాడు. వాళ్ళు వెనుకబడిన జాతికి చెందినవాళ్ళు! ఏ ఉద్యోగానికయినా అప్లికేషన్ పెట్టుకుంటే 'భారతీయుడన్న' ప్రమాణ పత్రాన్ని తీసుకు రమ్మంటున్నారు. ఇది 'పిచ్చి కుదిరింది. రోకలి తలకు చుట్ట' మన్న సామెతలాగా వుంది. వాళ్ళు ప్రమాణపత్రాన్ని ఎక్కడ తెస్తారు? ఉద్యోగాలు ఎప్పుడు చేస్తారు?

ఏ ఖంబా జీవితం కోసం ఇల్లూ వాకిలిని వదిలేశాడో? ఏ ఖంబా జీవితం కాలు విరిగినా తనను అంటిపెట్టుకుని వున్నదో, ఉత్సాహకరమైన ఆ జీవితం యాభై సంవత్సరాల బిసునూకు స్వప్న లోకపు జీవితం అయింది. ఇప్పటి అతని జీవితం కంటే 'కరతల భిక్షా, ఆరుతల వాస్' చాలా గొప్ప జీవితం అనవచ్చు. ఈ సంవత్సరం బిసునూ జబ్బున పడ్డాడు. ఆరునెలలకు కానీ మంచంలో కాలు కింద పెట్టగలిగాడు. చాలా మందులు తిన్నాడు. ఎన్నో ఇంజక్షన్లు చేయించుకున్నాడు. 'కరువులో అధికమాసం' అన్నట్టూ, మందులకూ, డాక్టర్లకూ ఐదారు వందలు ఖర్చు అయ్యాయి. ఎలాగో నక్కల నోట గుడ్డ కట్టాడు! ఓపిక, బలం పూర్తిగా రాకుండానే ఈ సంవత్సరం నవంబరులో కుటుంబంతో సహా ఢిల్లీకి వెళ్ళారు. 1-4-1954వ తేదీన బిసునూ అనే ఉపనామం కల కిషన్‌సింగ్ ఢిల్లీలోనే ఇహ జీవన యాత్రను ముగించాడు.

బిసునూ జీవితం అంతా సుఖకరమైనదని కానీ, నిర్విచారంగా గడిచింది అని కానీ చెప్పలేము. అతని జీవితంలోనూ బాధలున్నాయి. సమస్యలూ వున్నాయి. అయినా అతను చివరిక్షణం వరకూ దయార్ద్ర హృదయుడనే అనిపించుకున్నాడు. అతిథులను సత్కరించటం లోనూ, తోటి మానవులకు సహాయపడటంలోనూ అతడిని చెప్పే మరొకర్ని చెప్పుకోవాలి! ఈ మధ్య బాధామయమైన జీవితాన్ని గడుపుతున్న రోజుల్లోనూ, అతను తన సహజ ఔదార్యాన్ని చంపుకోలేదు!

# పేడ్-బాబా

ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో జూన్ 15నుండి సెప్టెంబర్ చివరి వరకూ వర్షాలు పడుతూ వుంటాయి. అలాగే మధుపురిలోనూ వర్షం పడుతుంది. అయితే ఆ సంవత్సరం జూన్ 15కే వర్షాలు ప్రారంభమయ్యాయి. కానీ ప్రతి సంవత్సరం జూన్ 15నే వర్షం పడి తీరుతుందన్న గ్యారంటీ లేదు. సెప్టెంబర్ గడిచినా వర్షం వదల్లేదు. చుట్టూ కొండలు వున్నాయి కాబట్టి సరిపోయింది. లేకపోతే ఆ వర్షానికి తప్పకుండా వరద వచ్చేది. మధుపురిలోని ప్రజలు చాలా ఇబ్బందిపడిపోయేవారు. మధుపురిలో వర్షాలు అతిగా పడిన సంవత్సరం భూపాతం జరగటం ఆచారం. ఆ సంవత్సరం అక్కడక్కడా చెదురు మదురుగా గానీ జరగలేదు. కొండలపైన రోడ్లు వేయటం ఖర్చుతో కూడిన పని. ఆ రోడ్లను నిత్యం పరిశీలిస్తూ వుండాల్సిన అవసరం వున్నది. మధుపురి మున్సిపాలిటీకి ఇతర మున్సిపాలిటీల్లాగానే రోడ్ల మరమ్మతుకు సంబంధించిన ప్రత్యేకమైన నియమాలున్నాయి. రోడ్డు కొంచెం బీట్లువారగానే మరమ్మత్తు చేసేయటం వారికి ఇష్టం వుండదు. రోడ్డు నెర్రెలు ఇచ్చింది. ఆ నెర్రెలల్లోంచి కొంత నీరు భూమిలోకి పోతుంది. అలాంటప్పుడే రిపేరు చేయవచ్చు. కానీ అలా చేయరు. రోడ్లు పూర్తిగా గోతులు పడి, బండ్లూ మనుషులూ వెళ్ళటానికి కూడా నిరుపయోగం అయ్యాక కానీ రిపేరు గురించి ఆలోచించరు. వంద రూపాయలతో అయిపోయేదాన్ని వెయ్యి రూపాయల వరకూ పెంచక పోతే కాంట్రాక్టరు ఏమైపోతాడు? ఈ సంవత్సరం మధుపురిలో రెండు మూడు చోట్ల గోతులు పడ్డాయి. క్రిందనుండి వచ్చే కార్లను నాలుగు రోజుల పాటు కిందనే ఆపేశారు.

మధుపురిలో వర్షం అధికంగా కురిసిందంటే చలీ ఎక్కువగానే వుంటుంది. రెండు మూడు రోజులు వదలకుండా వర్షంపడి, కొంచెం ఈదురుగాలి వీస్తే చాలు, చలి మొదలవుతుంది. ఇంత ఎత్తు ప్రదేశంలో చలి పెట్టటం అంటే, అది మామూలు చలిగా వుండదు. ప్రజలు పెట్టెల్లో దాచుకున్న ఉన్ని బట్టల్ని తీసుకుని ధరించాల్సిందే! సాధారణంగా వర్షాకాలం విలాసయాత్రికులు వచ్చే సీజన్ కాదు. కానీ పంజాబీలు ఎండలకు భయపడరు.

వర్షానికి భయపడతారు. కనుకనే వర్షాకాలంలో మధుపురిని సందడితో నింపడానికా అన్నట్టు పరుగెత్తుకు వస్తారు. పంజాబీలు వచ్చినా వేసవికాలంలో వున్న సందడి రాదు. అయితే, ఆ యాత్రయైనా సందడిని పట్టుకు వచ్చినందుకు పంజాబుకు చెందిన ఉన్నత వర్గ స్త్రీ పురుషుల్ని అభినందించవల్సిందే!

ఈ సంవత్సరం జులై, ఆగస్టు నెలల్లో కూడా మధుపురి జనసమ్మర్ధంగానే ఉండటానికి మరొక కారణం వుంది. మధుపురిలో తూర్పువైపు బజారులోని దుకాణాలు, కేవలం విలాస యాత్రికుల మీదనే ఆధారపడవు. స్థానిక ప్రజల మీద ఆధారపడ్డ వ్యాపారం కావడం వల్ల సంవత్సరం పొడుగునా ఒకే రకంగా వుంటుంది. మిగిలిన రెండు బజార్లూ ఎక్కువ శాతం విలాసయాత్రికుల మీద ఆధారపడ్డవి కావటం వల్ల సీజన్ సమయాల్లోనే సందడిగా వుంటాయి. ఆ రెండింటిలోనూ మధ్యలో వుండే బజారు చలికాలంలో దాదాపుగా పూర్తిగా మూతపడుతుంది. విలాసవస్తువులు అమ్మే దుకాణదారులు సీజన్ అయిపోగానే మధుపురిలో ఇక తమకు పనిలేదని తెల్సుకుంటారు. కానీ ఉప్పూ, పప్పూ, బియ్యం అమ్మే చిల్లర దుకాణదారులు అక్కడే వుండిపోతారు. ఒకటి వాళ్ళకు మరొకచోట ఆశ్రయం లేకపోవడం వలన కావచ్చు. రెండవది చలికాలంలో కూడా కొద్దో, గొప్పో వ్యాపారం సాగుతూనే వుంటుంది. మూడవ బజార్లో నయితే చాలా తక్కువ దుకాణాలే చలికాలంలో తెరచి వుంటాయి. మధుపురి నగర మధ్యలో వుండే బజారును సెంటర్ అని అంటారు. సీజన్ అయిపోయాక ఆ బజార్లో కొనుగోలుదారుల హడావుడి కొంత తగ్గినా సందడి ఎప్పటిలాగానే వుంటుంది. మధ్య బజారు మధుపురి సెంటర్‌లో వుంది. వ్యాపారస్థులకూ, కొనుగోలుదారులకూ ఇద్దరికీ బజారు ప్రత్యేకమైన ప్రాముఖ్యత కలదిగా కనిపిస్తుంది. కొండ అంచున బారుగా దుకాణాలు వుండటం వలన వాటిని దాటి కొంచెం ముందుకు వెళితే చాలు అడవి వస్తుంది.

ఆ సంవత్సరం ముసురు చాలారోజులు పట్టింది. చలీ ఎక్కువగానే అయింది. దాంతో అత్యవసరమైన పని వుంటేనే ప్రజలు బయటకు వస్తున్నారు. వెనుక వైపు వున్న బజార్లో ప్రజలు అసలే తిరగనే తిరగటం లేదు. ఉన్నట్టుండి ఒకరోజున ఒక వ్యక్తి ఆ బజార్లో ఒక ప్రాంతాన్ని చూశాడు. రోడ్డుపక్కన చెట్టుమీద కాషాయ రంగు బట్టలు వ్రేలాడుతూ వున్నాయి. వాటిమీద గొడుగొకటి తగిలించివుంది. ఊరికే తగిలించినట్టుగా కాకుండా బందోబస్తుగా తగిలించి వున్నాయి. మొదలుకు కొంచెం పైన రెండు కొమ్మలు అటొకటి ఇటొకటి చీలి వున్నాయి. వాటిమధ్య చెక్క నొకదాన్ని పెట్టి క్రిందపడకుండా తాళ్ళతో కట్టిన మంచం ఒకటి తయారై వున్నది. ఆ మంచం మీద ఒకానొక దివ్యమూర్తి శరీరం ఆది మధ్యాంతమూ, కాషాయాంబరంతో కప్పబడి కూర్చొని వుంది. అతడి నెత్తిన

గొడుగు అమర్చి వుంది. ఆ నోటా ఆనోటా పడి ఈ విషయం నలుగురికీ తెల్సింది. అయినా రెండు మూడు రోజులవరకూ ఈ విషయాన్ని గురించి ప్రత్యేకమైన శ్రద్ధను ఎవరూ ప్రదర్శించలేదు. అయితే, అంత వర్షంలోనూ, చలిలోనూ అలా రాత్రింబగళ్ళు చెట్టుమీద వుండటం అసాధారణ విషయం. అప్పుడప్పుడు ఒకళ్ళో, ఇద్దరో వచ్చి ఈ విచిత్రాన్ని చూస్తున్నారు. అయితే, ఆ మూర్తి మాత్రం రాతిప్రతిమలా నిశ్చలంగా వుంది. నాలుగయిదు రోజుల అనంతరం ఆ మూర్తిని గురించిన ప్రచారం ప్రారంభమయింది. సెంటర్ దగ్గర వున్న చెట్టుపైన వొక మహాపురుషుడు తపస్సు చేస్తున్నాడన్న వార్త మధుపురి అంతట్లోనూ పాకిపోయింది. ఆ మహాపురుషుడు ఆహారపానీయాల్ని కూడా విసర్జించి మరీ తపస్సు చేస్తున్నాడన్నవార్త ప్రచారం అయింది. దీంతో ప్రజల్లో ఉత్సుకత బయల్దేరింది. కుతూహలం పెరిగింది. ప్రజలు 'పేడ్ బాబా' (తరు మహాత్ముణ్ణి) చూడటానికి రాసాగారు. పేడ్‌బాబా ఎవరితోనూ మాట్లాడడు. కదలడు మెదలడు. పేడ్‌బాబా పేడ్ (చెట్టు) లాగానే నిశ్చలంగా వున్నాడు. అతడి ముఖం ఎలా వుంటుందో? ఆకారం ఎలా వుంటుందో? చూడాలని ప్రజలు కుతూహలపడుతున్నారు. ఒకవారం గడిచేసరికి పేడ్ బాబాని గురించి కథలూ, గాథలూ ప్రచారంలోకి వచ్చాయి. ఆహారమూ తీసుకోరు, శౌచానికీ వెళ్ళరు! అహర్నిశలూ ధ్యానమగ్నులై వుంటారు. అని అందరూ చెప్పుకోవటం మొదలు పెట్టారు.

ఏమీ తినకుండా ఒక వారం వుండటం అసాధ్యమయిన పని ఏమీ కాదు. అయినప్పటికీ కొందరు అనుమానాన్ని వ్యక్త పరచారు. 'రాత్రిపూట ఆహారం తెచ్చిపెడుతున్నారేమో'! అని అన్నారు. ఇంకొందరు ఒట్టు పెట్టుకుని మరీ సాక్ష్యం ఇవ్వడానికి సిద్ధపడ్డారు. "మేము రాత్రంతా కాపలాకాశాము. పేడ్‌బాబా కదలనైనా కదల్లేదు" అన్నారు. "వర్షం కురుస్తోంది కదా! తడిగుడ్డల్ని పిండుకుని గొంతు తడి చేసుకుంటున్నారేమో!" అని అన్నారు కొందరు. "బాబా పచ్చిగంగ ముట్టలేదు. మేము చూస్తున్నాం" అని సాక్ష్యం ఇచ్చారు కొందరు.

## 2

ఒకవారం గడచింది రెండవ వారమూ గడచింది. పేడ్‌బాబా తన స్థానం నుండి ఏ మాత్రమూ కదల్లేదు. ఇంక చలికాలంలో నిర్జీవంగా వుండే మధుపురిలోని ఆ సెంటర్‌కు ప్రజలు తిరునాళ్ళకు వచ్చినట్టుగా వస్తున్నారు. వర్షం క్షణమాగినా చాలు మధుపురిలోని స్త్రీ, పురుషులందరూ అక్కడే ప్రోగుపడేవారు. స్త్రీలు పూలమాలల్ని ఇతర పూజా సామాగ్రిని పట్టుకు వచ్చేవారు. పురుషులూ అంతే! విచిత్రమైన విషయం ఏమిటంటే తిరునాళ్ళలా వుస్తున్న ఈ ప్రజల్లో నిరక్షరాస్యులు అతి తక్కువమంది మాత్రమే వుంటారు. ఇతర ప్రదేశాల నుండి రెండవ సీజన్‌ని గడపటానికి వచ్చిన అప్ టు డేట్ ప్రజలు సెంటర్‌లో ఆ చెట్టు

కింద ప్రోగుపడుతున్నారు. పేడ్‌బాబా పుణ్యం వల్ల 'మేళా' ఏర్పాటయ్యింది. 'మేళా' (తిరునాళ్ళ) అన్న తర్వాత అన్ని హంగులూ వుండవలసిందే కదా! మిఠాయిలు అమ్మేవాళు ళ్ళ పళ్ళాలు పట్టుకుని తిరుగుతున్నారు. కిళ్లీ – బీడీ – సిగరెట్ అమ్మేవాళ్ళ అరుపులూ, మసాలా పప్పులు అమ్మేవాళ్ళు – హాస్యపు పాటల్ని పాడుతూ తిరుగుతున్నారు. అక్కడ పోగుపడ్డ తరుణీమణులు సినిమా తారల్ని మించి వున్నారు. మాటిమాటికీ హ్యాండ్‌బ్యాగ్ నుండి అద్దాల్ని తీసుకొని, పెదాలకు వేసుకున్న లిప్‌స్టిక్ చెదిరిందేమో చూసుకుంటున్నారు. గంభీర స్వభావులు పేడ్‌బాబాను గురించిన తర్కంలో మునిగి పోయారు. మధుపురిలో ప్రాక్టీసు పెట్టుకున్న ఇద్దరు వకీళ్ళు కోటూ–ప్యాంటూ – హేటు పెట్టుకుని వున్నారు. పేడ్‌బాబా వంక చూస్తూ మాట్లాడుకుంటున్నారు. వాళ్ళపక్కనుంచి పరిచయుడైన ఒక పెద్ద మనిషి వెళుతూ వుంటే ఉండబట్టలేక అతనికి ఇంగ్లీషులో పేడ్‌బాబా గురించి ఏమో చెప్పి ఆపారు. ఆ తర్వాత ఇద్దరు అడ్వకేట్లు పేడ్‌బాబా గొప్పతనాన్ని గురించి వర్ణించి, వర్ణించి అతనికి చెప్పారు. అప్పటికి పేడ్‌బాబా మూడు వారాలుగా ఆ చెట్టుపైన వుంటున్నాడు. అడ్వకేట్లు సూటూ–కోటూ బూటు వేసుకుని భోజనాది విషయాలలో నిషేధాన్ని పాటించక ఆధునికులమని చెప్పుకున్నప్పటికీ సనాతన ధర్మ నిష్ఠాగరిష్ఠులని వాళ్ళ మాటల వల్ల తెలుస్తూనే వున్నది. చెట్టుమీద కాషాయాంబర బాబా రూపంలో సనాతన ధర్మమే సాక్షాత్తూ వచ్చి కూర్చున్నదని అనవచ్చు. సనాతన ధర్మపు అత్యద్భుతాన్ని ప్రజలు తమకళ్ళముందే చూస్తున్నారు. సాధారణులు ఇలాంటి మహాత్ములే లేకపోతే ఈ ప్రపంచమే నడవదు అని అంటున్నారు. అడ్వకేట్లు తమ అభిప్రాయాన్ని ఇలా ఇస్తున్నారు. "ఔను మరి! ఇలాంటి తపస్సంపన్నులు లేకపోతే ప్రపంచమే నడవదు.

విపరీతమైన చలిలో రోజుల తరబడి చెట్టుమీద వుండటం నిజంగా ఆశ్చర్యకరమైన విషయమే! అయితే, ఇలాంటి విషయాలంటే నమ్మకంలేని వాళ్ళూ సెంటర్‌కు వచ్చి పేడ్‌బాబా వంక చూస్తుండేవారు. నా మిత్రుడొకాయన కొన్ని సంవత్సరాల పాటు అడవుల్లో ఘోర తపస్సు కూడా చేశాడు. (వీరిని గురించి రాహుల్జీ 'ఘుమక్కడ్‌స్వామి' అన్న గ్రంథంలో ప్రత్యేకంగా రాశారు). ఋషీకేశం వద్ద, గంగానదిని దాటి అడవిలో కొన్ని నెలలు చెట్టుమీద వుండిపోయాడు. ఆ అడవిలో ఇప్పటికీ ఏనుగుల సమూహాలు తిరుగుతూ వుంటాయి. నా మిత్రుడైన పేడ్‌బాబా గారిని, ఆ అడవిలోని ఏనుగులు బాగానే సత్కరించేవి. అయితే ఈయన ఏనుగులకు అలవికాని దృఢమైన మానుమీద ఏర్పాటు చేసుకున్నాడు. తాను కూర్చోవటానికి ఎత్తయిన కొమ్మల మీద గట్టి మంచంను తయారు చేసుకోవటంతో ఏనుగులు ఎంత ప్రయత్నించినా ఈయనగారు వాటికి అందకుండా తప్పించుకున్నారు.

ఏనుగులు రాత్రిపూట గంగానదీ స్నానానికో, నీరు త్రాగటానికో వచ్చేవి. వాటికి దారిలో నా మిత్రుడైన పేడ్‌బాబాగారు వున్న వృక్షం తగిలేది. నగరాలలో వుండేవారికి మృగాలంటే భయం. అరణ్యవాసులైన జంతువులకు మానవులంటే అంతకంటే భయం. ఒకరోజున రాత్రిపూట ఏనుగులు గంగానదికి వచ్చాయి. గంగానది ఒడ్డున వున్న బండరాళ్ళల్లో ఓ ఏనుగు గున్న చిక్కుకుపోయింది. దాన్ని బయటకు తీయటానికి ఏనుగులు రాత్రంతా ప్రయత్నించాయి. కానీ తీయలేకపోయాయి. తెల్లవారటానికి వచ్చింది. మానవ సంచారం ప్రారంభమవుతుంది. ఆ ఏనుగు పిల్లను అక్కడే వదిలి వెళ్ళిపోయాయి. నామిత్రుడికి తన తపస్సును మరొకరికి చూపవలసిన అవసరం లేకపోయింది. లేకపోతే గంగానదీ తీరంలో వున్న ఏ నగరం దగ్గర వుండే వృక్షాన్నో ఎన్నుకునేవాడు. ఆ అడవిలో కొంచెం దూరంలో పాలు అమ్ముకునే గొల్లవాళ్ళ గుడిసెలు కొన్నివున్నాయి. ఆ గొల్లలు ఆయనను చూశారు. ఎంత వద్దని చెప్పినా వినకుండా రోజూ పాలు ఇచ్చి వెళ్ళేవారు. పేడ్‌బాబా కేవలం పాలు తాగి వుండిపోయేవాడు. ఆయన కీర్తి ఋషీకేశంలోని ఒక సేటు దాకా పాకింది. అడవిలోకి వెళ్ళి నా మిత్రుడైన పేడ్‌బాబాను దర్శనం చేసుకున్నాడు ఆ సేటు. వద్దన్నా వినకుండా గొల్లలను పాలు నిత్యం పొయ్యమని చెప్పి ఆ డబ్బులు తను కట్టాడు. నా మిత్రుడు చాలా నిజాయితీగా హిందూ ధర్మంలో చెప్పినట్టుగా వివిధ రకాల తపస్సులను చేశాడు. వివిధ వ్రతాలనుష్టానాలనూ అనుష్టించాడు. యోగాభ్యాసం చేశాడు. మతం పేరుమీద బిజినెస్ చేయటం ఆయన ఉద్దేశం కాదు. అలాంటి ఉద్దేశ్యమే వుంటే లక్షలు గడించేవాడు. ఇప్పుడాయన వయస్సు అరవై సంవత్సరాలకు పైన వుంటుంది. అన్నింటినీ పరిశీలించి చివరకు ఖచ్చితమైన నాస్తికుడయ్యాడు.

నా మిత్రుడైన వెనుకటి పేడ్‌బాబా కూడా ఈ కొత్త పేడ్‌బాబా దగ్గరకు వెళ్ళి చూశాడు. నా మిత్రుడు ఇంటి గుట్టు తెలిసినవాడు. తాను సాధించలేని సిద్ధిని మరొకతను పొందటం చూసి ఈర్ష్య కలిగిందో ఏమో! “తపస్సు చేయాలనుకుంటే అడవికి వెళ్ళిపోవచ్చు కదా? ఇక్కడికి వచ్చి మధుపురిలోని సెంటరు బజారుకు వంద అడుగుల దూరంలో వున్న చెట్టెక్కి కూర్చొని ‘పేడ్‌బాబా’ అనిపించుకోవటం పచ్చిమోసం అని అన్నాడు.

అతని మిత్రుడు మరొకతను ప్రక్కన నిలబడి వున్నాడు. అతను ఇలా అన్నాడు “భారతదేశంలో ఎక్కడికైనా వెళ్ళి చూడండి. ఉత్తర, దక్షిణాల్లా, తూర్పు పడమరల్లా ఎక్కడికి వెళ్ళినా సరే మతాన్ని అంగళ్ళల్లో పెట్టి అమ్మటం స్పష్టంగా కనపడుతోంది. మతాన్ని అమ్మకానికి పెడుతూ, మత పెద్దలైన సాహుకార్లు (మతాచార్యులు) తమ సరుకు అమ్ముడు పోవడానికి క్రొత్త క్రొత్త ప్రచార సాధనాలను అమల్లోకి తెస్తున్నారు. ఇప్పుడు దేశం మీద ఇంగ్లీషువారి ముద్ర పడిపోయింది. ‘శంఖంలో పోస్తే కానీ తీర్థం కానట్టు’ మొదట

ఇంగ్లీషువాళ్ళ మెప్పు పొందితే కానీ ఏ సరుకయినా అంగట్లో చెల్లుబాటు కావటం లేదు. ఇంగ్లీషు చదువుల్లో డిగ్రీ పొందిన శిష్యులు కనీసం పదిమందయినా లేని ఆచార్యుల వారికి తమ సరుకు, మతము అమ్ముడు పోతాయన్న నమ్మకం తగ్గింది. నలుగురయిదుగురు ఇంగ్లీషు దొరలనూ, దొరసానులనూ శిష్యులుగా, శిష్యురాళ్ళుగా సంపాదించగలిగితే ఆచార్యుల వారి 'రొట్టె విరిగి నేతిలో పడ్డట్టే' నని అనుకోండి. మన భారతదేశపు పెట్టుబడిదారులకూ ఒక విషయం తెల్సు! దేశంలో మత పిచ్చి ఎంత ఎక్కువగా వుంటే, తమకు అంత క్షేమదాయకమని! కనుక ఇలాంటి వాటికి బహుళ ప్రచారాన్ని ఇవ్వటానికి తమ పత్రికల్లోని 'కాలమ్' లను ధారాళంగా వాడేస్తారు.

వీరిద్దరే కాకుండా వీరిలాంటి స్వతంత్ర భావాలు కలవాళ్లు మధుపురిలో ఇంకా వున్నారు. వాళ్ళు పేడ్ బాబా మీద కోపంగా వుండేవాళ్ళు. వాళ్ళకు కుదరలేదు కానీ కుదిరితే మాత్రం పేడ్ బాబాను ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించే వాళ్ళు. 'ఋణం కృత్వా ఘృతం పీవేత్' అన్న సిద్ధాంతాన్ని నమ్మేవారు. చార్వాకుల్లాగా నాస్తికులు కారు.

పేడ్‌బాబా మాట్లాడడు. కనీసం సౌంజ్ఞలతోనయినా భావాన్ని వ్యక్తీకరించడు. లేకపోతే మధుపురిలోని చాలా మంది ఆయన దగ్గరకు చేరి చేతులు చూపించి భవిష్యత్తును చెప్పించుకునేవారు! జాతక చక్రాన్ని వేయించుకునేవారు! గ్రహశాంతికి కొన్ని మంత్ర తంత్ర ఉపదేశాలన్నీ పొందేవారు. అలా ఉపదేశాల్ని పొందటం వలన వారికి సంభవించిన దైవికమైన, భౌతికమైన ఆధ్యాత్మికమైన ఎన్నో వ్యాధులు ఉపశమించేవి! అలాంటి శ్రద్ధాళువులు వున్నారు కనుకనే పేడ్‌బాబా మధుపురికి వచ్చారే కాని నాస్తికుల్ని, బౌద్ధికుల్ని (మేధావుల్ని) నమ్ముకుని వస్తారా? మధుపురిలో శ్రద్ధాళువులు చాలామంది వున్నారు. అలాంటప్పుడు పదిమందో, పదిహేనుమందో నాస్తికులు వున్నంత మాత్రాన పేడ్‌బాబాకు వచ్చిన నష్టం ఏముంటుంది? ఈ పదిపదిహేను మంది నాస్తికులు మిగతా ప్రజా సముద్రాన్ని పెడమార్గం పట్టించగలరా? ఎన్నటికీ పట్టించలేరు. శ్రద్దాళువులూ, ఆధ్యాత్మికులూ,. అయిన ప్రజలు అలాంటి నాస్తికులకు ముఖాన కొట్టినట్టు సమాధానమిస్తారు. పేడ్‌బాబాలో ఏ గొప్పతనమూ లేదంటున్నావుగా? పోనీ నువ్వూ వెళ్ళి ఈ చలిలో, వర్షంలో ఆ చెట్టు మీదకు వెళ్ళి కూర్చో, తెలుస్తుంది!"అని ముఖాన అనేస్తారు.

ఒకవారం గడిచాక పేడ్‌బాబా రోజూ కొన్ని క్షణాలపాటు భక్తులకు ముఖదర్శనం ఇస్తారన్న వార్త మెరుపు తీగలా ప్రచారమై ప్రజల్లో వ్యాపించింది. బాబా ప్రజలకు దర్శనం ఇవ్వటానికి మధ్యాహ్న సమయాన్ని ఎన్నుకున్నాడు. మధ్యాహ్న సమయంలో బాబా తన ముఖాన వున్న కాషాయాంబరాన్ని తీసేసి కొన్ని క్షణాలు ప్రజలకు దర్శనం ఇచ్చేవారు.

ప్రజలు భక్తి విహ్వాలులై జయకారాల్ని పలుకుతూ ఉత్సాహాన్నీ ప్రకటించేవారే, కానీ మొదటే ప్రజలకు ఒక సూచన ఇవ్వడం జరిగింది. పేడ్‌బాబా ధ్యానమగ్నులై మౌన ముద్రాంకితులై వున్నారు భక్తులందరూ మౌనము వహించవలెనని కోరుతున్నారు అని. పేడ్‌బాబా సిద్ధ పురుషుడన్న విషయంలో ఎవరికీ సందేహము లేదు. ఆయన ఇరవై నాలుగు గంటలూ అలా చెట్టుమీద కూర్చోవటం గురించి ఎంతో ఆసక్తిగా మధుపురి బజార్లల్లో చెప్పుకుంటున్నారు. ఆయన ఎప్పుడు ప్రజలకు దర్శనం ఇస్తాడో కూడా చెప్పు కుంటూ వుండేవారు. ఇంకా కొన్ని విషయాలూ ప్రచారంలోకి వచ్చాయి. పేడ్‌బాబాకు కొన్నివేల సంవత్సరాల వయస్సు వున్నదనీ, ఆయన హిమాలయ పర్వతాలలోని ఒకానొక గుహనుండి మధుపురికి వచ్చాడనీ చెప్పుకోసాగారు. ఆయన పుట్టుకను ప్రత్యక్షంగా చూసినట్టుగా కొందరు ఒట్టుపెట్టుకుని మరీ వెయ్యి సంవత్సరాల వయస్సు వుందని చెప్పేవారు. ఆయన ఒక నెల మధుపురిలో వుండి ధ్యానాన్ని పరిసమాప్తి కావించి ఉద్యాపనానంతరం ఉత్తరాఖండము వెళ్ళిపోతారన్న విషయమూ ప్రచారమైనది. పేడ్‌బాబా తపస్సు గావించిన ఆ ఒక్క నెలరోజుల్లోనూ మధుపురి ధర్మప్లావితమైపోతుంది. ఆర్య సమాజీకుల ముఖాలు మాడిపోయాయి. మధుపురిలోని వర్తకులలో సనాతన ధర్మాయా యులూ వున్నారు. ఆర్యసమాజీకులూ వున్నారు. ఆర్యసమాజీకులు తమ తర్కం ద్వారా సనాతన మతానుయాయుల్ని ఓడించేయాలనుకునేవారు కానీ, పేడ్‌బాబా అచల మౌన ముద్రతో చెట్టుమీద కూర్చుని ఆర్యసమాజీకుల తర్కాలన్నింటికీ పడగొడుతుండేవాడు. చివరకు ఆర్యసమాజీకుల గృహిణులే పేడ్‌బాబా పట్ల భక్తి బంధాన్ని ప్రకటించసాగారు. వాక్‌రూపంలో జరిగే ప్రచారము కంటే ఆచరణాత్మకమైన ప్రచారం చాలా శ్రేష్టమైనదని అప్పుడు అర్థమైనది ప్రజలకు. పేడ్‌బాబాను సత్యయుగం నాటి ఋషి అని చెప్పుకుంటారు. అలాగే ఆయన జ్ఞానము, విద్యా కూడా అనంతమైనదని అంటున్నారు. ఔను నిజమే మరి మౌనంగా వుండే వారి విద్య యొక్క అంతాన్నీ, జ్ఞానం యొక్క అంతాన్నీ తెలుసు కోవటం ఎలా సంభవం?

## 3

పేడ్‌బాబా నెలరోజుల తపస్సు పూర్తయింది. పేడ్‌బాబా చెట్టుమీద నుండి కిందకు దిగే సమయం ముందే నిశ్చయం అయింది. ఆయన చెట్టుమీద నుండి దిగేటప్పుడు చూడటానికి పక్కనే వున్న కొండమీద ప్రజలు తిరునాళ్ళలా ప్రోగుపడ్డారు. ఎక్కడ చూసినా లేడీస్ – జంటిల్‌మెన్‌లూ, సాధారణులైన స్త్రీలు పురుషులూ, బాలబాలికలూ ఇసుక వేస్తే రాలనంతగా నిండిపోయారు. కొండమీద నుండి జారి ఒకరిద్దరు క్రింద పడ్డారు కూడా.

అయితే పేడ్‌బాబా అనుగ్రహం వల్ల కాళ్లూ చేతులూ ఎవరికీ విరగలేదు. పేడ్‌బాబా దర్శనార్ధం అలా ప్రోగుపడ్డది కేవలం హిందువులో లేక భారతీయులో అని అనుకోవటానికి లేదు. వాళ్ళల్లో ఇంగ్లీషు దొరలూ – దొరసాన్లు కూడా వున్నారు. పేడ్‌బాబా గురించిన ప్రచారం చాలా ప్రణాళికాబద్ధంగా జరిగింది. ఆ ప్రచారం ముందు మధుపురి ఎన్నికల ప్రచారం వెలవెల పోయింది. ఆయనగారి తపస్సుకు సంబంధించిన ప్రతి విషయంలోనూ ఓ ప్రత్యేకమైన వ్యవస్థ కనపడుతుంది. కరెక్టుగా చెట్టుమీద నుండి దిగే సమయానికి ఎక్కడనుండి వచ్చాయో తెలియదు కానీ బ్యాండ్ మేళాలు వచ్చాయి. వర్ష రుతువు కావటం వలన మధుపురిలో పూవులు సమృద్ధిగా దొరుకుతాయి. పేడ్‌బాబాను చూడటానికి వచ్చిన వాళ్ళు పూలమాలల్తో సహా వచ్చారు. అప్పుడూ పేడ్‌బాబా ముఖాన వున్న కాషాయాంబరాన్ని తీయలేదు. మధ్య ఆసియాలోని ఒక సిద్ధ పురుషుడు తన ముఖానికి ఎప్పుడూ ఆకుపచ్చని బట్టనొకదాన్ని కట్టుకునేవాడుట. ఎందుకు ఇలా కట్టుకోవటం? అని ఎవరైనా అడిగితే తను ముఖకాంతిని చూసి భరించలేక ప్రజలెక్కడ కింద పడిపోతారోనని అనే వాడట. బహుశా పేడ్‌బాబాకు కూడా అలాంటి అభిప్రాయమే ఏదో ఉండి వుంటుంది. పేడ్‌బాబా తపస్సు చేసిన చెట్టుకు దగ్గర్లోనే ఒక పెద్ద భవనాన్ని కట్టారు. ఆ భవనంలో దుకాణాలు పెట్టుకోవటానికి పనికి వచ్చే హాలులున్నాయి. ఆ భవనం కట్టించినాయన కూడా ప్రాచీన హిందూ మత సాంప్రదాయాల్ని అభిమానించేవాడే? అప్పటికి ఇంకా ఏ దుకాణదారుడు అద్దెకు దిగలేదు అందులోకి! చెట్టుదిగిన పేడ్‌బాబాను ఆ భవనంలోకి తెచ్చి వుంచారు. అక్కడికి వచ్చిన క్షణం నుండీ ఒంటికాలిమీద నిలబడిపోయాడు పేడ్‌బాబా! భాగవతాన్ని సంపూర్ణంగా పారాయణం చేసి, పారాయణం ముగిశాక ఒక వెయ్యిమంది బ్రాహ్మణ్యానికి సంతర్పణ జరిగే వరకూ అలా ఒంటికాలిమీద నిలబడతానని దీక్ష బూనాడు పేడ్‌బాబా. అయితే, అప్పటికీ ముఖానికి తగిలించి వున్న కాషాయాంబరాన్ని తీయలేదు. మధుపురిలో సంవత్సరం పొడుగునా వుండే వ్యాపారాలు పడిపోయాయి. అయినా ఎక్కడినుండి వచ్చాయో తెలియదు కానీ రూపాయిలు వర్షంలా కురిశాయి. వ్యాపారస్థులు మనస్ఫూర్తిగా చందాలిచ్చారు. ఒక పన్నెండు మంది బ్రాహ్మణులను భాగవతాన్ని పారాయణం చేయటానికి నియమించటం జరిగింది. వాళ్ళకు అవసరమైన ఫలహారాలలో భోజనాలు మొదలైన సౌకర్యాలకు వంటవాళ్ళను ఏర్పాటు చేశారు. పేడ్‌బాబా పగలే కాకుండా రాత్రిపూట కూడా ఒంటికాలి మీదే వుంటారని కొందరు చెప్తున్నారు. పూరీ, హల్వాలతో భోజనం చేస్తున్న వంట బ్రాహ్మణులు పేడ్‌బాబా మహత్యాన్ని కొనియాడుతున్నారు. అతడిని గురించిన ప్రచార కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహిస్తున్నారు.

చూస్తుండగానే ప్రజలు ఐదు వేలకు పైగా ప్రోగయ్యారు. కథా పారాయణం జరిగేటప్పుడు కానుకల పళ్ళెంలోనూ, రూపాయలు, అర్థరూపాయలూ పావులాలు కూడా వర్షంలా కురుస్తున్నాయి.

పేడ్‌బాబాని దర్శనం చేసుకున్న అదృష్టవంతులు ఆయన దర్శనభాగ్యం వల్లనే హృదయంలో పవిత్ర భావాలు పుట్టుకొస్తుంటాయని చెప్తున్నారు. గీతాధ్యయనం చేసిన కొందరు ఆ మహాత్ముని సముఖంలో దైవికశక్తులే కాక ఆసురీశక్తులు కూడా నిలవవని చెప్తున్నారు. మధుపురికి ఒక్క విలాసపురుషులే వస్తారనేది ఏమీ లేదు. అక్కడికి వచ్చే విలాస యాత్రికులను ఉద్ధరించటానికి హజ్ హోల్‌సెస్, శంకరాచార్యులు, ఇతర సిద్ధ పురుషులూ చాలామంది వస్తుంటారు. ముఖ్యంగా మధుపురి తెల్లవాళ్ళ చేతుల్లో నుండి నల్లవాళ్ళ చేతుల్లోకి వచ్చాక అక్కడ జడలు పెంచుకున్న సాధువులూ, కాషాయబట్టలు కట్టుకున్న సాధువులూ అప్పుడప్పుడు కనిపిస్తూనే వున్నారు. సత్యయుగంలోని రాజభవనాలు మహాత్ముల పదరజంతో పునీతమయ్యాయంటారు. అటువంటప్పుడు మహాత్ములైన సాధుపురుషులు మధుపురిలోని సంసార పంకమగ్నమైన విలాసయాత్రికుల జీవితాలు, భవసాగరంలో మునిగిపోతూ వుంటే ఎలా చూస్తూ వుండగలరు? కానీ, ఇతర మహాత్ము లకూ, పేడ్‌బాబాకు చాలా తేడా వుంది. మధుపురికి వచ్చే విలాసయాత్రికుల్లో చాలామంది చదువుకున్న మధ్య తరగతికి చెందిన వారై వుంటారు. మామూలు చదువులే కాదు. ఇంగ్లీషునూ బాగా అధ్యయనం చేసినవారు కావటం వల్ల వారిమీద సాధారణమైన ఎత్తులు ఏమీ పనిచేయవు. అలాంటి ఇంగ్లీషు చదువుకున్న విలాస యాత్రికులను అంకుశంతో వంచుకు రావాలంటే ఇవతలివారు మంచి విద్యాజ్ఞానం కలిగిన వారై వుండాలి. కనుక అప్ టు డేట్ టెక్నిక్కులను ఉపయోగించ గలిగిన మహాత్ములు మాత్రమే మధుపురి నగరాన్ని వంచుకు రాగలరు. పేడ్‌బాబా ఖ్యాతి తాలూకు ప్రథమ వీచిక వీచినప్పుడు కొందరు శ్రద్ధాళువులూ ఇలా అన్నారు. ఇది చాలా క్రూడ్ టెన్నిక్. ఎన్ని కోతులూ రోజూ చెట్లమీద కూచుని తడవటం లేదు కనుక? వాటికి విలువ ఇవ్వటం లేదు కదా! మనం. కొంతమంది పెద్దమనుషులైతే అద్వైత బ్రహ్మను సూక్ష్మాతి సూక్ష్మ రూపంలో స్పష్టీకరించగల మహాత్ములే మేధావుల్ని ఆకర్షించగలరు అని అంటారు. పేడ్‌బాబా ఒక వారం రోజుల్లో విజయలక్ష్మిని చేపట్టాలని తొందరపడితే తప్పకుండా నిరాశపడిపోయేవాడు. కాని దిగాం కనుక తేల్చుకుందాం అన్నది పేడ్‌బాబా మహామంత్రం.

పేడ్‌బాబా అసాధ్యుడన్న విశ్వాసం నాస్తికులకూ కలిగింది. బాబా మధుపురిలో వున్నన్నాళ్ళూ ఒక్కమాట కూడా మాట్లాడలేదు. అయితే మాత్రం ఏం? ఆయన సాన్నిధ్యం

వల్ల ప్రజలు ధార్మికమైన ఉద్దీప్తిని పొందారు. పేడ్‌బాబాకు ఆశ అనేది అసలు లేనేలేదు. డబ్బులు వర్షంలా కురుస్తున్నప్పటికీ వాటిని ఆయన కన్నెత్తి చూడలేదు. ఇక ఆ డబ్బును తాకలేదని వేరే చెప్పవలసిన పనియేముంది? కానుక పళ్ళెంలో పడిన డబ్బులన్నింటినీ దానధర్మాల క్రింద ఖర్చు పెట్టేశారు. దానాల్ని ఎక్కువశాతం పొందినవారు మధుపురిలోని బ్రాహ్మణ దేవతలు. ఈ బ్రాహ్మణ దేవతలందరూ తిండికి మొహం వాచి వున్నవారే! మధుపురిలో ఇప్పటికీ సనాతన మతాభిమానులైన వ్యాపారస్తులు కొంతమంది వుండటం వలన ఈ బ్రాహ్మణ దేవతలు ఒకపూటనయినా తిండి తింటున్నారు. ఇటు పారాయణ జరుగుతూనే వున్నది. అటు బ్రాహ్మణ సంతర్పణకు ఏర్పాట్లు భారీ ఎత్తున ప్రారంభమయ్యాయి. అడుక్కుతినే అలగా జనాలకు పెడితే ప్రయోజనం ఏముంటుంది? పుణ్యం సంపాయించాలనుకున్న వారు ఖాద్య – పాద్యాదుల్తో భూరి దక్షిణల్తో భూసురుల్నే తృప్తి పరచాలి!

మొదటి వారం గడిచినదగ్గరనుండీ నాస్తికులకు వాగ్బంధం అయింది. అలాంటిది పేడ్‌బాబా చెట్టుదిగి వచ్చి ఒంటికాలిమీద నిలబడటం ప్రారంభించాక మధుపురిలోని నాస్తికులకు దిక్కులేకుండా పోయింది. చదువుకున్న వారిలోనూ, చదువుకోని వారిలోనూ, స్త్రీ బాల వృద్ధులలోనూ, స్థిర నివాసుల్లోనూ, విలాస యాత్రికులలోనూ అందరిలోనూ భక్తిభావన వెల్లువలా పొంగింది. మధుపురిలో పేడ్‌బాబాను గురించిన ప్రచారం అతి తీవ్రస్థాయిలో జరగసాగింది. ప్రజలు దిగ్భ్రమ చెందిపోయారు. సినిమా హాళ్ళల్లో, క్లబ్బుల్లో, రోడ్లమీద, బంగళాల్లో ఎక్కడ చూసినా ఆయనగారి గురించిన చర్చలే! ఒక్క భారతీయుల్లోనే కాదు. ఆంగ్లో ఇండియన్లలోనూ, యూరోపియన్లలోనూ పేడ్‌బాబాకు కీర్తి ప్రతిష్టలు పెరిగిపోయాయి. యూరోపియన్ కుటుంబాల్లో కొందరు విమర్శిస్తూనే వున్నారు. అయితే, విమర్శల్లోనూ, తరతమ భేదాలున్నాయి. కాథలిక్కులు సాధు పురుషుల అద్భుతాల్ని విశ్వసిస్తారు. ఈ సంవత్సరం జరిగిన ఒక విషయం గురించి చెప్తాను. ఇటలీలోని ఒక గ్రామంలోని మడోన్నా మట్టి విగ్రహానికి చాలా రోజుల పాటు కన్నీరు కారాయట! వేల కొలది స్త్రీలు, పురుషులు ఆ మట్టి విగ్రహం కన్నీరు కార్చటాన్ని చూశారు. పత్రికల్లోనూ ఈ వార్తలను ప్రముఖంగా ప్రచురించారు. పత్రికలు ఎక్కడైనా అసత్యాలు రాస్తాయా? తరువాత ఆ కన్నీటిని లేబరేటరీలో పరీక్షించారుట. ఆ కన్నీరు అచ్చంగా మానవుల కన్నీరేనట. ఇలాంటివన్నీ విశ్వసించే కాథలిక్కులకు పేడ్‌బాబాను అనుమానిం చాల్సిన పనేముంది? అయితే పేడ్‌బాబా 'విధర్మి' అయ్యాడు. క్రిష్టియన్లు తప్ప విధర్మయిన వాడు నిజంగా ఇలాంటి అద్భుతాన్ని చేయగలడా? అని సంశయింస్తున్నారు!

భాగవత పారాయణ సమాప్తమయ్యే సమయం దగ్గర పడ్డది. అర్థంతో పనిలేకుండా

భాగవతాన్ని ఊరకే పారాయణ చేసేస్తున్నారు. పేడ్‌బాబా సర్వజ్ఞుడు కావటం వలన అర్థం చేసుకుంటున్నాడు. మరొకరయితే ఆ శ్లోకాల్ని అర్థం చేసుకోవటం అసాధ్యం. పారాయణ చేస్తున్న భాగవతులకే ఆ శ్లోకాలు అర్థం కావటం లేదు. మధుపురి ప్రజలు భాగవత పారాయణ త్వరగా ముగియకుండా వుంటే బాగుండుననీ, పేడ్‌బాబా తమ మధ్యలో మరికొన్నాళ్ళు వుంటే బాగుండుననీ అనుకుంటున్నారు.

యజ్ఞం సమాప్తమయ్యేరోజు వచ్చింది. ఆరోజున నాగరికులు తమ శ్రద్ధాభక్తుల్ని అత్యద్భుతంగా ప్రదర్శించారు. ఊరేగింపు ఎటూ జరుగుతుంది. బ్యాండ్ వాయించే వాళ్ళందర్నీ రమ్మన్నారు. వ్యాపారస్తులు బజార్లలోని దుకాణాలన్నింటినీ కొత్త పద్ధతుల్లో అలంకరించారు. పేడ్‌బాబా తమ దుకాణాలను ఆశీర్వదించటానికి సాధారణ విద్యను అభ్యసించిన చిల్లర వ్యాపారస్థులే కాదు, బాగా చదువుకుని ఆంగ్ల నాగరికతలో తలపండి విలాస వస్తువులను అమ్మే దుకాణాల వాళ్ళు కూడా తమ దుకాణాల్ని అలంకరించారు. బజార్లో అక్కడక్కడా తోరణాలు కట్టారు. పెద్ద బజార్లో పేడ్‌బాబాను మోటారులో ఊరేగించాలని పురప్రజలు అనుకున్నారు. మధుపురిలోని పెద్ద బజార్లో కారు నడపాలంటే ముందుగా మెజిస్ట్రేట్ అనుమతిని పొందాలి. పేడ్‌బాబా కోసం మెజిస్ట్రేట్ ఏంటి? కావాలంటే కలెక్టరు దగ్గరనుంచైనా అనుమతిని తీసుకువస్తారు. ఆ ప్రాంతపు కలెక్టరు గొప్ప ధర్మపరాయణుడు. అనుక్షణమూ హిందూమతాన్ని గురించీ, హిందూ సభ్యతను గురించీ హిందూ మత పూర్వ వైభవాన్ని గురించీ మాట్లాడుతూ వుంటాడు. అంతేకాకుండా హిందూమతం సహస్ర జిహ్వాలు గల ఆదిశేషుడిలా సర్వ ప్రపంచాన్నీ తనలో ఇముడ్చుకోనందుకు విచారపడుతూ వుంటాడు. అయితే, పేడ్‌బాబాకు ఇలాంటి ఆడంబరాలేమీ గిట్టవు. తనకు కారుతో పనేముంది? కానీ అలాగని భక్తులు తెల్సుకోవటం ఎలా? మౌనం కదా? అప్పటికీ వారి భావాల్ని భక్తులు అర్థం చేసుకునేవారు. పేడ్‌బాబా మౌనంగా వున్నప్పటికీ భక్తులతో ప్రతిఒక్క విషయాన్నీ చెప్తున్నట్టే వుండేది. నాకీ కార్లతో పనేంటి? నాకాళ్ళే నాకు కార్లు. వీటితో హిమాలయ పర్వత శిఖరాల్ని తేలికగా ఎక్కేస్తాను అన్నట్టుగా వుంది. బాబా కూర్చోటానికి కారును ఏర్పాటు చేయలేదు. రిక్షాను ఏర్పాటు చేశారు. బాబా రిక్షాలో కూర్చునే మధుపురిలోని పెద్ద బజారులో ఇటుచివరనుండి అటు చివరకు ఊరేగారు. తన దర్శనానికి వచ్చిన ప్రజానీకానికి ముఖం మీది ముసుగును ఒకమాటు తీసీ, ఒకేమాటు మూసుకునే దర్శన భాగ్యం కలిగించారు. వారి చరణ రేణువులు పెద్ద బజారు అంతా వెదజల్లబడినాయి. భక్త కోటి దారి పొడవునా పుష్ప వర్షం కురిపించారు. అడుగడుక్కు హారతులిచ్చారు. సాష్టాంగ దండ ప్రణామాలను ఆచరించారు.

వారి చరణ రజాన్ని తలమీద చల్లుకున్నారు. కానీ పేడ్‌బాబా అలాగే మౌనంగా కొన్ని గంటలసేపు వూరేగారు. నిజంగా ఇది ఎంత అద్భుతం? తను చేస్తున్న ఈ అద్భుతాల్ని గురించి తను చెప్పాలనుకున్నా ఒక్కనోరు, ఒక్కనాలుకా గల అతను ఎలా చెప్పుకోగలడు. అతని తరఫున ప్రచారం చేయటానికి కొన్నివేల నోర్లూ, కొన్నివేల నాలుకలూ కార్య రంగంలోకి దిగాయి. ఇంక అతను మౌనంగా వుంటే ఏం? అడుగడుగునా 'పేడ్‌బాబాకి జై' అన్న జయజయ ధ్వనులు వినపడుతూనే వున్నాయి. ఆర్యసమాజ మందిరం దగ్గరకు వచ్చేసరికి ప్రజల్లో నూతన వుత్సాహం వచ్చేసింది. 'సనాతన ధర్మం వర్ధిల్లాలి' 'సనాతన ధర్మానికీ జై' అన్న నినాదాలు భూ–నభ అంతరాల్లో ప్రతిధ్వనించాయి. ఇది నిజంగా ఆర్యసమాజాన్ని ఛాలెంజ్ చేయటమే! సనాతనుల రొట్టె విరిగి నేతిలో పడ్డది. ఈ స్థితినుండి లాభాన్ని పొందటానికి హిందూమత గుత్తాధికారులు సిద్ధమయ్యారు.

సంతర్పణ జరిగింది. ప్రభుత్వం విందుకు పరిమితమైనంత మంది సభ్యుల్ని మాత్రమే అనుమతించింది. పేడ్‌బాబా విందులో ప్రభుత్వం అనుమతించిన సంఖ్యకు రెండు సున్నాలు చేర్చటం జరిగింది. బాధ్యతగల ప్రభుత్వ అధికారులు అనేకులు అప్పుడు మధుపురిలో వున్నారు. కానీ, సంతర్పణకు అభ్యంతరం కల్పించి నాస్తికులనిపించుకోవటానికి ఎవరూ సాహసించలేకపోయారు. వంటవాళ్ళకు ముందే డబ్బు ఇచ్చారు. రకరకాలైన పిండి వంటల్ని చేశారు వాళ్ళు. స్వీటుషాపుల వాళ్ళకు డిమాండ్ పెరిగింది. వాళ్ళ దగ్గర కొన్ని పిండి వంటల్ని కొన్నారు. రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఇంత బేరం వాళ్ళకు జరగలేదు. స్వీటు షాపుల వాళ్ళు నిజంగానే చాలా ఆనందపడ్డారు. పేడ్ బాబా అవతరించిన ఈ శుభసందర్భంలో ఆర్థిక సంబంధమైన ఆనందంతో మైమరచింది బ్రాహ్మణులూ, స్వీటు షాపుల వాళ్ళు మాత్రమే. అయితే, మతపరమైన ఆనందంలో మధుపురిలోని సమస్త జనులూ మైమరచారు. పేడ్‌బాబా చెట్టుదిగి వచ్చాక వారు తపస్సుచేసిన చెట్టు శూన్యమైనది. ఆ చెట్టునూ శూన్యంగా వుంచటం ధర్మ పరాయణులయిన మధుపురి ప్రజలకు బాధ అనిపించింది. పేడ్‌బాబా దివ్యాగమనానికి సంబంధించిన అమర కీర్తికి ప్రతీకగా ఆ చెట్టుకు శాశ్వత చిహ్నాన్ని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. బుద్ధుడు రావిచెట్టు కింద కూర్చొని తపస్సు చేసి జ్ఞానాన్ని పొందాడు. కనుక రావిచెట్టు యుగ యుగాంతాల వరకూ పునీతమైనది. మరి, మధుపురిలోని పేడ్‌బాబా తపస్సు చేసిన ఆ 'బాన్' వృక్షానికీ అలాంటి మహత్తే లభించింది. 'బాన్' వృక్షజాతినంతటినీ 'బాబావృక్షం' అన్నపేరుతో సమస్త భారతదేశంలో, యుగయుగాల వరకూ పవిత్రమైనదిగా భావించేట్టు చేయటం సంభవం కాదు. ఎందుకంటే 'బాన్' వృక్షం అధికశీతల ప్రదేశాల్లో కానీ వుండదు.

కనీసం సంవత్సరానికి నాలుగయిదు సార్లయినా హిమపాతం జరిగే చోట్లలోనే 'బాన్' వృక్షాలుంటాయి. భారతదేశంలో హిమపాతాలు అంటే ఏమిటో? తెలియని ప్రదేశాలూ వున్నాయి. అయితే, పేడ్‌బాబా వృక్షం అలాగే వుండటాన్ని ఏ భక్తుడో సహించలేకపోయాడు. కాషాయరంగు జండా నొకదాన్ని తెచ్చి ఆ చెట్టు ప్రక్కన నాటాడు. ఇప్పుడు ఆ మహాత్ముడు ఒంటికాలి మీద తపస్సు చేసిన ఆ గృహమూ శూన్యమవుతోంది. నిత్యం భాగవత పురాణం జరిగి హిందూ మతానికి జయధ్వానాలు పలుకబడి, వేలకొలది భక్తులు పోగుపడిన ఆ గృహం  శూన్యమవుతోంది.

ప్రతి పండుగకూ లేక మహోత్సవానికీ ఎప్పుడో ఒకప్పుడు ముగింపంటూ వుంటుంది. ఆనందోత్సాహంతో నిండిన జనాకర్షమైన ప్రదేశం జనశూన్యమవడంతో ఒక రకమైన నీరసత్వం, ఉదాసీనతా సర్వత్రా దర్శనమిస్తుంది. పేడ్‌బాబా మధుపురిని వదిలి వెళ్ళేరోజు వచ్చింది. తమ ఆరాధ్యదైవాన్ని మరొకమాటు దర్శనం చేసుకునేందుకు భక్తులు తిరునాళ్ళకు వచ్చినట్టుగా వచ్చారు. బాబా బయటకు వచ్చాడు. ఎదురుగుండా సినిమాహాలు వుంది. బాబా సందడి వచ్చాక మధుపురిలో సినిమాహాలు ఆదాయం పడిపోయింది. ఈ రోజుల్లో సినిమాలే గొప్ప తీర్థాలయిపోయాయి. సినిమా ఆలయం ముందు దేవాలయం ఎందుకూ పనికిరాదు. సినిమాహాలు ముందు వాల్‌పోస్టర్లల్లో సినిమా తారల నగ్నచిత్రాలు కనిపిస్తు న్నాయి. అయినా ప్రజలు వాటివంక చూడటం లేదు. పేడ్‌బాబా ముందు సినిమాతారాల నగ్నచిత్రాలూ పనికిరాకుండా పోయాయి. అప్పటికీ బాబా మౌనంగానే వున్నాడు. అయినప్పటికి కొంతమంది అతికష్టం మీద పేడ్‌బాబా దగ్గరకు వచ్చి తమను తాము కృతార్థులను చేసుకుంటున్నారు. బాబా దగ్గర సామాన్లు ఏమీలేవు. కాషాయ వస్త్రాలు – గొడుగూ తను చెట్టుమీద తపస్సు చేసినప్పటివి మాత్రం వున్నాయి. అతను కాలినడకనే వెళ్ళిపోదామనుకున్నాడు. అయితే, భక్తులు కార్లో పంపిస్తామని పట్టుపట్టారు. ఒక్కొక్కప్పుడు భగవంతుడు కూడా భక్తుల అభీష్టం ప్రకారం నడుచుకోవల్సి వస్తుంది. మధుపురిలో బాబాకు కారు దొరకటానికి అభ్యంతరం ఏముంటుంది? అక్కడ సొంత కార్లు ఉన్న వాళ్ళు చాలామందే వున్నారు. బాబా తమ కార్లో కాలు పెడితేనే చాలు అనుకునేవాళ్ళు వున్నారు. పుణ్యం అత్యవసరంగా కావాల్సిన ఒక భక్తుడు తన కారును ఇచ్చాడు. ఈ రకంగా బాబాకు సేవచేసి పుణ్యం సంపాదించుకున్నాడు. 'పేడ్‌బాబా' వెళ్ళిపోతున్నాడు. అతని వైరాగ్యం అద్వితీయమైనది. సుఖం, దుఃఖం,లాభం, నష్టం, జయం, పరాజయం వీటన్నింటినీ సమదృష్టితో చూసేవాడు. కానీ, ఆయన సాన్నిధ్యం వల్ల తమ ఆత్మల్ని పవిత్ర పరచుకుని, జన్మాంతరంలోని పాపాలను ప్రక్షాళనం గావించుకున్న వాళ్ళు మాత్రం

విరాగులు కారు. బాబా వెళ్ళిపోతున్నాడు. భక్తులు విహ్వలులై విలపిస్తున్నారు. శ్రావణ మేఘాల్లా వాళ్ళ కళ్లు కన్నీటిని వర్షించాయి. మన పరిచయులైన ఇద్దరు అడ్వకేట్లు ఆ సమూహంలో వున్నారు. వాళ్ళూ కన్నీరు కారుస్తున్నారు. భక్తులందరూ మౌనంగా ఇలా అనుకుంటున్నారు. బాబా మధుపురిని మరువకండి! పాపులమైన మాకు దర్శన భాగ్యాన్ని మరొకసారి కలిగించండి!"

కార్లో కూర్చొని బాబా కింది నగరానికి వెళ్ళాడు. అక్కడా వారి స్వాగతానికి కట్టుదిట్ట మైన ఏర్పాట్లు జరిగాయి. స్వాగతం ఇవ్వటానికి సిద్ధంగా వున్నవారు ఒక డజను మంది పోలీసులూ, ఒక పోలీసు ఇన్స్పెక్టరు! మధుపురి కొండ దిగంగానే బాబా కారును మరొక కారు వెంబడించ సాగింది. నగరంలోకి వెళ్ళగానే వెనుకకారు ముందుకు వచ్చి ఆగి, బాబాకారును ఆపేసింది. వెంటనే పోలీసులు తమకారులో నుండి క్రిందకి దూకి బాబాకారును చుట్టుముట్టారు. ఇనస్పెక్టర్ వచ్చి కార్లో కూచున్న బాబా చెయ్యి పుచ్చుకుని క్రిందకు దించారు. "పేడ్‌బాబా మధుపురిని ఉద్ధరించావు. ఇక పద మా జైళ్ళను ఉద్ధరిం చుదువుగాని!" అన్నాడు ఇన్స్పెక్టర్.

పేడ్‌బాబా బందిపోటు దొంగల నాయకుడట. అయితే మాత్రమేం? అతను మధుపురిని ఉద్ధరించలేదని ఎవరనగలరు?

# సుల్తాన్

విలాస యాత్రికులకు సర్వసౌఖ్యాలనూ సమకూర్చే పట్నాలుగా విలాసనగరాలను తయారు చేయటానికి ఎంతోమంది పనివాళ్ళు అవుసరం అవుతారు. తినే పదార్థాలను సప్లయి చేయటానికి రెస్టారెంట్‌లూ, హోటళ్ళూ, రొట్టెలు చేసేవాళ్ళు, వంటవాళ్ళూ, కూరలు అమ్మేవాళ్ళూ, మాంసం అమ్మేవాళ్ళూ, స్వీట్లు తయారు చేసేవాళ్ళూ ఎలాగూ అవుసరం అవుతూనే వుంటారు. మధుపురిని కళానిలయంగా తయారు చేయటానికి దర్జీలే కాకుండా దూది ఏకేవాళ్ళూ అవుసరం అవుతారు. అక్కడికి వచ్చే విలాస యాత్రికులకు మెత్తని పరుపులూ, దిండ్లూ, సోఫాల్లో కుర్చీల్లో వేసుకునే కుషన్లూ అవుసరం అవుతాయి. కొంచెం చలిపెరిగిందంటే రజాయ్‌లు (దూది నింపిన దుప్పట్లూ) కావాలి. కనుక, దూది ఏకే వాళ్ళు కూడా మధుపురిలో భాగంగానే అనిపిస్తారు. మధుపురిలో వీళ్ళకూ మంచి డిమాండ్ వుంటుంది. ప్రతి సంవత్సరం దాదాపు ఎనిమిది నెలల పాటు సుల్తాన్ మధుపురిలో కనిపిస్తూ వుంటాడు. దూది ఏకే ధనుస్సు లాంటి 'కమాన్'ను భుజం మీద పెట్టుకుని దస్తానీ చేత పుచ్చుకుని మధుపురి రోడ్ల మీద 'పరుపులు కుడతాం' అని గట్టిగా అరుస్తూ తిరుగుతూ వుంటాడు. అతని 'కమాన్'ను 'దస్తాని' చూసిన వారికి పాత కథ ఒకటి తప్పక జ్ఞాపకం వస్తుంది. 'ఒక దూది ఏకే సాయిబు 'కమాన్'ను భుజాన పెట్టుకుని 'దస్తాని' చేత పట్టుకుని ప్రభావశాలి వేషంలో పనికి బయలుదేరాడుట. బయటకు రాగానే ఒక నక్క అతనికి ఎదురయింది. అతడి వేషాన్ని, భుజంమీద, చేతిలోని పరికరాల్ని చూసి ఇతను తప్పక ఏ దేశానికో మహారాజు అయివుంటాడు. వేటకు వెళుతున్నాడేమో? కొంప ముంచి నన్నే చంపుతాడేమో? మంచి మాటలతో తప్పించుకుందామనుకుని ఇలా అంది' ఎక్కడికయ్యా ఢిల్లీ రాజా? అంబూ-విల్లూ అన్నీ తీసుకు వెళుతున్నావ్?

ఆ దూది ఏకే సాయిబుకు పోయిన ప్రాణాలు తిరిగి వచ్చినట్టయింది. అతడా నక్కను చూసి సింహం అనుకున్నాడు. తనను చంపేస్తుందేమోనని వణికి పోతున్నాడు. ప్రాణాల్ని

కుదుటపరుచుకుని 'నువ్వు చాలా గొప్పదానివే! కనుకనే, విల్లూ–అంబూ పుచ్చుకు వెళు తున్నాననన్నావ్!" అన్నాడు.

కానీ మధుపురిలో సుల్తాన్‌ని చూసినప్పుడు పై కథ జ్ఞాపకం వస్తుంది. దాంతో పాటు హృదయాన్ని ఎవరో నులిమి వేసినట్టు అవ్యక్తమైన బాధతో విలవిల్లాడిపోతాము.

సుల్తాన్ చూడ్డానికి కొంచెం పొట్టిగా, సన్నగా వుంటాడు. వయస్సు యాభై ఏళ్ళు వుండవచ్చు. కానీ, అంతకంటే వయస్సు ఎక్కువవున్న వాడిలా కనిపిస్తాడు. అతడు సన్నగా వుండటం వయస్సు కారణంగా కాదు. యవ్వనంలోనూ అతను సన్నగానే వుండేవాడు. అతని శరీరానికి మాంసం పట్టే అవకాశమే దొరకలేదు. చిన్నతనంలోనే మశూచికం రావటం వలన ఒక కన్నుపోయింది. ఒంటికంటి నవాబు అని అనవచ్చును అతనిని. కానీ నవాబు కంటే సుల్తాన్ పదవే గొప్పది కావటం వలన సుల్తాన్ అని పిలవటమే బాగుంటుంది. ముఖానికి మచ్చలకి తోడు, పిల్లిగడ్డం ఒకటి మన దృష్టిని ఆకర్షిస్తూ వుంటుంది. అతను దూది ఏకటానికి ఉపయోగించే 'కమాన్' అతని కంటే పెద్దది. అయినా, ఎక్కడికయినా సునాయాసంగా మోసుకువెళ్లేవాడు. మధుపురిలో సుల్తాన్ ఎక్కడ వుంటాడో ఎవరికీ తెలియదు. బహుశా ఇతర దూది ఏకే పనివాళ్ళతో కలిసి ఏ ఔట్‌హౌస్‌లో నయినా వుంటున్నాడేమో. ఎక్కడైనావుండనీ, తెల్లవారేసరికి ప్రత్యక్షం అవుతాడు. కేంద్రానికి మూడు, నాలుగు మైళ్ళ దూరంలో వున్న బంగళాల దగ్గర కూడా తెల్లవారేటప్పటికి ఎలా సిద్ధం అవుతాడో తెల్సుకోవటం కష్టం! మధుపురిలో బంగళాలల్లో వుండేవాళ్ళందరూ సుల్తాన్‌ని మనసారా దీవిస్తుంటారు. అతడే కనుక తమ బంగళాల దగ్గరకు రాకపోతే దాదాపు ఆరుమైళ్ళ విస్తీర్ణం కల మధుపురిలో అతడిని వెతికి పట్టుకోవటం కష్టసాధ్యమైన విషయం. సుల్తాన్ కనుక మధుపురిలో లేకపోతే పరుపుల్ని, రజాయ్‌లనూ (దూది నింపిన దుప్పట్లు) రిపేరు చేయించుకోవటానికి మూడుమైళ్ళ దూరంలో వున్న దుకాణానికి పంపవలసి వుంటుంది. అలా పంపటం వల్ల డబ్బుకు డబ్బూ ఖర్చు అవుతుంది. దుకాణం చుట్టూ తిరగవలసి వుంటుంది. అవి ఒక సంవత్సరం వరకైనా ఆ పరుపులూ, రజాయిలూ పనిచేస్తాయని చెప్పలేము. సుల్తాన్ కుట్టిన పరుపుకానీ, రజాయిలు కానీ, దూది ఉండకట్టటం అంటూ లేకుండా కొన్ని సంవత్సరాలు పనిచేస్తాయి. అయితే పై బట్ట చినిగి, దూది బయటపడినప్పుడు తిరిగి కుట్టించుకోవలసి వస్తుంది. ఒక రకంగా చూస్తే, ఇలా నిజాయితీగా దూదిని ఏకటం వలన అతడు నష్టపోతున్నాడనే అనవచ్చు. త్వరత్వరగా దూదిని వుండకట్టుకుంటే, త్వరత్వరగా పనులు దొరుకుతాయి. అలా కాకుండా ఒకసారి ఏకి కుట్టిన పరుపే సంవత్సరాల తరబడి పనిచేస్తే నష్టం కాదా? అంతేకాకుండా

అతను తీసుకునే కూలీ తక్కువే! సేరు దూది ఏకితే అర్ధరూపాయి తీసుకుంటాడు. వేరే ఇంకెవరయినా అయితే ఇంకా ఎక్కువే తీసుకుంటారు. సుల్తాన్ మధుపురిలో మంచి పలుకుబడి సంపాయించాడు. ఒకసారి అతనిచేత పరుపు కుట్టించుకున్న వాళ్ళకు మరొకరు కుట్టటం నచ్చనే నచ్చదు.

సుల్తాన్ మైదాన ప్రదేశానికి చెందినవాడు. గ్రామనివాసో? పట్టణనివాసో? చెప్పలేము. సాధారణంగా మధుపురిలోని వంటవాళ్ళూ, కసాయివాళ్ళూ, దూది ఏకేవాళ్ళూ, కూరగాయలు అమ్మేవాళ్ళూ అందరూ తాము పల్లెల్లో పుట్టి పెరిగినా నగర వాసులమనే చెప్పుకుంటూ వుంటారు. అలా చెప్పుకోవటం గర్వకారణంగా వుంటుంది. వాళ్ళకు! నెత్తిన బుట్టపెట్టుకుని ఇంటింటికీ తిరిగి మాంసం అమ్ముకునే ఒక కసాయివాడు తాను నగరవాసిని అని చెప్పటమే కాకుండా, 'మా ఆడవాళ్ళు సినిమాలు చూడరు' అనేశాడు. నగరంలో వుంటూ ఏ కసాయివాడి భార్య కానీ సినిమా చూడదంటే నమ్మటం కష్టం. ప్రపంచంలోని ఏమతమైనా సినిమాను పరిష్కరించలేదు. అంతే కాకుండా అతను తమ ఇంట్లో ఆడవాళ్ళు బయటకు రారనీ చెప్పుకున్నాడు. అలా చెప్పుకుంటే ఇతరులు తనను నగరవాసి అనుకుంటారని అతని ఆశ! ఇస్లాం మతం, మతం పేరుతో ఘోషాను ప్రచారం చేసింది. ఏమతం ఏదృష్టితో ఘోషాను ప్రచారం చేసినా అది ధనికుల వరకే పరిమితం. ఇంట్లో అందరూ కష్టించి పనిచేస్తే తప్ప ఇల్లు గడవని పరిస్థితి వున్నప్పుడు గోషా పద్ధతిని అనుసరిస్తే, కుటుంబంలో సగం మంది చేతులు ముడుచుకుని కూర్చోవలసి వస్తుంది. ఘోషాలాంటి విలాసపద్ధతులు బీదకసాయి ఇంట్లో ఎట్లా మనగలుగుతాయి? కానీ సుల్తాన్‌కు ఇలాంటి మిధ్యాభిమానాలు ఏమీ లేవు. అతని ముఖం చూస్తేనే ఎదుటివారికి దయ కలుగుతుంది. పరుపులు కుట్టించుకునే అవుసరం లేకపోయినప్పటికీ, అతనికి ఏదో పని ఇద్దామనిపిస్తుంది. కానీ, సుల్తాన్‌కు దూదిఏకడం తప్ప మరొకపని చేయటం రాదు. కుషన్ కుర్చీలను బాగు చేయటం, వాటికి ఫ్రేములూ అల్లటం, రంగు వేయటం లాంటి పనులే కనుక అతనికి వచ్చివుంటే, సంవత్సరం మొత్తం అతనికి చేతినిండా పని వుండేది!

## 2

1947 ఆగస్టు నెల వచ్చింది. భారతదేశం రెండుగా విభజింపబడి పాకిస్తాన్ ఏర్పడింది. రెండు దేశాల సరిహద్దుల్లో వున్న అమాయకులైన స్త్రీ పురుషులు ఎందరో బలిపశువుల్లా వధించబడ్డారు. ఆ సంఘటనలతో మధుపురి కొంత వరకూ ప్రభావిత మైనది. భారతదేశ విభజన జరగక ముందు మధుపురి ఏ మాత్రం పక్షపాతాన్ని

ప్రదర్శించకుండా విలాస యాత్రికులందరినీ ఆహ్వానించేది. ఈ శతాబ్ద ఆరంభంలో ఉచ్ఛకులాల్లో 'అంటూసొంటూ' అనే పట్టింపు కొద్దో గొప్పో మిగిలి వున్నా! రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఆహార సంబంధమైన నిషేధాలన్నీ పూర్తిగా తొలగిపోయాయి. బేటీ (కూతురు, వివాహ అనే ఉద్దేశం) లో సామ్యాన్ని సాధించలేకపోయినా రోటీ (ఆహారం) లో మాత్రం సామ్యాన్ని సాధించారు. మధుపురి రాజకీయ సంబంధం అయిన గ్రీష్మ రాజధాని కాదు. విలాసప్రియుల శుద్ధ విలాస నగరం! ఇంగ్లీషు వారే ఎక్కువగా వస్తుంటారి క్కడికి! వారి తరువాత రాజులు, నవాబులు కూడా అధిక సంఖ్యలోనే వస్తుంటారు. క్లబ్బుల్లో, రెస్టారెంట్లల్లో, హోటళ్ళల్లో ఒకరి కొకరు ఖరీదైన మద్యంతో నిండివున్న గ్లాసులను తాకిస్తూ 'ఛీర్స్' చెప్పుకునే శబ్దాలు నిరంతరమూ వినిపిస్తుండేవి. అయితే, ప్రథమ మహాయుద్ధానికి ముందు నల్లవాళ్ళు మధుపురిలో అడుగుపెట్టటానికి అనుమతి వుండేది కాదు. ఏ మంత్రికో లేక ఆ హోదాకు చెందిన వాళ్ళకో అప్పుడప్పుడు మధుపురిలో కాలుపెట్టే అదృష్టం లభిస్తుండేది. వంటవాళ్ళు భారతీయులే వుండేవారు. వాళ్ళల్లో బెట్ట గ్రామానికి చెందిన బరువా బౌద్ధులు, గోవాకు చెందిన క్రిస్టియన్లూ ప్రసిద్ధి చెందారు. అయితే, వాళ్ళను తమ దగ్గర వంటవాళ్ళుగా వుంచుకునే శక్తి ఇంగ్లీషు వాళ్ళందరకూ వుండేది కాదు. ఇంకోరకంగా చెప్పాలంటే, ఈ వంటవృత్తి మీద ముస్లిమ్‌లు గుత్తాధిపత్యాన్ని సంపాదించారని అనవచ్చు. హిందూ రాజు దగ్గర కానీ, ముస్లిం నవాబు దగ్గరకానీ, ఇంగ్లీషు ఆఫీసర్ల దగ్గరకానీ ఎవరి దగ్గర చూసినా ముస్లిం వంటవాళ్ళే వుండేవాళ్ళు. హిందువుల్లో ఉన్నత కులాలకు చెందిన వారెవరూ ఈ వృత్తికి రారు. ఒకవేళ ఎవరైనా ఒక రాణీగారు మరీ మత సంబంధమైన శ్రోత్రీయ అభిప్రాయాలు కలదైతే, తనతో పాటు బ్రాహ్మణ వంటవాణ్ణి తెచ్చుకునేది. అయితే, ఆ బ్రాహ్మణ వంటవాడు వంటచేసి పెట్టటమే కాకుండా గదుల్ని, ఫర్నీచర్‌ను మురికిచేసి పెట్టేవాడు. అదే ముస్లిం వంటవాడ యితే గదుల్ని శుభ్రంగానూ వుంచుతాడు, ఏ మాంసాన్ని వండిపెట్టమంటే, ఆ మాంసాన్ని వండిపెడతాడు. అయితే, అతడిని తినమని బలవంతం చేయకుండా వుంటే చాలు. నాలుగయిదు తరాలుగా అదే వృత్తిలో వుండటాన వంటగదిని ఎలా వుంచాలి, భోజనం చేసే టేబుల్ని ఎలా సర్దాలి – ఇలాంటి విషయాల్లో మెళకువల్ని బాగా తెల్సుకున్నారు. గాజుపాత్రల్ని భద్రంగా వాడటం నేర్చుకున్నారు. తమ యజమానుల దృష్టికి చక్కగా కనపడేట్టు తెల్లని దుస్తులు ధరించడమూ నేర్చుకున్నారు. ముస్లిం వంటవాళ్ళకు తమ మతం పట్ల చాలా భక్తి విశ్వాసాలున్నాయి. వీళ్ళల్లో చాలామంది రోజూ నమాజు చదువుతూ వుంటారు. శుక్రవారం నాడు మధుపురిలోని మసీదులన్నీ కిటకిటలాడుతూ వుంటాయి. ఐనప్పటికీ వాళ్ళల్లో ఇతర మతాల పట్ల ద్వేషభావం లేదు. ఇతర మతాలకు విరుద్ధంగా

బలవత్తరమైన ముస్లిం సంస్థను స్థాపించాలన్న ఉద్దేశమూ వాళ్ళకు లేదు. మధుపురిలోని బంగళాలనూ, రోడ్లనూ మరమ్మతు చేసే కూలీలు బాల్తీ (కాశ్మీర్) ముస్లింలు వాళ్ళను మధుపురిలో లధక్ ముస్లిములంటారు. వాళ్ళు 'అంటూ–సొంటూ' విషయంలో హిందువులకు ఏ మాత్రం తీసిపోరు. తమ గ్రామాల్లో వాళ్ళు హిందువులు ముట్టుకున్న పాలను కూడా తగరు. అయితే, చాలా అమాయకులు. మధుపురిలోని భయస్థులైన కోమట్లు కూడా వాళ్ళను నోటికి వచ్చినట్లు తిడుతుంటారు. భారతదేశం విభజింప బడక ముందు మధుపురి ప్రజల్లో మతసంబంధమైన క్రూర ప్రవృత్తులు అసలు లేవనే చెప్పవచ్చు.

ముస్లిమ్‌లీగ్ ముస్లిముల్ని ప్రత్యేకమైన జాతిగా ప్రచారం చేసింది. ఆ ప్రచారం ముదిరి దేశాన్ని విభజించే వరకూ వచ్చింది. ముస్లిం లీగ్‌లోని మధ్యతరగతి ముస్లిములు మధుపురికి వస్తూనే వుంటారు. వారి కారణంగా లీగ్ భావాల ప్రభావం మధుపురిలోని ముస్లిం వ్యాపారుల మీదా, పనివాళ్ళమీదా పడసాగింది. 'ముస్లింలీగ్ జిందాబాద్' 'కాయదే ఆజం జిందాబాద్' 'పాకిస్తానీ జిందాబాద్' అన్న నినాదాలు మధుపురిలోనూ అప్పుడప్పుడు వినపడుతూ వున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం సమాప్తం అయ్యేనాటికి పాకిస్తాన్ ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. ఇంకొక్క సంవత్సరానికి విభజన జరుగుతుందనగా, మధుపురిలోని హిందువులకూ పాకిస్తాన్ తప్పదనిపించింది. అప్పుడిక లధక్ ముస్లిమ్‌లు కూడా లీగ్ జండా క్రిందకు వచ్చారు. మధుపురికి వచ్చేవాళ్ళల్లో మాంసాహారులు కాని వాళ్ళు బహుకొద్ది మంది వుంటారు. అక్కడ మాంసం తినేవారి సంఖ్య ఎక్కువగా వుంటుంది కనుక మాంసం అమ్మేవారి సంఖ్య అధికమే! సిక్కులు స్వయంగా 'హలాల్' చేసుకుంటారు. కనుక ముస్లిమ్‌లు ముట్టిన మాంసాన్ని తినటానికి అభ్యంతర పడేవారు కాదు. ఇంతమందికి మాంసాన్ని సప్లయి చేయటానికి చాలామంది కసాయి వారూ అవుసరం అవుతారు. ముస్లింల లోని కసాయిలందరూ వాస్తవానికి హిందువులే! హిందువులలోని నిమ్నకులాలకు చెందిన వారి పూర్వీకులు భారతదేశానికి ముస్లిములు వచ్చిన కొత్తల్లో మతం మార్చుకు న్నారు. ఆనాడు ముస్లిం మతంలో చేరిన హిందువుల సంతానమే ఈనాటి కసాయి వృత్తిని చేస్తున్న ముస్లిములు! వీరికి మాంసాన్ని కోయటం చిన్నతనం నుంచే అభ్యాసంలో వుంటుంది. అలాగని వీళ్ళను యుద్ధవీరులు అనుకోవటానికి వీలు లేదు. అయినా, వాళ్ళ క్రూరత్వాన్ని చూసి హిందువులు భయపడేవారు. ముస్లిమ్ లీగ్ ఉద్యమం చిరస్థాయినందుకుంది. వెనుకట మాంసాన్ని బయటకు తీసుకువెళ్ళవలసి వస్తే గంపల్లో పెట్టుకుని, బట్ట కప్పుకుని తీసుకు వెళ్లేవారు. పశువుల్ని వధించటం కూడా ప్రత్యేకమైన స్థలాల్లోనే జరిగేది. ఆరోగ్యం దృష్ట్యా కూడా అలాంటి స్థల నిర్ణయం అవుసరమే. అలాంటిది కసాయిలు నడిబజార్లో ఆవుని కోస్తామని హిందువులను బెదిరించారు. హిందువులు

ఏమీ చేయలేకపోయారు. ఇంగ్లీషువాళ్ళు ముస్లిముల్ని 'ఉసి' కొలుపుతున్నారు. కొద్దిరోజుల తరువాత సెంటర్‌లో వున్న లాలాలందరూ తమ దుకాణాల్ని మూసేసుకున్నారు. నలువైపులా ఉద్రిక్త వాతావరణం వ్యాపించింది. సాధారణ ముస్లిం ప్రజలు ఒక విషయాన్ని ఆలోచించలేకపోతున్నారు. ఒకవేళ పాకిస్తాన్ ఏర్పాటు అయినప్పటికీ అది మధుపురికి చాలా దూరంలో వుంటుంది. మధుపురిలోని ముస్లిమ్‌లకు ఆ పాకిస్తాన్ వల్ల వచ్చిందేమీ లేదు. వీళ్ళు అక్కడికి ఎటూ వెళ్ళలేరు. మధుపురిలోని ముస్లిములు పాకిస్తాన్ వాదాన్ని సమర్థించే వారిని 'పాకిస్తాన్ ఏర్పడిందే అనుకో! దానివల్ల మాకు వచ్చే ప్రయోజనం ఏమిటి? అని ప్రశ్నించి వుండరు. ఒకవేళ ప్రశ్నించినా 'పాకిస్తాన్ ఏర్పడాలే కానీ మనందరం అక్కడికి వెళ్ళిపోదాం. అని చెబుతారు వాళ్ళు. వారి మాటల్ని బట్టి చూస్తే పాకిస్తాన్ ఏర్పడటం ఈ పృధ్వీమీదకు స్వర్గం అవతరించటమే!

ఇంకా దేశ విభజన జరగలేదు. సరిహద్దులూ నిర్ణయం కాలేదు. అప్పుడే పశ్చిమ పంజాబుకు చెందిన సంపన్నులైన హిందువులు కొందరు మూటాముల్లే సర్దుకుంటున్నారు. వాళ్ళు తక్కువ ఖర్చుతో హాయిగా వుండే నగరాలు హిమాలయ పర్వతాల్లోని విలాస నగరాలే! ముఖ్యం పంజాబుకు దగ్గర్లో వున్నది. ఆ సంవత్సరం 1947 లాహోరు, ఇతర నగరాలలోని కొన్ని లక్షల మంది హిందువులు మధుపురికి వచ్చి తలదాచుకున్నారు. బంగళాలూ, ఔట్‌హౌస్‌లు పంజాబీలయిన కాందిశీకులతో కిటకిటలాడిపోయాయి. పంజాబు హిందువులు తమ గ్రామాల్లో, నగరాలలో ముస్లిములతో పోరాడారు. వారికి కొంత అనుభవం వుంది. కనుక పంజాబు మధుపురి కోమట్లంత పిరికివాళ్ళు కారు! పంజాబీలు అధికసంఖ్యలో వచ్చారేమో చాలా ఎక్కువగా ధైర్యసాహసాలను ప్రదర్శించసాగారు. సెంటర్‌లో గోవుని వధిస్తామని ప్రగల్భాలు పలికి మధుపురి లాలాలను భయపెట్టిన ముస్లిముల పని ఇప్పుడు ఇరకాటంలో పడింది. హిందువులూ, పంజాబు నుండి వచ్చిన సిక్కులూ, ముస్లిములను కొట్టారు. ఎవరికి చెప్పుకుంటారు? గుడ్ల నీరు గుడ్ల కుక్కుకున్నారు. 'పాకిస్తాన్ జిందాబాద్' అన్న నినాదానికి బదులు 'పాకిస్తాన్ భాగో'' (పాకిస్తాన్‌కు పరుగెత్తండి) అన్న నినాదం అన్నిచోట్లా వినిపించసాగింది.

మధ్యతరగతికి చెందిన ముస్లిములకు హడలు పుట్టింది. అయితే, సరిహద్దుల నిర్ణయం జరిగినాక పాకిస్తాన్ వెళ్ళిపోవచ్చన్న ఆశ ఒకటి వున్నది వాళ్ళకు. మధుపురిలోని సిక్కులూ హిందువులూ లాహోరు నివాసులు. రావీ నది పశ్చిమ పాకిస్తాన్‌కు సరిహద్దు అవుతుందనీ, లాహోరు భారతదేశంలోకే చేరుతుందనీ వారికొక గుడ్డి నమ్మకం వుండేది. కానీ, తుదినిర్ణయాలు జరుగక ముందే రక్తపాతం ప్రారంభం అయింది. పంజాబులో రక్తం వరదలు కట్టింది. చివరకు తుది నిర్ణయాన్ని వినిపించారు. లాహోరు పాకిస్తాన్‌కు

పోయిందని రేడియోలో చెప్పారు. మధుపురిలోని కాందిశీకుల రక్తం ఉడికిపోయింది. గతంలో 'పాకిస్తాన్ జై' అన్న మధుపురిలోని ముస్లిమ్‌లు పాకిస్తాన్ రావటాన తమకు ఒరిగిందేమీ లేదని తెల్సుకున్నారు. ఈ గడ్డమీద తమ తాతలూ, తండ్రులూ పుట్టారు గిట్టారు. తరతరాలూ ఈ గడ్డమీదనే నడిచాయి. తామూ ఇక్కడే బతకాలి. తమ పితరులు దీర్ఘనిద్రభూతులైన ఈ గడ్డమీదనే తామూ కన్నుమూయాలి! అంతేకాకుండా తమ యజమానులూ ఇక్కడే వున్నారు. వారి దగ్గర పని చేసే తాము బ్రతకాలి అని తెలుసు కున్నారు ముస్లిములు. మధుపురిలోని ముస్లిములు చాలా మంది తమ పొరపాటును గ్రహించారు. కానీ, వాళ్ళు తప్పు తెలుసుకున్నారని గ్రహించేవాళ్ళు ఏరి? 'మా సోదరుల్ని అక్కడ చంపుతున్నారు. మేమూ ఇక్కడ చంపుతాం! అన్నమాటే ఎక్కడ విన్నా. వాళ్ళ దృష్టి అతి పురాతనమైన సామూహిక వాదానికి వెళ్ళిపోయింది. ఒకళ్ళు ఒక్క తప్పు చేస్తే సమూహాన్నే వధించేయాలన్న మానసిక స్థితి ఏర్పడింది. మధుపురిలోనూ హత్యాకాండను ప్రారంభించాలని చూశారు. అధికారులు ఎలాంటి సంఘటనలూ జరుగకుండా వుండటా నికి తగినన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. అయినా అది ఒక తుఫాను. దాన్ని ఎవరు ఆపగలరు? చివరకు, పది పదిహేను మంది ముస్లిం కూలీలను బలిపశువుల్ని చేశారు. మధుపురిలోని బంగళాలు ఒకదాని కొకటి దూరం దూరంగా వుంటాయి. వాటిల్లో మిగిలిన ముస్లిములను దాయటం చాలా సమస్య అయింది. చివరకు ఒక విశాలమైన, పెద్ద బంగళాను ఎంచుకుని మధుపురిలోని ముస్లిములందర్నీ అందులోకి చేర్చారు.

సుల్తాన్ ఎన్నడూ 'పాకిస్తాన్' వాదాన్ని సమర్థించలేదు. 'ఎక్కడో పాకిస్తాన్' ఏర్పడితే తమకు ఒరిగేదేమిటి? అన్న సమస్య మొదటి నుంచీ అతని మెదడులో మెదుల్తూనే వున్నది. సుల్తాన్ మౌనప్రియుడు. ఎవరితోటీ ఎక్కువగా మాట్లాడడు. పాకిస్తాన్ గురించి అతని అభిప్రాయాలు తోటి ముస్లిమ్‌లకు తెలిస్తే కాఫిర్ (విధర్మి – నాస్తికుడు అనే వారే! కానీ సుల్తాన్‌కు ఒక మొండి ధైర్యం వుంది. నేనెవరికీ చెడు చేయను. అలాంటప్పుడు నాకు చెరుపెందుకు చేస్తారు? అనుకునేవాడు.

కాని సుల్తాన్ సహచరులలో ఐదుగురిని నరికివేయటంతో అతని మొండిధైర్యం చలించింది. అతనూ పోలీసుల రక్షణలోకి వెళ్ళాడు. శరణార్థుల క్యాంపులో చేరాడు. ఆహారానికి సంబంధించిన ఏర్పాట్లను ప్రభుత్వమే చేసింది. అయినా అర్థాకలితో వుండిపోవల్సి వచ్చేది. ఆ గందరగోళంలో నలుగురైదుగురు హిందూ నాయకులు వ్యాపారులయ్యారు. ముస్లిముల చరాస్తినంతా ఈ నాయకులు స్వాహా చేశారు. రక్షణ కల్పించటానికి వచ్చిన పోలీసు ఆఫీసర్లు పాకిస్తాన్‌లో జరిగే హిందువుల హత్యల్ని గురించి అత్యుక్తుల్ని వింటున్నారు. మధుపురిలోని నిరపరాధులయిన ముస్లిముల పట్ల దయ

చూపలేకపోయారు. నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. సైనికులు చూస్తుండగానే ముస్లిముల దుకాణాలను దోచేశారు. ముస్లిముల దుకాణాలను దోచుకుని లక్ష రూపాయల ధనవంతుడు పదిలక్షలకు అధికారి అయ్యాడు. కొద్దోగొప్పో దోపిడీ చేసిన వాళ్ళు కూడా ఇలాంటి పెద్ద దోపిడీదారుడికీ తమ వద్ద కల వస్తువుల్ని కారు చౌకగా అమ్మేశారు.

మేలు ఏమి జరిగిందంటే, ఆ తుఫాను ఒకటి, రెండు రోజులే వీచింది మధుపురిలో. ప్రజలు అనవసరమైన హత్యాకాండకు విముఖులయ్యారు. పోలీసులూ వాళ్ళను ఆపటంలో సఫలులయ్యారు. సుల్తాన్ శరణార్థుల క్యాంపులోకి వెళ్ళాడేకానీ అక్కడ ఒకటి, రెండు రోజులకు మించి వుండలేదు. ఎంత వద్దని చెప్పినా వినకుండా సుల్తాన్ అందరికంటే ముందు క్యాంప్ నుండి బయటకు వచ్చేశాడు. మరొక వృద్ధ ముస్లిం కూడా సుల్తాన్‌తోపాటు బయటకు వచ్చేశాడు. అతను బ్రిటిష్ ప్రభుత్వంలో పెద్ద ఉద్యోగం చేశాడు. పెన్షన్ తీసుకుంటూ మధుపురిలోనే వుంటున్నాడు. అతను మధుపురిలో వుండటం విలాస జీవితాన్ని అనుభవించటానికి కాదు. మధుపురి యొక్క ప్రశాంతమైన ప్రకృతిని చూసి అక్కడికి వచ్చి వుంటున్నాడు. అతను ఇలా అనుకున్నాడు "నా హృదయంలో ఎవరిపట్ల మతసంబంధమైన ద్వేషం లేదు. అలాంటప్పుడు ఎవరో నాకు చేటు చేస్తారని ఎందుకు అనుకోవాలి? ఒకవేళ చేస్తారనుకున్నా చంపుతారు. అంతకంటే ఏం చేస్తారు? డెభై ఏళ్ళవాడిని నేను మృత్యువుకు భయపడటం ఏంటి?

తుఫాను తీవ్రత బాగా తగ్గక ముందే ఆ వృద్ధ ముస్లిం ఒంటరిగా బజార్లలో తిరిగేవాడు. అతని మిత్రులైన హిందువులు అలా వెళ్ళవద్దని ఎంతో చెప్పి చూశారు. అయినా అతను వినకపోవడంతో, మధుపురిలోని పెద్దలు కొంతమంది అతని రక్షణార్థం అతనికి తెలియకుండానే కొంతమందిని వెనుక పంపించేవారు! తన రక్షణ కోసం మరొకరు వెనుక వస్తున్నారంటే అతను ఒప్పుకోడు.

## 3

పాకిస్తాన్ ఏర్పడ్డది. తరువాత సంవత్సరమే మధుపురిలోని ముస్లిం వంటవాళ్లు, ఇతర పనివాళ్లు పాకిస్తాన్ వెళ్ళిపోయారు. మధుపురిలోని ముస్లిమ్‌లు హిమాలయ పర్వతాలలోని విలాసనగరాలకు అలవాటు పడ్డారు. పాకిస్తాన్‌లో తాము వుండటానికి మధుపురిలాంటి చల్లని విలాస నగరాన్ని వెతుక్కోవాలి! అయితే, అక్కడ 'మరీ'అనే విలాస నగరం మాత్రమే వుంది. మధుపురిలో ఏదో ఒక ఉద్యోగం చేసుకుంటూ నిశ్చింతగా బతికే ముస్లిములు పాకిస్తాన్ వెళ్ళాక ఎలాంటి ఇబ్బందుల్లో పడ్డారో తెల్సుకోవటానికి

క్రింద ఒక లెటరును ఇస్తున్నాను. ఈ లెటరు 1950 ఆగస్టు 1న అంటే తుఫాను తగ్గిపోయిన తరువాత మూడేళ్ళకు పాకిస్తాన్ వెళ్ళిన ముస్లిమ్ తన బంధువుకు రాశాడు.

"సబీర్ భాయికి' అనేక సలాములు. మా ఆడోళ్ళ సలాములూ స్వీకరించగలరు. మనోళ్లందరికీ నేను, మా ఆడోళ్ళు సెయెత్తి దణ్ణం పెడుతున్నాము. ఈడ మేమంతా కులాసాగా వున్నాము. భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నా. సుకంగా వుండండి. మీరు రాసిన లెటరు 31-7-50న అందింది. సదివి సంతోషించాము. అది సదువుతుంటే మా సబీరు అన్న కాడ కూకున్నట్టే వుంది. మీరు రాసినత్తు ఆత్తి అంతా సెల్లెలి పేర్ల పెట్టేత్తే సాలా బాగుంటది. మీరు అట్లా సేసినందుకు నాకు చానా కుసీగా వుంది. మీరు మంచిపని సేసారు. భగవంతుడు మీకు మేలు సేత్తాడు. మీరు ఐదు రోజుల సెలవలలో ఇంటికి ఎళితే అన్నగారూ! ఇంటిని కనిపెట్టి వుండండి. తమ్ముణ్ణి కనిపెట్టి వుండండి. నేనాడకు రావాలని ప్రయత్నిత్తుండా! బొందిలో పానాలు వుంటే, భగమంతుడు సల్లగా సూత్తే ఏనాటికయినా మనింటికి వత్తా. మీరు మరేమీ బాధపడకండి. మనకు ఈ ఎడబాటు దురదుట్టం వల్ల కలిగింది. భగమంతుడు మేలు సేత్తే బొందిలో పానాలుంటే,మనం ఏనాటికియాన సూసుకుంటాం. మా ఆడోళ్ళు ఇంటికి వెళ్ళిపోదామని ఒకటే పోరు పెడుతుండారు. నువ్వు రాకుండే మానే మమ్మాల సబీర్ కాడ దిగిడుసు అంటున్నారు. మీరేమి బయపడకండి. ఇంటిని జాగర్తగా సూసుకోండి. ఇల్లే మనకు గారవం ఇచ్చుద్ది. ఇల్లు వదిలితే మడిసికి గారవం యాడిది? ఇంకా రాసే ఇసయం ఏటంటే, మా వల్ల తప్పులుంటే చమించండి! ఉత్తరం రాసుతుండే అయ్యగారికి నా దణ్ణాలని సెప్పు. ఆర్ని కొంచెం ఇడి ఇడిగా రాయమని సెప్పు. ఆరి ఇందీ రాత నాకు అద్దం కావడం కట్టమౌతున్నది. ఇక రాసే ఇసయం ఆడ మీ పని అయిపోయాక ఇంటికి ఎల్లిపోండి! జాగత్త ఎటూ ఎల్లాలని అనుకోకండి. నిదానించి, ఆలోచిస్తే అన్నీ సక్కబడతాయి.

అందరికీ దండాలని సెప్పండి. నేనో లెటరు ఢిల్లీకి రాసాను. ఆడ నుండి జవాబు ఒచ్చాక, అక్కడి ఇసేసాలు రాత్తాను. ఇంతే సంగతులు. దండాలు!

1947 ఆగస్టులో మధుపురిలోని ముస్లిములు కొందరు పాకిస్తాన్‌కు వెళ్ళారు. అక్కడ తమకు నూతన నివాసం ఏర్పడుతుందని ఆశించారు. చలికాలంలో కొండ క్రింది మైదాన ప్రదేశాల్లోని ఏదో ఒక గ్రామాన్ని సొంత గ్రామంగా చేసుకుని, వేసవికాలంలో పాకిస్తాన్‌లోని విలాసనగరానికి దేనికయినా వెళ్లి పనిచేసుకుని బతకవచ్చు అనుకున్నారు. కానీ భారత దేశంలో విలాస నగరాలు చాలా వున్నాయి. విలాస యాత్రికులు చాలా మంది వస్తుంటారు. పాకిస్తాన్‌లో అయితే విలాసనగరం ఒక్కటే. అక్కడికి మధుపురికి వచ్చినంత మంది విలాసయాత్రికులు రారు. ఎన్నో ఆశలు పెట్టుకుని మధుపురి నుండి పాకిస్తాన్‌కు వెళ్ళిన

ముస్లిములు తరువాత పశ్చాత్తాప పడ్డారని పై లెటరు వల్ల తెలుస్తూనే వున్నది. పాకిస్తాన్ వెళ్ళకుండా వున్నవాళ్ళు, మూడేళ్ళ వరకూ మధుపురి వైపు కన్నెత్తి చూడలేదు. మూడు బజార్లలోనూ ఒక్క దుకాణమూ కూడా ముస్లిములది లేదు. గతంలోలా బజార్లలో ముస్లిములు ఎవరూ కనిపించటం లేదు. అయితే సుల్తానుకు మాత్రం ఏ భయమూ లేదు. అతను ఆ సంవత్సరమే నిర్భయంగా మధుపురి బజార్లలో తిరిగాడు. ఆ సంవత్సరం మధుపురిలోని ముస్లిములందర్నీ లారీల్లో క్రింది గ్రామాలకు పంపించి వేశారు. అయితే, సుల్తాన్ మాత్రం అలా వెళ్ళటానికి అంగీకరించలేదు. ఆ సంవత్సరం నవంబర్ వరకూ అతను మధుపురిలోనే వున్నాడు. ఆ సంవత్సరం అల్లర్ల కారణంగా రెండవ సీజన్‌కు విలాసయాత్రికులు ఎవరూ రాలేదు. వాళ్ళ బదులు శరణార్థులు చాలా మంది వచ్చారు. మధుపురిలోని ఔట్‌హౌస్‌లన్నీ శరణార్థులతో నిండిపోయాయి. వాళ్ళు చలికాలంలోనూ అక్కడే వుండిపోతారు. కనుక రజాయిల్లో దూది నింపవలసిన పని బాగా దొరుకుతుంది.

## 4

1947లో వీచిన తుఫాను గాలులు మధుపురి కళను పాడుచేశాయనటానికి వీలులేదు. 46 నుండే మధుపురి కళ తప్పుతూ వచ్చింది. అప్పుడే ఇంగ్లీషు వ్యాపారస్థులు తమ ఆస్తుల్ని కారు చౌకగా అమ్మేసుకు వెళ్ళిపోయారు. ఆ సంవత్సరం సీజన్‌లో ఇంగ్లీషు వారెవరూ మధుపురికి రాలేదు. 47 ఆగస్టులో ఆ కొట్లాటలు జరగకపోయినా మధుపురి స్థితి ఇలాగే వుండేది. ధనవంతులైన విదేశీ యాత్రికులు ఒక్కొక్కరే మధుపురికి రావటం మానేశారు. ముఖ్యంగా ఇంగ్లీషువాళ్ళు రాకపోవటంతో మధుపురిలో బతుకు తెరువు దెబ్బతిన్నది. రాజులూ, మహారాజులూ, జమీందార్లూ, జాగీర్దారుల సంస్థానాల మీద వజ్రపాతం జరగడంతో ఆదాయాలు లేక మధుపురికి రావడం మానుకున్నారు. పెన్షన్ రూపంలోనూ, నష్టపరిహార రూపంలోనూ బాగానే డబ్బు అందింది. అయినా, భవిష్యత్తు వెనకటి లాగా చింతారహితం కాకపోవడంతో, ప్రతి పైసానూ చూసి చూసి ఖర్చు పెట్టుకో వలసినవారయ్యారు. వెనకటిలా ఖర్చు పెట్టలేకపోతున్నారు. ఈ పరిస్థితుల ప్రభావం మధుపురిమీద పడటం సహజం కదా!

సుల్తాన్ ఒక వారం బిక్కుబిక్కుమంటూ గడిపాడు. క్యాంపులో మాత్రం రెండురోజులు వున్నాడు. ఇంట్లో తనూ ముసల్దీ! కొడుకూ, కోడలూ ఆ గందరగోళాలలో చెదిరిపోయారు. కొడుకు లాహోరులో వున్నాడని తెలిసింది. అక్కడికి తండ్రిని పిలిపించుకోవటం కొడుకుకు ఏమాత్రం ఇష్టం లేదు. కళ్ళు మూసుకుని స్వర్గాన్ని కలకనటం వేరు, జీవితం వేరు. సుల్తాన్ అలాంటి స్వర్గాల్ని పొందాలని ఎన్నడూ అనుకోలేదు. వెనుకటిలా ఇప్పుడతను

తెల్లవారు ఝూమున లేచి దూరపు బంగళాలకు వెళ్లటం లేదు. తెల్లవారి ఎనిమిది గంటలకు తర్వాత గానీ బయలుదేరటం లేదు. ఒక్కోసారి నాలుగు రొట్టెలు మూట కట్టుకుని వెళ్ళేవాడు. ఈమధ్య చక్కెరకు కరువు వచ్చాక అతనికి ఎవరూ టీ కూడా ఇవ్వటం లేదు. సుల్తాన్ రెండు గంటల్లో 5, 6 సేర్ల దూదిని ఏకి రజాయిల్లో నింపేయగలడు. అంటే రెండున్నర రూపాయల్ని సునాయాసంగా సంపాయించగలడు. కుట్టటం కూడా చేస్తే ఇంకో పన్నెండణాల డబ్బులు సంపాయించుకుంటాడు. అయితే, రోజూ పని వుండడం కష్టం. రోజూ పని వుంటే రోజుకు 25 రూ॥లు సంపాదించగలడు.

సుల్తాన్ చూడటానికి చాలా అమాయకంగా వుంటాడు. అతని మాటలు చాలా విలువ గలవిగా వుంటాయి. అయితే, అతని స్వరం అంత మధురంగా వుండదు. అతని ముఖంలోనూ, స్వరంలోనూ ఏదో అవ్యక్తమైన బాధ కనపడుతూ వుంటుంది. అతను తన బాధల గురించి ఎవరితోనూ చెప్పుకోడు. చెప్పుకున్నా ఎవరూ పంచుకొనరు కదా? ముసల్ది ఊళ్ళో వుంటుంది. కొడుకు కోసం ఒకటే ఏడుస్తూ వుంటుంది. కొడుకుని ఉత్తరం రాయమని ప్రతి ఉత్తరంలోనూ రాస్తూ వుంటుంది. కొడుకు లాహోరులో వుంటున్నారు. ఆరేళ్ళక్రితం లాహోరు ఎంత దగ్గర తమకు? సాయంకాలం రైలు ఎక్కితే తెల్లవారేసరికి చేరిపోయే వాళ్ళు అక్కడికి! కానీ ఇప్పుడది మరో లోకమే అయిపోయింది. ఈ మరో లోకానికి చచ్చినా వెళ్ళటం సంభవం కాదు. సుల్తాన్ ఒక రకంగా కొద్దిపాటి దార్శనికుడు కూడా. తన మనసుకు ఎలాగో ఊరట కల్పించుకునేవాడు. తమ జాతి వాడయిన కబీరుదాసు దోహాలు (ద్విపదులు) నాలుగు వచ్చినట్లయితే ఇంకా ఊరట కలిగి వుండేది!

సుల్తాన్‌కు మతం పట్ల శ్రద్ధ లేదనటానికీ లేదు. ప్రతి శుక్రవారం మసీదుకు వెళు తుంటాడు. ఉపవాసాలు చేస్తూ వుంటాడు. పేదవానికి ఉపవాసం చేయటం చాలా తేలిక. ఏ పుణ్యాన్నీ ఆశించకుండానే నిత్యం పస్తు పడుకునే వారికి పుణ్యం లభిస్తున్నప్పుడు పస్తు పడుకోవటానికేం? సుల్తాన్ స్నేహితులూ తనలాంటి కష్టజీవులే! వాళ్ళతోనే అతనికి సంబంధాలు ఎక్కువ. తీరిగ్గా వున్నప్పుడు పరిచయస్థులైన చాకలి వాళ్ళ ఇళ్ళకు వెళ్ళి గంటల తరబడి కూర్చొని ఏవేవో కబుర్లు చెబుతూ వుంటాడు. అలా కబుర్లు చెప్పేటప్పుడు అతను ఎంతో ఆనందంగా వుంటాడు. మంగలి, చాకలి, వంటవాళ్లూ, కాపలావాళ్ళూ వీళ్ళందరూ అతని వర్గం వాళ్లే! ఈ వర్గానికి చెందినవారు హిందువులే కానీ, ముస్లిములే కానీ, క్రిష్టియన్లే కానీ సుల్తాన్ వాళ్ళతో కూర్చొని వాళ్ళతో మాట్లాడుతూ వుండేవాడు. ఎక్కడ పనివున్నా వీళ్ళే కదా తనకు ఇప్పిస్తుంటారు. అతనూ తన వర్గ ప్రజలకు చాలా తక్కువ కూలీతో పరుపులూ రజాయిలూ కుట్టిస్తుంటాడు. సుల్తాన్ మూడు మైళ్ళ దూరంలో

వుంటున్నాడు. అయినా, పొద్దుగూకిన తరువాత కానీ ఇంటికి చేరేవాడు కాదు.

ఒకరోజున సుల్తాన్ రిక్షా లాగుతూ కనిపించాడు. దూది ఏకేవాళ్ళు కులవృత్తి చేసేవాళ్ళవుతారు. కానీ రిక్షా లాగే వాళ్లు మనుష్య శ్రేణి నుండి పశుశ్రేణిలోకి జారి పడ్డవాళ్ళవుతారు. సుల్తాన్ రిక్షా లాగడం చూసి చూసేవాళ్ళకు మనస్సు చాలా బాధపడ్డది. అయితే అతనికి ఏమీ వుండదు. ఒక పెద్దాయన తనవైపే చూస్తుండటాన్ని గమనించి బలవంతాన చిరునవ్వును పెదాల మీదకు తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ "పనేమీ లేదు. రిక్షా సోదరుడు వెళ్ళిపోయాడన్నాడు. సరే, పదమన్నాను" అన్నాడు సుల్తాన్.

అతనికి దూది ఏకే పని దొరికితే రిక్షా ఎందుకు లాగుతాడు. అతడలా రిక్షా లాగటాన్ని అతని బంధువులు ఎవరూ సహించలేరు. మైదాన ప్రాంతాల్లోని నగరాలలో ముస్లిములు ఎవరైనా రిక్షా లాగితే లాగుతారేమో కానీ మధుపురిలో మాత్రం ముస్లిములెవరూ రిక్షా లాగరు. ఇకనుండి సుల్తాన్‌కు తన వృత్తిని వదిలి, శరీరబలమే ఆధారంగా రిక్షా లాగి బ్రతకవలసి వస్తుందా? అతను వయస్సులోనూ లేడు అలాగని బలవంతుడూ కాదు. ఎగువకు రిక్షాను తీసుకువెళ్లవలసి వస్తే అతను చాలా అలసట చెందుతాడు. కూలీలకు డాక్టర్ల దగ్గరకు వెళ్లే అవకాశం అంతగా వుండదు. సుల్తాన్ కనుక మున్సిపాలిటీ డాక్టరు దగ్గరకు వెళ్ళి గుండె పరీక్ష చేయించుకుంటే, రిక్షా లాగటాన్ని వెంటనే ఆపేయమంటాడు. కాదని లాగితే ఏ క్షణాన్నయినా మృత్యువుకు చేరువవుతావని స్పష్టంగా చెప్తాడు. అయితే, సుల్తాన్ మృత్యువుకు భయపడడు! బ్రతికినన్నాళ్ళు పొట్టకోసం ఏదో ఒకటి చేయక తప్పదు కదా? కులవృత్తిని చేసుకుంటూ ఇలా రిక్షా లాగే స్థితికి పతనమైన వాళ్ళు మనదేశంలో లక్షల సంఖ్యలో వున్నారు. ఈ ఆర్థిక వ్యవస్థ ఇట్లాగే మరికొన్నాళ్ళు కొనసాగితే, వాళ్ళ సంఖ్య కోట్లకు పెరుగుతుంది. మేము ఈ పని మాత్రమే చేస్తాము. మేము రాతకోతలకు సంబంధించిన ఉద్యోగం మాత్రమే చేస్తాము. మరొకటి చేయము. అని భీష్మించుకుని కూర్చునే చదువుకునే వాళ్ళకంటే సుల్తాన్ వెయ్యిరెట్లు నయం. సుల్తాన్ ఇలా రిక్షా లాగే వానిగా అయిపోయినందుకు అతడి పరిచయులెవరూ నవ్వరనే అనుకుంటున్నాను. ఇప్పటికీ 'కమాన్' నరమూ అతని గదిలో పెట్టి వున్నాయి. ఏ నిమిషాన పని దొరికితే ఆ నిమిషాన అతను వాటిని బయటకు తీస్తాడు. మధుపురి బజార్లల్లో అతను తిరిగి యథారూపంలో తిరుగుతాడు.

# మాస్టర్‌జీ

**కొం**డ ప్రాంతాల ప్రజలు, క్రింది మైదాన ప్రదేశాలకు వెళ్ళి నివసించలేరు. మైదాన ప్రాంతాలకు వెళ్ళి నివసించటానికి సాహసించరు. పర్వతాలు ఎత్తుగా వుంటాయి. కనుక ఆ ప్రాంతాలన్నీ ఒకేరకమైన చల్లదనంతో వుంటాయనుకోవటానికి వీలులేదు. హిమాలయాల్లో నాలుగువేల అడుగుల ఎత్తునుండి మంచు కరిగి, నదులు ప్రవహిస్తూ వుంటాయి. వాస్తవానికి అంత ఎత్తున భరించలేని చలిపెడుతూ వుంటుంది. సాధారణంగా హిమాలయ పర్వత వరుసలన్నీ మూడు, నాలుగు వేల అడుగుల ఎత్తుకు మధ్యన వుంటాయి. మూడువేల అడుగుల ఎత్తు వరకూ ఉష్ణప్రదేశమనే చెప్పవచ్చు. ఆపైన వున్న ప్రదేశాలన్నీ అతి శీతల ప్రదేశాలు. అలాంటి అతిశీతల ప్రదేశాలు హిమాలయాల్లో అతి కొద్ది మాత్రమే వున్నాయి. హిమాలయ పర్వతాల్లోని నదీ ఉద్గమ ప్రదేశాలన్నీ మూడు, నాలుగు వేల అడుగుల ఎత్తునే వున్నాయి. ఈ పర్వతాలన్నీ చెట్లు–చేమలతో, పచ్చదనంతో నిండి వుండి మానవులకు భృతిని కల్పించేవిగా, వాసయోగ్యమైనవిగా వున్నాయనుకోవటానికి వీలులేదు. పర్వత ప్రాంతాలలో నివసించే చిన్నపిల్లలు కూడా ఎగుడు–దిగుడు ప్రదేశాలలో వేగంగా నడవటానికి అలవాటు పడివుంటారు. సాధారణంగా అక్కడి ప్రజలు తాము పర్వతాలలో రోజుకు ముప్ఫై మైళ్ళ వరకూ నడవగలమనీ, మైదాన ప్రదేశాల్లో పదిమైళ్ళ యినా నడవలేమనీ చెప్పుకుంటారు. బహుశా, అలా చెప్పుకోవటం అత్యుక్తి కావచ్చు. అయితే మైదాన ప్రజలు మరీ విపరీతం మాట్లాడతారు. కొండ గ్రామాల్లో తాము వంద గజాలు కూడా నడవలేమని అంటారు. దీన్నిబట్టి కొండ గ్రామాలు గాటికి కట్టివేసిన జీవాలని, వారు తమ కొండ గ్రామాలను వదిలి ఎక్కడికీ వెళ్ళరనీ అనుకోవటానికి వీలులేదు. అదృష్టాన్ని నమ్మేవారు నూకలు ఎక్కడ రాసిపెట్టి వుంటే అక్కడికి వెళతాము అంటారు. దాని యదార్థవాది 'పొట్టకూటికోసం మానవులు ఎక్కడికయినా వెళతారు' అంటాడు. ఇది నిజం కూడా! పొట్టకూటి కోసం కూలీలుగా మనదేశ ప్రజలు ఎంతెంత దూరదేశాలకూ, ద్వీపాలకూ వెళ్ళారో? ఫిజ్, మారిషస్, దక్షిణ ఆఫ్రికా, దక్షిణ అమెరికా ద్వీపకల్పాలయిన

గయానా, ట్రినిడాడ్ వరకూ బ్రతుకు తెరువును వెతుక్కుంటూ మన ప్రజలు వెళ్ళారు. అలా వెళ్ళిన వాళ్ళల్లో కొండ గ్రామాల ప్రజలూ వున్నారు. మైదాన ప్రజలూ వున్నారు. హిమాలయ పర్వతశ్రేణులు అంతమయ్యాక వాటిని ఆనుకునే 'సివాలిక్' పర్వత శ్రేణులు వున్నాయి. 'ఒకచోట సివాలిక్' పర్వత శ్రేణులూ, హిమాలయ పర్వతశ్రేణులూ కలిసి వున్నాయి. కానీ, ఒక్కోచోట ఈ రెండు పర్వతశ్రేణుల మధ్య చాలాదూరం ఏర్పడింది. అలా దూరం ఏర్పడినచోట సువిశాలమైన మైదాన ప్రదేశాలు, వాటిల్లో దట్టమైన అడవులూ తయారయ్యాయి. ఆ అడవుల్లో ఏనుగులూ, ప్రజలే కాకుండా సింహాలు కూడా వుండేవి. రెండు పర్వతశ్రేణులకు మధ్య వలయంగా వున్న ఇలాంటి భూమిని సంస్కృతంలో 'ద్రోణీ' అంటారు. హిందీలో 'దూన్' అంటారు. (తెలుగులోనూ ఇలాంటి భూమిని 'ద్రోణి' అనీ, 'అరణి' అనీ అంటారు. – అను) హిమాలయ, సివాలిక్ పర్వత శ్రేణులకు మధ్యనున్న ఈ ద్రోణిలో, క్రూరమృగాలు ఎలాగూ వున్నాయి. వాటికంటే క్రూరమైన మలేరియా దోమలూ వున్నాయి. ఎన్ని సమస్యలు వున్నా బతుకు తెరువు సమస్యను పరిష్కరించుకోవటానికి మానవులు వెళ్ళారక్కడకు. ఆ అడవుల్ని నరికి భూముల్ని సాగుచేసుకున్నారు. అడవుల్ని నరకటం వల్ల జలస్రోతస్సులు కొన్ని ఎండిపోవడమూ, కొన్ని చోట్ల భూపాతమూ జరిగాయి. ఒకరు ఇద్దరు కావటం, ఇద్దరు నలుగురు కావటం, నలుగురు ఎనిమిది మంది కావటం సహజమే కదా? కొండ గ్రామాల ప్రజలు 'ద్రోణి'లోని భయంకరమైన అడవులలోకి చొచ్చుకు పోయారు.

ఇలా ద్రోణిలోకి వచ్చిన కొండ గ్రామాల ప్రజల్లో వివిధ కులాలవారు వున్నారు. బ్రాహ్మణులూ, శిల్పకారులూ, హరిజనులూ ఇతర వృత్తుల వాళ్ళూ చాలామంది వచ్చారు. తరతరాలుగా పేదరికంతో, దరిద్రంతో బాధపడుతున్న వాళ్ళూ పీడితులూ అనేక మంది ద్రోణిలోని మహారణ్యాల్లో నివాసాన్ని ఏర్పరచుకోవటానికి వచ్చారు. అయితే, వాళ్ల సంతానం క్రూరమృగాల వల్ల, మలేరియా దోమల వల్లా చాలా వరకు నశించిపోయింది. ద్రోణిలోకి మొదటగా ప్రవేశించిన కొండ గ్రామాల ప్రజల సంతతి చాలా కొద్దిగా మాత్రమే మిగిలింది. కానీ పర్వత పాద భూములలోని మైదాన ప్రదేశాలలోన గ్రామాల్లో 18వ శతాబ్దపు ఉత్తరార్థంలో జనాభా చాలా వేగంగా పెరిగిపోయింది. వీళ్ళు బతుకుదెరువు కోసం ద్రోణీ వైపుకు పరుగెత్తారు. ఈ విధంగా స్పష్టానది గుండా ద్రోణిలోకి అటు కొండ గ్రామాల ప్రజలూ, ఇటు మైదాన గ్రామాల ప్రజలూ ప్రస్థానాన్ని సాగించారు. ఉభయుల్లోనూ పోటీ పడ్డది. సంఖ్యాధిక్యత వల్ల ప్రవాసంలోనూ మైదాన గ్రామ ప్రజలదే పైచేయి అయింది. కొండ గ్రామాల ప్రజలు కింద మైదాన ప్రదేశాల్ని 'దేస్' అని కానీ 'మధేస్' (మధ్యదేశ్)

అని కానీ అంటారు. ఇక మైదాన ప్రాంత ప్రజలను 'దేశవాళీ' అని కానీ 'మధేసియా' అని గానీ అంటారు.

19వ శతాబ్దపు ప్రథమ పాదంలోనే ద్రోణీ మీద ఇంగ్లీషువారి ఆధిపత్యం స్థిరపడింది. ఇంగ్లీషు వారు ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయటానికి సర్వ ప్రయత్నాలూ చేయటం మొదలు పెట్టారు. ఎంతో శ్రద్ధను చూపారు. అందుకు కారణమూ వుంది. బ్రిటిష్ వారు నేపాల్ నుండి హిమాలయ పర్వత ప్రాంత ప్రదేశాల్ని కొన్నింటిని తీసేసుకున్నారు. ఆ ప్రదేశాలన్నీ చల్లగా శ్వేత ప్రజలకు నివాసయోగ్యంగా వుంటాయి. ఈ ద్రోణి కూడా అలాంటి ప్రదేశమే. వీటిని అభివృద్ధి పరచి తమ జాతి ప్రజలకు (వలస దేశాలుగా) చేయాలన్నది బ్రిటిష్‌వారి యోచన. ఆస్ట్రేలియా, ఆఫ్రికా, కెనడా, న్యూజిలాండ్ వీటిలాగానే ద్రోణి ప్రదేశాలన్ని తమ జాతి ప్రజలకు వలసదేశంగా అభివృద్ధి పరిస్తే, వారక్కడ నిత్యనూతనంగా అభివృద్ధి చెందగలరని బ్రిటిష్ ప్రభువులు ఆశించారు. ఇతర దేశాల విషయం ఎలా వున్నా ఆఫ్రికాలో స్థానికుల సంఖ్య చాలా ఎక్కువ. వేళ్ళమీద లెక్కపెట్టగలిగినంత మంది ఇంగ్లీషువారు అక్కడికి వెళ్ళి ఆదేశ ఆదివాసుల్ని అణచి తమ వలసరాజ్యం చేసుకున్నారా దేశాన్ని. ఆంగ్లప్రభువులకు తమ ఆయుధాల గురించిన గర్వం ఎక్కువ. ఎప్పటికీ పై చెప్పిన దేశాలు తమకు వలస దేశాలుగానే వుంటాయనే నేటివ్‌లు (నల్లవాళ్ళు) ఎప్పటికీ తమకు దాస్యం చేస్తూనే వుంటారనీ అనుకున్నారు. భారతదేశంలోని అస్సాం మొదలు కాంగడా కాశ్మీరు వరకూ గల సుశీతల ప్రదేశాలన్నింటినీ ఆంగ్లేయులకు ఉపనివేశాలుగా చేయాలని కలలు కన్నారు బ్రిటిష్ ప్రభువులు. పందొమ్మిదవ శతాబ్దం ఉత్తరార్థం వరకూ అలా కలలు కంటూనే వున్నారు. ఆ ఉపనివేశాలు నిత్యాభివృద్ధిని చెందాలంటే అక్కడ నివసించటానికి వచ్చే తెల్లవాళ్ళు తమ జీవనానికీ ఏర్పాట్లను అక్కడే చేసుకోవాలి. ఇంగ్లీషువారి జీవన విధానం ఉన్నతమైనది. బానిస దేశాల ప్రజల ముందు తమ దేవత్వాన్ని ప్రదర్శించుకోవాలనుకుంటే ఇంకా ఉన్నతమైన జీవితాన్ని గడపాలి. ఇంగ్లాండులో నిరుద్యోగులూ, బీదలూ తిండికి లేనివాళ్ళూ అసంఖ్యకంగానే వున్నారు. అయితే వాళ్ళందర్నీ నల్లవాళ్ళ మధ్యకు తీసుకురావటం ఆంగ్ల ప్రభువులకు ఇష్టం వుండదు. కూలీలుగా, వంటవాళ్ళుగా, తమ జాతి ప్రజలను ఇక్కడకు తీసుకు రావటం దొరలకు ఇష్టం వుండదు. తమ దేశంలో నిరుద్యోగులూ, దరిద్రులూ అయిన ఆంగ్లేయులకు గౌరవనీయమైన భృతిని ఏర్పరచటం కోసమే టీతోటల్ని పెంచడం, పండ్ల తోటల్ని పెంచడం, రాగి గనుల్ని, లోహపు గనుల్ని తవ్వడంలాంటి పనుల్ని ప్రారంభించారు. గనులకు సంబంధించిన రాగి, ఇనుము, లాంటి ఇతర పదార్థాల్లో ఇంగ్లాండుతో పోటీ పడవల్సి వుంటుంది. రాకపోకల

సౌకర్యాలు లేని ఈ ప్రదేశాల్లోని పరిశ్రమలు ఇంగ్లాండు పరిశ్రమలతో ఎలా పోటీ చేయగలవు? అయినా ఆంగ్ల దొరలు తమ ప్రయత్నాలను విరమించలేదు. 19వ శతాబ్దపు రెండవ పాదంలో మళ్ళీ తిరిగి ఉపనివేశాలను స్థాపించాలన్న పట్టుదల ఆంగ్ల ప్రభువుల్లో ఎక్కువయింది. అప్పటివరకూ ఉపనివేశాలను స్థాపించే విషయంలో ఈస్ట్ ఇండియా కంపెనీ ఒకరకమైన ఉదాసీనతను ప్రదర్శిస్తూ వచ్చింది. అంతకు ముందు ముసలి హంగ్‌సన్ ఎన్నోసార్లు చెప్పి చూశాడు. కంపెనీ దొరలు వినిపించుకోక పోవటంతో నిరాశ చెందాడు. పందొమ్మిదవ శతాబ్దం రెండవపాదంలో దొరల్లో కలిగిన మార్పుకు ముసలి హంగ్‌సన్ చాలా సంతోషపడ్డాడు. తన ఆశయం నిర్వహించబడుతున్నందుకు సంతృప్తిని వెల్లడించాడు, అయితే అదే సమయంలో 1857 విప్లవం చెలరేగింది. ఆ సిపాయిల తిరుగుబాటులో పొందిన ఘాటయిన అనుభవాల అనంతరం ఇంగ్లీషు దొరలు ఈ దేశంలో ఉపనివేశాల్ని స్థాపించాలన్న తమ ఆదర్శానికి తిలోదకాలు వదులుకున్నారు. తమ ఆదర్శాన్ని కుదించుకున్నారు. ఉపనివేశాల విషయం దేవుడెరుగు మధుపురిలాంటి విలాస నగరాలు అభివృద్ధికి వస్తే అంతేచాలు అనుకున్నారు.

విలాస నగరాలకు సేవకుల అవసరంతో పాటు ఆహార పదార్థాలూ ఇతర జీవితావసర వస్తువులూ దగ్గరలోనే దొరికేట్టూ వుండటమూ అవసరమే! ద్రోణీలోని మహా అరణ్యాన్ని 19వ శతాబ్దం ప్రథమ పాదంలో నరకటం ప్రారంభించారు. త్వరలోనే ఆ ప్రాంతానికి ప్రజలు ప్రవాహంలా రావటం మొదలు పెట్టారు. మొదట ఒక చిన్న గ్రామం ఏర్పడింది అదే అభివృద్ధి చెంది పెద్ద పట్నమయింది. ఆ పట్నం లోని వ్యాపారమంతా 'దేశవాళీ' కోమట్ల సొంతం అయింది. అంతేకాకుండా వడ్డీ వ్యాపారాన్ని కూడా వాళ్ళే చేపట్టారు. ద్రోణీలో దేశవాళీ ప్రజల సంఖ్య ఎక్కువగా వుందా? కొండ గ్రామాల ప్రజల సంఖ్య ఎక్కువగా వుందా? అన్న విషయాన్ని తెలుసుకోవటానికి ఆ పట్నంలోని భాషను పరిశీలిస్తే సరిపోతుంది. కొండ గ్రామాల ప్రజలు కూడా అక్కడకు వచ్చాక మైదాన ప్రజల భాషనూ, ఆచారాలనూ స్వీకరించారు. కేవలం పెళ్ళిళ్ళ సమయంలో మాత్రమే తమ కొండ గ్రామాల భాషనూ – ఆచారాలనూ పాటిస్తున్నారు. వ్యవసాయంలోనూ కొండ గ్రామాల వాళ్ళు 'దేశవాళీ'ల పోటీకి నిలబడలేకపోయారు. రైతులు కానీ, వ్యవసాయ కూలీలు కానీ అధికసంఖ్యలో మైదాన ప్రాంతాల నుండి వచ్చినవారే. ఎన్నో బాధల్ని భరించి, దైవికమైన, ఆది భౌతికమైన అనేక ఆపదల్ని ఎదుర్కొని కొండగ్రామాల ప్రజలు అడవిని నరికి తయారు చేసుకున్న పంట భూములు వడ్డీ వ్యాపారుల చేతుల్లోకి వెళ్ళిపోయాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు బతుకు దెరువు కోసం ద్రోణిలో నిర్మించిన కొత్తపట్నానికి వస్తున్నారు.

## 2

ఆ నగరానికి కొండ గ్రామపు బ్రాహ్మణ కుటుంబం ఒకటి వచ్చింది బతకటానికి. నాలుగు రూపాయల ఉద్యోగం దొరికితే 'అదేభాగ్యం' అనేకునేవారు ఆరోజుల్లో. వాస్తవానికి 1900 సం॥ నాటి నాలుగు రూపాయలలో 1940 నాటి పదహారు రూపాయలతోటి సమానం. 1953 నాటి అరవై రూపాయలూ సమానం. ఆ బ్రాహ్మణుడు4 రూ॥ల జీతం మీద బంట్రోతు ఉద్యోగం (నౌకరు) చేయటానికి వచ్చాడు. అతనికి నలుగురు పిల్లలు. ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు. పదార్థాల ధరలు ఎంత చౌకగా వున్నప్పటికీ భార్యా, భర్తా నలుగురు పిల్లలూ మొత్తం ఆరుగురు. నాలుగు రూపాయలతో ఎలా బతుకుతున్నారో వూహించడమే  కష్టం. ఆ బ్రాహ్మణుడి ఇద్దరు కొడుకుల్లో పెద్దవాడు మన కథానాయకుడు. అతనే 'మాస్టర్‌జీ'. మాస్టర్‌జీ ఈ శతాబ్దపు ప్రథమ దశకంలో పుట్టాడు. నాలుగు రూపాయల బంట్రోతు ఉద్యోగాన్ని చేస్తున్న అతని తండ్రికి చదువు బొత్తిగా రాదు. హిందీలో సంతకం పెట్టటం మాత్రంవచ్చు అయితే, చదువు విలువ తెలిసినవాడు కావటం వలన తన ఇద్దరు మగపిల్లల్ని తమ బజార్లోనే వున్న బడిలో చేర్పించాడు. 'మాస్టర్‌జీ' మేధావి అయిన విద్యార్థి కాకపోయినా, అన్ని క్లాసులూ తప్పకుండా పాసవుతూ వచ్చాడు. తండ్రి నానా కష్టాలు పడి కొడుకును మిడిల్ వరకూ చదివించుకున్నాడు. అదే తమ కొండ గ్రామంలో వుంటే మహా అయితే కొడుకును ప్రైమరీ దాకానే చదివించుకోగలిగేవాడేమో! తండ్రి ఒకటి ఆలోచించాడు. మిడిల్ వరకూ చదివిస్తే వీధిబడి చెప్పుకుని అయినా  బ్రతుకుతాడు అనుకున్నాడు.

మాస్టర్‌జీ 16వ ఏట మిడిల్ ప్యాస్ అయ్యాడు. అయితే, అంతకు నాలుగు ఏళ్ళ క్రితమే అతనికి వివాహం చేసేశారు తల్లిదండ్రులు! పిల్లవాడి వివాహం ఆలస్యం చేయటం తల్లిదండ్రులకు ఇష్టం లేదు. అలాంటప్పుడు ఆడపిల్లలు వివాహం వయస్సు వచ్చాక జరగాలని ఎందుకు అనుకుంటారు. తమ కొండ గ్రామాలలో అయితే వధువుని వెతుక్కోవటానికి ఆ వూరూ – ఈ వూరూ తిరగవలసి వచ్చేది. ఈ నగరంలో కొండ గ్రామాల బ్రాహ్మణ కుటుంబాలు చాలా వున్నాయి. అనేక గోత్రాల వాళ్ళూ వున్నారు. కనుక వధువును ప్రత్యేకం వెతకవల్సిన పనేమీ లేదు. పిల్లనీ, పిల్ల తల్లిదండ్రుల్నీ మొదటి నుండీ తెలుసు. పిల్లకూ, పిల్లవాడికీ వయస్సులోనూ ఐదారు సంవత్సరాల వ్యత్యాసం వుండి వుంటుంది. వయస్సులో వ్యత్యాసం వున్నా, బుద్ధిలో అదే వ్యత్యాసం ఏమీ వుండదు. బాల్యంలో ఆడపిల్లలు తెలివితేటల్లో మగపిల్లలకంటే ఎక్కువగా వుంటారు.

హిందీ మిడిల్ పాస్ అయ్యాక, పేద విద్యార్థులు ఇంగ్లీషు బడిలో చదవటమనేది సమస్యతో కూడుకున్న విషయం. తండ్రి ఎలాగో ఫీజు లేకుండా కొడుకును మిడిల్

వరకూ చదివించాడు. పై చదువులు ఇంగ్లీషు స్కూల్లో చదివించాలంటే ఫీజు కట్టాలి. ఫీజు కట్టి పై చదువులు కొడుకుని చదివించలేదు. పిల్లవాడూ అంత తెలివితేటలు కలవాడు కాదు. లేకపోతే మిడిల్‌పాస్ అయ్యాక పై చదువుకు స్కాలర్‌షిప్ లభించేది. ప్రథమ ప్రపంచ యుద్ధపు ఆర్థిక మాంద్యపు రోజుల్లో ఆ కుటుంబం ఎలాగో ప్రాణాలతో బ్రతికి వుండగలిగింది. ఈ శతాబ్ద ఆరంభంలో ఒక జ్యోతిష్కుడు భవిష్యత్తును సూచించాడు. మిడిల్ ప్యాసయినవాడు వంటలు చేసుకు బ్రతకవల్సిన పరిస్థితులు వస్తాయని చెప్పాడు. అయితే, ఆ జ్యోతిష్యం నిజం కాలేదు. కనీసం ద్రోణీలోని ఈ నగరంలో ఆ జ్యోతిష్యం నిజం కానందుకు సంతోషపడవచ్చు. మాస్టర్‌జీకి ప్రైమరీ స్కూల్లో ఉద్యోగం దొరికింది. తండ్రి తను ఉద్యోగం చేస్తున్న దొర రికమండేషన్‌తో కొడుకుకు ఉద్యోగం ఇప్పించ గలిగాడు. మాస్టర్‌జీ బడిపంతులు అయ్యాడు. అప్పుడతని వయస్సు 17 సం॥లు. పొట్టిగా, సన్నగా వుండటం కారణంగా చూడటానికి 'మాస్టర్' అనిపించేవాడు కాదు. పిల్లలమీద తన అధికారాన్ని చూపించుకోవటానికి బెత్తాన్ని ఆశ్రయించవలసివచ్చేది. అప్పటికి చాలా రోజుల క్రితమే విద్యావేత్తలు ఒక నిర్ణయానికి వచ్చారు. పిల్లల బుర్రల్లోకి చదువును చొప్పించటానికి బెత్తంతో పనిలేదు. చదువు విషయంలో బెత్తం పిల్లలకు ఎలాంటి సహాయమూ చేయకపోగా నష్టాన్ని కలిగిస్తుంది' అన్న అభిప్రాయాన్ని వెల్లడించారు. కానీ పిల్లలు పాఠాలు వప్పజెప్పకపోతే, బడికి రాకపోతే కొట్టకుండా ఎలా? విద్యాశాఖాధి కారులు వచ్చినప్పుడు బడిలో బెత్తాన్ని కనపడకుండా దాయటం పెద్ద సమస్య అవుతోంది మాస్టర్‌జీకి!

మాస్టర్‌జీకి ఉద్యోగం అయితే వచ్చింది కానీ అది తాము వుంటున్న పట్నంలో కాదు. అలాగని చుట్టుపక్కల గ్రామాల్లోనూ కాదు. చాలా దూరంలో అరణ్య ప్రాంతంలో లోని ఒక గ్రామంలో వచ్చింది. అక్కడికి వెళ్ళాక మొదటి కార్తీకమాసంలోనే మలేరియా పట్టుకుంది. మనిషి మరీ శుష్కించిపోయాడు. తల్లిదండ్రులకూ, అత్తమామలకూ అతని విషయమై దిగులు పట్టుకుంది. పట్నంలో అతనికి ఉద్యోగం దొరికే అవకాశం లేదు. ట్రైనింగ్ పాసయిన ఉపాధ్యాయులే ఉద్యోగాలు లేకుండా వున్నారు. అక్కడికీ ఊరుకోకుండా ప్రయత్నం చేశారు. మొదట మాస్టర్‌జీని ట్రైనింగ్ చదవటానికి పంపించారు. తరువాత తామువుంటున్న నగరంలోనే మాస్టర్‌జీకి ఉద్యోగం దొరికింది. అదే నగరంలో ఉద్యోగం దొరకటం వలన మాస్టర్‌జీ చాలా సంతోషపడ్డాడు. ఇంటిదగ్గరే వుండి ఉద్యోగం చేసుకోవచ్చు. భార్యను వదిలి వుండవలసిన అవసరమూ వుండదు. కొండగ్రామాల బ్రాహ్మణుల్లో కానీ రసపుత్రులలో కానీ నల్లవాళ్ళు వుండరు. మాస్టర్‌జీ తెల్లగా వుండేవాడు.

భార్య కూడా తెల్లగా వుండేది. తెల్లగానే కాదు ఆమె అతిలోక సౌందర్యవతి అన్నా అత్యుక్తి కాదు. ఆమె ముందు మాస్టర్‌జీ దివిటీ ముందు దీపంలా వుంటాడు. అయితే, ఎప్పుడూ భర్త పట్ల అసంతృప్తి వెల్లడించలేదు ఆమె. నగరంలో ఉద్యోగం వచ్చినంత మాత్రాన సుఖమైన జీవితం అనుకోవటం లేదు. వాళ్ళది చాలా పేద కుటుంబం. తండ్రి నెలకు నాలుగు రూపాయలు పెన్షను తీసుకుంటున్నాడు. మాస్టర్‌జీకి నెలకు పదిహేను రూపాయల జీతం వస్తుంది. ఒకటి, రెండు ట్యూషన్లు చెప్పుకుంటే ఎంతో కొంత వస్తాయి కానీ పట్నాల్లో ఒక్క హిందీ మాత్రమే చదువుకున్న ఉపాధ్యాయుడి దగ్గరకు ఎవరు ట్యూషన్ చెప్పించుకోవటానికి వస్తారు? ఇంగ్లీషు చదువుకున్న ఉపాధ్యాయులే ఒక రూపాయికీ, రెండు రూపాయలకూ ట్యూషన్ చెప్పటానికి సిద్ధంగా వున్నారు. తండ్రి అప్పు చేసి ఆడపిల్లలకు పెళ్ళి చేశాడు. ఆ అప్పు తీరే సరికే కొన్ని సంవత్సరాలు పట్టింది. చిన్న పిల్లవాడికీ పెళ్ళి చేశారు. అంతటితో ఆగరు కదా? పట్నంలోకి వచ్చాక మాస్టర్‌జీకి మొదట మగపిల్లవాడు పుట్టాడు. మూడేళ్ళ తరువాత రెండవ మగపిల్లవాడు ఆ మరుసటి సంవత్సరం మూడవ మగపిల్ల వాడు, మళ్ళీ తరువాత సంవత్సరం ఒక ఆడపిల్ల పుట్టారు. అప్పటికి తల్లీదండ్రీ కాలం చేశారు. మాస్టర్‌జీ తన కుటుంబానికి ఇంటి పెద్ద అయ్యాడు. ఆర్థిక బాధల్లో వున్న ఉమ్మడి కుటుంబం విడిపోక తప్పదంటారు. తల్లీ తండ్రీ పోయాక తమ్ముడు వేరయ్యాడు. ఆ స్కూల్లో అంతకంటే అభివృద్ధికి వస్తామన్న ఆశ మాస్టర్‌జీకి కనిపించలేదు. మధుపురిలో ఉపాధ్యాయులకు జీతాలు ఎక్కువ ఇస్తారనీ, హిల్ అలవెన్సులు కూడా ఇస్తారని ఆయనకు ఎవరో చెప్పారు. అయితే, మాస్టర్‌జీకి మధుపురి చలి అంటే చాలా భయం. అంతేకాకుండా అక్కడ ప్రతిదీ ఖర్చుతో పని అని తెల్సుకున్నాడు. అక్కడ నుండి మధుపురి పన్నెండు, పదమూడు మైళ్ళకంటే ఎక్కువదూరం వుండదు. ఉదయం వెళితే సాయంత్రానికి తిరిగి రావచ్చు. ఒకటి రెండుసార్లు అతను మధుపురిని చూడటానికి కూడా వెళ్ళాడు. అక్కడ ఖర్చు ఎక్కువ అన్నమాట నిజమే కానీ ఇక్కడకంటే రెట్టింపు జీతం ఎక్కువ వస్తుంది. అతని భార్య పొదుపుగా వాడుతుంది. పొదుపరితనం విషయంలో ఆమెను చెప్పి మరొకరిని చెప్పాలి! అంత తక్కువ ఆదాయంతో అలా కుటుంబాన్ని గడుపుకురావడం మరొక స్త్రీ వల్ల కాదు. మాస్టర్‌జీకి భార్య ధైర్యాన్నిచ్చింది. 'ఇక్కడకంటే హాయిగా కుటుంబాన్ని గడుపుకోగలం అక్కడ' అన్నది. మాస్టర్‌జీ మధుపురిలో ఉద్యోగం కోసం ప్రయత్నం చేశాడు. అక్కడ ఉపాధ్యాయుల అవుసరం ఎలాగూ వున్నది. అప్లికేషన్ పెట్టగానే ఉద్యోగం దొరికింది.

మధుపురికి ఒక కొసన వున్న స్కూల్లో చదువు చెప్పటానికి వెళ్ళినాక మాస్టర్‌జీ

కొంత అసంతృప్తి కలిగింది. సెంటర్‌లో నయినా కాదు ట్యూషన్‌లయినా దొరుకుతాయను కోవడానికి అనుకున్నాడు. అయితే, ఈ కొసనా కొన్ని సౌకర్యాలు వున్నాయి. ఔట్‌హౌస్‌ల్లో గదులూ ఊరికే ఇస్తారు. కట్టెలూ ఊరికే వస్తాయి. వీటి గురించి ఆలోచించుకున్నాక మాస్టర్‌జీ కొంత వరకూ సంతృప్తి చెందాడు. రెండవ ప్రపంచ యుద్ధకాలం. ఆహార పదార్థాల ధరలు పెరిగాయి. కరువు భత్యం ఇస్తున్నారు. అయినా వచ్చే ఆదాయం తినటానికి చాలటం లేదు. ఇంట్లో తాము ఒకపూట తిని ఉదయపు ఆహారంకోసం పిల్లలకు వుంచేవారు. ఈ రకంగా కడుపు మాడ్చుకొని ఎన్నాళ్లు వుండగలరు? యుద్ధకారణంగా మిలటరీ ఉద్యోగాలు బాగానే దొరుకుతున్నాయి. ఆ ఉద్యోగాలకు మంచి జీతాలు ఇవ్వటమే కాకుండా ఉచితంగా రేషన్ కూడా ఇస్తారు. వస్త్రాలూ ఉచితంగానే ఇస్తారు. మాస్టర్‌జీ ముప్ఫై రెండేళ్ళ వాడయ్యాడు. యుద్ధం కారణంగా ఏర్పడిన ప్రత్యేక పరిస్థితుల వల్ల వయస్సును గురించి కూడా పట్టించుకోవడం లేదు. ఆయన ప్రయత్నం చేసి వుంటే సిపాయి కాగలిగేవాడు. అయితే, కావాలని యుద్ధంలోకి వెళ్ళి ఎవరు ప్రాణాలిస్తారు? కొండ గ్రామాల సిపాయిలను చదివించటానికి హిందీ పండితులు అవుసరం అయ్యారు? మాస్టర్‌జీ మధుపురికి రాకపోయినట్టయితే మిలటరీలో హిందీ అధ్యాపకులకు ఉద్యోగాలు దొరుకుతాయని ఆయనకు తెలిసేది కాదు. హిందీ నార్మల్‌గా పాసయిన అధ్యాపకులు కానీ మిడిల్ పాసయిన అధ్యాపకులు కానీ కూపస్త మండూకాల్లా వుంటారు. వాళ్ళకు తను చుట్టూ జరిగే విషయాలు కానీ, ప్రపంచంలో జరిగే విషయాలు కానీ ఏ మాత్రం తెలియవు. వాళ్ళకు రోజూ పత్రిక చదివే అలవాటూ వుండదు. ఒకవేళ అలాంటి అలవాటు చేసుకున్నా, ఆకొద్ది జీతంతో తిండే తింటారా? లేక పత్రిక కొనుక్కుంటారా? వాళ్ళు కూపస్థ మండూకాల్లా వుంటారనటానికి ఒక్క ఉదాహరణ చెబితే సరిపోతుంది. ఒక మిడిల్ స్కూలు ప్రధానోపాధ్యాయుడు తన స్కూల్లోనే చదివిన మిడిల్ పాసయిన విద్యార్థి (అటు తరువాత అతడు తన గ్రంథాల కారణంగా ఇతర దేశాల్లోనూ ప్రసిద్ధుడయ్యాడు) పేరును కూడా ఎన్నడూ వినలేదు.

మాస్టర్ జీ ఒకనాడు మధుపురిని వదిలి వెళ్లిపోయాడు. సైనిక స్కూల్లో ఉపాధ్యా యుడిగా పని చేయటానికి! యుద్ధక్షేత్రంలోకి వెళ్ళనవసరం వుండదని తెలిశాక మాస్టర్‌జీ ఆ ఉద్యోగానికి వెళ్ళటానికి అతని భార్య కూడా అంగీకరించింది.

## 3

మాస్టర్‌జీ ఇప్పుడు తన స్వస్థలానికి చాలా దూరంలో సైనిక శిబిరంలో వుంటున్నాడు. సైన్యంలో చేరిన సిపాయిలే అతని విద్యార్థులు. అతని విద్యార్థులలో చాలామంది వయస్సు

ముదిరిన వారే! యువకులైన సిపాయిలందర్నీ యుద్ధక్షేత్రానికి పంపించి వేస్తున్నారు. ప్రయత్నిస్తే మాస్టర్‌జీ ఇతర దేశాలకూ వెళ్ళేవాడే! అప్పుడు జీతభత్యాలూ పెరిగేదే! అయితే, అతనికి యుద్ధ క్షేత్రంలోకి వెళ్ళటం ఇష్టం లేదు. కొన్నిరోజుల తరువాత అతనిని అస్సాంలోని ఒకసైనిక శిబిరానికి పంపించారు. అయితే, ఈ క్రొత్త జీవితం మాస్టర్‌జీకి అంతగా నచ్చలేదు. ఎప్పుడూ భార్యా పిల్లలూ జ్ఞాపకం వస్తుండేవారు. కాపురానికి వచ్చాక భార్యకు ఉత్తరం రాసేవరకూ చదువు చెప్పాడు. ఆమె ఉత్తరాలు రాస్తుండేది. ఆమె భాష శుద్ధ హిందీకాదు, రొట్టీ - బెట్టి (రోటీ-బేటీ) అని పలికే కొరవే మాండలికం కల్సిన హిందీ భాషలో ఉత్తరాలు రాసేది. మాస్టర్‌జీ తన విద్యార్థుల విషయంలో పూర్తి సంతృప్తితో వుండేవాడు. ఏ సిపాయి అయినా మాస్టర్‌జీ దగ్గర మూడు నెలల కంటే ఎక్కువ చదవడు. ఆ మూడు నెలల్లో శ్రద్ధగా చదివిన వాళ్లు 'అనార్' 'ఆమ్' అన్న నాలుగు మాటలు చదవటం నేర్చుకునేవారు. లేకపోతే లేదు. డిప్యూటీ ఇనస్పెక్టర్ ఇంక్రిమెంటు ఆపేస్తాడన్న భయం లేదు. సైనిక విద్యార్థులను కొట్టవలసిన పనే వుండదు. సైనికుల మెస్‌లోనే మాస్టర్‌జీ కూడా భోజనం చేసేవాడు. ఆ భోజనం ఇంటి దగ్గర తాము తినే భోజనం కంటే బాగానే వుండేది. మాస్టర్‌జీ పూర్వాచార పరాయణుడు. అంటూ సొంటులను పాటించే మనస్తత్వం కలవాడు. అయితే, మెస్‌లో వంట చేసే అతను తమ దేశపు కొండ గ్రామానికి చెందిన బ్రాహ్మణుడే కావటం అదృష్టం. అంతగా అవుసరం అయితే అంత దూరదేశంలో అంటూ సొంటూలను పాటించకపోయినా ఫర్వాలేదు.

అస్సాం ప్రాంతానికి వచ్చిన కొద్ది నెలలకే మాస్టర్ జీ స్థిమితపడ్డాడు. జపాను వాళ్ళు దాడి చేశారు. సింగపూర్‌కు చెందిన నావికా సైన్యం అజేయమైందని అనుకునేవారు. ఇంగ్లీషువాళ్ళు అక్కడికి రెండు అజేయులైన సైనికులతో నిండిన నావల్ని పంపించారు. ఆ రెండు నావలూ క్షణంలో ఎండు పూరిళ్ళలా దగ్ధం అయ్యాయి. జపాను సైన్యం బర్మా మీదకూ వచ్చి పడ్డది. బర్మాలో వున్న అజేయులైన ఆంగ్ల సైనికులకు పోరాడటానికి కూడా అవకాశం దొరకలేదు. ఈఘోర పరాజయాన్ని గురించి సైనిక శిబిరాల్లో వున్న తమ సైనికులకు తెలియకుండా వుంటానికి అవుసరం అయిన ఏర్పాట్లను చేసేశారు. సైనిక శిబిరాలలోకి వార్తాపత్రికల ద్వారా ఇలాంటి వార్తలు వ్యాపించటానికి వీలు లేకుండా చేసింది ఆంగ్లప్రభుత్వం. అయినా ఇలాంటి వార్తలు వ్యాప్తి చెందుతూనే వుంటాయి. పరాజయానికి సంబంధించిన వార్తల్ని మాట్లాడరాదన్న కఠినమైన నిషేధపు ఉత్తర్వులు వున్నాయి. అయినా సైనికులు ఆంగ్లేయుల పరాజయాన్ని గురించి మాట్లాడుకుంటూనే వుండేవారు. ప్రాణాల మీదకు వచ్చినప్పుడు ఏ ఉన్నతమైన ఆదర్శమూ లేకుండా కేవలం

బతుకుతెరువు కోసమే సైన్యంలో చేరినప్పుడు పరాజయాన్ని గురించి మాట్లాడుకోక ఏం చేస్తారు? ఇతర సైనికుల్లా మాస్టర్‌జీ కూడా ప్రాణభయంతో బాధపడుతుండేవాడు.

ఇంగ్లాండు ముఖ్యమంత్రి చర్చిలూ, ఇతర మిత్రదేశాల మంత్రులూ అమెరికా ప్రెసిడెంటూ –తమ ఉపన్యాసాలలో 'మేము ఫాసిస్టుల నియంతృత్వానికి వ్యతిరేకులం' మేము ప్రజాతంత్రాన్ని కోరుతున్నాం. మానవ స్వాతంత్ర్యమే మా ఆదర్శం! మన ఈ యుద్ధం సమస్త మానవుల స్వాతంత్ర్యానికీ సంబంధించిన యుద్ధం హిట్లర్, ముసోలినీ, టోబో – మానవజాతిని బానిసత్వంలో ముంచేయాలని చూస్తున్నారు' అని చెప్తుండేవారు.

పై ఉపన్యాసాల్ని భారతీయులు హాస్యాస్పదమైన కబుర్లకింద లెక్కకట్టేవారు. చర్చిలు యొక్క బ్రిటిష్ ప్రభుత్వం మానవజాతిని బానిసత్వం నుండి ఏమాత్రం ఉద్ధరిస్తుందో – భారతదేశంలోని చిన్న పిల్లవాడికి కూడా తెల్సు. మాస్టర్‌జీకి ప్రపంచ విషయాలు అంతగా తెలియవు. వారి జిల్లాలో గాంధీగారి ఉద్యమం ఎప్పుడూ తీవ్రరూపాన్ని ధరించలేదు. రాజకీయాల గురించి తెల్సుకోవటానికి మాస్టర్‌జీకి అవకాశమూ కలగలేదు. కానీ 'ఇంగ్లీషు వారు మనల్ని బానిసలుగా వుంచి, పశుసమానులుగా చూస్తున్నారు. అన్న విషయం భారతీయులందరినీ దుఃఖపరుస్తున్నట్లే మాస్టర్‌జీని దుఃఖ పెడుతోంది. ఆయన రక్తంలోనూ తమను పశువులుగా చూస్తున్నారన్న భావన ఉడికెత్తిస్తుంది. అయితే, సైనిక ఆఫీసర్లు సిపాయిల ముందు అలాంటి మాటలు మాట్లాడుకునే వారు కాదు. సైనికుల కోసం ప్రచురించే పత్రికల్లో చర్చిల్, రూజ్‌వెల్ట్‌ల అభిబాషణలు అప్పుడప్పుడూ అచ్చువుతుండేవి. ఏమైనా కానీ స్వాతంత్రం, ప్రజాతంత్రం అన్నమాట సైనికుల చెవిన పడకుండా జాగ్రత్త పడుతుండేవారు ఆంగ్లప్రభువులు. శిబిరంలోని రెజిమెంట్ కర్నల్ ఆంగ్ల ప్రభువుల గురించి హిందీలో సైనికులకు ఇలా చెప్తుండేవాడు. మనం బ్రిటిష్ ప్రభువు ఉప్పూ–పులుసూ తింటున్నాం. మన చక్రవర్తిగారే మనకు దేవుడు! దేవుడికి సేవచేస్తే లభించే ఫలితమే చక్రవర్తిగారికి సేవ చేసినా లభిస్తుంది. చక్రవర్తిగారు మనల్ని సొంత బిడ్డల్లా చూసుకుంటున్నారు. మనకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా వుండటానికి ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. హిందూస్తాన్ వీర సిపాయిల్ని మహారాణిగారు స్వయంగా వెళ్ళి కల్సుకుంటున్నారు. వారి సాహసానికి ప్రతిగా తమ చేతులతో వారి ఛాతీలపై పతకాల్ని ఇస్తున్నారు. హాస్పటళ్ళకు వెళ్ళి గాయపడిన వీరసైనికులకు కట్లు కట్టడానికి కూడా రాణిగారు వెనుకాడటం లేదు. చక్రవర్తికీ, రాణీగారికీ మనం విధేయులమై వుంటాము. మనకీ యుద్ధము ఒక లెక్కలోనిది కాదు. గతంలో ఇంతకంటే భయంకరమైన యుద్ధాల్ని ఎన్నో చూశాము.

ఇంగ్లీషు కర్నల్ ఉపన్యాసం హిందూస్థానీ సిపాయిల మీద ఎలాంటి ప్రభావాన్ని వేసిందో చెప్పలేము. తాము ఎవరి ఉప్పూ-పులుసూ తింటున్నారో వాళ్లకు తెలియదు. అయితే, వాళ్ళకు ఒకటి మాత్రం తెలుసు. తాము బతుకు దెరువుకు సైన్యంలో చేరామని సైన్యంలో చేరిన సైనికులందరూ చనిపోవటం నిశ్చయం అని తెలిస్తే, వాళ్ళు ఎన్నటికీ సైన్యంలో చేరరు. సైన్యంలో చేరిన అందరూ చనిపోరని వాళ్ళ విశ్వాసం. బతికి వుండే వాళ్ళల్లోనే ఎప్పుడూ తనను లెక్కవేసుకుంటూ వుంటారు. ప్రథమ మహాయుద్ధంలోకి వెళ్ళిబ్రతికి వచ్చిన సిపాయిలూ పెన్షన్ తీసుకుంటూ వుండటం వాళ్ళకు తెలుసు. తమ జీవితాల్నీ ఆ పెన్షనర్ల జీవితంతో పోల్చుకునే వారు సిపాయిలు. మొదటి ప్రపంచ యుద్ధానికీ, రెండవ ప్రపంచ యుద్ధానికీ ఎంతో తేడా వుంది. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు దేశంలో స్వాతంత్ర్యోద్యమాలు తీవ్రరూపాన్ని దాల్చలేదు. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు గాంధీగారి నాయకత్వంలో సహాయ నిరాకరణోద్యమమూ, సత్యాగ్రహాలూ ఉధృతమైనాయి. వెనుకటి రోజుల్లో భారతీయులు సుబేదారు, మేజరు వరకే వెళ్ళగలిగారు. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు స్థితి ఇలా లేదు. భారతీయులు లెఫ్టినంట్, కర్నల్ కూడా అవుతున్నారు. ఎంతచేసినా ఇంగ్లీషువారికి భారతీయుల మీద విశ్వాసం అంతంత మాత్రమే, భారతీయులకు రెజిమెంట్ కమాండింగ్ అధికారాన్ని ఇచ్చేవారు కాదు. భారతీయ ఆఫీసర్లకు భారతీయ సైనికులలో రాజభక్తిని ప్రచారం చేసే బాధ్యతను వప్పజెప్పారు. ఆఫీసర్లయిన వాళ్ళు భారతీయులే కానీ, ఆంగ్లేయులే కానీ సిపాయిల కంటే చాలా అధికులం అన్న భావంతో వుండేవారు. అయితే అటు హిట్లరూ, ఇటు జపాను విజయాలను సాధించటం చూశాక - భారతీయ ఆఫీసర్లు కళ్ళు మూసుకుని వుండటానికి వీలులేదు. ఒక పక్క దేశంలోని నాయకులందర్నీ జైళ్ళల్లో కుక్కారు. ఆగస్టు ఉద్యమంతో బ్రిటిష్ ప్రభుత్వానికి గంగ వెర్రులెత్తాయి. ప్రథమ ప్రపంచ యుద్ధకాలంలో పంజాబులో సాగించినలాంటి హింసాకాండను బలియా జిల్లాలోనూ, ఇతర ప్రదేశాలలోనూ సాగించాలని చూశారు. ఇవన్నీ భారతీయ ఆఫీసర్లు చూస్తున్నారు. ఆంగ్లేయుల దుష్ట ప్రవర్తనను వాళ్ళు గమనిస్తూనే వున్నారు. రాజభక్తిని ప్రచారం చేసేటప్పుడు ఉపన్యాసాల్లో ఏం చెప్పినప్పటికీ ఏకాంతంలో యదార్థాన్ని చెప్పేవారు.

మాస్టర్‌జీ కూడా తోటి ఉపాధ్యాయుల్లా, సిపాయిల్లా వ్యధపడుతున్నాడు. బర్మానుండి వేల సంఖ్యలో భారతీయులు పారిపోయి వస్తుండేవారు. వాళ్ళు మణిపురి మీదుగా సైనిక శిబిరాల గుండా వెళుతుండేవారు. ఎముకల పోగులలాంటి శరీరాల్ని ఈడ్చుకువెళ్తున్న ఆ భారతీయుల్ని చూశాక శిబిరాలలోని భారతీయ సైనికులకూ, ఉపాధ్యాయులకూ కంటికి

కునుకు పట్టలేదు. ఏ యుద్ధాన్ని తలుచుకుని తాము భయపడుతున్నారో? ఆ యుద్ధం తమమీదే విరుచుకుపడటానికి సిద్ధంగా వుందని తెల్సుకున్నారు. కలకత్తా మీద జపాన్ వాళ్ళు బాంబు వేశారని తెలిశాక ఇంక ఏ క్షణాల్లోన్నయినా బాంబులు తమ నెత్తిన కూడా పడవచ్చని నిశ్చయించుకున్నారు శిబిరంలోని సైనికులు!

## 4

మణిపూర్ యుద్ధ క్షేత్రంగా మారిపోయింది. ఇక పక్కన మాస్టర్‌గారి స్కూలు వుండవలసిన అవుసరం లేదు. మాస్టర్‌జీని తమ జిల్లాలోని సైనిక శిబిరానికి మార్చారు. అతను చాలా సంతోషపడ్డాడు. ఇంటి దగ్గర భోజనం చేసుకుని శిబిరానికి వెళ్ళి రాత్రికి ఇంటికి తిరిగి రావచ్చు. మాస్టర్‌జీ ఆర్థిక స్థితి కొంత మెరుగయింది. ఇలాగే మరికొంత కాలం యుద్ధం సాగితే బాగుండునని అనుకుంటున్నాడు. కానీ, ఎప్పుడో ఒకప్పుడు యుద్ధం ముగియక తప్పదు కదా? యుద్ధం ముగియడంతో పాటు రెండు మూడు సర్టిఫికెట్లు ఇచ్చి మాస్టర్‌జీని ఇంటికి పంపించివేశారు. ఆంగ్ల ప్రభుత్వానికి తను చేసిన సేవకు ప్రతిఫలంగా ఏదో గొప్ప లాభం చేకూరుతుందని అనుకున్నాడు అతను. కానీ, యుద్ధం ముగియడంతో పాటు ఆంగ్లప్రభువులు మూటా ముల్లె సర్దుకోసాగారు. తమకే ఠికానా లేకపోతే హితైషులకు ఏం మార్గం చూపగలరు? ఆంగ్ల ప్రభువులు తమ శ్రేయోభి లాషులకు ఏ మార్గమూ చూపలేకపోయారు. కొన్ని నెలలపాటు మాస్టర్‌జీ ఇంటిదగ్గర ఖాళీగా కూర్చున్నాడు. చివరకు మధుపురిలోని తన ఉద్యోగం తనకు వచ్చేసరికి తలప్రాణం తోకకు వచ్చింది. ఆంగ్లప్రభుత్వానికి చేసిన సేవకు ప్రతిగా కనీసం ప్రైమరీ స్కూలు హెడ్మాష్టర్నయినా అవుతాననుకున్నాడు. కానీ, నాలుగేళ్ళ పాటు తను చేసిన సేవలకు ప్రతిఫలంగా తిరిగి ఆ ఎలిమెంటరీ స్కూలు అసిస్టెంట్ హెడ్మాష్టరు ఉద్యోగమే లభించింది.

సైనిక ఉద్యోగంలో చేరినప్పుడు మాస్టర్‌జీకి పిల్లలు నలుగురు. తిరిగి మధుపురికి వచ్చాక మొదటి సంవత్సరం ఐదవ మగపిల్లాడు పుట్టాడు. ఆ మరుసటి సంవత్సరం ఆరవ పిల్లవాడు. ఈ రకంగా పిల్లలు వృద్ధయిన కొద్దీ కుటుంబంలో ఆర్థిక బాధలూ ఎక్కువవుతూనే వున్నాయి. ఇప్పుడుఆ దంపతులకు తొమ్మిది మంది సంతానం. ఆ సంఖ్య ఎంతవరకూ పోయి ఆగుతుందో ఇప్పుడిప్పుడే చెప్పలేం. జీతంతో అందరి పొట్టలు నిండటం లేదు. అర్థాకలితో వుందామన్నా ఉదయం సేరున్నర గోధుమ పిండి, సాయంత్రం రెండున్నర సేర్ల పిండి అవుసరం అవుతుంది. సరుకుల ధరలు చూస్తుంటే మాస్టర్‌జీకీ, వారి భార్యామణికి పై ప్రాణాలు పైనే పోతున్నాయి. ఇదే కాకుండా చదువదీ ఒక సమస్యే! ఫీజులు సగం

కట్టినా పుస్తకాలదీ సమస్యే! ఈ సంవత్సరం తొమ్మిదవ తరగతి చదువుతున్న పిల్లలు ఇద్దరూ తప్పారు. ఇప్పుడు వాళ్ళకు పూర్తి ఫీజు కట్టాలి. పెద్ద పిల్లవాడు మెట్రిక్ ప్యాస్ అయ్యాడు. కుటుంబ బరువును కొంత మోయవల్సిన బాధ్యత అతడి మీదా వుంది. చాలా ప్రయత్నించిన మీదట పోస్టు జవాను ఉద్యోగం దొరికింది. అదే సీజన్ వరకే వుండే ఉద్యోగం.

కరువు భత్యాన్ని కూడా కలుపుకుని మాస్టర్జీకి 65రూ॥ల జీతం ఇస్తున్నారు. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు వాటి విలువ రు.16 వుంటుంది. మాస్టర్‌జీ పుట్టక సమయంలో రు.65ల విలువ రు.4 వుంటుంది. పదకొండుమంది గల కుటుంబం ఈ జీతంతో ఎలా బ్రతకగలుగుతున్నారో, ఈ వాక్యాల్ని చదివి పాఠకులే చెప్పాలి. మాస్టర్‌జీ వయస్సు ఇప్పుడు 44 సం॥రాలే. అయినా 60 ఏళ్ళ వాడిలా కనపడుతున్నాడు. ఆయన కండ్లు ఎప్పుడూ దేన్నో చూస్తుంటాయి. ముఖం మలేరియారోగి ముఖంలా వుంటుంది. ఎక్కడయినా కనపడితే నవ్వటానికి ప్రయత్నిస్తూ నమస్కరిస్తాడు. కుటుంబ బాధ్యతను ఎక్కువ శాతం వారి భార్య భరిస్తున్నది. తొమ్మిదిమంది బిడ్డలు వుండి, ఇన్ని బాధలు భరిస్తున్నప్పటికీ ఎప్పుడూ సహజమైన చిరునవ్వుతో వుంటుంది. హాయిగా నవ్వగలదు కనుకనే ఆమె సౌందర్యం మీద ఈతిబాధలు ఎలాంటి ప్రభావాన్నీ వేయలేకపోయాయి. కానీ, దరిద్రమనే మహాగ్ని గోళం హృదయంలో మండుతూంటే, ఆమె అంత హాయిగా ఎలా నవ్వగలుగుతుందో?

# చంపో

**ఆ**ధునిక నగరాలలో కానీయండి లేక పురాతన పట్నాలలో కానీయండీ వీధుల్ని ఊడ్చటం, మలమూత్రాదులు శుభ్రం చేయటం లాంటి హేయమైన పనులు చేయటానికి కొంతమంది మనుషులు అవసరం అవుతారు. తల్లి కూడా తన పిల్లల మలమూత్రాలను శుభ్రం చేస్తుంది. అయితే, తల్లిని అంటరాని మనిషిగా భావించం. ప్రతిదేశంలోనూ పట్నాలు (నగరాలు) వుంటాయి. ప్రతి పట్టణంలోనూ, కొన్నివేల కుటుంబాలు వుంటాయి. శుభ్రతను పాటించే దేశాలు తమ పట్టణాలనే కాకుండా, పల్లెల్ని కూడా చాలా శుభ్రంగా వుంచుకుంటాయి. భారతీయులు, శుచిశుభ్రతల్లో ప్రపంచంలోనే తాము అద్వితీయులమని భావిస్తూ వుంటారు. కానీ భారతదేశంలోని పల్లెలు ఎంత అశుభ్రంగా వుంటాయో చెప్పలేను. ప్రపంచంలోని మరి ఏ దేశమేకానీ, ఎంత వెనుకబడ్డ దేశమో కానీ తన గ్రామాల్ని ఇంత అసహ్యంగా, ఇంత అశుభ్రంగా వుంచుకోదు. ఒకరకంగా భారతీయులు అశుభ్రతకు చక్కని ఉదాహరణగా పనికి వస్తారు. వ్యక్తిగత శుభ్రతకు అత్యధికమైన ప్రాధాన్యతనిచ్చి, సామూహిక శుభ్రతను, సామాజిక శుభ్రతను అతి నిర్లక్ష్యంగా చూసే జాతి ప్రపంచంలో మరొకటి లేదు! భారతజాతి ఒక్కటే ఇలా చేస్తుంది. ఈ దేశంలో, గ్రామం పక్కన వున్న ఖాళీ బయలు ప్రదేశాల్ని మలమూత్రాదుల్ని విసర్జించటానికి నిరభ్యంతరంగా వాడేస్తుంటారు. లక్షల సంఖ్యలో మానవులు నివసిస్తూ వుండే నగరాలలోనూ ఇలాగే చేస్తే అంటురోగాల్ని ఆహ్వానించటమే అవుతుంది. కాబట్టే నగరాలలో పాయిఖానాల ఏర్పాట్లున్నాయి కొంతవరకూ! నన్నడిగితే, ఈనాటికంటే రెండు వేల సంవత్సరాల క్రితం భారతదేశంలో శుభ్రతకు సంబంధించిన నియమాలను చాలా ఎక్కువగా పాటించే వారనుకుంటాను. ఆనాడు మన నగరాలుకానీ, పట్నాలుకానీ ఇంత అశుభ్రంగా వుండేవి కావు. ప్రపంచంలోని ఇతర దేశాలలో శుభ్రతకు సంబంధించిన వృత్తుల్ని అవలంభించే వారిని నీచంగా చూడటం గానీ, అసహ్యించుకోవటం కానీ చేయరు. అయితే, ఇతర దేశాల్లోనూ ఇలాంటి వృత్తుల్ని చేసేవారికి జీతం కొద్దిగానే ఇచ్చినా, కానీ శుభ్రం చేశాక

అనువాదం : **కవిని ఆలూరి**

చేతులు కడిగేసుకుంటాడు. అవసరం అనుకుంటే బట్టలు మార్చుకుంటాడు. ఇంక అతనితో కలిసి భోజనం చేయటానికి ఎవరికీ అభ్యంతరం వుండదు. మనదేశంలో శుభ్రతకు సంబంధించిన పనులు చేసేవారిని హీనులుగా చూడటం పరిపాటి అయింది.

నూటపాతిక సంవత్సరాల క్రితం ఉన్నత వర్గాల వారి విలాసాల కోసం మధుపురి నిర్మాణం జరిగింది. అక్కడ పాయిఖానాలు శుభ్రం చేసే 'పాకీ'వారు అవసరం అయ్యారు. చుట్టూ అడవులూ, అక్కడక్కడా బంగళాలు. ఆ బంగళాల్లో నివసించే వారు భారతీయులే అయితే చుట్టూ వున్న అడవుల్ని పాకీదొడ్లగా వాడేసుకునేవారు. కానీ ఇంగ్లీషు వారికి అలాంటి అభ్యాసం లేదు. ఇంగ్లీషువారికి ఇళ్ళల్లో 'పాయిఖానా' వుండటమన్నది చాలా ముఖ్యమైన విషయంగా భావిస్తారు. అదేదూరం ఎక్కడో వుంటే లాభం లేదు. బంగళా లోపలే స్నానాల గదికి పక్కనే వుండాలి. అంటే ఎప్పుడూ శుభ్రంగా వుంచుకోవాలి. లేకపోతే దుర్గంధాన్ని భరించలేరు. చలిదేశాల్లో ఇంట్లోనే పాయిఖానాలు వుండటం చాలా అవసరం. మంచుపడేటప్పుడు దూరంగా వున్న పాయిఖానాలకు వెళ్లటం వల్ల నిమోనియా వచ్చే ప్రమాదం వుంటుంది. నిద్రలేవగానే బయటకు వెళ్ళకుండా అన్ని పనులూ ఇంట్లోనే జరిగిపోవాలి. మధుపురికి ఇతర పనిపాటలు చేసుకునే వారు ఎలాగు వచ్చారో? అలాగే పాకీ పనిచేసేవారూ వచ్చారు. క్రింది నగరాలలో పాకీవాళ్ళకు నెలకు 5 రూపాయల జీతం ఇస్తే చాలా ఎక్కువ. మధుపురిలో అయితే 12 నుండి 15 రూ॥ల వరకూ ఒక్కొక్కరికీ జీతం ఇస్తున్నారు. ఆదాయం అధికంగా వున్నచోటికి మనుషులు ప్రవాసం రావటం సహజమే. మధుపురిలో ఒక్కోపనిని ఒక్కో జిల్లావాళ్ళు చేస్తుండేవాళ్ళు. పాకీ పనిని ఎక్కువగా బిజనౌర్ జిల్లా వాళ్ళు చేస్తుంటారు. ఈపనిని చేసేవారిని మొదట్లో ఏ పేరుతో పిలిచేవారో తెలియదు. ఇప్పుడు మాత్రం మధుపురిలో వారిని 'జమాదార్' అని పిలుస్తున్నారు. కొత్తగా ఈపేరు విన్నప్పుడు మనసు బాధపడుతుంది. బిజనౌర్ జిల్లాలోని వీరు ఒక్క మధుపురిలోనే కాదు, కేదార్‌నాథ్–బదరీనాథ్ మొదలైన చోట్ల కూడా పాకీ పని చేస్తున్నారు.

పందొమ్మిదవ శతాబ్దపు పూర్వార్థంలో విలాసనగరాలు ఈనాడు వున్నంత సుఖకరంగా లేవు. ఇండ్లల్లో నీటిపంపులు వుండేవి కావు. పని మనుషులు స్నానానికీ త్రాగటానికే నీళ్ళు తెచ్చి పోస్తుండేవారు. రోడ్లమీద కరెంటు దీపాల మాట ఏమో కానీ మామూలు దీపాలు కూడా వుండేవి కావు. మధుపురిలో మొదటగా కిరసనాయిలు వీధి దీపాలను పెట్టారు. తరువాత వాటి అభివృద్ధి కరమైన రూపం కరెంటు దీపాలయ్యాయి. కరెంటు సాయంతో నీటిని ట్యాంకుల్లో భద్రపరచి బంగళాల్లోని పంపులకు పంపిస్తుండేవారు. బంగళాల్లోనూ, వీధుల్లోనూ ఎక్కడ చూసినా కరెంటు దీపాలు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి ఇప్పుడు. కాలింపోంగ్ లాంటి విలాసనగరాల్లోని కొన్ని ప్రాంతాల్లో

'ఫ్లష్' లేకుండా బంగళా కట్టటానికి వీలే వుండదు. కానీ మధుపురిలో అదంతా ఏమీ లేదు. ఇక్కడ జమాదార్లకు ఫ్లష్ లేకపోయినా ఫర్వాలేదు.

దొరలు భారతదేశానికి వచ్చాక హిందువులూ- ముస్లిములూ ఉభయులూ జమాదార్లను చిన్నచూపు చూస్తారనీ, వాళ్ళను తాకడానికి కూడా ఇష్టపడరనీ తెల్సుకున్నారు. ఇంగ్లీషు వాళ్ళు వచ్చిన కొత్తల్లో ఉన్నత వర్గాలకు చెందిన హిందువుల ఆచార వ్యవహారాల్ని అనుకరించ చూశారు. తమ దేశాన్నుండి క్రొత్తగా వచ్చిన దొరలకు అలా అనుకరించమని సలహా యిచ్చారు. ఉన్నత వర్గాల వారి దృష్టిలో గౌరవాన్ని పొందాలనే అనుకునేవారు. కొంతమంది దొరలయితే బ్రాహ్మణ వంటవాణ్ణి కూడా పెట్టుకున్నారు. వంటగదిలో పీటల మీద కూర్చొని భోజనం చేయటమూ ప్రారంభించారు. కానీ ఎక్కువ రోజులు అలా నడవలేదు. ఇంగ్లీషువారి సంస్కృతి భారతీయుల సంస్కృతి కంటే చాలా వున్నత స్థితిలో వుంది. అందుకు కారణం ఆధునిక విజ్ఞానము, నూతన పరిశోధనలూ, ఆయుధాలూ అన్నీ ఆంగ్లేయుల చేతుల్లో వున్నాయి. వారు వాటిల్లో చాలా ముందుకు వెళ్ళారు. త్వరలోనే వారు 'భారతీయులను మనం అనుకరించవలసిన అవసరం లేదు. మనల్నే భారతీయులు అనుకరిస్తారు అని తెల్సుకున్నారు. ఆలస్యం అయితే యేం? పశ్చిమ దేశాల ఆచారాల నెన్నింటినో భారతీయులు స్వీకరించారు. ఇప్పటికీ స్వీకరించని వాళ్ళెవరైనా వున్నారంటే అది డబ్బూ-చదువూ లేకపోవడం వల్లనే! ఆ రెండూ సమకూడిన క్షణాన వాళ్ళూ దీక్షా పరతంత్రులవుతారు. ఈ దేశానికి ముందుగా ఇంగ్లీషు ఆఫీసరులూ, వ్యాపారస్తులూ వచ్చారు. వాళ్ళకంటే ముందు ఫాదరీలు వచ్చారు. ఆ ఫాదరీలందరూ క్రీస్తుమతాన్ని ప్రచారం చేయడానికే వచ్చారు. శాసకులైన వారి మతాన్ని ప్రచారం చేయటానికి వచ్చారు గనుక వారికి ఆర్థికంగానూ, ఇతర రూపాలలోనూ అనేక సౌకర్యాలు లభించాయి. హిందూ మతమనే మహాదుర్గాన్ని పడగొట్టటానికి ఫాదరీలు తమ మత ప్రచారం అనే ఫిరంగుల్ని పేల్చారు! అయితే ఈ దుర్గం వారి ఫిరంగులకు పేలిపోయే దుర్గం కాదు. రాజకీయంగా ఇంగ్లీషు వారికి భారతీయులు తలవంచినా మతపరంగా అజేయులుగానే వుండిపోయారు. ఎవరైనా మతం మార్చుకుంటే తన బంధుమిత్రులందరినీ విడిచిపెట్టవలసి వచ్చేది. క్రిస్టియను మతాన్ని స్వీకరించినవారు తల్లిదండ్రులకూ, అన్నదమ్ములకూ, అక్కచెల్లెళ్ళకూ దూరం కావాల్సి వచ్చేది. అలాంటి ఆత్మీయుల ప్రేమకూ వాత్సల్యానికీ దూరం కావటమే కాకుండా వారినుంచీ లభించగల ఒనరులకూ దూరం అయ్యేవాడు. అయితే మొత్తం కులమంతా మతం మార్చుకుంటే ఈ సమస్య వుండదు. ఈ దేశంలోకి ముస్లిములు వచ్చిన రోజుల్లో అలాగే జరిగింది. బట్టలు నేసే వారందరూ మూకుమ్మడిగా ముస్లిం మతంలోకి చేరారు! కానీ క్రిస్టియన్ మతానికి అలాంటి సఫలత లభించలేదు ఈ దేశంలో!

ఇంక అస్పృశ్యులను తమవైపు లాక్కోవటానికి ప్రయత్నించసాగారు. 'మేము మానవులం దరినీ సమానంగా చూస్తాం! ఎవరినీ అంటరానివారిగా చూడం అని చెప్పటం మొదలు పెట్టారు. నిజంగా కూడా తమ ఇండ్లల్లో పనిచేసే జమాదార్లు వండిపెట్టినా నిరభ్యంతరంగా తినేవారు ఫాదరీలు. అయితే, ఇతర ఇంగ్లీషు దొరలు ఫాదరీలంత ముందుకు రాకపోయినా కొంతవరకూ అంటూ - సొంటూను పాటించేవారు కాదు. ఈనాటికీ చాలామంది ఇంగ్లీషువారి బంగళాల్లోనూ, ఆంగ్లోఇండియన్ల బంగళాల్లోనూ జమాదార్లూ వాళ్ళ భార్యలూ వంటవాళ్లుగా పనిచేస్తున్నారు. దాదాపుగా అర్ధశతాబ్దం నుండి మన నాయకులు అంటరాని తనం పోవాలంటున్నారు. అంటరానితనం మన సమాజానికి కుష్టులాంటిదంటున్నారు. అయినా, ఇంతవరకూ అంటరానితనం పోలేదు. ఈ రకంగా అయితే, మన సమాజం నుండి అంటరాని తనాన్ని పోగొట్టటానికి శతాబ్దాలు పడుతుంది. ఈ దేశం నుండి త్వరగా అంటరానితనం పోవాలంటే, అందుకు అంటరాని జాతులుగా పరిగణింపబడే వారే నడుం కట్టాలి!

## 2

చంపో జమాదార్ కూతురు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక పుట్టింది. ఆమె తండ్రి సెంట్రల్ బజారుకు దగ్గరలోని ఒక బంగళాకు కాపలాదారుగా వుంటున్నాడు. ఒక శతాబ్దంలోపు ఆ బంగళా ఎందరి చేతుల్లోకో మారింది. అయినా జమాదార్ కుటుంబం మాత్రం ఆ బంగళాను వదల్లేదు. ప్రస్తుతం వున్న జమాదారు ముత్తాత కూడా బంగళాకు కాపలాదారుగా వున్నాడు. చంపో ముత్తల్లి అక్కడకు మొదటగా వచ్చినప్పుడు ఆ బంగళా యజమాని ఒక ఇంగ్లీషు దొర. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు అతడా బంగళా యజమాని. ప్రతి బంగళాకూ ఔటుహౌస్ వుంటుంది. బంగళా సెంటరుకు దూరంగా వుండి చుట్టూ ఖాళీస్థలం, మెల్లా వుంటే ఔట్‌హౌస్‌ల్ని బంగళాకు దూరంగానూ కడుతూ వుంటారు. చాలా సంవత్సరాలుగా ఖాళీగా వున్న కారణంగా చాలామటుకు ఔట్‌హౌసులు మరమ్మతులు లేక పడిపోతున్నాయి. కానీ చంపోవాళ్ళు వుంటున్న ఔట్‌హౌస్ బాగానే వున్నది. వాళ్ళు వుంటున్న ఔట్‌హౌస్ తాలూకు బంగళా సెంటరుకు దగ్గరలోనే వున్నది. అందువల్ల అద్దెలకు వస్తూనే వుంటారు. గతంలో ఈ ఔట్‌హౌస్ గదుల్ని నౌకర్లకు ఇస్తుండేవారు. ఇప్పుడు చంపోవాళ్ళు వుంటున్న ఒక గది మినహా మిగిలిన వాటిల్లో ఒక దాంట్లో పిండిమర పెట్టారు. మరోదాంట్లో చిల్లరదుకాణం వుంది. ఇంకా కొన్నింటిలో వున్నత కులాలకు చెందినవారే అద్దెకు వుంటున్నారు. సాధారణంగా అయితే జమాదార్

వున్న గదికి పక్కగదుల్లో ఉన్నత కులాలకు చెందిన వారెవరూ అద్దెకు వుండటానికి ఒప్పుకోరు. ఆ గది జమాదారుకు పిత్రార్జితంగా అయిపోయింది! అతణ్ణి లేచివెళ్ళమని ఎవరు అనగలరు?

అంటరానితనాన్ని చిన్న పిల్లలు తొందరగా అర్థం చేసుకోవటం కష్టం. తమ కులంగానీ, కాకపోనీ, అంటతగినవారుకానీ, అంటరాని వారుకానీ నలుగురు పిల్లలు ఒకచోట వున్నారంటే, తప్పకుండా కలిసే వుంటారు. వాళ్ళు పెద్దవాళ్ళయి స్వయంగా అంటరానితనాన్ని తెల్సుకునే వరకూ కొట్టినా, తిట్టినా కూడా కల్సి ఆడుకోవటాన్ని మానరు! చంపోవాళ్ళు వుంటున్న బంగళా యజమానికి చంపో వయస్సు కూతురు వుంది. ఇద్దరూ కల్సి ఆడుకుంటూ వుండేవారు. ఆ అమ్మాయికి తల్లి ఏదైనా తినటానికి పెడితే తప్పకుండా తెచ్చి చంపోకి పెట్టేది. ఒకరోజున ఇద్దరు పిల్లలు స్వీటుముక్కను కాకి ఎంగిలి చేసుకు తింటున్నారు. యజమానిభార్య చూసింది. ఆమె మనస్సు బాధపడింది. ఆమె బాగా చదువుకున్నది. ఆధునిక భావాలు గల మనిషి. అంటూ–సొంటూ పాటించే తత్వం కూడా కాదు. చంపో తల్లి చేత ఇంటిపనులన్నీ చేయించుకునేది. సాధారణంగా శ్రోత్రీయులు అస్పృశ్యులు తాకిన వస్తువులను కూడా అంటరానివిగా భావిస్తూ వుంటారు. అలాంటి అభిప్రాయాలు ఏవీ యజమాని భార్యకు లేవు. జమాదారు కులవృత్తిని మానితే వాళ్ళ చేతి అన్నం తినటానికి కూడా ఆమెకు అభ్యంతరం లేదు. ఇంత అభ్యుదయకరమైన భావాలు కలిగివున్నా ఇద్దరు పిల్లలూ ఒకరి ఎంగిలి ఒకరు తినటం చూసేసరికి ఆమె మనస్సు బాధపడ్డది.

చంపోకు ఐదేళ్ళ వయస్సు వుంటుంది. స్నేహితురాలికీ అదే వయస్సు. ఆ అమ్మాయికి తన కులానికి సహజమైన ఏ సంస్కారమూ ఇంతవరకూ అంటలేదు. ఇద్దరు పిల్లలు కలిసి బొమ్మల పెళ్ళిళ్ళు చేస్తుండేవారు. కలిసి ఆడుకునేవారు. యజమాని కూతురు చంపోను తమ బంగళాలోకి తీసుకువెళ్ళేది. ఇద్దరూ సోఫామీద ఆడుకునేవారు. అలాంటప్పుడు పెద్దవాళ్ళ మనస్సు బాధపడేది. అయితే కోపంగా వున్నప్పుడు యజమాని కూతురు చంపోకు వార్నింగ్ ఇచ్చేది!. 'చంపో వెళ్ళిపో! ఇంక నేను నీతో ఆడుకోను' అనేది.

ఆదాయం తక్కువగా వచ్చే వాళ్ళు ఆదాయాన్ని పెంచే కొత్త కొత్త మార్గాలకోసం ప్రయత్నిస్తూ వుంటారు. చంపోతల్లి నాలుగు కోళ్ళను పెంచింది. కొన్ని రోజులు అయ్యేసరికి వాటికి పిల్లలు తయారయ్యాయి. చంపో కొంచెం పెద్దదయింది. ఒక మేకను కొన్నాడు తండ్రి. అది రెండు పిల్లల్ని పెట్టింది. మేక ఉత్తమ జాతికి చెందినది కాకపోయినా పోతు

మంచిది కావటం వలన పిల్లలు మంచివి పుట్టాయి. పెద్ద పెద్ద చెవులతో చూడటానికి అందంగా వుండేవి! బంగళా చుట్టూ ఖాళీ ప్రదేశం అంతగా లేదు. ఒకవైపున నిట్టనిలువుగా వున్న కొండ కావటం వలన కూరగాయల పాదులు పెట్టుకోటానికీ వీలుండదు. తీగలు పారించుకోటానికీ వీలుండదు. ఆ ప్రదేశంలోనే చంపో తన మేకపిల్లల్ని మేపుకుంటూ వుంటుంది. చంపో స్నేహితురాలి కోపం ఎక్కువ రోజులు వుండేది కాదు. కొద్దిరోజుల తరువాత మేకల్ని మేపుతున్న చంపో దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చేది. ఆ మేకపిల్లల్ని చేతుల్లోకి తీసుకుని ఇద్దరూ ఆడుకుంటూ వుండేవాళ్ళు. వర్షాకాలంలో గడ్డిపెరిగి వుండేది. ఇద్దరూ ఆ గడ్డిని పీకి మేకపిల్లలను మేపుతుండేవారు. ఆ మేకపిల్లలు తమవనీ ఇంకొకరికీ ఇవ్వకూడదని చంపోకి తెలియదు. తన స్నేహితురాలితో ఇలా అనేది 'ఒక మేక నాది ఒక మేక నీది' స్నేహితురాలు సంతోషంతో ఎగురుతూ 'నీ మేక రెండు పిల్లల్ని పెడుతుంది. నా మేక రెండు పిల్లల్ని పెడుతుంది!' అని అనేది. ప్రక్కనే వుండి వింటున్న జమాదారు ఒకతను ముప్ఫై రూపాయలు పెట్టి మేకను కొన్నాడు. ఊరకే నీకు మేకను ఇస్తారా? అనేవాడు. స్నేహితురాలు మూతి ముడుచుకుని 'మా అమ్మ దగ్గర చాలా రూపాయలు వున్నాయి!' అనేది. చంపో స్నేహితురాల్ని సమర్థించేది. 'అవును అమ్మగారి దగ్గర చాలా రూపాయలు వున్నాయి' అనేది.

తరువాత ఇద్దరు స్నేహితురాళ్ళూ చేతుల్తో చూపిస్తూ, ఎగురుతూ 'ఇన్ని రూపాయలు వున్నాయి?' అనేవారు. ఇద్దరు పిల్లలు ఒకటయ్యాక అతను మౌనాన్ని వహించాడు. తమ విజయానికి ఆనందంతో పరవశించిపోతూ ఇద్దరు పిల్లలూ పకపక నవ్వేవారు. పర్వత ప్రదేశాల్లో సహజంగానే భూమి ఎగుడు దిగుడుగా వుంటుంది. ఈ బంగళాల దగ్గర మరీ ఎక్కువ. నిట్ట నిలువుగా వున్న కొండ! పెద్ద పెద్ద రాళ్లూ! చిన్నపిల్లలు వీటిమీద ఎక్కి పడిపోవటమూ జరుగుతూ వుంటుంది. ఇద్దరు పిల్లలూ ఎన్నిసార్లు కిందపడ్డారు. కానీ వాళ్ళ అదృష్టం కొద్దీ వాళ్ళ ఎముకలు విరగలేదు. ఒకమాటు ఒక ఎత్తైన కొండరాయి మీదకు మేకపిల్ల ఎక్కి వెళ్ళింది. ఇద్దరు స్నేహితురాళ్ళకు ఓ వింత చేయాలనిపించింది. మేకపిల్ల క్రిందికి దిగటానికి వీలేలేకుండా దారికి అడ్డంగా నిలబడ్డారు. మేకపిల్ల ఏం చేస్తుందో చూస్తున్నారు? మేకపిల్ల అతవలి వైపుకు దూకింది. పది పదిహేను గజాల ఎత్తు నుండి దూకటం వలన దాని కాలు విరిగిపోయింది. చంపో అలాంటి ఆటలు ఆడితే తల్లీ – తండ్రీ ఎలా సహిస్తారు? ఇంకా నాలుగు నెలలు తరువాత రెండు మేకపిల్లలూ పెద్దవవుతాయి. ఒక్కోదాన్ని నలభై – నలభై ఐదు రూపాయలకు అమ్ముకోవచ్చు అనుకున్నారు తల్లిదండ్రులు. కూతురు కాలు విరగ్గొట్టటం వలన కోపం వచ్చి చంపోని

చావకొట్టాడు జమాదారు. మేకపిల్లకు కాలు విరిగినట్టుగా కూతురి ఎముకలు ఎక్కడ విరుగుతాయోనని భయపడింది తల్లి. ఆమె పరుగెత్తుకుంటూ వెళ్ళి కూతుర్ని ఒడిలోకి తీసుకుంది. జమాదారు ఒళ్ళు తెలియని కోపంతో వున్నాడేమో? భార్యనూ నాలుగు దెబ్బలు వేశాడు. నోటికి వచ్చినట్టు తిడుతూ 'నువ్వే దీన్నిట్టా పాడుచేశావు!' అన్నాడు.

జమాదారుకు కోపం తగ్గటానికి కొన్ని గంటలు పట్టింది. అప్పుడు భార్య అతడితో ఇలా అంది. 'గొప్పోరి బిడ్డల్తో సావాసం చేస్తే, మన బిడ్డలుఇలాగే సెడిపోతారు!'

కూతురు ఎప్పుడైనా విలువైన బిస్కెట్లు తినటానికి మారాం చేసినప్పుడు, చంపో తినే తక్కువ వస్తువుల్ని తింటానని గోల చేసినప్పుడు, యజమాని భార్య కూడా మన పిల్లలు అలగా జాతి పిల్లలతో స్నేహం చేస్తే ఇలాగే చెడిపోతారని' అనేది.

## 3

చంపో తల్లిదండ్రులకు మొదటి సంతానం. ప్రత్యేకించి ఇలాంటి కుటుంబాలలో పిల్లలకు ఏ బాలగ్రహాలు సోకాయోనని చాలా భయపడుతూ వుంటారు. పసిపిల్లల చుట్టూ భూత–ప్రేతాలు తిరుగుతుంటాయని తల్లిదండ్రుల అభిప్రాయం. తాయెత్తులను మాలగా కట్టి మెడలో వేసింది చంపో తల్లి. భూత వైద్యుల్ని బతిమిలాడి కూతురికోసం శాంతి పూజలు చేయించింది. ఒకసారి చంపోకు కొంచెంగా జ్వరం వచ్చింది. తల్లి భూతవైద్యుని దగ్గరకు పరుగెత్తింది. అతను కొద్దిసేపు ధ్యానించి 'పోలేరమ్మకు కోపం వచ్చింది. పూజ చేయించాలి. ఒక మేకను ఇస్తానని మొక్కుకో! అని చెప్పాడు. తల్లి అలాగే మొక్కుకుంది. గతంలోలా ఇప్పుడు నాలుగైదు రూపాయలకు మేకలు దొరకటం లేదు. మధుపురిలో నేడు మాంసం రెండున్నరకు అమ్ముతున్నారు. మేకపిల్లల మాంసం ఇంకా ఎక్కువ ఖరీదు! మేకను కొనేటప్పుడు జమాదారు మనసులో ఒక ఉద్దేశ్యం వుంది. మేక పెట్టే పిల్లల్లో ఒకదాన్ని పోలేరమ్మకు బలి ఇచ్చి రుణం తీర్చుకోవచ్చుననుకున్నారు. పోలేరమ్మ మొక్కుబడి విషయం జ్ఞాపకం చేస్తూ నీకు డబ్బు మీద ఆశ ఎక్కువయింది. మేకపిల్లలను అమ్ముకుని డబ్బు చేసుకోవాలనుకున్నావు. పోలేరమ్మకు కోపం వచ్చింది. మేకపిల్ల కాలు విరిగింది. అన్నది చంపో తల్లి జమాదారుతో.

కాలు విరిగిన మేకపిల్లను పోలేరమ్మకు బలి ఇచ్చారు. పోలేరమ్మకు గుడిలేదు. కనీసం అరుగయినాలేదు. అసలు విగ్రహమే లేదు. రాతినో, చెట్టునో పోలేరమ్మ అనటమూ లేదు. ఆమె ఊరిమీద పడి తిరుగుతూ వుంటుంది. అలా తిరిగితే తిన్న అన్నం అరగదు. పిల్లలంటే చాలా ఇష్టం. సంతోషంగా వుంచితే ఏ భూత ప్రేతాలనూ దగ్గరకు రానీయదు.

కోపం గనుక వచ్చిందా? క్షణాలమీద ఆడుతూ పాడుతూ వున్న పిల్లల్ని ఎత్తుకు వెళ్ళిపోతుంది. పోలేరమ్మకు తమ ఇంటి వెనుక వైపునే మేకపిల్లను బలి ఇచ్చారు. మధుపురిలో పశువులను ఎక్కడ బడితే అక్కడ వధించటానికి వీలులేదు. పశువులను వధించటానికి ప్రత్యేకమైన గృహాలను నిర్మించారు మున్సిపాలిటీ! అయితే, చంపో తల్లి దండ్రులకు అదంతా అనవసరం. తమ భక్తిశ్రద్ధలకూ, శాసనానికీ సంబంధం లేదని వాళ్ళ ఉద్దేశం. చంపో తల్లిదండ్రులు హిందువులు. వీళ్ళేకాదు మధుపురిలోని జమాదార్లం దరూ హిందువులే! మధుపురిలో జమాదార్లందరూ (పాకీ) సంఘంగా వుంటారు. అందరూ కట్టుదిట్టంగా వుంటారు. ఎవరూ కులాచారాన్ని దాటి పోరు. వాళ్ళల్లో సారా తాగే అలవాటు బాగా వుంటుంది. మాంసం తినే అలవాటూ ఎక్కువే. వాళ్ళకు పందిమాంసం అంటే ఇష్టం. అందుకు కారణం పందిమాంసం బాగా చౌకగా లభించటమే! కులాచారాన్ని కాదంటే మొత్తం కులం అంతటికీ మాంసంతో విందు చేయాల్సి వుంటుంది. అలాంటి విందులు నెలకు ఒకటి రెండు వుంటూనే వుంటాయి. కులం మొత్తం ఒకటిగ వుండటానికి కట్టుబాట్లూ వుండటం అవసరం.

చంపో తల్లి మేకపిల్లను బలి ఇచ్చింది. ఆ మాంసంలో కొంత ప్రసాదంగా యజమానురాలికి ఇచ్చింది. వెనుకటి ఆచారాలూ, రీతులూ త్వరితగతిన శిథిలమవు తున్నాయి. అందుకు ఉదాహరణగా బంగళా యజమానురాలిని చెప్పుకోవచ్చు. వాళ్ళ కుటుంబం మాంసాన్ని వర్జించి ఎన్నాళ్ళయిందో? కొన్ని తరాలుగా వాళ్ళు మాంసం అన్నమాటే లేదు కానీ ఇప్పుడు మాంసం లేకపోతే క్షణం గడవదు. ఇక ఆమెకు ప్రసాదాన్ని తీసుకోవటానికి అభ్యంతరం ఏముంటుంది? ఒకవేళ చంపోతల్లి ఆ మాంసాన్ని వండి ఇచ్చినా శుభ్రంగా వుంటే తప్పకుండా తీసుకునేదే. ఆ 'శుభ్రంగా వుండటం' అనేదే కొంచెం కష్టమైన విషయం. మధుపురిలోని జమాదార్లందరూ ఏపూట సంపాదన ఆ పూటే తినేస్తారు. జీతానికి సరిపడా అప్పు ముందే చేస్తారు. బట్టలు కూడా కొనుక్కోలేని స్థితిలో వుంటారు. ఇంటి యజమానురాలు తన పాత చీరల్ని చంపో తల్లికి ఇస్తూ వుంటుంది. కూతురి పాతబట్టల్ని చంపోకి ఇస్తుంది. బట్టలనయితే ఆమె ఇచ్చింది కానీ వాటి శుభ్రపరచటానికి సబ్బు, సర్ఫుల కయ్యే ఖర్చు ఆమె ఇవ్వదు కదా? మాసిపోయి మురికి పట్టివున్న ఆ చీరల్ని కట్టుకు తిరుగుతూ వుంటుంది చంపోతల్లి.

చంపో తన కులంలోని ఇతర బాలికలకంటే చాలా అదృష్టవంతురాలు. ఇతర బంగళా యజమానులకు లాగా తమ బంగళా యజమానురాలికి అంటు లాంటి పట్టింపు లేమీ లేవు. కనుక, చిన్నతనం నుండీ చంపో తన యజమానురాలి కూతురితో కలిసి

ఎక్కడికయినా వెళ్ళి ఆడుకునేది! ఎప్పుడయినా, ఏ కారణం చేతనయినా యజమానురాలికి బాధ అనిపించినా చంపోను కోప్పడేది కాదు. కసురుకునేదీ కాదు. తన కూతురికి ప్లేటులో అన్నం పెడితే, చంపోకి పాత న్యూస్‌పేపర్ మీద పెట్టి ఇచ్చేది. యజమానురాలి కూతురు ప్లేటును టేబులు మీద పెట్టుకుని తింటుంటే, చంపో ఆ అమ్మాయి కాళ్లదగ్గర కూర్చొని తినేది. కూర్చునే ప్రదేశాల్లో వ్యత్యాసం కనబరచినా, తినే పదార్థాలు పెట్టటంలో ఏ మాత్రం పక్షపాతాన్ని చూపేది కాదు. చంపోని తన స్నేహితురాలితో పాటుగా తినటానికి అన్ని పదార్థాలూ లభిస్తున్నప్పుడు ఎక్కడ కూర్చుని తింటే మాత్రమేం? తనను అలా ఇంట్లోకి పిలిచి పెడుతున్నందుకు యజమానురాలి పట్ల కృతజ్ఞత చూపాలని చంపో అనుకునేది కాదు. 'తాను జమాదార్ కూతురునని తను ముట్టుకున్నవి ఎవరూ ముట్టుకోరనే విషయం చంపోకు తెలియదు. అలాంటప్పుడు కృతజ్ఞత చూపటం అన్న సమస్య వుండదు కదా? పక్కగదుల్లో వున్న వాళ్ళకు అంటు పట్టింపు చాలా ఎక్కువ. అయితే తమకంటే అధికురాలయిన యజమానే జమాదార్ కుటుంబాన్ని ఇంట్లోకి రానిస్తున్నప్పుడుతాము ఎలా వద్దనగలరు?

మధుపురిలో ఇప్పుడు ప్రాథమిక విద్య అనివార్యము. అయితే ప్రతి ఒక్క తల్లీదండ్రీ దీనిని విధిగా పాటించేటట్లు ప్రయత్నం చేయటం జరగని పని. పెద్ద మనుషులు కొందరు తల్లిదండ్రులకు అవుసరం అనుకుంటే మాత్రమే వాళ్ళు తమ పిల్లల్ని స్కూలుకు పంపుతారు అని అనుకుంటున్నారు. చంపోకు స్కూలుకు వెళ్ళవలసిన అవుసరం ఏమాత్రం లేదు. నాలుగేళ్ళు పోతే ఎవరో ఒక కుర్రవాడికి ఇచ్చి వివాహం చేస్తే చంపో కూడా ఒక జమాదార్ ఇంటికి కోడలుగా వెళుతుంది. అత్తింటికి వెళ్ళాక ఏ బంగళాలు చిమ్మటమో, ఏ పూల తోటకు కాపలాగానో జీవితం గడుపుతూ వుంటుంది. అలాంటప్పుడు ఇంక చదువుతో పనేంటి? మధుపురిలో వీధుల్ని చిమ్మటమూ జమాదార్లే చేస్తుంటారు. అయితే, జమాదారివాళ్ళు ఆ మున్సిపాలిటీవాళ్ళ పనులకు వెళ్ళరు. యజమానురాలి కూతురి విషయం అలా కాదు. తల్లీదండ్రీ ఆ అమ్మాయిని బడిలో వేయటానికి తొందరపడుతున్నారు. రెండు సంవత్సరాల క్రితమే వేయవలసింది. యజమానీ, యజమానురాలూ ధనికులు, తమ కూతురికి కట్నం ఇచ్చి మంచి సంబంధం తీసుకురాగలరు. అయితే, ఉన్నత వర్గాలకు చెందిన యువకులు కట్నంతో సంతృప్తి చెందరు. అమ్మాయి ఎంతవరకూ చదువుకున్నదో చూస్తారు. ఒకవేళ చంపో స్నేహితురాలు చదువుకోకపోతే ఆమె ఎంత అనన్యసుందరి అయినా ఆమెకు మంచి ధనిక కుటుంబంలోని యువకుడు దొరకటం సాధ్యపడదు. ఆమె తల్లిదండ్రులు ఆమెను స్కూలుకు పంపలేకపోయినా మాస్టర్ని ఇంటివద్దకే పిలిపించి

చదివిస్తున్నారు. ఆ అమ్మాయికి చదవాలనిపించినపుడు చదువుతుంది. లేకపోతే ఆడుకోవటానికి వెళుతుంది. మాస్టర్‌జీ మాత్రం తన 'గంట' సమయాన్నీ పూర్తి చేసుకుని వెళ్ళిపోతుండేవాడు.. స్కూలులో ఇట్లా అవకాశం వుండదు. 'నన్ను బళ్ళో వేస్తారు. అప్పుడు మనం ఇలా ఆడుకోను వీలుండదు. రోజుమొత్తం స్కూలులోనే వుండిపోతాను" అనేది స్నేహితురాలితో దిగులుగా.

## 4

స్నేహితురాలు స్కూలుకు వెళుతున్నది. ఆమెకు స్కూల్లో కూర్చోబుద్దికావటం లేదు. ఇంటి దగ్గరయితే కాసేపు కూర్చునేది, కాసేపు చంపోతో ఆడుకునేది. వచ్చిన బాధ ఏమిటంటే? ఆవరణలోనే వుండి ఇద్దరూ తల్లీదండ్రి ఎదురుగా ఆవరణలో ఆడుకోవాలి. బడి ఎగ్గొట్టి వచ్చి అలా ఆడుకుంటే, తల్లీదండ్రీ ఊరుకుంటారా? చంపోకు ఏమీ తోచకుండా వుంది. ఆమెకు ఇంకా తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ వున్నారు. వాళ్ళ ఇంట్లో సంవత్సరానికి ఓ క్రొత్త ముఖం అవతరించడం ఆచారం. చంపో అందరికంటే పెద్దది కావటం వలన తన కంటే చిన్నవాళ్ళతో ఆడుకోవటంలో ఆమెకు ఎటువంటి ఆనందం లభించదు. ఆమె స్నేహితురాలు చదువుకున్న కుటుంబానికి సంబంధించినది. ఆమెతో మాట్లాడటంతో ఎంతటి ఆనందం వుంటుందో? అది మరొకచోట దొరకడం దుర్లభం. ఒక్కొక్కసారి తను కూడా స్కూలు ఎందుకు వెళ్ళకూడదని ఆలోచిస్తూ వుండేది. కానీ ఆమె తల్లిదండ్రులు స్కూలుకు వెళ్ళటానికి ఆమెకు అనుమతించే వారు కాదు. చిన్న పిల్లల్ని ఆడించేపని చంపోది. మేక ప్రతి సంవత్సరం రెండుసార్లు నాలుగు, నాలుగు పిల్లల చొప్పున పెడుతుంది. వాటిని మేతకు తీసుకుపోయే బాధ్యత కూడా చంపోదే! చంపో పగలంతా తన స్నేహితురాలికోసం స్కూలు వదిలే టైముకి ఆ దారివైపే చూస్తూ కూర్చునేది. చంపో స్నేహితురాలు అప్పుడప్పుడు తన స్నేహితురాళ్ళు ఇద్దరు, ముగ్గురితో కలిసి ఆడుతూ, పాడుతూ వస్తుండేది, తన స్నేహితురాలు అలా ఇతరులతో కల్సి రావటం చూస్తే చంపో మనస్సు చివుక్కుమనేది. ఏదో తెలియని బాధతో ఆ పసిహృదయం అల్లాడేది. తన స్నేహితురాలు మరొకరి స్నేహితురాలు కావడాన్ని చంపో సహించలేకపోయేది.

యజమానురాలి కూతురు తనతో పాటు వచ్చిన స్నేహితురాళ్ళను పరిచయం చేసేది. 'చంపో ఇదిగో, ఈ అమ్మాయి నా స్నేహితురాలు కుసుమ! ఈ అమ్మాయి గాయత్రి! అంటూ పరిచయం చేసేది. తన స్కూలు స్నేహితురాళ్ళకు "ఈ అమ్మాయి నాకు మంచి స్నేహితురాలు చంపో! చాలా బాగా పాడుతుంది. బాగా మాట్లాడుతుంది. చీకటిపడేదాకా

ఈ అమ్మాయితోనే ఆడుకునేదాన్ని". చంపో భుజం మీద చేయివేసి చెప్తుండేది స్నేహితురాలు. ఆమె స్కూలు స్నేహితులు వయస్సులో ఆమెకంటే పెద్దవాళ్ళు కారు. కానీ వాళ్ళు పెరిగిన వాతావరణం వేరు కావడం వలన జమాదారు కూతుర్ని తాకకూడదని వాళ్ళకు తెల్సు!

చంపో ఎదురుగా వాళ్ళు ఏమీ అనలేకపోయినా తరువాత 'జమాదార్ కూతుర్ని తాకరాదని' చెప్పసాగారు. వాళ్ళు చాలా అసహ్యంగా వుంటారని, నువ్వు వాళ్ళను తాకితే పంతులమ్మగారు కోప్పడతారు. మన స్నేహితురాళ్ళు నిన్నూ జమాదార్ కూతురి కింద లెక్కకట్టేస్తారని' చెప్పారు.

జమాదార్ కూతురనేస్తారన్న మాటకి యజమానురాలి కూతురి హృదయం కంపించింది. చంపో తన స్నేహితురాలని చెప్పుకోవటానికి సంకోచపడదు. కానీ తను జమాదార్ కూతురని అనిపించుకోవటం ఆ అమ్మాయికి ఇష్టం లేదు. రోజు రోజుకూ స్కూలు స్నేహితురాళ్ళు అధికమవుతున్నారు. వాళ్ళూ రోజూ బంగళాకు వస్తున్నారు. వాళ్ళు యజమానురాలి కూతురితో 'నువ్వు చంపోని తాకినా, చంపోతో ఆడుకున్నా – మేము ఇక్కడకు రాము' అన్నారు. రోజురోజుకూ తన స్నేహితురాలు తనకు దూరమై పోతున్నదని చంపోకు అర్థమవుతున్నది. సాయంత్ర సమయాల్లో ఎంతో ఆశగా, ఆసక్తిగా తన స్నేహితురాలి బంగళాకు వెళ్ళేది చంపో. కానీ, ఆ అమ్మాయి చంపోను చూసేది కాదు. తన స్కూలు స్నేహితురాళ్ళతో ఆడుకుంటూ వుండేది. కొన్ని నెలలపాటు ఇలా వెళుతూనే వుండేది. నిరాశగా తిరిగి వచ్చేది. 'ఇక తాము ఇద్దరూ కలిసి వుండము' అని చంపో నిశ్చయించుకుంది.

మధుపురిలోని జమాదార్లు సంవత్సరమంతా ఇక్కడే వుండిపోతారు. అక్కడే మున్సిపాలిటీ ఇళ్ళల్లోనూ, ఔట్‌హౌస్‌ల్లోనూ వుంటారు. తరతరాలుగా మధుపురిలో వుండటాన పెళ్ళిళ్ళు కూడా అక్కడి వాళ్ళనే చేసుకునేవారు. అలాంటప్పుడు వాళ్ళు బిజనౌర్ జిల్లాలోని తమ పట్నాల్ని, గ్రామాలను మర్చిపోయి వుంటారని అనుకోవచ్చు. కానీ, అలాంటిదేమీ లేదు. వీళ్ళందరికీ కులదేవత వున్నది. ఆ దేవతను కొలవటానికి మధుపురిలోని జమాదార్లు అప్పుడప్పుడు తమ ప్రాంతానికి, బిజనౌర్ జిల్లాకు వెళ్ళి వస్తుండేవారు. అక్కడకు వెళ్ళటానికి ప్రధాన కారణం తమ కులదేవతకు మొక్కు చెల్లించ టానికే. వాళ్ళు హిందువులుగా వున్నంతకాలం తమ కులదేవతను నిర్లక్ష్యం చేయలేరు. ఆ దేవత కృపాపాత్రులై వుంటారు. చంపో పుట్టినప్పటి నుండీ ఆమె తల్లిదండ్రులు ఒక్కసారి కూడా బిజనౌరు వెళ్ళలేదు. కులదేవతకు తీర్చాల్సిన మొక్కుబడి వుంది. ఈసారి చలికాలంలో చంపో తల్లిదండ్రులు తమ పిల్లలందర్నీ తీసుకుని బిజనౌరు వెళ్ళారు.

కులదేవతను పూజించారు. బంధువులకు సారాయి / విందు భోజనం ఇచ్చారు. తాగారు. తందనాలాడారు. ఒక నెల తరువాత కుటుంబమంతా మధుపురికి తిరిగి వచ్చారు. కానీ చంపో రాలేదు. చంపో రాకపోవటం చూసి మిగిలిన వాళ్ళు అడిగితే, చంపో తల్లి వెక్కి వెక్కి ఏడుస్తూ 'మా చంపో వెళ్ళిపోయింది. చిన్నమ్మగారి కోసం కలవరించిందంటే నమ్మండి! ఆరోజు మధ్యాహ్నం కూర్చున్న మనిసి కూసున్నట్టుగా కన్ను మూసింది. ఆరోజు చాలా మొండికేసింది. నన్ను నా స్నేహితురాలి దగ్గరకు తీసుకువెళ్ళండని ఎంత ఏడిసిందో?' ఆ సమయంలో అక్కడకు వచ్చిన యజమానురాలు తన కన్నీటిని ఆపుకోలేకపోయింది. ఆమెకూ దుఃఖం ఆగలేదు. కన్నీరు కారుస్తూ 'ఎంత చక్కని పిల్ల!' అని అన్నది.

"అవునండీ! పెద్దమ్మగోరు! అందరూ అట్టాగే అనేవోరు. సక్కని పిల్ల. గొప్పోరిబిడ్డ లాగుంటది. మాటలూ అట్టాగే మాట్టాడుద్ది అనేవోరు అందరూ.' చంపో తల్లికి ఎక్కిళ్ళు వచ్చాయి. పమిట చెంగుతో కళ్ళు తుడుచుకుంది. యజమానురాలు ఓదార్చింది. అమాయకురాలైన చంపో తల్లి కరుణస్వరంతో "పెద్దమ్మగోరూ! మనస్సుకు ఎంత చెప్పుకుంటున్నా. కానీ ఏం సేయను? చంపో గురుతుకు వస్తే గుండె పగిలిపోద్ది. చంపో చిన్నమ్మగోరితో ఇంకెప్పుడూ ఆడుకోదు." చంపో తన స్నేహితురాలితో ఆడుకోవడం ఎప్పుడో బంద్ అయిపోయింది. తల్లిదండ్రుల నెత్తిమీద నుండి ఒక బరువును తీసేసినట్ట యింది. కానీ కన్న బిడ్డను బరువు అని ఏ తల్లిదండ్రులు మాత్రం అనుకుంటారు.

# నల్లదొర

**మ**ధుపురి దొరల పట్టణము. ఒకప్పుడు ఈ పర్వతం మీద దట్టమైన అడవి వుండేది. రెండు మూడు వేల అడుగుల కింద ఒకటీ – అరా కొండ గ్రామాలుండేవి. అక్కడి ప్రజలు వర్షాకాలంలో తమ పశువుల్ని మేపుకోవటానికి ఎత్తయిన పర్వత శ్రేణులకూ, అడవుల్లోకీ వచ్చేవారు. మధుపురి నిర్మాణం ఒక ప్రణాళిక ప్రకారం జరిగింది కాదు. ఈస్ట్ ఇండియా కంపెనీ నేపాల్ నుండి మధ్య పశ్చిమ హిమాలయాలను పర్వత ప్రాంత భూమిని లాక్కున్నది. దాంతో మధుపురి నిర్మాణం పట్ల అంతగా ఆసక్తిని ఈస్ట్ ఇండియా కంపెనీ కనబరచకపోయినా స్థానిక కంపెనీ ఆఫీసరుకు మధుపురి ప్రదేశం, పరిసరాలను చూసి చిన్న సైజు ఇంగ్లాండును అవతరింప చేయవచ్చుననుకున్నారు. వ్యక్తిగతంగా ఒకరిద్దరు ఆఫీసర్లు చెక్కల్తో చిన్న చిన్న గదులను నిర్మించుకుని వేసవికాలంలో వచ్చి వుండసాగారు. ఈ రకంగా రోహిణీకార్తె వడగాల్పుల నుండి తమను తాము రక్షించుకోవటం ప్రారంభించారు. ఇది క్రీ.శ. 1820 నాటి మాట. ఈ ఇద్దరు ముగ్గురు దొరల్ని చూసి మరికొందరు దొరలు కొండమీదకు వేసవి కాలాన్ని గడపటానికి రాసాగారు. అప్పటికి కంపెనీ అధికార్లు కళ్ళు తెరిచారు. ఈ ప్రాంతపు మహత్తును గమనించారు. ఒక వ్యవస్థితమైన రూపంలో తెల్లదొరలకు వాసయోగ్యమైన పట్నాన్ని నిర్మించ తలపెట్టారు. కంపెనీ ఒక ఆఫీసరును నియమించింది. అతని పని మధుపురిని విలాసనగరంగా అభివృద్ధి పరచటం. మధుపురి అభివృద్ధితో పాటూ ఆ అధికారి అధికారాలూ అభివృద్ధి అయ్యాయి. 18వ శతాబ్దపు సైనిక తిరుగుబాటుతో దక్షిణ దేశీయ సంస్థానాలు తర్వాత హిమాలయ పర్వత ప్రాంతమే ఆంగ్ల దొరలకు అన్నిటికంటే సురక్షిత స్థానమనిపించింది. ఆ తరువాత కంపెనీ అధికారాన్ని ఇంగ్లాండు రాణికి బదలాయించడమయింది. దేశంలో ఎప్పటిలాగానే ఆంగ్లేయుల పరిపాలన కొనసాగుతూనే వున్నది. అయినా, పరిపాలనలో ప్రధానమైన మార్పులేమీ జరగకపోయినప్పటికీ ఆంగ్ల దొరల ప్రవర్తనలో కొంత మార్పు వచ్చింది. తాము అచ్చం స్వర్గం నుండి దిగి వచ్చిన దేవదూతలని అనుకోసాగారు.

అనువాదం : **కవిని ఆలూరి**

భారతీయుల్ని చూస్తేనే మండిపడేవారు. ఏ భారతీయుడూ కళ్ళు ఎత్తి వాళ్ళవంక చూడటానికి వీలు లేదు. చూస్తే చావుదెబ్బలు తిన్నాడన్నమాటే!

ఈస్ట్ ఇండియా కంపెనీ తాబేదారులైన ఉద్యోగులు తమ తమ స్థానాల్లో చక్రవర్తుల్లా అధికారాన్ని చలాయించేవారు. స్థానికుల్ని తన్నేవారు, కొట్టేవారు. తిట్టేవారు. ఆ రకంగా దొరల్ని ఎలా చూడాల్నో స్థానికులకు నేర్పేవారు. భారతదేశంలో ఉంటున్నప్పటికీ ఇంగ్లీషు దొరలు స్థానిక ప్రజలతో ఏ మాత్రం సంబంధం లేకుండా వుండేవారు. కానీ 18వ శతాబ్దంలో ఇంగ్లీషు దొరలు స్థానికులకు దగ్గరవటానికి సుముఖంగా వుండేవారు. అయినా, అవమానించటం కూడా అలవాటు చేసుకున్నారు. అయితే, ప్రతిదీ తమకు ఇంగ్లాండు నుండే రావాలన్న ఆలోచన వుండేది. కొంత సమయం గడిచాక ఐ.పి.యస్.లనే ఒకానొక వలను నేర్పుగా పన్నారు. ఈ వలలోని ఒక భాగంగా ఒక యువకుడు ఐ.పి.యస్.గా మధుపురికి శాసకుడై వచ్చాడు. 19వ శతాబ్దం మూడవపాదం గడుస్తుండే సరికి మధుపురి ఈనాడుమనం చూస్తున్న ఈ రూపం వచ్చింది. సీజన్ సమయంలో వచ్చే వారి సంఖ్య అధికంగా వుండేది. మిగిలిన సమయాల్లో ఏ కొద్దిమందో వుంటుండే వాళ్ళు. క్రింది పర్వతాలలోని గ్రామాలు కొన్ని మధుపురి ఐ.పి.ఎస్.దొరగారి అధికారి క్రింద వున్నాయి. ఈ ఐ.పి.ఎస్. మెజిస్ట్రేట్ అధికారాల్ని కలిగి సమస్తమైన దావాల్నీ, ఇతర కేసుల్నీ చూస్తుంటాడు. రోజూ పని వుండదు కనుక వారానికి ఒకమాటు వచ్చి కోర్టు పనుల్నీ, కేసుల్నీ చూసుకు వెళుతుంటాడు.

వెనుక ఎలాంటివాడినయినా సరే, ఇంగ్లీషువాడు అయితే చాలు ఆఫీసర్ని చేసేసేవారు. కానీ ఈమధ్య ఆ స్థితి మారింది. భారతీయులు ఆధునికతలో భాగంగా కొంతమంది ఇంగ్లీషు సాహిత్యాన్ని కూడా చదవడం ప్రారంభించారు. ఇంగ్లీషువారు కూడా తమలాంటి మనుషులేనన్న విషయాన్ని తెలుసుకుంటున్నారు. ఇలాంటి స్థితిలో అయోగ్యుడైన శాసకుణ్ణి చూసి భారతీయుల హృదయాల్లో శాసకుల పట్ల అగౌరవభావం ఏర్పడే అవకాశం వుంది. అలా కాకుండా వుండాలంటే, అయినవాడూ, కానివాడూ అనిచూడకుండా యోగ్యతల్ని పరిశీలించి ఉత్తమమైన శాసకుడిని భారతదేశానికి దిగుమతి చేయాల్సి వుంటుంది. ఐ.పి.ఎస్.గా వచ్చే వారిని ట్రైనింగ్ ఇచ్చి భారత్‌కు పంపించేవారు తెల్లదొరలు. భారత దేశానికి రాకముందే వారికి భారతీయుల్ని ఎలా పరిపాలించాల్నో మొత్తం చెప్పి పంపించేవాళ్ళు. సైనిక తిరుగుబాటులో ఇంగ్లీషువారిని సకుటుంబ సమేతంగా, క్రూరంగా ఎలా హతమార్చారో వారికి చూపించేవారు. ఆఫీసర్లకు కొంత అత్యుక్తుల్ని జతపరచి ఆనాటి హత్యాకాండను వివరించి చెప్పేవారు. ఇక్కడికి వచ్చేటప్పుడు దొరలు కూడా సాధారణ మనుషులలాగానే వస్తారు. వారిలోనూ దయా, సానుభూతి లాంటివి వుంటాయి.

వాటిని స్థానికుల పట్ల ఎక్కడ ప్రదర్శిస్తారోనని ముందుగానే జాగ్రత్త తీసుకునేవారు ముసలిదొరలు. అనుభవజ్ఞులైన ముసలి దొరలు, యువకులైన ఐ.పి.ఎస్. దొరలకు భారతీయులకు దూరంగా వుండవల్సిందని గట్టిగా చెప్పేవారు. ఏమైనప్పటికీ ఇంగ్లాండు నుండి వచ్చే యువకులైన ఐ.పి.ఎస్. దొరల్లో రెండు ప్రత్యేకమైన గుణాలుండేవి. ఒకటి వాళ్ళు నిజాయితీగా పనిచేసేవారు. ఇతరుల చేతా అలాగే చేయించేవారు. ఇక సమయపాలన అనేది వాళ్ళ రక్తంలోనే వుండేది. ఉదయం 10 గంటలకు కోర్టు మొదల యితే సాయంత్రం 4 గంటలకు బంద్ కావాల్సిందే. ఒంటి గంటసమయంలో ఒక అరగంట దొరలంచ్ కోసం కేటాయించేవారు. పనివున్న రోజున అక్షరాలా రోజులో అయిదున్నర గంటలు తమ ఆఫీసుల్లోనూ, కోర్టులోనూ గడిపేవారు.

మధుపురికి పెద్ద ఆఫీసరు అవటం అంటే గొప్ప అదృష్టంతో కూడుకున్న విషయంగా భావిస్తుండేవారు. వచ్చిన ఆఫీసరుకు తాను భారతదేశంలో వుండి కూడా ఇంగ్లాండులో వున్నట్టే వుంటుంది. పైగా స్వజాతీయులైన ఇంగ్లీషుదొరలు కనిపిస్తూ వుంటారు మధుపురిలో! మరోచోట అయితే ఇలా వుండదు. జిల్లాకు ఒకరిద్దరు తెల్లదొరలు వుంటారు. మధుపురి క్లబ్బుల్లోనూ, ఇంగ్లాండులోని హోటళ్ళలో జరిగినట్టు బాల్ డ్యాన్సులు లాంటివి వుంటాయి. సీజన్ సమయంలో కొన్నివేల మంది ఆంగ్ల యువతీ యువకులు మధుపురిలో కనిపిస్తుంటారు. దొరలకు అచ్చం ఇంగ్లాండులో వున్నట్టే వుంటుంది.. దొరల వినోదాలకూ, విలాసాలకూ అవుసరం అయిన అన్ని సౌకర్యాలూ మధుపురిలో లభ్యమవుతున్నాయి. వెనుక మధుపురిలో మోటారుకారు వచ్చేది కాదు. అప్పుడు పెద్ద దొర (మధుపురి మేజిస్ట్రేట్) గుర్రానెక్కి ఎనిమిది గంటలకే వచ్చేవాడు. మధుపురిలోని మిత్రులను కలుసుకునేవాడు. కొందర్ని క్రొత్తగా పరిచయం చేసుకునేవాడు. అతను అవివాహితుడైతే అతని కోసం ఇక్కడికివచ్చి స్థిరపడిన దొరల కన్యలు పూలమాలలతో సిద్ధంగా వుండేవారు. క్రింది పట్టణాలలో ఇంగ్లీషు దొరలు తమకు కొన్ని హద్దులు పెట్టుకునేవారు. మాట్లాడటం దగ్గరనుండే ప్రతి దానికీ హద్దులున్నాయి. మధుపురికి రాగానే అన్ని హద్దులూ వాటంతట అవే మటుమాయమవుతాయి. వేరే ప్రపంచంలో విహరిస్తారు. అలా విహరించేటప్పుడు భారతీయులు వాళ్ళను చూడటం దొరలకు ఇష్టం వుండదు. అందుకే వాళ్ళు నివసించే ప్రాంతాలకు నల్లవాళ్ళు రాకూడదు. వంటవాళ్ళు, బంట్రోతులూ మాత్రం వాళ్ళ బంగళాల్లోకి రావచ్చు. అవమానాన్ని భరించటం అనేది చాలా దుస్సహకమైన విషయం. అయితే తరతరాలుగా అవమానాలకు గురవుతుంటే, అవమానాలకు గురిచేసే వారికీ, గురయ్యే వారికీ అదే అలవాటై పోతుంది.

ఉన్నతమైన పదవుల్లో చదువుకున్న మధ్యతరగతి ఆంగ్ల యువకులనే నియమిస్తుంటారు. 1857లో జరిగినట్టు భవిష్యత్తులో జరక్కుండా వుండటానికి ఇంగ్లీషు సిపాయీలనూ పెద్ద సంఖ్యలో ఈ దేశంలో వుంచవలసిన అవసరం కలిగింది బ్రిటిష్ ప్రభుత్వానికి! ఈ దేశానికి సిపాయిలుగా వచ్చే ఆంగ్ల యువకులు సభ్యాసభ్యతలు తెలియని మొరటు వాళ్ళూ, మూర్ఖులూ! క్రింది ప్రదేశాల్లో వున్నప్పుడు వాళ్ళను సైనిక శిబిరాల్లో నుండి బయటకు రానీయరు. మధుపురిలో అలాంటి బంధనాలు ఏమీ వుండవు. వాళ్ళు బంధ విముక్తులై విహరిస్తారు. వాళ్ళు భారతీయుల పట్ల ఎంత అవమానకరంగా ప్రవర్తిస్తారో స్థానికులకు తెలియనిది కాదు. వాళ్ళ నివాసాలకు చుట్టుపట్ల వుండే వాళ్ళు తమ స్త్రీలను ఎంతో జాగ్రత్తగా దాచి వుంచేవారు. ఎందుకంటే మధుపురిలోని మెజిస్ట్రేట్ వారి శాసనంలో ఒక ప్రత్యేకత వుంది. వారి శాసనాలేవీ ఇంగ్లీషు వారి పట్ల ప్రయోగించబడవు. మధుపురిలో ఈ స్థితి ప్రథమ ప్రపంచ యుద్ధం ముగిసే వరకూ వున్నది. మధుపురి ఇంగ్లీషు వారికి విలాసనగరం. భారతీయుల అవమానాలకు చిహ్నం. కానీ అవమానాలకు అలవాటు పడిన స్థానికులూ, వ్యాపారస్తులూ అవమానాల్ని అవతలకుపెట్టి మధుపురిలో కురిసే బంగారు వర్షానికి తడిసి తలమునకలవుతుండేవారు. ఇంక కొండ గ్రామాల నుండి వచ్చిన కూలీలు వుండనే వున్నారు. వాళ్ళకు మధుపురి కల్పవృక్షమే.

## 2

పెద్ద పెద్ద యుద్ధాలు గొప్ప పరివర్తనలనే తీసుకువస్తాయి. గతంలో ఎన్నడూ ప్రపంచ యుద్ధాలు జరగలేదు. ఈ యుగంలో జరిగిన ప్రథమ, ద్వితీయ ప్రపంచ యుద్ధాలు మొత్తం ప్రపంచంలోనే గొప్ప పరివర్తనను తీసుకు వచ్చాయి. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత భారతదేశంలో మోటారు కార్ల ప్రచారం ముమ్మరం అయింది. ఇంగ్లీషు వాళ్ళకు తమ మాతృభూమి అయిన ఇంగ్లాండు, వెనుకటిలా ప్రపంచానికి ఒక కొసన వున్నట్లుగా లేదు. ఓడలు ఒకే ఒక్క నెలలోపు ఇంగ్లీషువార్ని ఇంగ్లాండుకు హాయిగా క్షేమంగా తీసుకు వెళ్తున్నాయి. ఇంగ్లాండు వెళ్ళటానికి 6 నెలల సమయం పట్టే కాలంలో ప్రయాణము ప్రమాదకరంగా వుండేది. ఆ సమయంలో తమ పిల్లల చదువుల కోసం ఆంగ్ల దొరలు హిమాలయ పర్వతాల్లోకి విలాస నగరాల్లో ప్రత్యేకమైన స్కూళ్ళను ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడు ప్రయాణమార్గాలు అభివృద్ధి చెందటంతో తమ పిల్లల్ని ఇక్కడ చదివించవలసిన అవసరం కనిపించలేదు. ఇక్కడ చేసే సమయంలో సెలవులు ఎక్కువగా వచ్చినప్పుడు తగినంత డబ్బు ఇచ్చి ఇంగ్లాండుకు పంపటం జరుగుతున్నది. ఈ మార్పులన్నీ విలాస

నగరాల మీద ప్రభావాన్ని వేస్తున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో రూపాయికి నాలుగు సేర్లు ఇచ్చే బియ్యం రెండుసేర్లు అయ్యాయి. ఈ రకంగా ప్రతి వస్తువు ధరనూ రెట్టింపు చేసింది రెండవ ప్రపంచ యుద్ధం. అయితే మొదటి ప్రపంచయుద్ధం వస్తువుల ధరలను పెంచేసింది. భారతదేశంలోని ఆంగ్ల ఉద్యోగులు యుద్ధం కారణంగా వస్తువుల ధరలు పెరగటం దృష్ట్యా తమ జీతాలు పెంచవలసిందని గోల పెట్టారు. బ్రిటిష్ ప్రభుత్వం ఆంగ్ల ఉద్యోగుల జీతాలను ధరల పెరుగుదల ననుసరించి పెంచింది. అయినా, భవిష్యత్తులో ఇంగ్లాండులోని యువకులు ఉద్యోగ రీత్యా భారతదేశం వెళ్ళడానికి సుముఖంగా వుండరేమోనని భయపడ్డారు. ఆంగ్ల పాలకులునిజంగానే ఐ.సి.ఎస్. పరీక్షల్లో ప్రతిభా సంపన్నులైన ఆంగ్ల యువకులు వెనుకటిలా పెద్ద సంఖ్యలో పాల్గొనలేదు. దీంతో ప్రభుత్వానికి ఆంగ్ల ఉద్యోగులు రారేమోనన్న భయం ఎక్కువయింది. దీనికోసం ప్రభుత్వం దొరగారి అధ్యక్షతతో ఒక కమిటీని వేసింది. దీంతో 'గుడ్డివానికి గురుత్వం' ఇచ్చినట్టుగా లీ కమిటీ దోపిడీ ముఠాగా ప్రసిద్ధి నొందింది. అసలే ఐ.సి.ఎస్. ఫలితాలు, సైనిక ఆఫీసర్ల జీతాలు అత్యధిక మొత్తాలో వున్నాయి. లీ మహాశయుడి పుణ్యమాని ఐ.సి.ఎస్. జీతాలూ, సైనిక ఆఫీసర్ల జీతాలూ ఆకాశం అంత ఎత్తున పెరిగాయి. లీ మహాశయుడు ప్రవేశపెట్టిన ఈ రకమైన దోపిడీ వలన లాభాన్ని పొందింది. ఒక్క ఆంగ్ల ఐ.సి.ఎస్.లూ, ఆంగ్ల సైనిక ఆఫీసర్లేకాదు. భారతీయులైన ఆఫీసర్లు కూడా లాభాన్ని పొందారు. లీ దోపిడీలో వీళ్ళూ భాగస్తులయ్యారు.

రెండవ ప్రపంచ యుద్ధం చివరిసారిగా మధుపురిని రూపాయిల వర్షంతో తలమున్కలు చేసింది. యుద్ధం ముగియడంతో పాటు ఇంగ్లీషువారు ఈ దేశంలో తాము నిర్మించిన విలాసనగరాలను ఆశగా చూస్తూ శాశ్వతంగా వెళ్ళిపోయారు. ఇంగ్లీషువారు వెళ్ళగానే 'ప్రభుత్వం' అనే కాంక్రీటు పునాదితో కట్టబడిన మహాభవనం చప్పగా కూలిపోతుందని అందరూ అనుకున్నారు. ఒకవేళ అందరూ అలా అనుకోలేదు అనుకున్నా. ఇంగ్లీషు ప్రభుత్వం స్థానాన్ని స్వీకరించటానికి సిద్ధంగా వున్న కాంగ్రెస్ ప్రభువులు మాత్రం అలాగే భావించారు. 1947 ఆగస్టుకు ముందు ఉద్యోగాలన్నింటిలోనూ ఇంగ్లీషు వాళ్ళే వుండేవారు. ఐ.సి.ఎస్.లలో భారతీయులు చాలా మంది వున్నారు. కానీ, వాళ్ళ ప్రవేశం నిషిద్ధమయిన' స్థానాలు ఎన్నో వుండేవి. ఇంగ్లీషు వాళ్ళు వెళ్ళిపోయాక పెద్ద పెద్ద ఉద్యోగాలకు వేల సంఖ్యలో ఖాళీలు వచ్చాయి. ఇంగ్లీషు వారు వుండగా కాంగ్రెస్ దేశ భక్తులు ఆంగ్ల ప్రభుత్వాన్ని విమర్శించటంలో ఎలా గొంతుచించుకునేవారనుకున్నారు? భారతదేశం ప్రపంచ దేశాలన్నింటిలోకీ పేద దేశం! దేశ ప్రజలు చెమటోడ్చి సంపాదించిన ధనాన్ని

ఇంతంత పెద్ద పెద్ద ఉద్యోగస్థుల జీతాల కోసం ఖర్చుపెట్టటం దారుణమైన అత్యాచారం! అతి పేద దేశమైన మనదేశానికి ఇంతింత పెద్ద ఉద్యోగాలు అనవసరం అనేవారు.

మరి ఇప్పుడు తమ విమర్శలను కార్యరూపంలో పెట్టే అవకాశం కాంగ్రెస్ వారికి లభించింది. జరిగిందేమిటంటే 1947లోని దోపిడీ లీ దోపిడీని మరిపించింది. మూడు వందల జీతం తీసుకునే ఉద్యోగస్థులు ఒక్కసారిగా పదిహేను వందలు, రెండు వేలకు వెళ్ళిపోయారు. సాయంత్రం డిప్యూటీగా వున్నవాడు తెల్లవారే సరికి కలెక్టర్ అయిపోయాడు. ఈ దోపిడీ వల్ల లబ్ధిపొందని దురదృష్టవంతులూ కొంతమంది వున్నారు. అయితేవాళ్ళు కొత్త ప్రభువులకు అన్నలు కానీ, తమ్ముళ్లు కానీ, బావలూ, బావమరుదులూ కానీ మేనత్త కొడుకులూ, మేనమామ కొడుకులూ కానీ ఇలాంటి బంధుత్వ శాఖల్లో దేనికో చెందినవారై వుంటారు. యోగ్యాయోగ్యతలను అటకమీదకు పెట్టేసి, ఏమాత్రం విచక్షణాజ్ఞానం లేకుండా గొప్ప గొప్ప పదవులన్నింటిలోనూ తమ వారిని పెట్టేసుకున్నారు. 'ఆగస్టు దోపిడీ' ఇంగ్లీషు వారు ఖాళీ చేసి వెళ్ళిన స్థానాన్ని పూర్తి చేయడంలోనే ఆగిపోలేదు. ఇంకా ఎందరో సత్పాత్రలు మిగిలిపోయారు. యోగ్యత వున్నా లేకపోయినా మరెన్నో సద్గుణాలు వున్నాయి. వాటిల్లో ముఖ్యమైనది 'జీ! హుజూర్!' కొట్టటం!

ఇంగ్లాండు నుండి దిగిన తెల్లదొరలకంటే, నల్లదొరలు గొప్ప అయిపోయారు. వీరూ తెల్లదొరలకంటే గొప్పగా కొలువు తీరుతున్నారు. జిల్లా అధికారులూ, జిల్లా నాయకుల నుండి ఢిల్లీలోని మహాప్రభువుల వరకూ సమస్తోపచారాలతోటి ఫీజుల్ని అందుకోవటం ప్రారంభించారు. ఆగస్టు దోపిడీలో లాభించినది నల్లదొరలే కాకుండా పాత ఐ.సి.ఎస్.లకు కూడా విషయాన్ని తెల్సుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సజావుగా అభివృద్ధి చెందాలంటే 'జీ హుజూర్' కొట్టటం ముఖ్యమని గమనించారు. వెనుక తెల్లదొరలకు నెత్తిమీద టోపీ తీసి తలవంచి సలాం పెట్టేవారు. ఇప్పుడు 'పాదప్రమాణాలనే ఆచరిస్తున్నారు. పాత ఐ.సి.ఎస్.లు వెనుక తెల్లదొరల తాబేదారులన్న మాట నిజమే! ఇప్పుడు తమ పొరపాటును తెల్సుకున్నారు. మనలో కలుపుకోవటానికి అభ్యంతరం ఎందుకు వుండాలి? ప్రభుత్వ ఉ ద్యోగులూ, ఆఫీసర్లూ పనులు వదిలేసి తమ కర్తవ్యాలను పాటించటానికి వాళ్ళు ప్రాంత,, దేశ రాజధానికి వెళ్ళిపోయారు. పూజా కార్యక్రమాల్ని చేసుకుంటున్నారు. ఇలా ఉద్యోగ ధర్మాల్ని కూడా విస్మరించి 'కర్తవ్యానికే' ప్రాముఖ్యతనిస్తున్నారంటే – వారి ప్రభు భక్తిని వేనోళ్ళ కొనియాడాలి. తొలుత ప్రభువుల్ని ప్రభావితుల్ని చేసుకునే ప్రధాన లక్ష్యాన్ని సాధించటం కోసం ఇతరత్రా ఎన్నెన్ని చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం తన ఆఫీసర్లను క్షమించటానికి సర్వదా సిద్ధంగా వుండేది. 'ఆగస్టు దోపిడీ'ని సర్వవ్యాపకం చేయటానికి

స్థల కాలాదులకు సంబంధించిన అవధుల్ని విస్తృతం చేశారు. వెనుక ఇంగ్లీషు దొరలు వున్నప్పుడు జిల్లా మొత్తానికీ గెజిటెడ్ ఆఫీసర్లు ఇద్దరో, ముగ్గురో వుండేవారు. కాంగ్రెస్ దొరలు వచ్చాక గెజిటెడ్ ఆఫీసర్ల సంఖ్య నాలుగైదు రెట్లకు పెరిగింది. వారిని అనుసరించి క్రింది సిబ్బందీ పెరగాలి కదా? లేకపోతే వాళ్ళు సంతకాలు పెట్టటానికి కాగితాలు ఎవరు అందిస్తారు? కనుక క్లర్కుల సంఖ్య ఐదురెట్లు పెరిగింది. ఈ పని తెలిసీ తెలియకుండా, మోసంగా జరిగిందని అనుకోవటానికి లేదు. ఢిల్లీలోని కాంగ్రెస్ మహా ప్రభువులు ఈ సత్కార్యానికి స్వయంగా ప్రారంభోత్సవం చేశారు. ఇంగ్లీషు వారు వున్నప్పుడు అఖండ భారతదేశాన్ని పరిపాలించటంలో సహకరించటానికి గొప్ప జీతాల్ని తీసుకుంటున్న తొమ్మిది మంది సెక్రటరీలు సరిపోయేవారు. కాంగ్రెస్ మహాప్రభువు స్వయంగా వారి సంఖ్యను 22కు పెంచాడు. విభజింపబడని భారతదేశానికి 9 మంది సరిపోతే విభజింప బడిన భారతదేశానికి 22 మంది అవసరం అయ్యారంటే ఇక ఊహించుకోవచ్చు. ప్రపంచంలోని కడు బీద దేశాలలో ఒకటైన భారతదేశం కాంగ్రెస్ ప్రభుత్వం చేతుల్లోకి రాగానే ధనిక దేశం అయిపోయింది. ప్రజల ఇళ్ళల్లో ధనం మూలుగుతోంది. అందుకే నల్లదొరలు ఈ విధంగా దోచేస్తున్నారు. ఈ దోపిడీలో మనం గమనించవలసిన విషయం ఒకటివుంది. ఈ దోపిడీకి సంబంధించిన ప్రతిఫలం తమ బంధుకోటి చేతుల్లోకో, ప్రీతిపాత్రుల చేతుల్లోకో, 'జీహుజూర్ గాళ్ళ చేతుల్లోకో పోయేట్టు జాగ్రత్తలు తీసుకున్నారే గానీ పరాయివాళ్ళ చేతుల్లోకి పోనీయలేదు కాంగ్రెస్ ప్రభువులు!

## 3

ఈ పరివర్తన తాలూకు ప్రభావం మధుపురి మీదా పడ్డది. తెల్ల ఐ.పి.ఎస్. దొర బదులు నల్ల ఐ.పి.ఎస్. దొర వచ్చాడు. ఇద్దరి శరీరాల రంగులో భేదం వున్నప్పటికీ జీతంలో ఎటువంటి భేదం లేదు. ఇద్దరి యోగ్యతలలోనూ భేదం వుంది కానీ అహంకారంలో భేదం లేదు. ఈ నల్లదొరగారు కూడా తెల్లదొరల లాగానే ప్రజలకు దూరంగా వుంటారు. ఈ దొరగారి శరీరపు రంగు నల్లగా వుంటుంది. ఆ రంగుని చూసి పొరపాటుపడి మనవాడే కదా! అని అనుకుని ఎవరైనా నల్లవాడి దగ్గరకు వెళ్ళారంటే – దొరగారి కళ్ళల్లో నుండి వెలువడే కరెంటు షాకు కొట్టి బొక్కబోర్లా పడాల్సిందే! వెళ్ళిన వాళ్ళు కళ్ళల్లోకి చూడకపోతే క్రిందపడడు కానీ, అతని నోటినుండి తిట్లు తినవలసి వుంటుంది. తన అహంకారాన్ని కాపాడుకోవటంలో నల్లదొర తెల్లదొరల కంటే నాలుగు ఆకులు ఎక్కువ చదివాడు. ఇంగ్లీషు వాళ్ళు వెళ్ళిపోయారు కానీ శాసనం చేయటానికి అత్యుత్తమ

మైనది ఇంగ్లీషు దొరల పద్ధతే అని నల్లదొరల అభిప్రాయము. ఢిల్లీ ప్రభువుల గొంతు మీద కూర్చుంటే తప్పనిసరై హిందీని రాజభాషను చేయటానికి అంగీకరించారు. కానీ 15 సంవత్సరాల తరువాత మాత్రమే హిందీ రాజభాషగా వుంటుంది. ఈలోపు వీలులేదు. ఆ తర్వాతైనా హిందీ వస్తే రాయచ్చేమో గానీ, ఇంగ్లీషు అంకెలు మాత్రం భారతదేశంలో అదే విధంగా తిష్ట వేసుకుని వుండిపోతాయి. ఆ వుండిపోవటం ఎంతవరకు అంటారేమో! మహాప్రళయం వచ్చి ప్రపంచం సర్వనాశనం అయ్యేవరకూ అలా వుండిపోతాయి. ఈ నల్లదొరలకు, ప్రజల మీదా, ప్రజల భాషమీదా ఎంత ప్రేమో చెప్పలేము. ఒక్క ఉదాహరణ చెబితే పాఠకులే అర్థం చేసుకుంటారు. వీళ్ళు అధికారంలోకి రాకముందు కొన్ని స్వదేశీ సంస్థానాల్లో హిందీని తీసేసారు. ఆ సంస్థానాల్లోనూ ఇంగ్లీషు స్టెనోగ్రాఫర్లనూ, టైపిస్టులనూ ఉద్యోగాల్లో చేర్చుకుంటున్నారు. ఈ ప్రభుత్వం ప్రజల కోసం పనిచేయటం లేదని ఎవరు అనగలరు? ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసమే ఇంగ్లీషు చదివిన ఉద్యోగుల్ని ప్రభుత్వ యంత్రాంగంలో చేర్చుకుంటోంది అనటం కేవలం హాస్యాస్పదమే అవుతుంది. ప్రపంచ భాషలలోకీ ఉత్తమ భాష ఇంగ్లీషు భాష. ఇలాంటి భాషను భారత ప్రభుత్వం ఉగ్గుగిన్నెలలోకీ పుక్కిట పట్టించాలనుకుంటోంది. మధుపురికి ఆఫీసరుగా వచ్చిన నల్లదొర కూడా ఈ విషయంలో తమ ప్రదేశ ముఖ్యమంత్రి సలహాను ఖాతరు చేయడంలేదు. ఆ మంత్రిగారు హిందీ విషయంగా ఇచ్చిన సలహాలూ, చేసిన ప్రకటనలూ పైపై మాటలే కానీ అంతరంగం నుండి వచ్చినది కావు. ఈ నల్లదొరగారికి తెల్సు. ఓటర్లను చేతిలో పెట్టుకోవాలంటే ఒక్కోసారి ఇష్టంలేని సూచనలూ చేయవల్సి వస్తుంది. ఇష్టంలేని ప్రకటనలూ చేయవల్సి వస్తుంది. నిజంగా హిందీని రాజభాష చేయటమే ప్రదేశ ముఖ్యమంత్రిగారి అభిమతమయితే, మొదట ఆఫీసుల్లోనూ ఇంగ్లీషు టైపు రైటర్లను తీసివేస్తారు. ఇంగ్లీషు స్టెనోగ్రాఫర్లకు హిందీ నేర్చుకోవాలని ఆర్డరు చేస్తారు. అంతేకానీ ఉద్యోగస్థులు హిందీ నేర్చుకునే గడువును ఈ విధంగా పొడిగించారు.

మధుపురిలోని నల్లదొర కొన్ని విషయాల్లో మహారాజులా వ్యవహరిస్తాడు. ఆయన వేషధారణ, పద్ధతి, అంతా తెల్లదొరల్ని పోలి వుంటుంది. సూటు వేసుకుంటాడు. తలమీద ఫెల్ట్ హేటు! రోజూ షేవ్ చేసుకుంటాడు. శరీరం లావుగా లేకపోవటాన యువకుడిగా చలాకీగా వుంటాడు. హిందీ భాషను చాలా కష్టంగా మాట్లాడుతూ వుంటాడు. ఇంగ్లీషును మాత్రం చెవులు చిల్లులు పడేట్టుగా గట్టిగా ఈ దేశంలోనే పుట్టలేదేమో! అని అనిపిస్తుంటాడు. అబద్ధం చెబితే చెల్లుబాటుకాదని చెప్పడమో కానీ లేకపోతే ఆక్స్‌ఫర్డ్‌లో చదివినట్టూ, అందువల్ల ఆ ఉచ్ఛారణ వచ్చినట్టూ చెప్పుకునేవాడే! అలాంటి నల్లదొరగారు

తన ఆఫీసులో హిందీని ప్రవేశపెడతాడని ఎట్లా ఆశిస్తాం. నల్లదొరగారికి ఈ దేశ ప్రజలతో కానీ,ప్రజల భాషతో కానీ బొత్తిగా సంబంధం లేదు. నల్లదొరగారు తనకంటే ముందు సింహాసనాన్ని అధిష్టించిన తెల్లదొరల్ని అనుకరిస్తున్నాడు. ఆయనకు అదే పదివేలు!

## 4

మధుపురి చాలా మారిపోయింది. ఇప్పుడు ఆ వెనుకటి మధుపురి కాదు. అయినా, ఫర్వాలేదు. ఇప్పటికీ యూరోప్ దేశాలకు చెందిన రాయబారులూ, వారి సతీమణులూ వందల సంఖ్యలో వస్తూనే వున్నారు. వాళ్లు రావటం వలన మధుపురికి లాభమే కానీ నష్టం వుండదు. ఇతర దేశాలు విలాస యాత్రికుల్ని ఆకర్షించటానికి ప్రచారానికి లక్షలు ఖర్చుపెడుతున్నాయి. కానీ, మనం అలా చేయటం లేదు. మధుపురికి ప్రస్తుతం ఆఫీసరుగా వుంటున్న నల్లదొర వెనుకటి పద్ధతిలోనే అతని వేషభాషలున్నాయి. ప్రజలును కలిసినపుడు ఎవరి వలన సింహాసనం మీద కూర్చోగలిగామన్న ధ్యాస అతనికి లేదు. చాలా సంతృప్తిని ప్రకటిస్తూ వుండేవాడు. అతణ్ణి అందరూ మెచ్చుకునేవారు కానీ అటువంటి వ్యక్తిని మధుపురికి ఆఫీసరుగా ఉండనిస్తారా? అందుకనే పైనున్న ప్రభువులు మధుపురికి తగిన వానిని అధికారిగా పంపించారు. ఒక్క రంగుమినహా ఇతను వెనుకటి తెల్లదొరలకు ఏమాత్రం తీసిపోడు. 'ఏమాత్రం తీసిపోడు' అన్న మాటకు అర్థం. తెల్లదొరలలోని మంచి గుణాలకు కూడా ఏ మాత్రం తీసిపోడు అనటానికి వీలులేదు. తెల్లదొరలు సమయ పాలనకోసం తమ విశ్రాంతి కాలాన్ని కూడా ఖర్చు పెట్టేవారు. ఈ నల్లదొరగారు వెనుకటి తెల్లదొరలలాగానే వారానికి ఒకసారి మధుపురికి వస్తూంటారు. కోర్టు ప్రారంభించటం పది గంటలకు. కేసులూ, దావాలూ వున్న వాళ్ళకు సమన్లు పంపించేటప్పుడు వాటిల్లో పది గంటలకు కోర్టు దగ్గర హాజరుగా వుండకపోతే ప్రతివాదికి అనుకూలంగా తీర్పు వుంటుందని వ్రాస్తారు. అయితే, ఆయన స్వయంగా మధుపురికి వచ్చేసరికి 12 గంటలు దాటుతుంది. వచ్చిన తరువాత కూడా కారులో వచ్చిన దొరగారు కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. పక్షుల్లా ఎదురు చూస్తున్న ప్రజలకు చంద్రుడు లాంటి ఆయన ముఖ దర్శనం కాదు. నల్లదొరగారు ఒంటిగంటకు కోర్టులో కుర్చీలో కూర్చుంటే అదే భాగ్యమని అనవచ్చు. మళ్ళీ లంచ్ కోసం కోర్టు కార్యక్రమం బంద్ అవుతుంది. కోర్టు పని మీద వచ్చిన వాళ్ళు ముందుగానే జాగ్రత్తపడి తిండితిని వచ్చారా సరేసరి లేకపోతే మటుకు ఇంక వాళ్ళు తిండి మానుకోవాల్సిందే. వాళ్ళు తిండి మానుకుంటే మానుకుంటారు గాక ఎన్నో శతాబ్దాలుగా వస్తున్న ఆచారాన్ని నల్లదొర ఎలా మానుకోగలడు? లంచ్‌కంటే

వెళ్ళాక నాలుగు గంటల లోపు తిరిగి కోర్టుకు రావాలన్న నియమం ఎక్కడుంది? నియమాలు వున్నా ఇతరులకోసం గానీ, మధుపురికి సర్వాధికారయిన 'నల్లదొర' కోసమా!

ఒక్క సమయం విషయంలోనే కాదు కార్యదర్శతలోనూ ఇతనికే వెనుకటి తెల్లదొరలకూ నక్కకీ నాగలోకానికీ వున్నంత వ్యత్యాసం వుంది. వెనుకటి క్లర్కులు ఇప్పటికీ కొందరు వున్నారు గనుక కానీ లేకపోతే బండి ఏనాడో ఊబిలో చిక్కుకునేది – అయితే ఈ నల్లదొర ఒక విషయంలో మాత్రం తన దేశభక్తి భావాలను నిలబెట్టుకుంటున్నాడు. వెనుకటి దొరలు పనిమీద వచ్చినవారు ఎవరైనా పలకరించేవారు. ఇతడు మాత్రం నల్లవాడైనా, తెల్లవాడైనా ఎవరైనా సరే తన కోసం గంటల తరబడి నిలబడవలసిందే! తెల్లదొరలు ఎవరైనా తెల్లదొర కోసం వస్తే కూర్చోటానికి కుర్చీని తప్పకుండా ఇచ్చేవాడు. ఈ నల్లదొర తెల్లదొరల్ని కూడా గంటల తరబడి నిలబెడుతూనే వున్నాడు. ఢిల్లీ మహాప్రభువులు ఏ తెల్లదొరల కటాక్ష వీక్షణాల కోసం వున్నారో, ఏ తెల్లదొరల్ని సంతసింప చేసి ఈ దేశం మీద కనక వర్షం కురిపించాలని చూస్తున్నారో, ఆ తెల్లదొరలు కూడా కోర్టులో గంటల తరబడి నిలబడుతున్నారు మరి!

మరి ఇతను నల్లదొరేనంటారా?



**Madhupuri** (Short Stories)

By ***Rahul Sankrityayan***



Translated by

***Kavini Aluri***

బ్రిటీషువారు తమ విలాసాల కోసం, తమ సైనికుల విలాసాల కోసం హిమాలయ పర్వతాలలోని శీతల మంద సుగంధ పవనాలు వీచే పచ్చని ప్రదేశాలను ఎంపిక చేసుకునేవారు. ఆ ప్రాంతాలలో ఉండే వెనుకబడిన జాతుల ప్రజల జీవనాలను ధ్వంసించేవారు. విలాస నగరాలకు వచ్చే విలాస ప్రియులు సహజ సౌందర్యవంతులైన అక్కడి స్త్రీల జీవితాలను నరకప్రాయం చేసేవారు. అదే విధంగా ఈనాటి ప్రభుత్వాలు టూరిజం పేరు మీద అలాగే స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారుల అవసరాలకు అనుగుణంగా సహజ వనరులతో అలరారే పచ్చని ప్రాంతాలను మరుభూములుగా మారుస్తున్నారు. అణగారిన పేద, బడుగు, బలహీన గిరిజన జాతుల ప్రజల జీవనాన్ని ఛిద్రం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 40 సంవత్సరాల క్రితం రాహుల్ సాంకృత్యాయన్ హిందీలో రాసిన "బహురంగీ మధుపురి" కథల సంపుటిని "మధుపురి" అనే పేరుమీద తెలుగులోకి అనువదించి చారిత్రక, రాజకీయ అంశాల పట్ల ఆసక్తి మెండుగా ఉండే తెలుగు పాఠకుల ముందుకు తీసుకు వస్తున్నాం. రాహుల్జీ గ్రంథాలు ఆంధ్రదేశంలో బహుళ ప్రాచుర్యం పొందాయి. ఈ కథల సంపుటి కూడా ఆ విధంగానే తెలుగు ప్రజల మనోభావాల్లో విహరించగలదు.



₹ 200/-

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ-520 004